దేవహూతి కుమారుడైన

కపిల భగవానుని ఉపదేశములు

కపిల భగవానుని ఉపదేశములు

అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘ సంస్థాపకాచార్యులు

పరమపూజ్యశ్రీ శ్రీమత్

ఏ.సి.భక్తివేదాంత స్వామి ప్రభుపాదులు



దేవహూతి కుమారుడైన
కపిల భగవానుని ఉపదేశములు

శ్రీ గురు గౌరాంగౌ విజయేతామ్

దేవహూతి కుమారుడైన
కపిల భగవానుని ఉపదేశములు

అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘ సంస్థాపకాచార్యులు
పరమపూజ్యశ్రీ శ్రీమత్
ఏ.సి. భక్తివేదాంత స్వామి ప్రభుపాదులు

విషయసూచిక

ముందుమాట

కపిలముని పూర్వం ఎంతో ప్రఖ్యాతి గాంచిన ఋషి. భారతదేశపు వైదిక సంస్కృతి తత్త్వపు అంతర్గత భాగమైన 'సాంఖ్య' దర్శనమునకు అతడు మూలకర్త. 'సాంఖ్య' దర్శనము తమదైన శైలిలో భౌతిక మరియు ఆధ్యాత్మిక జ్ఞానమును గురించి చర్చిస్తూ పరమసత్యము యొక్క అనుభూతిని పొందునట్లు చేయును. కపిలుడు ఏదో సాధారణ తత్త్వవేత్తయో లేదా ఋషి కాదు. వైదిక సంస్కృతి మరియు సనాతన శాస్త్రీయ సాహిత్యము ననుసరించి అతడు స్వయంగా పరమ సత్యము యొక్క అవతారము.

కపిలుని ఉపదేశములు వైదిక సాహిత్యపు అత్యంత ప్రధాన శాస్త్రమైన శ్రీమద్భాగవత ప్రారంభములోని మూడవ స్కంధంలోని ఇరవై ఐదవ అధ్యాయము నుండి ముప్పై మూడవ అధ్యాయము వరకు కపిలుని ఉపదేశములు వివరింప బడెను. 1974వ, సంవత్సరము వసంతకాలము ముంబాయి నగరములో పరమపూజ్యశ్రీ శ్రీమత్ ఏ.సి. భక్తివేదాంత స్వామి ప్రభుపాదుల వారి చేత అద్భుతముగా ఇవ్వబడిన ప్రవచనములపై ఆధారపడినదే ఈ 'దేవహూతి కుమారుడైన కపిల భగవానుని ఉపదేశములు'. ఈ పుస్తకములో, కపిలదేవుని ఉపదేశములు ప్రారంభమైనట్టి ఇరవై ఐదవ అధ్యాయము నుండి శ్రీల ప్రభుపాదుల వారు తమ ప్రసంగములను ప్రారంభించెను. శ్రీల ప్రభుపాదుల వారు ప్రఖ్యాతమైన శ్రీమద్భాగవత శ్లోకము లన్నింటికి అనువాదము మరియు వ్యాఖ్యానమును చేసిరి. ప్రభుపాదుల వారు ఈ ఉపన్యాసములను చేయుటకు పూర్వమే శ్రీమద్భాగవతము లోని కపిలదేవుని ఉపదేశములకు భాష్యమును రచించిరి. మరియు వారు ఈ శ్లోకములను వివరించునప్పుడు వాటి అంతర్గత గూడార్థములను విపులంగా వివరించడమే కాకుండ, అత్యంత ఆసక్తికరము మరియు ఉత్కంఠ పూరితమైన ఈ ఉపదేశములపై మరింత వివరంగా జ్ఞానప్రకాశమును ప్రసరింపచేసిరి.

శౌనక ఋషి శ్లోకములతో మూలగ్రంథము ప్రారంభమగును. మరియు నైమిశారణ్యములోని గొప్ప ఋషిపుంగవు లందరిలోకి అతడు అగ్రగణ్యుడు. ఋషులందరి కొరకు శ్రీమద్భాగవతము మొదట బోధింపబడినది. కొన్నివేల సంవత్సరాల క్రితం గొప్ప ఆధ్యాత్మికాచార్యుడైన శ్రీ సూతగోస్వామి నుండి ఈ ఋషులందరు ముందుగానే కపిల దేవుని గురించి విని ఉండిరి. మరియు శౌనక ఋషి పలుకుల నుండి స్పష్టంగా తెలియుచున్న దేమనగా, కపిలముని స్వయంగా

భగవానుని అవతారము కాబట్టి అతడిచేత తెలుపబడిన యోగ మరియు ఆధ్యాత్మిక జ్ఞానము అత్యున్నతమైన ప్రమాణమని వారు అంగీకరించిరి. కపిల భగవానుని చరిత్రను వివరిస్తున్నప్పుడు, శ్రీ సూత గోస్వామి వైదిక సూత్రముల ననుసరించి ఆధ్యాత్మిక జ్ఞానమును అందజేయుటకు పూర్వము గొప్ప ఆధ్యాత్మికాచార్యు లెవరైనను ఈ విషయమును గురించి చర్చించిరా అనే విషయమును పరిశీలిస్తుండెను. ఈ సందర్భములో, విదురునికి మరియు వైదిక సాహిత్యమునకు మూల రచయితయైన వ్యాసదేవుని మిత్రుడైన మైత్రేయునికి మధ్య జరిగిన సంభాషణను శ్రీ సూత గోస్వామి పరిశీలించెను.

శ్రీ సూత గోస్వామి ముందుగానే ఇట్లు వివరించిరి, ఈ లోకంలో గొప్ప ధ్యానయోగియైన కర్దమమునికి మరియు అతని భార్యయైన దేవహూతికి కపిల భగవానుడు కుమారుడిగా అవతరించెను. తమ పుత్రుని దివ్యత్వమును గురించి కర్దమముని మరియు దేవహూతికి ముందే తెలుసును. ఈ విశ్వములోనే ప్రథమ జీవుడైన బ్రహ్మదేవుడు కపిల దేవుని జననముకు పూర్వమే దేవహూతి ఎదుట ప్రత్యక్షమై భగవానుడు స్వయంగా ఆమెకు కుమారుడిగా అవతరించ బోతున్నాడని మరియు ఆ అవతారము ఆమెకు ఆధ్యాత్మిక జ్ఞానమును ప్రకాశింప జేయునని తెలియజేసెను.

వైదిక సమాజ పద్ధతి ననుసరించి, ఎవరికైనను ఎదిగిన కుమారుడున్నచో సన్న్యాసమును స్వీకరింపవచ్చును. కాబట్టి ఎవరైనను ఈ విధముగా వారి కుటుంబముతో మరియు ప్రాపంచిక జీవితముతో తమకు గల సంబంధములను త్యజించి భార్య బాధ్యతలను కుమారునికి అప్పగించవలెను. కర్దమమునికి తన కుమారుడు స్వయంగా భగవంతుని అవతారమని తెలిసినప్పటికినీ, ఈ వైదిక సమాజ పద్ధతిని గౌరవిస్తూ దాని ప్రాముఖ్యతను తెలియజేయుటకు అతడు తన భార్యయైన దేవహూతిని తన దివ్యకుమారుడైన కపిల దేవునికి అప్పగించి సన్న్యాసాశ్రమాన్ని స్వీకరించెను. కర్దమముని కపిలదేవుని సంరక్షణలో దేవహూతిని అప్పగించి అడవులకు ఏ విధముగా వెళ్ళేననెడి విషయము కపిలదేవుని గురించి శౌనకమునికి శ్రీ సూత గోస్వామి సమాధాన మిచ్చుటకు మునుపే నైమిశారణ్యము లోని ఋషులకు వివరించబడినది.

కర్దమముని అడవులకు వెళ్ళిన తర్వాత, బ్రహ్మదేవుని భవిష్యవాణిని తలచుకుంటూ దేవహూతి దివ్యజ్ఞానము కొరకు తన దివ్యకుమారుడిని మిక్కిలి వినయముతో సమీపించి తన కోరికను ఇలా వ్యక్తపరిచెను : "నా ప్రియమైన

భగవాన్! నేను అజ్ఞానమనే అంధకారములో పడిపోయితిని. ఈ అజ్ఞాన అంధకార కూపం నుండి బయటపడుటకు కేవలము నీ కృపయే నాకు ఆధారము, ఎందుకనగా నీవు నా దివ్యనేత్రుడవు. నీ కృప చేతనే నేను ఎన్నోజన్మల తర్వాత నేను నిన్ను పొందగలిగితిని... హే ప్రభూ! ప్రసన్నుడవై నా భ్రమను ఇప్పుడు తొలగింపుము...నీవు భౌతిక జీవితమనే వృక్షమును నరక గలిగే గొడ్డలి వంటివాడవు. కాబట్టి నేను నీకు ప్రణామముల నర్పిస్తున్నాను. నీవు యోగులందరిలో కెల్లా శ్రేష్ఠుడవు, నేను స్త్రీ పురుషునికి మరియు భౌతిక ఆధ్యాత్మిక పదార్థమునకు మధ్య గల సంబంధమును గురించి నీ నుండి తెలియగోరుచున్నాను." (శ్రీమద్భాగవతము 3.25.7–11)

ఆత్మసాక్షాత్కార విషయములో తల్లికి గల శుద్ధమైన కోరికకు కపిలుడు సంతసించి, ఆమెపై గొప్ప కృపతో 'సాంఖ్య' దర్శనమును ఉపదేశించుటను ప్రారంభించెను.

ఇపుడు, 'సాంఖ్య' అనగా ఏమిటి? 'సాంఖ్య' అనేది భౌతిక తత్త్వమును గురించి లేదా భౌతిక విశ్వమునకు చెందిన ప్రకృతి నియమాలకు సంబంధించినది. 'సాంఖ్య' అనేది పాశ్చాత్యుల ద్వారా 'తత్త్వశాస్త్రము'గా గుర్తించబడినది. 'సాంఖ్య' అను శబ్దానికి 'లెక్కించుట' అని అర్థం. ఎందుకనగా, 'సాంఖ్య' శాస్త్రము అంటే సృష్టి ఉత్పత్తి పరిణామము యొక్క తత్త్వములను, విశ్లేషణ మరియు తర్కముల ద్వారా లెక్కకట్టుట. కాబట్టి ఈ 'సాంఖ్య' శాస్త్ర నామము ఉపయోగించ బడినది. శబ్ద ఉత్పత్తి యొక్క సంస్కృత అర్థము ననుసరించి, భౌతిక తత్త్వముల విభజనలను గురించి సువిస్తారంగా వివరించు దానినే 'సాంఖ్య' అంటారు. తాత్త్విక దృష్టిలో ఈ శబ్దం ఎందుకు వాడబడినదనగా, 'సాంఖ్య' పద్ధతి అనేది ఆధ్యాత్మిక మరియు భౌతిక పదార్థముల మధ్య గల భేదమును విపులంగా విశ్లేషించును. మరియు ఈ అవగాహన భగవంతునికి సేవ నొనరించెడు భక్తియుక్త సేవకు దారితీయును. అందుకే 'సాంఖ్య' మరియు భక్తి అనేవి ఒకే పద్ధతికి చెందిన రెండు కోణములుగా చెప్పబడెను. కాబట్టి 'సాంఖ్య' యొక్క పరమలక్ష్యం లేదా చరమదశ భక్తియే.

ఈ సందర్భంలో గమనించదగ్గ విషయ మేమిటంటే, కపిల భగవానుడు అవతరించిన చాలాకాలము తర్వాత భారతదేశపు ఉపఖండములో నాస్తిక కపిలుడు ఉద్భవించి నాస్తిక సాంఖ్య శాస్త్రమును ప్రతిపాదించెను. ఇది ప్రస్తుత ఆధునిక విద్యాలయాల్లో సాంఖ్య శాస్త్రముగా అధ్యయనము చేయబడుచున్నది. నిజానికి ఇది కేవలం నాస్తిక భౌతిక సాంఖ్య శాస్త్రము. నిజమైన కపిలదేవుడు వివరించిన సాంఖ్య శాస్త్రము గురించి ప్రత్యక్షంగా పాశ్చాత్యులకు తెలియదు. ఈ మూల, ఆస్తిక సాంఖ్యపై 'దేవహూతి కుమారుడైన కపిల భగవానుని ఉపదేశములు'

(శ్రీమద్భాగవతములోని కపిలుని సాంఖ్యను గురించి శ్రీల ప్రభుపాదుల వారి సంపూర్ణ భాష్యము) బహుశా ఆంగ్లభాషలో ఇదే మొట్టమొదటి వ్యాఖ్యానము కావచ్చును. కాబట్టి ఈ విషయమునకు సంబంధించిన విద్యావంతులకు ఇది మిక్కిలి ఆసక్తిని కలిగించునదిగా పరిగణించబడెను.

కపిలదేవుని సాంఖ్యతత్త్వపు ప్రాథమిక సూత్రము మరియు పరమ లక్ష్యము భక్తి అయినందున, కపిలుడు దేవహూతికి దీనినుండే ఉపదేశించుట ఆరంభించెను. ఫలితంగా, 'దేవహూతి కుమారుడైన కపిల భగవానుని ఉపదేశములు' అనే ఈ పుస్తకం కపిల భగవానుని ప్రారంభిక ఉపదేశములపై శ్రీల ప్రభుపాదుల వారి వ్యాఖ్యానములు ప్రధానముగా భగవత్ సంబంధ విషయములను – భక్తియోగ శాస్త్రమును గురించి వివరించును(యోగ అనగా 'కలుపుట').

వాస్తవ కథకు ప్రారంభములో, దేవహూతి తన కుమారుడైన కపిలదేవుని మిక్కిలి వినయముతో సమీపించి ఆధ్యాత్మిక జ్ఞానోదయము కొరకు తన కోరికను తెలియజేసెను. దానికి సమాధానముగా కపిలదేవుడు, "ఆత్మసాక్షాత్కారములో శ్రద్ధ గలవారు అనుసరించే మార్గమును" ఉపదేశించెను. ఆత్మసాక్షాత్కార పద్ధతిని సంక్షిప్త పరస్తూ, కపిలుడు బద్ధ మరియు ముక్తి స్థితులలో గల చైతన్యమును వివరించెను. అతడు శుద్ధచైతన్యపు మనోభావములను, సాధులక్షణములను మరియు సత్సాంగత్యము – సాధు సాంగత్యము యొక్క ప్రాముఖ్యతను నొక్కివక్కాణించెను. తరువాత కపిలదేవుడు ముక్తి దశ అనేది భక్తికి ముందు పొందే దశ అని వివరించెను. అంతేకాకుండ ఎవరైతే భక్తిని పొందుదురో వారు సహజముగానే ముక్తిని పొందిన వారని తెలిపెను. భక్తి, భక్తియుక్త సేవలో నిమగ్నులైన వారు సహజంగానే భౌతికమైన కోరికలను అధిగమించి చివరకు జన్మమృత్యువులను దాటగలరని తెలిపెను.

శ్రీమద్భాగవతములోని తరువాతి వివరణల ననుసరించి, దేవహూతి తన కుమారుని దివ్యోపదేశములను శ్రవణము చేసి అర్థం చేసుకొనుట వలన పరిపూర్ణ ఆధ్యాత్మిక జ్ఞానానుభూతిని పొందగలిగెనని తెలియుచున్నది.

– ప్రకాశకులు

అధ్యాయము 1
కపిల భగవానుని అవతరణ ఉద్దేశ్యము
శ్లోకము 1

శౌనక ఉవాచ

కపిలస్తత్త్వసంఖ్యాతా భగవానాత్మమాయయా
జాతః స్వయమజః సాక్షాదాత్మప్రజ్ఞప్తయే నృణామ్

శ్రీ శౌనకుడు పలికెను : అతడు పుట్టుకలేని వాడైనప్పటికినీ దేవాదిదేవుడు తన స్వరూపశక్తి ద్వారా కపిలముని రూపమున జన్మించెను. సమస్త మానవాళి శ్రేయస్సు కొరకై దివ్యజ్ఞానమును విస్తరింప జేయుటకు అతడు అవతరించెను.

భాష్యము : మానవాళి శ్రేయస్సు కొరకై ఆధ్యాత్మిక జ్ఞానము నొసగుటకు భగవానుడు అవతరించునని *'ఆత్మప్రజ్ఞాప్తయే'* అను శబ్దము సూచించుచున్నది. భౌతికావసరము లకు సంబంధించిన విషయములన్నియు వైదిక సాహిత్యము నందు పూర్తిగా ఒసగ బడినవి; అవి చక్కని జీవనమునకు మరియు క్రమముగా సత్త్వగుణ స్థితికి ఉద్ధరింప బడుటకు తగిన ప్రణాళిక నొసగును. అట్టి సత్త్వగుణ స్థితి యందు మనుజుని జ్ఞానము విస్తరించగలదు. రజోగుణ మనునది కేవలము భౌతిక సుఖములను భోగించుటకు ఒక ప్రేరణ వంటిది కనుక అట్టి స్థితిలో జ్ఞానమునకు తావు లేదు. ఇక తమోగుణము నందు జ్ఞానము గాని, భోగము గాని లేకుండ కేవలము జంతుజీవనమే నెలకొని యుండును.

మనుజుని రజోగుణము నుండి సత్త్వగుణ స్థితికి ఉద్ధరించుటకే వేదములు ఉద్దేశింపబడినవి. ఎవరైనను సత్త్వగుణము నందు స్థితుడైనప్పుడు అతడు ఆత్మ జ్ఞానమును అవగతము చేసికొనగలడు. సాధారణ మానవుడెవ్వడును ఆ జ్ఞానము నెరుగజాలడు. కనుక గురుశిష్య పరంపర అవసరమైనందున, ఈ జ్ఞానము స్వయముగా దేవాదిదేవునిచే గాని లేదా అతని ప్రామాణిక భక్తునిచే గాని వివరింప బడుచుండును. దేవాదిదేవుని అవతారమగు కపిలుడు కూడ కేవలము ఆధ్యాత్మిక జ్ఞానమును విస్తరింప జేయుటకే జన్మించెను, లేదా అవతరించెను. శౌనకముని సైతము ఇచ్చట ఇలా పలుకుచున్నాడు. నేను ఆత్మ స్వరూపుడననెడి జ్ఞానమొక్కటే (*'అహం బ్రహ్మాస్మి'* : శాశ్వత స్వభావరీత్యా నేను బ్రహ్మమును) ఆత్మను గూర్చి, దాని కర్మలను గూర్చి ఎరుగుటయే సరిపోదు. దానికొరకై మనుజుడు వాస్తవముగా

బ్రహ్మన్‌కు సంబంధించిన కర్మల యందు నెలకొని యుండవలెను. ఆ కర్మలకు సంబంధించిన జ్ఞానమును సాక్షాత్తుగా దేవాదిదేవుని చేతనే వివరింపబడినది. అటువంటి ఆధ్యాత్మికజ్ఞానము మానవులకే గాని జంతువులకు అవగతము కాదు. ఈ విషయమే *'నృణాం'*(మానవులకు) అను పదము ద్వారా ఇచ్చట స్పష్టముగా సూచింపబడినది. క్రమమైన జీవితము కొరకు మానవులు ఉద్దేశింపబడిరి. జంతుజీవనము నందును ప్రకృతిరిత్యా కొంత నియమము లున్నప్పటికినీ, అవి శాస్త్రములందు గాని లేదా ప్రామాణికులచే గాని వివరింపబడిన నియమిత జీవనము కాదు. శాస్త్రానుసారము గల జీవనమందే మనుజుడు ఆధ్యాత్మిక జ్ఞానమును అవగతము చేసికొనగలడు.

ఈ ఆధ్యాత్మిక జ్ఞానమును వ్యాపింప చేయుటకొరకు దేవాదిదేవుని అవతారమైన కపిలదేవుడు తన తల్లియైన దేవహూతికి 'సాంఖ్య' శాస్త్రమును ఉపదేశించెను. తరువాతి కాలంలో మరొక కపిలదేవుడు అవతరించి నాస్తిక 'సాంఖ్య' తత్త్వమును వివరించెను. ఈ తత్త్వం మొత్తం 24 మూలకాలతో ముడిపడి ఉండును. కాని అందులో భగవంతుని గూర్చి ఎలాంటి సమాచారమును అతడు అందివ్వలేదు. నిజమైన కపిలదేవుడు దేవహూతి కుమారుడైన కపిలుడుగా, మరియు మరొకడిని నాస్తిక కపిలుడని పిలవటమైనది. కపిలదేవుని ఉద్దేశిస్తూ శౌనకముని ఇలా చెబుతున్నాడు, *"కపిలస్తత్త్వ సంఖ్యాతా"* – కపిలుడు పరమ పురుషుడు. కాబట్టి అతడు పరమసత్యమును వివరించగలడు. నిజానికి, భగవంతుడు మాత్రమే పరమ సత్యం యొక్క నిజస్థితిని ఎరుగును. ఇతరులెవ్వరు దానిని తెలుసుకోలేరు. భగవానుడు శ్రీకృష్ణుడు లేదా అతని అవతారము కొన్నిసార్లు భూమి పై అవతరించి మానవాళికి జీవిత లక్ష్యమును ఉపదేశింతురు. కాబట్టి భగవానుడు కపిలదేవునిగా అవతరించెను, *'తత్త్వసాంఖ్యాతా'.* *'సాంఖ్యాతా'* అనే శబ్దానికి 'వ్యాఖ్యాత' అని తత్త్వమనే శబ్దమునకు 'పరమసత్యం' అని అర్థం. పరమసత్యం స్వయంగా శ్రీకృష్ణభగవానుడే. ప్రత్యేకించి మనం భౌతిక త్రిగుణాల(సత్త్వగుణం, రజోగుణం, తమోగుణం) ప్రభావానికి లోనైనప్పుడు, పరమసత్యమును లేదా పరమ పురుషుడిని మానసిక కల్పనలతో అర్థం చేసుకోలేము. సత్వగుణములో నెలకొనినవారే పరమ సత్యమును అర్థం చేసుకొనుటకు అర్హులు. భగవద్గీత(18.42) ననుసరించి బ్రాహ్మణ గుణాలు కలవారు మాత్రమే సత్త్వగుణములో ప్రతిష్ఠితులు కాగలరు.

శమో దమస్తపః శౌచం క్షాన్తిరార్జవమేవ చ
జ్ఞానం విజ్ఞానమాస్తిక్యం బ్రహ్మకర్మ స్వభావజమ్

"శాంతి, ఆత్మనిగ్రహము, తపస్సు, శుచిత్వము, సహనము, ధర్మప్రవర్తనము, జ్ఞానము, తెలివి, భగవంతుని యందు విశ్వాసము అనెడి సహజములైన గుణములచే బ్రాహ్మణులు కర్మచేయుదురు."

వైదిక పద్ధతిని అనుసరించి, వాస్తవ సత్యమును వివరించగలిగే సామర్థ్యము గల నిజమైన బ్రాహ్మణులు సమాజములో ఉండవలెను. అందరు శూద్రులైనచో పరమ సత్యమును అర్థం చేసుకోలేరు. కలియుగంలో ప్రతిఒక్కరు శూద్రులని *(కలౌ శూద్రసంభవాః)* చెప్పబడినందన ఈ యుగంలో అర్హత గల బ్రాహ్మణులను కనుగొనుట ఎంతో కష్టం. ఎందుకనగా, వారు ఎంతో అరుదు. నిజానికి, ఈ యుగంలో అర్హత గలిగిన బ్రాహ్మణు డొక్కడు కూడ లేడు.

ప్రాయేణాల్పాయుషః సభ్య కలావస్మిన్ యుగే జనాః
మందాః సుమన్దమతయో మందభాగ్యా హ్యుపద్రుతాః

"ఓ ఋషులారా! ఈ కలియుగము నందు జనులు అల్పాయుష్కులుగా నుందురు. వారు కలహస్వభావులు, బద్ధకస్తులు, తప్పుద్రోవ పట్టింపబడినవారు, మందభాగ్యులు మాత్రమేగాక సదా కలతలకు లోనైయుందురు." (శ్రీమద్భాగవతము 1.1.10) ఈ యుగంలోని జనులు అల్పాయుష్కులు మరియు ఆధ్యాత్మిక జీవితమును చురుకుగా అర్థం చేసుకోలేరు. నిజానికి మానవ జీవితం ఆధ్యాత్మిక తత్త్వజిజ్ఞాసను అర్థం చేసుకొనుటకై నిర్దేశించబడినది. కాని ఈ యుగంలో ప్రతిఒక్కరు శూద్రులైనందున ఎవరు దానిపట్ల శ్రద్ధను కనపరచుట లేదు. ప్రజలు నిజమైన జీవిత లక్ష్యమును విస్మరించారు. ఈ యుగములోని మానవులందరు దుష్టులు లేదా మందబుద్ధులు లేదా రెండింటి మిశ్రమము. అంతేకాకుండ ప్రజలు దురదృష్టవంతులైనందున వివిధ కారణముల చేత ఆందోళన చెందుతుంటారు. శ్రీమద్భాగవతము ననుసరించి వర్షాలు ఎక్కువగా ఉండవు. దానిఫలితంగా ఆహారపదార్థాల కొరత ఏర్పడును. అంతేకాకుండ, ప్రభుత్వం కూడ పెద్ద మొత్తంలో పన్నులను వసూలు చేయును. శ్రీమద్భాగవతములో తెలుపబడిన కలియుగ లక్షణములను కొన్నింటిని మనం అనుభవిస్తున్నాము. కలియుగమనేది దుఃఖాలయము కాబట్టి స్వయంగా శ్రీకృష్ణుడైన శ్రీ చైతన్య మహాప్రభువు కేవలం 'హరేకృష్ణ' మహామంత్రమును కీర్తించుమని అందరిని ఆదేశిస్తున్నాడు.

హరేర్నామ హరేర్నామ హరేర్నామైవ కేవలం
కలౌ నాస్త్యేవ నాస్త్యేవ నాస్త్యేవ గతిరన్యథా

"కపటము మరియు కలహములతో నిండిన ఈ యుగమునందు హరినామ సంకీర్తనయే ముక్తికి గల ఏకైక సాధనము. దానికిమించిన మరొక మార్గము లేదు. మరొక మార్గము లేదు. మరొక మార్గము లేదు." (బృహన్నారదీయ పురాణము) 'హరేకృష్ణ' మహామంత్ర కీర్తనయే ఈ కలియుగంలో గల సులభ పద్ధతి. ఈ పద్ధతిని శ్రీ చైతన్య మహాప్రభువు కనుగొనలేదు. ఇది శాస్త్రాలు, పురాణముల చేత ఆదేశించబడినది. ఈ యుగంలోని వారందరు మందబుద్ధులు, దురదృష్టవంతులు మరియు మానసిక ఆందోళనలు కలిగిన శూద్రులు, కాబట్టి వారు ఎలా పరమ సత్యమును లేదా జీవిత లక్ష్యమును అర్థం చేసుకోగలరు? స్వయంగా శ్రీకృష్ణుడు భగవద్గీత(4.7) లో చెబుతున్నట్లుగా :

యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత
అభ్యుత్థానమధర్మస్య తదాత్మానం సృజామ్యహం

"భరత వంశీయుడవైన ఓ అర్జునా! ఎప్పుడెప్పుడు ధర్మాచరణమునకు హానియు, అధర్మమునకు అభ్యుదయమును కల్గుచుండునో అప్పుడు నే నవతరింతును."

కొన్ని వందల మరియు వేల సంవత్సరముల క్రితం శ్రీకృష్ణభగవానుడు దేవహూతి కుమారుడైన కపిలునిగా అవతరించాడు. అతని తండ్రి కర్దమముని. కపిలదేవుడు పెరిగి పెద్దవాడైన తర్వాత, అతని తండ్రి వైదిక పద్ధతి ననుసరించి, ఆధ్యాత్మిక జీవితమును కొనసాగించుట కొరకై గృహాన్ని త్యజించి సన్న్యాసాశ్రమాన్ని స్వీకరించిరి. మానవుడు జీవితాంతము ఈ భౌతిక లోకంలోనే మగ్గిపోనవసరము లేదు. *"పంచసోర్ధ్వం వనం వ్రజేత్."* వైదిక ఆదేశముల ననుసరించి నాలుగు ఆశ్రమాలు మరియు నాలుగు వర్ణములు కలవు. వీటిని ఖచ్చితముగా పాటించి తీరవలెను. వైదిక ఆచారముల నన్నింటిని ఖచ్చితంగా పాటించెడి కర్దమముని తన భార్యను యుక్త వయస్కుడైన కపిలదేవుని సంరక్షణ నందుంచి తాను గృహ త్యాగమును చేసెను.

కపిలుని గురించి ఇలా చెప్పబడినది : *"కపిలస్తత్త్వసంఖ్యాతా భగవాన్"* – కపిలదేవుడు భగవానుడు. ఈ రోజులలో భగవానుడు అనే పదము దుర్వినియోగ పడుతున్నందున ఈ పదమును చాలా చౌకగా ఉపయోగిస్తుంటారు. నిజానికి భగవానుడు సామాన్యవ్యక్తి కాదు. *"అవజానన్తి మాం మూఢాః"* – శ్రీకృష్ణభగవానుడు మానవుడి వలె అవతరించినందున, మూర్ఖులు అతడిని సామాన్య మానవుడిగా పరిగణిస్తారు. శ్రీకృష్ణుడు స్వయంగా భగవద్గీత (7.13)లో ఇట్లు చెబుతున్నాడు :

త్రిభిర్గుణమయైర్భావైరేభిః సర్వమిదం జగత్
మోహితం నాభిజానాతి మామేభ్యః పరమవ్యయమ్

"సమస్త విశ్వము సత్త్వరజస్తమస్సులను త్రిగుణములచే మోహింపబడినదై, ఈ గుణములన్నింటికిని అతీతుడను, అక్షయుడనైన నన్ను తెలియజాలకున్నది."

అయినను శ్రీకృష్ణుని అర్థం చేసుకోగల మహాత్ములెందరో కలరు. శ్రీకృష్ణుడు తన స్నేహితుని పాత్ర పోషిస్తున్నను, శ్రీకృష్ణుడు స్వయంగా దేవాదిదేవుడని అర్జునుడు అర్థం చేసుకోగలిగెను. అర్జునుడు పరిపూర్ణ జ్ఞానవంతుడైనను, శ్రీకృష్ణుడు మనందరి శ్రేయస్సుకై అతడికి ఉపదేశించెను. అర్జునుడు శ్రీకృష్ణుడిని ఆదేశించమని ప్రార్థించెను, ఆ ఆదేశములన్నీ మానవాళి కంతటికి మార్గదర్శకములు. భగవద్గీతను శ్రవణము చేసిన తర్వాత, అర్జునుడు శ్రీకృష్ణుడిని *"పరం బ్రహ్మ పరం ధామ"* అని సంభోదించాడు.

నిజానికి ప్రతిఒక్కరు బ్రహ్మన్ అనగా ఆత్మస్వరూపులు. నిజానికి మనము శరీరములము కాదు. *"అహం బ్రహ్మాస్మి"*(నేను ఆత్మను) అని తెలుసుకొనుటయే నిజమైన ఆత్మసాక్షాత్కారము. వైదిక సంస్కృతి ననుసరించి, తాము ఆత్మ స్వరూపులమని శరీరము కాదనే నిజమును ప్రతిఒక్కరు తెలుసుకోవలెను. మనం కుక్క మరియు పిల్లుల వలె అజ్ఞానంలో ఉంటూ, "నేను శరీరమును, నేను అమెరికా వాసుణ్ణి, నేను భారతీయుడను, నేను బ్రాహ్మణుడిని, నేను క్షత్రియుడను, నేను హిందువును, నేను ముస్లిమును" అని భావించరాదు. ఇవన్నీ కేవలము శరీర ఉపాధులు. మానవుడు ఆధ్యాత్మికముగా పురోభివృద్ధిని సాధించినప్పుడు, *'అహం బ్రహ్మాస్మి'* తాను ఆత్మస్వరూపుడనని అర్థం చేసుకొనును. ఇదే బ్రహ్మానుభూతి. అనగా ఏదో సాధన ద్వారా మనం ఆత్మ స్వరూపులమంటే బ్రహ్మన్ కాగలమని అర్థం కాదు. బంగారము బంగారమే. అది ఏమైనను బంగారమే. ఎలాగైనను తొలగించ బడునట్టి కొద్దిపాటి మట్టితో ఏదైన కప్పబడినచో అది ఖచ్చితముగా తొలిగించబడును. అదేవిధముగా మనమందరము బ్రహ్మన్, ఆత్మ స్వరూపులమైనను ఏదోవిధముగా ఈ భౌతిక జగత్తుతో సంబంధమును ఏర్పరచుకుని*(భూమిరాపోఽనలో వాయుః),* ఈ శరీర కవచములను పొందాము. దానితో మనము "నేను ఈ శరీరమును" అని భావిస్తుంటాము. ఇది అజ్ఞానము. ఆధ్యాత్మిక జ్ఞానం చేత మానవుడు ప్రకాశింప బడనంత వరకు అతడు పశుప్రవృత్తిలోనే ఉండిపోవును.

ధర్మమనగా మన నిజస్థితిని అర్థం చేసుకొనుటయే. ధర్మం యొక్క పరమ లక్ష్యమును శ్రీకృష్ణుడు స్వయంగా భగవద్గీత(18.66) లో స్పష్టంగా వివరించెను.

“సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ” – “సమస్త ధర్మములను విడిచి నన్నే శరణు పొందుము.” ఈ భూమిపై మనం హిందుధర్మం, ముస్లింధర్మం, క్రైస్తవధర్మం మొదలగు ఎన్నో ధర్మములను సృష్టించాము. అయినప్పటికిని శ్రీకృష్ణుడే సర్వమనే నిర్ణయమునకు వచ్చినచో నిజమైన ధర్మమును సాధించినట్లు అర్థము. తిరిగి శ్రీకృష్ణుని ఉపదేశమైన భగవద్గీత(7.19)ను చూచినచో :

బహూనాం జన్మనామన్తే జ్ఞానవాన్ మాం ప్రపద్యతే
వాసుదేవ స్సర్వమితి స మహాత్మా సుదుర్లభః

“పెక్కు జననమరణముల తర్వాత నేనే సమస్తమనియు, కారణముల కన్నింటికిని కారణమనియు ఎరింగి నిజమైన జ్ఞానము గలవాడై నన్ను శరణు జొచ్చును. అట్టి మహాత్ముడు చాలా అరుదు.”

కృష్ణచైతన్య ఉద్యమము ఈ సందేశమును ప్రచారము చేయుటకొరకే నిర్దేశించబడినది. కాబట్టి మేము ఏదో ప్రత్యేక వర్గానికి చెందిన మతపద్ధతిని ప్రచారము చేయుట లేదు. నిజమైన ధర్మమును ప్రచారము చేస్తున్నాము. *“ధర్మం తు సాక్షాద్ భగవత్ ప్రణీతమ్”* – వాస్తవమునకు నిజమైన ధర్మమేమిటో ఎవరికి తెలియదు, మరియు ఎవరు కూడ ధర్మాన్ని తయారు చేయలేరు. ధర్మమనునది భగవానుని(పరమ పురుషుని) ఆదేశము. ప్రభుత్వ చట్టాలను ఎవరు తయారు చేయలేరు; ఎందుకంటే అవి ప్రభుత్వము చేత తయారు చేయబడును. ధర్మమునకు గల సులభ నిర్వచనమే పరమ పురుషుని ఆదేశము. పరమ పురుషుడైన భగవంతుడు ఒక్కడైనప్పుడు అతని ఆదేశము కూడ తప్పనిసరిగా ఒక్కటై ఉండాలి. అలాగైనచో, వివిధ రకాల ధర్మములు ఎందుకు కలవు? ఇది అసాధ్యము. వివిధ ధర్మాలు అజ్ఞానము వలన సృష్టించబడి నందున ప్రజలు తాము హిందు ధర్మమని, ముస్లిం ధర్మమని, క్రైస్తవ ధర్మమని ఈ విధమైన ధర్మమని, ఆ విధమైన ధర్మమని భావిస్తున్నారు. కాని నిజానికి అవేమి కాదు. బంగారము బంగారమే. క్రైస్తవుడు బంగారమును కలిగివున్నందున అది క్రైస్తవ బంగారమగునా? బంగారము హిందువుల దైనను, ముస్లిముల దైనను, క్రైస్తవుల దైనను మరెవరిదైనను బంగారము బంగారమే. భగవానుని ఆదేశము ననుసరించి, ధర్మమనగా పరమ పురుషునికి శరణాగతి చేయుటయే. ఇది భాగవత ధర్మం, మరియు భగవంతుడికి శరణాగతిని ఎలా చేసుకోవలెనో అందరికి బోధించవలెను. భగవంతుడు ఒక్కడే. భగవంతుడు ఇద్దరు కాదు. పోటీ ఉన్నచో అక్కడ భగవంతు డుండడు. ప్రస్తుత కాలంలో ప్రతి

వీధిలో ఒక భిన్నమైన భగవంతుడు కనిపిస్తున్నాడు. కాని శ్రీకృష్ణుడు అలాంటి భగవంతుడు కాడు. అతడు పరమేశ్వరుడు. భగవద్గీత(7.7) లో శ్రీకృష్ణుడు స్వయంగా చెబుతున్నాడు :

మత్తః పరతరం నాన్యత్ కించిదస్తి ధనంజయ
మయి సర్వమిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ

"ఓ ధనంజయా! నాకంటె ఉన్నతతరమైన సత్యమింకొకటి లేదు. ముత్యములు దారముతో గ్రుచ్చబడి దానిపై ఆధారపడి యుండునట్లు సర్వమును నా మీదనే ఆధారపడి యున్నది."

శ్రీకృష్ణుడి, భగవంతుడి కంటే ఉన్నతమైన వారెవరూలేరని అందరికి తెలియ జేయుటయే కృష్ణచైతన్య ఉద్యమ లక్ష్యము. అదృష్టవశాత్తు, ఎందరో అమెరికా యువతీయువకులకు బూటకపు భగవంతుల గురించి తెలియదు. వారు ప్రామాణికమైన ఈ కృష్ణచైతన్య ఉద్యమమును ఎంతోశ్రద్ధగా అంగీకరించారు. "*కృష్ణస్తు భగవాన్ స్వయమ్*" – "భగవానుడు అనగా శ్రీకృష్ణుడు". "ఇదిగో భగవంతుడు శ్రీకృష్ణుడు" అని మాత్రమే సమాచారమును అందించాము. ఎంతోమంది అమెరికా మరియు యూరోపు యువత దానిని మిక్కిలి శ్రద్ధగా అంగీకరిస్తున్నందున కృష్ణచైతన్యములో అభివృద్ధిని సాధిస్తున్నారు. దానితో ఎంతోమంది ఎలా ఈ అమెరికా మరియు యూరోపు దేశాలవారు గొప్ప భక్తులుగా మారి పారవశ్యముతో నృత్యం చేస్తున్నారని ఆశ్చర్యపోతున్నారు. "*కృష్ణస్తు భగవాన్ స్వయమ్*" అనే సమాచారమును మిక్కిలి శ్రద్ధగా అంగీకరించినందున వారు పురోభివృద్ధిని సాధించ గలుగుతున్నారు. ఎవరైనను అగ్నిని తెలిసి లేదా గ్రుడ్డిగా పట్టుకున్నను అది చేతిని కాల్చితీరుతుంది. పిల్లవాడు అగ్నిని పట్టుకున్నాడు కాబట్టి అది కాల్చదు అని కాదు. ఈ పాశ్చాత్య యువత అగ్నిని పట్టుకున్నారు. దానికి ఫలితముగా అది అగ్ని వలె పని చేయుచున్నది.

'*ఆచార్యోపాసనమ్.*' '*కృష్ణస్తు భగవాన్ స్వయమ్*' అను ఈ సమాచారము కల్పించినది కాదు. ఇది గురుశిష్య పరంపరలోని ఆచార్యులందరి చేత అంగీకరించ బడినది. శంకరాచార్యులు నిరాకారవాదైనను అతడు శ్రీకృష్ణుడిని దేవాదిదేవుడిగా అంగీకరించెను. అలాగే శ్రీ రామానుజాచార్యులు, శ్రీ మధ్వాచార్యులు, శ్రీ విష్ణుస్వామి, శ్రీ నింబార్కాచార్యులు మరియు శ్రీ చైతన్య మహాప్రభువు మరియు అతని అనుచరులందరు దీనినే అంగీకరించిరి. అర్జునుని వలె వారందరు కూడ

శ్రీకృష్ణుడు భగవానుడని అంగీకరించిరి. ఇది ఎంతో సులభ పద్ధతి. భగవంతుడు అంటే ఏమిటి? భగవంతుడు ఎక్కడ? అంటూ మూర్ఖంగా వెతకడమెందుకు? ఇక్కడ భగవంతుడు శ్రీకృష్ణుడు కలడు. శ్రీకృష్ణుడు కనిపించడని మనం భావించ వచ్చును, కాని శ్రీకృష్ణుడు తన శక్తి రూపంలో ప్రకటితుడగును. రాయి భగవంతుడు కాదు, కాని అది భగవంతుని శక్తులలో ఒకటి. వేడి మరియు ప్రకాశం అనునని అగ్ని కాదు, కాని అగ్ని లేకుండ వేడి లేదా ప్రకాశము అనేవి ఉండవు. వేడి మరియు ప్రకాశము అగ్ని కంటె భిన్నం కాదనేది ఉద్దేశ్యము. ఈ భౌతిక లోకం అనునది పరమ అగ్ని యొక్క వేడి మరియు ప్రకాశము వంటిది.

ఏకదేశస్థితస్యాగ్నిర్ జ్యోత్స్న విస్తారిణీ యథా
పరస్య బ్రాహ్మణః శక్తిస్తథేదమఖిలం జగత్

"అగ్ని ఒకచోట నుండినను, తన ప్రకాశమును సర్వత్రా ప్రకాశింప జేయునట్లు, దేవాదిదేవుడు, పరబ్రహ్మన్ తన శక్తులను విశ్వమంతటా విస్తరింప జేయును." (విష్ణుపురాణము 1.22.53)

సూర్యుడు ఒకచోట నెలకొని ఉండినను దాని వెలుతురు మరియు వేడి సూర్యగ్రహమంతటా వ్యాపించును. వేడి మరియు వెలుతురును తాకిన వెంటనే మనం సూర్యుడున్నాడని అర్థం చేసుకోగలము. వెలుతురు మరియు వేడిని అందరూ గ్రహించగలరు. భగవద్గీత(7.8) లో శ్రీకృష్ణుడు : *"ప్రభాస్మి శశిసూర్యయోః"* అనగా నేను సూర్యుని మరియు చంద్రుని కాంతిని అని చెబుతున్నాడు. జనులు తరుచుగా "నాకు భగవంతుడిని చూపించగలరా?" అని అడుగుతుంటారు. ప్రతిరోజు ప్రతిక్షణం భగవంతుడిని దర్శిస్తున్నారని వారు అర్థం చేసుకోలేక పోతున్నారు. ఎందుకంటే, ఈ యుగంలోని జనులు వట్టి మూర్ఖులు. భగవంతుని శక్తిని గ్రహించినచో భగవంతుని ఉనికిని కూడ అనుభూతి చెందగలుగుదుమని జనులు అర్థం చేసుకోలేకున్నారు.

ఇప్పుడు కృష్ణచైతన్య ఉద్యమములోని యువతీయువకులైన భక్తులు శ్రీకృష్ణుడిని ఆరాధిస్తున్నారు. భౌతిక ఆనందముల పట్ల అనాసక్తిని కలిగి ఉండుటయే భక్తుడి లక్షణము. నిజమైన లక్ష్యం, *"భక్తిః పరేశానుభవో విరక్తిరన్యత్ర చ"* (భాగ. 11.2.42). కృష్ణచైతన్య సంఘమునకు సంబంధించిన శిష్యులు చలనచిత్రాలకు హోటళ్ళకు లేదా క్లబ్బుల వంటివాటికి వెళ్ళరు. అంతేకాకుండ వారు మత్తు పానీయాలు లేదా ధూమపానం వంటివేటిని కూడ సేవించరు. యూరోపు మరియు

అమెరికా దేశాలలో ఇవన్నీ చౌకగా అందుబాటులో ఉన్నప్పటికినీ ఈ యువత వాటిపట్ల ఆసక్తిని చూపించుట లేదు. ఎందుకంటే, వారు భౌతిక ప్రపంచమును తిరస్కరించారు. కాబట్టి వారు కేవలం కటిక నేలపై కూర్చొని కృష్ణచైతన్యమును గూర్చి తెలుసుకొనుటలోనే ఆసక్తిని కల్గి ఉన్నారు. ఎవరైనను, భౌతిక సుఖాల పట్ల ఆసక్తిని కోల్పోయినచో, అతడు ఆధ్యాత్మికంగా పురోభివృద్ధిని సాధించాడని మనము అర్థము చేసుకోవచ్చును. ఆధ్యాత్మిక జీవితం అంటే సన్యాసమును తీసుకొని తర్వాత ధూమపానము లేదా తేనీరు తీసుకొనుట కాదు. భౌతికజీవితము పట్ల ఆసక్తిని కోల్పోవు స్థితికి మనం చేరుకోవలెను. భౌతిక కర్మలలో ఆసక్తిని కోల్పోయి, పరమ పురుషుడైన భగవంతుని మరియు అతని సేవను అర్థం చేసుకొనుటలో ఆసక్తిని కనపరచవలెను. శ్రీమద్భాగవతము(5.5.1) లో చెబుతున్నట్లుగా :

నాయం దేహో దేహభాజాం నృలోకే
కష్టాన్ కామానర్హతే విడ్భుజాం యే

"పుత్రులారా! ఈ లోకమున మానవజన్మను ధరించిన దేహధారులగు జీవులకు కేవలము ఇంద్రియభోగార్థము రేయింబవళ్ళు కష్టించి పనిచేయుట ఎంతమాత్రము తగదు. అట్టి సుఖము మలభక్షణము చేయు శునక, సూకరములకు కూడా లభించు చున్నది." '*విడ్భుజాం*' అను పదానికి మలము తినేవారని అర్థం. పందులు కేవలం మలము తినుటకొరకై రాత్రింబగళ్ళు పనిచేయును, మరియు మలములో రసాయన ద్రవ్యాలు, భాస్వరం(హైడ్రోపాస్ఫేట్) వంటివి ఉంటాయి. కాబట్టి పందులు శక్తిని పొంది క్రొవ్వుపట్టి మైథున సుఖమును అనుభవిస్తాయి. మానవ జీవితము ఏ విధముగాను పందుల జీవితములను అనుకరించుటకు కాకుండ తపమును ఆచరించుటకై నిర్దేశించబడినది.

తపో దివ్యం పుత్రకా యేన సత్త్వం
శుద్ధ్యేద్యస్మాద్ బ్రహ్మసౌఖ్యం త్వనన్తమ్

"కనుక పుత్రులారా, మనుజుడు దివ్యమగు భక్తియోగ స్థితిని బడయుటకు తపస్సును చేపట్టవలెను. అట్టి కార్యములచే హృదయము పవిత్రమై దివ్యస్థితిని పొందినపుడు, భౌతిక సుఖమునకు అతీతమైన, అనంతమైన దివ్యసుఖమును అతడు పొందును." (భాగ. 5.5.1)

వైదికనాగరికతకు అర్థమిదియే. బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు,

శూద్రులు బ్రహ్మచారులు, గృహస్థులు, వానప్రస్థులు మరియు సన్యాసులతో కూడినదే వర్ణాశ్రమ ధర్మం. అంతేకాకుండ ఇది ప్రజలను క్రమంగా భగవంతుని అర్థము చేసుకోగలిగే పరిపూర్ణ స్థితికి కొనిపోవుటకై నిర్దేశించబడినది. వివిధ వర్ణాల మరియు ఆశ్రమాల సంపూర్ణ లక్ష్యం కేవలము భగవంతుని ఆరాధించుటయే. కాబట్టి మనం విభిన్న శ్రేణులు గల ఈ సమాజ స్థితి ద్వారా దీనిని అర్థం చేసుకోవచ్చును. ఎవరైనను పాఠశాలకు వెళ్ళినచో, ప్రారంభములో మొదటి తరగతి నుండి రెండవ తరగతికి, మూడవ తరగతికి ఇలా క్రమముగా ముందుకు కొనసాగునట్లుగా ఒకరు అభివృద్ధిని సాధిస్తుంటారు.

వర్ణాశ్రమ ధర్మమును మానవ సమాజము అంగీకరించినప్పుడు క్రమంగా బ్రహ్మన్‌ను అర్థం చేసుకోగలుగుతారు. పుట్టుకతో అందరు శూద్రులే. కాబట్టి అందరు జ్ఞానవంతులు కావలెను. 'ద్విజ' అనే పదానికి 'రెండుసార్లు జన్మించిన వాడని' అర్థం. మొదట తల్లి గర్భం నుండి జన్మిస్తాము. తరువాతి జన్మను ఆధ్యాత్మిక గురువు మరియు వైదిక జ్ఞానం నుండి పొందుతాము. వైదిక జ్ఞానమనేది తల్లి, మరియు ఆధ్యాత్మిక గురువు తండ్రి. మనం గురువు నుండి యజ్ఞోపవీతమును పొంది, ఆధ్యాత్మిక జీవితమును అభ్యసించుటను ప్రారంభించినచో దానిని ద్విజుడు అంటారు. అప్పుడు వైదిక సాహిత్య పఠనకు అనుమతి లభిస్తుంది. ఈ విధంగా వైదిక సాహిత్యమునకు పుత్రులమగుదుము. *"నిగమకల్పతరోర్గలితం ఫలమ్"*: శ్రీమద్భాగవతమనేది వైదిక సంస్కృతి యొక్క సారాంశము. ఇది ఒక కల్పవృక్షం, దానినుండి కావలసిన దేనినైనను మనం పొందవచ్చును. వైదికజ్ఞానం సంపూర్ణ మైనది, కాబట్టి దానిని తెలుసు కోవాలనుకుంటే ప్రామాణిక ఆధ్యాత్మికాచార్యుడిని తప్పక మనం ఆశ్రయించవలెను *(తద్ విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్).*

దురదృష్టవశాత్తు ఈ యుగంలో ఏదీ క్రమబద్ధీ కరించబడదు. ప్రజలు జీవిత లక్ష్యమును విస్మరించినప్పుడు భగవంతుడు స్వయంగా అవతరించును. భగవంతుడు తన అవ్యాజ కృపచేత అవతరించును. ఎందుకనగా, అతడు మనలను మన శాశ్వత ధామమైన భగవద్ధామానికి తిరిగి తీసుకువెళ్ళుట కొరకు ఆరాట పడుతుంటాడు. కాబట్టి మనం తిరిగి వెళ్ళవలెను. అజ్ఞానములో నున్నందున మనకు భగవంతుని రాజ్యం గురించి ఏమి తెలియదు. అక్కడికి ఎలా చేరుకోవాలో లేదా ఎలా ఆనందముగా ఉండాలనే విషయాలు కూడ ఏవి మనకు తెలియవు. దీనినంతటిని మనం విస్మరించాము. కాబట్టి శ్రీకృష్ణుడు కొన్నిసార్లు అతడి ప్రతినిధులైన శుద్ధభక్తులను పంపును. అంతేకాకుండ, కొన్నిసార్లు అతడు స్వయంగా

వచ్చును, మరికొన్నిసార్లు అతడు తన అవతారములను పంపును.

కపిలదేవుడు పరమ పురుషుడైన శ్రీకృష్ణభగవానుని అవతారము. అందుకే ఇలా చెప్పబడినది : *"కపిలస్తత్త్వసంఖ్యాతా భగవాన్ ఆత్మమాయయా."* *'మాయ'* అనే పదానికి భ్రాంతి అని అర్థమే కాకుండా, ఆప్యాయత మరియు శక్తి అని కూడ అర్థం. శ్రీకృష్ణుడు అవతరించినప్పుడు అతడి శక్తులన్నీ కూడ అతనితోపాటు అవతరించును. అతడికి బలవంతముగా రావలసిన అవసరము లేదు. మనం ప్రత్యేక శరీరములను అంగీకరిస్తాము. ఎందుకనగా దానిని మనము బలవంతముగా అంగీకరించవలసి వచ్చును. కాని శ్రీకృష్ణుని విషయములో అలా కాదు. ఇప్పుడు నేను మానవ శరీరమును కలిగి ఉన్నాను, కాబట్టి భవిష్యత్తులో కూడ మానవ శరీరమునే కావాలనీ ఒత్తిడి చేయలేను. వచ్చే జన్మలోని శరీరమును మన కర్మలను బట్టి పొందుతాము. అంతేకాని మన ఇచ్ఛానుసారము కాదు. ఎవరైనను, అర్హత కలిగిన విద్యను సంపాదించకుండ అత్యున్నత న్యాయస్థానమునకు న్యాయాధీషులము కావాలనీ ఒత్తిడి చేయలేము. ఎవరైనను అర్హతను సంపాదించు కొనినచో అతడు దేవతగానో, ఇంద్రుడు లేదా చంద్రుని వంటిదేవతల వలెనో లేదా కుక్క పిల్లి వలెనో కావచ్చును. అది కర్మ లేదా అతడి కార్యకలాపాల పై *(కర్మణా దైవనేత్రేణ)* ఆధారపడి ఉంటుంది. శ్రీకృష్ణుడు లేదా అతని అవతారములు వచ్చినపుడు శరీరముల కొరకు వారు తమ కర్మలపై ఆధారపడరు. భగవంతుడు కర్మకు అతీతుడు. అంతేకాకుండ అతడు తన సంపూర్ణ ఇచ్ఛానుసారమే అవతరించును. కాబట్టి *'ఆత్మమాయయా'* అని చెప్పబడినది. భగవంతుడు తన అంతరంగ శక్తితో అవతరించును. అంతేకాని బహిరంగశక్తి లేదా ఒకరి బలవంతము వలన అతడు అవతరించడు. గవర్నరు కారాగారమును సందర్శించెననగా అతడు బలవంతముగా అక్కడకు వెళ్ళినట్లు కాదు. అతడిని దోషిగా భావించి దూషించనులేము. ఎందుకంటే, అతడు కారాగారమునకు తన ఇచ్ఛానుసారము కార్యములను పర్యవేక్షించుట కొరకు వెళ్ళును. ఏది ఏమైనను తెలియచున్న విషయమేమనగా, ఒకరు సాధారణ దోషిగా నిరూపించ బడినప్పుడు అతడు కారాగారములో పెట్టబడును. అంతేకాకుండ అతడు అక్కడికి బలవంతముగా పంపబడును. అలాగే, మూర్ఖులు శ్రీకృష్ణుడు తమలో ఒకడని భావించినట్లు నేరస్తుడు మూర్ఖత్వముతో తాను మరియు గవర్నరు ఒక్కటేనని భావించవచ్చును. *"అవజానన్తి మాం మూఢా మానుషీం తనుమాశ్రితమ్."* శ్రీకృష్ణుడు లేదా అతని అవతారములు ఈ భౌతిక ప్రపంచములో అవతరించినను, భగవానుడు తన దివ్యస్థితిని కోల్పోడని విజ్ఞుడు అర్థం చేసుకోగలడు. అతడు సాధారణ వ్యక్తి

కాదు, లేదా కర్మకారణంగా అతడు భౌతిక లోకములోనికి బలవంతముగా త్రోయబడలేదు. భగవంతుడు తన ఇచ్ఛానుసారమే అవతరించును. *"పరం భావ మజానన్తః."* శ్రీకృష్ణుడంటే ఏమిటో మూర్ఖులు అర్థం చేసుకోలేరు. అందుకే వారు శ్రీకృష్ణుడిని మానవుడని భావింతురు. శ్రీకృష్ణుడే స్వయంగా భగవద్గీత(7.3) లో చెబుతున్నట్లుగా :

మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే
యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః

"పెక్కువేలమంది మానవులలో ఎవరో ఒకడు సంపూర్ణ సిద్ధికొరకై ప్రయత్నించును. అట్లు ప్రయత్నించి సిద్ధి పొందినవారిలో ఎవరో ఒక్కడు నన్ను యథార్థముగా నెరుంగును."

కాబట్టి శ్రీకృష్ణుడిని అర్థం చేసుకొనుట సులభము కాదు. శ్రీకృష్ణుడు చెబుతున్నట్లుగా, వేలకొలది మనుషులలో ఒకరు, సిద్ధులు ఆత్మసాక్షాత్కారమును పొందిన వారగుదురు. అలాంటి సిద్ధులనేకులలో ఒకరు మాత్రమే శ్రీకృష్ణుడిని అర్థం చేసుకొనుటకు అవకాశమును కలిగి ఉందురు. స్వయంగా శ్రీకృష్ణుడే శ్రీ చైతన్య మహాప్రభువుగా అవతరించి ఈ సులభ పద్ధతితో మనకు శ్రీకృష్ణుడిని అర్థం చేసుకునే అవకాశమును కలిగించాడు. ఇది మన సౌభాగ్యము. ఆ పద్ధతి ఏమిటి? అది కేవలం శ్రీకృష్ణుని గురించి శ్రవణము చేయుటయే. అంతే. అందుకే మేము ప్రపంచమంతటా కృష్ణ చైతన్య కేంద్రములను నెలకొల్పితిమి.

శృణ్వతాం స్వకథాః కృష్ణః పుణ్యశ్రవణకీర్తనః
హృద్యన్తఃస్థో హ్యభద్రాణి విధునోతి సుహృత్సతామ్

"పరమాత్మగా సర్వజీవ హృదయములలో నిలిచినవాడును మరియు శ్రద్ధావంతులైన భక్తుల శ్రేయోభిలాషియును అగు శ్రీకృష్ణభగవానుడు చక్కగా శ్రవణకీర్తనములు జరిగినపుడు పుణ్యప్రదములైన తన దివ్యలీలాకథల యెడ శ్రవణోత్సాహమును పెంపొందించుకొనిన భక్తుని హృదయము నుండి భౌతిక సుఖాభిలాషను తొలగించి వేయుచున్నాడు." (శ్రీమద్భాగవతము 1.2.17)

మనం శ్రీకృష్ణుని గురించి శ్రవణము చేసినచో శుద్ధులమగుదుము. శ్రీకృష్ణుని గురించి శ్రవణము చేయుటమనగా అతనితో సాంగత్యము చేయుటయే. ఈ విధముగా మన జీవితములను పరిపూర్ణము చేసుకోవచ్చును.

అధ్యాయము 2

ఆధ్యాత్మికాచార్యుడు మరియు పరమయోగి

శ్లోకము 2

న హ్యస్య వర్ష్మణః పుంసాం వరిమ్ణః సర్వయోగినామ్
విశ్రుతౌ శ్రుతదేవస్య భూరి తృప్యన్తి మేऽసవః

శౌనకుడు ఇంకను ఇట్లు కొనసాగించెను : భగవానుని కన్నను అధికముగా నెరిగినవాడు వేరొక్కడు లేడు. ఆతని కన్నను అధికపూజ్యుడు లేదా పరిపక్వత చెందిన యోగి ఇంకొకడు లేడు. కనుకనే ఆ దేవాదిదేవుడు వేదపతియై యున్నాడు; సర్వదా ఆతనిని గూర్చి శ్రవణము చేయుటయే ఇంద్రియములకు నిజమైన సుఖము.

భాష్యము : దేవాదిదేవునికి ఎవ్వడును సమానుడు గాని, అధికుడు గాని కాజాలడని భగవద్గీత యందు తెలుపబడినది. అదే విషయము వేదములలో, *"ఏకో బహూనాం యో విదధాతి కామాన్"* అని నిర్ధారించబడినది. పరమపురుషుడగు ఆతడు ఇతర జీవులందరకు జీవనావసరముల నొసగుచున్నాడు. ఆ విధముగా విష్ణుతత్త్వములు, జీవతత్త్వములు అందరును దేవాదిదేవుడగు శ్రీకృష్ణభగవానునికి ఆధీనులై యున్నారు. అదే భావన ఇచ్చట నిర్ధారించబడినది. *"న హ్యస్య వర్ష్మణః పుంసామ్"*: జీవులలో ఎవ్వరును పరమపురుషుని కన్నను అధిక ధనవంతుడు, అధిక యశోమంతుడు, బలవంతుడు, అధిక సుందరుడు, జ్ఞానవంతుడు లేదా అధిక వైరాగ్యవంతుడు లేనందున ఆతడిని ఎవరూ అతిశయింప జాలరు. ఈ యోగ్యతలే ఆతడిని దేవాదిదేవుడి గాను, సర్వకారణకారణుని గాను చేసినవి. అద్భుత కార్యములను చేయుట వలన యోగులు మిగుల గర్వించవచ్చును. కాని వారిలో ఎవ్వరును దేవాదిదేవునితో సమానులు కాలేరు.

శ్రీకృష్ణభగవానుని సహచర్యము గల వారెవ్వరైనను ఉత్తమోత్తమ యోగిగా పరిగణింపబడును. భక్తులు భగవానుని యంతటి శక్తివంతులు కాకపోయినను, ఆ దేవాదిదేవునితో నిత్య సాహచర్యము వలన దాదాపు భగవానునితో సమానులు కాగలరు. కొన్నిమార్లు భక్తులు భగవానుని కన్నను అధికశక్తి శాలురుగా వర్తింతురు. నిస్సందేహముగా అది భగవానుని అనుమతితోనే జరుగుచుండును.

ఇక్కడ *'వరిమ్ణః'* అను పదము కూడా ప్రయోగింపబడినది. యోగులందరి

లోను పరమపూజ్యుడని దాని భావము. శ్రీకృష్ణుని నుండి శ్రవణము చేయుట యనునది ఇంద్రియములకు నిజమైన సుఖము; కనుకనే ఆతడు "గోవిందుడు"అని తెలియబడినాడు. తన వాక్కులచే, బోధలచే, ఆదేశములచే తనకు సంబంధించిన ప్రతిదానిచే ఆతడు ఇంద్రియములను రంజింపజేయుటయే అందులకు కారణము. ఆతడేది ఉపదేశించినను అది దివ్యస్థితి నుండే అయి యుండును; ఆతని ఉపదేశములు సంపూర్ణములైన కారణమున అవి ఆతనికి అభిన్నములు. శ్రీకృష్ణుని నుండి లేదా ఆతని విస్తరణ నుండి లేదా కపిలుని లేదా సంపూర్ణ అంశావతారము నుండి శ్రవణము చేయుట ఇంద్రియములకు మిగుల సుఖకరము. గొప్పసుఖము నొసగునదైనందున భగవద్గీతను ఎన్నిసార్లైనను పఠింప వచ్చును లేదా శ్రవణము చేయవచ్చును; దానిని ఎంత అధికముగా పఠించినచో మనుజునికి పఠనాసక్తి అంతగా అధికమై, విషయము అవగతమగును; అంతియేగాక ప్రతిమారు క్రొత్త అనుభూతి, అవగాహన కలుగుచుండును. దివ్యసందేశపు స్వభావమదియే. అదేవిధముగా అటువంటి ఆధ్యాత్మిక ఆనందమునే శ్రీమద్భాగవతము నందున మనము గాంచగలము. శ్రీకృష్ణభగవానుని మహిమలను ఎంత అధికముగా శ్రవణము చేస్తూ, కీర్తించినచో అంత అధికముగా మనము అదృష్టవంతులము కాగలము.

పూర్వపు శ్లోకంలో దేవాదిదేవుడి అవతారమైన దేవహూతి కుమారుడు కపిలదేవుడిని *'భగవాన్ ఆత్మమాయయా'* అని వివరించబడినది. *'భగ'* అనే పదానికి 'ఐశ్వర్యము' అని అర్థం మరియు *'వాన్'* అనగా 'ఎవరైతే కలిగి ఉంటాడో' వానిని సంబోధించుట. సృష్టి యొక్క సర్వైశ్వర్యములు భగవంతుడిలో ఉపస్థితమై ఉండును. వేదాలలో తెలిపినట్లుగా(కఠోపనిషత్తు 2.2.13) :

నిత్యో నిత్యానాం చేతనాశ్చేతనానామ్
ఏకో బహూనాం యో విదధాతి కామాన్

'నిత్య' అనగా భగవంతుడు ఒకడు. మరియు *'నిత్యనాం'* అనగా జీవులు అనేకము. *'నిత్యో నిత్యానాం'* మనము అనేకులము. కాని భగవంతుడు ఒక్కడే. జీవులకు పరిమితి లేదు. వారిని లెక్కకట్టలేము. అనంత అనే శబ్దమునకు అంతులేనన్ని జీవులనీ అర్థం. ఈ జీవులందరు ఒక్కడైన పరమ పురుషుని చేత పాలించబడు తున్నారు. భగవంతుని చేత పాలించబడుతున్న జీవరాసులన్నింటినీ మనము ఊహించలేము. గొప్ప ఏనుగులు, చిన్న చీమలు, 84 లక్షల జీవరాసులన్నీ

భగవంతుని చేత పోషింపబడుచున్నవి. అలాంటప్పుడు మనలను అతడు పోషింపడని విచారించుట మెందుకు? భగవంతునికి భక్తులై సర్వమును త్యజించి కేవలం అతని సేవలోనే నెలకొని అతని పాదపద్మములను శరణు పొందినవారు ఖచ్చితంగా భగవంతుని చేత రక్షింపబడుదురు. కృష్ణ చైతన్య సంఘమునకు వందకు పైగా కేంద్రాలు కలవు. వాటినన్నింటిని శ్రీకృష్ణుడే పోషిస్తున్నాడు. భక్తులెవ్వరు కూడ స్వతంత్రముగా డబ్బుకొరకై పనిచేయక పోయినను వారందరు పోషించ బడుతున్నారు. భగవద్గీతలో శ్రీకృష్ణుడు "మీరు ఇది చేయండి లేదా అది చేయండి, అప్పుడే నేను మిమ్ములను పోషిస్తాను" అని ఎక్కడ చెప్పలేదు. అంతేకాకుండ, అతడు మనలను పోషించుటయే కాకుండ, మన పాపకర్మల ఫలితాల నన్నింటి నుండి రక్షించెదనని చెబుతున్నాడు(18.66). వీటన్నింటికి సంబంధించిన హామి కలదు.

'తస్యైవ హేతోః ప్రయతేత కోవిదః.' *'కోవిదః'* అనే శబ్దానికి జ్ఞానం కలవాడనని అర్థం. జ్ఞానవంతుడు శ్రీకృష్ణుని పాదపద్మములను శరణు పొందుటకు ప్రయత్నించవలెను. నిజానికి, మానవ జీవితం శ్రీకృష్ణుని చరణాలకు శరణు పొందుట కొరకై నిర్దేశించబడినది. అదియే మన ధర్మం. *'ఉపరి'* అనే పదం ఉన్నత లోకాలను సూచిస్తుంది. ఏడు ఉన్నత లోకాలు కలవు, మనము మధ్యలోని భూలోకములో ఉన్నాము. ఈ విశ్వంలో పదునాలుగు లోకములున్నవి, మరియు జీవులందరు వివిధ శరీరాలతో వివిధ లోకాలలో తిరుగాడుతున్నారు. కర్మను బట్టి జీవులు కొన్నిసార్లు ఉన్నత లోకాలకు లేదా అధోలోకాలకు వెళ్ళుతుంటారు. జీవి ఈ విధముగా పరిభ్రమిస్తూ, భౌతిక ఆనందములను పొందుతూ ఇంద్రియాలను మరింతగా సంతృప్తి పరుచుటమెలా అని ఆలోచిస్తుంది. ఏమైనను మనం ఈ విధముగా చేయరాదని శాస్త్రం తెలుపుతుంది. కేవలము శ్రీకృష్ణుడిని అర్థం చేసుకొనుటకు కష్టపడవలెను. మనము కేవలము ఆహార నిద్ర కోసమే చింతించ రాదు. ఎందుకనగా, శరీరమునకు అవసరమైనవన్నీ ముందుగానే సమకూర్చ బడినవి. శరీరమును పోషించుటకు ప్రత్యేకించి శ్రమించ నవసరము లేదు.

తల్లభ్యతే దుఃఖవదన్యతః సుఖం
కాలేన సర్వత్ర గభీరరంహసా

మనము నిజమైన ఆనందము కొరకు కష్టించవలెను, అదే నిజమైన జీవనం కోసమై చేసే పోరాటము. శాస్త్రప్రకారం, *'తల్లభ్యతే దుఃఖవత్'.* *'దుఃఖవత్'* అనే శబ్దము

దుఃఖాలను కోరకపోయినను అవి ఏదోవిధముగా మనకు లభించుచున్నవి. కాబట్టి దుఃఖముల కొరకు మనం ప్రత్యేకంగా శ్రమించ నవసరము లేదు. ఎవరూ కూడ తమ గృహమునకు నిప్పు అంటుకోవాలనో లేదా వారి పిల్లవాడు మరణించాలనో కోరుకొనరు. ఎవరు ఇటువంటి విపత్తులను ఆశించరు. అయినను అవి వస్తుందును. ప్రతిఒక్కరు నా కుమారుడు కలకాలం చల్లగా జీవించాలని, లేదా నాకు గొప్పధనం లభిస్తే బాగుండునని కోరుకుంటారు. అదేవిధముగా, మనం అనుభవించవలసిన సుఖము కూడ మన ప్రమేయము ఆహ్వానము లేకుండానే లభించును. కాబట్టి మనము సుఖదుఃఖముల కొరకు శ్రమించరాదు. కేవలము శ్రీకృష్ణుడిని అర్థం చేసుకుని అతడి చరణములను ఆశ్రయించు స్థితికి చేరుకోవలెను. అదే నిజమైన మానవ ప్రయత్నము.

శ్రీల రూప గోస్వామికి శ్రీ చైతన్య మహాప్రభువు ఇలా చెబుతున్నారు :

బ్రహ్మాండ భ్రమితే కోన్ భాగ్యవాన్ జీవ్
గురు-కృష్ణ-ప్రసాదే పాయ్ భక్తి-లతా-బీజ్

"జీవుడు క్రిందికి మీదికి, ఒక లోకము నుండి మరొక లోకానికి పరిభ్రమిస్తుందును. ఆధ్యాత్మికాచార్యుని మరియు శ్రీకృష్ణుని కృప చేత అతడికి శ్రీకృష్ణుని భక్తియుక్త సేవా బీజము లభించినచో అతడు గొప్ప అదృష్టవంతుడగును."(శ్రీ చైతన్య చరితామృతము, మధ్యలీల 19.151) కృష్ణచైతన్య ఉద్యమము ప్రజలను అదృష్టవంతులుగా మార్చుట కొరకై ప్రయత్నిస్తున్నది. ఈ యుగంలోని ప్రతిఒక్కరు దురదృష్టవంతు లైనప్పటికిని(*మందభాగ్యాః*) ఈ స్థితిని మార్చుటకు మేము ప్రయత్నిస్తున్నాము.

ప్రపంచమంతయు సమస్యలతో నిండియున్నది. ఒక దేశంలో ఒక రకమైన సమస్య మరోదేశంలో మరొక రకమైన సమస్య ఉంటుంది. ప్రభుత్వముల మధ్య కూడ కలహాలు కలవు. దేశరాష్ట్రపతి కూడ కలతలతో నిండి ఉంటాడు. కొన్నిసార్లు మనము గొప్ప అదృష్టవంతులమని భావించవచ్చును. ఉదాహరణకు రాష్ట్రపతి నిక్సన్ తాను అదృష్టవంతుడనని తాను అమెరికా సంయుక్త రాష్ట్రాలకు అధిపతినని భావించెను. కాని స్వల్పకాలంలోనే తాను దురదృష్ట వంతుడనని తెలుసుకున్నాడు. నిజానికి ఈ స్థితి మనందరిది. రాష్ట్రపతి నిక్సన్ మాత్రమే పట్టుబడ్డ నేరస్తుడు. తాము సురక్షితమని ఎవరూ అనుకోరాదు. బెంగాలీ భాషలో ఒక సామెత ఇలా కలదు : ఎండిన ఆవుపేడను కాల్చటానికి ఉపయోగిస్తారు. ఎండినపేడ మండుటను

చూచి పచ్చిపేడ నవ్వుతూ ఇలా అంటుంది, "ఓ నీవు మంటలలో కాలుతున్నావు, కాని నేను సురక్షితముగా ఉన్నాను." కాని దానికి తెలియదు అది ఎండిన వెంటనే దానిని కూడ మంటలలో పడవేయుదురని. అధ్యక్షుడైన నిక్సన్ కష్టాలలో ఉన్నాడని మనం నవ్వొచ్చును, బ్యాంకులో డబ్బు ఉన్నందుకు మనం సురక్షితమని భావించ వచ్చును, కాని నిజానికి ఎవరు సురక్షితము కాదు. కాలక్రమేణ అందరు ఎండి పోవుదురు మరియు మంటలలో పడవేయబడుదురు. అది సత్యం. ఎన్ని సంవత్సరాలు జీవించినను మృత్యువును మనం తప్పించుకోలేము. వాస్తవానికి "మృత్యువు అనేది నిశ్చయం". మరియు మృత్యుఫలితం ఏమిటి? కీర్తి–డబ్బు–పదవి వంటి సమస్తమును చివరికి భౌతిక జీవితమును మనమందరము కోల్పోవుదుము. శ్రీకృష్ణుడు భగవద్గీత(10.34) లో: "*మృత్యుః సర్వహరశ్చహమ్*"– "నేను సర్వాన్ని కబళించే మృత్యువును అంటాడు." శ్రీకృష్ణుడు మృత్యురూపంలో వచ్చి బ్యాంకులోని డబ్బును, మేడమిద్దెలను, భార్యపిల్లలను అంతేకాకుండ మనవద్దగల సమస్తమును దోచుకుంటాడు. "ఓ మృత్యువా! సర్దుకొనుటకు నాకు కొద్ది సమయమును ఇవ్వండి" అని మనము అడగలేము. ఎందుకంటే, అప్పుడు సర్దుబాట్లు అనేవి ఉండవు. మనం వెంటనే వెళ్ళవలసి వస్తుంది.

మూర్ఖులు భౌతిక జీవిత దుఃఖములను తెలుసుకోలేకున్నారు. భగవద్గీత (13.9)లో శ్రీకృష్ణుడు చెబుతున్నాడు :"*జన్మమృత్యుజరావ్యాధిదుఃఖదోషాను దర్శణమ్.*" నిజమైన జ్ఞానమనగా ఒకరు ఎంతటి గొప్పవారైనను భౌతిక జీవితములో నాలుగు ముఖ్యమైన జన్మ–మృత్యు–వృద్ధాప్యం మరియు రోగం అనేవి ఉండును. ఇవి ఉన్నత లోకములలో(బ్రహ్మలోకం) మరియు అధోలోకంలో(పాతాళలోకం) కూడ ఉండును.

తస్యైవ హేతోః ప్రయతేత కోవిదో
న లభ్యతే యద్భ్రమతాముపర్యధః
తల్లభ్యతే దుఃఖవదన్యతః సుఖం
కాలేన సర్వత్ర గభీరరంహసా

"అత్యంత ఉన్నతలోకమైన బ్రహ్మలోకము నుండి అధోలోకమైన పాతాళము వరకు పరిభ్రమించినను లభించనటువంటి ప్రయోజనము కొరకే తత్త్వజ్ఞానము కలిగిన బుద్ధిమంతులైనవారు వాస్తవముగా ప్రయత్నించవలెను. ఎందుకనగా కోరక పోయినను దుఃఖములు మనకు సకాలములో సంప్రాప్తించు రీతి, ఇంద్రియ

భోగసుఖము కూడా దానంతట అదియే అప్రయత్నముగానే కాలక్రమమున లభింప గలదు.” (భాగ. 1.5.18)

ఎప్పుడైతే యమధర్మరాజు యుధిష్టురుని(ధర్మరాజు)తో ఈ ప్రపంచములో అన్నింటికన్నను “ఆశ్చర్యమును కలిగించు విషయమేది” అని ప్రశ్నించినపుడు, యుధిష్టిర మహారాజు : *“అహన్యాహని భూతాని గచ్ఛంతిహా యమాలయమ్”* ప్రతిక్షణం జనులు మరణిస్తున్నారు – “నా స్నేహితుడు మరణించాడు కాని నేను మాత్రం శాశ్వతముగా జీవించెదను” అని జీవించి ఉన్నవారు ఆలోచిస్తున్నారు (మహాభారతం, వనపర్వం 313.116). పచ్చిపేడ కూడ అలాగే ఆలోచిస్తుంది. బద్ధజీవుల స్థితి ఇటువంటిదే.

పరమేశ్వరుడైన భగవానుడు ఈ స్థితిని కలిగి ఉండడు. అందుకే ఇక్కడ : *“భగవాన్ ఆత్మమాయయా”* అని చెప్పబడినది. మనము ఈ లోకానికి కొద్ది రోజులు అనగా యాభై సంవత్సరాలో లేదా వంద సంవత్సరాలో జీవించుట కొరకు వస్తుంటాము. కాని భగవానుడు ఆ లక్ష్యం కోసం అవతరించడు. *(న మాం కర్మాణి లింపన్తి).* ఇక్కడ ఇంకా ఇలా చెప్పబడినది, *“న హ్యాస్య వర్ష్మణః”* – “ఎవరు కూడ భగవంతుని కంటె గొప్పవారు కాదు.” ఎవరు కూడ భగవంతుని కంటె గొప్పవారు కాని సమానులు కాని ఉండరు. అందరు అతనికంటె తక్కువవారే. ‘శ్రీ చైతన్య చరితామృతము’ను అనుసరించి(ఆదిలీల 5.142) : *“ఏకలే ఈశ్వర కృష్ణ, ఆర్ సబ్ భృత్య”* – కేవలము శ్రీకృష్ణుడే యజమాని. బ్రహ్మనుండి మొదలుకొని విష్ణు, మహేశ్వరుడు, ఇంద్రుడు, చంద్రుడు మరియు దేవతలందరు(ముప్పైమూడు కోట్ల దేవతలు) మరియు మధ్యలోకం, పాతాళ లోకాలలోని జీవులందరితో సహా అందరు అతడి సేవకులే. ఎప్పుడైతే శ్రీకృష్ణుడు : “నా ప్రియమైన ఫలానా...ఫలానా ఇక మీ ప్రదేశమును వదిలి బయటకు పదండి” అని ఆజ్ఞాపించినప్పుడు, మనం తప్పక వెళ్ళవలిసినదే. కాబట్టి అందరు సేవకులే. బ్రహ్మనుండి చీమ వరకు అందరి స్థితి అదే. *“యస్త్వింద్ర గోపమథవేంద్రమహో స్వకర్మ.”* ఇంద్రుడు మొదలుకొని క్షుద్రమైన ‘ఇంద్రగోపం’ అనే పురుగు వరకు అందరు తమ కర్మ ఫలితాల నన్నింటిని అనుభవిస్తూనే ఉన్నారు. మన కర్మను మనమే స్వయంగా సృష్టించుకుంటూ, ఈ జన్మలోనే రాబోవు శరీరమును తయారు చేసుకుంటున్నాము. ఈ జీవితములో మనం మన పూర్వజన్మ కర్మల ననుసరించి ఆనందించుటయో, దుఃఖించుటయో చేస్తుంటాము. అలాగే రాబోవు శరీరానికి కావలసిన కర్మలను కూడ చేస్తుంటాము. నిజానికి, మనం తిరిగి భౌతిక శరీరమును పొందకుండునట్లుగా వ్యవహరించ

వలెను. అయితే ఎలా దీనిని సాధించగలము? శ్రీకృష్ణుడిని అర్థం చేసుకొనుటకు ప్రయత్నించినప్పుడే దీనిని సాధించగలము. భగవద్గీత(4.9)లో శ్రీకృష్ణుడు చెబుతున్నట్లుగా :

జన్మ కర్మ చ మే దివ్యమేవం యో వేత్తి తత్త్వతః
త్యక్త్వా దేహం పునర్జన్మ నైతి మామేతి సోఽర్జున

"ఓ అర్జునా! నా యవతారము యొక్కయు, కర్మల యొక్కయు, దివ్యమైన స్వభావము నెవ్వడెరుంగునో అతడు దేహమును విడిచిన పిమ్మట మరల ఈ లౌకిక ప్రపంచమున జన్మింపక నా శాశ్వత ధామమున నన్నే పొందును."

ఇది సులభంగా కనిపించినను వాస్తవానికి శ్రీకృష్ణుడిని అర్థం చేసుకొనుట ఎంతో కష్టమైనది. ఏమైనను మనము కృష్ణభక్తులమైనచో శ్రీకృష్ణుడిని అర్థం చేసుకొనుట ఎంతో సులభమగును. ఏది ఏమైనను మనమతడిని జ్ఞాన, కర్మ లేదా యోగ ద్వారా అర్థం చేసుకొనుటకు ప్రయత్నించినచో నిరాశకు గురగుదుము. ఎన్నోరకాల యోగులు కలరు, కాని శ్రీకృష్ణుడికి భక్తులైనవారే యోగులలో అగ్ర గణ్యులు. శ్రీకృష్ణుడు యోగ ప్రక్రియ లన్నింటికి అతీతమైనవాడు. భారతదేశంలో యోగవిద్యలను ప్రదర్శించే అనేకమంది యోగులు కలరు. వారు నీటిపై నడువ గలరు. వారు తమకు తాము అతి తేలికగా లేదా అత్యంత బరువుగాను మారగలరు. కాని శ్రీకృష్ణుని యోగశక్తి ముందు వీటి విలువ ఎంత? అతని శక్తి వలన బ్రహ్మాండములు గాలిలో తేలుతున్నవి. చిన్న రాయినైనను గాలిలో నిలబెట్టడము ఎవరికైన సాధ్యమా? మనమెంతటి మూర్ఖులమనగా, కొన్నిసార్లు ఒక యోగి తన కొద్దిపాటి శక్తిని ప్రదర్శిస్తూ కొద్దిపాటి బంగారమును సృష్టించినచో వెంటనే అతడిని భగవంతుడని విశ్వసిస్తాము. మరియు కోట్లకొలది బంగారు గనులను ఉత్పత్తి చేసి, వాటిని ఆకాశములో తేలియాడునట్లు చేసిన నిజమైన యోగియైన భగవంతుడిని విస్మరిస్తాము. కృష్ణచైతన్య వంతులైనవారు తాము భగవంతులమని చెప్పెడి యోగుల చేత మోసగింపబడరు. కృష్ణచైతన్యము గల వ్యక్తి కేవలము అత్యున్నత యోగియైన యోగేశ్వరుడిని *(వరిష్ఠః సర్వయోగినామ్)* మాత్రమే సేవించుదురు. ఎందుకంటే, మనము అతని భక్తులగుటకు ప్రయత్ని స్తున్నందున యోగేశ్వరుడైన శ్రీకృష్ణుడిని దేవాదిదేవునిగా అంగీకరిస్తాము. శ్రీకృష్ణుడు స్వయంగా భగవద్గీత(18.55) లో ఇలా చెబుతున్నాడు:

భక్త్యా మామభిజానాతి యావాన్యశ్చాస్మి తత్త్వతః
తతో మాం తత్త్వతో జ్ఞాత్వా విశతే తదనన్తరమ్

“మానవుడు భక్తియుక్త సేవచే దేవాదిదేవుడనైన నన్ను యథాతథముగా అర్థము చేసికొనగలడు. అట్టి భక్తిచే అతడు నన్ను పూర్తిగా నెరింగినప్పుడు భగవద్రాజ్యమున ప్రవేశింపగలడు.”

ఈ పద్ధతి నిజానికి ఎంతో సులభమైనది. మొట్టమొదట మృత్యువు పై విజయమును సాధించుటమెలా అని మనము తెలుసుకోవలెను. ప్రస్తుతం మనం మృత్యువు తప్పనిసరి అని భావిస్తున్నాము, కాని అది నిజం కాదు. ఒకరిని కారాగారంలో పెట్టవచ్చునేమో కాని నిజానికి కారాగారం తప్పనిసరి అని కాదు. అది కేవలము అతడు చేసిన కర్మ చేత, నేరస్థుడైనందున అతడిని కారాగారములో పెట్టవలసి వస్తుంది. ప్రతిఒక్కరు కారాగారానికి ఖచ్చితముగా వెళ్ళాలనేమీ లేదు. జీవుల మైనందున వైకుంఠములో మనకు ప్రత్యేక చోటు కలదు.

పరస్తస్మాత్తు భావోఽ న్యో ఽ వ్యక్తోఽ వ్యక్తాత్సనాతనః
యః స సర్వేషు భూతేషు నశ్యత్సు న వినశ్యతి

అవ్యక్తోఽ క్షర ఇత్యుక్తస్తమాహుః పరమాం గతిమ్
యం ప్రాప్య న నివర్తన్తే తద్ధామ పరమం మమ

“ఈ వ్యక్తావ్యక్త ప్రపంచమున కతీతమైన శాశ్వతమైన మరియొక అవ్యక్త ప్రకృతి కలదు. అది పరమోత్కృష్టమైనది, ఎప్పుడును నశింపదు. ఈ ప్రపంచము నందున్న దంతయు నశించిన తరువాత గూడ అది యథాతథముగా నుండును. దేనిని వేదాంతులు అవ్యక్తమనియు అక్షరమనియు వర్ణింతురో ఏది పరమ లక్ష్యమని చెప్పబడుచున్నదో ఏ ప్రదేశమును పొందిన జీవులు తిరిగిరారో అదే నా దివ్య నివాసము.” (భ.గీ. 8.20,21)

వైకుంఠలోకాలలో సర్వం కలదు. శాశ్వత ఆనంద దాయకమైన మరియు పూర్తి జ్ఞానప్రదమైన జీవితమును(సత్‌చిత్ ఆనంద) మనమక్కడ పొందగలము. ఈ భౌతికలోకంలో మనం మగ్గిపోనవసరము లేదు. వైకుంఠ లోకమునకు వెళ్ళుటకు కావలసిన సులభ మార్గం : *“జన్మ కర్మ చ మే దివ్యమేవం యో వేత్తి తత్త్వతః.”* శ్రీకృష్ణుడిని అర్థం చేసుకొనుటకు మాత్రమే ప్రయత్నించండి. అతడెందుకు అవతరించును? అతని కార్యకలాపాలేమిటి? అతడు ఎక్కడి నుండి వస్తున్నాడు?

ఎందుకు అతడు మానవ శరీరంలో అవతరిస్తున్నాడు? కేవలము మనం దీనిని శ్రీకృష్ణుడు భగవద్గీతలో చెప్పినట్లుగా అర్థం చేసుకొనుటకు ప్రయత్నించ వలెను. కాబట్టి దీనిలో కష్టమేమిటి? భగవంతుడు స్వయంగా తన గురించి యథాతథంగా వివరిస్తున్నాడు, కాబట్టి మనము భగవద్గీతను యథాతథంగా అంగీకరించినచో, మనం తిరిగి భౌతిక శరీరమును పొందనవసరము లేదు. *"త్యక్త్వా దేహం పునర్జన్మ నైతి."* మనం జన్మమృత్యువులు లేని ఆధ్యాత్మిక శరీరములను పొంది *(సచ్చిదానంద విగ్రహః)* శ్రీకృష్ణుని కుటుంబములో ఆనందముగా నివసించవచ్చును. శ్రీకృష్ణుడు మనలను ఇక్కడ పోషిస్తున్నాడు, అక్కడ కూడ పోషించును. కాబట్టి ఆనందమనునది భగవద్ధామమును చేరినప్పుడే కలుగునని, మరియు అక్కడ శ్రీకృష్ణుని సాంగత్యములో మనము భుజిస్తూ, పానీయాలను సేవిస్తూ ఆనందముగా గడపగలమని తెలుసుకోవలెను.

అధ్యాయము 3

భగవంతుని లీలలను ఎలా అర్థం చేసుకోగలము

శ్లోకము 3

యద్యద్విధత్తే భగవాన్ స్వచ్ఛన్దాత్మాత్మమాయయా
తాని మే శ్రద్దధానస్య కీర్తన్యాన్యనుకీర్తయ

కనుక స్వచ్ఛందాత్ముడును మరియు కర్మలనన్నింటిని తన స్వరూపశక్తి ద్వారా నిర్వహించువాడును అగు భగవానుని కర్మలను, లీలలను సునిశితముగా వర్ణింపుడు.

భాష్యము : *'అనుకీర్తయ'* అను పదము ఇచ్చట ప్రధానమైనది. ఏదో మానసిక కల్పనను సృష్టించక నిజమైన వర్ణనను అనుసరించుటయని దాని భావము. సూత గోస్వామి తన గురువుగారైన శుకదేవ గోస్వామి నుండి శ్రీకృష్ణభగవానుని దివ్య లీలలను (ఆతని స్వరూపశక్తిచేత ప్రకటితమైనవి) గూర్చి వాస్తవముగా ఏది శ్రవణము చేసెనో దానిని అతడు తనకు వర్ణించవలెనని శౌనకుడు అర్థించెను. దేవాదిదేవుడగు భగవానుడు భౌతిక దేహరహితుడు; అయినను తన దివ్య సంకల్పముచే ఆతడు ఏ దేహమునైనను ధరించగలడు. ఆతని స్వరూపశక్తి ద్వారా అది సాధ్యపడును.

మనము భగవంతుని యొక్క దివ్యలీలలను క్రింద పేర్కొనిన ఏదైన ఒకటి లేదా కొన్ని ప్రామాణిక భక్తియుక్త సేవా విధానముల ద్వారా అర్థం చేసుకోగలము.

శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనమ్
అర్చనం వన్దనం దాస్యం సఖ్యమాత్మనివేదనమ్

"భగవంతుని దివ్యమగు నామరూపగుణ పరికర లీలలను గూర్చి వినుట, కీర్తించుట, వానిని స్మరించుట, ఆ దేవాదిదేవుని పాదపద్మములను సేవించుట, షోడశోపచార విధులతో ఆతడిని అర్చించుట, ఆతడిని స్తుతించుట. శ్రీకృష్ణునికి దాసుడనని భావించుట, ఆ భగవంతుడినే తమ ఉత్తమ మిత్రుడని భావించుట, సమస్తమును ఆతడికే అర్పించుట అనెడి తొమ్మిది పద్ధతులే విశుద్ధ భక్తియోగమని అంగీకరింప బడినవి." (శ్రీమద్భాగవతము 7.5.23)

నవవిధ భక్తి సేవ మార్గములు కలవు. అవి భగవంతుని యొక్క శ్రవణము

మరియు కీర్తనము. అతడిని స్మరించుట అతని పాదపద్మములకు సేవ చేయుట. అతడిని పూజించుట. అతడికి ప్రార్థనలు చేయుట. అతడికి సేవకుని వలె నడుచు కొనుట. మరియు అతడికి మిత్రుడగుట. మరియు సమస్తమును అతడికి సమర్పించుట. భక్తిని శ్రవణము మరియు కీర్తనతో ప్రారంభించవలెను. మానవుడు శ్రవణము మరియు కీర్తన చేయుటకు మిగుల ఉత్సాహవంతుడు కావలెను.

భగవద్గీత(9.14) లో చెబుతున్నట్లుగా :

సతతం కీర్తయన్తో మాం యతన్తశ్చ దృఢవ్రతాః
నమస్యన్తశ్చ మాం భక్త్యా నిత్యయుక్తా ఉపాసతే

"ఈ మహాత్ములు ఎల్లప్పుడును నా వైభవములను కీర్తించుచు, దృఢ నిశ్చయముతో ప్రయత్నించుచు, నా ముందు నమస్కరించుచు నన్ను నిత్యము భక్తితో పూజింతురు."

మనము దేవాదిదేవుని పవిత్ర లీలల గురించి చర్చించుట లేదా కీర్తించుటను చేయవలెను. కాని ముందుగా వాటి గురించి శ్రవణము చేయవలెను. శుకదేవ గోస్వామి చేత ఈ శ్రీమద్భాగవతము చెప్పబడినది మరియు పరిక్షిత్తు మహారాజు చేత శ్రవణము చేయబడినది మరియు మనము మనవంతుగా శ్రీకృష్ణుని గురించి శ్రవణము చేయవలెను. అతడిని కీర్తించవలెనని*(శ్రవణం కీర్తనం విష్ణోః)* దాని అర్థం. మనము విష్ణువును గూర్చి చర్చిస్తున్నామంటే శ్రీకృష్ణుని గూర్చి చర్చిస్తున్నట్లు. శ్రీకృష్ణుడు విష్ణుతత్త్వములకు మూలము. అనగా విష్ణువు శ్రీకృష్ణుని విస్తరణ. మేము విష్ణువును గురించి చెప్పినచో దాని అర్థం విష్ణువునకు మూలం శ్రీకృష్ణుడని అర్థం చేసుకోవలెను. శ్రీకృష్ణుడు భగవద్గీత(10.2) లో చెబుతున్నట్లుగా : "*అహమాదిర్హి దేవానామ్*" – "నేను దేవతలకు మూలము."

బ్రహ్మ, విష్ణు మరియు శివుడు ప్రధాన దేవతలు. సృష్టికి ముందు విష్ణువు ఉండెను. విష్ణువు నుండి బ్రహ్మ జన్మించెను. బ్రహ్మ నుండి శివుడు జన్మించెను. మరియు ఈ ముగ్గురు దేవతలు భౌతిక ప్రకృతికి సంబంధించిన త్రిగుణాలకు సంబంధించిన బాధ్యతలను తీసుకొనిరి. విష్ణువు సత్త్వగుణమును, బ్రహ్మదేవుడు రజోగుణమును మరియు శివుడు తమోగుణ బాధ్యతలను తీసుకొనెను. ఏమైనను, సృష్టికి పూర్వం శివుడు గాని, బ్రహ్మ గాని లేరు. కేవలం శ్రీకృష్ణుడే కలడు. కాబట్టి శ్రీకృష్ణుడు ఇలా చెబుతున్నాడు, "*అహమాదిర్హి దేవానామ్.*" అతడే దేవతలందరి మరియు జీవులందరికి సృష్టి కర్త. జగత్తు సృష్టించిన తర్వాత జీవులు అందులో ఉంచబడును. కాబట్టి ప్రారంభములో శివుడుగాని, బ్రహ్మగాని లేరని, కేవలం

నారాయణుడే గలడని వేదాలు ఘోషించెను*(ఏకో నారాయణ ఆసీత్).* నారాయణుడు కూడ శ్రీకృష్ణుని మరో సంపూర్ణ అంశ.

శాస్త్రముల నుండి మనము తెలుసుకోవలసిన దేమిటంటే, శ్రీకృషుడే సమస్తమునకు మూలము అని. "*కృష్ణస్తు భగవాన్ స్వయమ్*" – అన్ని విష్ణుతత్వాలు మరియు అవతారములు శ్రీకృష్ణుని సంపూర్ణ అంశలు, లేదా సంపూర్ణ అంశల యొక్క విస్తరణలు. లక్షలకొలదిగా అవతారములు కలవు. అవి సముద్రంలోని అలలవలె అపరిమితములు. శక్త్యావేశ అవతారములు, గుణ అవతారములు మరియు స్వయం అవతారము లన్నింటిని గూర్చి శ్రీమద్భాగవతములో వర్ణించ బడెను. ఈ అవతారములన్నీ '*స్వచ్ఛానందాత్మలు*' అనగా చింతల నుండి స్వేచ్ఛ కలవి. మనము ఒక వ్యాపారమును నడుపుచున్నప్పుడు ఎన్నో ఆందోళనలు కలుగును. ప్రత్యేకించి ఆ వ్యాపారపు ప్రధాన కార్యనిర్వహణాధికారికి లేదా యజమానికి ఎన్నో ఆందోళనలుండును. అతడు అతని కార్యాలయములో ఆందోళన చెందకుండ కూర్చున్నను, ఆనందముగా ఉండలేడు. ఎందుకంటే, అతడు ఎల్లప్పుడు దీనిని లేదా దానిని ఎలా చేయాలి, ఈ వ్యాపారమును ఎలా నడపాలి లేదా దానిని ఎలా నడపాలి అని ఆలోచిస్తుండును. ఇది భౌతిక ప్రకృతి. కాబట్టి ఈ భౌతిక లోకంలో ఎల్లప్పుడు ఆందోళన లుండునని చెప్పబడినది. ఎప్పుడైతే హిరణ్యా కశిపుడు తన కుమారుడైన ప్రహ్లాద మహారాజుతో, "నా ప్రియ కుమారా! మీ గురువుల నుండి నీవు నేర్చుకొనిన అత్యుత్తమ విషయమును గురించి తెలుపుము? అని అడిగెను. ప్రహ్లాద మహారాజు వెంటనే ఇట్లు ప్రత్యుత్తరమిచ్చెను : "*తత్ సాదుమన్యేఽ సురవర్యా దేహినాం సదా సముద్విగ్నధియామ్ అసత్ గ్రహాత్*" (భాగ. 7.5.5) – "భౌతికవాదులు '*అసత్*' గుణమును అంగీకరించిరని నేను నేర్చు కొంటిని." '*అసత్*' అనగా 'ఏదైతేకాదో' మనము ఈ స్థితిలోనే ఉండిపోరాదు, కాని తప్పనిసరిగా '*సత్*' *(ఓం తత్ సత్)* స్థితికి ఎదుగవలెను. ఇది వైదికాదేశము. ఈ భౌతిక లోకం '*అసత్ వస్తు*': ఇది నిలచి ఉండుట సాధ్యపడదు. భౌతికలోకంలో చివరకు సమస్తము నశించును. ఈ భౌతిక లోకంలోని దంతయు కొద్దికాలము మాత్రమే కొనసాగును. ఇది తాత్కాలికము. మాయావాది తత్త్వవేత్తలు "*బ్రహ్మ సత్యం జగన్ మిథ్యా*" అని చెబుతారు – అనగా "పరమ సత్యం వాస్తవమైనది, కాని జగత్తు అవాస్తవమైనది" అని. కాని వైష్ణవులు మిథ్యా అనే పదమును ఉపయోగించరు, ఎందుకనగా, పరబ్రహ్మన్ సత్యం మరియు సత్యం నుండి ఎలాంటి అవాస్తవము ఉద్భవించదు. మనము బంగారము నుండి చెవిపోగును తయారు

చేసినచో, ఆ చెవిపోగు కూడ బంగారమే. మనము చెవిపోగు అవాస్తవమని చెప్పలేము. *"యతో ఇమాని భూతాని జాయన్తే"*: దేనినుండి సర్వం ఉద్భవించునో అదే పరమ సత్యం. సమస్తము పరమసత్యము నుండే ఉద్భవిస్తున్నచో, ఏది కూడ అవాస్తవమవ్వదు. వైష్ణవాచార్యులు ఈ జగత్తును అశాశ్వతమైనదిగా అంగీకరింతురు. కాని మాయావాదులు చెప్పునట్లుగా మిథ్యా అని కాదు.

ఈ జగత్తు భగవంతుని నుండి ఉద్భవించినది. కాబట్టి ఇది 'మిథ్య' కాదు. కాని ఇది అశాశ్వతమైనది. అది కూడ భగవద్గీత(8.19)లో : *"భూత్వా భూత్వా ప్రలీయతే"* అని వివరించబడినది. భౌతిక జగత్తు ఉద్భవించును, కొద్దికాలము నిలుచును, చివరకు సమస్తము నశించును. ఇది మిథ్య కాదు. ఎందుకనగా, దీనిని పరమ సత్యమును అర్థం చేసుకొనుటకు ఉపయోగించ వచ్చును. అదే వైష్ణవతత్త్వం. జగత్తు అశాశ్వతమైనను దానిని ఆధ్యాత్మిక సాక్షాత్కారము కొరకు ఉపయోగించవలెను. దేనినైనను పరమ సత్యమును తెలుసుకొనుటకు ఉపయోగించినచో అది పరమసత్యముతో గుణైక్యము చెందుతుంది. శ్రీల రూప గోస్వామి చెబుతున్నట్లుగా :

అనాసక్తస్య విషయాన్ యథార్హముపయుంజతః
నిర్బంధః కృష్ణసంబంధే యుక్తం వైరాగ్యముచ్యతే

ప్రాపంచికతయా బుద్ధ్యా హరిసంబంధివస్తునః
ముముక్షుభిః పరిత్యాగో వైరాగ్యం ఫల్గు కథ్యతే
(భక్తిరసామృత సింధు 1.2.255, 256)

'ముముక్షుభిః' అనే పదం ఎవరైతే ముక్తిని పొందగోరుదురో వారిని ఉద్దేశించి చెప్పబడినది. ఒకరు భౌతిక విషయాల పట్ల విరక్తి చెందినప్పుడు, భౌతికలోకంతో సంబంధము గల దేనినైనను అంతం చేయాలనుకుంటారు. కాని *"ప్రాపంచికతయా బుద్ధ్యా హరిసంబంధివస్తునః"* అని వైష్ణవులు చెబుతుంటారు. ప్రతిది కూడ పరమ సత్యమైన పరమ పురుషునితో ఎంతోకొంత సంబంధమును కలిగి ఉండును. ఉదాహరణకు మైక్రోఫోన్‌ను తీసుకున్నట్లయితే అది లోహముతో తయారు చేయబడినది, కాని లోహమనేది ఏమిటి? అది భూమి యొక్క మరో రూపం. భగవద్గీత(7.4)లో శ్రీకృష్ణుడు ఇలా చెబుతున్నాడు :

భూమిరాపోఽ నలో వాయుః ఖం మనో బుద్ధిరేవ చ
అహంకార ఇతీయం మే భిన్నా ప్రకృతిరష్టధా

"భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము, మనస్సు, బుద్ధి, అహంకారము– ఈ ఎనిమిదియు కలిసి భిన్నమైన నా భౌతిక శక్తి(అపరా ప్రకృతి) యొక్క రూపములు." ఇవన్నీ శ్రీకృష్ణుని శక్తులు మరియు శ్రీకృష్ణుడు వాటికి మూలాధార మైనప్పుడు అవన్నీ మిథ్య ఎలా అగును? ఎన్నటికి కాలేవు. ఆ లోహం శ్రీకృష్ణునితో సంబంధము లేనిదని వైష్ణవుడెన్నడు చెప్పడు. ఇది అతని శక్తులలో ఒకటి, ఈ భౌతిక ప్రపంచం సూర్యుని సృష్టి. మనము సూర్యరశ్మిని అవాస్తవమని, సూర్యుడు సత్యం అని చెప్పలేము. సూర్యుడు సత్యమైనచో, సూర్యరశ్మి కూడ సత్యమే. అదేవిధంగా, మేము ఈ భౌతిక జగత్తు మిథ్యయని చెప్పము. ఇది అశాశ్వతము కావచ్చును, కాని మిథ్య కాదు. అందుకే గోస్వాములు మరియు శ్రీకృష్ణుడు స్వయంగా చెబుతున్న దేమిటంటే, ప్రతిది శ్రీకృష్ణునికి చెందినది, కాబట్టి సమస్తమును అతని సేవలోనే ఉపయోగించ వలెను.

ఈ సృష్టి చింతలు లేని పరమేశ్వరుడైన భగవంతుని నుండి ఉద్భవించెను. శ్రీకృష్ణుడు ఆనందముగా తన శాశ్వత సహచరిణియైన శ్రీమతి రాధారాణి సహచర్యములో వేణుగానమును ఆస్వాదిస్తుంటాడు. భగవంతుడు చింతలను కలిగి ఉన్నచో అతడు ఏ రకమైన భగవానుడు? బ్రహ్మ మరియు ఇతర దేవతలు కూడ చింతలతో నిండి ఉంటారు. బ్రహ్మ ధ్యానంలో నిమగ్నుడై ఉంటాడు. శివుడు లోకమును లయమొందించుటకు నృత్యం చేస్తుంటాడు. కాళిదేవత తన ఖడ్గంతో దుష్టసంహారణలో నిమగ్నమై ఉంటుంది. ఈ విధముగా సమస్తము కొనసాగు తుండును. దేవతలకెన్నో కార్యములు చేయవలసి ఉండును. కాని శ్రీకృష్ణుడు ఎప్పుడు ప్రశాంతముగా ఉంటాడు. ఏ శ్రీకృష్ణుడైతే రాక్షసులను సంహరించునో అతడే వాసుదేవ శ్రీకృష్ణుడు, అతడు(మూల) శ్రీకృష్ణుడు కాదు. మూల శ్రీకృష్ణుడు ఎక్కడికి వెళ్ళడు. అతడు వృందావనం నుండి ఒక్క అడుగు కూడ బయటకు వేయడు. శ్రీకృష్ణుని ఇతర కార్యకలాపముల నన్నింటిని శ్రీకృష్ణుని రూపాలైన వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధులు నిర్వహిస్తుంటారు. శ్రీకృష్ణుడు నారాయణునిగా, సంకర్షణునిగా, విష్ణువుగా, మహావిష్ణువుగా, గర్భోదకశాయి విష్ణువుగా మరియు క్షీరోదకశాయి విష్ణువుగా విస్తరించును. భగవంతుడు ఇలా ఎన్నెన్నో రూపములుగా విస్తరించగలడు.

అద్వైతమచ్యుతమనాదిమనంతరూపమ్
ఆద్యం పురాణపురుషం నవయౌవనం చ
(బ్రహ్మ సంహిత 5.33)

అతడు ఆదిపురుషుడు. అన్నింటికి మూలాధారమైన ఆత్మ. *"గోవిందమాదిపురుషం తమహం భజామి"* – బ్రహ్మ తాను ఆదిపురుషుడను కాదని, మరియు ఆ గోవిందుడు, శ్రీకృష్ణుడే ఆదిపురుషుడని తెలుపుచున్నాడు. శ్రీకృష్ణుడికి అనేక అవతారములు కలవు *(అద్వైతమచ్యుతమనాదిమ్).* ఆది అంటూ అతడికి లేదు, కాని అతడే అన్నింటికి ఆది. అతడు ఎన్నో అవతారములుగా విస్తరించును, విష్ణుతత్త్వంలో *'భగవత్ తత్వ స్వాంశ'* అనగా స్వ అంశలు. మరియు మనము శ్రీకృష్ణుని స్వరూపాంశము లైనప్పటికినీ విభిన్నాంశలము. మనము ఆయన శక్తుల విస్తరణాంశలము. భగవద్గీత(7.5) లో శ్రీకృష్ణుని అనుసరించి :

అపరేయమితస్త్వన్యాం ప్రకృతిం విద్ధి మే పరామ్
జీవభూతాం మహాబాహో యయేదం ధార్యతే జగత్

"మహా బాహుడవైన ఓ అర్జునా! ఇవిగాక నాకు న్యూనమైన భౌతిక ప్రకృతి వనరులను ఉపయోగించుకొను జీవులందరితో కూడిన ఉన్నతమైన శక్తి మరియొకటి కలదు."

'జీవప్రకృతి', 'పరాప్రకృతి' యొక్క విస్తరణాంశలు శ్రీకృష్ణుని పరాశక్తికి సంబంధించినవి. ఏ విషయమును తీసుకున్నను శ్రీకృష్ణుడు *'స్వచ్ఛందాత్మ'* అనగా చింతలు లేనివాడు. రాక్షసులను చంపుచున్నప్పటికినీ అతడు ఆందోళనలకు గురికాడు. వేదాలలో ఇది నిర్ధారించబడినది (శ్వేతాశ్వతరోపనిషత్తు 6.8) :

న తస్య కార్యం కరణం చ విద్యతే
న తత్ సమశ్చాభ్యధికశ్చ దృశ్యతే
పరాస్య శక్తిర్వివిధైవ శ్రూయతే
స్వాభావికీ జ్ఞానబలక్రియా చ

"శ్రీకృష్ణుడికి చేయవలసిన కార్యములంటూ ఏమీ లేవు. ఎందుకనగా సమస్త కార్యములు సహజ సిద్ధంగానే అతడి శక్తుల ద్వారా నిర్వహించబడును. ఎవరు అతడికి సమానులైనవారు గాని అధికులైనవారు గాని కనిపించరు."

శ్రీకృష్ణుడు స్వయముగా దేనిని చేయనవసరము లేదు. అతడి శక్తి ఎల్లప్పుడు పని చేయుచుండును. ఒక ప్రముఖ వ్యక్తి దేనినైనను చేయదలచినచో,

అతడు తన పనులన్నింటిని చూచుకునే వ్యక్తిగత కార్యదర్శికి తెలియజేయును. ఎందుకంటే, తన కార్యదర్శికి కార్యం అప్పగించినచో కావలసిన కార్యములన్నీ నెరవేరుననే విశ్వాసమును అతడు కలిగి ఉండును. సేవకుడు అనేవాడు వ్యక్తి అనగా శక్తి. ఈ లోకంలోని సాధారణ వ్యక్తి కూడ కార్యదర్శుల రూపంలో అనేక శక్తులను కలిగి ఉన్నచో శ్రీకృష్ణుడు కలిగివున్న శక్తులను అర్థం చేసుకొనుట మనకు ఎలా సాధ్యపడును. శ్రీకృష్ణుడు జగధీశ్వరుడు అనగా సమస్త విశ్వమునకు నియంత్రకుడు. కాబట్టి అతడు ఈ విశ్వమును పోషిస్తున్నాడు. కేవలం అజ్ఞానము చేతనే మూర్ఖపు జనులు ఈ విశ్వం వెనుక ఎలాంటి మెదడు లేదంటారు. శాస్త్రముల నుండి సమాచారమును పొంది ఆ మెదడు ఎవరిదనే విషయమును మనం అర్థం చేసుకోవచ్చును. శ్రీకృష్ణుని ననుసరించి భగవద్గీత(9.10)లో :

మయాధ్యక్షేణ ప్రకృతిః సూయతే సచరాచరమ్
హేతునానేన కౌన్తేయ జగద్విపరివర్తతే

"ఓ కౌంతేయ! నా శక్తులలో ఒకటైన ఈ భౌతిక ప్రకృతి నా పర్యవేక్షణమున పనిచేయుచు స్థావర జంగమ వస్తువులను ఉత్పాదించుచున్నది. దాని నియమము ననుసరించియే ఈ వ్యక్తమగు ప్రపంచము తిరిగి తిరిగి సృజింపబడుటయు లయము నొందుటయు జరుగుచున్నది." భగవంతుడి శక్తులు ఈ భౌతికలోకంలో అన్ని సమయాలలో పని చేయుచుండుటను మనం చూడవచ్చును. ఉరుములు మెరిసి వర్షం కురుయును. వర్షం నుండి మనం ఆస్వాదించే ఆహారం ఉత్పన్నమగును. ఈ ప్రక్రియ గురించి భగవద్గీత(3.14) లో వర్ణించబడినది :

అన్నాద్ భవన్తి భూతాని పర్జన్యాదన్నసమ్భవః
యజ్ఞాద్ భవతి పర్జన్యో యజ్ఞః కర్మసముద్భవః

"జీవులన్నియు వర్షముల నుండి ఉత్పన్నమగు ఆహార ధాన్యములపై ఆధారపడి జీవించును. వర్షములు యజ్ఞాచరణము వలన కలుగును. యజ్ఞము విహిత కర్మాచరణముల వలన కలుగును." అన్నింటికి మూలము దేవాదిదేవుడు. యజ్ఞము ద్వారా మనము భగవంతుడిని, పరమపురుషుని సంతృప్తి పరచవలెను. సమాజ మంతయు వర్ణాశ్రమ ధర్మం చేత క్రమబద్ధీకరించ బడినప్పుడే యజ్ఞములను ఆచరించుట సాధ్యమగును. వర్ణాశ్రమ ధర్మములో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య మరియు శూద్రులనే నాలుగు వర్ణములు కలవు. మరియు బ్రహ్మచారి, గృహస్థ, వానప్రస్థ,

సన్న్యాసి అనే నాలుగు ఆశ్రమాలు కలవు. ఈ వర్ణములు మరియు ఆశ్రమాలు ప్రత్యేక ధర్మములను కలిగి ఉన్నాయి. మానవ సమాజము ఈ ఎనిమిది శాస్త్రీయ విభాగములుగా విభజించబడి ప్రతిఒక్కరు వాటి ననుసరించి నడుచుకున్నప్పుడు లోకములో శాంతి ఏర్పడును.

వర్ణాశ్రమాచారవతా పురుషేణ పరః పుమాన్
విష్ణురారాధ్యతే పంథా నాన్యత్ తత్తోషకారణమ్

"వర్ణ మరియు ఆశ్రమ పద్ధతిలో తెలుపబడిన విధ్యుక్త ధర్మములను చక్కగా పాటించుట ద్వారా విష్ణుభగవానుడు, దేవాదిదేవుడు ఆరాధించబడును. దేవాదిదేవుని సంతృప్తి పరచుటకు మరొక మార్గం లేదు." (విష్ణు పురాణము 3.8.9)

భగవానుడైన విష్ణువుని సంతృప్తి పరుచుటయే సమస్త కార్యకలాపములకు గల పరమ లక్ష్యం. *"న తే విదుః స్వార్థగతిం హి విష్ణుమ్."* (భాగ. 7.5.31) మూర్ఖపు జనులకు వారి పరమ గమ్యం అనేది విష్ణువుకు తృప్తి కలిగించుటలోనే గలదని తెలియదు. అందుకే ఎప్పుడైతే *'ధర్మస్య గ్లానిః'* అనగా ధర్మమునకు నష్టం వాటిల్లునప్పుడు శ్రీకృష్ణుడు లేదా అతని అవతారములు స్వయంగా వచ్చును. *"యద్ యద్ విధత్తే భగవాన్"* అని చెప్పబడినది. అతడు అవతరించినప్పుడు అతడికి ఆందోళన లుండవు. అతడు తన స్వరూపశక్తి వలన వచ్చును, అతడు ఎవరి సహాయమును తీసుకొనడు. అతడు వివిధ రకాల శక్తులను కలిగి ఉన్నాడు. మరియు ఆ శక్తులన్నీ పరిపూర్ణంగా మరియు దోషరహితముగా పని చేయు చుండును *(పరాస్య శక్తిర్వివిధైవ శ్రూయతే స్వాభావికీ జ్ఞానబలక్రియా చ).*

సర్వం ఎలా పరిపూర్ణంగా పనిచేయుచున్నదో నిరాకారవాదులకు అర్థం కాదు. ఎందుకనగా, వారు దేవాదిదేవుని అర్థం చేసుకోలేరు. కనుక *"మోహితం నాభిజానాతి మామేభ్యః పరమవ్యయమ్."* శ్రీకృష్ణుడు భగవద్గీత(7.14) లో చెబుతున్నట్లుగా :

దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా
మామేవ యే ప్రపద్యన్తే మాయామేతాం తరన్తి తే

"భౌతిక ప్రకృతికి సంబంధించిన త్రిగుణములతో కూడిన దివ్యమైన నా మాయాశక్తిని దాటుటకు శక్యము కానిది. కాని నన్ను శరణుపొందిన వారు దానిని సులభముగా దాటజాలుదురు." మానవుడు ప్రకృతి యొక్క త్రిగుణాలచే కప్పబడినందున,

దేవాదిదేవుని అర్థం చేసుకొనుట సాధ్యపడదు. ఏమైనను, భగవంతుడు స్వయంగా తన గురించి తన భక్తులకు ప్రకటించుకొనును.

శ్రీకృష్ణుడిని యథాతథముగా అర్థం చేసుకొనుటయే మన ధర్మము. అప్పుడే మన జీవితములు సఫలమగును. శ్రీకృష్ణుడిని మిడిమిడి జ్ఞానంతో అర్థం చేసుకొనుట ఇక్కడ సాధ్యపడదు. అందుకే ఇక్కడ ఈ విధంగా చెప్పబడినది : "*తాని మే శ్రద్ధధానస్య కీర్తన్యాన్యనుకీర్తయ.*" '*అనుకీర్తయ*' అను పదం మనం దేనిని కల్పించి తయారు చేయకూడదని ముందుగానే నొక్కి చెప్పబడినది. '*అను*' శబ్దానికి అనుసరించుట మనేది అర్థం. అందుకే భాగవత తత్త్వం లేదా భగవానుడు కేవలం గురుశిష్య పరంపర ద్వారానే అర్థమగును.

ఏవం పరమ్పరాప్రాప్తమిమం రాజర్షయో విదుః
స కాలనేహ మహతా యోగో నష్టః పరన్తప

"ఈ ఉత్తమమైన యోగశాస్త్ర మీ విధముగా గురుశిష్య పరంపరాక్రమమున గ్రహింపబడినది. రాజర్షులు దీని నా విధముగా తెలిసికొనిరి. కాని కాలక్రమమున ఆ పరంపర భగ్నమైనది. అందుచే ఆ శాస్త్రము నష్టమైనట్లు కనిపించు చున్నది." (భ.గీ. 4.2)

పూర్వం రాజులు గొప్ప సాధుపురుషులు. వారు మధుపాన మత్తులై విలాస నృత్యాలు చేసే సాధారణ వ్యక్తులు కాదు. పరీక్షిత్తు మహారాజు కాలం వరకు గల వారందరు ఋషులు. వారు ఏ విధముగా శిక్షణ పొందారంటే వారు సాధారణ మానవులుగా గాక 'నరదేవత'లుగా పేర్కొనబడినారు. 'నరదేవ' అనగా నరుల రూపంలో గల భగవంతుడిని సూచిస్తుంది. అతడు 'రాజర్షి' అనగా రాజు మరియు ఋషి కాబట్టి అతడు పూజింపబడేవాడు. రాజుకు జీవిత లక్ష్యం తెలిసినచో, అతడు చక్కగా పరిపాలించునని శ్రీకృష్ణుడు చెబుతున్నాడు. లక్ష్యం తెలియకుండ కేవలం అతడు ఆహార నిద్రా భయ మైథునాదులనే సర్వమని భావించినచో అతడి పరిపాలనలోని ప్రజలు కూడ పశువులవలే జీవించెదరు. ఈ రోజులలో మానవ జీవిత లక్ష్యమేమిటో తెలియదు. ఈ యుగంలో మూర్ఖపు జనులు ఆనందము కొరకు ఎంతగా ప్రయత్నిస్తున్నను వారి ఆశలు ఎన్నడు నెరవేరవు. "*న తే విదుః స్వార్థగతిం హి విష్ణుం దురాశయాః.*" ఈ భౌతిక లోకంలోని జనులు భౌతిక విషయాలతో ఆనందముగా జీవించాలనీ ప్రయత్నిస్తున్నారు, కాని వారి ప్రణాళిక లెన్నడు నెరవేరవు. ప్రపంచ చరిత్రను చూచినచో, పూర్వం ఎందరో నాయకులు

కఠోర పరిశ్రమను చేస్తూ మృత్యువు నొందారు. వారు ఎంత కఠినంగా పరిశ్రమించి నను వారి ప్రణాళికలను వారు నేరవేర్చుకో లేకపోయారు. నెపోలియన్, హిట్లర్, గాంధి మరియు నెహ్రూలాంటి వారెందరో కూడ చివరికి ఓడిపోయారు. ఇది 'దురాశయే'. జీవితపు పరమ లక్ష్యం విష్ణువైనప్పటికినీ, జనులు గ్రుడ్డిగా తమ ఇంద్రియాలను సంతృప్తి పరచుట కోసమే ప్రయత్నిస్తున్నారు. ఒక గ్రుడ్డివాడు మరొకడికి మార్గదర్శనం చేసినచో ఫలితమేమగును? నాయకులు మరియు ప్రజలు అంధులైనచో, వారందరు గోతిలో పడుదురు. ఎందుకనగా, వారు వారి ప్రవృత్తికి బద్ధులు కాబట్టి.

'శ్రవణము' మరియు 'కీర్తనము' భక్తియుక్త సేవకు ఆరంభములు. అందుకే ఇలా చెప్పబడినది. *"తాని మే శ్రద్ధధానస్య కీర్తన్యాన్యనుకీర్తయ."* *'అనుకీర్తయ'* అను పదమునకు అర్థం పరంపర పద్ధతిని అనుసరించుట. మొట్టమొదట మనము ప్రామాణికుల నుండి సమాచారమును పొందిన తరువాత సత్యం గురించి మాట్లాడ వలెను. పరమ సత్యమును భగవానుడు అతని లీలలు, అతని కృప మరియు జీవరాసుల పట్ల అతని దయ వంటివాటిని వర్ణించుటమెలాగో ముందుగా మనం నేర్చుకోవాలి. విద్యను మరియు జ్ఞానోదయమును కలిగించుట కొరకు భగవంతుడు మనకంటె ఎన్నోరెట్లు ఎక్కువ ఆసక్తితో ఉన్నాడు. కాబట్టి అతడు తన సాహిత్యమును, అతని భక్తులను మరియు పరంపర పద్ధతిని మనకు అందించును. కాని వాటి నుండి ప్రయోజనములను ఎలా పొందాలనే విషయం మనపై ఆధారపడి ఉంటుంది. సమాజానికి పరమసత్యమును గురించిన సరియైన సమాచారమును అందించటానికి కృష్ణచైతన్య ఉద్యమం ఉద్దేశించ బడినది. మేము ఏదో సృష్టించిన లేదా బూటకపు సిద్ధాంతమును అందించుట లేదు. ఏదో నూతన సిద్ధాంతమును తయారుచేస్తూ సమయమును మనమెందుకు వృథా చేసుకోవలెను. పరమ ప్రామాణికులు తెలిపినది అభ్యసించుట కొరకై ఎంతో గలదు. మనము చేయవలసినదల్లా ఈ వైదిక సాహిత్యమును అంగీకరించి, దానిని అభ్యసించుటకు ప్రయత్నిస్తూ ఇతరులకు ప్రచారము చేయవలెను. అది శ్రీ చైతన్య మహాప్రభువు ఉద్దేశ్యం (శ్రీ చైతన్య చరితామృతము, ఆదిలీల 9.41) :

భారత – భూమితే హోయిలో మానుష్య – జన్మ యార్
జన్మ సార్థక కరి కరో పరోపకార్

ప్రత్యేకించి భరత వర్షములో, భారతభూమిలో జన్మించిన ప్రతిఒక్కరి కర్తవ్య

మేమిటంటే, ఈ వైదిక సాహిత్యముల నుండి ప్రయోజనములను పొంది జన్మను సార్థకము చేసుకోవడమే. కాని దురదృష్టం కొద్ది సాంకేతిక విద్యను అభ్యసించుటకు మనం ప్రయత్నిస్తున్నాము, కాబట్టి అది మన దౌర్భాగ్యం. నిజమైన విద్య అనగా జీవిత సమస్యల నన్నింటిని పరిష్కరించు కోవడమే.

ఈ భౌతిక జీవితపు బంధముల నుండి ఉపశమనము పొందుట మెలాగో తెలిపేదే దివ్యజ్ఞానం. ఇది కేవలము భగవంతుని దివ్యలీలలను తెలుసుకొనుట ద్వారానే సాధ్యపడును.

అధ్యాయము 4

ప్రామాణిక గురువును ఆశ్రయించుట

శ్లోకము 4

సూత ఉవాచ

ద్వైపాయనసఖస్త్వేవం మైత్రేయో భగవాంస్తథా

ప్రాహేదం విదురం ప్రీత ఆన్వీక్షిక్యాం ప్రచోదితః

శ్రీ సూత గోస్వామి పలికెను : పరమశక్తిమంతుడగు మైత్రేయముని వ్యాసదేవుని మిత్రుడు. ఆధ్యాత్మికజ్ఞానమును గూర్చిన విదురుని విచారణతో ముదమంది ఉత్సాహముతో అతడు ఇట్లు పలికెను.

భాష్యము : పృచ్ఛకుడు ప్రామాణికుడు కాగా, వక్త కూడా అధికారము పొందిన వాడైనపుడు ప్రశ్నోత్తరముల కార్యక్రమము అత్యంత సంతృప్తికరముగా సాగగలదు. ఇచ్చట మైత్రేయుడు శక్తిమంతుడైన మునిగా భావింపబడినాడు; కనుకనే అతడు భగవానుడనియు వర్ణింపబడినాడు. భగవానుడు అనెడి పదము కేవలము దేవాదిదేవునకే ఉపయోగించవలసి యున్నను ఆతనితో దాదాపుగా సమాన శక్తి సంపన్నులైన వారికెవరికైనను కూడా అది వాడబడును. ఆధ్యాత్మికముగా మిగుల పురోగతి చెందియున్న కారణమున మైత్రేయుడు "భగవానుడు" అని సంబోధింప బడెను. భగవానుని సాహితీ అవతారమగు ద్వైపాయన వ్యాసదేవునకు అతడు సన్నిహిత మిత్రుడు. విదురుని ప్రశ్నలు ప్రామాణికములు, శుద్ధభక్తుని ప్రశ్నలైనందున వాటిచే మైత్రేయుడు మిగుల ముదమందెను. ఆ విధముగా మైత్రేయుడు వాటికి సమాధానమొసగ సంసిద్ధుడయ్యెను. ఒకే మానసిక స్థితికి చెందిన భక్తుల నడుమ ఆధ్యాత్మిక విషయములపై చర్చలు సంభవించినప్పుడు కలిగెడి ప్రశ్నోత్తరములు మిగుల ఫలవంతములు, ఉత్సాహకారకములై యుండును.

జ్ఞానమును పొందుటకు కావలసిన వైదికపద్ధతి ఇదియే. మానవుడు ప్రామాణికుడైన గురువును ఆశ్రయించి, వినయ విధేయతలతో అతడు వివరించే దివ్యజ్ఞానమును శ్రవణము చేయవలెను. శ్రీకృష్ణుడు భగవద్గీత(4.34)లో ఆదేశిస్తున్నట్లుగా : "*తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా*" – "కేవలం ఆధ్యాత్మిక గురువును ఆశ్రయించి సత్యమును తెలుసుకొనుటకు ప్రయత్నించవలెను. అతడిని

వినయపూర్వకంగా ప్రశ్నించవలెను, మరియు అతడికి సేవ చేయవలెను."

దివ్యజ్ఞానము అంత కష్టమైనదేమి కాదు, కాని దానిపద్ధతిని గురించి తప్పక తెలుసుకోవలెను. కొన్నిసార్లు టైపుయంత్రము లేదా అనువాదము చేసే యంత్రము పనిచేయక పోవచ్చు, కాని దానిని మరమ్మత్తు చేసేవాడి దగ్గరకు తీసుకువెళ్ళినచో, అతడు వెంటనే దానిని మరమ్మత్తు చేయును. అలా చేయుటకు ప్రక్రియ అనునది తెలిసి ఉండవలెను. నేలను త్రవ్వేవాని దగ్గరకు టైపు యంత్రమును మరమ్మత్తుకు తీసుకు వెళ్ళినచో అతడు ఏమి చేయలేడు. అతడికి నేలను ఎలా త్రవ్వాలో తెలుసును, కాని యంత్ర మరమ్మత్తు కాదు. కాబట్టి మానవుడు దివ్యజ్ఞానమును తెలుసు కోవాలంటే సరియైన వ్యక్తిని ఆశ్రయించవలెనని శాస్త్రము చెబుతున్నది. *'తత్ విజ్ఞాన'* అనే పదం ఆధ్యాత్మిక జ్ఞానమును సూచిస్తుంది, భౌతిక జ్ఞానమును కాదు. ఒక వైద్యుడు శరీరమునకు సంబంధించిన భౌతిక జ్ఞానమును కలిగి ఉండవచ్చును, కాని దానిలో గల ఆత్మను గురించిన జ్ఞానం అతడికి తెలిసి ఉండక పోవచ్చును. కేవలం అతడు ప్రకృతి చేత నియమింపబడిన శరీరమనే యంత్రం యొక్క 'యాంత్రిక' ఏర్పాట్ల గురించే అధ్యయనము చేయును. నిజానికి శరీరం అనునది ఒక యంత్రమని భగవద్గీత(18.61) లో చెప్పబడినది :

ఈశ్వరః సర్వభూతానం హృద్దేశఽర్జున తిష్ఠతి
భ్రామయన్ సర్వభూతాని యన్త్రారూఢాని మాయయా

"ఓ అర్జునా! పరమపురుషుడు అందరి హృదయము లందును ఉండి భౌతిక శక్తిచే చేయబడిన యంత్రమునందు ఆసీనులై ఉన్నట్లున్న జీవులందరి సంచారము లను నిర్దేశించుచుండును."

శరీరమనే యంత్రముతో అనుబంధము కలిగి ఉన్నవారి కొరకు ఈ యోగపద్ధతి ఆదేశించటమైనది. దేహాత్మబుద్ధి అధికంగా గలవారికి, భౌతికమైన శారీరక వ్యాయామం చేత మనస్సును నియంత్రించాలని చెప్పబడినది. కాబట్టి హఠయోగలో అనేక శారీరక శిక్షణలను అభ్యసించవలసి ఉంటుంది. కాని వీటి నిజమైన లక్ష్యం భగవంతుడైన విష్ణువును అర్థం చేసుకొనుటయే. శరీరమనే యంత్రానికి వివిధ రకాల యోగపద్ధతులు నిర్దేశింపబడినవి, కాని భక్తిపద్దతి ఈ యాంత్రిక ఏర్పాట్లకు మరియు భౌతిక అవగాహనకు అతీతమైనది. కాబట్టి ఇది *'తద్విజ్ఞానము'* అని చెప్పబడినది. అనగా భౌతిక పరిజ్ఞానమునకు అతీతమైనది. ఎవరైనను, వాస్తవంగా ఆధ్యాత్మిక జీవితమును మరియు ఆధ్యాత్మిక జ్ఞానమును

అర్థం చేసుకోవాలనుకుంటే వారు గురువును ఆశ్రయించవలెను. 'గురు' అనగా బరువు. అనగా జ్ఞానముచే బరువైనవాడు. మరి ఆ జ్ఞానం ఏమిటి? *'తద్విజ్ఞాన'* ఆ బరువు అనేదే *'బ్రహ్మనిష్ఠ'* – బ్రహ్మన్ మరియు పరబ్రహ్మన్ భగవానునితో అనుబంధమే గురువు యొక్క అర్హత. *'బ్రాహ్మణ్యుపశమాశ్రయమ్.'* దివ్యశాస్త్రాను బంధము గురువు యొక్క అర్హత. ముండకోపనిషత్తు(1. 2. 12) ననుసరించి : *"తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్"* – "దివ్యశాస్త్రమును అర్థం చేసుకొనుటకు తప్పనిసరిగా గురువును ఆశ్రయించవలెను." అదేవిధముగా శ్రీమద్భాగవతము (11. 3. 21) లో తెలుపుతున్నట్లుగా :

తస్మాత్ గురుం ప్రపద్యేత జిజ్ఞాసుః శ్రేయ ఉత్తమమ్

"ఎవరైనను, వాస్తవ ఆనందమును పొందుటలో నిజమైన ఆసక్తిని కల్గి ఉన్నచో, అతడు ఖచ్చితంగా ప్రామాణిక ఆధ్యాత్మికాచారుడిని అన్వేషించి అతడిని ఆశ్రయించి దీక్షను గ్రహించవలెను."

ఉపనిషత్తులు మనకు బోధించేదేమిటనగా గురువు అనగా వేదాల నుండి జ్ఞానమును శ్రవణము ద్వారా పొందినవాడు. *"శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్."* వేదాలను 'శృతి' అంటారు. మరియు ప్రామాణిక గురువు అనగా గురుపరంపర నుండి శ్రవణము చేయువాడు. భగవద్గీత(4. 2) లో చెప్పినట్లుగా : *"ఏవం పరంపరా ప్రాప్తమ్."* అనగా ప్రామాణిక గురువు తన స్వంత జ్ఞానమును కాని కల్పించిన జ్ఞానమును కాని ఎన్నడు అందివ్వడు. అతడి జ్ఞానం ప్రామాణికమైనది మరియు పరంపర పద్ధతి నుండి గ్రహించబడినది. అంతేకాకుండ అతడు భగవంతుని సేవలో స్థిరంగా నెలకొనినవాడు *(బ్రహ్మనిష్ఠమ్).* ఈ రెండు అతని అర్హతలు. అతడు తప్పనిసరిగా వైదిక జ్ఞానమును గురుశిష్య పరంపర నుండి శ్రవణము చేసి యుండవలెను. మరియు భగవంతుని సేవలో నిమగ్నుడై ఉండవలెను. అతడు గొప్ప విద్యావంతుడు కానక్కర లేదు, కాని అతడు మాత్రం ప్రామాణిక ప్రతినిధుల నుండి శ్రవణము చేసి ఉండవలెను. భగవంతుడు మనకు శ్రవణం చేయుటకొరకై కావలసిన చెవులను ఇచ్చెను, మరియు శ్రవణము చేతనే మనము గొప్ప ప్రచారకులము కాగలము. అందుకు మనకు పి. హెచ్. డిలు లేదా విద్యాలయ పరీక్షలు అవసరము లేదు. మరియు మనము మన ప్రస్తుత పరిస్థితులను మార్చుకోవలసిన అవసరము లేదు.

ఈ లక్ష్యం కొరకు నాలుగు వర్ణములు మరియు నాలుగు ఆశ్రమాలు గల

వర్ణాశ్రమ ధర్మం కలదు. సమాజము ఈ ఎనిమిది విభాగములుగా విభజన కానంతవరకు, అది కేవలము పశునాగరిక పద్ధతిగా మిగిలిపోవును. కాబట్టి క్రమమైన నియమిత పద్ధతులంటూ తప్పక ఉండవలెను. ఉదాహరణకు శరీరములో తల, చేతులు, ఉదరము మరియు కాళ్ళవంటి నాలుగు విభాగములు కలవు. ఈ నాలుగు విభాగములు లేకుండ ఏ సమాజము కూడ సక్రమముగా పని చేయదు. లేనిచో అక్కడ కేవలం ఆందోళనలు మాత్రమే ఏర్పడును. *'స్థానే స్థితః'* అనగా 'వర్ణాశ్రమ ధర్మంలో నెలకొని' అని అర్థం. బ్రహ్మన్ అంటే ఏమిటో శూద్రుడు తెలుసుకోగలిగినచో, అతడు సహజముగానే బ్రాహ్మణుడగును. శ్రద్ధగా శ్రవణము చేయుటమనేది ఎంతో అవసరము.

మైత్రేయ ఋషి నుండి విదురుడు శ్రవణము చేసాడని చెప్పబడినది, మరియు మైత్రేయ ఋషి కూడ అతడి పట్ల ఎంతో సంతసించాడు. ఎవరైనను, గురువును సంతృప్తిపరచనిచో, సరియైన జ్ఞానమును పొందుట సాధ్యపడదు. అది సహజమైనది. ఎవరైనను తమ గురువును సాదరంగా ఆహ్వానించి అతడిని అనుకూల ఆసనములో ఉపస్థితుని చేసినపుడు, గురువు అతని ప్రవర్తన చేత తృప్తి చెందినప్పుడు, గురువు ఖచ్చితముగా బోధించును. అప్పుడే అది శిష్యునికి ఎంతో ఉపయోగపడును. ఆధ్యాత్మికాచార్యుని ఆశ్రయించి, అతని నుండి ఆదేశాలను పొందినప్పటికినీ వాటిని ఆచరించ లేకున్నచో, అతడు కేవలం సమయమును వృథా పరుస్తున్నట్లే. అంతేకాదు, ఆధ్యాత్మికాచార్యుడిని సవాలు చేయుటకొరకు కాకుండ సేవాపూరిత భావనతో అతడిని ఆశ్రయించవలెను. *'నిపత్'* అనగా 'పతనం చెందుట' మరియు *'ప్ర'* అనగా 'ఎలాంటి నిబంధనలు లేకుండ'. కాబట్టి దివ్యజ్ఞానం *'ప్రనిపాత్'*పై ఆధారపడి ఉండును. కాబట్టి శ్రీకృష్ణుడు : *"సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ"* అని చెబుతున్నాడు – "కేవలం నన్నే శరణు వేడండి." ఎలాగైతే మనం శ్రీకృష్ణునికి శరణు పొందుదుమో అలాగే అతని ప్రతినిధియైన ఆధ్యాత్మికాచార్యుడిని కూడ శరణు పొందవలెను. గురువు శ్రీకృష్ణుని బాహ్యప్రతినిధి మరియు అంతరంగిక గురువు శ్రీకృష్ణుడే స్వయంగా పరమాత్మ రూపంలో అందరి హృదయాలలో నెలకొని ఉండును. కేవలం శ్రీకృష్ణుడు వైకుంఠంలోనో గోలోకంలోనో ఉంటాడని అర్థం కాదు. అతడు అంతటా గలడు. అతడు అణువులో కూడ నెలకొని ఉన్నాడు. *"గోలోక యేవ నివసత్యఖిలాత్మభూతః."* (బ్రహ్మ సంహిత 5.37) అదే పరమాత్మకు నిర్వచనము. నేను ఆత్మస్వరూపుడను మరియు మీరు కూడ ఆత్మస్వరూపులు. మనమందరము స్థానికంగా నెలకొని ఉన్నాము. మీరు మీ శరీరంలో, నేను నా

శరీరములో, అయినను పరమాత్మ అన్ని చోట్ల నెలకొని యున్నాడు. అదే ఆత్మ మరియు పరమాత్మలకు మధ్య గల భేదము. ఎవరైనను వారి మధ్య భేదము లేదనినచో వారు పొరపడుతున్నట్లు అర్థం. వారు జ్ఞానమయులు మరియు చేతనను కలిగినట్టివారు కనుక ఒకవిధంగా వారిద్దరు ఒక్కటే*(నిత్యో నిత్యానాం చేతనాశ్చేత నానామ్).* అయినను వారి పరిమాణములో భేదము కలదు. భగవద్గీత (13.3)లో శ్రీకృష్ణుడు చెబుతున్నట్లు :

క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి సర్వక్షేత్రేసు భారత

"ఓ భరత వంశజుడా! నేను సమస్త శరీరముల గురించిన జ్ఞానం గలవాడినని నీవు తెలుసుకోవలెను." క్షేత్రజ్ఞుడు క్షేత్రం(శరీరం) యొక్క యజమాని. నిజానికి జీవాత్మ తన శరీరం యొక్క యజమాని కాదు కేవలం దానిని ఆక్రమించినవాడు. అద్దె గృహములో అద్దెకున్నవారు మరియు యజమాని నివసించును. అద్దెకున్నవారు గృహమును ఆశ్రయించి నున్నప్పటికినీ నిజమైన అధిపతి యజమాని. అదేవిధంగా ఆత్మ అనునది కేవలం శరీరమును ఆశ్రయించి నటువంటిది. యజమాని పరమాత్మ. ఇంటి యజమాని అద్దెకున్నవారిని గృహమును విడిచివెళ్ళాలని చెప్పినప్పుడు, వారు అలా తప్పక చేయవలసిందే. పరమాత్మ మనతో శరీరమును విడువమని చెప్పినప్పుడు, మనము అలా చేయవలసిందే.

ఈ వైదిక జ్ఞానమును పొందుట కొరకు ప్రామాణికాచార్యుడిని మనము తప్పక ఆశ్రయించవలెను. శాస్త్రాలన్నింటిలోను గురువు అర్హతలను గురించి వివరించబడెను. శ్రీమద్భాగవతము(11.3.21)లో ఇలా చెప్పబడినది :

తస్మాత్ గురుం ప్రపద్యేత జిజ్ఞాసుః శ్రేయ ఉత్తమమ్

జీవిత పరమ లక్ష్యమును తెలుసుకొనుటలో ఆసక్తి లేనివారు గురువును ఆశ్రయించ రాదు. శారీరక సుఖముల పట్ల ఆసక్తి కలిగిన సాధారణ వ్యక్తికి గురువు అవసరము లేదు. కాని దురదృష్టవశాత్తు ప్రస్తుత కాలంలో, గురువు అనే పదం ఎవరైతే శారీరమునకు ఔషధమును ఇచ్చెదరో వారిని గూర్చి సంబోధించడమైనది. జనులు ఒక మహాత్ముడిని సమీపించి, "నేను ఈ రోగముతో బాధపడుతున్నాను. దయచేసి నాకు సహాయం చేయండి" అని అడిగినప్పుడు, దానికి ఆ మహాత్మాజీ "సరే! నా దగ్గర ఒక మంత్రం కలదు అది మీ రోగమును నయం చేస్తుంది. మీరు ఫలితమును పొందగలరు, కొద్దిగా నాకు డబ్బు ఇచ్చి దానిని తీసుకొనండి" అని చెబుతాడు.

అంటే అతడు నిజమైన గురువుకాదని అర్థం. మనం గురువును ఆశ్రయించి తత్త్వం గురించి అనగా పరమసత్యం గురించి తెలుసుకోవలెను. మన భౌతికమైన శారీరక వ్యాధులను నయం చేసుకొనుట కొరకై గురువును ఆశ్రయించరాదు. దానికొరకు వైద్యుడిని సంప్రదించవలెను. అదేవిధముగా, ఎవరైనను తనను వ్యాపారములో లాభాలను గడించేలా చేయగలిగితే అతడు గురువు అని జనులు భావిస్తారు. కాని శాస్త్రము దీనిని అంగీకరించదు. గురువు అనగా వేదాలు మరియు వేదాంత నిర్ణయమును ఎరిగినవాడు. భగవంతుడైన శ్రీకృష్ణుడిని అర్థం చేసుకొనుటయే వేదాంత నిర్ణయము. *"వేదేశ్చ సర్వేరహమేవ వేద్యః"* – "సమస్త వేదముల నుండి నన్నే తెలుసుకోవలసినది." (భ.గీ. 15.15)

శ్రీకృష్ణుడిని సంపూర్ణంగా అర్థం చేసుకోలేము. అది అసాధ్యం. అనంతుడైన వాడిని అర్థం చేసుకునే సామర్థ్యము మన దగ్గర లేదు. *'అద్వైతమచ్యుత మనాది మనంతరూపమ్.'* (బ్రహ్మ సంహిత 5.33) మన పరిమితమైన జ్ఞానం ద్వారా అపరిమితమైన దానిని అర్థం చేసుకోలేము; నిజానికి శ్రీకృష్ణుడు కూడ తనను గురించి అర్థం చేసుకోలేడు. అతని ఆకర్షణ అనంతము, ఎందుకు తాను అంత ఆకర్షణీయంగా ఉన్నాడను దానిని అర్థం చేసుకొనుటకు అతడు శ్రీ చైతన్య మహాప్రభువుగా అవతరించి రాధారాణి పారవశ్య మహాభావములను పొందెను *(రాధాభావద్యుతి).* స్వయంగా శ్రీకృష్ణుడే తన ఆకర్షణ మరియు ఆనందమును గురించి తెలుసుకోలేనట్లయితే, మన పరిమిత జ్ఞానంతో తెలుసు కొనుటమనేది ఖచ్చితంగా సాధ్యపడదు. శ్రీకృష్ణుడిని కొద్దిగానైనా అర్థం చేసుకున్నచో మన జీవితం పరిపూర్ణమౌతుంది. అందుకే శ్రీకృష్ణుడు చెబుతున్నాడు : *"జన్మ కర్మ చ మే దివ్యమేవం యో వేత్తి తత్త్వతః."* శ్రీకృష్ణుడిని తప్పుగా అర్థం చేసుకొని మరియు అతడిని మనలాంటి సాధారణ మానవుడిగా భావించినచో మనము మూర్ఖుల మగుదుము. శ్రీకృష్ణుడి శరీరం మన వలెనే భౌతిక మూలకాలతో కూడుకున్నది కాదు. మరియు అలా భావించినచో మనం పొరబడినట్లే అర్థం. భౌతిక ప్రకృతి శ్రీకృష్ణుడికి చెందినది, అంతేకాకుండ అతడు దానికి నియంత్రకుడు. కాని మనం భౌతిక ప్రకృతికి లోబడి ఉన్నాము. మరియు అతడికి మనకు మధ్య గల భేదమిదియే.

భౌతిక ప్రకృతి శ్రీకృష్ణుడి ఆధీనములో పని చేయుచున్నదని నిజమైన జ్ఞానం గలిగిన వ్యక్తి తెలుసుకోగలడు. ఇదంతయు ఎలా నడుస్తుందో అర్థం చేసుకొనుట సాధ్యం కాదు. కాని దీనిని సంక్షిప్తంగా అర్థం చేసుకోవచ్చును. *"జన్మాద్యస్య యతోऽన్వయాదితరతశ్చ"* – పరమ సత్యమైన శ్రీకృష్ణుడి నుండి సర్వం ఉద్భవిస్తున్నదను

ఈ జ్ఞానం తెలిసినను సరిపోతుంది. తరువాత మనం ఎలా భౌతిక ప్రకృతి శ్రీకృష్ణుని నిర్దేశకత్వములో పనిచేయుచున్నదో అర్థం చేసుకొంటూ ఈ జ్ఞానమును పెంచు కోవలెను. ఆధునిక శాస్త్రజ్ఞులు భౌతిక ప్రకృతి స్వతంత్రముగా పని చేయుచున్నదని మరియు రసాయన ప్రక్రియ ద్వారా మాత్రమే భౌతికసృష్టి పరిణామము చెందునని పొరపాటుగా భావిస్తుంటారు. ఏమైనను జీవం అనేది కేవలం జీవం నుండి మాత్రమే వచ్చును. ఏదో రసాయనిక పరిణామము వలన రాదు. భగవద్గీత(10.8)లో శ్రీకృష్ణుడు చెబుతున్నట్లుగా : *"అహం సర్వస్య ప్రభవో మత్తః సర్వం ప్రవర్తతే"* – "సమస్త ఆధ్యాత్మిక మరియు భౌతిక లోకాలకు నేనే మూలాధారమును. సర్వం నా నుండియే ఉద్భవిస్తున్నది." వేదాంత సూత్రములో కూడ ఈ విధంగానే నిర్ణయించ బడినది. అక్కడ *"జన్మాద్యస్యయతః"* – "ఎవరి నుండి సమస్తము ఉద్భవించు చున్నదో అదే బ్రహ్మన్." సమస్తము అనగా జీవాత్మలు మరియు అపర ప్రకృతి. జడ పదార్థము మరియు జీవులు రెండు శ్రీకృష్ణుడి నుండి వచ్చుచున్నవి. నిజానికి ప్రపంచమంతయు భౌతిక మరియు ఆధ్యాత్మిక, ప్రకృతి మరియు జీవాత్మల కలయిక.

భౌతిక ప్రకృతి శక్తి న్యూనమైనది. మరియు ఆధ్యాత్మిక శక్తి ఉన్నతమైనది. ఎందుకు? పరాశక్తి*(జీవభూత)*, జీవాత్మ భౌతిక ప్రకృతిని నియంత్రిస్తున్నది. వాస్తవానికి అతడు నియంత్రించుట లేదు, కాని దానిని ఉపయోగించు కొనుటకు ప్రయత్నిస్తున్నాడు. ఉదాహరణకు, ఆధునిక మానవులు మరియు జడమైన, అచేతనమైన భౌతిక పదార్థములను ఉపయోగించి ఆధునిక నాగరికతను సృష్టించిరి. ఇది మన ఆధిక్యత. ఏది ఏమైనను, మనం కూడ ప్రకృతి అలాగే *'పరాప్రకృతి'.* ఈ విధముగా మనం తత్త్వవిజ్ఞానమును అర్థం చేసుకోవలెను.

వేదాంత సూత్రముల భాష్యం శ్రీమద్భాగవతము. పరతత్త్వమే సమస్తమునకు మూలాధారమని వేదాంత సూత్రములు వివరించుచున్నవి. శ్రీమద్భాగవతము (1.1.1) లో మూలాధార స్వభావమును గురించి వివరించ బడినది : *"జన్మాద్యస్య యతోఽన్వయాదితరతశ్చార్థేష్వభిజ్ఞః స్వరాట్."* ఆ మూలాధారం *'అభిజ్ఞ'* చైతన్యం. భౌతిక చైతన్యం లేనిది. కాబట్టి జీవం అనునది జడపదార్థము నుండి ఉద్భవించు ననెడి ఆధునిక సిద్ధాంతము సరియైనది కాదు. ఎవరి నుండి అయితే సర్వం ఉద్భవించునో ఆ జ్ఞానము 'అభిజ్ఞము'. చైతన్యం అనగా అర్థం చేసుకోగలడు. భాగవతము(1.1.1) కూడ ఇట్లు చెప్పుచున్నది : *"తేనే బ్రహ్మ హృదాయ ఆది కవయే"* – శ్రీకృష్ణుడు బ్రహ్మకు వైదిక జ్ఞానమును బోధించెను. పరమ మూలాధార మనేది చైతన్య స్వరూపుడు కానిచో, అతడు ఎలా జ్ఞానమును అందజేయగలడు?

భాగవతమును వేదవ్యాసుల వారు సంగ్రహించారు. అలాగే అతడు వేదాంత సూత్రములను కూడ సంగ్రహించారు. సాధారణంగా శంకరాచార్యుల వారు వేదాంత సూత్రముపై చేసిన శారీరక భాష్యమునకు మాత్రమే మాయావాదులు ప్రాముఖ్యతను ఇస్తుంటారు, కాని అది వేదాంత సూత్రం పై చేయబడిన నిజమైన భాష్యం కాదు. నిజమైన భాష్యమును శ్రీమద్భాగవత రూపంలో రచయితయైన వ్యాసుడు స్వయంగా అందజేసెను. వేదాంత సూత్రమునకు నిజమైన అర్థమును అర్థం చేసుకొనుటకు దాని రచయిత చేత స్వయంగా ఇవ్వబడిన భాష్యమును మనం అధ్యయనము చేయవలెను. భగవద్గీత (13.5) లో శ్రీకృష్ణుడు స్వయంగా ఇట్లు చెబుతున్నాడు :

ఋషిభిర్బహుధా గీతం ఛన్దోభిర్వివిధైః పృథక్
బ్రహ్మసూత్రపదైశ్చైవ హేతుమద్భిర్వినిశ్చితైః

"క్షేత్రము యొక్కయు క్షేత్రజ్ఞుని యొక్కయు ఆ జ్ఞానము పలువురు ఋషులచే వివిధ వేదగ్రంథములలో వర్ణింపబడినది. అది వేదాంత సూత్రములలో కార్య కారణములకు సంబంధించిన అన్ని హేతువులతో ప్రత్యేకముగా ప్రకటించబడినది."

అందుకే ఆధ్యాత్మిక జ్ఞానమనేది యుక్తమైనది. వైదిక పద్ధతి ననుసరించి, వేదాంత సూత్రములను ముందుగానే అర్థం చేసుకొనినచో అతడు ఆచార్యుడిగా అంగీకరింపబడును. (బ్రహ్మసూత్రాలు అని కూడ అందురు.) ఆచార్యులు వీటిని అర్థం చేసుకొని ఉండవలెను. మాయావాద సంప్రదాయము మరియు వైష్ణవ సంప్రదాయము వారిరువురు వేదాంత సూత్రాలను వివరించిరి. వేదాంత సూత్రాలను అర్థం చేసుకోకుండ పరబ్రహ్మన్‌ను అర్థం చేసుకోలేము. విదురుడు దివ్యజ్ఞానమును మైత్రేయ ఋషి నుండి తెలుసుకొనెనని చెప్పబడినది. మైత్రేయుడు వ్యాసదేవుని స్నేహితుడు, అనగా వ్యాసదేవునికి తెలిసినదే మైత్రేయుడికి మరియు విదురునికి కూడ తెలుసును. వ్యాసదేవుడి పరంపరలోని ఆధ్యాత్మికాచార్యుని మనం సమీపించ వలెను. నిజానికి వ్యాసదేవుని అనుచరులమని చెప్పువారందరు అతడిని అనుసరించవలెను. వ్యాసదేవుడు శ్రీకృష్ణుడిని దేవాదిదేవుడని అంగీకరించెను, మరియు అర్జునుడు కూడ శ్రీకృష్ణుడిని పరంబ్రహ్మగా, పరమ పురుషునిగా అంగీకరించెను. అర్జునుడు శ్రీకృష్ణుడి స్నేహితుడు కాబట్టి అతడు ఈ విధముగా అంగీకరించెనని ఎవరైన అనవచ్చును, కాని ఇది వాస్తవం కాదు. వ్యాసదేవుడు కూడ శ్రీకృష్ణుడిని అంగీకరించెనని అర్జునుడు నిరూపించెను.

పరం బ్రహ్మ పరం ధామ పవిత్రం పరమం భవాన్
పురుషం శాశ్వతం దివ్యమాదిదేవమజం విభుమ్

ఆహుస్త్వామృషయః సర్వే దేవర్షిర్నారదస్తథా
అసితో దేవలో వ్యాసః స్వయం చైవ బ్రవీషి మే

"అర్జునుడు పలికెను : నీవు దేవాదిదేవుడవు, పరంధాముడవు, పరమ పవిత్రుడవు, సత్యస్వరూపుడవు, శాశ్వతుడవు, దివ్యుడవు, ఆదిపురుషుడవు, అజుడవు, విభుడవు. నారదుడు, అసితుడు, దేవలుడు, వ్యాసుడు మొదలగు మహర్షులందరును నీకు సంబంధించిన ఈ సత్యమును సమర్థించి యున్నారు. ఇప్పుడు నీవు కూడ అట్లే ప్రకటిస్తున్నావు." (భ.గీ. 10.12,13)

వ్యాసదేవుడు శ్రీకృష్ణుడిని పరబ్రహ్మముగా అంగీకరించెను. మరియు వ్యాసదేవుడు వేదాంతసూత్ర భాష్య ప్రారంభంలో : *"ఓం నమో భగవతే వాసుదేవాయ"* అనే శబ్దములతో ప్రారంభించెను. మనకు వీటిని అర్థం చేసుకోవాలనే నిజమైన ఆసక్తి ఉన్నట్లయితే, వ్యాసదేవుని ప్రతినిధియైన మైత్రేయుని వంటి వారిని ఆశ్రయించవలెను. పరమ భగవానుడు శ్రీకృష్ణుడైనను ఇక్కడ మైత్రేయుని కూడ *'భగవాన్'* అని సంబోధించటమైనది *(కృష్ణస్తు భగవాన్ స్వయమ్).* కాని *'భగవాన్'* అనే పదం శక్తివంతులైన బ్రహ్మ, శివుడు, వ్యాసదేవుడు లేదా మైత్రేయుడు లాంటి వారికి కూడ ఉపయోగిస్తారు. నిజమైన భగవంతుడు శ్రీకృష్ణుడైనప్పటికినీ, ఈ గొప్పవ్యక్తులు శ్రీకృష్ణుని గూర్చిన జ్ఞానమును ఎంత సంపాదించగలరో అంతగా సంపాదించిరి. శ్రీకృష్ణుని గురించిన సంపూర్ణ జ్ఞానమును వందశాతం పొందుట సాధ్యం కాదు. నారాయణుడికే ఇది సాధ్యం కాదు. ఏమైనను, శ్రీకృష్ణుని ఆదేశాలను పరిపూర్ణంగా పాటించేవారు కూడ కొన్నిసార్లు భగవానుడని సంభోదించ బడతారు. ఎందరో బూటకపు భగవంతులు కలరు. కాని నిజమైన భగవాన్ ఎవరనగా, శ్రీకృష్ణుడు బోధించిన దానిని తెలుసుకొనిన వారు. విదురుడు దివ్యజ్ఞానమును పొందుటకు ఎంతో ఉత్సాహమును కలిగి ఉండెను. కాబట్టి మైత్రేయ ఋషి అతడి పట్ల సంతృప్తి నొందెను. ఎవరైనను ఆధ్యాత్మికాచార్యునకు శరణాగతి చేసుకొని అతడిని సేవిస్తూ : "అయ్యా, నేను అత్యంత నమ్రతను కలిగిన సేవకుడిని దయచేసి నన్ను అంగీకరించి నాకు శిక్షణను ఇవ్వవలసినది" అని చెప్పినప్పుడు గురువు సంతుష్టుడగును. అర్జునుడు శ్రీకృష్ణుడి ప్రాణ స్నేహితుడైనను, శ్రీమద్భగవద్గీతను పొందుటకు పూర్వం : *"శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్"* – "ఇప్పుడు

నేను మీకు ఆత్మసమర్పణను చేసుకొనిన శిష్యుడను దయచేసి నన్ను ఆదేశించండి" అని పలికెను (భ.గీ. 2.7).

జ్ఞానమును పొందుటకు ఇదే సరియైన పద్ధతి. సవాల్ చేయుట కొరకు ఎవరూ ఆధ్యాత్మికాచార్యుడిని ఆశ్రయించరాదు. ఆధ్యాత్మిక శాస్త్రమును అర్థం చేసుకొనుటకు జిజ్ఞాసను కలిగి ఉండవలెను. తమకుతాము గురువు కంటే అధికులమని ఎవరూ భావించరాదు. మానవుడు శరణాగతిని చేసుకొనుట కొరకు గురువును తప్పక అన్వేషించవలెను. ఒకవేళ ఇది సాధ్యం కానిచో అతడు సమయమును వృథా చేసుకోరాదు. ప్రామాణిక వ్యక్తి ఆశ్రయమును పొందుట వలన ఎవరైనను దివ్యజ్ఞానమును స్వల్ప కాలములోనే అర్థం చేసుకోగలరు.

అధ్యాయము 5

కపిల భగవానుడు తన తల్లియైన దేవహూతి బాధ్యతలను స్వీకరించుట

శ్లోకము 5

మైత్రేయ ఉవాచ
పితరి ప్రస్థితేఽరణ్యం మాతుః ప్రియచికీర్షయా
తస్మిన్ బిన్దుసరేఽవాత్సీద్భగవాన్ కపిలః కిల

మైత్రేయుడు పలికెను : కర్దముడు అడవి కేగిన పిమ్మట కపిల భగవానుడు తన జననియగు దేవహూతి ప్రీత్యర్థమై బిందుసరోవర తటమునందు వసించెను.

భాష్యము : తండ్రి అభావమునందు తల్లి బాధ్యతను స్వీకరించి, భర్తవియోగమును ఆమె అనుభవింపకుండునట్లు తన శాయశక్తుల సేవించుట యుక్తవయస్కుడగు తనయుని బాధ్యత. అదేవిధముగా తల్లిబాధ్యతను, కుటుంబ వ్యవహారములను చూడగలిగే ఎదిగిన పుత్రుడు ఉన్నప్పుడు శీఘ్రమే గృహమును వీడుట భర్త యొక్క ధర్మము. వైదిక విధానపు గృహస్థ జీవనమదియే. మరణ సమయము వరకు గృహకలాపములందే ఎవ్వరును చిక్కుబడక వాటిని విడిచి వెళ్ళవలెను. అప్పుడు యుక్తవయస్కుడగు పుత్రుడు ఇంటి వ్యవహారములను, తల్లిబాధ్యతను స్వీకరించును.

గొప్ప యోగి అయినట్టి కర్దమమునికి కుటుంబ జీవనము పట్ల అంతగా ఆసక్తి లేకుండెను. అయినను అతడు వివాహం చేసుకోవాలని నిశ్చయించుకొనెను. మరియు స్వయంభువ మను తన కుమార్తె దేవహూతిని అతనికి పత్నిగా సేవ చేయటానికి తీసుకువచ్చెను. కర్దమముని ఒక యోగి మరియు పర్ణశాలలో నివసించెడి వాడు, మరియు దేవహూతి ఒక రాకుమారి, సపర్యలను చేయుటమనేది అలవాటు లేని కారణంగా, ఆమె ఎంతో చిక్కిపోయినది. కర్దమమునికి ఆమెపై జాలి కలిగి, ఈ యువతి నా దగ్గరకు వచ్చెను, కాని ప్రస్తుతం ఆమె అసౌకర్య స్థితిలో కలదని భావించి అనేక సేవకులతో, తోటలతో మరియు ఇతర ఐశ్వర్యాలతో నిండిన పెద్ద భవంతిని కర్దమముని తన యోగ శక్తితో సృష్టించెను. అంతేకాకుండ, అతడు గాలిలో ఎగిరే చిన్న పట్టణము లాంటి 'ఆకాశనౌక'ను కూడ సృష్టించెను. ఆధునిక విమాన సంస్థలు 747 వంటి పెద్ద విమానాలను తయారు చేసినను,

కర్దమముని తన యోగశక్తిచే సరస్సులు, భవంతులు మరియు తోటలు గల ఆకాశనౌకను సృష్టించెను. ఈ ఆకాశనౌక సృష్టి అంతటా ప్రయాణం చేయగలిగినటు వంటిది. ఆధునిక శాస్త్రజ్ఞులు చంద్రుడి దగ్గరకు వెళ్ళే చిన్న రోదసినౌకలను తయారు చేయుటకు ఎంతో శ్రమిస్తున్నారు. కాని కర్దమముని అన్ని గ్రహాలకు ప్రయాణము చేయగల ఒక పెద్ద ఆకాశనౌకను సృష్టించగలిగెను. ఇది యోగశక్తి ద్వారానే సంభవమగును.

వివిధ రకాల సిద్ధులు లేదా యోగపరిపూర్ణతలు కలవు. అవి 'అణిమా', 'లఘిమా', 'ప్రాప్తి' మొదలగునవి. మరియు యోగులు కావాలను కొనినవారు దానిని చేయగలరు. అదే నిజమైన యోగపద్ధతి. కేవలం తన ముక్కును పట్టుకొని కొన్ని వ్యాయామాలు చేయుట ద్వారా ఎవరూ యోగి కాలేడు. అతడు యోగసిద్ధులను సాధించవలెను. ఈ సిద్ధుల ద్వారా యోగి తాను అత్యంత చిన్నగా లేదా అత్యంత పెద్దగా, అత్యంత తేలికగా లేదా అత్యంత బరువుగా మారగలడు. అతడు కావాలనుకున్న దానిని వెంటనే చేతిలో ఉత్పత్తి చేయగలడు. అంతేకాకుండ అతడు తను కోరిన చోటికి ప్రయాణించగలడు. కర్దమముని అలాంటి పరిపూర్ణతను సాధించిన సిద్ధయోగి. తన పత్ని దేవహూతి ద్వారా అతడు తొమ్మిదిమంది ఆడపిల్లలు కలిగి వారిని దక్షమహారాజు వంటి ప్రజాపతికి మరియు ఇతరులకు ఇచ్చి వివాహము చేసెను. కర్దమముని కుమారుడు కపిలదేవుడు అతడే శ్రీకృష్ణుని అవతారము. అతడు మహాజనులలో ఒకడు. 'మహాజన' అనే పదానికి అర్థం 'ప్రామాణికత్వం'. మరియు వైదికశాస్త్రాల ననుసరించి పన్నెండుమంది మహాజనులు కలరు. వారు స్వయంభువుడు, నారద, శంభు, కుమార, కపిల, మను, ప్రహ్లాద, జనక, భీష్మ, బలీ, శుకదేవ గోస్వామి మరియు యమరాజు. స్వయంభువు అనగా బ్రహ్మదేవుడు, మరియు శంభు అనగా శివుడు. దేవాదిదేవుని తెలుసుకొనుటకు మరియు ఆధ్యాత్మిక జీవిత లక్ష్యమును తెలుసుకొనుటకు ఈ మహాజనులను అనుసరించవలెను. *"మహాజనో యేన గతః స పంథాః."* ఈ మహాజనులు భగవద్గీతలో శ్రీకృష్ణుడు తెలిపిన ధర్మసూత్రాలను అనుసరిస్తారు.

ధర్మసూత్రాల యొక్క వాస్తవసత్యాలను సులభముగా అర్థం చేసుకోలేము, కాని ఈ మహాజనులను మనం అనుసరించినచో శ్రీకృష్ణుని అర్థం చేసుకోగలము. కపిలముని భక్తియుక్త సేవ యొక్క గొప్పతనాన్ని తన తల్లియైన దేవహూతికి వివరించెను. కాబట్టి మనము అతడిని అనుసరించినచో, భక్తి యుక్త సేవను గురించిన సత్యములను తెలుసుకోగలము. వర్ణాశ్రమ ధర్మపద్ధతిని అనుసరించి,

యాభై సంవత్సరాలు దాటినవారు తప్పనిసరిగా గృహమును విడిచి అడవులకు వెళ్ళి ఆత్మసాక్షాత్కారము కొరకు తమ జీవితమును పూర్తిగా అంకితము చేసుకోవలెను. ఇది నిజమైన వర్ణాశ్రమ ధర్మపద్ధతి. ఇది హిందూధర్మ పద్ధతి కాదు. హిందు అనే పదం మహ్మదీయుల ద్వారా ఇవ్వబడినది మరియు ఈ పదం వైదిక సాహిత్యములో మనకు కనిపించదు. ఏమైనను వర్ణాశ్రమ ధర్మం గురించి అందులో వివరించ బడినది. నాగరిక మానవులు ఖచ్చితముగా వర్ణాశ్రమ పద్ధతిని పాటించవలెను. ఎవరైనను బ్రాహ్మణ కుటుంబములో జన్మించినచో అతడికి చక్కటి బ్రహ్మచారి శిక్షణ ఇవ్వబడును. తదుపరి అతడు గృహస్థ ఆశ్రమమును స్వీకరించును. అతడు గృహమును విడిచినచో వానప్రస్థుడని పిలువబడును, మరియు తర్వాత అతడు సన్న్యాసమును తీసుకోవచ్చును. యోగి అయినందున కర్దమముని ఈ నియమాలను ఖచ్చితముగా పాటించెను. కాబట్టి కపిలదేవుడు ఎదిగిన వెంటనే అతడి సంరక్షణలో దేవహూతిని విడిచి కర్దమముని వెడలిపోయెను. ఈ శ్లోకంలో చెప్పినట్లుగా : *"పితరి ప్రస్థితేऽరణ్యం మాతుః ప్రియచికీర్షయా."*

మనుసంహిత ప్రకారం స్త్రీకి స్వాతంత్ర్యము ఇవ్వరాదు. స్త్రీ భర్త సంరక్షణలో లేదా కుమారుల సంరక్షణలో ఉండవలెను. ఎందుకనగా, స్త్రీ తన స్వేచ్ఛను సక్రమంగా వినియోగించుకోలేదు. కాబట్టి వారు ఇతరులపై ఆధారపడి ఉండుట మంచిది. స్వేచ్ఛ గల స్త్రీ ఆనందంగా ఉండలేదు. అది సత్యం. పాశ్చాత్య దేశాలలో కేవలం స్వేచ్ఛ అనే పేరుతో యువతులు స్వతంత్రముగా ఉన్నారు. అయినను వారు సంతోషముగా జీవించ లేకపోవుటను మేము గమనించితిమి. వైదిక నాగరికత లేదా వర్ణాశ్రమ ధర్మం స్వేచ్ఛ అనుదానిని ప్రతిపాదించలేదు. కాబట్టి దేవహూతి బాధ్యత కపిలదేవునికి అప్పగించబడినది. కాబట్టి తన తల్లి యొక్క పూర్తి సంరక్షణ భారమును కపిలదేవుడు స్వీకరించెను. ఆడపిల్ల యుక్తవయస్సునకు వచ్చి తగిన వరుని వివాహం చేసుకునేంత వరకు, ఆ కన్య యొక్క పూర్తి సంరక్షణ బాధ్యత తండ్రిపై ఉండును. తదుపరి భర్త ఆమె సంరక్షణ భారమును తీసుకొనును. సాధారణంగా యువకుడు దాదాపు 25 సంవత్సరాలకు మునుపే, మరియు యువతీ 16 సంవత్సరాల వయస్సులోనే వివాహం చేసుకోవలెను. ఒకరికి యాభై సంవత్సరాలు నిండినప్పుడు అతడి పెద్ద కుమారుడు 25 సంవత్సరాల వాడై తల్లి సంరక్షణ బాధ్యతను వహించు స్థితిలో ఉండును. ఈ లెక్కల ననుసరించి, కపిలదేవుడు దాదాపు 25 సంవత్సరాల వయస్సు కలవాడు, తల్లియైన దేవహూతిని సంరక్షించగలడు. తల్లి బాధ్యతను తండ్రి తనకు అప్పగించినందున ఆమెను

జాగ్రత్తగా చూచుకోవలెనని, మరియు ఎల్లప్పుడు సంతృప్తిపడేలా నడుచు కోవలెనని అతడికి తెలుసును. *"మాతుః ప్రియచికీర్షయా."* కపిలదేవుడు బాధ్యతా రహితుడు కాడు. అతడు తన తల్లిని సంరక్షించుటకు ఎల్లప్పుడు సిద్ధముగా ఉండెను. కపిలుడు బ్రహ్మచారి, అతని తల్లి అతని దగ్గర శిక్షణ తీసుకొన్నది. ఇది పురుషుల విశేష అధికారము. భగవద్గీత(9.32) లో చెబుతున్నట్లుగా :

మాం హి పార్థ వ్యపాశ్రిత్య యేఽ పి స్యుః పాపయోనయః
స్త్రియో వైశ్యాస్తథా శూద్రాస్తేఽ పి యాన్తి పరాం గతిమ్

"ఓ పృథాకుమారా! నీచ కుటుంబములో పుట్టినవారైనను స్త్రీ లైనను వైశ్యులైనను శూద్రులైనను నన్నాశ్రయించినచో దివ్యమైన గమ్యమును చేరజాలుదురు." స్త్రీలు, శూద్రులతో సమాన స్థితిని కలిగినవారు. స్త్రీ ఒక బ్రాహ్మణుడిని వివాహం చేసుకొనినను ఆమెకు యజ్ఞోపవీతము ఇవ్వబడదు. స్త్రీలు, శూద్రులు మరియు ద్విజబంధు అనగా ఎవరైతే బ్రాహ్మణ కుటుంబములో జన్మించినను, బ్రాహ్మణుల వలె అర్హతలేని వారు, వీరందరికి వైదికజ్ఞానం అర్థం కానందున వ్యాసదేవుడు మహాభారతమును రచించెను. *"స్త్రీశూద్రద్విజబంధూనాం త్రయీ న శ్రుతిగోచరా."* (శ్రీమద్భాగవతము 1.4.25) కాబట్టి మహాభారతము పంచమవేదంగా పిలువ బడెను. సామ, యజుర్, ఋగ్ మరియు అథర్వణ అనే నాలుగు వేదాలు కలవు. వైదిక సాహిత్య సారాంశము మహాభారతములోని భగవద్గీతలో తెలుపబడెను. వైదిక నాగరికత ఎంతో పరిపూర్ణమైనది. స్త్రీలు పురుషుల కంటె అల్పులు, కాబట్టి స్త్రీల బాధ్యతను పురుషులకు అప్పగించటమైనది. కాబట్టి *"మాతుః ప్రియచీకిర్షయా".* కుమారుడు ఎల్లప్పుడు తల్లి ఆనందముగా ఉండునట్లు చూడగలడని చెప్పబడినది. కపిలుని తల్లి తన తండ్రి ఎడబాటుతో ఆవేదన చెందకుండ ఉండునట్లు ఆమెను అన్ని సమయాల్లోను జాగ్రత్తగా చూసుకుంటూ, ఆమెకు జ్ఞానమును ప్రసాదించుటకు సన్నద్ధముగా ఉండెను. స్త్రీలు సాధారణముగా అల్పజ్ఞానులు కాబట్టి వారికి జ్ఞానమును అందించవలెను. మరియు వారు ఆ జ్ఞానమును అనుసరించ వలెను. వారు వారి తండ్రి మరియు పతి సూచనలను, కపిలుని వంటి యుక్తవయస్సుకు వచ్చిన పండితులైన కుమారుల సూచనలను పాటించవలెను. ఈ విధముగా వారి జీవితాలు పరిపూర్ణమగును. స్త్రీలు సర్వదా ఆధారపడి ఉండవలెను.

"తస్మిన్ బిన్దుసరేఽవాత్సీద్భగవాన్ కపిలః కిల." ఇక్కడ గమనించ వలసినదే మనగా కపిలదేవుడిని *'భగవాన్'* అని సంబోధించట మైనది. అనగా అతడు

సమస్త సంపదను, శక్తిని, కీర్తిని, జ్ఞానమును, సౌందర్యమును మరియు త్యాగమును సంపూర్ణముగా కలిగి ఉన్నాడని అర్థం. శ్రీకృష్ణునిలో ఈ ఆరు ఐశ్వర్యాలు పూర్తిగా నెలకొని ఉండును. అందుకే శ్రీకృష్ణుడు దేవాదిదేవునిగా*(కృష్ణస్తు భగవాన్ స్వయమ్)* అంగీకరించబడెను. మరియు ఇతరులు అతని విస్తరణ అంశలుగా లేదా అవతారములుగా(విష్ణుతత్వాలు) అంగీకరించబడెను. భక్తిరసామృత సింధువులో శ్రీల రూప గోస్వామి భగవానుని లక్షణములను వివరించెను. మొదటినుండి భగవానుడు స్వయంగా శ్రీకృష్ణుడు, అంతేకాకుండ అతని కొన్ని ఐశ్వర్యములు బ్రహ్మదేవునిపై కూడ కురిపించబడెను. బ్రహ్మదేవుడు మన వలెనే జీవుడు – జీవతత్త్వం. ఆధ్యాత్మికముగా శక్తివంతుల మైనప్పుడు మనం కూడ బ్రహ్మపదవిని పొందవచ్చును. బ్రహ్మకంటె అధికుడు శివుడు, శివుని కంటె అధికుడు విష్ణువు లేదా నారాయణుడు మరియు సర్వాధికుడు శ్రీకృష్ణుడని వైదిక శాస్త్రాలు మరియు 'బ్రహ్మ సంహిత' విశ్లేషణ. మాయావాద నిరాకార తత్త్వజ్ఞుడైన శంకరాచార్యుల వారు కూడ శ్రీకృష్ణుడు దేవాదిదేవుడని అంగీకరించెను *(స భగవాన్ స్వయం కృష్ణః).* శ్రీ రామానుజాచార్యులు, శ్రీ మధ్వాచార్యులు, శ్రీ విష్ణుస్వామి, శ్రీ నింబార్క మరియు శ్రీ చైతన్య మహాప్రభువు ఇలా ఆచార్యులందరు శ్రీకృష్ణభగవానుని పరమ పురుషునిగా అంగీకరించిరి.

కపిలదేవుడు శ్రీకృష్ణుని అవతారము, అతడు తన తల్లి దేవహూతికి బోధించెను. మనమిప్పుడు ఇద్దరు కపిలుల మధ్య భేదమును తప్పక గమనించ వలెను. ఒక కపిలుడు భగవాన్ కపిలుడు, భగవాన్ కపిలుడు దేవహూతి కపిలునిగా పిలువబడెను. మరొకరు నాస్తిక కపిలుడు. ఇద్దరు కపిలులు కూడ సాంఖ్య శాస్త్రమును వివరించిరి, కాని నాస్తిక కపిలుడు భగవత్ సాక్షాత్కారమును గురించి బోధించని భౌతిక సాంఖ్య శాస్త్రమును తెలిపెను. భగవద్గీత జ్ఞానమును తన మిత్రుడైన అర్జునునికి వివరించినట్లుగానే, బిందు సరోవరములో కపిలదేవుడు తన తల్లియైన దేవహూతికి స్వయంగా సాంఖ్య శాస్త్రమును వివరించెను. అర్జునుని వలెనే దేవహూతి కూడ తాను తన ఆధ్యాత్మికాచార్యుని ఎదుట ఈ క్రింది శ్లోకములో వివరించినట్లుగా కలదని తెలుసును. అంతేకాకుండ, బ్రహ్మదేవుడు ఆమె కుమారుడు శక్తివంతమైన అవతారమని కూడ తెలిపి ఉండెను.

శ్లోకము 6

తమాసీనమకర్మాణం తత్త్వమార్గాగ్రదర్శనమ్
స్వసుతం దేవహూత్యాహ ధాతుః సంస్మరతీ వచః

ఆమె యెదుట కపిలభగవానుడు, దేవహూతికి పరతత్త్వపు పరమ లక్ష్యమును చూపగలిగినవాడు, సావకాశముగా ఆమె ఎదుట ఉపస్థితుడై యుండినప్పుడు, దేవహూతి బ్రహ్మ పలుకులను జ్ఞప్తికి తెచ్చుకొని ఆతడిని ఇట్లు ప్రశ్నింప నారంభించెను.

భాష్యము : పరమసత్యం యొక్క పరమ లక్ష్యం భక్తియుక్త సేవ. ముక్తి అనునది అంతిమ స్థితి కాదు. తాను శరీరం కాదని, ఆత్మ స్వరూపుడనని తెలుసుకొనుట మాత్రమే సరిపోదు. మన జ్ఞానం అసంపూర్ణము. మనము ఆత్మస్వరూపుల(బ్రహ్మన్) వలె నడుచుకోవలెను. అప్పుడు మన స్థితి స్థిరమగును.

బ్రహ్మభూతః ప్రసన్నాత్మా న శోచతి న కాంక్షతి
సమః సర్వేషు భూతేషు మద్భక్తిం లభతే పరామ్

"ఈ విధముగా ఆత్మసాక్షాత్కార స్థితిని పొందినవాడు బ్రహ్మముతో గుణైక్యము పొంది వెంటనే పరిపూర్ణానందమును అనుభవించును. అతడెప్పుడును శోకింపడు. దేనిని ఆశించడు. ప్రతిజీవి యందును అతడు సమచిత్తుడై యుండును. అట్టిస్థితిలో అతడు నా యందు విశుద్ధ భక్తియుక్త సేవను పొందును."(భ.గీ. 18.54) భక్తి అనునది బద్ధాత్మకు కాకుండ ముక్తాత్మకు లభ్యమగును. అయినచో మనకు అది ఎలా సాధ్యమగును. శ్రీకృష్ణుడు భగవద్గీత(14.26) లో ఇలా చెబుతున్నాడు :

మాం చ యోఽవ్యభిచారేణ భక్తియోగేన సేవతే
స గుణాన్ సమతీత్యైతాన్ బ్రహ్మభూయాయ కల్పతే

"అన్ని పరిస్థితులలోను నిశ్చలమైన సంపూర్ణ భక్తియుక్త సేవలో నిమగ్నుడై యుండువాడు వెంటనే భౌతిక ప్రకృతి గుణముల నతిక్రమించి బ్రహ్మస్థితికి వచ్చును."

మనము నవవిధ భక్తి మార్గముల ననుసరించి సేవ చేయవలెను. అందులో మొదటిది 'శ్రవణము' అనగా వినుట. తరువాత ఆధ్యాత్మికాచార్యుడు మరియు శాస్త్రముల నిర్దేశకత్వములో ఎవరైనను వెంటనే ముక్తజీవుడు కాగలడు. కాబట్టి భక్తియుక్త సేవలో పాల్గొనినప్పుడు ప్రత్యేకించి ముక్తి కొరకు శ్రమించ నవసరము

లేదు. శ్రీకృష్ణుని సేవలో నిమగ్నుడైనందున తాను భౌతిక కల్మషము లన్నింటి నుండి విముక్తుడనని సంపూర్ణ విశ్వాసమును కలిగి ఉండవలెను. ఇది తప్పనిసరి. "*తత్త్వమార్గ దర్శనమ్*" అని వివరించబడెను. శ్రీమద్భాగవతము(1.2.11) లో: "*బ్రహ్మేతి పరమాత్మేతి భగవానితి శబ్ద్యతే.*" పరమ సత్యం వివిధ రకాలుగా విద్యార్థి స్థితి ననుసరించి అర్థం చేసుకొనబడును. కొందరు పరమ సత్యమును నిరాకార బ్రహ్మముగా, కొందరు హృదయములో నెలకొనిన పరమాత్మ వలె మరియు ఇతరులు దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడుగా లేదా, విష్ణువుగా అర్థం చేసుకొనెదరు. బ్రహ్మన్, పరమాత్మ, భగవాన్, దేవాదిదేవుడు భిన్నములు కాదు. అవన్నియు భగవంతునికి సంబంధించిన వివిధ అంశములు. దూరం నుండి కొండను గమనించినచో అది మనకు పొగకమ్మి ఉన్న మేఘమువలె అనిపించును. కాని కొద్దిగా దగ్గరకు వెళ్ళి చూచినచో అక్కడ పచ్చదనాన్ని చూడవచ్చును. ఒకవేళ నిజంగా కొండను ఎక్కి చూచినచో, ఎన్నో గృహాలు, చెట్లు, జంతువులు ఉండుటను మనం గమనించ వచ్చును. మన దృష్టి కొండపై గలదు, కాని వివిధ రకాల దృష్టికోణముల ననుసరించి పొగకమ్ముకున్న మేఘము వలె లేదా పచ్చదనముగా విలక్షణముగా కొండ కనిపించినను చివరికి అక్కడ చెట్లు, మనుషులు, గృహాలు, మొదలగు ఎన్నో వైవిధ్యము లుండును. పరమ సత్యము కూడ వైవిధ్యములు లేకుండ ఉండదు. ఎలాగైతే ఇక్కడ భౌతిక వైవిధ్యములు కలవో అలాగే అక్కడ కూడ ఆధ్యాత్మిక వైవిధ్యములు కలవు. మాయావాదులు దూరం నుండి పరమ సత్యమును చూచుట వలన వారు పరమ సత్యములో వైవిధ్యములు లేవని భావిస్తుంటారు. వారు వైవిధ్యములను భౌతికములని భావిస్తుంటారు. కాని అది పొరపాటు. కాని 'బ్రహ్మ సంహిత'(5.29) లో పరమ సత్యం వైవిధ్యములతో నిండినదని వివరించబడినది:

చింతామణిప్రకరసద్మసు కల్పవృక్ష–
లక్షావృతేషు సురభీరభిపాలయంతమ్
లక్ష్మీసహస్రశతసంభ్రమ సేవ్యమానం
గోవిందమాదిపురుషం తమహం భజామి

"ఆదిదేవుడు, పురాణపురుషుడైన గోవిందుడు చింతామణి సమూహములచే నిర్మితములైన భవనములయందు స్థితుడు. లక్షలాది కల్పవృక్షములచే ఆ భవనములు పరివేష్టితములై యున్నవి. కామధేనువులు ఆయన చల్లని నీడలో పోషింప బడుచున్నవి. లక్షలకొలది లక్ష్మీదేవతలు లేదా గోపికలు అత్యంత ప్రేమాదరములతో

ఆ పురుషోత్తముని సేవించుచున్నారు. అట్టి గోవిందుని నేను భజించుచున్నాను.”

ఆధ్యాత్మిక ప్రపంచములో వైకుంఠ లోకములు కలవు. అక్కడ ముక్తులైన భక్తులు కలరు. ఈ భక్తులు ‘అక్షరులు’ అనగా వారు భౌతిక లోకానికి పతనము చెందరు. వారు ఆధ్యాత్మిక ప్రపంచములోని వైకుంఠ లోకాలలోనే నివసిస్తారు. వారు మనలాంటి వ్యక్తులే అయినను వారు శాశ్వతపురుషులు, పరిపూర్ణ జ్ఞాన వంతులు మరియు పరిపూర్ణ ఆనందమయులు. ఇదే మనకు వారికి మధ్య గల భేదము. అదే తత్త్వజ్ఞానం. పరమసత్యం యొక్క వైవిధ్యములను మనము అర్థం చేసుకోలేకపోయినచో పతనము చెందే అవకాశము కలదు. కాబట్టి కేవలం పరమ సత్యం యొక్క అనిశ్చితమైన నిరాకార రూపమునకే అంటిపెట్టుకొని ఉండుటయే సరిపోదు :

ఆరుహ్య కృచ్ఛ్రేణ పరం పదం తతః
పతన్త్యధోఽ నాదృతయుష్మదంఘ్రయః

(శ్రీమద్భాగవతము 10.2.32)

నిరాకారవాదులు వైకుంఠ లోకములోనికి అనుమతించ బడనందున వారు కేవలము బ్రహ్మజ్యోతిలోనే నిలిచిపోవలిసి వస్తుంది. కాబట్టి వారు భౌతిక లోకాలలోని వైవిధ్యములలోకి పతనము చెందుదురు. మాయావాద సన్న్యాసులు ముందుగా జగత్తు మిథ్య అని వదిలి పెట్టెదరు*(బ్రహ్మసత్యం జగన్ మిథ్యా).* మరియు వారు తమకుతాము బ్రహ్మన్*(అహం బ్రహ్మాస్మి)* జగత్తును మిథ్య అని*(జగన్ మిథ్యా)* మరియు భౌతిక లోకంతో ఇక ఎలాంటి పనిలేదని చివరికి, “నేను నారాయణుడ నయ్యాను” అని అంటారు. తరువాత వారు ‘దరిద్ర నారాయణు’ని స్థితికి దిగ జారుదురు. వారు నారాయణునిగా మారి ఏదైనా మంచి చేయాలనే ఆలోచనలతో, వైవిధ్యములను ఆశించి, వారు భౌతికమైన సాంఘిక సంక్షేమ కార్యక్రమాలలో పాల్గొంటారు. వారు వారి భార్యలను మిథ్య అని భావించినప్పటికినీ వారు మరలా తిరిగి వచ్చుదురు. “మీరు మిథ్య అని త్యజించి, ఎందుకు తిరిగి వచ్చారు?” అని వారిని వారి భార్యలడుగు తుంటారు. దానికి అర్థమేమనగా ఈ సన్న్యాసులని పిలువబడేవారికి చేయుటకు ఏమి లేదు. వారు నిరాకార బ్రహ్మ స్థితిని పొందుట కొరకు అనేక కఠిన నియమాలను, తపములను ఆచరిస్తుంటారు, కాని అక్కడ ఎటువంటి ఆనందము లభించనందున వారు భౌతిక వైవిధ్యములను అనుభవించుట కొరకు భౌతిక ప్రపంచమునకు తిరిగి వస్తుంటారు.

మనము చక్కని రోదసి నౌకను నిర్మించి దానిని ఆకాశములోకి పంప వచ్చును, మరియు రోదసి చోదకులు అక్కడి వరకు వెళ్ళి నిరాకార ఆకాశములోకి ఎగురవచ్చును, కాని వారు చివరికి అలిసిపోయి, "దయచేసి మమ్ము భూమి పైకి దింపండి" అని భగవంతుడిని ప్రార్థిస్తుంటారు. రష్యా రోదసి యాత్రికులు వారు ఆకాశములో ప్రయాణం చేసేటప్పుడు మాస్కో నగరమును గుర్తించలేక పోయారని మేము చదివాము. నిరాకారవాదుల యాత్ర కేవలం ఆందోళనను కలిగించును. అదేవిధముగా, పరమసత్యం యొక్క నిరాకారానుభూతి శాశ్వతము కాదు. ఎందుకంటే మనం వైవిధ్యములను కోరుకుంటాము. పతనం అనుదానిని తప్పించు కోలేము. 'గ్రహాంతర సులభయానం' అనే మా పుస్తకమును చదివిన ఒకవ్యక్తి ఇతర గ్రహాలకు వెళ్ళుటకు ఎంతో ఉత్సాహమును కనపరచెను, అప్పుడు దానికి నేను తప్పకుండ "మీరు ఈ పుస్తకం ద్వారా వెళ్ళవచ్చు" అని సమాధానమిచ్చాను. "నిజమా" అని తర్వాత అతడు "నేను తిరిగి రాగలనా" అని వెంటనే ప్రశ్నించాడు. "ఎందుకు రావటం?" మీరు అక్కడే ఉండిపోవచ్చును. "లేదు లేదు. నేను అక్కడే ఉండిపోదలచు కోలేదు. కేవలం అక్కడకు వెళ్ళి తిరిగి రావాలనుకుంటున్నాను" అని అతడు అన్నాడు. ఇది 'ఆనందించే' తత్త్వం. వైవిధ్యములు లేకుండ మనం ఆనందముగా ఉండలేము. వైవిధ్యం అనేది ఆనందమునకు తల్లి. బ్రహ్మానుభూతి లేదా పరమాత్మానుభూతి మనకు శాశ్వతమైన ఆనందమును కలిగించదు. మనము ఆనందమును కోరుకుంటాము. *"ఆనందమయోఽభ్యాసాత్."* జీవులు ఆత్మలు మరియు శ్రీకృష్ణుడు పరబ్రహ్మము. శ్రీకృష్ణుడు శాశ్వతమైన ఆనందమును అనుభవిస్తుంటాడు. శ్రీకృష్ణుడి అంశలమైనందున మనం కూడ ఆనందమునే కోరుకుంటాము. ఆనందమనేది నిరాకార లేదా శూన్యము కాజాలదు. అనంద మనునది వైవిధ్యముతో కూడుకున్నది. కేవలం పాలు త్రాగుటలో మరియు చక్కెర తినుటలోనే ఎవరూ ఆసక్తిని కలిగి ఉండరు, కాబట్టి పాలు చక్కెరతో పేడ, బర్ఫీ, క్షీరాన్నం, రబ్డి, పెరుగు మొదలగునవి తయారు చేసుకోవచ్చును. వందలకొలది వంటకాలను తయారు చేసుకోవచ్చును. ఏది ఏమైనను ఆనందము కొరకు వైవిధ్యమనేది అవసరము.

సంపూర్ణ వైవిధ్యములతో కూడుకొనిన శ్రీకృష్ణుడిని అర్థం చేసుకోనుటయే తత్త్వజ్ఞానములోని చివరిదశ. కపిలదేవుడు *'తత్త్వమార్గాగ్రదర్శణమ్'* అతడు దేవాదిదేవుని అవతారము. అతడు తన తల్లికి తత్త్వమనగా ఏమిటో, తత్త్వజ్ఞానమును ఎలా సమీపించగలమో మరియు దానిని ఎలా ఆనందించ గలమనే విషయాలను

వివరించెను. ఇది కేవలం శుష్కవేదాంతము కాదు. ఈ కృష్ణచైతన్య తత్త్వం ఆధ్యాత్మిక వైవిధ్యములతో నిండి ఉంది. జనులు ఈ వైవిధ్యములను కొన్నిసార్లు భౌతికమని పొరపడు తుంటారు. అంతేకాకుండ వారు నిర్విశేష, నిరాకార శూన్యము కొరకు ప్రాకులాడుతుంటారు. ఏమైనను, మన సిద్ధాంతము శూన్యమైనది కాదు, ఇది పూర్తి వైవిధ్యములతో మరియు దివ్యానందముతో నిండినది. తరువాత ఇది కపిలదేవుని ద్వారా క్లుప్తంగా వివరించడమైనది.

అధ్యాయము 6

దేవహూతి దివ్యజ్ఞానమును ఆశించుట

శ్లోకము 7

దేవహూతిరువాచ

నిర్విణ్ణా నితరాం భూమన్నసదిన్ద్రియతర్షణాత్

యేన సంభావ్యమానేన ప్రపన్నాన్ధం తమః ప్రభో

దేవహూతి పలికెను : హే ప్రభూ! భౌతిక ఇంద్రియములు కలిగించెడి కలతచే అజ్ఞానాంధకార కూపమున పడియున్నందున దాని యెడ నేను మిగుల విసుగు చెందియున్నాను.

భాష్యము : ఇచ్చట దేవహూతి ప్రశ్నించుటకు మునుపు, *'అసదిన్ద్రియతర్షణాత్'* అనే పదము ప్రధానమైనది. *'అసత్'* అనగా అశాశ్వతమైనది లేదా తాత్కాలికమైనది; *'తర్షణాత్'* అనగా కలత అని భావము. కనుక *'అసదిన్ద్రియతర్షణాత్'* అనగా 'భౌతికదేహపు తాత్కాలిక ఇంద్రియములచే కలత చెంది' అని భావము. మనము అనేక రకములగు దైహికస్థితుల నుండి (కొన్నిమార్లు మానవదేహము, మరికొన్ని మార్లు జంతుదేహము) గా పరిణామము చెందుచు వచ్చుచున్నాము; కనుక మన ఇంద్రియముల కార్యకలాపములు సైతము ఎల్లప్పుడు మారుచున్నవి. మార్పు స్వభావము గలదేదైనను *'అసత్'* (తాత్కాలికము) అని పిలువబడును. ఈ తాత్కాలిక ఇంద్రియములకు పరముగా మన శాశ్వతేంద్రియములు కలవనియు, అవి ఇప్పుడు భౌతికదేహముచే కప్పబడినవనియు మనమెరుగవలెను. అసత్తుచే కలుషితమైన శాశ్వత ఇంద్రియములు యుక్తముగా వర్తించుట లేదు. ఈ కల్మషము పూర్తిగా తొలగింపబడి ఇంద్రియములు విశుద్ధమగు కృష్ణచైతన్యములో వర్తించినప్పుడు, మనము 'సదిన్ద్రియము'లను పొందితిమని చెప్పవచ్చును. నిత్యేంద్రియ కర్మలే భక్తియుక్త సేవ అని పిలువబడును; ఇక తాత్కాలికమగు ఇంద్రియకర్మలు ఇంద్రియ భోగమని పిలువబడును. భౌతికేంద్రియ భోగము నెడ విసుగు చెందనంత వరకు కపిలభగవానుని వంటివారి నుండి ఆధ్యాత్మిక సందేశములను శ్రవణము చేసెడి అవకాశమే కలుగదు. తాను అలసి విసుగు చెందితినని దేవహూతి పలికినది; ఇప్పుడు తన భర్త గృహమును పరిత్యజించినందున కపిలభగవానుని సందేశములను విని ఆమె ఊరటను పొందగోరెను.

వైదిక సాహిత్యములు ఈ భౌతిక లోకములను అంధకారమని వర్ణించినవి. నిజానికి ఇది అంధకారము. కాబట్టి మనకు సూర్యకాంతి, చంద్రకాంతి మరియు విద్యుత్తు అవసరమై ఉంటుంది. ఇది స్వభావరిత్యా అంధకారము కానిచో, మనమెందుకు కృత్రిమ కాంతి కొరకు ఎన్నో ఏర్పాట్లను చేసుకోవలసి వస్తుంది? వేదాలు మనకు అంధకారములో ఉండరాదు అని చెబుతున్నాయి : "*తమసి మా జ్యోతిర్గమ.*" మనము వెలుగులోనికి వెళ్ళవలిసిందిగా ఆదేశించ బడినాము. మరియు ఆ వెలుగే ఆధ్యాత్మిక ప్రపంచము, అదే శ్రీకృష్ణుని శరీరపు కాంతి లేదా ప్రకాశముచే స్వయంగా వెలుగునది. 'బ్రహ్మ సంహిత'(5.40) తెలిపినట్లుగా:

యస్య ప్రభా ప్రభవతో జగదండకోటి –
కోటిష్వశేషవసుధాదివిభూతిభిన్నమ్
తద్ బ్రహ్మ నిష్కలమనంతమశేషభూతమ్
గోవిందమాదిపురుషం తమహం భజామి

"ఆదిపురుషుడైన ఆ గోవిందుని ప్రకాశము ఉపనిషత్తులలో వర్ణింపబడిన నిర్విశేష బ్రహ్మన్‌కు ఆధారము. ఆయన కోట్లకొలది బ్రహ్మాండముల యందు అనంత విభూతుల రూపములలో వైవిధ్యములు కలిగియున్నను, ఉపాధిరహితుడు, అనంతుడు, సంపూర్ణుడుగా ప్రకటితు డగుచుండును. అట్టి గోవిందుని నేను భజించు చున్నాను."

పశువులు తాము అంధకారములో నున్నామని అర్థం చేసుకోగల శక్తిని కలిగిలేవు, కాని మానవులకు తెలుసును. జ్ఞానవంతులైన వారెవ్వరైనను అజ్ఞానమనే అంధకారము చేత దేవహూతి వలె విరక్తి చెందవలెను. "*న హన్యతే హన్యమానే శరీరే.*" భగవద్గీత(2.20)లో చెప్పినట్లుగా, ఆత్మకు చావు గాని పుట్టుకగాని లేదు. శరీరము నశించినను ఆత్మ నశించదు. ఆత్మ శరీరాలను వస్త్రాలవలె ధరిస్తూ విడుస్తుండును. భగవద్గీత ప్రారంభములో ఈ సరళమైన జ్ఞానము వివరించ బడెను. అయినను గొప్ప పండితులు మరియు నాయకులు శరీరం(ఆత్మ) మనిషి కంటె భిన్నమైనదని అర్థం చేసుకోలేకపోతున్నారు. భగవద్గీతను సరియైన పద్ధతిలో అధ్యయనము చేయనందునే ఇలా జరుగుచున్నది. దానికి ఫలితంగా, ఎవ్వరూ కూడ నిజమైన తాను శరీరము కాదని పూర్తిగా తెలిసికోలేక పోతున్నారు. దీనినే అంధకారమని అంటారు. ఈ అంధకారముతో విరక్తి చెందినప్పుడే మానవ జీవితము ప్రారంభ మవుతుంది.

భౌతిక జీవితం పట్ల విరక్తి చెందినవారికి గురువు ఆదేశాలు ఎంతో అవసరం. *"తస్మాద్ గురుం ప్రపద్యేత జిజ్ఞాసుః శ్రేయ ఉత్తమమ్."* గొప్పయోగికి భార్య అయినందున దేవహూతి తన నిజస్థితిని అర్థం చేసుకోగలిగినది. అందుకే ఆమె తన సమస్యను భగవంతుని అవతారమైన తన కుమారుడు కపిలుని ముందు వ్యక్తపరిచినది. కపిలదేవుడు తన కుమారుడైనను అతని నుండి ఉపదేశాలను వినుటకు దేవహూతి సంకోచపడలేదు : "ఓ! ఇతడు నా కుమారుడు. ఇతడు నాకు ఏమి తెలుపును? నేను ఇతడికి తల్లిని, మరియు నేను ఆదేశింతునని ఆమె అనలేదు." జ్ఞానం గల వారెవరివద్ద నుండైనా ఉపదేశములను పొందవలెను. అతని స్థితి ఏమిటి అనే దానిపై ఇది ఆధారపడి ఉండదు. అతడు కుమారుడు కావచ్చును. బాలుడు, శూద్రుడు, బ్రాహ్మణుడు, సన్యాసి లేదా గృహస్థుడు ఎవరైనను కావచ్చును. జ్ఞానం తెలిసిన వారి దగ్గర నుండి దానిని గ్రహించవలెను. అదే శ్రీ చైతన్య మహాప్రభువు యొక్క ఆదేశము. మహాప్రభువు బ్రాహ్మణుడు, మరియు సన్యాసి అయినను భక్తిలో ఉన్నత శ్రేణికి చెందిన గృహస్థుడు శూద్రుడైన రామానంద రాయ్ నుండి ఉపదేశములను పొందెను. ఆదేశించుటకు రామానంద రాయ్ సంకోచించుటను గమనించి మహాప్రభువు : "ఎందుకు సంకోచిస్తున్నారు? మీరు గృహస్థులైనను, శూద్ర కుటుంబములో జన్మించినప్పటికిని, నేను మీ దగ్గర ఉపదేశములను పొందుటకు సిద్ధముగా నున్నానని పలికెను."

కిబ విప్ర, కిబ న్యాసి, శూద్ర కేనే నాయ్
ఏయి కృష్ణతత్వవేత్త, సేయ్ గురు హోయ్
(శ్రీ చైతన్య చరితామృతము, మధ్యలీల 8.128)

ఇది శ్రీ చైతన్య మహాప్రభువు ఉపదేశము. కృష్ణచైతన్యములో అర్హత పొందిన వారెవరైనను గురువు కావచ్చును. అతని కుటుంబము మరియు భౌతిక ఉపాధులేవి లెక్కలోనికి రావు. కేవలము అతడికి శాస్త్రం గురించి తెలిసి ఉండవలెను. ఎప్పుడైనను, మనము ఒక యంత్రకారుని(ఇంజనీరు), వైద్యుడిని, న్యాయవాదిని సంప్రదించినప్పుడు అతడిని బ్రాహ్మణుడా లేక శూద్రుడా అని మనము ప్రశ్నించము. అతడు అర్హతను కలిగి ఉన్నచో, మనకు అవసరమైన విషయములో సహాయ పడగలడు. అదేవిధముగా ఎవరికైనను శ్రీకృష్ణుని శాస్త్రం తెలిసినచో, అతడు గురువు కావచ్చును. తన కుమారుడు కృష్ణభక్తి శాస్త్రం తెలిసి ఉండుట వలన దేవహూతి అతడి వద్దనుండి ఉపదేశములను పొందుచుండెను. బంగారము మురికి

ప్రదేశములో పడి ఉన్నను దానిని తీసుకోవలెను. ఒక యువతి కనుక గొప్ప శీలవతి లేదా అందముగా నున్నచో ఆమె తక్కువకులంలో జన్మించినను అంగీకరించ వలెనని వేదాలలో తెలుపబడినది. కాబట్టి జన్మ ముఖ్యము కాదు అర్హత ముఖ్య మైనది. భారతభూమిలో జన్మించిన వారందరు శ్రీకృష్ణుని గురించి తెలుసుకొని కృష్ణభక్తిని ప్రచారము చేయవలెనని శ్రీ చైతన్య మహాప్రభువు ఆదేశించెను. ఇది ఎంతో సులభమైనది. కేవలం మనము శ్రీకృష్ణుడు తెలిపిన దానిని లేదా వైదిక శాస్త్రాలలో శ్రీకృష్ణుని గూర్చి తెలుపబడిన దానిని తిరిగి మనము తెలుపవలెను.

మానవ నాగరికత కృష్ణచైతన్యము లేకుండ ఆనందముగా ఉండలేదు. శ్రీకృష్ణుడు పరమభోక్త, మరియు మనము అతని సేవకులము. యజమాని ఆనందిస్తున్నాడు, సేవకులు యజమాని ఆనందించుటలో సహాయ పడుతున్నారు. జీవాత్మలమైన మనము భగవంతుని శాశ్వత సేవకులము. యజమాని ఆనందము కొరకు సహాయము చేయుట మన ధర్మం. శ్రీమతి రాధారాణి శ్రీకృష్ణుని పరమోన్నత సేవకురాలు. శ్రీకృష్ణుడిని ఎల్లప్పుడు ఆనందింప చేయుటయే ఆమె స్వభావము. రాధారాణి అంటే శ్రీకృష్ణుడికి ఎంతో ఇష్టం. ఎందుకనగా, ఆవిడ ఎల్లప్పుడు పరమోన్నత సేవలను అతడికి అందించును. ఆవిడ యొక్క 64 అర్హతలు (లక్షణములు) వైదిక సాహిత్యములో వివరించబడెను. దురదృష్టవశాత్తు, ఈ భౌతిక ప్రపంచములో మనము మన భౌతిక ఇంద్రియాలను సంతృప్తిపరిచే ప్రయత్నములోనే మునిగి ఉన్నాము. భగవద్గీత(3.42) లో చెబుతున్నట్లుగా :

ఇన్ద్రియాణి పరాణ్యాహురిన్ద్రియేభ్యః పరం మనః
మనసస్తు పరా బుద్ధిర్యో బుద్ధేః పరతస్తు సః

"జడపదార్థము కంటె పనిచేయు ఇంద్రియములు ఉత్తమములు; ఇంద్రియముల కంటె మనస్సు; మనస్సుకంటె కూడ బుద్ధి ఉత్తమము; బుద్ధికంటె కూడ ఆత్మ ఉత్తమము." ఆత్మ అనేది ఆధ్యాత్మిక స్థితిలో ఉండును. భౌతిక స్థితిలో మనము మన ఇంద్రియాలను తృప్తిపరుచుటలో ఆసక్తిని కలిగి ఉంటాము. ఈ విధముగా మనము ప్రకృతి నియమాలలో చిక్కుకుపోతాము. శాస్త్రాలలో చెప్పినట్లుగా :

నూనం ప్రమత్తః కురుతే వికర్మ యదిన్ద్రియప్రీతయ ఆపృణోతి
న సాధు మన్యే యత ఆత్మనోఽ యమసన్నపి క్లేశద ఆస దేహః

"ఇంద్రియ భోగమునే జీవిత లక్ష్యముగా భావించినపుడు మనుజుడు నిక్కముగా

లౌకికజీవనము పట్ల వెర్రిపట్టినవాడై పాపకర్మరతుడగును. తాత్కాలికమే అయినను దుఃఖకారణమగునట్టి ఈ దేహము గతజన్మ పాపముల వలననే లభించినదని అతడెరుగడు. నిజమునకు జీవుడు భౌతిక దేహమును స్వీకరించరాదు; కాని ఇంద్రియభోగార్థము అతనికి అది ఒసగబడినది. కనుక జన్మపరంపరను కలుగజేసెడి ఇంద్రియభోగ కర్మల యందు నెలకొనుట వివేకవంతుడైన మనుజునికి యుక్తము కాదని నేను తలంతును." (శ్రీమద్భాగవతము 5.5.4)

ఈ భౌతికలోకంలో జీవాత్మలు తమ ఇంద్రియములను తృప్తిపరుచుకొను ప్రయత్నములో తీరిక లేకుండా ఉన్నారు. వీధిలో అనేక కుక్కలు ఇంద్రియ సంభోగము కొరకు గుమిగూడును. ఇది చూచుటకు అసహ్యముగా కనిపించినను మానవులు కూడ అదే పనిలో సుదీర్ఘ పద్ధతిలో పాల్గొనుచున్నారు. ఇంద్రియ తృప్తి అనేది పశువుల కొరకు నిర్దేశించబడినదని మనం తెలుసుకోవాలి. ఇంద్రియ నిగ్రహమనేది మానవుల కొరకు ఆదేశించబడినది. తపస్సు ద్వారా మనలను శుద్ధిపరచుకొని మన శాశ్వత జీవితమును తిరిగి పొందవలెను.

ఎలాగైతే శరీరము బట్టలచే కప్పబడి ఉంటుందో అలాగే మన భౌతిక ఇంద్రియాలు కూడ కప్పబడి ఉన్నాయి. *"దేహినోఽ స్మిన్ యథా దేహే."* భౌతిక శరీరములో ఆధ్యాత్మిక శరీరము కలదు. భౌతిక శరీరము బాల్యము నుండి యవ్వనానికి తర్వాత వృద్ధాప్యానికి మారుతూ చివరికి నశించును. ఇది మన వాస్తవ శరీరము కాకున్నను, మనం ఇంద్రియ తృప్తిని దీనిద్వారానే పొందుతున్నాము. ఏది ఏమైనను మన నిజమైన పరమానందము కొరకు మన ఇంద్రియములను తప్పక శుద్ధి చేసుకోవలెను. ఇంద్రియాలను నష్టపరచుటయో లేదా కోరికలు లేకుండ ఉండుటమనే ప్రశ్నే లేదు. భౌతిక కార్యక్రమము మరియు కోరికలు లేకుండ ఉండుట సాధ్యపడదు. ఇంద్రియములతో ఆధ్యాత్మికముగా నడుచుకొనుట కొరకై వాటిని శుద్ధిపరచవలెను. భక్తియోగ మనలను ఇంద్రియాలను నాశనము చేయుమని తెలుపుట లేదు. కాని వాటిని శుద్ధికరించ వలెను. ఇంద్రియాలు శుద్ధమైనప్పుడు, శ్రీకృష్ణుని మనము సేవించవచ్చును :

సర్వోపాధివినిర్ముక్తం తత్‌పరత్వేన నిర్మలమ్
హృషీకేణ హృషీకేశసేవనం భక్తిరుచ్యతే

"భక్తుడు భౌతిక ఉపాధు లన్నింటికిని దూరముగా నుండవలెను. కృష్ణ చైతన్యముతో భవకాలుష్యమును తొలగించు కొనవలెను. ఇంద్రియములకు అధిపతియైన వాని

సేవలో ఇంద్రియములను వినియోగిస్తూ అతడు తన శుద్ధమైన నిజ స్వరూపమును తిరిగి పొందవలెను."(నారద పాంచరాత్రము)

ఇంద్రియముల ద్వారా మనము ఇంద్రియములకు అధిపతియైన హృషీకేశునికి సేవ చేయవలెను. ఎలాగైతే చేయి శరీరం యొక్క అంశయో అలాగే మనము కూడ శ్రీకృష్ణుని అంశలము. అదేవిధముగా మన ఇంద్రియాలు కూడ శ్రీకృష్ణుని దివ్యశరీరపు అంశలే. మన ఇంద్రియాలు పవిత్రమైనప్పుడే మనం మన నిజస్థితిలో నెలకొని శ్రీకృష్ణుడికి సేవ చేయగలము. మన స్థితిని విస్మరించి మరియు మనలను సంతృప్తి పరచుకోవాలని ప్రయత్నించినప్పుడే మనము భౌతికంగా బద్ధులమవుతాము. శ్రీకృష్ణునికి సేవ చేసే మన ధర్మమును విస్మరించినప్పుడు, మనం భౌతిక ప్రపంచములోకి పతనము చెంది వ్యక్తిగత ఇంద్రియ భోగములలో చిక్కుకుంటాము. మనం మన ఇంద్రియాలను సంతృప్తిపరచుటకు ప్రయత్నించినంత కాలము మరొక శరీరమును అంగీకరించ వలసినదే. శ్రీకృష్ణుడు ఎంతటి దయామయుడు అనగా మనము పులి శరీరమును కావాలని కోరుకున్నచో, అతడు మనకు పులి శరీరమును ఇచ్చును. భక్తుల శరీరమును కోరుకున్నచో అతడు మనకు భక్తుడి శరీరమును ఇచ్చును. అంటే ఈ జన్మలో రాబోవు జన్మను తయారు చేసుకొనుటయే. భగవద్ధామమును తిరిగి చేరుటకు మరియు మన ఆధ్యాత్మిక ఇంద్రియాలను అనుభవింప దలచినచో పవిత్రుల మవ్వాలి. గురువునకు శిష్యుడు శరణాగతి పొందునట్లుగా దేవహూతి తన కుమారుని శరణు వేడుకొనుచున్నది.

శ్లోకము 8

తస్య త్వం తమసోఽన్ధస్య దుష్పారస్యాద్య పారగమ్
సచ్చక్షుర్జన్మనామన్తే లబ్ధం మే త్వదనుగ్రహాత్

ఈ అజ్ఞానాంధకారము నుండి బయటపడుటకు నీవే నాకు ఏకైక మార్గమై యున్నావు. ఏలయన కేవలము నీ కరుణ చేతనే బహుజన్మల పిదప నిన్ను జ్ఞాన చక్షువుగా పొందియున్నాను.

భాష్యము : గురుశిష్యుల నడుమ సంబంధమును సూచించునదైనందున ఈ శ్లోకము మిగుల ఉపదేశాత్మకమై యున్నది. శిష్యుడు(లేదా బద్ధజీవుడు) అజ్ఞానాంధకారము నందున్నందున ఇంద్రియభోగపు భౌతిక అస్తిత్వమున చిక్కుబడి యుండును. ఈ బంధము నుండి బయటపడి స్వాతంత్ర్యమును పొందుట మిగుల కష్టతరము;

కాని మనుజుడు కపిలముని లేదా అతని ప్రతినిధి వంటి గురువు యొక్క సన్నిధిని పొందగలిగినంతటి భాగ్యవంతుడైనచో ఆయన కరుణచే అజ్ఞానము నుండి బయట పడగలడు. కనుకనే అవిద్య అంధకారము నుండి జ్ఞానజ్యోతిచే శిష్యుని ఉద్ధరించు వానిగా గురుదేవుడు అర్చించబడును. ఇచ్చట *'పారగమ్'* అను పదము ప్రధాన మైనది; ఆవలి ప్రక్కన ముక్తజీవనము కలదు. జ్ఞానముచే శిష్యునికి నేత్రోదయము కావించుట ద్వారా గురువు అతనిని ఆవలిప్రక్కకు తోడ్కొనిపోవును. కేవలము అజ్ఞాన వశముననే మనము దుఃఖితులమై యున్నాము. కాని గురూపదేశముచే అట్టి అజ్ఞానాంధకారము తొలగిపోగలదు. ఆ విధముగా శిష్యుడు ముక్తి వైపునకు చేరగలడు. బహూఃజన్మల పిదపయే మనుజుడు దేవాదిదేవుడగు శ్రీకృష్ణుని శరణు జొచ్చునని భగవద్గీత యందు తెలుపబడినది. అదేవిధముగా బహుజన్మల పిదప యైనను మనుజుడు ప్రామాణిక గురువును కనుగొనగలిగి, ఆ శ్రీకృష్ణుని ప్రతినిధికి శరణము నొందగలిగినచో వెలుగు వైపునకు కొనిపోబడును.

ప్రామాణికుడైన ఆధ్యాత్మికాచార్యుడు నిజమైన వేదాంతి, ఎందుకనగా అతడికి నిజమైన వేదాంతము మరియు వేదాల గురించి తెలుసును మరియు దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడిని అర్థం చేసుకొనును. *'వేద'* అనే పదానికి 'జ్ఞానము' అని మరియు *'అంత'* అనగా 'చివరిదశ'. జ్ఞానంలో వివిధ రకాలు కలవు. ఆర్థికాభివృద్ధిని ఆశించి మనం సాధారణ జ్ఞానంలో ఆసక్తి కలిగి ఉన్నాము, కాని అది వాస్తవజ్ఞానం కాదు. అది జీవనోపాధి యొక్క కళ. విద్యుత్తు శాస్త్రమును చదివి ఎవరైన విద్యుత్తు తీగలను మరమ్మత్తు చేయుచు జీవనోపాధిని కొనసాగించ వచ్చును. ఈ రకమైన జ్ఞానమును 'శిల్పజ్ఞానం' అంటారు. కాని నిజమైన జ్ఞానం అనునది వైదిక జ్ఞానం. తనను గురించి తాను తెలుసుకొనుట. తాను ఏమిటి, భగవంతుడు ఏమిటి అంతేకాకుండ భగవంతునితో తమకు గల సంబంధము మరియు తమ ధర్మము ఏమిటి అని తెలుసుకొనుటయే.

జ్ఞానము కొరకు అన్వేషించే వానిని *'జ్ఞానవాన్'* అంటారు. జ్ఞానం అనునది *"అథాతో బ్రహ్మజిజ్ఞాసా"* – "బ్రహ్మన్ అనగా ఏమిటి" అని ప్రశ్నించుట ద్వారా ప్రారంభ మగును. భౌతికలోకములోని ఆదిభౌతిక, ఆధ్యాత్మిక మరియు ఆదిదైవిక అనే త్రివిధ తాపత్రయములను అర్థం చేసుకొనుట ద్వారా కూడ జ్ఞానం ప్రారంభ మగును. ఇతర జీవరాసుల వలన మరియు ప్రకృతి చర్యల వలన, మనము బాధల ననుభవిస్తున్నాము. అంతేకాకుండ శరీరం మరియు మనస్సు వలన కలిగే బాధలు. ఆత్మ అనేది శరీరము మరియు మనస్సునకు అతీతమైనది. కాని ఆత్మ

భౌతిక కల్మషముల చేత దుఃఖముల పాలగును. ఈ త్రివిధ తాపత్రయములపై మనకు ఎలాంటి నియంత్రణ లేదు. అవి శ్రీకృష్ణుని సేవకురాలైన భౌతిక ప్రకృతియైన దుర్గ నియంత్రణలో ఉండును. ఆమె శ్రీకృష్ణుని కంటె స్వతంత్రురాలు కాదు. ఏమైనను, ఆమె సృష్టించి పాలించగల శక్తివంతమైనది. ప్రకృతి నిర్దయ కలది. దుర్గమాత ఎక్కువగా త్రిశూలముచే రాక్షసులను వెంటాడుతూ సంహరిస్తున్నట్లుగా చిత్రించబడుటను మనం చూస్తుంటాము.

పండితులు వివేకవంతులైన వారు భౌతిక జీవితములోని క్లేశముల నుండి విముక్తి పొందుటకు దేవాదిదేవుని కృపను ఆశిస్తారు. ఈ భౌతిక లోకము అంధకార మయమైనను, జనులు వారి కన్నులను చూసుకొని ఎంతో గర్విస్తుంటారు. వారెప్పుడు : "మీరు నాకు భగవంతుని చూపించగలరా?" అని అడుగుతుంటారు. "మీకు భగవంతుడిని చూచుటకు కన్నులు కలవా?" అనేది సమాధానము. ఎందుకు చూచుటకు ప్రధాన్యత ఇవ్వబడినది? తప్పకుండ, భగవంతుడిని చూడవచ్చు. 'బ్రహ్మ సంహిత' (5.38)లో చెప్పబడినట్లు: *"ప్రేమాంజనచ్ఛురితభక్తివిలోచనేన"* – "ఎవరి కన్నులు ప్రేమ అనెడి అంజనముతో అలంకరించబడెనో అలాంటి భక్తులు గోవిందుడి(శ్రీకృష్ణుని)ని ఎల్లప్పుడు దర్శించగలరు."

మనం భక్తులము మరియు భగవంతుని ప్రేమికుల మైనచో ప్రేమ అనే కాటుక మన కళ్ళను శుద్ధిచేయును. భగవంతుని దర్శించుట కొరకు, మన కళ్ళకు గల భౌతిక కలుషితమనే కంటి జబ్బును దూరం చేసుకొనుట వలన వాటిని శుభ్రం చేయగలము. భగవంతుడిని దర్శించ వలెనను కోరికను కలిగి ఉన్నప్పటికినీ, ప్రస్తుత భౌతిక చక్షువులచే అతడిని మనము చూడలేము. అతని నామము ఉన్నప్పటికిని మనమతడిని చూచుటయే కాకుండ అతడిని అర్థం కూడ చేసుకోలేము. భగవంతుడిని అర్థం చేసుకొనుట అనగా ముందు అతడి నామమును అర్థం చేసుకొనుట. కాబట్టి ప్రారంభము నుండి మనం అతడి నామమును అర్థం చేసుకో వలెను. ప్రారంభము నుండి మనము హరేకృష్ణ నామసంకీర్తనను చేయవలెను. భగవంతుడు అతని నామము కంటె భిన్నమైనవాడు కాదు. శ్రీకృష్ణుని నామము మరియు అతని స్వరూపం ఒకటే. *'సమస్తం'* అనగా శ్రీకృష్ణుని నామము, రూపము, ధామము, దుస్తులు, లీలలు మరియు సర్వము ఏది అతనికి భిన్నములు కావు. శ్రీకృష్ణుడు అతని నామములో నున్నప్పటికినీ అతని పట్ల ప్రేమలేని కారణముగా మనమతడిని చూడలేకున్నాము.

శ్రీ సనాతన గోస్వామి గొప్ప విద్వాంసుడు, మరియు అతడు పండితుడని

పిలువబడేవాడు. అనగా అతడు గొప్పజ్ఞానం గల బ్రాహ్మణుడని అర్థం. శ్రీ సనాతన గోస్వామి శ్రీ చైతన్య మహాప్రభువును సందర్శించినపుడు : "ఇతరులు నన్ను పండితుడని సంబోధిస్తుంటారు. నాకు బాధ కలుగుచున్నది" అని అతడు తెలిపెను. అప్పుడు మీరెందుకు దీనికి విచారిస్తున్నారని శ్రీ చైతన్య మహాప్రభువు అడిగెను : "నేను ఎంతటి పండితుడననగా నాకు జీవిత లక్ష్యము గురించి తెలియదు. అంతేకాకుండ ఏది శ్రేయస్కరమైనదో కూడ నాకు తెలియదు. నేను కేవలం ఇంద్రియ సుఖాలలో పడికొట్టుకు పోవుచున్నాను" అని సనాతన గోస్వామి సమాధానమిచ్చెను. ఈ విధముగా సనాతన గోస్వామి శ్రీ చైతన్య మహాప్రభువును సమీపించెను. అతడు బంగారము లేదా ఔషధుల కోసమో శ్రీ చైతన్య మహాప్రభువును సమీపించ లేదు. అతడు నిజమైన ఆత్మసాక్షాత్కారము కొరకు సమీపించాడు. గురువును సమీపించుటలో గల వాస్తవ ఉద్దేశ్యమిదే.

దేవహూతి కూడ కపిలదేవుని ఈ విధముగానే సమీపించినది : "నా ప్రియమైన కపిల, నీవు నా కుమారుడిగా వచ్చినను నీవు నా గురువువు. ఎందుకంటే ఈ భౌతిక లోకమనే అజ్ఞాన సాగరమును నేనెలా దాటగలనో నీవు తెలుపగలవు." కాబట్టి భౌతిక జీవనమనే అంధకారముతో నిండిన అజ్ఞానమనే సాగరమును దాటాలనుకునే వారికి గురువు అవసరము ఎంతో కలదు. గురువు అంటే బంగారము మరియు ఔషధులను సమకూర్చువాడు కాదు. ప్రస్తుతకాలంలో కుక్కలను, పిల్లులను పెంచుకొనునట్లుగా గురువును చూపుట ఒక ప్రదర్శనగా మారిపోయింది. దీనివలన ఎటువంటి ప్రయోజనము కలుగదు. ఈ అంధకారము నకు అతీతమైన భగవంతుని సృష్టిని గురించి మనము విచారించవలెను. ఉపనిషత్తులు మరియు భగవద్గీత భౌతిక ప్రకృతికి అతీతమైన మరో ప్రపంచమును గురించి వివరించుచున్నవి. భగవద్గీత(15.6)లో శ్రీకృష్ణుడిని అనుసరించి :

న తద్భాసయతే సూర్యో న శశాఙ్కో న పావకః
యద్గత్వా న నివర్తన్తే తద్ధామ పరమం మమ

"ఆ నా దివ్యధామము సూర్యునిచే గాని, చంద్రునిచే గాని, అగ్నిచే గాని, విద్యుత్తుచే గాని ప్రకాశింప చేయబడదు. దానిని చేరువారు మరల ఈ భౌతిక ప్రపంచమున కెప్పుడును తిరిగి రారు."

ఆధ్యాతిక జగత్తునకు భౌతిక పద్దతుల ద్వారా వెళ్ళుట సాధ్యపడదు. శ్రీకృష్ణుడిని అర్థం చేసుకోకుండ భౌతిక విశ్వమును ఛేదించలేము. మనం

భగవంతుని కృప చేత జ్ఞానోదయమును పొందవచ్చును. ఎందుకనగా శ్రీకృష్ణుడు ఆదేశించుటకు స్వయంగా విచ్చేయును. అతడు స్వయంగా రానప్పుడు అతని ప్రతినిధిని పంపించును లేదా భగవద్గీత ఉపదేశములను మనకొరకు విడిచి వెళ్ళును. ఏది ఏమైనను మనమెంతటి మూర్ఖులమంటే వేటినుండి ప్రయోజనమును పొందలేము. సర్వం త్యజించి ఈ జ్ఞానమును ఇవ్వటానికి ఉత్సాహమును కనపరిచే భగవత్ భక్తుల ఉపదేశములను పొందము. అందుకే శ్రీ చైతన్య మహాప్రభువు ఇలా తెలిపెను :

బ్రహ్మాండే భ్రమితే కోన్ భాగ్యవాన్ జీవ్
గురు-కృష్ణ-ప్రసాదే పాయ్ భక్తిలత బీజ్

"పతనం చెందిన, బద్ధావస్థలోని జీవుడు బహిరంగ శక్తిలో చిక్కుకొని, ఈ భౌతిక ప్రపంచములో తిరుగాడుచున్నాడు. కాని అదృష్టవశాత్తు అతడు భగవంతుని ప్రామాణిక ప్రతినిధిని కలిసినప్పుడు మరియు అలాంటి గురువు యొక్క లాభమును తీసుకొనినప్పుడు, అతడు భక్తియుక్త సేవా బీజమును పొందును." (శ్రీ చైతన్య చరితామృతము, మధ్యలీల 19.151)

గొప్ప అదృష్టవంతుడు మాత్రమే భక్తియుక్త సేవ యొక్క బీజమును పొందగలడు. అంతర్జాతీయ కృష్ణచైతన్యములో చేరి భక్తిని సాధన చేస్తున్న వారు ఈ ప్రపంచములోకెల్లా గొప్ప అదృష్టవంతులు. శ్రీకృష్ణుని కృపచేత జీవుడు *'భక్తి-లత-బీజ్'* భక్తి యుక్త సేవ యొక్క బీజమును పొందును. పాపకర్మల ఫలితాల నుండి విముక్తి పొందనంత వరకు, ఎవరు కూడ భక్తి లేదా భగవంతుడిని అర్థం చేసుకోలేరు. కాబట్టి అక్రమ సంభోగము, మత్తు పానీయాలు, మాంసాహారము మరియు జూదం వంటి వాటిని త్యజిస్తూ మనం పవిత్రముగా నడుచుకోవలెను. జీవితమును పవిత్రముగా గడిపినచో, భగవంతుడిని మనము అర్థము చేసుకో గలము. ఈ కృష్ణచైతన్య ఉద్యమము వాటిని త్యజించేలా ప్రజలకు శిక్షణ నిస్తున్నది. దానితో వారి జీవితాలు పరిపూర్ణ మగును. జనులకు ఈ లక్ష్యమును చేరుకుని వారి జీవితాలు విజయవంతము చేసుకొనుటకు కావలసిన శిక్షణను ఇచ్చుట కొరకై కృష్ణ చైతన్య ఉద్యమము నెలకొల్పబడినది.

శ్లోకము 9

య ఆద్యో భగవాన్ పుంసామీశ్వరో వై భవాన్ కిల
లోకస్య తమసాన్ధస్య చక్షుః సూర్య ఇవోదితః

నీవు దేవాదిదేవుడవు, ఆద్యుడవు, పరమేశ్వరుడవు. విశ్వపు అజ్ఞానాంధకారమును నశింపచేయుటకు సూర్యుని వలె నీవు ఉదయించితివి.

భాష్యము : కపిలముని దేవాదిదేవుడగు శ్రీకృష్ణుని అవతారముగా అంగీకరింపబడెను. *'ఆద్య'* అనగా సమస్త జీవులకు మూలమనియు; *'పుంసామీశ్వరః'* అనగా జీవేశ్వరుడని *(ఈశ్వరః పరమః కృష్ణః)* ఇచ్చుట భావము. కపిలముని ఆధ్యాత్మిక జ్ఞాన సూర్యుడగు శ్రీకృష్ణుని ప్రత్యక్ష విస్తారము. సూర్యుడు విశ్వపు అంధకారమును నశింప జేయునట్టివాడు; అదేవిధముగా దేవాదిదేవుడు వెలుగుగా క్రిందకు వచ్చి మాయాంధకారమును ఒక్కమారుగా నశింప జేయునట్టివాడు. సూర్యకాంతి లేనిచో అవి వ్యర్థములగును. మనము కన్నులను కలిగి యున్నప్పటికినీ, అదేరీతిగా భగవానుని వెలుగు లేకుండా లేదా గురువు యొక్క దివ్యకరుణ లేకుండా శిష్యుడు యథార్థదృష్టిని పొందజాలడు.

ఈ శ్లోకంలో దేవహూతి తన కుమారుడిని భగవానుడిగా సంభోదించినది. భగవంతుడు పరమ పురుషుడు. సాధారణ దృష్టి ననుసరించి చూసినచో, ఒక సంస్థను నడిపించటానికి నాయకుడు అవసరము. నాయకుడు లేకుండ దేనిని మనం నడిపించలేము. ఈ సృష్టి తనకుతాను ప్రకృతి నుండి వెలువడినదని చెప్పుదురు. ప్రారంభములో ఒక గట్టి పదార్థపు ముద్ద కలదని మరియు చరాచర సృష్టి ఆ ముద్ద నుండి వచ్చినదని వారు చెబుతుంటారు. కాని ఈ ముద్ద ఎక్కడి నుండి వచ్చింది? సత్యమేమనగా దేన్నినైనను చేసినచో దాని వెనుకాల ఒక మేధస్సు, ఒక నాయకుడు ఉండి తీరును. ఆ నాయకుని గురించిన సమాచారమును వేదాల నుండి పొందవచ్చును : *“నిత్యోనిత్యానాం చేతనాశ్చేతనానామ్.”* భగవానుడు శాశ్వతుడు, మరియు మనం కూడ శాశ్వతులమే. కాని భగవంతుడు అనేవాడు ఒకడు, జీవాత్మలు అనేకములు. భగవంతుడు అనంతుడు, మనం అల్పులము. అతడు సర్వజ్ఞుడు మరియు అనంతుడు, మనము పరిమితులము మరియు అత్యంత సూక్ష్మలము. మనం సృష్టిని విశ్లేషించినచో, అందరు ఒకే రకమైన సమాన స్థితినందు ఉండక పోవుటను గమనించవచ్చును. ఒకరు మరొకరి కన్నను అధిక బుద్ధివంతుడు

మరియు అధిక ఐశ్వర్యవంతుడై ఉండును. ఈ విధంగా విషయాలను విశ్లేషించినప్పుడు, మనము దేవతల వద్దకు మరియు దేవతలందరిలో ముఖ్యుడైన బ్రహ్మను కనుగొనెదము. అతడు ఈ సృష్టి యొక్క ఆది కర్త అయినను అతడు గొప్ప బుద్ధిమంతుడు కాదు. సృష్టి ప్రారంభంలో బ్రహ్మ దేవాదిదేవుని నుండి జ్ఞానమును పొందెనని తెలియుచున్నది.

ఈ మధ్య వార్తాపత్రికలలో సాకారుడైన భగవంతుని పట్ల శ్రద్ధ తగ్గుతుందని పేర్కొనబడినది. ప్రజలు రోజురోజుకి మూర్ఖులౌవు తున్నారనేది దీని అర్థం. ఇది కలియుగములో సహజము. కలియుగము అభివృద్ధి చెందుతున్న కొలది శారీరక బలము మేధస్సు మరియు దయ క్షీణించిపోతుంది. ప్రస్తుతం జనులు పూర్వకాలము వారి వలె దృఢంగా లేకపోవుటను మనం వాస్తవంగా గమనించవచ్చును. జనులు తక్కువ జ్ఞాపకశక్తిని కలిగి ఉంటారు. దయ కూడ క్షీణిస్తున్నది. కొన్నిసార్లు జనం ముందే ఎవరైనను చంపబడుతున్నను దానిని లెక్కచేయక పోవుటను చూచి మనం అర్థం చేసుకోవచ్చును. ప్రతిది క్షీణిస్తున్నందున భగవంతుని భక్తి కూడ క్షీణిస్తున్నది. అందుకే సాకార భగవంతునిలో విశ్వాసము సన్నగిల్లుచున్నదనే వార్తలను సహజముగా వింటుంటాము. భగవద్గీత(7.15) భగవంతుని సాకార రూపమును విశ్వసించని వారిని మూఢులని పేర్కొనినది :

న మాం దుష్కృతినో మూఢాః ప్రపద్యన్తే నరాధమాః
మాయయాపహృతజ్ఞానా ఆసురం భావమాశ్రితాః

"చెడుపనులు చేయువారును, మూఢులును, మానవాధములును, మాయచే అపహరింపబడిన జ్ఞానము గలవారును, రాక్షసులకు సంబంధించిన నాస్తిక స్వభావముతో కూడిన వారును నన్ను శరణు పొందజాలరు."

వాస్తవానికి, ప్రస్తుత కాలంలోని జనులకు భగవంతుడంటే అర్థం తెలియదు. కాబట్టి శరణాగతి అనే ప్రశ్నే ఉదయించదు. పండితులు మరియు గొప్ప విద్యావంతులున్నప్పటికినీ వారి జ్ఞానం మాయచేత అపహరింపబడినది. వారు బహిరంగముగా గొప్ప విద్యార్హతలను కలిగి ఉన్నప్పటికిని వారికి నిజమైన జ్ఞానం లేదు : "నేను భగవంతుడను, మీరు భగవంతులు. మీరు భగవంతుని కొరకు ఎందుకు వెదుకుతున్నారు? వీధిలో ఎందరో భగవంతులు తిరుగుచున్నారని వారి క్షేమమును చూడండి అనే అసురులు, రాక్షసులు ఎందరో భగవంతుని ధిక్కరిస్తుంటారు." అందుకే వార్తాపత్రికలలో భగవంతుని సాకార రూపం పట్ల విశ్వాసము సన్నగిల్లు

చున్నదనే వార్తను చూచినప్పుడు ఆశ్చర్యము కలుగుట లేదు. ఏమైనను భగవంతుడు సాకార పురుషుడు. *"యఆద్యో భగవాన్."* బ్రహ్మదేవుడు కూడ శ్రీకృష్ణుని పూజిస్తూ : *"గోవిందమాదిపురుషం తమహం భజామి"* అని స్తుతిస్తున్నాడు. అనగా "నేను ఆదిపురుషుడైన గోవిందుని పూజించెదను." *'ఆదిపురుషమ్'* – శ్రీకృష్ణుడికి మించిన వారెవరు లేరు. కాబట్టి అతడు ఆది అని పిలువబడినాడు. శ్రీకృష్ణుడు వసుదేవునికి జన్మించాడు అంటారు. అంటే వసుదేవుని శ్రీకృష్ణుడు తండ్రిగా అంగీకరించాడు. శ్రీకృష్ణుడు తన భక్తులతో విభిన్న శాంత, దాస్య, సఖ్య, వాత్సల్య మరియు మాధుర్య సంబంధములతో వ్యవహరించును.

ఏదోరకంగా మనమందరము శ్రీకృష్ణుడితో సంబంధమును కలిగి ఉన్నాము. కాని ప్రస్తుతం అది కప్పబడినది. అందుకే దానిని మనం పునరుద్ధరించ వలెను. కేవలం భగవంతుని గురించి తెలుసుకొనుటను శాంతరసము అంటారు. ఎవరైనను భగవంతుని గురించి పూర్తిగా తెలిసికొనినప్పుడు అతనికి సేవ చేయవలెనని ఆశిస్తారు. మరియు అదే దాస్యరసం. ఎవరైనను శ్రీకృష్ణుని సాన్నిహిత్యమును మరింత పొందినప్పుడు అతడు శ్రీకృష్ణునికి స్నేహితుడగును. దీనిని సఖ్యరసం అంటారు. ఎవరైనను మరింత ప్రగతిని సాధించినప్పుడు, అతడు శ్రీకృష్ణుడికి తండ్రి వలె, తల్లివలె సేవ చేయవలెనని ఆశిస్తారు. దానినే వాత్సల్యము అంటారు. తండ్రి లేదా తల్లి అనగా కుమారునికి సేవ చేయుటయే. భగవంతుడిని పరమపితగా కొలిచే క్రైస్తవ మతం పరిపూర్ణమైనది కాదు. ఎందుకనగా, మనం భగవంతుడిని తండ్రిగా అంగీకరించినచో, అతని నుండి సేవలు తీసుకొనుటయే మన స్థితి అగును. ప్రతిఒక్కరు తండ్రివద్ద నుండి దేనినైనను తీసుకోవాలని ఆశిస్తారు. కాబట్టి: "తండ్రి ఇది ఇవ్వండి, తండ్రి అది ఇవ్వండి" అని ఎల్లప్పుడు అడుగుతుంటారు. ఏమైనను, భగవంతుడిని కుమారునిగా అంగీకరించుట అనగా సేవలు అందించుటయే. యశోదామాతకు శ్రీకృష్ణుడు పుత్రుడుగా లభించెను, మరియు అతడు ఎటువంటి ప్రమాదంలో చిక్కుకోకూడదని ఆవిడ ఎల్లప్పుడు ఆవేదన చెందు చుండెడిది. కాబట్టి ఆమె ఎల్లప్పుడు అతడిని సంరక్షించు చుండెను. నిజానికి శ్రీకృష్ణుడు సమస్త లోకాలను సంరక్షించును, కాని యశోద శ్రీకృష్ణుని సంరక్షిస్తుండెను. ఇది వైష్ణవ సిద్ధాంతము. తృణావర్తుడనే రాక్షసుడు శ్రీకృష్ణుడిని తీసుకువెళ్ళుటను చూచి యశోద వ్యథ చెందెను. శ్రీకృష్ణుడు బరువుగా మారినందున ఆ రాక్షసుడు ఆకాశములో ఎగురలేక భూమిపై పడి మరణించెను. యశోద వెంటనే: "భగవంతుడు నా కృష్ణుడిని రక్షించాడు" అని పలికెను. తరువాత ఆమె ఇతర

దేవతలకు కృతజ్ఞతలను తెలుపుకున్నది. ఆమెకు శ్రీకృష్ణుడు దేవాదిదేవుడని తెలియదు. శ్రీకృష్ణుడు దేవాదిదేవుడని యశోదకు తెలిసినచో తల్లి మరియు కుమారునికి గల సంబంధము ఛిన్నాభిన్నమయ్యేది. కాబట్టి శ్రీకృష్ణుడు సాధారణ పిల్లవాని వలె ఆడుచుండెను, మరియు తల్లి యశోద అతడిని కుమారునిగా చూచు చుండెను. శ్రీకృష్ణుని స్నేహితులైన గోపబాలురు కూడ అతడిని భగవంతుడిగా భావించలేదు. గోపికలు శ్రీకృష్ణుడిని దండించేవారు. కనుక భక్తుడు శ్రీకృష్ణునితో ఇలాంటి సంబంధమును కలిగి ఉన్నచో, అతడెందుకు అతనిలో ఐక్యమవ్వాలని కోరుకుంటాడు? భగవంతుడికి తండ్రిగా లేదా భగవంతుడి చేత నియంత్రింపబడేలా ఉండుట మేలు. ఇది భక్తిమార్గం. భక్తియుక్త సేవా మార్గం. భక్తుడు భగవంతునితో సమానమవ్వాలనీ, లేదా అతనిలో ఐక్యమవ్వాలనీ కోరుకొనడు. అతడు కేవలము సేవచేయాలని మాత్రమే కోరుకుంటాడు.

పరమ సత్యమును అర్థం చేసుకోవాలంటే, మనం ముందుగా భగవంతుడు అంటే ఏమిటో అర్థం చేసుకోవలెను. దేవహూతి సాధారణ స్త్రీ కాదు. ఆవిడ గొప్ప యోగి అయినటు వంటి కర్దమమునికి భార్య. ఆవిడ తప్పకుండ తన భర్త నుండి దేనినైనను కొద్దిగా తెలిసికొని ఉండును. ఆవిడ గొప్ప స్త్రీ కానిచో కపిల భగవానుడు ఆమె కుమారునిగా ఎందుకు అవతరించును? ప్రతిఒక్కరు భగవంతుడు అంటే ఏమిటను విషయమును భగవంతుని నుండి తెలుసుకొని ఉపదేశములు పొందవలెను. కపిల భగవానుడు తల్లికి స్వయంగా సాంఖ్య తత్త్వమును ఉపదేశించెను. భగవంతుని పై గల మన నిగూఢమైన ప్రేమను జాగృత పరుచు కోవడమో లేక వృద్ధిచేసుకొనుటనో చేయగలము. మన కన్నులు ప్రేమ అనేడి కాటుకతో అలంకరించ బడినప్పుడు భగవంతుడిని అన్నివేళల అంతటా చూడగలము. భగవంతుడిని కేవలం మన హృదయంలోనే కాకుండ సముద్రము దగ్గరకు వెళ్ళినను అక్కడ భగవంతుడిని తప్ప మరొదానిని చూడము. ఎవరైనను, కొద్దిగా వివేకవంతుడైనచో అతడు మహాసముద్రము ఇటుఅటు తన పరిధులు దాటకూడదని ఆజ్ఞాపించ బడినందున తన పరిమిత ప్రదేశములోనే నిలిచి ఉండుటను గమనించును. వివేకవంతుడు సముద్రతీరంలో నడుస్తున్నను భగవంతుడిని చూడగలడు. ఏమైనను, దీనికొరకు కొద్దిపాటి బుద్ధి అవసరము. మూఢులు, గాడిదలు, దుష్టులు భగవంతుడిని చూడలేరు. కాని జ్ఞానవంతులైన వారు భగవంతుడిని సర్వత్రా చూడగలరు. ఎందుకనగా భగవంతుడు సర్వవ్యాపకుడు. అతడు విశ్వమంతటా కలడు. అంతేకాకుండ, అతడు మన

హృదయములోను మరియు ప్రతి అణువులోను కూడ కలదు. అయినను ఎందుకు అతడిని దర్శించ లేకున్నామని చెబుతుంటాము? “నన్ను ఈ విధముగా దర్శించుటకు ప్రయత్నింపుము, లేనిచో మీరు గొప్ప మందబుద్ధులైనచో నన్ను మరోవిధముగా దర్శించుటకు ప్రయత్నింపుము” అని భగవానుడు చెబుతున్నాడు.

సులభ మార్గమేమిటి? భగవద్గీతలో శ్రీకృష్ణుడు “నేను నీటిలోని రుచిని” అని చెబుతున్నాడు. ఇక్కడ ఎవరైన నీటి రుచిని చూడని వారున్నారా? అతడింకను “నేను సూర్యుని కాంతిని” అని చెబుతున్నాడు. ఇక్కడ సూర్యకాంతిని చూడని వారున్నారా? జనులు ఎందుకు “నేను భగవంతుడిని చూడలేదు” అని చెబుతుంటారు? మొదట మనము భగవంతుని చూచుటకు ప్రయత్నించవలెను. ఇది అ ఆ ఇ ఈల వలెనే సులభమైనది. భగవంతుడిని అంతటా దర్శించగలిగినప్పుడే భగవంతుడి సాకార రూపమును మనం చూడగలము. అప్పుడే మనము దానిని అర్థం చేసుకోగలము.

‘భగవాన్ పుంసామీశ్వరః.’ భగవంతుడు ఈశ్వరుడు, నియంత. మనం స్వతంత్రులము కాదు. ఎవరు కూడ “నేను స్వతంత్రుడను” అని చెప్పలేరు. భౌతిక ప్రకృతి యొక్క త్రిగుణాల చేత బంధింపబడి ఉన్నప్పటికిని మనం స్వతంత్రులమని భావిస్తుంటాము. ఇది కేవలం మూర్ఖత్వము. అందుకే భౌతిక ప్రపంచములోని జనులందరు అజ్ఞానమనే అంధకారములో బంధించ బడినారని చెప్పబడినది. ఎప్పుడైతే జనులు గ్రుడ్డిగా అజ్ఞానముతో, “భగవంతుడు లేడు. నేను భగవంతుడిని చూడలేదు” అనినప్పుడు భగవంతుడు శ్రీకృష్ణుని రూపంలో లేదా కపిలదేవునిగా వచ్చి “ఇక్కడ నేనున్నాను, నా స్వరూపమును దర్శించండి. నేను పురుషుడను. నేను వేణువును వాయిస్తూ వృందావనంలో నాకు నేనుగా ఆనందిస్తుంటాను. ఎందుకు మీరు నన్ను దర్శించలేరు?” అని అంటాడు. అందుకే భగవంతుడు అవతరించి తన గురించి వివరిస్తూ తన ఉపదేశములను, భగవద్గీతను ఉపదేశించి వెళ్ళినను జనులు భగవంతుడిని అర్థం చేసుకోలేమని గొప్ప మూర్ఖత్వముతో వాదిస్తారు. మనం కనుక కపిలుడు దేవహూతికి ఇచ్చిన ఉపదేశముల ద్వారా భగవంతుడిని దర్శించుటకు ప్రయత్నించినచో మన జీవితాలు పరిపూర్ణము లగును.

శ్లోకము 10

అథ మే దేవ సమ్మోహమపాక్రష్టుం త్వమర్హసి
యోఽ వగ్రహోఽ హం మమేతీత్యేతస్మిన్ యోజితస్త్వయా

ఓ ప్రభు! నాపై ప్రసన్నుడవై నా గొప్పమోహమును ఇప్పుడు నశింప జేయుము. మిథ్యాహంకార కారణమున నీ మాయచే నడుపబడి దేహాత్మభావనలో మరియు తత్ఫలస్వరూపమగు దేహ సంబంధములందు లగ్నమైతిని.

భాష్యము : మిథ్యాహంకారముతో దేహాత్మభావన కలిగియుండి, దేహ సంబంధమున కలిగియున్న వాటిపై అధికారమును ప్రకటించుట 'మాయ' అని పిలువబడును. "తాను ఎల్లరి హృదయములలో విరాజమానుడనై యున్నాననియు, తన నుండియే ఎల్లరకు స్మృతి మరియు విస్మృతి కలుగు చున్నదనియు" భగవద్గీత యందలి పదునైదవ అధ్యాయమున శ్రీకృష్ణభగవానుడు తెలుపుచున్నాడు. దేహముతో ఆత్మ యొక్క మిథ్యా తాదాత్మ్యము మరియు దేహపరములైన ఉపాధుల యెడ అనురక్తి యనునవి సైతము భగవన్నిర్దేశము వలననే కలుగుచున్నవని దేవహూతి పలికినది. దీనిభావము భగవానుడు పక్షపాతమును చూపుచు ఒకరిని భక్తియోగము నందు, మరొకరిని ఇంద్రియ భోగము నందు నిలుపుననియా? ఒకవేళ ఇదే సత్యమైనచో భగవానుని తరపున అది విరుద్ధమగు విషయము కాగలదు. కాని అది సత్యము కాదు. జీవుడు తనకు భగవానునితోగల నిజస్థితిని విస్మరించి, ఇంద్రియ భోగరతుడు కాగోరినపుడు వెంటనే మాయచే బంధితుడగును. దేహముతో చైతన్యము యొక్క మిథ్యాతాదాత్మ్యము మరియు దైహికసంపత్తుల యెడ ఆసక్తియే ఈ 'మాయా' బంధము; ఇవన్నీయును 'మాయ' యొక్క కర్మలు. 'మాయ' కూడ భగవానుని ప్రతినిధియే కనుక అది పరోక్షముగా భగవానుని కర్మయే అగును. భగవానుడు దయామయుడు కనుక ఎవరైనను అతడిని విస్మరించి ఈ భౌతిక జగమును భోగింప గోరినచో ప్రత్యక్షముగా కాకుండ తన భౌతికశక్తి ద్వారా ఆతడు పూర్తి సౌకర్యములను ఒసగును. అనగా భౌతికశక్తి యనునది భగవచ్ఛక్తియే కనుక భగవానుడే తనను మరచుటకు పరోక్షముగా దోహద పడుచున్నాడు. కనుకనే దేవహూతి : "నేను ఇంద్రియ భోగము నందు లగ్నమగుట కూడా నీ కారణముననే జరిగినది. ఇప్పుడు దయతో ఈ బంధము నుండి నన్ను విముక్తురాలను జేయుము" అని పలికెను.

భగవత్కరుణ చేతనే జీవుడు ఈ భౌతిక జగమునందు భోగించుటకు అనుమతింప బడును. కాని దానితో అతడు విసుగుచెంది భంగపడి, ఆ పిదప శ్రీకృష్ణభగవానుని చరణ కమలములను శ్రద్ధతో శరణు జొచ్చినప్పుడు కరుణాంత రంగుడైన ఆ దేవాదిదేవుడు అతడిని బంధవిముక్తుని చేయును. కనుకనే భగవద్గీత యందు శ్రీకృష్ణుడు : "మొట్టమొదట నాకు శరణము నొందుము; పిదప నీ

బాధ్యతను నేను స్వీకరించి సర్వ పాపఫలితముల నుండి నిన్ను నేను విముక్తుని చేయుదును" అని పలికెను. భగవానునితో గల సంబంధమును విస్మరించి చేసిన కర్మలే పాపకర్మలు. ఈ భౌతిక జగమందు పుణ్యప్రదములుగా భావింపబడు భౌతిక భోగకర్మలు కూడా పాపభూయిష్టములే. ఉదాహరణకు ధనార్థికి ఎవరైనా ధన సహాయము చేసినప్పుడు దానికి నాలుగురెట్లు తిరిగి పొందవలెననెడి భావనతో ఆ కార్యమును చేస్తుంటారు. ఏదైనను తిరిగి పొందవలెననెడి ప్రయోజనముతో చేయబడు దానము రజోగుణ దానమని పిలువబడును. ఈ జగమునందు చేయబడు ప్రతిదియు త్రిగుణముల ఆధీనములో చేయబడును. కనుకనే ఒక్క కృష్ణసేవ తప్ప సమస్త కార్యములు పాపభూయిష్టములే. అట్టిపాపకార్యముల కారణముననే మనము భౌతికాసక్తి యనెడి మాయకు ఆకర్షితులమై 'ఈ దేహమే నేను' అని భావిస్తుంటాము. ఆ విధముగా దేహమునే నేనని భావిస్తూ, దేహమునకు సంబంధించిన వానిని 'నావి' అని భావించుట జరుగుచుండును. అట్టి మిథ్యాతాదాత్మ్యము మరియు మిథ్యాస్వామిత్వము నుండి తనను విముక్తురాలను చేయుమని దేవహూతి కపిల భగవానుని ప్రార్థించినది.

ఈ విధముగా ప్రార్థిస్తూ దేవహూతి తన కుమారుడైన కపిల దేవుడిని గురువుగా అంగీకరిస్తున్నది. కాబట్టి దానికి ఫలితముగా అతడు భౌతిక సమస్యలను ఎలా పరిష్కరించవలెనో తెలియజేయును. భౌతిక జీవనము అనగా కేవలము మైథున సంభోగము పట్ల ఆసక్తి తప్ప మరొకటి కాదు. "*పుంసః స్త్రీయా మిథుని భావమేతమ్.*" (శ్రీమద్భాగవతము 5.5.8) భౌతిక జీవితమనగా పురుషులు స్త్రీల కొరకు మరియు స్త్రీలు పురుషుల కొరకు ప్రాకులాడు తుంటారు. దీనిని కేవలం మానవ సమాజంలోనే కాకుండ పక్షి, కుక్క, పిల్లి మరియు దేవతల సమాజములో కూడ ఉండుటను మనం చూడవచ్చును. ఈ మైథున సంభోగములో సంతృప్తి పొందుటకు ప్రజలు ప్రయత్నించునప్పుడు వెంటనే ఆసక్తి అనేది పెరుగుతూ పోవును. ఏకాంతము కొరకై గృహము అవసరమై ఉండును. జీవనోపాధి కొరకు డబ్బును సంపాదించు కోవలెను. భూమి అవసరమై ఉండును. పిల్లలు లేని వివాహజీవితము నిరాశను కలిగించును. మరియు సంతానమును విద్యావంతులుగా తీర్చిదిద్దవలెను. ఇలా ఎన్నో పరిస్థితులను సృష్టించుకొనుచు భౌతిక జీవితములో బంధించ బడుతుంటారు. కాని శ్రీకృష్ణుడు మృత్యురూపంలో గృహం, భూమి, భార్య, సంతానం, స్నేహితులు, కీర్తి నన్నింటిని తీసుకువెళ్ళును. తిరిగి మనము మరో జీవితమును ప్రారంభించ వలసి వచ్చును. మరణించుట వలన శరీరము మాత్రమే అంత

మగును, అంతేకాని సర్వం(ఆత్మ)నశించదు. మనము శాశ్వతముగా జీవించుదుము. మరియు మనం 84 లక్షల జీవరాసులలోని ఏదోఒక శరీరమును అంగీకరించవల్సి వస్తుంది. ఈ విధముగా జీవితము ముందుకు కొనసాగుతుంది. అయినను మనం భార్యపిల్లలు మొదలగు వాటిగురించి ఆలోచిస్తుంటాము. ఇది అంతయు భ్రాంతి.

ఏ పరిస్థితులలోను మనం ఇక్కడ నివసించుటకు అనుమతించ బడము. మనమెన్నింటితో సంబంధమును కలిగి ఉన్నను, మరణ సమయంలో సర్వం కొనిపోబడును. ఏ పదవులను మనం ఆక్రమించినను అది అధ్యక్షుడైనను లేదా బ్రహ్మదేవుడైనను వాటినన్నింటిని తాత్కాలికముగానే అక్రమిస్తున్నాము. మనము ఇక్కడ ఐదు లేదా పది, వంద సంవత్సరాలు లేదా 50 లక్షల సంవత్సరాలు జీవించవచ్చును. ఏమైనను మన స్థితి పరిమితమైనది. భౌతిక లోకంలోని మన స్థితి అశాశ్వతమైనది. ఏమైనను మనం శాశ్వతుల మైనప్పటికినీ అశాశ్వతమైన వానిపట్ల భ్రాంతి చెందుతుంటాము? స్వభావసిద్ధంగా మనము శ్రీకృష్ణుడి అంశలము మరియు శ్రీకృష్ణుడు సచ్చిదానంద స్వరూపుడు. మనము భౌతిక జీవితపు అంధకారమును అధిగమించుటకు మరియు జ్యోతిమయమైన ఆధ్యాత్మిక లోకమును చేరుటకు గురువును ఆశ్రయించ వలెను. ఈ కారణం వలననే దేవహూతి కపిల భగవానుని ఆశ్రయిస్తున్నది.

తెల్లవారు జామున సూర్యుడు ఉదయించగానే రాత్రి చీకటి తొలగిపోవును. అదేవిధముగా భగవంతుడు లేదా అతని అవతారము వచ్చినపుడు భౌతిక జీవితపు అంధకారము తొలగిపోవును. దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడు వచ్చినప్పుడు అర్జునుడి భ్రాంతి తొలగిపోయెను. "ఎందుకు నేను నా బంధువులతో యుద్ధం చేయాలి" అని అర్జునుడు ఆలోచిస్తుండెను. వాస్తవానికి ఈ ప్రపంచమంతటా ఈ 'నా' 'నాది' అనే పద్ధతిలోనే కొనసాగుచున్నది. దేశాలమధ్య, సమాజాల మధ్య, వర్గముల మధ్య మరియు కుటుంబముల మధ్య గొడవలు జరుగుచున్నవి. "ఎందుకు నా పనికి అడ్డుపడుచున్నావు?" అని జనులు భావిస్తుంటారు, ఇక అప్పుడే గొడవ మొదలగును. మనం భ్రాంతిలో ఉన్నందున, ఈ పరిస్థితులన్నియు తాత్కాలికమని గుర్తించ లేకున్నాము. రైలు బండిలో చోటు కోసం జనులు వాదించు కోవచ్చును. కాని ఎవరైతే తాను ఈ రైలు బండిలో రెండు మూడు గంటలు మాత్రమే ఉండునని తెలుసుకొనునో వారు ఇలా ఆలోచిస్తారు : "ఎందుకు నేను వాదించవలెను? కొద్దిసేపు మాత్రమే ఇక్కడ ఉంటాను." కాని మరొక వ్యక్తి అతడి చోటు శాశ్వతమని భావిస్తూ గొడవకు సిద్ధపడును. ఎవరు కూడ ఈ భౌతిక ప్రపంచములో ఉండుటకు

అనుమతించ బడలేదు. ప్రతిఒక్కరు శరీరము మరియు స్థితిని మార్చుకోవలసి వచ్చును. అంతేకాకుండ, ఇక్కడ జీవించి ఉన్నంత కాలము, అతడు జీవిత పోరాటమును సలుపును. ఇది భౌతిక జీవితము. మనం తాత్కాలిక ఏర్పాట్లను చేసుకున్నను చివరికి ఈ భౌతిక ప్రపంచము దుఃఖాలయము.

ఈ భౌతిక ప్రపంచము పట్ల మనము ఆసక్తిని కలిగి ఉన్నాము, కాని వైదిక పద్ధతి ననుసరించి వైరాగ్యమనునది ఎంతో అవసరము. ఎందుకనగా, యాభై సంవత్సరాలు నిండిన వారెవరైనను కుటుంబ జీవితమును త్యజించ వలెను. "నీకు యాభై సంవత్సరాలు నిండినవి. ఇంతవరకు నీవు ఈ భౌతిక లోకంలో పోరాడినావు, ఇకపై ఈ పనిని చాలింపుము" అని ప్రకృతి హెచ్చరించును. పిల్లలు సముద్ర తీరంలో ఇసుకతో గూళ్ళు కట్టుకొంటూ ఆడుకొంటుంటారు. కొంత సమయము తరువాత తండ్రి వచ్చి : "నా ప్రియమైన పిల్లలారా! ప్రస్తుతం సమయం గడిచిపోయింది, ఈ పనిని ఆపి ఇంటికి పదండి" అని చెబుతుంటాడు. అదేవిధముగా, శిష్యులకు వైరాగ్యమును నేర్పించుట గురువు యొక్క ధర్మం. ఈ ప్రపంచము మన నివాసస్థలం కాదు. మన నివాస స్థలం వైకుంఠ లోకం. శ్రీకృష్ణుడు కూడ దీనిని గుర్తు చేయుటకు వచ్చును. మన ధర్మం, భగవంతుని ఆదేశం, పరమ పురుషులకు భక్తులమై సర్వదా భగవంతుని గురించియే ఆలోచించవలెను. శ్రీకృష్ణుడు ఇలా చెబుతున్నాడు :

మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు

"నీ మనస్సు సర్వదా నన్ను గూర్చి ఆలోచించుట యందే యుండునట్లు నీవు నిమగ్నుడవు కమ్ము. నా భక్తుడవు కమ్ము. నన్ను పూజింపుము. నాకు నమస్కరింపుము." (భ.గీ. 9.34)

ఈ విధముగా, శ్రీకృష్ణుడు ద్వారమును తెరుచును, కాని మనం దురదృష్టవశాత్తు అతడిని అంగీకరించము. శ్రీకృష్ణుడు అర్జునునికి ఇట్లు చెబుతున్నాడు : "నీవు నా మిత్రుడవు కావున నేను నీకు అత్యంత రహస్యమైన ధర్మమును తెలియ జేస్తున్నాను." మరి అది ఏమిటి? "కేవలం నన్ను శరణు పొందండి." ఇదే భగవంతుడు తెలిపిన ధర్మం. అంతేకాకుండ శ్రీకృష్ణుని అవతారములు మరియు అతని భక్తులు కూడ అదే ధర్మమును బోధిస్తుంటారు.

మనమందరము ఆనందము కొరకు ప్రాకులాడు తుంటాము. కాని ఈ ఆనందమును ఎలా అనుభవించాలో మనకు తెలియదు. మనము మన

ఇంద్రియాలను అనుభవించా లనుకుంటాము, కాని మాయ పొరలతో కప్పబడిన జడ ఇంద్రియాలతో అది సాధ్యపడదు. ఇంద్రియాల పొరలను తొలగింప వలెను, మరియు అదే శుద్ధికరణ ప్రక్రియ. మనము మన గురించి ఎన్నో భౌతిక మిథ్యా ఉపాధుల ననుసరించి ఆలోచిస్తుంటాము. కాని మనము శ్రీ చైతన్య మహాప్రభువు ఆదేశములను అంగీకరించవలెను : *"జీవేర్ స్వరూప్ హోయ్ కృష్ణేర నిత్యదాస్"* – "నేను శ్రీకృష్ణుడి శాశ్వత సేవకుడను" అను స్థితికి మనం తప్పక రావలెను. ఏది ఏమైనను మన ఇంద్రియాలు ఇతరుల కొరకు లేక మన సంతృప్తి కొరకు పని చేయుచున్నవి. అవి కామ, క్రోధ, లోభ, మదమాత్సర్యం – మాయ కోసం మనం మన కామప్రేరిత ఇంద్రియాలను సేవించనప్పుడు కోపాన్ని సేవిస్తుంటాము. నేను కనుక క్రోధమునకు నియంత్రికుడనైనచో కోపమును నియంత్రించ గలను, మరియు నేను కనుక నా కోరికలకు నియంత్రికు డైనప్పుడు కోరికలను నియంత్రించ గలను. అన్ని పరిస్థితులలోను నేను ఒక సేవకుడను మరియు నాసేవను శ్రీకృష్ణుడి వైపునకు మరల్చవలెను. అదే జీవిత సంసిద్ధి.

మనము ఆధ్యాత్మిక స్థితిలో(భక్తి) నెలకొనినప్పుడు శ్రీకృష్ణుడిని అర్థం చేసుకోగలము. శ్రీకృష్ణుడు మానసిక ఊహాకల్పనల చేత అర్థం కాడు. లేనిచో, అతడు తాను జ్ఞానంద్వారా, కర్మద్వారా లేదా యోగద్వారా అర్థమగునని చెప్పెడి వాడు. ఏమైనను అతడు స్పష్టంగా వివరిస్తున్నాడు : *"భక్త్యామామభిజానాతి"* – కేవలం భక్తియుక్త సేవ ద్వారానే నన్ను అర్థం చేసుకోగలరు. శ్రీకృష్ణుడిని యదావిధిగా తెలుసు కోవాలనుకున్నచో, భక్తిమార్గమును అంగీకరించవలెను. దేవహూతికి కపిలదేవుడు ఈ భక్తి మార్గమునే వెల్లడించెను.

శ్లోకము 11

తం త్వా గతాహం శరణం శరణ్యం
స్వభృత్యసంసారతరోః కుఠారమ్
జిజ్ఞాసయాహం ప్రకృతేః పూరుషస్య
నమామి సద్ధర్మవిదాం వరిష్ఠమ్

దేవహూతి ఇట్లు కొనసాగించెను : ఏకైక శరణ్యుడవైనందున నీ చరణకమలాలను నేను ఆశ్రయించితిని. సంసార వృక్షమునకు నీవు గొడ్డలి వంటి వాడవు. కనుకనే యోగిశ్రేష్ఠుడవగు నీకు ప్రణామములను నర్పించుచు ప్రకృతి

పురుషుల నడుమ సంబంధమును, భౌతిక, ఆధ్యాత్మిక సంబంధమును తెలిసికొన గోరుచున్నాను.

భాష్యము : సాంఖ్యతత్త్వము ప్రకృతి మరియు పురుషుని గూర్చి చర్చించును; ఇది సర్వవిదితమగు విషయమే. 'పురుషుడు' అనగా దేవాదిదేవుడగు భగవానుడు లేదా భోక్తగా భగవానుని అనుకరించువాడు అని భావము; ఇక 'ప్రకృతి' యనగా భౌతిక ప్రకృతియని భావము. భౌతిక జగమునందు పురుషులచే లేదా జీవులచే ప్రకృతి కొల్లగొట్టబడి తమ లాభమునకై వినియోగించు కొనబడుచుండును. భౌతిక జగత్తులో ప్రకృతి పురుషుల (భోగ్యము మరియు భోక్త) సంబంధపు మర్మములే "సంసారము" భవబంధము అని పిలువబడును. దేవహూతి ఆ సంసార వృక్షమును ఖండింపగోరి, దానికి తగిన ఆయుధమును కపిలముని యందు గాంచినది. సంసార వృక్షము భగవద్గీతలోని పదునైదవ అధ్యాయమున 'అశ్వత్థవృక్షము' (వ్రేళ్ళు ఊర్ధ్వముగాను, శాఖలు క్రిందికి కలిగినట్టిది) అని వర్ణింపబడినది. అనాసక్తి అనెడి గొడ్డలితో ఆ సంసారవృక్షపు మూలమును మనుజుడు ఖండింప వలెనని అచ్చట ఉపదేశించ బడినది. ఇంతకు ఆసక్తి అనగానేమిటి? ఆసక్తి అనునది ప్రకృతి పురుషులను గూడియుండును. జీవులు భౌతిక ప్రకృతిపై ఆధిపత్యము చెలాయించ వలెనని యత్నించు చుందురు; ఆ విధముగా భౌతికప్రకృతిని తన భోగ్యవస్తువుగా గ్రహించి భోక్తస్థానమును ఆక్రమించు చున్నందున బద్ధజీవుడు 'పురుషుడు' అని పిలువ బడుచున్నాడు.

భౌతిక జగత్తు నెడ తనకు గల ఆసక్తిని కేవలము కపిల భగవానుడే ఛేదింప గలుగునని యెరిగి యున్నందున దేవహూతి ఆతడినే ప్రశ్నించినది. జీవులు స్త్రీ, పురుషుల ముసుగులో ప్రకృతిని భోగింప యత్నించుచున్నారు; కనుక ఒకరకంగా ప్రతియొక్కరు పురుషుడే. ఏలయన 'పురుషుడు' అనగా భోక్తయనియు, 'ప్రకృతి' అనగా భోగ్యవస్తువనియు భావము. ఈ భౌతిక జగమునందు నామమాత్రపు పురుషుడు, స్త్రీ అని పిలువబడేవారు ఇరువురును నిజమగు పురుషుని అనుకరించు చున్నారు. కాని ఆధ్యాత్మిక భావన యందు దేవాదిదేవుడే నిజమైన భోక్త కాగా ఇతరులందరు ప్రకృతియై యున్నారు. అనగా జీవులు ప్రకృతిగా భావింపబడుదురు.

భగవద్గీత యందు భౌతికపదార్థము 'అపర' (గౌణప్రకృతి)యని వివరింప బడగా, ఆ గౌణ ప్రకృతికి అతీతముగా దివ్యప్రకృతి(జీవులు) వేరొకటి కలదు. అనగా జీవులు కూడా ప్రకృతియే(భోగ్యులే); కాని మాయా ప్రభావమున వారు

భోక్తల స్థానమును ఆక్రమించవలెనని తప్పుగా యత్నించుచున్నారు. అదియే సంసార బంధమునకు(బద్ధజీవనమునకు) కారణము. అటువంటి బద్ధజీవనము నుండి బయటపడి, సంపూర్ణ శరణాగతిని చేసుకోవలెనని దేవహూతి కోరినది. భగవానుడు సమస్తైశ్వర్య సంపన్ను డైనందున సర్వులకు శరణ్యుడై యున్నాడు; అనగా ఎవరైనను సంపూర్ణముగా శరణము నొందగల ఏకైక యోగ్యుడగు పురుషుడని భావము. ఎవరేని నిజముగా విముక్తిని పొందగోరినచో, దేవాదిదేవునికి శరణము నొందుటయే ఉత్తమోత్తమ మార్గము. భగవానుడు ఇచ్చట *'సద్ధర్మవిదాం వరిష్ఠమ్'* అని వర్ణింప బడినాడు. దివ్యకర్మల నన్నింటి యందు దేవాదిదేవునికి శాశ్వతమైన ప్రేమయుక్త సేవను గూర్చుటయే పరమశ్రేష్ఠ కర్మయని అది సూచించుచున్నది. 'ధర్మము' అనునది కొన్నిమార్లు మతము అని అనువదింప బడుచుండును; కాని అది సరియైన అర్థము కాదు. 'త్యజింపరానిది' లేదా 'విడదీయరానిది' అనుటయే ధర్మమనుదానికి నిజమగు అర్థము. ఉష్ణము అగ్ని నుండి విడదీయ బడనట్టిది; కనుక అది అగ్ని యొక్క ధర్మము లేదా స్వభావ మనబడును. అదేవిధముగా 'సద్ధర్మము' అనగా శాశ్వత ధర్మమని భావము. దేవాదిదేవుడగు శ్రీకృష్ణభగవానుని దివ్యమగు ప్రేమయుక్త సేవ యందు నెలకొనుటయే జీవుని శాశ్వత ధర్మము. కపిలదేవుని సాంఖ్య తత్త్వ ప్రయోజనము విశుద్ధమగు భక్తియుక్త సేవను వృద్ధిచేయుటయే; కనుకనే అతడు జీవుని దివ్యధర్మము నెరిగినవారిలో ప్రధానుడిగా ఇక్కడ సంబోధింపబడెను.

ముందుగా చెప్పుకున్నట్లుగా, దేవాదిదేవుడు ప్రతిఒక్కరికి నిజమైన ఆశ్రయుడు*(శరణం శరణ్యమ్)*. అందరు ఆయన ఆశ్రయమును కోరుతుంటారు. ఎందుకనగా, మన నిజస్థితిలో మనమందరము సేవకులము. నిజానికి, మనము భగవంతుని సేవకులము. కాబట్టి అతడిని ఆశ్రయించుటయే మన స్వభావము. కొందరు గొప్పవ్యక్తికి సేవ చేయాలనుకుంటారు. మరికొందరు ప్రభుత్వానికి లేదా మరెవరికో సేవ చేయాలనుకుంటారు. ఏ పరిస్థితులలోనైన పరమాశ్రయము దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడు మాత్రమే. శ్రీకృష్ణుని అవతార మైనందున కపిలదేవుడు కూడ ఆశ్రయుడు. శ్రీకృష్ణుడు, అనంత రూపాలు మరియు అనంత అవతారములను కలిగి ఉన్నాడు. శ్రీమద్భాగవతములో అతని అవతారములు సముద్రములోని అలల వలె నిరంతరము విస్తరిస్తున్నాయని పేర్కొనబడెను. వాస్తవానికి వాటిని మనం లెక్కించలేము. 'బ్రహ్మ సంహిత' లో : *"అద్వైతమచ్యుతమనాదిమనంత రూపమ్"* అని చెప్పబడినది. భారతదేశంలో వేలకొలది మందిరాలు కలవు, మరియు ఈ మందిరా లన్నింటిలోను అర్చావిగ్రహాలు కలవు. ఈ కృష్ణులందరు భిన్నులు కారు.

అవన్నీ ఒక్కటే. శ్రీకృష్ణుడు వైకుంఠములోనే కాకుండ మందిరములలో కూడ వసించును. శ్రీకృష్ణులందరు అనంతులైనను వారు భిన్నమైన వారు కాదు. శ్రీకృష్ణుడు అనంతమైనను అతడు అందరి హృదయాలలో నెలకొని ఉన్న సాక్షి. అంతేకాకుండ అతడు మన కార్యముల నన్నింటిని గమనిస్తున్నాడు. అతడి నుండి దేనిని మనము దాచలేము. మరియు శ్రీకృష్ణుడు జీవుల హృదయములో ఉండి సాక్షిగా చూస్తున్నాడు. కాబట్టి మనము మన కర్మ ఫలితాల నన్నింటిని పొందుదుము. శ్రీకృష్ణుని దృష్టి నుండి మనము తప్పించుకోలేము. శ్రీకృష్ణుని అనుమతి లేకుండ, మనము దేనినీ చేయలేము. మనం తప్పు చేస్తుండుటను శ్రీకృష్ణుడెందుకు అనుమతిస్తున్నాడు? నిజానికి, అతడు మనలను తనను శరణుపొందుమని మాత్రమే తెలుపును. అంతకుమించి మరేమి మనకు చేయుమని చెప్పుట లేదు. కాని మన బలవంతము వలననే అతడు అలా చేయును. మనము దేనినైనను చేయాలను కున్నచో శ్రీకృష్ణుడు దానిని అంగీకరించ వచ్చును. కాని ఆ పనికి మనమే బాధ్యతను వహించవలసి వస్తుంది. కాని శ్రీకృష్ణుడు దానికి బాధ్యుడు కాడు. ఏమైనను, శ్రీకృష్ణుని అనుమతి లేకుండ దేనిని మనము చేయలేమని మనము తెలుసుకోవలెను. అది సత్యం. నిజానికి మనం మన నిజ స్వరూపములో శ్రీకృష్ణుని సేవకులము. నిజానికి మనం స్వతంత్రులమని ప్రకటించు కున్నప్పటికిని మనము స్వతంత్రులము కాము. అంతేకాకుండ మనము సేవకులమైనను కపటత్వముతో స్వతంత్రులమని ప్రకటిస్తున్నాము. మనం దేవాదిదేవునిపై ఆధారపడినట్టి వారమని అర్థం చేసు కొనుటయే ఆత్మసాక్షాత్కారము. శ్రీ చైతన్య మహాప్రభువు చెబుతున్నట్లుగా,

అయి నందతనుజ కింకరం పతితం మాం విషమే భవాంబుధౌ
కృపయా తవ పాదపంకజస్థితధూళీసదృశం విచింతయ

"ఓ నందనందనా (శ్రీకృష్ణా)! నేను నీ నిత్య సేవకుడనైనను, ఏదియో ఒక కారణము చేత ఈ జన్మమృత్యు సాగరమున బడితిని. కనుక ఈ భవసాగరము నుండి నన్ను ఉద్ధరించి నీ పాదపద్మముల చెంత ఒక రేణువుగా నిలుపుకొనుము." (శిక్షాష్టకము 5) మనము మాయలో నున్నందున, దేవహూతి ఇలా చెబుతున్నది : "*స్వభృత్యసంసార తరోః కుతారమ్.*" భగవద్గీత(15.1-4)లో భౌతిక జగత్తు మూలములు పైకి మరియు దాని కొమ్మలు క్రిందకు గల మఱ్ఱి వృక్షముచే పోల్చబడినది. ఈ వృక్షపు మూలములు ఎంత దృఢంగా నుండినను వాటిని గొడ్డలి *(కుతారం)* తో ఖండించ వచ్చును. శ్రీకృష్ణుని పాదపద్మములను ఆశ్రయించుట వలన మనం భౌతిక

సంసారపు దృఢమైన మూలములను ఖండించగలము. ఎందుకంటే, మనం శ్రీకృష్ణుని సేవను విస్మరించి ఇతరమైన వాటికెన్నింటికో సేవకులమైనాము. మనము తల్లిదండ్రులకు, భార్యపిల్లలకు, దేశము మొదలగు వాటికి సేవ చేయుటమనేది తప్పని సరైనది. మనమెందరో మానవులకు, ఉష్ణము మరియు కాంతిని ఇచ్చే దేవతలెందరికో ఋణపడి ఉన్నాము. సూర్యకాంతి మరియు సూర్యుని వేడి యొక్క లాభమును పొందుతున్నను మనం ఎటువంటి మూల్యమును చెల్లించుట లేదు. విద్యుత్తును ఉపయోగిస్తే మనం దానికి డబ్బును చెల్లించవలసి వచ్చును. కాని, మనం సూర్యునికి ఎటువంటి పన్నును చెల్లించము. కాబట్టి మనం సూర్యదేవుడైన వివస్వంతునకు ఋణపడి ఉన్నాము. ఆ విధముగా స్వర్గాధిపతియైన ఇంద్రుడు నీటిని వర్షరూపంలో సరఫరా చేయును. మూఢులు ఇవన్నియు ప్రకృతి నుండి లభిస్తున్నాయని చెబుతుంటారు. కాని ప్రకృతి కూడ నియంత్రించ బడునని వారికి తెలియదు. యజ్ఞరూపంలో మనం పన్నులు కట్టనిచో కరువు తప్పకుండా ఏర్పడును. ఎందుకంటే, ఇవన్నీ పరమపితయైన దేవాదిదేవుని నుండి లభిస్తున్నవి. కాని మనం వాటిని ప్రకృతి నుండి లభిస్తున్నవని భావిస్తూ, పన్నులు కట్టుచున్నామా లేదా అనే ఆలోచన కూడ లేకుండా వాటిని ఉపయోగించు కుంటున్నాము. మన తండ్రి సంపదను మనము అనుభవించవచ్చును. కాని ప్రస్తుత పరిస్థితిలో మనం మన తండ్రికి పుత్రులుగా నడుచుకొనుట లేదు. మనం మాయ యొక్క పుత్రులము. మనం మన తండ్రిని లెక్కించుట లేదు. ఏమైనను, అది భగవంతుని ఆధీనములో ఉండి పని చేయుచున్నది. మనమతడిని లెక్కచేయనిచో, ప్రకృతి తన సరఫరాను తగ్గించును. ఎందుకంటే అసురులు వృద్ధి అగుటకు ప్రకృతి అనుమతి నివ్వదు. భగవద్గీత(16.19) లో తెలుపుచున్నట్లుగా :

తానహం ద్విషతః క్రూరాన్ సంసారేషు నరాధమాన్
క్షిపామ్యజస్రమశుభానాసురీష్వేవ యోనిషు

"అసూయ గలిగినట్టియు, క్రూరులైనట్టియు, అధములైనట్టియు, దుష్టులైనట్టియు వారిని నేను శాశ్వతముగా సంసార సముద్రమునందు అన్ని విధములైన అసుర జీవజాతుల యందు త్రోయుదును."

రాక్షసులు శిక్షించబడుటకు అర్హులు. మరియు గొప్ప రాక్షసులైన రావణుడు, హిరణ్యకశిపుడు భగవంతుడి చేత స్వయంగా అంతమొందింప బడ్డారు. మరియు సాధారణ అసురులు భౌతిక ప్రకృతి నియమాల చేత శిక్షింపబడుదురు. చిన్నచిన్న

అసురులను సంహరించుటకు శ్రీకృష్ణుడు స్వయంగా రావలసిన అవసరము లేదు. కాని రావణుడు, హిరణ్యకశిపుడు మరియు కంసుడు వంటి గొప్ప రాక్షసులున్నప్పుడు భగవంతుడు రామచంద్రునిగా, నరసింహునిగా మరియు స్వయంగా శ్రీకృష్ణుడుగా అవతరించి శిక్షించును. మనం శిక్షింప బడదలచు కొననిచో, మనం సద్ధర్మము అనగా నియమ నిబంధనలను అనుసరించ వలెను. ధర్మము అనగా 'భగవంతుడి చేత ఇవ్వబడిన నియమాలు'. *"ధర్మం తు సాక్షాద్ భగవత్ ప్రణీతమ్."* అనగా భగవంతుడి చేత మనుసంహిత మరియు ఇతర వైదిక సాహిత్యాలలో ఇవ్వబడిన నియమములు. చట్టప్రకారం మనము ప్రభుత్వానికి విధేయులమై ఉండవలెను, అంతేకాకుండ, ధర్మము ననుసరించి మనం భగవంతుడికి, శ్రీకృష్ణుడికి విధేయులమై ఉండవలెను. మనము మన ఇంట్లో ప్రభుత్వ చట్టాలను తయారు చేయలేనట్లు గానే ధర్మమును కూడ తయారు చేయలేము. ఎవరైనను అలా తయారు చేయుటకు ప్రయత్నించినచో, అది కేవలం జనాన్ని మోసగిస్తున్నట్లే అర్థం. అటువంటి కపట ధర్మములు శ్రీమద్భాగవతము(1.1.2) లో ఖండించబడినవి : *"ధర్మః ప్రోజ్ఝిత."* శ్రీకృష్ణుడు నిజమైన ధర్మమును స్థాపించెను. అదే, *"సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ."* (భ.గీ. 18.66) ఇతర ధర్మములన్నీ కేవలం మోసపూరితమైనవి. మనం భగవద్గీత సిద్ధాంతాలను తప్పక అంగీకరించవలెను. అవి ధర్మం యొక్క అ ఆ ఇ ఈలు. నిజానికి మనం శ్రీకృష్ణునికి శరణు పొందాలనే ఆదేశమును అంగీకరించవలెను, కాని ఈ అంగీకారము ఎన్నో జన్మల తరువాతనే వస్తుంది. ఇది సులభము కాదు. అనేక జన్మల పోరాటము తరువాత నిజమైన భక్తుడు పరిపూర్ణత్వమును సాధించి శ్రీకృష్ణునికి శరణాగతి చేసుకొనును. ఆ సమయంలో అతడు వాసుదేవ శ్రీకృష్ణుడు సర్వం అని పరిపూర్ణంగా అర్థం చేసుకొనును. ఇది భగవద్గీత యొక్క సర్వోన్నత ఆదేశము. సర్వం శ్రీకృష్ణుని శక్తియే, మరియు మనం చూస్తున్నదంతయు రెండు విభిన్న శక్తుల ప్రదర్శణయే. సూర్యునకు వేడి మరియు వెలుతురు అనే రెండు శక్తులు కలవని అందరికి తెలుసును. అదేవిధముగా శ్రీకృష్ణునకు కూడ బహిరంగ మరియు అంతరంగిక శక్తులు కలవు. అతడు తటస్థ శక్తిని కూడ కలిగి ఉన్నాడు. ఇది అంతరంగ మరియు బహిరంగ శక్తుల మిశ్రమము. బహిరంగ శక్తి అనగా ఈ భౌతిక జగత్తు, అంతరంగిక శక్తి అనేది ఆధ్యాత్మిక జగత్తు మరియు తటస్థశక్తి జీవులు. జీవులు తటస్థ శక్తి ఎందుకనగా వారు భౌతిక జగత్తులో లేదా ఆధ్యాత్మిక జగత్తులోనైన నివసించ వచ్చును. భగవద్గీత క్షర మరియు అక్షర అనే రెండు రకాల జీవాత్మల గురించి వర్ణించును. వీరు

భౌతిక జగత్తులో ఉండేవారు మరియు ఆధ్యాత్మిక జగత్తులో ఉండేవారు. ఎవరైతే భౌతిక జగత్తునకు పతనం చెందుతారో వారు భగవద్గీత(పదిహేనవ అధ్యాయం)లో వివరించిన సంసార వృక్షమైన భౌతిక జీవితమనే మఱ్ఱివృక్షానికి ఆకర్షితులగుదురు.

అనాసక్తితో మనం ఈ మఱ్ఱి వృక్షముతో సాంగత్యము చేయకుండుట మనేది ఎంతో ముఖ్యం. ఈ వృక్షమును నరికివేయుట ఎంతో కష్టం, కాని ఇది అనాసక్తి అనే ఆయుధముతోనే సాధ్యమవుతుంది. బెంగాలీ సామెత ఒకటి ఇలా కలదు : "నేను చేపను పట్టుకొందును కాని నీటిని తాకను" ఇటువంటి బుద్ధి ఎంతో అవసరము. అమెరికాలోని అనేకమంది వృద్ధులు తమ వ్యాపారముల నుండి విరమణ పొందిన తరువాత వారు తమ సమయాన్ని సముద్ర తీరంలో వృథా చేస్తూ, చేపలను పట్టుటకు ప్రయత్నించుటను మనం చూడవచ్చును. వారు జాగ్రత్తగా లేనందున నీటిని తాకుదురు. ఏమైనప్పటికినీ, మనం ఈ భౌతికలోకంలో శ్రీకృష్ణునికి సేవ చేస్తూ జీవించవలెను. అంతేకాని భౌతికలోకపు నీటిని తాకరాదు. అనగా, భౌతిక ప్రపంచములోని వస్తువుల పట్ల మనకు ఆసక్తి ఉండరాదు. మనం అనేక గొప్ప మందిరాలను కలిగి ఉండవచ్చును, అయినను వాటిపట్ల ఆసక్తిని కలిగి ఉండరాదు. శ్రీకృష్ణుని కొరకు మనం మందిరాలను నిర్మిస్తుంటాము. కాని అది శ్రీకృష్ణుని సంపద అని అర్థం చేసుకోవాలి. సర్వం శ్రీకృష్ణునికి చెందినదని మనం జనులకు బోధించాలి. కేవలం దొంగ మాత్రమే ఇతరులకు సంబంధించిన దానిని ఆక్రమించి తనదని వాదించును.

కృష్ణ చైతన్య ఉద్యమం ప్రతిది శ్రీకృష్ణుడికి చెందినదని మరియు దానిని శ్రీకృష్ణుని సేవ కోసమే వినియోగించాలని బోధించును. అతడు అందరికి శ్రేయస్సును సమకూర్చువాడు. ఈ జ్ఞానమును కలిగి ఉండుటయే మనకు శ్రేయస్సు. *"ఈశావాస్యమిదం సర్వమ్."* ఎవరైనను సర్వం శ్రీకృష్ణుడికే చెందినదని తెలుసుకొనినచో వారు గొప్ప మహాత్ము లగుదురు. మహాత్ములు అనగా పెద్దగడ్డం పెంచుకొని మరియు ప్రత్యేక రకమైన బట్టలు ధరించుటమని కాదు. మన సమస్తమును శ్రీకృష్ణునికి అర్పించ వలెననెడి అవగాహనను తప్పక కలిగి ఉండాలి. మనము చక్కటి ఆహారమును కలిగి ఉన్నచో, దానిని అతడికి నివేదించవలెను. మన దగ్గర ఏమి లేనిచో, అతడికి పత్రమును గాని, కొద్దిపాటి నీరును గాని లేదా ఫలమును గాని అర్పించవలెను. వీటిని ఎవరైనను ఎక్కడైనను డబ్బు లేకుండ సమకూర్చుకోవచ్చును. భగవద్గీత(9.26)లో శ్రీకృష్ణుడు ఇట్లు చెబుతున్నాడు :

పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి
తదహం భక్త్యుపహృతమశ్నామి ప్రయతాత్మనః

"ఎవరైనను నాకు ప్రేమతోడను భక్తితోడను పత్రమును గాని, పువ్వును గాని, పండును గాని, నీటినిగాని అర్పించినచో దానిని నేను అంగీకరింతును."

భక్తితో దేనినైనను శ్రీకృష్ణుడికి సమర్పించు కోవలెననునది ఇక్కడ తెలుసు కోవలసిన విషయం. శ్రీకృష్ణుడు ఆకలి వలన ఆహారమును అడుగుతున్నాడని అర్థం కాదు. అతడు అందరిని పోషిస్తున్నాడు. అందరి అవసరాలను సరఫరా చేస్తున్నాడు : *"ఏకో బహూనాం యో విదధాతి కామాన్."* (కఠోపనిషత్తు 2.2.13) మరిదేనిని అతడు కోరుతున్నాడు? అతడు భక్తిని కోరుతున్నాడు. ఎందుకంటే, మనమతడిని ప్రేమించాలని కోరుకుంటాడు. ఈ లోకంలో మనం దుఃఖములను అనుభవిస్తున్నాము. భౌతిక జీవితమనే వృక్షంలో చిక్కుకొని, ఒక కొమ్మ నుండి మరొక కొమ్మకు మారుతున్నాము, దానితో మనం దుఃఖములను అనుభవిస్తున్నాము. ఇలా మనం ఒక కొమ్మ నుండి మరొక కొమ్మకు కోతులవలె గెంతుతూ బాధలను అనుభవిస్తుండుటను శ్రీకృష్ణుడు కోరుకొనడు. కేవలము మనమతడిని సమీపించి శరణాగతి చేసుకోవాలి. దీనిని తెలుసు కొనినప్పుడే జ్ఞానంతో మనం సంసిద్ధిని సాధించగలము. మనం శ్రీకృష్ణుని పాదపద్మములను ఆశ్రయించి నప్పుడు, మనమెవరికి ఋణపడ నవసరము అవసరము లేదు. *"న కింకరో నాయం ఋణీ."* (భాగవతం 11.5.41) *"అహం త్వాం సర్వపాపేభ్యో మోక్షయిశ్యామి"* : "నేను మీకు ఉపశమనము కలిగింతును" అని శ్రీకృష్ణుడు హామి ఇస్తున్నాడు (భ.గీ. 18.66). నిజానికి దీనినే మనం కోరుకోవలెను. కాబట్టి దేవహూతి కపిలదేవుని శరణు వేడుకొని అతడితో : "నీవు అనాసక్తిని కలిగించుటలో గొడ్డలి వంటివాడివి" అని చెబుతున్నది. ఈ భౌతిక లోకంతో మనకు గల ఆసక్తిని నరికి వేసినప్పుడు మనం విముక్తిని పొందుదుము. అనాసక్తిని పెంపొందించు కొనినచో దానినే భక్తి అంటారు. *"వైరాగ్యవిద్యనిజభక్తియోగ."* భక్తియోగ అనునది వైరాగ్య శాస్త్రం. ఈ శ్లోకం సార్వభౌమ భట్టాచార్యుడు శ్రీ చైతన్య మహాప్రభువును దేవాదిదేవుడిగా అర్థం చేసుకొనినప్పుడు రచించినది. సార్వభౌమ భట్టాచార్యుడు గొప్ప తర్కవేత్త మరియు అతడు శ్రీ చైతన్య మహాప్రభువును గురించి నూరు శ్లోకములను రచించెను. అతడు భగవంతుడిని ఇలా స్తుతించెను.

వైరాగ్యవిద్యానిజభక్తియోగ శిక్షార్థమేకః పురుషః పురాణః
శ్రీకృష్ణచైతన్యశరీరధారీ కృపాంబుధిర్యస్తమహం ప్రపద్యే

"నిజమైన జ్ఞానమును భగవంతుని పట్ల భక్తియుక్త సేవను, మరియు కృష్ణ చైతన్యమునకు సంబంధించని వాటిపట్ల వైరాగ్యమును బోధించుటకు శ్రీ చైతన్య మహాప్రభువుగా అవతరించిన దేవాదిదేవుడైన శ్రీకృష్ణునకు నేను శరణు పొందుదును గాక! అతడు దివ్య కరుణాసముద్రుడుగా అవతరించెను. ఆయన చరణ కమలములను శరణు పొందుదును గాక!" (శ్రీ చైతన్య చరితామృతము, మధ్యలీల 6.254)

భక్తిలో ఎవరైన అభివృద్ధి సాధించినప్పుడు అతడిలో సహజంగానే భౌతిక ఆకర్షణల పట్ల అనాసక్తి కలుగును. ఎందరో అమెరికా మరియు యురోపు దేశాలలోని యువతీయువకులు కృష్ణచైతన్య ఉద్యమంలో కలరు, వారు భౌతిక సంపదలను అనుభవించేందుకు అవకాశములు గల దేశాలలో జన్మించి నప్పటికినీ, వారు ఈ భౌతిక సుఖాలను మరియు సంపదలను వీధిలోని చెత్త వలె పరిగణించిరి. వాసుదేవుని భక్తులైనందున వారు భౌతిక వస్తువుల పట్ల ఆసక్తిని కోల్పోయిరి. ఇది భక్తియోగకు ఫలితం. అది భౌతిక సుఖాలపట్ల అనాసక్తిని కలిగించును. భక్తి యోగలో అభివృద్ధి చెందుతున్నా రనుటకు విషయాసక్తి లేకుండుటమనేది చిహ్నాము. *"భక్తిః పరేశానుభవో విరక్తిరన్యత్ర చ."* (భాగ. 11.2.42) భక్తిలోని అభివృద్ధికి ఇది పరీక్ష. మనము భక్తిలో అభివృద్ధిని సాధించినప్పుడు మనం భౌతిక సుఖాలపట్ల గల అసక్తిని కోల్పోవుదుము. మనకు మనం గొప్ప భక్తులమని భావించుకుంటూ, అదే సమయంలో భౌతిక సుఖాలను అనుభవించుటమని కాదు. భగవద్గీత(5.22)లో చెబుతున్నట్లుగా :

యే హి సంస్పర్శజా భోగా దుఃఖయోనయ ఏవ తే
ఆద్యన్తవన్తః కౌన్తేయ న తేషు రమతే బుధః

"ఓ కౌంతేయా! బుద్ధిమంతుడు ఇంద్రియ విషయముల సంపర్కము వలన దుఃఖ కారణములైన భోగములందు పాల్గొనడు. అట్టి సౌఖ్యములు ఆదియు అంతమును కలిగి ఉండును. అందుచేత తెలివైనవాడు వానియందు ప్రీతినొందడు." ఎవరైనను ఉన్నతమైన దానిని పొందినప్పుడు దానికంటే తక్కువ విలువైన దానిని వెంటనే తిరస్కరిస్తారు. నిజానికి, మన స్వంత ప్రయత్నము చేత వీటినన్నింటిని అంగీకరించము. కాబట్టి మనము శ్రీకృష్ణుడిని ఆశ్రయించవలెను. అప్పుడే అతడు

సహాయపడును. శ్రీకృష్ణుడిని శరణు పొందుటయే మన ధర్మమైనందున దేవహూతి ఇట్లు చెబుతున్నది : "నేను నిన్ను శరణు వేడుచున్నాను, కాబట్టి నీవు ఈ భౌతిక జీవితము పట్ల గల నా ఆసక్తిని ఖండించ వలెను. ఎందుకంటే, నేను నీ శాశ్వత సేవకురాలను కాబట్టి నీవు దానిని చేయవలెను."

"అనాది కర్మ ఫలే, పది భవార్ణవజలే, తరిబారె నా దేఖి ఉపాయ్" అని శ్రీల భక్తివినోద ఠాకూర్ చెబుతున్నారు. మనం సముద్రములో పడినప్పుడు, మనమెంతటి గొప్ప గజ ఈతగాళ్ళమైనను ఎంతో పోరాడవలసి వచ్చును. ఎంతటి నేర్పరితనంతో వ్యవహరించినను మనకు ఈ భౌతిక లోకంలో శాంతి అనేది లభించదు. ఇక్కడ పోరాటము తప్ప మరేది లేదు. ఇక్కడ శాంతితో జీవించలేము. అది అసాధ్యం. మనము అహింస వాదులమైనను, ఎవరినీ బాధించక పోయినను, కష్టాలు తప్పవు. కాని ఎలాగో ఒడ్డుకు చేరినచో మనము శాంతిని పొందగలము. సముద్రపు నీటినుండి ఒక అంగుళము తప్పించుకొనినను మనకు శాంతి లభించును. *"తవ పాద పంకజస్థితధూళి సదృశం విచింతయ."* (శిక్షాష్టకము 5) ఏదోవిధముగా మనం శ్రీకృష్ణుని పాదపద్మల వద్ద చిన్న ధూళికణమైనను ముక్తిని పొందగలము.

మనం హిందు ముస్లిం లేదా క్రైస్తవులుగా 50 లేదా 60 సంవత్సరాలు లేదా చివరకు వంద సంవత్సరాలు జీవించినను తిరిగి జన్మించి, మరేదో రూపములో జన్మించవలసి వచ్చును. మనము ఆలోచించే ఈ మతపరమైన ఉపాధులను *'అసద్ ధర్మ'* అంటారు. అనగా అవి ఏ క్షణంలోనైన మార్పు చెందగలవు. కాని వాస్తవ ధర్మమేమిటి? వాస్తవ ధర్మం అనగా 'సద్ధర్మం'. మార్పునకు లోనుకానిది, అనగా శ్రీకృష్ణుడిని శరణు పొందుటయే సద్ధర్మము. ఈ ధర్మం శాశ్వతముగా కొనసాగును. ఎందరో సద్ధర్మం గురించి వివరించిరి. భగవంతుడికి సత్యం తెలుసు కనుక అతడు అత్యుత్తమ శిక్షకుడు. అందుకే గోస్వాముల గురించి ఇలా చెప్పబడినది : *"నానాశాస్త్రవిచారనైకనిపుణౌ సద్ధర్మ సంస్థాపకౌ."* శ్రీ చైతన్య మహాప్రభు యొక్క ప్రత్యక్ష శిష్యులైన గోస్వాములు సద్ధర్మాన్ని స్థాపించుటకు కృషిచేసిరి. మరియు మేము ప్రపంచమంతటా కృష్ణ చైతన్య ఉద్యమమును వ్యాపింప చేయుటకు వారి అడుగుజాడలలో ప్రయత్నిస్తున్నాము.

అధ్యాయము 7

కపిల భగవానుడు ఆత్మసాక్షాత్కారమును వివరించుటను ప్రారంభించెను

శ్లోకము 12

మైత్రేయ ఉవాచ
ఇతి స్వమాతుర్నిరవద్యమీప్సితం
నిశమ్య పుంసామపవర్గవర్ధనమ్
ధియాభినన్ద్యాత్మవతాం సతాం గతి -
ర్బభాష ఈషత్స్మితశోభితాననః

మైత్రేయుడు పలికెను : ఆధ్యాత్మికానుభూతి యెడ తన తల్లి యొక్క విశుద్ధమగు కోరికను వినిన పిమ్మట భగవానుడు ఆ ప్రశ్నలకు ఆమెను మనస్సులోనే అభినందించెను; ఆ విధముగా ఆతడు ఆత్మానుభవము నందు అసక్తులైన తత్త్వవేత్తల పథమును దరహాసవదనముతో వివరించెను.

భాష్యము : భవబంధములలో చిక్కుబడితినని తన పాపనివేదనము చేసుకొనిన దేవహూతి దానినుండి విడుదల వాంఛను సైతము తెలిపినది. భవబంధము నుండి నిజమైన ముక్తిని పొంది సంసిద్ధిని బడయుటకు నిజముగా యత్నించువారలకు ఆమె కపిల భగవానుని అడిగిన ప్రశ్నలు ఆసక్తికరములై యుండును. ఆధ్యాత్మిక జీవితము లేదా, తన నిజ స్థితిని అవగాహన చేసికొనుట యందు అభిరుచి లేనిచో, భౌతిక అస్తిత్వము నందు అసౌకర్యముగా నున్న భావన కలుగనిచో, అతడి మానవ జన్మ వృథా అయినట్లే. కేవలము మూర్ఖుడైనట్టివాడే జీవితపు ఈ ఆధ్యాత్మిక అవసరములను పట్టించుకొనకుండ, కేవలము జంతువువలె ఆహార, నిద్ర, భయము, మైథునముల యందు నెలకొనును. తన జనని అడిగిన ప్రశ్నలచే కపిల భగవానుడు మిగుల సంతృప్తి చెందెను; ఏలయన వాటి సమాధానములు భవబంధము నుండి ముక్తిని బడయుటకు మనుజుని కోరికను ప్రోత్సహించునవై యున్నవి. అటువంటి ప్రశ్నలే '*అపవర్గవర్ధనమ్*' అని పిలువబడినవి. నిజముగా ఆధ్యాత్మికాభిరుచి కలిగిన వారు '*సత్*' భక్తులు అని పిలువబడుదురు. లేదా '*సతాం ప్రసంగాత్*'. '*సత్*' అనగా 'శాశ్వతము'గా, 'నెలకొని యుండునది'; '*అసత్*' అనగా 'శాశ్వతము కానిది'

అని భావము. ఆధ్యాత్మిక స్థితిలో నెలకొననిదే మనుజుడు *'సత్'* కాజాలడు; అతడు *'అసత్'* అనబడును. అసత్ అయినవాడు అశాశ్వత స్థితిలో నిలిచియుండును. కాని ఆధ్యాత్మిక స్థితి యందు నిలిచినవాడు శాశ్వతముగా నిలిచియుండును. శుద్ధాత్మలుగా ప్రతిఒక్కరు శాశ్వతముగా నిలిచియుందురు. కాని *'అసత్'* అయినవాడు భౌతిక జగమునే తన ఆశ్రయముగా స్వీకరించి నందున దుఃఖపూర్ణుడై యుండును. *'అసద్గ్రహాన్'*: భౌతిక పదార్థమును భోగింపవలెననెడి వాంఛ, మరియు ఇదే ఆత్మ *'అసత్'* యగుటకు కారణము. నిజమునకు ఆత్మ *'అసత్'* కానే కాదు. ఈ సత్యము నెరిగినంతనే మనుజుడు కృష్ణచైతన్యమును చేపట్టి *'సత్'* కాగలడు. ముక్తిని అభిలషించువారలకు *'సతాం గతిః'* (శాశ్వత పథము) మిగుల ప్రియమైనదిగా ఉండును. మరియు కపిలభగవానుడు ఆ పథమును గూర్చియే పలుకుట నారంభించెను.

ఆధ్యాత్మిక జీవితములో అభివృద్ధి సాధించిన వారు సత్ మరియు ఆధ్యాత్మిక జీవితమును అర్థం చేసుకోవాలనుకునే వారి నుండి ప్రశ్నలు వినినపుడు వారు ఎంతో ఆనందించెదరు. భక్తులు ప్రాపంచిక చర్చల పట్ల అసక్తిని కలిగి ఉండరు. నిజానికి, ప్రాపంచిక సంభాషణలు వారికి ఎంతో అసహ్యమును కలిగిస్తాయి. అంతేకాకుండ, ప్రాపంచిక విషయాలను గురించి మాట్లాడువారితో వృథా సాంగత్యమును చేయరు. శ్రీ చైతన్య మహాప్రభువు తన శిష్యులను ఇట్లు ఆదేశించెను: *"గ్రామ్య కథా న శునిబే." 'గ్రామ్య'* అనే పదం గ్రామం, సంఘం, లేదా చుట్టుప్రక్కల వారిని సూచిస్తుంది. జనులు 'గ్రామ్యకథ'ను మాట్లాడుటలో ఆసక్తిని కలిగి ఉంటారు. ఉదాహరణకు వార్తాపత్రికలన్నీ 'గ్రామ్యకథ'లతో నిండి ఉంటాయి. వాటిలో ఎలాంటి ఆధ్యాత్మికమైన అర్థం ఉండదు. అమెరికాలో ఎన్నోరకాల వార్తాపత్రికలు కలవు, మరియు కేవలం న్యూయార్క్ టైమ్స్ అనే వార్తాపత్రికను ముద్రించుట కొరకు ఎన్నో వృక్షాలను నరికి వేయవలిసి వస్తుంది. ప్రస్తుతం కాగితపు కొరత కలదు. వారెందుకు కేవలం 'గ్రామ్యకథ' కొరకు చెట్లను నరికి వేస్తున్నారు? ఎందుకంటే వారు లాభాలను గడించుటలోనే ఆసక్తిని కలిగి ఉన్నారు.

మరొక రకమైన కథ కలదు. అది కృష్ణ కథ, ఎన్నో సాహిత్యాలు కలవు. సాహితీ దృష్టికోణం నుండి చూచినచో అవి ఎంతోచక్కగా వర్ణించ బడినట్టివి. కాని అవి భగవంతుడిని కీర్తించక పోయినచో నిరుపయోగము లగును.

న యద్వచశ్చిత్రపదం హరేర్యశో
జగత్పవిత్రం ప్రగృణీత కర్హిచిత్

తద్వాయసం తీర్థముశన్తి మానసా
న యత్ర హంసా నిరమన్త్యుశిక్క్షయాః

"విశ్వమంతటిని పవిత్రము చేయగల శ్రీకృష్ణభగవానుని యశస్సును కీర్తించనటువంటి వచనములు మహాత్ములైన వారిచే వాయతీర్థముగా పరిగణింప బడును. పరమహంసలైనవారు వాస్తవమునకు దివ్యధామమున వసించునట్టివారు గనుక అట్టి వాయస తీర్థమునందు రమింపగోరరు." (భాగ. 1.5.10)

ప్రాపంచిక సాహిత్యాలు కాకులు ఆనందించే ప్రదేశాలవంటివి, పక్షి సమాజములో కాకులు మరియు హంసలు కలవు. చెత్తపదార్థాలు గల ప్రదేశాలలో కాకులు అసక్తిని కలిగి ఉండును. కాని హంసలు తామరపూవులతో నిండిన స్వచ్ఛమైన జలాశయములను ఎంచుకొని అవి అక్కడ ఆనందించును. ఆ విధముగా కాకులు మరియు హంసలవలె మనుష్యులు కలరు. అది సహజమైన విభజన. ఒక పాత ఆంగ్ల సామెత ప్రకారం, రెక్కలు కలిగిన ఒకేరకం పక్షులు ఒక దగ్గర గుమికూడును. కాకులు కాకులతో కలియును, మరియు హంసలు హంసలతో కలియును. భక్తులు హంసల వంటివారు, అత్యున్నత స్థితికి చెందిన భక్తులైన పరమహంసలు కాకులకు సంబంధించిన విషయాలలో ఆసక్తిని కలిగి ఉండరు. ఆధ్యాత్మిక విషయాలను, కృష్ణకథల గురించి విచారించువారు పరమహంసలకు ఆనందమును చేకూర్చుచుందురు. కాబట్టి కపిలదేవుడు తన తల్లి భౌతిక బంధముల నుండి ఎలా విముక్తిని పొందవలెనను దానిని తెలుసుకొనుటకు అసక్తిని కనపరుచుటను చూచి ఎంతో ఆనందించెను :

అథ మే దేవ సమ్మోహమపాకష్టుం త్వమర్హసి
యోఽ వగ్రహోఽ హం మమేతీత్యేతస్మిన్ యోజితస్త్వయా

"కనుక ఓ దేవా! ప్రసన్నుడవై నా మహామోహమును ఇప్పుడు నశింపజేయుము. మిథ్యాహంకార కారణమున నీ మాయచే నడుపబడి దేహాత్మభావన యందు మరియు తత్ఫలస్వరూపమగు దేహపరమగు బంధములందు లగ్నమైతిని." (భాగ. 3.25.10)

శ్రీ చైతన్య మహాప్రభువు తన శిష్యులకు ఎన్నడు రుచికరమైన ఆహారమును భుజించరాదని, గ్రామ్యకథను చర్చించుట, సాధారణ నవలలు, పద్యాలను మరియు వార్తాపత్రికలను చదవకూడదని ఆదేశించెను. ఎవరైనను ఇలా అడుగవచ్చును, "ఈ ఆధునిక యుగంలో కృష్ణచైతన్య సంఘమునకు చెందిన యూరోపియన్లు మరియు అమెరికవాసులు వార్తాపత్రికలను చదువకుండ ఉండుటమనేది ఎలా

సాధ్యం?" పాశ్చాత్యదేశాలలో వార్తాపత్రికలు ఎంతో ప్రసిద్ధి. ప్రతిరోజు రెండు నుండి మూడుసార్లు పత్రికలు ముద్రించబడును. మరియు అవన్నీ అమ్ముడుపోవును. కాని కృష్ణ చైతన్యములో చేరిన ఈ అమెరికా యువతీయువకులు వార్తాపత్రికలను చదువుటను ఆపివేశారు. వారికి రోజువారి వార్తలు ఏమిటనేవి తెలియవు. మరియు అవన్నీ వారికి అవసరము లేదు. అవి కేవలము సమయమును వృథాపరచునవి. కాబట్టి వారు శ్రీమద్భాగవతము మరియు భగవద్గీత వంటి సాహిత్యములను చదువుట మేలు, ఎందుకు మన విలువైన సమయమును వృథా చేసుకొనుట?అని భావింతురు.

తన తల్లి కేవలం ఆధ్యాత్మిక పురోభివృద్ధిని సాధించుటలోనే ఆసక్తిని కలిగి ఉండుటను చూచి కపిల దేవుడు ఎంతో సంతోషించెను. ఈ భౌతిక జీవితమును 'పవర్గము' మరియు దీనిని నిలిపివేయుటను 'అపవర్గము' అంటారు. ఈ భౌతిక లోకంలోని జనులు కేవలం డబ్బు సంపాదించుట కొరకై ఎంతగానో శ్రమిస్తుంటారు. ఇది నరక ప్రాయమైన స్థితిని ఏర్పరుచును. మరియు ఇదే భౌతిక జీవనపద్ధతి. జనులు ఎంతటి మందబుద్ధి గలవారంటే వారికి ముక్తికి అర్థం కూడ తెలియదు. వారు పశువుల వలె తయారైనారు. ముక్తి అనేది ఒకటుంటుందని పశువుకు తెలిపినచో, దానిని అది ఎలా అర్థం చేసుకోగలదు? అది అసాధ్యం. ప్రస్తుత కాలంలో మానవులు పశువుల మాదిరిగా తయారైనారు. 'అపవర్గ', ముక్తి అనుదానికి అర్థం కూడ వారికి తెలియదు. పూర్వం జనులు జీవితమనునది 'అపవర్గ'కు సంబంధించినదని అర్థం చేసుకునేవారు. దేవహూతి ద్వారా ప్రశ్నలు అడుగబడెను, కపిలదేవుని చేత సమాధానములు చెప్పబడెను. అది 'అపవర్గ వర్ధనము'. శాస్త్రములెన్నడు భౌతికమైన జీవిత పోషణ గురించి నొక్కి చెప్పలేదు. అంతేకాకుండ, ఒకరి పోషణ అనునది సహజముగానే చక్కగా జరిగి పోతుందని తెలుపబడినది. భగవంతుడు జంతువులకు, పక్షులకు, మరియు నీటిజీవులకు ఆహారమును సమకూరుస్తున్నప్పుడు అపవర్గలో ఆసక్తి కలిగి ఉన్నవారికి ఎందుకు సమకూర్చడు. దురదృష్టవశాత్తు జనులకు విశ్వాసమనేది లోపించినది, అందుకే సత్ సాంగత్యం అవసరము.

కాకులతో సాంగత్యం చేస్తూ జనులు వారి సమయమును వృథా చేయకుండ హంసలతో సాంగత్యము చేయవలెను. చెత్తచెదారమును పడవేసినప్పుడు, కాకులు మరియు కుక్కలు ఏమిటని వచ్చిచూచును. కాని వివేకవంతుడు ఏమిటని వాటిని చూడడు. ఈ భౌతిక లోకం నుండి ఆనందమును పొందుటకు ప్రయత్నించువారు

నిజానికి నమలినదానినే తిరిగి నములుతున్నారు. 'పునః పునశ్చర్విత చర్వణానామ్.' (శ్రీమద్భాగవతము 7.5.30) ఎవరైనను రసమును నమిలివేసిన చెఱకుగడ పిప్పిని తిరిగి నమలుటకు ప్రయత్నించినచో అతడు మూర్ఖుడని అర్థము. ఆ చెఱకుగడ నుండి రసము ముందుగానే తీయబడినదని మనము తెలుసుకోవాలి. దానిని నమలుట వలన ఏమిటి లాభము? ఏమైనను కొన్ని జంతువులు కేవలం నమిలిన దానిని నమలుటలోనే అసక్తిని కనపరచును. భౌతిక జీవితమనగా నమిలిన దానిని తిరిగి నమలుట. తండ్రి కుమారుడికి జీవనోపాధి కొరకు విద్య నేర్పును. తరువాత కుమారుడు వివాహము చేసుకొని జీవితములో స్థిరపడును. ఏమైనను వీటన్నింటి వలన తన కుమారుడు తృప్తి చెందలేదని అతనికి తెలుసును. అయినను, ఎందుకు అతడు తన కుమారుడుని అదే పనిలో వినియోగించును? నిజమైన తండ్రి తన కుమారుడిని నమలిన దానిని తిరిగి నమలుటకు అనుమతి నివ్వడు. "*పితా న స స్యాజ్జనని న సా స్యాత్...న మోచయేద్యః సముపేతమృత్యుమ్*" – "మృత్యువు యొక్క గుప్పిటి నుండి తమ సంతానమును తప్పించలేని వారు తల్లి లేదా తండ్రి కారాదు."(భాగ. 5.5.18) అది తల్లితండ్రుల ధర్మము. దీనిని చేయుట ఎలా? తల్లితండ్రులు తమ సంతతికి కృష్ణచైతన్యమును బోధించవలెను. అప్పుడే వారు రక్షింపబడుదురు. వారు తమ కుమారుడిని 'పవర్గము' అనేది లేకుండునట్లుగా చేసుకొను విధముగా శిక్షణ ఇవ్వవలెను. మనము ముక్తి కొరకు ప్రయత్నించనిచో కుక్క పిల్లుల సంస్కృతిని వృద్ధి చేయుదుము. ఆహార నిద్రా భయమైథునాలనేవి కుక్కలు పిల్లులు అనుభవించుట కొరకు. కాని మానవ జీవితం మరొక లక్ష్యం కొరకై ఉద్దేశించబడినది. ఏమైనను మనము శరీరమును పోషించుకోవలెను, దానిని అశ్రద్ధ చేయరాదు; కాని శరీరపోషణ కొరకు మనం అనవసరముగా శ్రమించరాదు.

యస్యాత్మబుద్ధిః కుణపే త్రిధాతుకే
స్వధీః కలత్రాదిషు భౌమ ఇజ్యధీః
యత్తీర్థబుద్ధిః సలిలే న కర్హిచిజ్-
జనేష్వభిజ్ఞేషు స ఏవ గోఖరః

"కఫవాతపిత్తమయమగు జడదేషమే తానని తలచువాడు, భార్యాదులు శాశ్వతముగా తన వారని భావించువాడు, మృణ్మయమూర్తిని లేదా జన్మస్థలమును పూజనీయ మైనదని తలచువాడు లేదా తీరసానమును కేవలము అచట నున్న జలముగా చూచుచు తత్త్వజ్ఞులగు మహనీయులతో జతకూడనివాడు, వారితో సంబంధమును

నెరపనివాడు, వారిని అర్చించనివాడు లేదా వారి దర్శనమునైనను పొందనివాడు గోవు లేదా గాడిదతో సమానము." (శ్రీమద్భాగవతము 10.84.13)

వేదాల నుండి మనము అన్నిరకాల విద్యలను నేర్చుకోగలము. మామిడి చెట్టుపై పండిన పండ్లు ఉంటాయి. శ్రీమద్భాగవతమనేది వైదిక జ్ఞానమనే కల్పవృక్షమునకు పండిన మామిడి పండు : *"నిగమ కల్పతరోర్గలితం ఫలం."* మామిడి పండును చిలుక కొరికినచో రుచి రెట్టింపు అవుతుంది. శుక అను పదానికి చిలుక అని అర్థం, మరియు శుకదేవ గోస్వామి భాగవతమును గురించి చర్చించెను. అతడి ఆధరముల నుండి వెలువడినందున అది ఎంతో ఆస్వాదించ బడినది.

నిగమకల్పతరోర్గలితం ఫలం
శుకముఖాదమృతద్రవసంయుతమ్
పిబత భాగవతం రసమాలయం
ముహురహో రసికా భువి భావుకాః

"ఓ భావుకులారా! రసికులారా! వేదవాఙ్మయమనెడి కల్పవృక్షపు పక్వఫలమైన శ్రీమద్భాగవతమును ఆస్వాదింపుడు. ఇది శ్రీ శుకదేవగోస్వామి ముఖతః వెలువడి యున్నది. తత్కారణముగా ఈ ఫలము మరింత మధురముగా ఒప్పారి, దాని అమృతరసము ముక్తపురుషులతో సహా సర్వులకు ఆస్వాదనీయమై యున్నది." (భాగ. 1.1.3) మిగుల శోచనీయమైన విషయమేమనగా, ఈ సాహిత్యములన్నీ లభించెడి భారతదేశములోని జనులు వీటిపట్ల శ్రద్ధచూపుట లేదు. వారు శ్రీమద్భాగవతము పట్ల సామ్యవాద సాహిత్యము పట్ల శ్రద్ధను కనపరుస్తున్నారు. మరియు ఇదే భారతదేశపు దురదృష్టము.

శిష్యుడు ఆధ్యాత్మిక విషయాలను శ్రద్ధగా వినినప్పుడు ఆధ్యాత్మికాచార్యుడు ఎంతగానో ఆనందించును. ఆధ్యాత్మిక విషయాలను అర్థం చేసుకొనుటకు తన తల్లి ఆసక్తిని కలిగి ఉండుటను చూచి కపిలదేవుడు ఎంతో ఆనందించెను. కాబట్టి అతడు తన తల్లి ప్రశ్నలు వేస్తున్నందుకు అభినందించెను.

సాధారణంగా జనులు త్వరిత ఫలితాలను ఇచ్చే వాటిపట్లనే ఆసక్తిని కలిగి ఉంటారు. నాలుకకు రుచికలిగించు దానిని తినవచ్చునా లేదా అని ఆలోచించకుండ రుచి చూస్తుంటారు. పందులు ఎలాంటి విచక్షణ లేకుండ మలమును తినుటకు సిద్ధంగా ఉండును. వాటికి తపస్సు గురించి ఎటువంటి అవగాహన లేదు. ఎవరైన

ఆధ్యాత్మికానుభూతిని పొందవలెననిచో తపమును ఆచరించవలెను. ఏమైనను శ్రీ చైతన్య మహాప్రభువు దీనిని ఎంతో సరళము చేసెను. *"చేతోదర్పణమార్జనం భవ మహాదావాగ్నినిర్వాపనమ్."* కేవలము మనము కొద్ది సమయమును వెచ్చించి 'హరేకృష్ణ' జపమును చేయవలెను. కాని మనము ఈ కొద్ది తపస్సును చేయుట కొరకు కూడ సిద్ధంగా లేము. శ్రీకృష్ణుడు ముక్తి వైపుకు సాగుతున్న మార్గములో మనలను నడుపుటకు ఎంతో ఆసక్తిని కనపరచును. అతడు మనకు ఎంతో సులభ పద్ధతిని అందజేసాడు : *"హరేర్నామ హరేర్నామ హరేర్నామైవ కేవలమ్."* మనము కేవలం 'హరేకృష్ణ' జపం చేయవలెను. ఈ 'హరేకృష్ణ' జపంలో పరిపూర్ణత్వమును సాధించుట కొరకు ఖచ్చితమైన నియమమేది లేదు. కేవలము సంకీర్తన ద్వారానే మనం పరిపూర్ణత్వమును సాధించగలము. దురదృష్టవశాత్తు, కలియుగము వలన మనము కలుషిత మైనందున, శ్రీకృష్ణుని పవిత్ర నామాల పట్ల మనకు ఆకర్షణ లేకుండ పోయినది. కాబట్టి ఎవరైనను కొద్దిగా ఆసక్తిని కలిగిఉన్నను, కపిలదేవుడు మరియు అతని ప్రతినిధులు వారు దానికి ఎంతో సంతోషించి అతడిని అభినందిస్తారు. కపిల దేవుడు తన తల్లి ఆసక్తిని కలిగి ఉండుటను చూసి, బయటికి కాకుండ లోలోపలనే అభినందించెను.

కపిల దేవుడు ఎంతో సంతోషముగా సంభాషణను ప్రారంభించాడు. కపిల దేవుడు భగవంతుని అవతారము మరియు అతడు యువకుడు; కాబట్టి అతని ముఖము ఎంతో అందముగా ఉండెను. ఈ ప్రశ్నకు సమాధాన మిస్తున్నప్పుడు అతడు మరింత అందముగా కనిపించెను, అంతేకాకుండ తన తల్లి ప్రశ్నకు సంతోషించి అతడు చిరునవ్వులు చిందించెను. శ్రీకృష్ణుడు గొప్ప సౌందర్యవంతుడు. కాని అతని భక్తుడు అతడిని సేవిస్తూ సమీపించినచో అతడు మరింత అందముగా కనిపించును. భక్తుడు హృదయ పూర్వకముగా భగవంతునకు సేవ చేయునప్పుడు, అతనికి చక్కని వస్త్రములను అలంకరించునప్పుడు, పుష్పములను సమర్పించు నప్పుడు శ్రీకృష్ణుడు చిరునవ్వులను చిందించును. శ్రీకృష్ణుని పెదవులపై కనీసం ఒక్కసారైన చిరునవ్వు తెప్పించగలిగితే మీ జీవిత లక్ష్యము నెరవేరినట్లే.

ఆ విధముగా చిరునవ్వులను చిందిస్తూ కపిల దేవుడు తన తల్లికి ఉపదేశించుటను ప్రారంభించెను.

శ్లోకము 13

శ్రీభగవానువాచ
యోగ ఆధ్యాత్మికః పుంసాం మతో నిఃశ్రేయసాయ మే
అత్యన్తోపరతిర్యత్ర దుఃఖస్య చ సుఖస్య చ

దేవాదిదేవుడు ఈ విధముగా సమాధానమొసగెను : భగవానునికి మరియు జీవునికి సంబంధించినదై యుండి జీవుని చరమ లాభమునకై ఉద్దేశింపబడినదియు, మరియు భౌతిక జగమునందు సుఖదుఃఖముల యెడ అనాసక్తిని కలిగించునదియు అగు భక్తియోగయే పరమోన్నత యోగము.

భాష్యము : భౌతిక జగమునందు ప్రతియొక్కరు ఎంతో కొంత భౌతిక సుఖమును పొందవలెనని యత్నించుచున్నారు. కాని కొద్దిగా భౌతిక సుఖమును పొందినంతనే దానితోపాటు దుఃఖము కూడా సంప్రాప్తించుచుండును. ఈ భౌతిక జగత్తులో నిరంతర సౌఖ్యమును ఎవ్వరును పొందజాలరు. ఏ రకమైన సుఖమైనను దుఃఖముచే మిళితమై యుండును. ఉదాహరణకు ప్రతిరోజు పాలు త్రాగవలెనని కోరినచో, ఆవును పోషించెడి భారాన్ని తలకెత్తుకోవలెను. పాలు త్రాగుట మంచిదే; అది సుఖకరము అయినను కూడా పాలు త్రాగుట కొరకు మనుజుడు ఎంతయో కష్టమును భరించ వలసియుండును. కపిల భగవానునిచే ఇచ్చట తెలుపబడిన యోగవిధానము సమస్తమగు భౌతిక సుఖదుఃఖములను నివారించుటకే ఉద్దేశింపబడినది. భగవద్గీత యందు శ్రీకృష్ణభగవానునిచే ఉపదేశించబడిన పరమోన్నత యోగము భక్తియోగయే. మనుజుడు ఓర్పును కలిగియుండుటకు యత్నించవలెననియు, సుఖదుఃఖములచే కలత చెందరాదనియు భగవద్గీత యందు పేర్కొనబడినది. భౌతిక సౌఖ్యములచే తనకెట్టి కలత కలుగుట లేదని ఎవరైనను పలికిన పలుకవచ్చును; కాని ఆ నామమాత్రపు సౌఖ్యమును అనుభవించిన పిమ్మట దుఃఖము వచ్చిపడునని వారెరుగరు. అదియే భౌతిక జగత్తు నియమము. యోగపద్ధతి ఆత్మ యొక్క విజ్ఞానశాస్త్రమని కపిలభగవానుడు పలికెను. ఆధ్యాత్మికస్థితి యందు పరిపూర్ణత్వమును బడయుట కెవరైనను యోగ నభ్యసించవలెను; సుఖ దుఃఖములనెడి ప్రశ్నయే అచ్చట ఉదయించదు. అది దివ్యమైనది. ఏ విధముగా అది దివ్యమైనదో కపిలభగవానుడు ముున్ముందు వివరించును. అయినను ప్రారంభ పరిచయము ఇచ్చట ఒసగబడినది.

ఈ భౌతిక లోకంలో సుఖమును పెంచుకోవాలని మరియు దుఃఖములను తగ్గించు కోవాలనుకొనుటనే జీవితపోరాటమని అంటారు. సాధారణంగా భౌతిక లాభముల కొరకు యోగాభ్యాసమును చేస్తారు. ఎనిమిది రకాల యోగసిద్ధులు కలవు. అణిమ, లఘిమా, ప్రాప్తి, ఇశిత్వా, వశిత్వా, మహిమా, ప్రాకామ్య మరియు కామావసాహితా. నిజమైన యోగి సూక్ష్మాతి సూక్ష్మముగా, అత్యంత తేలికైనవాడిగా, అత్యంత బరువైనవాడిగా మారగలడు. అతడు కోరుకున్నదానిని చేతిలో వెంటనే ఉత్పత్తి చేయగలడు. అతడు లోకాన్ని సైతం సృష్టించగలడు. ఇవి కొన్ని యోగ సిద్ధులు. కాని పరమోన్నతమైన యోగపద్ధతి భౌతిక సుఖాలను పొందేలా లేదా భౌతిక దుఃఖముల నుండి విముక్తి పొందటానికై ఉద్దేశించ బడలేదని ఇక్కడ తెలుప బడినది. భౌతిక దుఃఖముల నుండి విముక్తి మరియు భౌతిక సుఖాలను పొందుట కొరకు ప్రతిఒక్కరు ప్రయత్నిస్తుంటారు. ఏ భౌతిక విషయంలోనైనను కేవలం బూటకపు సుఖం మరియు బూటకపు దుఃఖమే ఉండును. ఉదాహరణకు, బాణాసంచా కాల్చబడు చున్నప్పుడు అది కొందరికి ఆనందమును మరికొందరికి బాధను కలిగించవచ్చును. కొందరు ఈ టపాకాయలు ఎంతో ఆనందమును కలిగిస్తున్నాయని అనుకుంటారు. కాని మనము వాటిని గొప్ప ఆటంకములుగా భావిస్తుంటాము. అది భౌతిక ప్రపంచము. ఒకవైపు ఆనందము మరోవైపు దుఃఖము. నిజానికి సుఖము మరియు దుఃఖము రెండు భ్రాంతితో కూడుకున్నవే. వేసవికాలంలో నీరు ఎంతో సుఖమును కలిగిస్తుంది, కాని అదే నీరు శీతాకాలంలో బాధను కలిగిస్తుంది. కాబట్టి అవి ఒక సమయంలో సుఖమును మరియు మరొక సమయంలో బాధను కలిగిస్తున్నవి. పుత్రుడు జన్మించినపుడు ఆనందము కలుగును. కాని అతడు మరణించినచో దుఃఖం కలుగును. ఏ సందర్భంలో నైనను పుత్రుడు ఒక్కడే.

ఈ భౌతిక లోకం ద్వంద్వములతో కూడుకొన్నది. మనము సుఖములను దుఃఖములు లేకుండ మరియు దుఃఖములను సుఖములు లేకుండ అర్థం చేసుకోలేము. అందుకే ఈ ప్రపంచమును ద్వంద్వ ప్రపంచమంటారు. ఆధ్యాత్మిక ఆనందము ఈ ద్వంద్వములకు అతీతమైనది. *'యోగ అధ్యాత్మికః.'* ఆధ్యాత్మిక సుఖమనేది యోగ యొక్క పరిపూర్ణత. యోగ అనేది ఆత్మ యొక్క ఆనందం. జీవాత్మ పరమాత్మతో నివసించు నప్పుడు ఆనందముగా ఉండును. *"నిత్యో నిత్యానాం చేతనశ్చేతనానామ్."* పరమాత్మ లేదా పరమ పురుషుడు కలడు. అంతేకాకుండ ఎన్నో జీవాత్మలు కూడ కలవు. కాని జీవాత్మకు మూలమైన ఆదిపురుషుడు మాత్రం

ఒకడే. అదే శ్రీకృష్ణుడు. అతడు అగ్నిలాంటి వాడు మరియు మనము అగ్ని యొక్క కణాలము. అగ్నితో ఉన్నపుడు కణములు ప్రకాశించును, కాని కణములు అగ్ని సాన్నిధ్యాన్ని వదిలిన వెంటనే ఆరిపోవును. ఆ విధముగా పరమ పురుషునితో కలిసి అనుభవించుటలో మనకు నిజమైన ఆనందము కలుగును. ఆనందమనేది అతడి సాంగత్యములోనే కలదు. శ్రీకృష్ణుడు ఒంటరివాడు కాదు, అతడు సర్వదా అతని మిత్రులతో, గోపికలతో, గోపబాలురతో లేదా అతని తల్లితండ్రితో కలిసి ఉండును. శ్రీకృష్ణుడు ఒంటరిగా ఉండుటమనేది మనకెన్నడు కనిపించదు. అతడు శ్రీమతి రాధారాణితో లేదా అతని భక్తులతో ఉండును. అతడు రాజు లేదా అధ్యక్షుడి వంటివాడు. ఎవరైనను రాజు లేదా అధ్యక్షుడు వస్తున్నారన్నచో అతడు ఒంటరిగా వచ్చుట లేదని మనమర్థము చేసుకోగలము. అతడు తన కార్యదర్శులతో, మంత్రులతో, మరెందరితోనో కలిసివచ్చును.

'యోగ' అనే పదానికి 'కలయిక'(కలుపుట) అని అర్థం. మరియు 'ఆత్మ' అనగా కొన్నిసార్లు మనస్సు లేదా శరీరమని చెప్పబడినది. పరమ పురుషునితో భౌతిక శరీరమునకు ఎలాంటి సంబంధము లేదు. ఎందుకనగా పరమ పురుషుడు దివ్యుడు. అతడు మాయతో కప్పబడి భౌతికత్వమును కలిగి ఉన్నాడని భావించినచో దానికి అర్థం అలా భావించువాడే మాయతో కప్పబడి ఉన్నాడని అర్థం చేసుకోవాలి. శ్రీకృష్ణుడు తాను సాధారణ జీవునిగా అవతరించెదనని చెప్పలేదు. అతని అవతరణ పూర్తిగా దివ్యమైనది. *"జన్మ కర్మ చ మే దివ్యమేవం యో వేత్తి తత్త్వతః."* (భగవద్గీత 4.4) కాబట్టి మనం శ్రీకృష్ణుడు ఎలా జన్మించునని తెలుసుకోవలెను. అది సాధారణమైనది కాదు. అతని జన్మ సాధారణమైనచో మనమెందుకు జన్మాష్టమినీ జరుపు కుంటున్నాము? అతని జన్మ దివ్యమైనది. శ్రీకృష్ణునికి సంబంధించిన దంతయు దివ్యము. శ్రీకృష్ణుడు మనలాంటి వాడని భావించినచో వెంటనే మనము మూర్ఖుల మగుదుము. భగవద్గీత(9.11)లో చెబుతున్నట్లుగా :

అవజానన్తి మాం మూఢా మానుషీం తనుమాశ్రితమ్
పరం భావమజానన్తో మమ భూతమహేశ్వరమ్

"సర్వమునకు పరమ ప్రభువునైన నా దివ్యత్వమును వారెరుంగక నేను మానవ రూపముతో అవతరించినప్పుడు మూఢులు నన్ను అపహసింతురు."

వాస్తవానికి శ్రీకృష్ణుడు ఆదిదేవుడు, మూలపురుషుడు. మనం శ్రీకృష్ణుని అణు అంశలము మాత్రమే. శ్రీకృష్ణునితో సంబంధమును కలిగి ఉన్నట్లయితే,

మనం శ్రీకృష్ణుడు ప్రకాశించునట్లుగా ప్రకాశించగలము. మనం శ్రీకృష్ణుని విడిచినచో మన ఆధ్యాత్మిక శక్తి మరియు ప్రకాశము నశించును. 'యోగ' అనే శబ్దమునకు కలుపుట లేదా ఆది అయిన దానితో సంకలనము చేయుట అని అర్థం. 'యోగ' అనేది సంస్కృత శబ్దం 'కలుపుట' అనే అర్థం కలది. మరియు 'వియోగం' అనగా 'విడిపోవుట'.

కపిల దేవుడు దేవాదిదేవుడని పేర్కొనబడెను. భగవంతుడు పొరపాట్లను చేయడు. *"నారాయణః పరోఽవ్యక్తాత్"* – శంకరాచార్యుల వారు కూడ "నారాయణుడు, భగవంతుడు ఈ భౌతిక లోకానికి చెందినవాడు కాదని చెబుతున్నాడు." మనము భగవానుని గురించి చర్చించినప్పుడు లేదా శాస్త్రములు భగవంతుని గురించి పేర్కొనినప్పుడు, మనమతడిని భౌతిక అవగాహనకు అతీతుడని తెలుసుకుంటాము. *'శ్రీభగవానువాచ'* అని ఇక్కడ చెప్పబడినట్లు, ఇక్కడ 'వ్యాసదేవ ఉవాచ' లేదా 'కపిలదేవ ఉవాచ' అని చెబుతున్నాడు. అదేవిధముగా భగవద్గీతలో వ్యాసదేవుడు *'శ్రీభగవానువాచ'* అని చెబుతున్నాడు. భగవంతుడైన వాడు భౌతిక లోకములోని లోపాలకు అతీతముగా ఉంటాడు. భగవంతుడు జీవుల వలె నాలుగు రకాల లోపాలకు అతీతుడు. అసంపూర్ణు లైనందున జీవులు భ్రాంతి వలన పొరపాట్లను చేయు స్వభావమును మరియు ఇతరులను మోసగించేటి గుణమును కలిగి ఉంటారు. జ్ఞానం లేనివాడు ఉపాధ్యాయునిగా లేదా బోధకునిగా నటించినచో, అతడు నిజానికి ఇతరులను మోసగిస్తున్నాడని అర్థం. జనులు పరిపూర్ణ జ్ఞానమును కలిగి లేనందున భగవానుడు ఉపదేశించిన దానిని మాత్రమే బోధించుటకు మేము ప్రయత్నిస్తుంటాము. మేము మా స్వంత ఉపదేశాలను తయారు చేయము. పండితులని పిలువబడేవారు మరియు విద్యావంతులు తమ స్వంత ఉపదేశాలను తయారుచేస్తూ వాటికి వారి స్వంత అభిప్రాయాలను జోడిస్తుంటారు. ప్రత్యేకించి, పాశ్చాత్య దేశాలలో తత్త్వమును గురించి ఎన్నో తర్కయుక్తులను చేస్తుండుటను మనం గమనించ వచ్చును. కాని అలాంటి తత్త్వం ఎన్నడు పరిపూర్ణము కాలేదు. భగవంతుని నుండి ఉపదేశములను పొందవలెను. అప్పుడే అవి పరిపూర్ణ ములగును. మనం భగవద్గీతను చదువుతాము. ఎందుకంటే అది పరిపూర్ణమైనది దోషములు లేనిది. దానిలో భ్రాంతి మోసము లేదు. అంతేకాకుండ, అది లోప భూయిష్టమైన ఇంద్రియాలు గలవారితో ప్రతిపాదించ బడలేదు. శ్రీకృష్ణుడు భగవద్గీత (7.26)లో ఇలా చెబుతున్నాడు :

వేదాహం సమతీతాని వర్తమానాని చార్జున
భవిష్యాణి చ భూతాని మాం తు వేద న కశ్చన

"ఓ అర్జునా! దేవాదిదేవుడ వగుటచే నేను భూతకాలమున జరిగినట్టియు, వర్తమాన కాలమున జరుగుచున్నట్టియు, భవిష్యత్కాలమున జరుగబోవునట్టియు సర్వమును ఎరుగుదును. అందరు ప్రాణులను కూడా నేను ఎరుగుదును. కాని నన్నెవ్వరును ఎరుగరు."

భగవంతుడికి సర్వము తెలుసును. కాని మనకు భగవంతుడు అనగా ఏమిటో తెలియదు. అది మన స్థితి. మన స్థితి తెలియకుండా ఉన్నది. *"ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి"* – ఈశ్వరుడు, శ్రీకృష్ణుడు అందరి హృదయాలలో ప్రతిష్ఠితుడై ఉన్నాడు (భ.గీ. 18.61). *"సర్వస్య చాహం హృది సన్నివిష్టః"* : "నేను ప్రతిజీవి హృదయములోనికి ప్రవేశించితిని." (భ.గీ. 15.15) భగవంతుడు కేవలం మానవుల హృదయాలలోనే కాకుండ జంతువులు మరియు ప్రతి ప్రాణి హృదయములోను నెలకొని ఉండునని పరమపురుషుడు పేర్కొనెను.

అండాంతరస్థపరమాణుచయాంతరస్థం
గోవిందమాదిపురుషం తమహం భజామి

(బ్రహ్మ సంహిత 5.35)

భగవంతుడు అణువులో కూడ ఉండును. కాబట్టి అతడు జీవాత్మలో కూడ ఉండును. అంతటా ఉన్నందున అతడికి సర్వం తెలుసును. అతడికి సర్వం తెలిసినందున మనమతని నుండి ఉపదేశములను పొందవలెను. భగవంతుడు తెలుపుతున్న దానినంతటిని సంపూర్ణ మైనదని మనం అంగీకరించుట వలన మనం పరిపూర్ణ జ్ఞానమును పొందగలుగుతాము. ఈ జ్ఞానమును పొందుటకు పరంపర పద్ధతి కలదు. అది భగవద్గీత(4.2)లో ఇట్లు వివరించబడెను :

ఏవం పరమ్పరాప్రాప్తమిమం రాజర్షయో విదుః

"ఈ ఉత్తమమైన యోగశాస్త్ర మీ విధముగా గురుశిష్య పరంపరా క్రమమున గ్రహింపబడినది. రాజర్షులు దీని నా విధముగా తెలిసికొనిరి." ఈ కృష్ణ చైతన్య తత్త్వం ఎంతో సరళమైనది. ఎందుకనగా మేము సిద్ధాంతములను తయారు చేయము. పరమ పురుషుడు, శ్రీకృష్ణుడు లేదా అతని అవతారము లేదా అతని ప్రతినిధి తెలిపిన సిద్ధాంతములను, మరియు ఉపదేశములను యదావిధిగా మేము

అంగీకరిస్తాము. అతని ప్రతినిధి స్వయంగా శ్రీకృష్ణుడు తెలుపని దానినెన్నడు తెలుపడు. ప్రతినిధిగా ఉండుట ఎంతో సులభము. కాని శ్రీకృష్ణుని ఉపదేశములను తాము ఇష్టం వచ్చినట్లుగా వక్రీకరించుటకు ప్రయత్నించినచో వాటివలన ఎవరూ కూడ శ్రీకృష్ణుని ప్రతినిధి కాలేరు.

శ్రీకృష్ణుని కంటే గొప్ప ప్రామాణికత మరొకటి లేదు, మనము ఈ సూత్రానికి కట్టుబడినచో గురువులము కావచ్చును. గురువు అయ్యేందుకు మన ప్రస్తుత స్థితిని మార్చుకోవలసిన అవసరం లేదు. మనం చేయవలిసినదల్లా శ్రీకృష్ణుని నుండి ప్రారంభమైన పరంపరా పద్ధతిని అనుసరించవలెను. శ్రీ చైతన్య మహాప్రభు : *"అమార ఆజ్ఞాయ్ గురు హోన తార్ ఏయ్ దేశ్"* అని ఆదేశించారు (శ్రీ చైతన్య చరితామృతము, మధ్యలీల 7.128). శ్రీ చైతన్య మహాప్రభువు తన బోధనలను తెలుసుకొని తర్వాత వారి గ్రామాలలోని జనాలకు బోధించమని ఆజ్ఞాపించెను. ఎవరైనను, "నేను విద్య లేనివాడను నేను గొప్ప కుటుంబములో జన్మించలేదు, మరి నేనెలా గురువు నగుదును?" అని భావించవచ్చును. కాని శ్రీ చైతన్య మహాప్రభువు ఇదేమి గొప్ప విషయమేమీ కాదని చెబుతున్నారు. *"యారే దేకో తారే కహో కృష్ణ – ఉపదేశ్"* – "కేవలం శ్రీకృష్ణుడు ఉపదేశించిన దానిని తిరిగి ఉపదేశించండి. దానితో నీవు గురువు కాగలవు." ఎవరైనను శ్రీకృష్ణుడు బోధించిన దానిని బోధింపనిచో గురువు కాలేరు. అతడు కేవలము మూర్ఖుడగును. గురువనే వాడు శ్రీకృష్ణుడు బోధించినదానినే బోధించును. అది శాస్త్రోపదేశము.

షట్కర్మనిపుణో విప్రో మంత్రతంత్రవిశారదః
అవైష్ణవో గురుర్నాస్యాద్ వైష్ణవః శ్వపచో గురుః

"అవైష్ణవుడైన బ్రాహ్మణ పండితుడు వైదిక శాస్త్రజ్ఞానంలో నిపుణుడైనప్పటికినీ అతడు ఆధ్యాత్మికాచార్యుడగుటకు అనర్హుడు. కాని ఒకవ్యక్తి నీచజాతిలో జన్మించినను అతడు వైష్ణవుడైనచో అతడు ఆధ్యాత్మికాచార్యుడు కావచ్చును." (పద్మపురాణము)

జనులు అజ్ఞానములో ఉన్నారు. కాబట్టి వారికి జ్ఞానోదయము చేయవలెను. మనం చివరకు జంతులోకం నుండి మానవ జన్మవరకు వచ్చాము. మరియు ఈ మానవ శరీరము జననమరణమనే చక్రము నుండి బయటపడుటకు అవకాశమును కలిగించును. కృష్ణ చైతన్య సంఘపు లక్ష్యం జనులను వారి నిజచైతన్య స్థితికి తీసుకురావటమే. *"జీవ్ జాగో జీవ్ జాగో గౌరాచాంద బోలే."* 'గౌరాచాంద' అనే పదం శ్రీ చైతన్య మహాప్రభువును సూచిస్తుంది. జీవులతో అతడు ఇలా చెబుతున్నాడు,

"మేల్కొనండి! మేల్కొనండి! ఎంతకాలం మీరు ఇలా నిద్రను కొనసాగిస్తారు?" *"కోత నిద్ర జావో మాయ్ పిశాచిర్ కొలే."* అదే అక్కడ కూడ చెప్పబడినది. పరమ పురుషునితో తిరిగి అనుబంధమును కలిగించు కొనుటయే జీవుల ప్రధాన ధర్మము. యోగ యొక్క లక్ష్యం కృష్ణచైతన్యమును జాగృతపరుచుట అనగా తిరిగి శ్రీకృష్ణుడితో సంబంధమును ఏర్పరచుకొనుట. అది 'ఆధ్యాత్మిక యోగ'. యోగ అనగా ఏదో ఇంద్రజాలము కాదు. భగవద్గీత(6.47)లో శ్రీకృష్ణుడు స్వయంగా అత్యున్నతమైన యోగిని గురించి ఇలా వివరించాడు :

యోగినామపి సర్వేషాం మద్గతేనాన్తరాత్మనా
శ్రద్ధావాన్ భజతే యో మాం స మే యుక్తతమో మతః

"అధికమైన విశ్వాసముతో నా యందుండి తనలో నన్నే తలంచుచు నాకు ప్రేమ యుక్తమైన దివ్యసేవ చేయువాడు యోగము నందు నాతో మిక్కిలి సన్నిహితముగా కలిసి యున్నవాడును యోగులందరిలో అత్యుత్తమమైన వాడగును. ఇది నా అభిప్రాయము."

ఎందరో యోగులు మరియు ఎన్నో యోగవిధానముల గురించి భగవద్గీతలో చర్చించబడెను. హఠయోగ, జ్ఞానయోగ, మరియు రాజయోగ కలవు. నిజమైన యోగ విధానము శ్రీకృష్ణునితో మన సంబంధమును తిరిగి నెలకొల్పుట కొరకు ఉద్దేశించబడినది. *"యోగ ఆధ్యాత్మికః పుంసామ్"* అని చెప్పబడినది. *ఆధ్యాత్మికః* అనగా మనం జీవాత్మలము, మనం శ్రీకృష్ణుడితో విడిపోలేదు. కాని కేవలం అతడిని మనం విస్మరించాము. విడిపోవుట అనునది సాధ్యం కాదు. కాని కప్పబడి ఉండుట మనేది సాధ్యపడును. భగవద్గీత(7.25)లో శ్రీకృష్ణుడి వాక్యములలో :

నాహం ప్రకాశః సర్వస్య యోగమాయాసమావృతః
మూఢోఽయం నాభిజానాతి లోకో మామజమవ్యయమ్

"మూఢులకును మందబుద్ధులకును నేను వ్యక్తము కాను. వారికి నేను యోగ మాయచే కప్పబడియుందును. అందుచే వారు నేనజుడననియు, అవ్యయుడననియు నెరుంగరు."

'యోగ' మరియు *'యోగమాయ'* కలదు. *'యోగమాయ'* అనగా విస్మరించుట. మొదట ఆత్మ అంటే ఏమిటో తెలుసుకోవలెను. ప్రస్తుతము ప్రజలు ఎంతటి అజ్ఞానములో ఉన్నారంటే వారికి ఆత్మగురించి ఏమాత్రం తెలియదు. కాబట్టి

భగవద్గీత ప్రారంభములో(2.13) ఆత్మను గురించి ఇలా తెలుపబడినది :

దేహినోఽస్మిన్ యథా దేహే కౌమారం యౌవనం జరా
తథా దేహాన్తరప్రాప్తిర్ధీరస్తత్ర న ముహ్యతి

"బద్ధజీవుడు అవిచ్ఛిన్నముగా ఈ దేహమునందు బాల్యమునుండి క్రమముగా యౌవనమును, ముసలితనమును పొందుచుండునట్లు జీవాత్మ కూడ మరణ సమయమున మరొక దేహమును పొందును. అట్టి మార్పుచే ధీరుడెప్పుడును మోహము నొందదు." 'దేహి' అనే పదానికి 'శరీరం యొక్క అధిపతి' అని అర్థం. "నేను ఈ శరీరమును" అని భావిస్తుంటాము. కాని వాస్తవానికి ఇది నిజం కాదు. మనం శరీరమునకు యజమానులమని తెలుసుకొనుటయే ఆత్మ యొక్క వాస్తవ అవగాహన. మనం "నేను ఈ వేలు" లేదా "నేను ఈ చేయి" అని చెప్పము. ఇది "నా వేలు" ఇది "నా తల" ఇది "నా శరీరం" అనగా నేను శరీరమునని చెబుతుంటాము. ఆ విధముగానే, ఈ శరీరాన్నంతటిని గురించి కూడ ఆ విధముగానే చెప్పవచ్చును. "ఇది నా శరీరం" అనగా ఈ శరీరమునకు యజమానినీ అని అర్థం. శరీరమనేది భౌతిక శక్తియైన మాయ చేత ఇవ్వబడినది.

ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః
అహంకారవిమూఢాత్మ కర్తాహమితి మన్యతే

"అహంకారము యొక్క ప్రభావముచే కలత నొందింపబడినదై జీవాత్మ నిజముగా భౌతిక ప్రకృతి యొక్క త్రిగుణములచే చేయబడిన కర్మలకు తానే కర్తనని భావించును." (భ.గీ. 3.27)

జీవులు తమ కర్మలను బట్టి వివిధ రకాల శరీరములను పొందుతుంటారు. ఒక జీవుడు పిల్లి శరీరం, మరో జీవి కుక్క శరీరమును మరియు మరొకరు మరొక శరీరమును పొందవచ్చును. ఎందుకు వివిధ రకాల శరీరములు కలవు? ఎందుకు ఒకే రకమైన శరీరములు లేవు? దీనికి సమాధానము కూడ భగవద్గీత (13.22)లో చెప్పబడినది :

కారణం గుణసఙ్గోఽస్య సదసద్యోనిజన్మసు

"ప్రకృతి గుణముల సంపర్కము వలన అతడు పెక్కు జీవజాతులలో ఉత్తమ, అధమ జన్మలను పొందుచుండును."

ఆత్మ భౌతిక ప్రకృతి యొక్క త్రిగుణాలచే సాంగత్యము చేయుట వలన (సత్త్వ, రజో మరియు తమోగుణము) జీవుడు వివిధ రకాల శరీరములను పొందుతాడు. మనము రాబోవు శరీరం గురించి ఆలోచించకూడదు. అది తప్పక మరొక రకమైన శరీరమని తెలుసుకోగలము. ఒకరికి ఎలాంటి శరీరం లభించునను దానిని శ్రీకృష్ణుడు చెప్పలేదు. అది అర్హతను బట్టి లభించును. మనం కనుక సత్త్వగుణ సంపన్నులమైనచో ఉన్నత లోకాలకు వెళ్ళెదము. రజోగుణము చేత కనుక మనం సాంగత్యం చేసినచో ఇక్కడే ఉండిపోవుదుము. మరియు ఒకరు కనుక తమోగుణం మరియు అజ్ఞానం యొక్క సాంగత్యమును చేసినచో, అతడు నీచజన్మలకు అనగా జంతువులు, మొక్కలు, వృక్షాల స్థితికి దిగజారును. దీనిని భగవద్గీత(14.18) లో శ్రీకృష్ణుడు ఈ విధముగా ప్రకటించెను :

ఊర్ధ్వం గచ్ఛన్తి సత్త్వస్థా మధ్యే తిష్ఠన్తి రాజసాః
జఘన్యగుణవృత్తిస్థా అధో గచ్ఛన్తి తామసాః

"సత్త్వగుణము నందున్నవారు క్రమముగ ఊర్ధ్వలోకములకు పోవుదురు. రజో గుణము నందున్నవారు భూలోకమునందే నివసింతురు. హేయమైన తమోగుణము నందున్నవారు నరక లోకములకు పతనమవుదురు."

84 లక్షల జీవరాసులు కలవు. మరియు ఇవన్నీ గుణముల యొక్క సాంగత్యం చేతనే వృద్ధి చెందుతున్నవి*(కారణం గుణసంగోఽస్య).* శరీరమును అనుసరించే ఒకరు ఆనందమును లేదా సుఖమును గాని పొందుతారు. ఒక ధనికుడు లేదా రాజు అనుభవించెడి సుఖమును అనుభవించ వలెనని కుక్క ఆశించ రాదు. ఏమైనను, మనం ఈ సుఖమును లేదా ఆ సుఖమును అనుభవించుటయే, లేదా ఈ దుఃఖమును లేదా ఆ దుఃఖమును అనుభవించుట, ఈ సుఖదుఃఖాలన్నీ కేవలం భౌతిక శరీరం వలన కలుగుచున్నవి. మనం కనుక శ్రీకృష్ణుడితో పరమ యోగ ద్వారా సంబంధమును ఏర్పరుచుకున్నచో, మనం శరీరము వలన పొందుతున్న ఈ భౌతిక సుఖదుఃఖాల నుండి ఉపశమనమును పొందవచ్చును. తిరిగి శ్రీకృష్ణునితో సంబంధమును ఏర్పరచుకొనుటను "భక్తియోగ" అంటారు. పరమయోగను గురించి ఉపదేశించుటకు శ్రీకృష్ణుడు అవతరించును. సారాంశముగా అతడు మనకు ఇలా తెలుపును, "ఓ మూర్ఖుడా! కేవలం నాతో నీ సంబంధమును తిరిగి నెలకొల్పుకొనుము. తయారు చేయబడినట్టి యోగ మరియు వివిధ ధర్మము లన్నింటిని విడిచి నన్నే శరణు పొందుము." అదే శ్రీకృష్ణుని

ఉపదేశము. అంతేకాదు శ్రీకృష్ణుని ప్రతినిధి, లేదా భగవంతుని అవతారము, లేదా గురువు కూడ అదే విషయమును తెలుపును. కపిలదేవుడు శ్రీకృష్ణుని అవతారమైనను, అతడు శ్రీకృష్ణుని ప్రతినిధి వలె గురువు వలె నడుచుకొనెను. కేవలం శ్రీకృష్ణుడికి శరణు పొందవలెననెడి సూత్రమును మనము అంగీకరించినచో, ఈ భౌతిక ఆనందమునకు అతీతుల మగుదుము. మనం భౌతిక సుఖము లేదా భౌతిక దుఃఖముల చేత బంధించబడరాదు. అవే బంధములకు కారణము. భౌతిక ఆనందమనేది నిజమైన ఆనందము కాదు. ఇది నిజానికి దుఃఖపూరితమైనది. మనం డబ్బు సంపాదన చేత ఆనందమును పొందాలను కుంటాము. కాని డబ్బు సులభముగా లభించదు. కాబట్టి మనం దానికొరకై కఠోర పరిశ్రమను చేయవలెను. ఏమైనను, అవాస్తవమైన సుఖమును పొందగలమనే ఆశతో దుఃఖమును భరిస్తాము. మనము మన ఇంద్రియాలను శుద్ధిచేసుకున్నప్పుడే ఆధ్యాత్మిక స్థితిని పొందగలము. మన ఇంద్రియములతో శ్రీకృష్ణుడి ఇంద్రియాలను సేవించుట వలన నిజమైన ఆనందమును పొందగలుగుదుము. ఈ విధముగా మన ఇంద్రియాలు ఆధ్యాత్మికము లగును. దీనిని 'ఆధ్యాత్మిక యోగ' లేదా భక్తియోగ అంటారు. కపిల భగవానుడు ఈ యోగను ఇక్కడ వివరించెను.

అధ్యాయము 8

భక్తియోగ : పరమయోగ పద్ధతి

శ్లోకము 14

తమిమం తే ప్రవక్ష్యామి యమవోచం పురానఘే
ఋషీణాం శ్రోతుకామానాం యోగం సర్వాంగనైపుణమ్

ఓ పరమపుణ్య జననీ! పూర్వము ఋషులకు నాచే వివరింపబడిన పురాతన యోగవిధానమును నేనిప్పుడు నీకు వివరింతును. అది అన్ని విధముల ఉపయుక్తమైనది మరియు ఆచరణయోగ్యమైనది.

భాష్యము : భగవానుడు ఏనాడును క్రొత్త యోగవిధానమును రూపొందించడు. ఎవరో అవతారపురుషుడు తయారయ్యాడని, పరతత్త్వానికి క్రొత్త అవగాహన తెలుపుతున్నాడని పలుకుట సర్వసాధారణ విషయమే. కాని ఇక్కడ మనము గాంచినదేమనగా కపిలముని సాక్షాత్తుగా భగవానుడే అయినను, తన తల్లి కొరకై క్రొత్త సిద్ధాంతమును తయారుచేయగల సమర్థుడే అయినను : "పూర్వమొకసారి మహర్షులకు తాను వివరించిన పురాతన విధానమును నేనిపుడు వివరింతును; వారును దానిని వినుటకు మిగుల కుతూహలమును కలిగియుండిరి" అని పలికెను. ఉత్తమోత్తమమైన పరమశ్రేష్ఠమగు విధానము వేదవాఙ్మయమున ఇదివరకే లభ్యమైయున్నప్పుడు అమాయక జనులను మోసగించుటకు క్రొత్త విధానమును కల్పింపనవసరము లేదు. కాని ప్రామాణిక విధానమును త్రోసిపుచ్చి, క్రొత్తగా కనిపెట్టబడిన యోగవిధానము పేరిట ఏదో బూటకమైనదానిని ప్రతిపాదించుట ప్రస్తుతకాలమందు మోజుగా తయారైనది.

సనాతమైన ప్రాచీనయోగ పద్ధతి ఆత్మకు సంబంధించినది. ప్రత్యేకించి అమెరికా దేశంలో హఠయోగ అనేది ఇప్పుడెంతో ప్రసిద్ధి చెందినది. ఇది లావుపాటి స్త్రీలు తమ బరువును తగ్గించుకొని వారి జీర్ణశక్తిని క్రమబద్ధీ కరించుటకు ఉపయోగపడుతుంది. ఎంతోమంది జనులు ఇటువంటి వ్యాయామ యోగలో ఆసక్తిని కనపరుస్తుంటారు. కాని వాస్తవమైన యోగ అనేది 'ఆధ్యాత్మిక' మైనది. 'ఆధ్యాత్మిక' అనగా ఆత్మను తన నిజస్థితిలో జాగృతపరచుట. ఆత్మ అనేది పురుషుడు. శ్రీకృష్ణునితో కోల్పోయిన సంబంధమును తిరిగి నెలకొల్పు కొనుటయే అతని(ఆత్మ) ధర్మము.

ఇక్కడ కపిల దేవుడు ఈ యోగపద్ధతిని గొప్ప ఋషులకు బోధించెనని చెబుతున్నాడు. ఆ పద్ధతిని 'శ్రవణము' చేయుటకొరకు మానవుడు ఉత్సాహమును చూపించవలెను. ఎందుకనగా ఆధ్యాత్మిక జీవితమనేది శ్రవణము నుండి ప్రారంభమగును.

అతః శ్రీకృష్ణనామాది న భవేద్ గ్రాహ్యమింద్రియైః
సేవోన్ముఖే హి జిహ్వాదౌ స్వయమేవ స్ఫురత్యదః
(భక్తిరసామృత సింధువు 1.1.234)

మన భౌతిక జడ ఇంద్రియాలచే శ్రీకృష్ణుని అర్థం చేసుకొనుట సాధ్యపడదని శాస్త్రములలో తెలుపబడెను. శ్రీకృష్ణుని నామము, రూపము, గుణములు, లీలలు పరికరములు మరియు ధామము ఇవన్నీ శ్రీకృష్ణుని అంశలు. ఏమైనను శ్రీకృష్ణుని అర్థం చేసుకొనుట అతని నామరూపములను గురించిన శ్రవణ కీర్తనములను చేయుట ద్వారా ప్రారంభమగును. సాధారణంగా కనిష్ఠభక్తుడికి భగవంతుని నామం మరియు గుణాలు అతని స్వరూపమును దర్శించుట మరియు పూజించుట వంటివి ఎంతో ప్రధానమైనవి. అది శ్రీకృష్ణుని యొక్క అంతరంగిక ఉపదేశము :

మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు

"నీ మనస్సును సదా నన్ను స్మరించుటలోనే వినియోగించుము, నాకు నమస్కరింపుము మరియు పూజించుము." (భ.గీ. 9.34)

మందిరములోని విగ్రహములోను శ్రీకృష్ణభగవానుడు నెలకొని ఉన్నాడు. ఒక చిన్న బాలుడు అక్కడకు నమస్కరించుటకు వచ్చినచో ఆ బాలుడు భక్తుడిగా పరిగణించబడును. బాలుడికి ఏమీ తెలియకపోవచ్చును. కాని, అర్చామూర్తుల దర్శనము వలన కేవలం కీర్తన నృత్యముల వలన అతడు లాభమును పొందగలడు. ప్రతిఒక్కరికి అడుగడుగులో కృష్ణచైతన్యములో అభివృద్ధి చెందుటకు ఆవకాశమును కలిగించుటకు మందిరాలనేవి నిర్దేశింపబడినవి.

స్వల్పమప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్

"ఈ మార్గంలో కొద్దిగానైన అభివృద్ధి సాధించినచో గొప్ప ప్రమాదముల భయం నుండి రక్షణ మానవునకు కలుగును." (భ.గీ. 2.40) భక్తిమార్గంలో కొద్దిగానైన పురోభివృద్ధిని సాధించినచో అది మన ఖాతాలోకి చేరుతుంది. ఉదాహరణకు,

మన ఖాతాలో రెండు వేలను జమ చేసినను, అది మన ఖాతాలోనే జమచేయబడును. అంతేకాకుండ అది వడ్డితో సహా వృద్ధి చెందును. ఆ విధముగా ఎవరైనను భక్తియుక్త సేవలో కొద్దిగానైననూ పాల్గొనినచో దానిని వారు నష్టపోరు. ఎవరైనను ఈ కృష్ణ చైతన్య ఉద్యమములో పాల్గొని, కొద్దికాలము సేవను చేసి తర్వాత పతనము చెందినను, అతడు చేసిన సేవ ఏదైనను అది శాశ్వతముగా నిలిచిపోతుంది. మరియు అది ఎప్పుడు నష్టపోదు. ఎవరైనను సేవను తిరిగి ప్రారంభింప దలచినచో, అతడు ఎక్కడ విడిచెనో అక్కడి నుండి తన సేవను ప్రారంభించును. ఇది భగవద్గీత యొక్క ఉపదేశము (6.41) :

సుచీనాం శ్రీమతాం గేహే యోగభ్రష్టోऽభిజాయతే

"పరిపూర్ణత్వమును పొందని యోగి ధార్మిక కుటుంబంలో లేదా భాగ్యవంతుల కుటుంబంలో గాని జన్మించును." కాబట్టి ఎవరైనను భక్తియోగను పూర్తి చేయుటలో విఫలమైనచో అతడికి మరొక అవకాశం తరువాతి జన్మలో ఇవ్వబడును. ఒక బెంగాలీ పద్యం ఇలా కలదు :

సుచి హయ్ ముచి హయ్ యది కృష్ణ త్యజే
ముచి హయ్ సుచి హయ్ యది కృష్ణ భజే

"ఎవరైనను కృష్ణభక్తిని అంగీకరించినచో అతడు చెప్పులు కుట్టెడి కుటుంబములో జన్మించినను(ముచి) అతడు బ్రాహ్మణుని కంటె గొప్పవాడగును. కాని ఎవరైన బ్రాహ్మణ కుటుంబంలో(సుచి) జన్మించినను అతడు కృష్ణ చైతన్యమును త్యజించినచో అతడు 'ముచి' అనగా చెప్పులు కుట్టువాడగును." కాబట్టి భక్తి అనే ద్వారము అందరి కొరకు తెరిచియే ఉన్నది. తన స్థితితో నిమిత్తం లేకుండ ఎవరైనను తనను శరణుపొందినచో వారు పరమగతిని పొందగలరని శ్రీకృష్ణుడు చెబుతున్నాడు.

మాం హి పార్థ వ్యపాశ్రిత్య యేऽపి స్యుః పాపయోనయః
స్త్రియో వైశ్యాస్తథా శూద్రాస్తేऽపి యాన్తి పరాం గతిమ్

"ఓ పృథాకుమారా! నీచ కుటుంబములో జన్మించినవారైనను స్త్రీ లైనను వైశ్యులైనను శూద్రులైనను నన్నాశ్రయించినచో దివ్యమైన గమ్యమును చేరజాలుదురు." (భ.గీ. 9.32) మరియు శ్రీ శుకదేవ గోస్వామి ఇలా చెబుతున్నాడు :

కిరాతహూణాంధ్రపుళిన్దపుల్కశా–
ఆభీరశుంభా యవనాః ఖసాదయః
యేఽన్యే చ పాపా యదపాశ్రయాశ్రయాః
శుధ్యన్తి తస్మై ప్రభవిష్ణవే నమః

“కిరాతులు, హూణులు, ఆంధ్రులు, పులిందులు, పుల్కషులు, ఆభీరులు, శుంభులు, యవనులు, ఖసజాతులకు చెందినవారు మరియు ఇతర పాపకర్ములు సైతము భగవద్భక్తుల ఆశ్రయమును పొందుట ద్వారా పవిత్రులు కాగలరు. భగవానుడు పరమశక్తి వంతుడగుటయే అందులకు కారణము. నేను ఆతడికి గౌరవపూర్వక వందనములను అర్పించుచున్నాను.”(భాగ. 2.4.18) కృష్ణచైతన్యము సంపూర్ణమైనది. అది అన్నింటిని ఆహ్వానిస్తుంది. బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు మరియు శూద్రులు ప్రతిఒక్కరూ తమ తమ వృత్తి ధర్మములను కలిగి ఉన్నప్పటికిని, వారు కృష్ణ చైతన్యవంతు లగుటకు వృత్తి ధర్మములను విడనాడవలసిన అవసరము లేదు. అలాగే ఎవరైనను కృష్ణ చైతన్యమును అంగీకరించి, దానిలో ఉత్తీర్ణులవ్వకుండ పతనం చెందినను అందులో నష్టపోరు. ఎవరైనను తమ స్వధర్మాన్ని పరిపూర్ణముగా ఆచరిస్తున్నను కృష్ణచైతన్యవంతులు కానిచో ఏమిటి లాభం? నిజానికి, దానివలన ఎటువంటి లాభం కలుగదు. భక్తియోగ మార్గమును ప్రారంభించిన వారెన్నడు నిజానికి పతనము చెందరు. ఎవరైనను తాత్కాలికముగా పతనము చెందినను భక్తియోగను ఒక్కసారి ప్రారంభించినచో అది కొనసాగు తుండునని కపిలదేవుడు వివరించెను. వారికి మంచి కుటుంబములో లేదా భాగ్యవంతుల కుటుంబములో లేదా పండితుల కుటుంబములో, బ్రాహ్మణ కుటుంబములో జన్మించుటకు అవకాశ మివ్వబడును. ఎవరైనను బ్రాహ్మణునివలె తన బాధ్యతలను నిర్వహించినచో, విష్ణు భగవానుడు ఎంతగానో సంతోషించును. అలాగే ఎవరైనను క్షత్రియుడుగా లేదా శూద్రుడిగా తమ బాధ్యతలను నిర్వర్తించినను విష్ణువు ఆనందించును. మానవుడు తన పరిస్థితిని మార్చుకోవలసిన అవసరము లేదు. భగవద్గీత(18.46)లో శ్రీకృష్ణుడు ప్రతిఒక్కరు తమ గుణకర్మల ననుసరించి పరిపూర్ణత్వమును సాధించ వచ్చునని తెలిపెను :

యతః ప్రవృత్తిర్భూతానాం యేన సర్వమిదం తతమ్
స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విన్దతి మానవః

"సర్వజీవులకు మూల కారణమును, సర్వవ్యాపకుడైన భగవంతుని మానవుడు తన స్వకర్మములను చేయుట ద్వారా అతడిని పూజించుటచే మానవుడు పరిపూర్ణత్వమును సాధించును." కాబట్టి ఎవరైనను పరిపూర్ణమైన క్షత్రియునిగా వైశ్యునిగా శూద్రునిగా తమ బాధ్యతలను సరిగ్గా నిర్వహించినచో విష్ణువు సంతోషించును. కర్మ యొక్క ఉద్దేశ్యం విష్ణువును సంతృప్తి పరుచుటయే. దురదృష్టవశాత్తు జనులు దీనిని విస్మరించారు. మానవులకు శ్రీకృష్ణుని సంతృప్తి పరచి తమ జీవితాలను పరిపూర్ణము చేసుకొనుటకు అవకాశ మిచ్చుటకు ఈ వైదిక సమాజ పద్ధతియైన వర్ణాశ్రమ ధర్మము ఉద్దేశింపబడినది. దురదృష్టవశాత్తు, వర్ణాశ్రమ ధర్మమనేది ఈ కాలంలో నశించిపోయినది. కాబట్టి శ్రీ చైతన్య మహాప్రభువు కలియుగములో మగ్గిపోతున్న బద్ధజీవులకు ఉపశమనమును కలిగించుటకై మహామంత్రమును అందించెను.

హరేర్నామ హరేర్నామ హరేర్నామైవ కేవలమ్
కలౌ నాస్త్యేవ నాస్త్యేవ నాస్త్యేవ గతిరన్యథా

"కపటము మరియు కలహములతో కూడిన ఈ యుగము నందు భగవంతుని పవిత్రనామ సంకీర్తనము చేయుటమే ముక్తికి గల ఏకైక సాధనము. మరొక మార్గము లేదు. మరొక మార్గము లేదు. మరొక మార్గము లేదు." (బృహన్నారదీయ పురాణము) ఈ యుగంలో మనం పరిపూర్ణమైన వర్ణాశ్రమ ధర్మమును పునరుద్ధరించుటకు ప్రయత్నించినను అది సాధ్యపడదు. జనులు పతితులు కలతలతో నిండి ఉంటారు. అంతేకాకుండ వారు దురదృష్టవంతులు :

ప్రాయేణాల్పాయుషః సభ్య కలావస్మిన్ యుగే జనాః
మందాః సుమన్దమతయో మందభాగ్యా హ్యుపద్రుతాః

"ఓ ఋషులారా! ఈ కలియుగమునందు జనులు అల్పాయుష్కులుగా నుందురు. వారు కలహస్వభావులు, బద్ధకస్తులు, తప్పుదోవ పట్టింపబడినవారు, మందభాగ్యులు మాత్రమేగాక సదా కలతకు లోనైనవారై యుందురు."(భాగ. 1.1.10) ఈ యుగంలో కావలసినంత వర్షం మరియు ఆహారము ఉండదు. అంతేకాకుండ ప్రభుత్వము జనుల ఆధాయమును అధిక పన్నుల రూపములో దోచుకొనును. కలియుగ లక్షణములన్నీ శ్రీమద్భాగవతములో వివరించబడెను. ప్రజలు ఎంతగా విరక్తి చెందుతారనగా వారు తమ భార్యపిల్లలను అకస్మాత్తుగా విడిచి అడవులకు

వెళ్ళుదురు. కలియుగములో జనులు ఇలా పీడించబడినచో, శాంతియుతమైన వర్ణాశ్రమ ధర్మం ఎలా సాధ్యమవుతుంది. ఇది దాదాపు అసాధ్యం. కాబట్టి భక్తియోగ పద్ధతియైన 'హరేకృష్ణ' మహామంత్రమును జపించవలెను. భక్తియోగ పద్ధతి విష్ణువును సంతృప్తి పరుచుట కొరకు ఉద్దేశింపబడినది. "*యజ్ఞైః సంకీర్తనప్రాయైః*" విష్ణు, శ్రీకృష్ణుడు శ్రీ చైతన్య మహాప్రభువుగా అవతరించి, మనకు సంకీర్తన మార్గమును బోధించెను. ప్రస్తుతము జనులను ఆకర్షించుట కోసం నూతన మతసిద్ధాంతములను తయారు చేస్తున్నారు. కాని కపిలదేవుడు శ్రీకృష్ణుని వంటివాడైనను ఎలాంటి క్రొత్త సిద్ధాంతమును ప్రతిపాదించలేదు. ఈ పద్ధతి క్రొత్తది కాదు, ఎంతో పురాతనమైనది. శ్రీకృష్ణుడు కూడ భగవద్గీత(4.2)లో అదే చెబుతున్నారు : "*ఏవం పరమ్పరా ప్రాప్తమిమం రాజర్షయో విదుః*" – "ఈ పరమ శాస్త్రము పరంపర ద్వారా అంగీకరించబడెను. మరియు రాజర్షులు కూడ దానిని ఆ విధముగానే అర్థం చేసుకున్నారు." శ్రీకృష్ణుడు మరియు కపిలదేవుడు అదే సందేశమును తిరిగి బోధిస్తున్నారు. అంతే! నూతన విషయాలనేమి బోధించుట లేదు. ఎందుకనగా కాలగర్భంలో జ్ఞానం కలిసిపోయెను. "మీరు దీనిని నాకెందుకు వివరిస్తున్నారు? ఇతరుల కెందుకు మీరు వివరించుట లేదు?" అని అర్జునుడు అడుగుచున్నాడు. "*భక్తోఽసి మే సఖా చేతి*" – "ఎందుకనగా, నీవు నా భక్తుడవు అలాగే మిత్రుడవు" అని శ్రీకృష్ణుడు సమాధాన మిస్తున్నాడు (భ.గీ 4.3).

కాబట్టి శ్రీకృష్ణునికి భక్తుడు కాకుండ నిజానికి ఎవరు భక్తియోగను అర్థం చేసుకోలేరు. భగవద్గీతను అర్థం చేసుకొనుట అనగా శ్రీకృష్ణుడిని అర్థం చేసుకొనుటయే. ఈ సమాచార మంతయు కేవలం భక్తి సంప్రదాయములోనే వివరించ బడినది, ఇతర సంప్రదాయాలలో వివరించ బడలేదు. అందుకే శ్రీకృష్ణుడు భగవద్గీత(18.55) లో : "*భక్త్యామామభిజానాతి*" – ఎవరైన శ్రీకృష్ణుడిని, మరియు భగవంతునితో మనకు గల సంబంధమును వాస్తవంగా అర్థం చేసుకోవాలనుకుంటే, భక్తియోగ పద్ధతిని తప్పక అంగీకరించ వలెనని నిర్ణయింపబడెను. సాంఖ్యయోగలో కపిలుని ద్వారా భక్తియోగ వివరించబడినది.

కపిల దేవుడిక్కడ ఇలా చెబుతున్నాడు :

తమిమం తే ప్రవక్ష్యామి యమవోచం పురాణఘే

'*అనఘే*' అనే శబ్దం పాపము చేయని వారిని సూచిస్తుంది. '*అఘ*' అనే శబ్దం పూర్వపు పాపములను మరియు '*అన్*' అనగా 'లేకుండుట' అని అర్థం. అందుకే

పాపముల నుండి విముక్తి పొందనంత వరకు ఎవరు కూడ కృష్ణచైతన్యమును అర్థం చేసుకోలేరు. *"యేషాం త్వంతగతం పాపమ్"*: పాప ఫలితాలన్నింటి నుండి పూర్తిగా విముక్తి పొందినప్పుడు కృష్ణచైతన్యమును విస్మరించము. "దీనికొరకు కొంత సమయము పట్టవచ్చును. నేను కేవలం ఒక్క రాత్రిలో పాప ఫలితాలన్నింటి నుండి బయటపడలేను" అని ఎవరైన అనవచ్చును. ఏమైనను, శ్రీకృష్ణుడు ఇలా చెబుతున్నాడు : "తప్పకుండ, ఇది వెంటనే సాధ్యపడును. కేవలం నన్ను శరణు పొందుము, సమస్త పాపముల నుండి నేను మిమ్ము రక్షించెదను." ఆ విధముగా కేవలము శ్రీకృష్ణుని శరణువేడుట వలన మన ఆధ్యాత్మిక జీవనము ప్రారంభ మగును.

మన పాపకర్మలకు ఫలితముగా వివిధ రకాల శరీరములను పొందు తుంటామని మనం అర్థం చేసుకోవాలి. ఈ మానవ దేహంతో మన ధర్మమును నిర్వర్తించటానికి మనకిప్పుడు అవకాశము ఇవ్వబడినది. *"బహూనాం జన్మనామన్తే"* మనం ఈ శరీరమును పరిణామ పద్ధతి ద్వారా పొందుదుము. మరియు ఈ మానవజన్మ అనేది గొప్ప అవకాశము. నరోత్తమ దాస ఠాకూర్ ఇలా పాడుతున్నారు: *"హరి హరి బిఫలే జనమ గొనాయిను"* – "నా ప్రియమైన కృష్ణా! నేను నా సమయమును కేవలం వృథా చేసితిని, ఎందుకు?"

మానుష్య–జన్మ పాయ్యా రాధా–కృష్ణ నా భజియా
జానియా శునియా విష ఖాయిను

"ఎందుకనగా, శ్రీకృష్ణుడిని అర్థం చేసుకొనుటకు నిర్దేశించబడిన ఈ మానవ జీవితమును పొందినప్పటికినీ, నేను ఈ అవకాశమును సద్వినియోగ పరచు కోకుండ, నా సమయమును వృథా చేసుకున్నాను. శ్రీరాధాకృష్ణుల ఆరాధనను తప్పించి నేను అన్నింటినీ చేశాను. కాబట్టి తెలిసి విషమును పుచ్చుకున్నాను." ఎవరైనను విషమును తెలిసి తీసుకునినచో వారు ఆత్మాహూతికి పాల్పడినట్లు అర్థము. మానవ జీవితము నుండి ప్రయోజనమును పొందకపోవుట మనేది కూడ అటువంటిదే. ఆహార నిద్ర భయ మైథునాలనేవి భౌతిక కర్మలు. మన హృదయాలు కేవలము వీటియందే నిమగ్నమైనచో, విషం పుచ్చుకున్నట్లుగా జ్వలించును. దీనినుండి ఉపశమనమును ఎలా పొందుట?

గొలోకేర ప్రేమధన హరినామ – సంకీర్తన రతి నా జన్మిల కేనే తాయ్

"నా ప్రియమైన ప్రభు! మీరు మాకు హరినామ సంకీర్తన అనే ఔషధమును ఇచ్చారు. కాని దురదృష్టవశాత్తు నాకు దివ్యనామము పట్ల ఎలాంటి ఆకర్షణ లేదు." మరియు ఇంకను ఇలా చెప్పబడినది :

వ్రజేంద్ర – నందన జేయ్ సచి – సుత హోయిలో సేయ్
బలరామ హోయిలో నితాయ్

"శ్రీకృష్ణుడు ప్రస్తుతం సచి కుమారుడైన శ్రీ చైతన్య మహాప్రభువుగా అవతరించెను. మరియు బలరాముడు నిత్యానందునిగా అవతరించెను." కాబట్టి వారు పాపులందరిని 'హరేకృష్ణ' మహామంత్ర కీర్తనతో ఉద్ధరిస్తున్నారు, అదే వారి పని అని చెప్పుటకు జాగాయ్, మధాయ్ అనే పాపులను శ్రీ చైతన్య మహాప్రభువు మరియు నిత్యానంద ప్రభువు ఉద్ధరించుటయే దీనికి సాక్ష్యము. ప్రస్తుతకాలంలో ప్రతిఒక్కరు జగాయ్, మధాయ్ లాంటివారే. ఎందుకనగా, ప్రతిఒక్కరు మత్తుపదార్థములను తీసుకుంటూ సంభోగము కోసం వెర్రెక్కి ఉన్నారు. శ్రీ చైతన్య మహాప్రభువు కృప వలన ఇప్పుడు వేలకొలది జగాయ్, మధాయ్‌లు ఉద్ధరించ బడుతున్నారు. ఈ 'హరేకృష్ణ' మహామంత్రము చురుకుగా పని చేస్తుంది. ఇది పరిపూర్ణమైన యోగపద్ధతి. ఈ పద్ధతి తయారుచేసినది కాదు, మరియు మేము దేనిని సృష్టించుట లేదు. శ్రీకృష్ణుడు ఉపదేశించిన దానిని యథాతథముగా అంగీకరించుటయే మన ధర్మం. శ్రీకృష్ణుడు తన భక్తుల లక్షణములను స్వయంగా ఇలా వివరిస్తున్నాడు :

సతతం కీర్తయన్తో మాం యతన్తశ్చ దృఢవ్రతాః
నమస్యన్తశ్చ మాం భక్త్యా నిత్యయుక్తా ఉపాసతే

"ఈ మహాత్ములు ఎల్లప్పుడును నా వైభవములను కీర్తించుచు, దృఢనిశ్చయముతో ప్రయత్నించుచు, నా ముందు నమస్కరించుచు నన్ను నిత్యము భక్తితో పూజింతురు." (భ.గీ. 9.14)

మనము గొప్ప విద్వాంసులము కానవసరము లేదు. భగవంతుని కృపయే చాలును. భగవంతుని కృప అనేది మనలను పండితులుగా మరియు అతని బోధనలను అనుసరించేలా చేయును. భగవద్గీత ననుసరించి మనము ఈ కృష్ణ చైతన్య ఉద్యమమునకు కట్టుబడి ఉండవలెను. మనం మరింత అభివృద్ధి సాధించి నప్పుడు శ్రీమద్భాగవతమును చదువవచ్చును. శ్రీ చైతన్య మహాప్రభువు స్వయంగా ఈ సంకీర్తన ఉద్యమ మార్గమును తెరిచారు. ప్రపంచమంతయు కృష్ణచైతన్యము

లేకుండ అంధకారముతో నిండి ఉన్నది. అంతేకాకుండ ఈ యుగములోని జనులు ఎంతటి మందబుద్ధులంటే వారికి ముక్తి మరియు బంధములకు మధ్య గల తేడా ఏమిటో కూడ తెలియదు. మానవుడు ఈ భేదమును తెలుసుకొననిచో అతడు పశువుకన్నా గొప్పేమి కాదు.

ప్రస్తుతము మనం భౌతిక ప్రకృతి యొక్క సత్త్వ, రజో మరియు తమో గుణముల వశములో నున్నాము. ఈ త్రిగుణాలలో సత్వగుణ మనునది ఉన్నత మైనది. బ్రాహ్మణుడు సత్యవ్రతుడై మరియు ఆత్మనిగ్రహమును కలిగి సత్త్వగుణ సంపన్నుడగును. అతడు ఇంద్రియములను మరియు మనస్సును నియంత్రిస్తూ శాంతి మరియు సాధారణ జీవితమును కలిగి ఉండవలెను. అతడు పరిపూర్ణమైన జ్ఞానమును కలిగి ఉండును, మరియు అతడికి ఈ జ్ఞానమును జీవితము నందు ఎలా ఉపయోగించు కోవాలో తెలిసి ఉండవలెను. బ్రాహ్మణుడికి వేద ప్రమాణాలలో పూర్తి విశ్వాసముండును. 'ఆస్తిక్యం' అను లక్షణము కలదు. శ్రీ చైతన్య మహాప్రభువు 'ఆస్తిక్యము' మరియు 'నాస్తిక్యము'లోని భేదమును వివరించెను. వైదిక జ్ఞానము ననుసరించి వేదములను విశ్వసించనివాడిని నాస్తికుడు అంటారు. శ్రీ చైతన్య మహాప్రభు : *"వేద నా మానియా బౌద్ధ హోయిలో నాస్తిక్."* (శ్రీ చైతన్య చరితామృతము, మధ్యలీల 6.168) బుద్ధభగవానుడు వేదాల యొక్క ప్రమాణమును నిరాకరించాడు. ఏమైనను అతడి లక్ష్యము పశుబలిని ఆపుటయే. వేదములలో పశుబలిని గురించిన ఆదేశాలు కలవు. కాబట్టి పశుబలిని నిలిపివేయుట కొరకై బుద్ధభగవానుడు వేదాలను తిరస్కరించెను. అలాంటి యజ్ఞములు ఈ కాలములో సాధ్యపడవు. దానిని నిర్వర్తించుటకు కావలసిన అర్హతలు గల బ్రాహ్మణుడు లేడు. ఈ యుగములో అటువంటి యజ్ఞములు విజయవంతములు కాలేవని జ్ఞానవంతు లెరుగుదురు. ఎందుకనగా, వృద్ధజంతువు శరీరమునకు మరొక నూతన జంతు శరీరం ఇచ్చుటకు కావలసిన సరియైన మంత్రములు ఎవరికి తెలియవు. పశుబలి యజ్ఞం సరిగ్గా నిర్వహించ బడినప్పుడు, ముసలి జంతువు బలి ఇవ్వబడినప్పుడు అగ్ని నుండి నూతన శరీరము ఉద్భవించును. ఈ కాలములో ఇది సాధ్యపడదు. కాని 'హరేకృష్ణ' మహామంత్ర సంకీర్తన యజ్ఞము మాత్రమే సాధ్యపడును. ప్రత్యేకించి ఇది ఈ యుగానికి ఆదేశించబడిన యజ్ఞము. "హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే / హరే రామ హరే రామ రామ రామ హరే హరే" అనే మహా మంత్రమును మాత్రమే మనము కీర్తించాలి. ఈ యజ్ఞమును నిర్వహించుట వలన కలుగు ఫలితము, *'చేతోదర్పణమార్జనమ్'* – మనస్సు అనబడే అద్దం శుభ్రపడును.

అది శుభ్రపడినప్పుడు, మనము వెంటనే ముక్తిని పొందుదుము.

ఇది బద్ధజీవితము లేదా ముక్త జీవితమునకైనను చైతన్యమనేది ప్రధాన సూత్రము. అందుకే మేము జన్మమృత్యువనే చక్రము నుండి విముక్తి కలిగించు కృష్ణచైతన్యమును ప్రతిపాదిస్తున్నాము. దురదృష్టవశాత్తు, ఈ యుగములోని జనులు జన్మమృత్యువులను ఎలా నిరోధించాలనే విషయమును తెలుసు కోలేనంతటి మందబుద్ధులు. జన్మమృత్యువులను నిరోధించలేమని వారనుకుంటారు. దీనినే గొప్ప శాస్త్రజ్ఞులు కూడ అంగీకరిస్తారు. భగవద్గీత(13.9) లో శ్రీకృష్ణుడు తెలుపుతున్న దేమిటంటే, మన మనస్సులలో జన్మ మృత్యు జరా వ్యాధులనే ఈ నాలుగు దుఃఖములను ఎల్లప్పుడు స్మరించుకోవాలి. వీటిని తప్పించుకోగలిగితే మనం ముక్తిని సాధించినట్లుగా భావించవలెను. మనము మన చైతన్యమును కృష్ణస్మరణ చేతనే శుద్ధికరించుకోవాలి. ఈ కృష్ణచైతన్య ఉద్యమము వలన శ్రీకృష్ణుడిపై మనస్సును ఏకాగ్రం చేయవచ్చును. శ్రీకృష్ణుడు దేవాదిదేవుడు మరియు సాకార స్వరూపుడు. అర్జునుడు శ్రీకృష్ణుడిని అర్థం చేసుకునిన తరువాత, భగవానుడు పురుషుడు అనగా అనుభవించేవాడు – 'భోక్త', మరియు ప్రకృతి అనగా అనుభవించ బడేదని అర్థం చేసుకోగలిగెను. పరమపురుషుని చేత సర్వం అనుభవించబడును. నిజానికి మనము ప్రకృతి అని పురుషులము కాదని చెప్పబడినది. మానవ శరీరమనేది కేవలం మాయ. మనము పురుషులమని, భోక్తలమని భావిస్తాము. కాని నిజానికి మనము అనుభవించ బడెడివారము. అయినను జీవితమును అనుభవించాలనీ ఆశించి పురుషుడిగా అనుకరించుటకు ప్రయత్నిస్తుంటాము. కాని నిజానికి మనం ప్రకృతి, దీనికి ఫలితముగా జీవుడు భౌతిక లోకమును అనుభవించా లనుకుంటాడు. అతడు భౌతిక లోకములోకి త్రోయబడును. జీవుడు త్రిగుణాలచే బంధించబడి వివిధ రకాల శరీరములను పొందుతుంటాడు. సత్త్వగుణములోని వారు పండితుడైన బ్రాహ్మణుడి శరీరమును పొందుతాడు. ఈ స్థితి కొద్దిగా ఉన్నతమైనది, కాబట్టి అతడు క్రమముగా భగవంతుడిని అర్థం చేసుకొనుటకు ప్రయత్నించును. రజో మరియు తమోగుణంలోని వారెవరు భగవంతుడిని అర్థం చేసుకోలేరు. భౌతిక దృష్టిననుసరించి, సత్త్వగుణములో నెలకొనినవారు వారు ఉన్నత లోకాలలోకి ప్రవేశించగలరు. ఏమైనను, ఈ భౌతిక జగత్తులోని అత్యున్నత లోకమైన బ్రహ్మ లోకములో ప్రవేశించినను ఎవరు కూడ అక్కడ శాశ్వతముగా జీవించలేరు. దానివలన నిజమైన ప్రయోజనమేమి కలుగదు. ఎందుకనగా, బ్రహ్మలోకములో కూడ జన్మమృత్యుజరావ్యాధి అనే నాలుగు దుఃఖములుండును. బ్రహ్మదేవుడు కూడ

మరణించును మరియు తిరిగి జన్మించును. బ్రహ్మదేవుడు విష్ణువు యొక్క నాభి కమలము నుండి ఉద్భవించెనని వైదికసాహిత్యముల నుండి మనము తెలుసు కుంటున్నాము. ఆ విధముగా బ్రహ్మ ఉద్భవించెను. బ్రహ్మ మరణించినప్పుడు సమస్త చరాచర జగత్తు లయమగును. బ్రహ్మ మొదలుకొని చిన్న చీమ, పురుగు కూడ జన్మమృత్యుజరావ్యాధులనెడి అవస్థను దాటవలసి యుండును. కాబట్టి, జీవుడు బంధనముల నుండి బయటపడవలెను. ఎందుకంటే అతడు స్వభావరిత్యా నిత్యుడు. నిజానికి, భగవద్గీత ననుసరించి జీవుడు జన్మించడు లేదా మరణించడు. "*న జాయతే మ్రియతే వా కదాచిత్*"– "ఆత్మకు జన్మించుట మరియు మరణించుట మనేది ఎన్నటికి ఉండదు." (భ.గీ. 2.20)

బ్రహ్మ శరీరమైనను లేదా చిన్న చీమ శరీరమైనను మరేదైనను శరీరం అనబడేదే మృత్యువు నొందును. వేల సంవత్సరాలు జీవించగలిగితే ముక్తిని పొందినట్లుగా భావించరాదు. బ్రహ్మజీవితమనేది భూలోకంలో వేలకొలది సంవత్సరాలు ఉంటుంది. అయినను, అతడు జననమరణములకు గురగును. అది బద్ధజీవితము. జన్మమృత్యుచక్రము నుండి బయటపడుట కొరకు శ్రీకృష్ణభగవానుడు, భగవానుడైన కపిలదేవుడు మరియు గొప్ప ఋషుల చేత ఇవ్వబడిన పరిపూర్ణ జ్ఞానము యొక్క ప్రయోజనమును పొందవలెను.

కృష్ణచైతన్యమును పొందుటమనగా జ్ఞానజ్యోతిని పొందుటయే. ముఖ్యముగా పాశ్చాత్య దేశాలలోని జనులు భౌతిక జీవన శైలితో అలసిపోయారు. కృష్ణచైతన్య ఉద్యమము పాశ్చాత్య సమాజమునకు ఇప్పుడు కొత్తవెలుగును ప్రసాదిస్తున్నది. జీవులు సహజముగానే ముక్తులు. నిజానికి మనం శ్రీకృష్ణభగవానుని అంశల మైనందున ఇలాంటి జన్మమృత్యుజరావ్యాధులనే ప్రశ్నే ఉదయించదు. మరియు వీటికి ఎటువంటి ఆస్కారము లేదు? శ్రీకృష్ణుడు 'సచ్చిదానంద విగ్రహుడు'. కాబట్టి అతడి అంశలమైనందున మనం కూడ అటువంటి స్వభావమునే కలిగి ఉన్నాము. మనము పరిమాణములో కాకుండ గుణములో అతడితో సమానము. కాబట్టి మనమెందుకు మృత్యువు యొక్క హస్తాలలో చిక్కుకుని బాధలు పడవలెను? అందుకే పూర్వపు శ్లోకంలో కపిలదేవుడు ఇట్లు బోధించెను : "*యోగ ఆధ్యాత్మికః పుంసాం మతో నిఃశ్రేయసాయ.*" శరీరంలో ఆత్మ అనేది బంధించ బడినది. శరీరమును అంటురోగము వలె పట్టుకున్న నాలుగు దుఃఖముల నుండి బంధముల నుండి ఏది ఆత్మను రక్షించునో అదే పరిపూర్ణమైన యోగ. ఈ పరిపూర్ణ యోగను ఎట్లు పొందగలము? కపిల భగవానుడు తరువాతి శ్లోకంలో ఇలా వివరిస్తున్నాడు :

“రతం వా పుంసి ముక్తయే.” కేవలం శ్రీకృష్ణుడి పట్లనే మనం ఆసక్తిని కలిగి ఉన్నచో ముక్తిని పొందగలము.

“హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే / హరే రామ హరే రామ రామ రామ హరే హరే” అని మహాత్ములు ఎల్లప్పుడు శ్రీకృష్ణుని గురించి కీర్తిస్తూ భక్తియుక్త సేవలో దృఢసంకల్పముతో ప్రయత్నిస్తుంటారు. ఉదాహరణకు, కృష్ణచైతన్య ఉద్యమములోని భక్తులు తెల్లవారు జామున నాలుగు గంటలకు మేలుకొని, వెంటనే స్నానం చేసి నాలుగున్నరకు మంగళహారతి తరువాత వైదిక సాహిత్యములను అధ్యయనము చేస్తుంటారు. ఈ ప్రక్రియల వలన మనలో నిగూఢంగా దాగి ఉన్న శ్రీకృష్ణుని పట్ల ప్రేమను జాగృతపరుచు కోగలము. కుమారుడు తండ్రి అంశయైనట్లుగా మనం కూడ శ్రీకృష్ణుడి అంశలము. మన మధ్య ప్రేమ అనేది సహజము. అయినను, ఏదోవిధముగా కుమారుడు ఇంటిని విడిచి తండ్రిని విస్మరించినను తండ్రి ఎన్నడు కుమారుడిని విస్మరించడు. అతడు, “ఓ, నా కుమారుడు నన్ను విడిచి వెళ్ళిపోయాడు” తిరిగి వచ్చినచో ఎంత బాగుండునని ఆలోచించును. ఆ విధముగానే శ్రీకృష్ణుడు కూడ ఆలోచించును. మనమందరము శ్రీకృష్ణుని కుమారులము, మనమతడి దగ్గరికి వెళ్ళాలని కోరుకునే దానికంటెను అతడు మనలను అతని ధామానికి తీసుకువెళ్ళుటకు ఎంతో ఉత్సాహమును కలిగి ఉండును. అందుకే : “మూర్ఖుడా! బుద్ధిలేని భౌతిక కార్యముల నన్నింటినీ విడువుము. నీవు ఎన్నో మతధర్మాలను సృష్టించితివి, వాటినన్నింటిని విడిచి కేవలం నన్నే శరణు పొందుము” అని శ్రీకృష్ణుడు స్వయంగా వచ్చి బోధించి వెళ్ళును. భగవంతుని బోధనలకు మరియు అతడికి తేడా లేదు. ఎందుకంటే అవి సంపూర్ణమైనవి. శ్రీకృష్ణుడిని ప్రస్తుతము మనము చూడలేకున్నను నిజమైన అభివృద్ధిని సాధించినప్పుడు మనమతడిని చూడగలము. మందిరములోని విగ్రహమును చూచి, “ఓ! ఇది బొమ్మ, ఇది శ్రీకృష్ణుడు కాదు” అని మనము భావిస్తుంటాము. మనం ఈ విధముగా భావించినచో శ్రీకృష్ణుడిని చూడలేము. శ్రీకృష్ణుడు తన బోధనల ద్వారా భగవద్గీతలో ప్రతిష్ఠితుడై ఉన్నాడు. అది కృష్ణవాణి అనగా శ్రీకృష్ణుని సందేశము. కృష్ణచైతన్యములో అభివృద్ధి సాధించినప్పుడు మాత్రమే మనము శ్రీకృష్ణుని గురించిన అవగాహనను పొందగలము. అప్పుడే భగవద్గీతలో, విగ్రహ రూపంలో, నీటిలోని రుచిలో, సూర్యకాంతిలో, చంద్రకాంతిలో మరియు అంతటా శ్రీకృష్ణుడు ప్రత్యక్షంగా ఉన్నాడని అర్థం చేసుకోగలము. శ్రీకృష్ణుడు సర్వత్రా కలడు. అయినను, మనం భగవంతుని దర్శించుట కొరకు జ్ఞానమును ఆర్జించవలెను.

అదే ముక్తి. అదే కృష్ణచైతన్యం. అదే భక్తియోగ పద్ధతి : *"శ్రవణం కీర్తణం విష్ణో స్మరణం..."* విగ్రహారాధన, అర్చనం, కీర్తనం, వందనం, మరియు దాస్యం అనునది శ్రీకృష్ణుడికి సేవ చేయుట మరియు కృష్ణచైతన్య ఉద్యమమును వ్యాప్తి చేయుట వంటివన్నీ కూడ భక్తియోగ మార్గములే.

సాధారణంగా జనులు ముఖ్యముగా శ్రీకృష్ణుని దర్శించుటలో ఆసక్తిని కలిగి ఉంటారు. వారెందుకు కేవలము దర్శించుటలోనే ఆసక్తిని కనపరుస్తుంటారు? అతడిని గురించి శ్రవణము చేయండి. మనం కొద్దిపాటి విశ్వాసముతో శ్రవణము చేసినను విశ్వాసమనేది వృద్ధి అగును. మనం మందిరములకు వెళ్ళవలెను. శ్రీకృష్ణుడి గూర్చి చర్చించవలెను. అంతేకాకుండ కొద్దికాలం తర్వాత శ్రీకృష్ణుడి సేవ కొరకు దీక్షను తీసుకోవలెను. దానినే 'భజనక్రియ' అంటారు. ఆ సమయములో అక్రమ సంభోగము, మత్తుపదార్థాల సేవనము, మాంసాహారము, జూదము వంటివాటిని త్యజించాలి. ఎవరైనను వీటిపట్ల అనుబంధమును కలిగి ఉన్నచో అతడు అభివృద్ధిని సాధించుట లేదని అర్థం చేసుకోవలెను. కాని ఎవరైనను 'భజనక్రియ'లో పురోభివృద్ధిని సాధించినచో అతడి ఈ అనర్థాలన్నీ నశించును. *"పరం దృష్ట్వా నివర్తంతే."* మనం ఏదైన ఉన్నతమైన దానిని సాధించినప్పుడు దానికన్న విలువ తక్కువ దానిని త్యజిస్తాము. ఒక్కసారి కృష్ణభక్తిలో రుచిని పొందినచో దానిని విడిచి ఉండలేము. ఒక త్రాగుబోతు త్రాగకుండ ఉండలేడు. అలాగే భక్తుడు కృష్ణభక్తిని పానము చేయును. అన్ని భౌతిక రోగములను నిరోధించగలిగేది ఈ కృష్ణచైతన్యమే. త్రిగుణములను నిరోధించుట కొరకు ఈ భక్తియోగలో మనము నిమగ్నము కావలెను. ఒకసారి పరిపూర్ణ స్థితిని పొందినచో భగవంతుని పట్ల 'భావభక్తి'ని పొందగలము. ఆ స్థితిలో శ్రీకృష్ణుడు లేకుండ ఒక్కక్షణము కూడ ఉండలేము. దానినే 'భావ'స్థితి అంటారు. మరియు 'భావ'స్థితి నుండి 'మహాభావ' స్థితికి ఎదుగ వలెను. ఇది సాధారణ మానవులకు సాధ్యపడదు. ఇది కేవలం గోపికలకు మరియు రాధారాణికి మాత్రమే సాధ్యపడెను. నిజానికి వారు శ్రీకృష్ణుడిని వదలి ఉండలేక పోయారు. అది ముక్తి యొక్క పరమోన్నత స్థితి.

అధ్యాయము 9

ఆత్మసాక్షాత్కారము కొరకు మనస్సును శుద్ధికరించుట

శ్లోకము 15

చేతః ఖల్వస్య బన్ధాయ ముక్తయే చాత్మనో మతమ్
గుణేషు సక్తం బన్ధాయ రతం వా పుంసి ముక్తయే

ఏ స్థితి యందు జీవుని చైతన్యము ప్రకృతి త్రిగుణములచే ఆకర్షింపబడునో అదియే బద్ధజీవనమనబడును. కాని అదే చైతన్యము భగవానుని పట్ల ఆకర్షింపబడినచో మనుజుడు ముక్తచైతన్య స్థితి కలిగినవాడగును.

భాష్యము : కృష్ణచైతన్యము మరియు మాయాచైతన్యము మధ్యగల గొప్ప వ్యత్యాసములో మాయాచైతన్యము పట్ల *(గుణేషు)* త్రిగుణముల పట్ల ఆసక్తిని కూడి యుండును. దాని ప్రభావమున మనుజుడు కొన్నిమార్లు సత్త్వగుణము నందు, జ్ఞానము నందు వర్తించగా, మరికొన్నిమార్లు రజోగుణమునందు, మరికొన్నిమార్లు తమోగుణము నందు వర్తించును. భౌతిక భోగముతో ముడివడి యుండెడి ఆ వివిధ కర్మలే మనుజుని బద్ధజీవనమునకు కారణము. కాని అదే చైతన్యము దేవాదిదేవుడి, శ్రీకృష్ణుడి వైపునకు మరల్చబడినచో లేదా కృష్ణచైతన్య వంతుడైనచో మనుజుడు ముక్తిపథముపై నిలిచిన వాడగును.

శ్లోకము 16

అహం మమాభిమానోత్థైః కామలోభాదిభిర్మలైః
వీతం యదా మనః శుద్ధమదుఃఖమసుఖం సమమ్

నేను, నాది యనెడి దేహాత్మబుద్ధి నుండి పుట్టెడి కామలోభమలినములైన 'నేను' మరియు 'నావి', వంటివాటి నుండి పూర్తిగా శుద్ధిపడినపుడు మనుజుని మనస్సు పవిత్రము కాగలదు. అటువంటి నిర్మల స్థితి యందే అతడు సుఖదుఃఖ స్థితులకు అతీతుడగును.

భాష్యము : కామము, లోభము అనునవియే భౌతిక అస్తిత్వపు లక్షణములు.

ప్రతియొక్కరు ఏదియో నొకదానిని కలిగి యుండవలెననియే కోరుదురు. కామలోభములు దేహాత్మబుద్ధి భావనయందు మిథ్యాతాదాత్మ్యపు ఫలములని ఇక్కడ తెలుపబడినది. ఈ కల్మషము నుండి మనుజుడు విడుదల పొందినప్పుడు, అతని మనస్సు మరియు చైతన్యము కూడా విడుదల పొంది తమ నిజస్థితి యందు నెలకొనగలవు. మనస్సు, చైతన్యము, జీవుడు ఎల్లప్పుడు నిలిచియుండును. మనము జీవుని గూర్చి ఎప్పుడు పలికినను, అది మనస్సు మరియు చైతన్యమును గూర్చి కూడా అయి యుండును. మనస్సును, చైతన్యమును శుద్ధపరచినప్పుడే భౌతిక జీవితమునకు ముక్త జీవితమునకు మధ్య భేదమేర్పడును. ముక్తజీవనము ఆరంభ మగును; అవి శుద్ధిపడినప్పుడు మనుజుడు భౌతిక సుఖదుఃఖములకు అతీతుడు కాగలడు.

పరిపూర్ణ మైనటువంటి యోగవిధానము మనుజుడు భౌతిక సుఖ దుఃఖ స్థితులకు అతీతుడయ్యేలా చేయునని ప్రారంభములోనే కపిలభగవానుడు పలికినాడు. అది ఏ విధముగా సాధ్యమనెడి విషయము ఇక్కడ వివరింపబడినది; దానికొరకు మనుజుడు తన మనస్సును, చైతన్యమును శుద్ధిపరచు కొనవలెను. అది భక్తియోగ ద్వారానే సిద్ధింపగలదు. 'నారద పంచరాత్రము'లో వివరింపబడినట్లు, మనుజుని మనస్సు, ఇంద్రియములు తప్పక శుద్ధిపరచవలెను(*తత్పరత్వేన నిర్మలమ్*). ఇంద్రియములన్నీ శ్రీకృష్ణభగవానుని భక్తియుక్త సేవ యందు నెలకొనుటయే దానికి సరియైన విధానము. మనస్సుకు ఏదో ఒక వ్యాపకము అవసరము; దానినెవ్వరును ఖాళీగా ఉంచలేరు. మనస్సును ఖాళీగా నుంచుటకు లేదా శూన్యముగా చేయుటకు ఏవో మూర్ఖపు యత్నములు చేయబడుచున్నను, అది సాధ్యపడదు. మనస్సును శ్రీకృష్ణుని సేవయందు నియమింపచేయుటయే దానిని శుద్ధికరించుటకు గల ఏకైక మార్గము. మనస్సును ఎల్లప్పుడు ఏదో ఒక కార్యమునందు తప్పక నెలకొల్పవలెను. మనస్సును శ్రీకృష్ణుని పైననే నెలకొల్పినచో సహజముగానే చైతన్యము శుద్ధికాగలదు. అప్పుడు కామలోభములు ప్రవేశించుటకు అవకాశమే ఉండదు.

మన మనస్సే మనకు స్నేహితుడు మరియు శత్రువు కూడ. ఇది శుద్ధిపడినచో, అది మనకు స్నేహితుడగును. కాని అది కలుషితమైనప్పుడు మనం భౌతిక రోగములను పొందుతాము. మనం కనుక మనలను శుభ్రంగా, శుద్ధిగా ఉంచుకోగలిగితే, మనం కల్మషు లగుటకు అవకాశమే లేదు. వైదిక నాగరికత ప్రకారం ఉదయం, మధ్యాహ్నము, సాయంత్రము రోజుకు మూడుసార్లు శరీరమును మానవుడు శుభ్రపరుచుకోవాలి. బ్రాహ్మణ పద్ధతిని ఖచ్చితముగా పాటించువారు

ఈ పద్ధతిని తప్పకుండ అమలుపరుస్తారు. శౌచం అనేది భగవత్ చైతన్యమునకు చేరువలో ఉండును. బద్ధజీవితము అనగా మనస్సు కల్మషములతో కప్పబడి ఉండుట, అదే మనకు గల రోగము. తామసిక మరియు రాజసికమనెడి నీచ గుణాలతో మనము కప్పబడి ఉన్నపుడు, ఈ మలినాలు ఎంతో ప్రభావవంత మవుతాయి. సంకీర్తన మరియు శ్రవణమనే పద్ధతి ద్వారా మనము ఈ సత్త్వగుణానికి ఎదుగవలెను. మానవుడు కృష్ణకథను శ్రవణము చేయవలెను. శ్రీకృష్ణుడు అందరి హృదయాలలో కలడు. జీవాత్మ శ్రీకృష్ణుని అంశ. మరియు శ్రీకృష్ణుడు జీవాత్మ తన వైపునకు మరలవలెనని ఆశించును. దురదృష్టవశాత్తు, బద్ధాత్మ భౌతిక సుఖము పట్ల ఆసక్తిని కలిగి ఉన్నది. మరియు ఈ ఆసక్తియే జన్మ, మృత్యు, జరా, వ్యాధి అను వాటితో బంధించును. బద్ధాత్మ ఎంత మూర్ఖమైనదంటే ఈ దుఃఖములు పునరావృత్తి అవుతున్నాయని కూడ ఆలోచించుట లేదు. అతడు చాకలివాడి మూటలను మోసే గాడిదవంటివాడు. కాసింత గడ్డికోసం, తనకు ఏ మాత్రము సంబంధము లేని పెద్ద పెద్ద మూటలను రోజంతా గాడిద మోస్తుంది. ఇది కర్ముల మార్గము. వారు గొప్ప లక్షాధికారులైనను వారు గాడిద వంటివారు. ఎందుకనగా వారు రేయింపవళ్ళు కష్టించి పని చేయుచుందురు. వారి దగ్గర ఎంత డబ్బున్నను, వారి పొట్టమాత్రం అంతే ఆహారమును తీసుకొంటుంది. అంతేకాకుండ నిద్రించుటకు వారి శరీరానికి ఆరు అడుగుల స్థలము మాత్రమే అవసరము. అయినను ఈ కర్ములు తమకుతాము గొప్ప ప్రధానమైన వారిగా భావిస్తుంటారు. “నేను లేనట్లయితే, నా దేశ ప్రజలందరు మరణించెదరు” అని భావిస్తుంటారు. “కాబట్టి నేను మరణించె వరకు రాత్రింపవళ్ళు కష్టించి పని చేయవలెను.” “ఈ దేశానికి, ఈ కుటుంబానికి, ఈ వర్గమునకు చెందినవారమని, నాకు ఈ బాధ్యత లేదా ఆ బాధ్యత కలదని” జనులు భావిస్తుంటారు. ఇవన్నీ మిథ్యా ఉపాధులనీ వారికి తెలియదు.

కాబట్టి శ్రీ చైతన్య మహాప్రభువు ఇలా ఆదేశిస్తున్నారు : “జీవేర స్వరూప హోయ్ – కృష్ణేర నిత్య దాస్” – మన నిజస్థితి శ్రీకృష్ణుని యొక్క సేవకులము. నేను ఈ దేశానికి లేదా ఈ కుటుంబానికి చెందిన వారమని తమోగుణము యొక్క అజ్ఞానము వలన మనం పొరపాటుగా భావిస్తున్నను, భగవద్గీతలోని ఆదేశాలను పాటించుట వలన మనము సత్త్వగుణ స్థితిని పొందగలము. కృష్ణకథలను శ్రవణము చేయుట ద్వారా, మనస్సులో గల మలినములన్నీ శుభ్రపడును. అలాగే, మనము నృత్యకీర్తనలో పాల్గొనినప్పుడు ఈ మలినాలన్నీ తొలిగిపోవును. ఈ మనస్సనేది

బంధములకు దుఃఖములకు కారణము. ఇది మలినంగా ఉన్నపుడు బంధములకు కారణమగును. బద్ధజీవితంలో మనము జన్మించి, కొద్దికాలం జీవిస్తూ సుఖము లేదా దుఃఖమునో అనుభవించవలెను. కాని నిజానికి సుఖమనే ప్రశ్నేలేదు. మనం మరణించినప్పుడు శరీరమును విడిచి తిరిగి మరొక శరీరమును ధరించవలసి ఉంటుంది. మనం మరణించిన తరువాత వెంటనే మరొక తల్లి గర్భంలో ప్రవేశించి తొమ్మిది నెలలు ఉండి, తరువాత బయటకు రావలిసి ఉంటుంది. తరువాత మరొక నూతన జీవితము ప్రారంభమగును. ఇది బద్ధజీవితము, మరియు ఇది ఇలా నిరంతరము కొనసాగుతునే ఉండును. ఈ విధముగా మనం జన్మ మృత్యు జరా వ్యాధులనే దుఃఖములను అనుభవించవలసి ఉంటుంది. కుక్కలు మరియు పిల్లులు ఈ ప్రక్రియను అర్థం చేసుకోలేవు, కాని మానవ జీవితంలో వైదిక సాహిత్యముతో దీనిని అర్థం చేసుకోవచ్చును. మనం కనుక ఈ వైదిక సాహిత్యముల వలన లాభములను పొందనిచో మన విద్య అంతయూ నిష్ప్రయోజన మగును.

నిజానికి, జనులు రాజకీయాలు, సామాజిక విషయాలు, మానవ వర్ణన శాస్త్రం మొదలగు విషయాల గురించి చర్చిస్తూ వారి సమయమును దుర్వినియోగ పరుస్తుంటారు. వారు భగవంతుడైన హరిని కీర్తించని అనేక సాహిత్యములను చదువుతూ సమయమును వృథాపరుస్తుంటారు. ఈ కృష్ణచైతన్య సంఘం ప్రతిఒక్కరికి శుద్ధిపరుచుకొనుటకు కావలసిన అవకాశమును ఇస్తున్నది. *'పుణ్యశ్రవణకీర్తణః.'* డబ్బులను దానము చేయుట కాని, లేదా గంగలో స్నానము చేయుట కాని అవసరము లేదు. పుణ్యవంతు లగుటకు కావలసిన ఎన్నో మంచికర్మలు మరియు ఎన్నో పద్ధతులు ఉపదేశములు మనకు శాస్త్రముల నుండి లభించును. ఏమైనను, కలియుగంలో జనులు వారి శక్తినంతటిని కోల్పోయారు. వారు ఎంతటి పాపులంటే శాస్త్రములలో నిర్దేశించబడిన పుణ్యకర్మ పద్ధతుల ద్వారా పవిత్రుల మగుటమనే ప్రశ్నే ఉదయించదు. కేవలం శ్రీకృష్ణుని గురించి శ్రవణము చేయుట మరియు అతని నామాలను కీర్తించుటయే దానికి మార్గము. శ్రవణము చేయుట కొరకు శ్రీకృష్ణుడు మనకు చెవులను మరియు కీర్తించుటకు నాలుకను ఇచ్చాడు. మనం ఆత్మసాక్షాత్కారమును పొందిన వారి నుండి శ్రవణం చేస్తూ మన జీవితాలను పరిపూర్ణము చేసుకోవలెను. ఈ విధముగా మనం శుద్ధికాబడుటకు అవకాశము ఇవ్వబడినది. మనము శుద్ధినొందకుండ భక్తులము కాలేము. మానవ జీవితము శుద్ధినొందుట కొరకే ఉద్దేశించబడినది. దురదృష్టవశాత్తు ఈ యుగంలో ప్రజలకు శ్రీకృష్ణుని పట్ల ఆసక్తి లేదు. కాబట్టి వారు దుఃఖములతో భౌతిక జీవితమును

అనగా ఒక జన్మ నుండి మరొక జన్మను ఇలా నిరంతరముగా అనుభవిస్తుంటారు. ఒక జన్మలో వారు గొప్ప ఐశ్వర్యవంతులైనచో రాబోవు జన్మను లెక్కచేయరు. "నేను తిని, త్రాగి, ఆనందించాలి" అని వారనుకుంటారు. ప్రపంచమంతటా ఇదే కొనసాగుచున్నది. జనులు ఈ విధముగా పొరపాట్లు చేస్తుంటారని శాస్త్రాలు చెబుతున్నాయి. *"నూనం ప్రమత్తః కురుతే వికర్మః"* (భాగ. 5. 5. 4) – జనులు ఇంద్రియతృప్తి కొరకు వెర్రివారవుతున్నారు. కాబట్టి వారు నిషేధింపబడిన కార్యము లన్నింటిలో నిమగ్ను లవుతుంటారు. 'కర్మ' అనగా విధి. మరియు 'వికర్మ' అనగా దానికి వ్యతిరేకము అనగా అన్యాయము, నిషేధింపబడిన కార్యములు. 'అకర్మ' అనే శబ్ధమునకు కర్మఫలితం యొక్క ప్రభావానికి లోనుకాని వాడని అర్థం. భగవద్గీత (3. 9) లో తెలుపుచున్నట్లుగా :

యజ్ఞార్థాత్ కర్మణోఽ న్యత్ర లోకోఽయం కర్మబన్ధనః
తదర్థం కర్మ కౌన్తేయ ముక్తసంగః సమాచర

"యజ్ఞరూపుడైన విష్ణువు కొరకే కర్మ నాచరింపవలెను. లేనిచో ఆ కర్మ భౌతిక బంధకారణమగును. అందుచే ఓ కుంతీపుత్రా! విష్ణువు తృప్తికొరకు విధ్యుక్త ధర్మముల నొనరించినచో నీవెప్పుడును బంధ విముక్తుడవై ఉందువు."

జనులు రజో మరియు తమోగుణంలో ఉన్నపుడు, వారు 'వికర్మ'లలో పాల్గొంటుంటారు. వారు వారి భవిష్యత్తు జన్మల గురించి లెక్క చేయరు, మరియు వారు పందుల వలె దేనినైనను మరియు అన్నింటిని తినుటకు అలవాటు పడి ఉంటారు. వారు శాస్త్రనిబంధనలను లెక్కచేయక పూర్తిగా బాధ్యతారహితు లగుదురు. వారు దేనిని లెక్కచేయని ఎటువంటి విద్య లేని వీధిబాలుర వంటివారు. అలాంటి బాలురు తమకు ఇష్టం వచ్చినదానిని చేస్తుంటారు. ఎందుకనగా వారి తల్లితండ్రులు వారిని పట్టించుకొనరు. అలాంటి క్రమశిక్షణ లేని జీవితము తమోగుణముతో కూడుకొనిన అజ్ఞాన జీవితము. జనులు కర్మఫలితములను లెక్క చేయకుండ అధర్మ కర్మలను చేస్తూ ఇంద్రియతృప్తి కొరకు కర్మలను ఆచరిస్తుంటారు. అంతేకాకుండ పాపకర్మలను చేయుటలో వారు ఆనందమును పొందుతుంటారు. కోడిపిల్లల గొంతును కోసినప్పుడు అవి అక్కడ ఇక్కడ బాధతో పడి కొట్టు కొనునప్పుడు వాటిని చూచి నవ్వుకొను వారిని నేను కలకత్తాలో చూసాను. పాశ్చాత్య దేశాలలో కొన్ని సమయాలలో విద్యార్థులను కబేళాశాలలకు తీసుకువెళ్ళి కేవలము ఆవులను ఎలా చంపుతున్నారో చూపిస్తుంటారు. ఈ యుగంలోని జనులు అన్నిరకాల

పాపకర్మములను ఆచరిస్తూ ఆనందమును పొందుతుంటారు. ఈ శరీరము తాత్కాలికమైనదని మరియు పూర్తిగా దుఃఖములతో కూడుకున్నదని గుర్తించుటకు కావలసిన మేధస్సు వారి వద్ద లేదు. వారు వధించే పశువుల వలె వారు కూడ పూర్తిగా అజ్ఞానాంధకారములో మునిగి ఉన్నారు. పచ్చిక బయళ్ళలో అనేక పశువులు ఉన్నప్పుడు దానిలో ఒక దానిని ప్రక్కకు తీసుకెళ్ళి దాని గొంతు కోస్తున్నను మిగతా పశువులు అలాగే నిలబడి చూస్తూ గడ్డితినుటను కొనసాగించును. తరువాత వాటిని కూడ వధించెదరని వాటికి తెలియదు. కలియుగంలోని జనులు ఆ విధమైన స్థితిలోనే ఉన్నారు, కాని కృష్ణచైతన్య ఉద్యమం వారికి వీటినన్నింటిని తెలుసు కొనుటకు కావలసిన జ్ఞానమును ఇచ్చుటకు ప్రయత్నిస్తున్నది. మీరు జంతువుల వలె ఉండిపోరాదు, మానవులు కండి అని మేము చెబుతుంటాము. శ్రీ చైతన్య మహాప్రభువు చెబుతున్నట్లుగా,

కృష్ణ భులి సేయ్ జీవ్ అనాది బహిర్ముఖ్
అత్తైవ మాయా తారే దేయా సంసారాదుఃఖ్

"జీవులు అనాదినుండి శ్రీకృష్ణుడిని విస్మరించి అతడి బాహ్యారూపమునకు ఆకర్షితులగు చున్నారు. కాబట్టి జీవులకు భౌతిక జీవితములో 'మాయా'శక్తి అనేక రకాల కష్టాలకు గురిచేయును." (శ్రీ చైతన్య చరితామృతము, మధ్యలీల 20.117) ఎవరైనను శ్రీకృష్ణునితో తమ సంబంధమును విస్మరించినప్పుడే మూర్ఖముగా ప్రవర్తించుదురు. మరియు 'మాయ' అతనికి ఒకటి తరువాత ఒకటిగా అనేక రకాల కష్టాలకు గురిచేయును. మరింకను ఇలా చెప్పబడినది :

మాయా – ముగ్ధో జీవేర్ నహి స్వతః కృష్ణజ్ఞాన్
జీవేర్ కృపాయ్ కోయిల కృష్ణ వేద్ – పురాణ్

"తమ స్వంత ప్రయత్నముల ద్వారా బద్ధ జీవి కృష్ణ చైతన్యమును పునరుద్ధరించు కోలేదు. కాబట్టి శ్రీకృష్ణుడు తన అవ్యాజ కృపచేత వైదిక సాహిత్యమును మరియు దాని అనుబంధ శాస్త్రములను, పురాణములను రచించెను." (శ్రీ చైతన్య చరితామృతము, మధ్యలీల 20.122)

వేదాంత ఉపనిషత్తుల, రామాయణ, మహాభారతము వంటి ఇతర వైదిక సాహిత్యములను వినియోగించుకొని తమో మరియు రజోగుణముల యొక్క కల్మషముల నుండి విముక్తి పొందవలెను. కామం మరియు లోభం కారణంగా

ప్రపంచమంతయు నడుస్తున్నది. కామ అనగా భోగవాంఛ మరియు లోభము. జనులకు చాలినంత డబ్బు మరియు మైథునసుఖము దొరుకుట లేదు. కాబట్టి వారి హృదయాలు కల్మషముతో నిండిపోయాయి. కాబట్టి దానిని శ్రవణం, స్మరణం, కీర్తనములతో శుద్ధిచేసుకోవలెను. మానవ జీవితం అనర్థముల నుండి విముక్తి పొందుట కొరకై నిర్దేశించ బడినది. శ్రీకృష్ణుడు హృదయములో ఉన్నాడు, మరియు కల్మషము కూడ హృదయంలోనే కలదు. వాటిని శుద్ధిపరుచు కొనుటకు శ్రీకృష్ణుడు మనకు సహాయపడును. *"నష్టప్రాయేషు అభద్రేషు నిత్యం భాగవతసేవయా."* (భాగ. 1.2.8) నిత్యం శ్రీమద్భాగవత శ్రవణము మరియు 'హరేకృష్ణ' జపమును క్రమము తప్పక మనం చేయవలెను. ఈ రెండు పద్ధతులు శ్రీ చైతన్య మహాప్రభువు చేత ఆదేశించబడెను. శ్రీల హరిదాసు ఠాకూరు రోజుకు మూడులక్షల భగవంతుని నామాలను జపించెడివారు. అయినను మేము పదహారు మాలలను చేయాలనీ నిశ్చయించాము. అయినను, మనమెంతటి దురదృష్టవంతులము మరియు ఎంతగా పతనము చెందామంటే దీనిని కూడ నిర్వర్తించలేని పరిస్థితిలో ఉన్నాము. మన సమయమును విలువలేనివాటిని వినుటలోనో లేదా మాట్లాడుటలోనో వృథా చేయరాదు. దానిని మనము శ్రీమద్భాగవతమును పఠించుటలో వినియోగించ వలెను. మన సమయం ఎంతో విలువైనది. కాబట్టి దానిని వృథాచేయరాదు. చాణక్య పండితుడు ఇలా చెబుతున్నారు : *"ఆయుషః క్షణ ఏకోఽపి న లభ్యః స్వర్ణకోటిభిః"* మనం వంద సంవత్సరాలు జీవించినను ఈ వంద సంవత్సరాలలో ఒక్కక్షణం కూడ మనకు తిరిగి ఇవ్వబడదు. మనం లక్షల కోట్లరూపాయలను ఇచ్చినను ఒక్కక్షణం కూడ తిరిగిరాదు. మనం ఒక క్షణమును అధికంగా కలపుటయో లేదా ఒక్కక్షణమును తిరిగి పొందుటయో గాని జరుగదు. సమయం కనుక ధనం అయినచో, మనం ఎంత డబ్బును నష్టపోయామను దానిని పరిశీలించు కోవలెను. ఏమైనను సమయం దానికన్నా విలువైనది. మరియు అది తిరిగి పొందలేనిది. అందుకే క్షణం కూడ వృథాచేయరాదు. మానవ జీవితమును జపం చేయుటకు మరియు వైదిక సాహిత్యములను చదువుట కొరకు వినియోగించవలెను. కృష్ణచైతన్య సంఘం ఎన్నో పుస్తకాలను ముద్రిస్తున్నది. కాబట్టి వాటిని చక్కగా అధ్యయనము చేస్తూ, జనులు వారి సమయమును తద్వారా వారి జీవితములను విజయవంతము చేసుకోవలెను. కేవలం శ్రీమద్భాగవతమును పఠించుటయే కాదు భాగవతుడైన వ్యక్తిని అనగా ఎవరి జీవితం శ్రీమద్భాగవతము కంటే భిన్నం కాదో వారికి సేవ చేయవలెను. *"నిత్యం భాగవతసేవయా."* ఈ పద్ధతి ద్వారా మనం

భగవత్ భక్తి స్థితిని పొందగలము, కాని మొదట మనం ఈ అనర్థము లన్నింటి నుండి విముక్తిని పొందవలెను. ప్రస్తుతం మనం "ఇది నా భూమి, ఇది నా దేశము, ఇది నా శరీరము మరియు కుటుంబము" అని ఎన్నోవిధాలుగా భావిస్తూ సమయమును వృథా చేస్తుంటాము. *"నిత్యం భాగవతసేవయా."* మనము సత్త్వగుణ స్థితిలో నెలకొనినప్పుడు, ఇటువంటి ఉపాధులన్నీ నిర్మూలించ బడినప్పుడు తమో, రజోగుణం లేదా కామం మరియు లోభం వలన అందోళనలకు గురికాము. ఇది వాసుదేవ స్థితి. *"ఓం నమో భగవతే వాసుదేవాయ."*

కపిలదేవుడు తరువాతి శ్లోకములో ఈ శుద్ధికరణ ప్రక్రియలను విజయ వంతముగా పూర్తిచేసినప్పుడు కలుగు ఫలితములను వివరిస్తున్నాడు.

శ్లోకము 17

తదా పురుష ఆత్మానం కేవలం ప్రకృతేః పరమ్
నిరన్తరం స్వయంజ్యోతిరణిమానమఖండితమ్

ఆ సమయమున జీవుడు తనను భౌతిక అస్తిత్వమునకు అతీతమైనవానిగను, పరిమాణమందు అతి సూక్ష్మమైనప్పటికిని స్వయం ప్రకాశముగను, అఖండితునిగను గాంచగలడు.

భాష్యము : విశుద్ధ చైతన్యస్థితి నందులేదా కృష్ణచైతన్యము నందు మనుజుడు తనను భగవానునికి అభిన్నమగు సూక్ష్మాంశగా గాంచును. భగవద్గీత యందు తెలుపబడినట్లు జీవుడు భగవానుని శాశ్వతాంశము. సూర్యకిరణములు తేజోమయుడగు సూర్యుని సూక్ష్మాంశము లైనట్లుగా, జీవుడు పరమాత్ముని సూక్ష్మాంశము. జీవుడు మరియు భగవానుడు భౌతిక విభజన యైనట్లుగా విడివడ లేరు; జీవుడు ఆది నుండియు సూక్ష్మాంశయే. జీవుడు చిన్నకణము కాబట్టి పరమాత్ముని నుండి విభజింపబడినాడని ఎవ్వరును భావించరాదు. పరమాత్మలోని ఒక భాగము జీవునిగా పిలువబడునది. మాయచే కప్పబడినదని మాయావాద తత్త్వము ప్రవచించుచున్నది. కాని ఆత్మ యనునది జడపదార్థపు భాగము వలె విభజనీయము కానట్టిది కావున ఆ సిద్ధాంతము అంగీకార యోగ్యము కాదు. జీవుడనెడి భాగము శాశ్వత విభక్తాంశమే. పరమాత్ముడు నిలిచియున్నంత వరకు ఆతని అంశలు కూడా నిలిచియుండును; సూర్యుడు నిలిచియున్నంత వరకు సూర్యరశ్మి కూడా నిలిచి యుండవలసినదే కదా!

ఆత్మపరిమాణము వెంట్రుకకొసలోని పై భాగములోని పదివేలవంతని వేదవాఙ్మయమున చెప్పబడినది. అనగా అది అత్యంత సూక్ష్మమైనది. పరమాత్ముడు అనంతుడు; కాని జీవుడు మాత్రము అత్యంత సూక్ష్మమైనవాడు. అయినను అతడు గుణరిత్యా పరమాత్మునితో ఎటువంటి భేదము లేనట్టివాడు.

ఈ శ్లోకమునందలి రెండు పదములను ప్రత్యేకముగా పరిశీలించవలసి యున్నది : ఒకటి *'నిరంతరమ్'* అనునది. అనగా అభిన్నము లేదా ఒకే గుణమును కలిగినట్టిది అని భావము. జీవుడు ఈ శ్లోకమున *'అణిమానమ్'* అతి సూక్ష్మ స్వరూపుడని చెప్పబడినాడు. అనగా పరమాత్మడు సర్వవ్యాపికాగా, అతి సూక్ష్మమైన వాడు జీవాత్ముడు. *'అఖండితమ్'* అనగా ఖండితము కానిదని భావము కాని 'సహజముగా ఎల్లప్పుడు అతి సూక్ష్మమైనది' అని భావము. సూర్యరశ్మి నెవ్వరును సూర్యుని నుండి వేరు చేయజాలరు; కాని అదే సమయమున సూర్యరశ్మి కణము సూర్యుని అంతగా విస్తారమైనది కాబోదు. అదేవిధముగా జీవుడు తన నిజస్థితి దృష్ట్యాగుణరీతిన పరమాత్మునితో సమానుడే అయియున్నాడు; కాని అతడు ఎల్లప్పుడు అతి సూక్ష్మస్వరూపుడే.

ఆత్మసాక్షాత్కారము అనగా తన నిజ స్వరూపము సూక్ష్మమైన జీవుడని తెలుసుకొనుటయే. ప్రస్తుతము మనము శరీరమును చూస్తున్నాము. కాని ఇది సరియైన గుర్తింపుకాదు. శరీరమును ఆక్రమించిన వాస్తవపురుషుని యొక్క అవగాహన మనకు లేదు. భగవద్గీత ప్రథమ ఉపదేశము (2.13) మనకు తెలుపునది ఏమనగా, శరీరమునకు అధిపతి మరియు శరీరము ఈ రెండు భిన్నమైనవి. మనం ఈ శరీరము కాదని అర్థం చేసుకున్నచో అది ఆత్మసాక్షాత్కారము యొక్క ప్రారంభిక దశ. మరియు దానినే బ్రహ్మభూత స్థితి అంటారు. *"అహం బ్రహ్మాస్మి"*: నేను ఈ భౌతికమైన శరీరమును కాదు. కాని ఆత్మను. మరియు ఆత్మ, జీవాత్మ లక్షణములు ఏమిటి? మొట్టమొదటి విషయమేమిటంటే అతడు *'అణిమానమ్'*, అనగా అణు ఆత్మ. భగవంతుని వలె మనం కూడ 'జ్యోతి'ప్రకాశము. కాని భగవంతుడు 'బ్రహ్మజ్యోతి', సర్వాంతర్యామి మరియు అనంతుడు. మాయవాద సిద్ధాంతము ప్రకారం మనం కూడ 'బ్రహ్మజ్యోతి'లో ఐక్యమవ్వాలి. మాయవాదులు కుండ మరియు ఆకాశము యొక్క ఉదాహరణను ఇస్తుంటారు. కుండ బయట ఆకాశము కలదు, మరియు కుండలో కూడ ఆకాశము కలదు. కేవలం కుండ అను పెంకుల వలననే ఈ భేదము. కుండ పగిలినచో లోపల మరియు బయట అంతయు ఒకటై పోతుంది. ఏమైనను, ఈ ఉపమానం ఆత్మకు సరిగ్గా వర్తించదు.

భగవద్గీత (2.24)లో దీనిని గురించి ఇలా వర్ణించబడినది :

అచ్ఛేద్యో౽ యమదాహ్యో౽ యమక్లేద్యో౽ శోష్య ఏవ చ
నిత్యః సర్వగతః స్థాణురచలో౽ యం సనాతనః

"జీవాత్మ ఛేదించుటకు వీలులేనిది. నీటిలో కరిగించుటకు వీలులేనిది. దానిని దహించుట గాని ఎండించుట గాని శక్యము కాదు. అది నిత్యము, సర్వవ్యాపకము, మార్పులేనిది, కదలించరానిదియై శాశ్వతముగా ఒకే విధముగా ఉండును." ఆత్మను ముక్కలుగా నరకలేము. దీని అర్థం ఆత్మ అనేది శాశ్వత అణు అంశ. మనము శ్రీకృష్ణుని శాశ్వత అంశలము. భగవద్గీత(15.7) లో శ్రీకృష్ణుడు స్వయంగా ఇట్లు చెబుతున్నాడు :

మమైవాంశో జీవలోకే జీవభూతః సనాతనః

"ఈ బద్ధలోకంలోని జీవాత్మలు నా శాశ్వత మరియు సూక్ష్మ అంశలు." 'సనాతన' అనెడి పదమునకు శాశ్వతము అని అర్థం. మరియు 'అంశ' అనగా 'కణం' భగవంతుడైన శ్రీకృష్ణుడు ఎంతో గొప్పవాడు. ఎవరు అతడికి సమానము లేదా అతని కంటె గొప్పవారు లేరు. భగవంతుడు గొప్పవాడని చెప్పబడినది, కాని అతడెంత గొప్పవాడనేది నిజానికి మనకు అర్థం కాదు. అతడు ఎంత గొప్పవాడంటే వేలకొలది లోకములు అతడి శరీరంలోని రోమగ్రంథముల నుండి ఉద్భవిస్తున్నవి.

యస్యైకనిశ్వసితకాలమథావలంబ్య
జీవంతి లోమవిలజా జగదండనాథాః
విష్ణుర్మహాన్ స ఇహ యస్య కలావిశేషో
గోవిందమాదిపురుషం తమహం భజామి

"ఆ మహావిష్ణువు యొక్క రోమరంధ్రముల నుండి ప్రకటితులైన బ్రహ్మ మరియు బ్రహ్మాండములకు అధిపతులైన ఇతర ప్రభువులు ఆ మహావిష్ణువు యొక్క ఒక నిశ్వాసకాలమాత్రము జీవించి యుందురు. కాని ఆ మహావిష్ణువు కూడ ఆ గోవిందుని కళావిశేషమే. ఆదిపురుషుడైన అట్టి గోవిందుని నేను భజించుచున్నాను." (బ్రహ్మ సంహిత 5.48)

వేలకొలది లోకాలు మహావిష్ణువు యొక్క శ్వాస నుండి వెలువడుచున్నవి. భగవద్గీతలోని పదవ అధ్యాయములో, శ్రీకృష్ణుడు అర్జునునికి అతని యొక్క

అనంతమైన మహాత్మ్యమును గురించి కొద్దిగా సూచించెను, మరియు క్రింది వాక్యముల ద్వారా అతడి వర్ణనను ముగించును (భ.గీ. 10.42) :

అథవా బహునైతేన కిం జ్ఞాతేన తవార్జున
విష్టభ్యాహమిదం కృత్స్నమేకాంశేన స్థితోఽ జగత్

"ఓ అర్జునా! ఈ వివరములతో కూడిన జ్ఞానమునకు అక్కర ఏమిగలదు? నా యొక్క ఒకే అంశముచేత నేనీ విశ్వమునంతటను వ్యాపించి పోషించుచుందును."

ఈ జగత్తు శ్రీకృష్ణుని ఒకభాగం యోగ శక్తి పైననే ఆధారపడి ఉన్నది. ఈ విధముగా మనము భగవంతుని గొప్పతనమును అర్థం చేసుకోవలెను. మరియు మనము అతని అణు అంశలమని తెలుసుకోవలెను. జీవాత్మ వెంట్రుక కొస భాగములోని పదివేలవ వంతు పరిమాణములో ఉండునని పురాణములలో తెలుప బడెను. ఏదోవిధముగా మనం వెంట్రుకను పదివేల భాగములుగా విభజించినప్పుడు, ఆత్మ ఎలా కనిపించకుండ ఉండగలదో అర్థం చేసుకోవచ్చును. ఆత్మసాక్షాత్కారము అనగా మనం అత్యంత సూక్ష్మాంశలమని తెలుసుకొనుటయే. ఈ చిన్న ఆత్మ మనందరిలోను కలదు. కాని భౌతికమైన కన్నుల ద్వారా దీనిని చూచుట సాధ్యపడదు. ఈ ఆత్మను నిజంగా చూచుటకు కావలసిన ఎటువంటి పరికరము ఈ భౌతిక ప్రపంచములో లేదు. ఆత్మ చూచుటకు సాధ్యపడదు. కాబట్టి మనం దీనిని నిరాకారమని, రూపం లేనిదని అంటాము. మనం దాని పరిమాణమును (ఆకారము) లెక్కకట్టలేము. మనం లెక్కకట్ట లేకున్నను ఆత్మ అనేది కలదు. జీవాత్మ పూర్తి శరీరమును కలిగి ఉన్నాడు. కంటికి కనిపించని అతి సూక్ష్మమైన క్రిములు మరియు కీటకాలు కూడ ఎన్నోకలవు. వాటి శరీరము కూడ ఎన్నో అంగములతో పని చేయుచున్నది. ఆ చిన్న కీటకములో కూడ జీవాత్మ కలదు. అంతేకాకుండ అదే జీవాత్మ ఏనుగులో మరియు ఇతర పెద్ద జంతువులలో కూడ కలదు.

నిజమైన బ్రహ్మానుభూతిని పొందినప్పుడు మన జీవితము పరిపూర్ణమగును. ప్రస్తుతం మనం దేహాత్మబుద్ధిని కలిగివున్నాము. కాని ఇలా ఉన్నంత కాలము మన వద్ద ఎంతటి శాస్త్రీయ జ్ఞానం ఉన్నప్పటికినీ, మనం కుక్క మరియు పిల్లుల కంటె గొప్పవారమేమి కాదు. శరీరమే ఆత్మయని బద్ధజీవి భావించును. అందుకే జీవులు తమను అమెరికావాసులుగా, భారతీయులుగా, బ్రాహ్మణులుగా, క్షత్రియులుగా, పురుషులుగా, స్త్రీలుగా ఏనుగు మొదలగు వాటితో గుర్తుంచు కుంటారు. దేహాత్మబుద్ధి వలన జనులు తమ భార్య, పిల్లలు తమవారని జన్మభూమి

పూజింపదగినదని భావిస్తారు. ఇలా ఆలోచిస్తూ ప్రజలు తమ దేశం కోసమై పోరాడి మరణించుటకు సిద్ధపడుతుంటారు. ప్రస్తుతం ప్రజలందరూ ఈ భ్రమతోనే శ్రమిస్తుంటారు, కాని మనము మన ఆధ్యాత్మిక స్వరూపమును అర్థం చేసుకొనుట కొరకు, సరియైన గురువు కొరకు అన్వేషించవలెను.

మన స్వరూపమును తెలుసుకొనుట అనగా, మనం శ్రీకృష్ణుడి యొక్క శాశ్వత సూక్ష్మాంశలమని, ఒక అంశ మరియు అంశితో సంబంధము కలిగి ఉన్నట్లుగా, మనం కూడ శ్రీకృష్ణునితో శాశ్వత, సనాతనమైన సంబంధమును కలిగి ఉన్నామని అర్థము చేసుకోవాలి. గుణైక్యమున్నను ఏ సమయంలోను కూడ మనము శ్రీకృష్ణుడి వలె గొప్పవారము కాలేము. ఎవరూ అతనికంటె గొప్పవారు గాని లేదా అతని కంటె సమానము గాని కాలేరు. ఎవరైనను భగవంతుడనని వాదించినచో, అతని కంటె గొప్పవారు ఎవరూ లేరని నిరూపించవలెను. అతడు అలా చేసినచో అతడు భగవంతుడు. ఇది ఎంతో సరళమైన నిర్వచనము. 'బ్రహ్మ సంహిత'(5.1) కూడ ఈ వాక్యమును నిర్ధారించెను : *"ఈశ్వరః పరమః కృష్ణః."* *'ఈశ్వరః'* అను పదమునకు నియంత్రకుడని అర్థం. మరియు *'పరమః'* అనగా సర్వశ్రేష్ఠుడు అని అర్థం. అణు జీవులమైన మనం కూడ కొద్దిపాటి నియంత్రకులమే. మనం కొన్ని కొన్నిసార్లు మన కుటుంబ సభ్యులను, భార్యను, పిల్లలు మొదలగు వారిని నియంత్రించ గలము. లేదా మన కర్మాగారమును, మన కార్యాలయమును దేశమును మరేదో దానిని నియంత్రించగలము. చిన్న మరియు గొప్ప నియంత్రికులు కలరు. మనము బ్రహ్మను గమనించి చూచినచో అతడు సృష్టి మొత్తమును నియంత్రిస్తున్నప్పటికినీ అతడు పరమేశ్వరుడు కాదు. ఈ విశ్వములోని అతి గొప్ప జీవాత్మయైన బ్రహ్మ కూడ ఎలా నియంత్రించాలనే దానిని నేర్చుకొనుట కొరకై ధ్యానము చేయుచున్నాడు. *"తేనే బ్రహ్మ హృదా య అదికవయే."* (భాగ. 1.1.1)

మొట్టమొదట బ్రహ్మ ఈ జగత్తును నియంత్రించుట మెలాగో నేర్చుకున్నాడు; తరువాతనే అతడు బ్రహ్మగా అర్హత పొందాడు. అతడు బ్రహ్మగా జన్మించినప్పటికినీ శిక్షణను పొందవలసి వచ్చెను. ఈ జగత్తులో అతడు ఆది జీవియైనచో అతనికి ఎవరు శిక్షణ నిచ్చారు. భగవద్గీత(10.2) లో శ్రీకృష్ణుడు ఇలా చెబుతున్నాడు: *"అహమాదిర్హి దేవానాం"* – "దేవతలందరికి నేనే మూలాధారమును."

బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుడు ఆదిదేవతలు. శ్రీకృష్ణుడు, విష్ణువే బ్రహ్మ మరియు శివునికి శిక్షకుడు. కాబట్టి శ్రీకృష్ణుడు దేవతలందరికి మూలాధారము.

మూర్ఖత్వముతో భగవంతుడితో సమానులమని గొప్పవారమని మనము

వాదించరాదు. మనం అగ్నిలోని కణముల వంటివారమని అర్థం చేసుకోవలెను. అగ్నికణము కూడ అగ్నియే, కాని అది మూలమైన అగ్ని నుండి వేరుబడినచో అది కూడ ఆరిపోగలదు. మనం గుణములో భగవంతుడి వంటివారము. కనుక మనము భగవంతులమని భావించరాదు. మనం ఈశ్వరులము, నియంత్రులము కావచ్చును, కాని *'ఈశ్వరః పరమః'* అనగా పరమ నియంత్రులము కాలేము. ఈ రోజులలో భగవంతుడిగా, నారాయణుల మయ్యామని వాదించుటమొక ప్రదర్శనగా మారినది. మాయావాదులు ఒకరినొకరు నారాయణులమని సంబోధించుకుంటూ వారు అలా నారాయణులుగా మారుదురు. ఈ విధముగా మనమిప్పుడు అక్కడ ఇక్కడ నారాయణులతో క్రిక్కిరిసి పోతున్నాము. కాని ప్రతిఒక్కరు నారాయణులు ఎలా కాగలరు? నారాయణుడు ఒక్కడు, మరియు శాస్త్రములు ఈ విధముగా హెచ్చరిస్తున్నవి :

యస్తు నారాయణం దేవం బ్రహ్మరుద్రాదిదేవత్తైః
సమత్త్వేనైవ వీక్షేత స పాషండీ భవేద్ధృవమ్

"ఆధ్యాత్మిక దృష్టి ననుసరించి ఎవరైన విష్ణువు మరియు దేవతలు సమానులని భావించినచో వారిని వెంటనే నాస్తికుడు అని అర్థం చేసుకోవలెను."(పద్మపురాణము) కాబట్టి ఎవరైనను నారాయణుని దేవతలతో పోల్చినచో, అతడు కేవలము తన బుద్ధిహీనతను ప్రదర్శిస్తున్నట్లు అర్థం. అలాగే దరిద్ర నారాయణుడు అనుట అలవాటుగా మారింది, వీధులలోని దరిద్రుడిని నారాయణుడు అని వాదించుటయే. ఏమిటి ఈ మూర్ఖత్వము? నారాయణుడు అంటే దేవాదిదేవుడు. శంకరాచార్యుల వారు కూడ ఇలా చెబుతున్నారు : *"నారాయణః పరోఽ వ్యక్తాత్"* – ఈ జగత్తునకు అతీతమైనవాడు నారాయణుడు. *"అవ్యక్తాద్ అణ్డసంభవః"* – సృష్టి అంతయు ఈ 'అవ్యక్తము' యొక్క ఉత్పత్తి. మరియు మనం నారాయణుని ఎవరితోను పోల్చరాదు. అటువంటప్పుడు వీధిలోని దరిద్రుని గురించి చెప్పేదేముంది? ఇదంతయు మూర్ఖత్వము. నారాయణుడు లక్ష్మీపతి అనగా అదృష్టదేవతయైన లక్ష్మిని నియంత్రించువాడు. అటువంటప్పుడు, అతడు దరిద్రుడు ఎలా అగును. ఇదంతయు భ్రాంతి చేతనే జరుగుచున్నది. అందుకే శాస్త్రములు ఇలా చెబుతున్నాయి, ఎవరైనను నారాయణుడిని దేవతలతో సమానమని భావించినచో, అతడిని పాషండిగా మరియు నాస్తికునిగా పరిగణించవలెను. మనము ముక్తులమైనందున నారాయణునితో సమానులమని భావించరాదు. కఠిన తపస్సు ద్వారా మనము బ్రహ్మన్ స్థితిని

పొందవచ్చును. కాని ఇది పరబ్రహ్మన్ స్థితి కాదు. *"ఆరుహ్యా కృచ్ఛ్రేన పరం పదం తతః."* (భాగ. 10.2.32) ఎవరైనను బ్రహ్మన్ స్థితికి ఎదిగినను, శ్రీకృష్ణుని పాదపద్మముల ఆరాధనను నిర్లక్ష్యము చేసినచో అతడు తిరిగి భౌతిక స్థితికి పతన మగును. ఎవరైన బ్రహ్మజ్యోతిని చేరినప్పటికినీ, అక్కడ ఎటువంటి ఆశ్రయము లేనందున, అతడు భౌతిక లోకమునకు తిరిగి వచ్చెదరు. ఎవరైనను భౌతికలోకంలోని అత్యున్నత లోకమైన బ్రహ్మలోకమును చేరినను అక్కడ అతని స్థితి తాత్కాలికమైనది. ఏమైనను, పరవ్యోమ, ఆధ్యాత్మిక జగత్తులో ఎన్నో ఆధ్యాత్మిక లోకాలు కలవు, మరియు వీటినే వైకుంఠ లోకములని అంటారు. ఇలాంటి కోటానుకోట్ల గొప్ప లోకాలెన్నో కలవు. వీటిలో దేనినైనను ఆశ్రయించ వలెను, లేనిచో మనం ఈ భౌతిక ప్రపంచములోకి తిరిగి పతనమగుదుము.

కేవలం బ్రహ్మన్ అనుభూతికి ఎదుగుటమనేది సరిపోదు. బ్రహ్మన్ అనగా సత్ మరియు ఇది సరమసత్యము యొక్క అసంపూర్ణ అనుభూతి. నిజానికి మనం అనందము కొరకు ప్రాకులాడుతున్నాము. *'సచ్చిదానంద'* : *'చిత్'* అనగా జ్ఞానం ఇది కూడ అసంపూర్ణము. పరిపూర్ణ అనుభూతిని పొందవలెనన్నచో దానికి ఆనందమను దానిని కలుపవలెను. కేవలము ఆకాశములో విమానములో ఎగురుతూ పోవుట వలన అనందమును పొందలేము. కొంత సమయము తర్వాతనైనను విమానాశ్రయములో దిగవలిసి ఉంటుంది. కేవలం బ్రహ్మజ్యోతి వరకు ఎదుగుట వలన మనం ఆనందానుభూతిని పొందలేము. నారాయణుడు, శ్రీకృష్ణుడు నివసించెడి దివ్యలోకములను చేరినప్పుడే మనకు ఆనంధానుభూతి కలుగును. *"పరస్తస్మాత్తు భావోఽన్యోఽవ్యక్తోఽవ్యక్తాత్ సనాతనః."* (భ.గీ. 8.20) మనం శాశ్వతమైన లోకాలలోకి ప్రవేశించి దేవాదిదేవునితో సాంగత్యము చేసినప్పుడే నిజమైన ఆనందము లభించును. మనం ఈ స్థితికి చేరుకొననిచో తిరిగి భౌతిక ప్రపంచమును చేరుదుము. కాబట్టి ఎలా ఈ స్థితిని పొందగలము? మనం కేవలము అతడెందుకు అవతరించును? అతని కార్యమేమిటి? అతని స్వరూపం ఏమిటి?అని అర్థం చేసుకొనుటకు ప్రయత్నించవలెను.

జనులకు శ్రీకృష్ణుడిని ఎలా అర్థం చేసుకోవాలో బోధించుటయే కృష్ణ చైతన్య ఉద్యమ ఉద్దేశ్యము. ఎవరైనను అతడిని అర్థం చేసుకోగలిగెడి అదృష్టవంతుడైనచో, అతడి జీవితము పరిపూర్ణమగును. కామ మరియు లోభవాంఛలు ఉన్నంత వరకు మనం దీనిని అర్థం చేసుకోలేము. భక్తియోగ పద్ధతి అనేది శుద్ధమైన ప్రక్రియ. దీనితో మనం కామం మరియు లోభం నుండి మరియు నీచగుణములైన, తమోరజో

గుణముల ప్రభావముల నుండి విముక్తిని పొందుదుము. భక్తియుక్త సేవలో పాల్గొనిన వెంటనే, మనం గుణ ప్రభావముల నుండి విముక్తిని పొందగలము. భగవంతుడిని సమీపించుట మెలాగో మనకు తెలియనందున ఆచార్యులు తెలిపిన భక్తియోగ సూత్రములను అనుసరించవలెను. బాలుడు పాఠశాలకు వెళ్ళుటను ప్రారంభించి నప్పుడు, అతడు అక్కడి నియమ నిబంధనలను నేర్చుకోవలెను, కాని కొద్దికాలం తర్వాత ఆ నియమ నిబంధనలను పాటించుటకు అతడు అలవాటు పడినప్పుడు వాడికి తిరిగి నేర్పించ నవసరము లేదు. మరోలా చెప్పాలంటే, అతడు కొద్దికాలం తర్వాత పాఠశాలకు సహజముగానే తగిన సమయానికి వెళ్ళి తనకు కేటాయించ బడిన ప్రదేశములో కూర్చొని చక్కగా నేర్చుకొనును. అదేవిధముగా కృష్ణచైతన్య ఉద్యమములో కూడ కొన్ని నియమ నిబంధనలు కలవు. మనం తెల్లవారు జామున మేల్కొని మంగళహారతిలో పాల్గొనవలెను, పదహారు మాలలను జపం చేయవలెను. భక్తియోగకు సంబంధించిన అంగములన్నింటిని పాటించవలెను. ఈ విధముగా, శ్రీకృష్ణునికి సేవ చేయవలెను. అంతేకాకుండ, ఈ భక్తిశాస్త్రములో మంచి సాధకులమైన వెంటనే ఆత్మసాక్షాత్కారమును పొందగలుగుదుము.

అధ్యాయము 10

ఆధ్యాత్మికాసక్తి మరియు భౌతిక అనాసక్తి

శ్లోకము 18

జ్ఞానవైరాగ్యయుక్తేన భక్తియుక్తేన చాత్మనా
పరిపశ్యత్యుదాసీనం ప్రకృతిం చ హతౌజసమ్

అటువంటి ఆత్మసాక్షాత్కార స్థితి యందు మనుజుడు భక్తియుక్తమగు జ్ఞానవైరాగ్యముల నభ్యసించుచు ప్రతిదానిని యథార్థదృష్టితో గాంచును. భౌతిక అస్తిత్వమునెడ అతడు ఉపేక్షవహించినవాడు కాగా, భౌతిక ప్రభావము అతనిపై ప్రభావవంతముగా పనిచేయబోదు.

భాష్యము : ఏదేని ఒక రోగమునకు సంబంధించిన సూక్ష్మక్రిములు బలహీనుడైన వాని పైననే ప్రభావము చూపినట్లు, ప్రకృతి(మాయాశక్తి) ప్రభావము బలహీన(బద్ధ) జీవుని పైననే పనిచేయును గాని ముక్తజీవునిపై కాదు. ఆత్మసాక్షాత్కారమనేది ముక్తస్థితి. జ్ఞానవైరాగ్యముల ద్వారా మనుజుడు తన సహజస్థితిని అవగతము చేసికొనగలడు. జ్ఞానము లేకుండ ఎవ్వడును ఆత్మసాక్షాత్కారమును బడయబోడు. తాను పరమాత్మ యందలి సూక్ష్మాతిసూక్ష్మమగు అంశననెడి అనుభూతి మనుజుని బద్ధభౌతిక జీవనము నెడ అనాసక్తుడిని చేయును. అదియే భక్తియుక్త సేవకు ఆరంభము. భౌతిక కల్మషము నుండి విడివడనిదే ఎవ్వరును భక్తియుక్తసేవ యందు నెలకొనజాలరు. కనుకనే ఈ శ్లోకమునందు *'జ్ఞానవైరాగ్యయుక్తేన'* అని తెలుపబడినది. అనగా మనుజుడు తన నిజస్థితిని గూర్చిన సంపూర్ణ జ్ఞానమును కలిగి యుండి, భౌతికాకర్షణ యెడ అనాసక్తుడై సన్న్యాసజీవనమున నెలకొని యున్నప్పుడు విశుద్ధభక్తియుక్త సేవ ద్వారా(భక్తియుక్తేన) కృష్ణసేవ యందు అతనికి ప్రియమైన సేవకుడిగా నియుక్తుడు కాగలడు. అతడు ప్రతిదానిని యథార్థదృష్టితో గాంచగలడనుటయే *'పరిపశ్యతి'* అను పదము యొక్క భావము. అప్పుడు భౌతిక ప్రకృతి యొక్క ప్రభావము దాదాపు శూన్యమగును. ఈ విషయము భగవద్గీత(18.54) యందును నిర్ధారించబడినది : *"బ్రహ్మభూతః ప్రసన్నాత్మా"*– మనుజుడు ఆత్మసాక్షాత్కారమును బడసినపుడు ప్రసన్నుడై, భౌతికప్రకృతి ప్రభావము నుండి విడివడును. ఆ సమయమున అతడు శోకము మరియు అత్యాశ నుండి బయటపడగలడు. ఆ స్థితినే శ్రీకృష్ణభగవానుడు : *"మద్భక్తిం లభతే పరామ్"* అనగా

భక్తియుక్త సేవారంభ స్థితి అని తెలిపినాడు. అదేవిధముగా, 'నారదపంచరాత్ర' మందును నిర్ధారించ బడినదేమనగా ఇంద్రియములు పవిత్రమైనప్పుడు, వాటిని హృషీకేశుని సేవలో నియుక్తము కావింపవచ్చును. భౌతిక కల్మషముల పట్ల అనుబంధము గలవాడు భక్తుడు కాజాలడు.

బద్ధస్థితిలో మనం భౌతిక ప్రకృతి ద్వారా ప్రభావితులౌతాము. సత్త్వరజో తమో అనే త్రిగుణముల ద్వారా మనము ఎలా బద్ధస్థితిలో బంధింప బడతామో ముందుగానే చర్చించితిమి. తమో మరియు రజోగుణము కంటే సత్త్వగుణము ఉన్నతమైనది. ఎందుకనగా ఈ సత్త్వగుణము వలన మనము శ్రీకృష్ణుడిని అర్థం చేసుకోగలుగుదుము. అంతేకాకుండ ఆ విధముగా గుణముల నన్నింటిని అధిగమించగలము. ఈ కలియుగములోని ప్రజలు సహజముగానే నీచ గుణములైన తమోరజోగుణాల ప్రభావములకులోనై ఉంటారు. కాబట్టి ఈ గుణములతో మనం శ్రీకృష్ణునికి సేవ చేయలేకున్నాము. మన సహజస్థితి సేవ చేయుటయే. ఎవరికి సేవ చేయనిచో మాయకు సేవ చేసెదము. ఎట్టి స్థితిలోను మనం యజమానులము కాలేము. తాను యజమానిననీ, ఎవరికి తాను సేవ చేయుట లేదని ఎవరు చెప్పగలరు? మనము మన కుటుంబమును, సమాజమును, దేశమును, వ్యాపారమును లేదా మరోదానిని సేవిస్తుంటాము. సేవ చేయుటకు ఏది లేనిచో వెళ్ళి కుక్కనో లేదా పిల్లినో కొని వాటికి సేవ చేస్తుంటాము. ఎందుకు? ఎందుకనగా సేవ అనేది మన సహజ ప్రవృత్తి. కాని ఎవరిని సేవించాలనే జ్ఞానమును లేకుండ ఉన్నాము. సేవ అనేది శ్రీకృష్ణుని కొరకు ఉద్దేశించబడినది. ఈ భౌతిక లోకంలో మనము మన కామవాంఛలను సేవిస్తున్నాము, అంతేకాని శ్రీకృష్ణుని కాదు. మరియు దీని నుండి మనం ఎటువంటి ఆనందమును పొందుట లేదు. మనం కార్యాలయాల్లో లేదా మరేదానిలోనో డబ్బు కొరకు సేవిస్తున్నాము. ఈ విషయములో, మనం డబ్బును సేవిస్తున్నాము, వ్యక్తిని కాదు. కాబట్టి ఈ భౌతిక లోకంలో మనము డబ్బులను మరియు ఇంద్రియములను సేవిస్తున్నాము. ఏ పరిస్థితిలోనైనను సేవించుటమనేది కలదు. కాబట్టి మనం తప్పక సేవించవలసి వచ్చును.

నిజానికి శ్రీకృష్ణుడు మాత్రమే యజమాని. *"ఏకలే ఈశ్వర కృష్ణ, అర్ సబ్ భృత్య."* (శ్రీ చైతన్య చరితామృతము, ఆదిలీల 5.142) దేవతలు మానవులు, జంతువులు, వృక్షాలు, సర్వులు సేవకులే. ఆత్మసాక్షాత్కారము అనగా తాను శ్రీకృష్ణుడి యొక్క శాశ్వత సేవకుడనని తెలుసుకొనుట మరియు అతడిని సేవించుటయే మన ధర్మమని తెలుసుకోవాలి. ఆత్మసాక్షాత్కారము అనగా *"అహం బ్రహ్మాస్మి"*–

"నేను బ్రహ్మన్, భగవానుని అయ్యానని భావించుట కాదు." మనం ఎలా భగవంతులము కాగలము? నిజానికి మనము భగవానులమైనచో, మనం సర్వశక్తి వంతులము. ఇది సత్యమైనచో, మనమెందుకున్నాము? దుఃఖపూరితమైన స్థితిలో ఉన్నాము? మాయ ప్రభావములో మనమెందుకు ఉన్నాము? భగవంతుడు కూడ మాయ ప్రభావమునకు లోనవుతాడా? లేదు. శ్రీకృష్ణుడు ప్రత్యేకించి భగవద్గీతలో ప్రకృతి లేదా మాయ తన ఆదేశాలను అనుసరించి పని చేయుచున్నదని చెబుతున్నాడు. మాయ అనేది శ్రీకృష్ణునికి సేవకురాలు. మరియు మనము మాయకు సేవకుల మైనప్పుడు శ్రీకృష్ణుడు లేదా భగవానుడుగా ఎలా కాగలము? మనము మన ఆధ్యాత్మిక ఇంద్రియాలలో నెలకొనినప్పుడు, మాయ సేవలో పొరపాటుగా పాల్గొంటున్నామని మరియు శ్రీకృష్ణుడికి సేవ చేయుట మన ధర్మమని అర్థం చేసుకోగలుగుదుము. అది ఆత్మసాక్షాత్కారము. ఇక్కడ చెప్పినట్లుగా, *'జ్ఞానవైరాగ్య యుక్తేన'.* వాస్తవమైన జ్ఞానమంటే తాను శ్రీకృష్ణుని సేవకుడననీ మరెవరికినీ కాదని అర్థం చేసుకొనుటయే. ఎటువంటి లాభము మరియు ఆనందము లేకుండ, భ్రాంతిలో ఉన్నందున మనం కామాన్ని, లోభాన్ని మాత్సర్యాన్ని సేవిస్తున్నాము. *'కామాధీనాం కతి న కతిధా పాలితా దుర్నిదేశాః'* – "కామవాంఛల యొక్క విలువలేని ఆదేశాలకు అంతమనేది లేదు."(భక్తిరసామృత సింధువు 3.2.25) శ్రీకృష్ణుని సేవలోనే మనకు ఆనందమనేది కలుగునని తెలుసుకున్నప్పుడు, 'జ్ఞానవైరాగ్యము'లను సాధించినట్లు. కాబట్టి శ్రీమద్భాగవతము(1.2.7)లో ఇలా చెప్పబడినది :

వాసుదేవే భగవతి భక్తియోగః ప్రయోజితః
జనయత్యాశు వైరాగ్యం జ్ఞానం చ యదహైతుకమ్

"దేవాదిదేవుడైన శ్రీకృష్ణునకు భక్తియుక్త సేవను గూర్చుట ద్వారా మనుజుడు శీఘ్రముగా నిర్హేతుకమైన జ్ఞానమును మరియు జగత్తు నుండి వైరాగ్యమును పొందును." ఎవరైనను వాసుదేవుని, శ్రీకృష్ణుని సేవలో నియుక్తులైనప్పుడు, ఈ జ్ఞానమును పొంది వారు మహాత్ములగుదురు. శ్రీకృష్ణుడే సర్వమని తెలుసుకున్నవాడే మహాత్ముడు. అతడు శ్రీకృష్ణుడిని తిరస్కరించుట లేదా శ్రీకృష్ణుడవ్వాలనీ ప్రయత్నించడు. ఎవరైనను అలా చేసినచో వారు మహాత్ములు కారు, వారు దురాత్ములు – మూర్ఖులు. మహాత్ముని స్థితి మరియు జ్ఞానం ఏమిటి? శ్రీకృష్ణుడు ఇలా చెబుతున్నాడు (భ.గీ.9.13) :

మహాత్మానస్తు మాం పార్థ దైవీం ప్రకృతిమాశ్రితాః
భజన్త్యనన్యమనసో జ్ఞాత్వా భూతాదిమవ్యయమ్

"ఓ పృథాకుమారా! భ్రాంతచిత్తులు కాని మహాత్ములు దివ్యప్రకృతి రక్షణమున నుందురు. వారు నన్ను ఆద్యుడును అనంతుడును అయిన దేవాదిదేవునిగా నెరుగుదురు. కావున వారు భక్తియుక్త సేవలో సంపూర్ణముగా నిమగ్నులైయుందురు."

మహాత్ముడిని తయారు చేయలేము. అతడు *'దైవీప్రకృతి'* ఆధీనములో ఉండును. *'పరాప్రకృతి'* మరియు *'అపరాప్రకృతి'* అను రెండు ప్రకృతులు కలవు. *'అపరాప్రకృతి',* అనేది భౌతికలోకము మరియు *'దైవీప్రకృతి'* అనేది ఆధ్యాత్మిక లోకము. ఈ భౌతిక లోకములో కుటుంబము, స్నేహితులు, దేశము మొదలగు వాటి రూపంలో మాయను అనవసరంగా సేవిస్తున్నామని అర్థం చేసుకునిన వెంటనే అతడు జ్ఞానస్థితిని పొందును. ఈ జ్ఞానమును పొందిన వెంటనే అతడు *'బ్రహ్మభూత'* స్థితిని పొంది *'ప్రసన్నాత్ముడు'* అగును. అనగా ఆనందమును పొందును. నేనెందుకు శ్రీకృష్ణుడిని సేవించవలెను? అని ఎవరైన అడుగవచ్చును. ముందే నేను వివరించినట్లు, అంశ అనేది అంశికి సేవచేయవలెను. శ్రీకృష్ణుడు మరియు జీవాత్మలు శ్రీకృష్ణుని సంతృప్తికొరకు ఉద్దేశించబడినవారు. *"ఈశావాస్యమిదం సర్వమ్."*

ఎందరో ఈశ్వరులు, నియంతలు కలరు. అయినను శ్రీకృష్ణుడే పరమేశ్వరుడు. ఈ సాక్షాత్కారమును పొందిన వెంటనే మానవుడు, పరిపూర్ణ జ్ఞానమును పొందినట్లు, మరియు అతడు భక్తియోగనందు సేవ నొనరించును. మూర్ఖపు జనులు భక్తియోగ అనేది అజ్ఞానుల కొరకు ఉద్దేశించబడినదని అంటారు. కాని అది సత్యం కాదు. భగవద్గీత(7.19)లో శ్రీకృష్ణుడు అనేక జన్మల తర్వాత జ్ఞానియైనవాడు తనకు శరణాగతి పొందునని చెప్పుచున్నాడు.

శ్రీకృష్ణుడిని వాసుదేవుడని అర్థం చేసుకోలేనంత వరకు మనం మూర్ఖులమనే అర్థము. గొప్పజ్ఞానులమని, పండితులమని ప్రకటనలు చేసుకొని నప్పటికిని మనం నిజానికి మూర్ఖులమే. ఇదే శాస్త్రనిర్ణయము. నిజమైన జ్ఞానమును పొందినప్పుడు శ్రీకృష్ణుడికి శరణాగతి చేసుకోవలెను.

కొన్ని పుణ్యకర్మలు కొన్ని పాపకర్మలు కలవు. కాని శ్రీకృష్ణుడు రెండింటిని విడువవలెనని పేర్కొను చున్నాడు. ఎన్నో ధర్మాలు లేక కార్యక్రమాలెన్నో కలవు. తమ బంధువులతో పోరాడుట పాపకర్మయని అర్జునుడు భావించెను. కాని శ్రీకృష్ణుడు

యుద్ధం చేయాలని అతడిని ఒత్తిడి చేసెను. కాని అర్జునుడు ఎలా పాపకర్మను ఆచరించును? అతడు చేయలేడు. ఎందుకనగా శ్రీకృష్ణునికి చేయు సేవ పాపపుణ్య కర్మలకు అతీతమైనది. గోపికలు అర్ధరాత్రి శ్రీకృష్ణుడి వేణుగానమును వినినప్పుడు వారు శ్రీకృష్ణుడిని కలుసుకొనుట కొరకై అడవికి పరిగెత్తిరి. యువతులు ఒక యువకుడిని చూచుట కొరకు అడవిలోనికి అర్ధరాత్రి వెళ్ళుటమనేది ధర్మవిరుద్ధము. నిజానికి ఇది ధర్మవిరుద్ధము కాదు, ఎందుకంటే గోపికలు దీనిని శ్రీకృష్ణుని కొరకు చేశారు. శ్రీ చైతన్య మహాప్రభువు ఎంత ఖచ్చితంగా ఉండేవాడంటే, ఏ యువతి కూడ ఆయన దగ్గరకు వెళ్ళి ప్రణామములను అర్పించేది కాదు. అలాంటి ఆయన ఇలా చెబుతున్నారు : *"రమ్యా కశ్చిదుపాసనా వ్రజవధూవర్గేణ యా కల్పితా"* – "గోపికల ఆరాధన కంటె అద్భుతమైనది మరొకటి కలదా?" గోపికలు శ్రీకృష్ణునితో నృత్యం చేయుటమనేది ధర్మవిరుద్ధమైన కార్యంగా కనిపించినను శ్రీకృష్ణుడితో వారికి గల సంబంధము అత్యున్నతమైన ఆరాధనమని శ్రీ చైతన్య మహాప్రభువు చెబుతున్నారు. ఇదియే నిజమైన ఆధ్యాత్మిక జ్ఞానము. శ్రీకృష్ణుడికి సేవ చేసినప్పుడు, మానవుడు పాపపుణ్య కార్యములకు అతీతుడగును. ప్రకృతి గుణములలోనే ఈ పాపపుణ్యము లనేవి కలవు. శ్రీకృష్ణునికి చేయు సేవ మంచిచెడు, పాపపుణ్య కర్మలకు అతీతమైనది. జ్ఞానవైరాగ్యములు కలిగినప్పుడు భక్తియోగ ప్రారంభమగును. జ్ఞానమనగా తెలుసుకొనుట మరియు వైరాగ్యమనగా జడ పదార్థము పట్ల అనాసక్తిని కలిగి, ఆత్మ ఆధ్యాత్మిక పదార్థములో నియుక్తమగుటయే. ఈ రెండు శ్రీకృష్ణుని భక్తియుక్త సేవలో పాల్గొనినప్పుడు సహజముగానే సాధ్యపడును.

శ్లోకము 19

న యుజ్యమానయా భక్త్యా భగవత్యఖిలాత్మని
సదృశోఽస్తి శివః పన్థా యోగినాం బ్రహ్మసిద్ధయే

దేవాదిదేవునికి భక్తియుక్త సేవయందు నెలకొననిదే ఏ రకపు యోగియును ఆత్మానుభవము నందు పూర్ణత్వమును బడయజాలడు. ఏలయన అది ఒక్కటే మంగళప్రదమగు పథమై యున్నది.

భాష్యము : భక్తియుక్తసేవతో మిళితము కానప్పుడు జ్ఞానవైరాగ్యములును ఏనాడును పరిపూర్ణత్వమును బడయవనెడి విషయము స్పష్టముగా వివరింపబడినది. '*న యుజ్యమానయా*' అనగా 'మిళితము కాకుండా' అని భావము. 'భక్తియుక్త సేవ'

అని అనినప్పుడు ఆ సేవ నెచ్చట ఒనరించవలెననెడి ప్రశ్న ఉదయించును. సమస్తము నందు పరమాత్మునిగా వెలుగొందుచున్న దేవాదిదేవునికే ఆ సేవ నొనర్చ వలెననుట దానికి సమాధానము. ఏలయన అదియే విశ్వసనీయమగు ఆత్మసాక్షాత్కార పథము, లేదా బ్రహ్మానుభూతియై (బ్రహ్మభావనము) యున్నది. మనుజుడు తాను జడపదార్థమునకు భిన్నునిగను మరియు తాను బ్రహ్మమునని అవగతము చేసికొనుట *'బ్రహ్మసిద్ధయే'* అను పదము యొక్క అర్థము. "అహం *బ్రహ్మాస్మి"* అనునది ఈ విషయమునకు సంబంధించిన వేదవాక్కు. *'బ్రహ్మసిద్ధి'* యనగా మనుజుడు తాను జడపదార్థమును కానని, శుద్ధాత్ముడనని తెలిసికొన వలెను. యోగులు అనేక రకములుగా నున్నారు; కాని ప్రతి యోగియును ఆత్మ సాక్షాత్కారము(బ్రహ్మానుభూతి) నందు నెలకొనవలసినదే. దేవాదిదేవుని భక్తియుక్త సేవలో సంపూర్ణముగా నెలకొననిదే ఎవ్వరును *'బ్రహ్మసిద్ధి'* పథమును సులభముగా చేరజాలరని ఇచ్చట స్పష్టముగా తెలుపబడినది.

మనుజుడు వాసుదేవుని భక్తియుక్తసేవలో నెలకొనినప్పుడు ఆధ్యాత్మిక జ్ఞానము మరియు భౌతిక జగత్తు నెడ వైరాగ్యము అప్రయత్నముగానే కలుగునని శ్రీమద్భాగవతము నందలి రెండవ అధ్యాయపు ప్రారంభములోనే తెలుపబడినది. అనగా భక్తుడు జ్ఞానము కొరకు లేదా వైరాగ్యము కొరకు విడిగా యత్నించ నవసరము లేదు. సాక్షాత్తుగా భక్తియుక్త సేవ ఎంతటి శక్తివంత మైనదనగా దాని సేవద్వారా సర్వము విదితము కాగలదు. అది *'శివః పన్థా'* – సాక్షాత్కారమునకు అదియే మంగళకర పథమని చెప్పబడినది. బ్రహ్మానుభూతికి భక్తియుక్త సేవా పథమనునది అత్యంత రహస్యమార్గమై యున్నది. బ్రహ్మానుభూతి యందు పూర్ణత్వము మంగళకర పథమగు భక్తియోగము ద్వారా సిద్ధించుననెడి విషయము నామమాత్రపు బ్రహ్మానుభూతి (బ్రహ్మజ్యోతి యొక్క అనుభవము) నిజమగు *'బ్రహ్మసిద్ధి'* కాదని సూచించుచున్నది. ఆ బ్రహ్మజ్యోతికి పరముగా దేవాదిదేవుడు కలడు. దయతో తేజమును (బ్రహ్మజ్యోతి) తొలగించుమనియు, తద్వారా భగవానుని నిజమైన శాశ్వత స్వరూపమును తాను చూడగలననియు భక్తుడు ఒక ఉపనిషత్తు నందు భగవానుని ప్రార్థించెను. భగవానుని దివ్యస్వరూపాను భవమును బడయనిదే భక్తి యనెడి ప్రశ్నే ఉదయించదు. భక్తియనెడి విషయము నందు భక్తియుక్త సేవను స్వీకరించువాడు, భక్తియుక్త సేవ చేయు భక్తుడు ఇరువురును అవసరము. అట్టి భక్తియుక్త సేవ ద్వారా ఒనగూడు *'బ్రహ్మసిద్ధి'* దేవాదిదేవుని అనుభవమై యున్నది. భగవానుని దేహము యొక్క సముజ్జ్వలకాంతి అవగాహన *'బ్రహ్మసిద్ధి'* యొక్క

పరిపూర్ణత్వ స్థితి కానేరదు. అదే విధముగా పరమపురుషుని పరమాత్మ తత్త్వపు అనుభూతి సైతము పూర్ణము కాదు. ఏలయన భగవానుడే అఖిలాత్ముడై ఆతడే పరమాత్ముడై యున్నాడు. దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుని అనుభూత మొనర్చు కొనినవాడే ఇతర తత్త్వములను పరమాత్ముడు, నిరాకార బ్రహ్మములను అనుభూత మొనర్చుకొనగలడు; ఆ పరిపూర్ణానుభవమే *'బ్రహ్మసిద్ధి'* యనబడును.

ముందే వివరించినట్లుగా, యోగ అనగా 'కలుపుట'. *'బ్రహ్మసిద్ధయే'* అనగా 'ఆత్మసాక్షాత్కారము' మరియు *"అహం బ్రహ్మాస్మి"* అనగా "నేను జీవాత్మను" అని అర్థం. వాస్తవానికి తాను ఆత్మను అనెడి అనుభూతి మాత్రమే సరిపోదు. మనం మరింత ముందుకు పురోభివృద్ధిని సాధించవలెను. మన జ్వరం తగ్గవచ్చును, కాని మనం తిరిగి శక్తిని పుంజుకొని జీర్ణాశయము చక్కగా పనిచేసినప్పుడే అనారోగ్యము నుండి పూర్తిగా కోలుకొనినట్లు. అప్పుడే మనం చక్కని ఆరోగ్య వంతమైన జీవితమును, రోగముల నుండి విముక్తి పొందిన జీవితమును కలిగి ఉందుము. ఆ విధముగా తాము ఆత్మను అని అర్థం చేసుకొనుట మాత్రమే సరిపోదు. మనం ఆధ్యాత్మిక కార్యములలో పాల్గొనవలెను. మరియు ఆ ఆధ్యాత్మిక కార్యములే భక్తి. భౌతిక కార్యక్రమముల నన్నింటిని నిలిపి వేయుటయే చాలునని మాయావాదులు భావింతురు. మరియు బౌద్ధులు భౌతిక జీవితమును 'నిర్వాణము' చేయవలెనని చెబుతుంటారు. ఈ రెండు కూడ పరిపూర్ణ సమాచారమును ఇవ్వటం లేదు. నిజానికి మనము భౌతిక సమ్మేళనము వలన దుఃఖములను అనుభవిస్తున్నా మనునది సత్యం. శరీరం అనునది భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం, మనస్సు, బుద్ధి మరియు అహంకారములతో నిర్మించబడినది. మాయావాదులు మరియు బౌద్ధులు ఈ పదార్థములను అంతం చేయవలెనని చెబుతుంటారు : "మట్టి అనేది మట్టిలో కలువవలెను, నీరు నీటిలో కలువవలెను, అగ్ని అగ్నిలో కలసి శూన్యమవ్వాలి." మనం భౌతిక శరీరమనే గృహమును కూల్చివేసి మరియు శూన్యమగుట వలన 'నిర్వాణము'ను పొందెదము. 'నిర్వాణము' అనగా సుఖ దుఃఖముల అంతం. మాయావాదులు మరియు బౌద్ధులు ఒక కుండలో నీటిని నింపునప్పుడు, ఆ కుండ నిండనంత వరకు శబ్దం చేయును. కుండ పూర్తిగా నిండుకొనినప్పుడు, ఇక శబ్దం అనేది ఉండదు. కాబట్టి ఒకరు బ్రహ్మానుభూతిని పొందినప్పుడు సర్వవేద మంత్రములన్నీ నిష్ఫలమగునని వాదిస్తారు. మరొమాటలో, బౌద్ధులు మరియు మాయావాదులు భౌతికలోకం అనేది మిథ్య అని, మనము ఎలాగైనను దానిని శూన్యం చేయాలని చెబుతుంటారు. ఏమైనను, ఆత్మలమని

తెలుసుకొనుట అనగా బ్రహ్మానుభూతిని పొందుట మాత్రమే సరిపోదు. భగవంతుడైన సర్వాంతర్యామి అంతటా కలడని మనము తెలుసుకోవలెను :

ఏకోఽప్యసౌ రచయితుం జగదండకోటిం
యచ్ఛక్తిరస్తి జగదండచయా యదన్తః
అండాంతరస్థపరమాణుచయాంతరస్థం
గోవిందమాదిపురుషం తమహం భజామి

"శక్తిమంతుడి కంటెను శక్తి అభిన్నమగుటవలన అతడొక అభేదతత్త్వము. అతని ద్వారా కోట్లకొలది బ్రహ్మాండముల సృష్టి జరిగినను అతని శక్తి అతని నుండి భిన్నము కాదు. అతడిలోనే బ్రహ్మాండము లన్నియును ఇమిడి యున్నవి. అదే సమయమున అతడు బ్రహ్మాండముల లోపల గల పరమాణు సమూహములలో మరియు ప్రత్యణువునందును పూర్ణరూపుడై విలసిల్లుచున్నాడు. అట్టి ఆదిపురుషుడైన గోవిందుని నేను భజింతును." (బ్రహ్మ సంహిత 5.35)

భగవానుడు ఒంటరివాడు కాదు. కేవలం అతడు ఒక ప్రదేశంలో మాత్రమే స్థితుడై లేడు, అతడు సర్వత్రా కలడు. శ్రీకృష్ణుడు ప్రత్యేక ధామమును కలిగి ఉన్నప్పటికినీ, అతడు సర్వత్రా కలడు. శ్రీకృష్ణుడు ఒక చోటనున్నచో మరొచోట నుండలేడని అర్థం కాదు. బద్ధస్థితిలో నున్నందు వలన మనం మన కార్యాలయంలో కూర్చున్న అదే సమయంలో ఇంట్లోను ఉండలేము. శ్రీకృష్ణుడు ఇలా కాదు. *"గోలోక ఏవ నివసత్యఖిలాత్మభూతః."* శ్రీకృష్ణుడు ఎల్లప్పుడు గోలోక వృందావనములోనే ఉండును. అయినను *"అండాంతరస్థపరమాణుచయాన్తరస్థమ్".* అతడు ఈ విశ్వంలోని ప్రతి అణువులోను కలడు. ఈ విశ్వం గర్భోదకశాయి విష్ణు వలన ప్రకటితమైనది. కేవలం ఈ ఒక్క విశ్వమే కాదు, కొన్నికోట్ల విశ్వాలు కూడ చక్కగా పని చేయుచున్నాయంటే దానికి గర్భోదకశాయి విష్ణు ఉపస్థితుడై ఉండుటయే కారణము. కాబట్టి ఎటువంటి నిర్దేశకత్వము లేకుండ ఈ లోకాలన్నీ ఆకాశములో తేలుతున్నాయనీ భావించరాదు. ఇలా జరుగుటకు ఖచ్చితంగా కావలసిన ఏర్పాట్లు జరిగి ఉండెను.

భౌతిక గుణముల నుండి పూర్తిగా విముక్తి పొందుటకు కేవలం జ్ఞానవైరాగ్య స్థితిని పొందుటయే సరిపోదు. భక్తియుక్త సేవలో పాల్గొనవలెను. మేము భక్తి గురించి చెప్పినప్పుడు కొందరు : "నేను నా భార్యను ఆరాధిస్తాను, తనను ఎంతగానో ప్రేమిస్తాను, అంతేకాకుండ ఆవిడను చక్కగా చూసుకొంటాను. తను లేనిచో నేను

పిచ్చివాడనగుదును” అని చెబుతుంటారు. జనులు వారి కుటుంబములకు లేదా దేశానికి, దుర్గాదేవతకు, మరియు ఇతర దేవతల పట్ల భక్తిని కలిగి ఉన్నారు. కాని అలాంటి భక్తి పనిచేయదు. అందుకే ఇక్కడ *‘భక్తిర్భగవతి’* అని చెప్పబడినది. భక్తి అనేది పరమ పురుషునికి నొనరించవలెను. కపట ప్రదర్శనలు చేసే భగవానులకు భక్తి చేయరాదు. ఎవరైనను తాను భగవంతుడనని చెప్పినచో : “మీరు అందరి హృదయాలలో నెలకొని ఉన్నారా? నేను ప్రస్తుతం ఏమి ఆలోచిస్తున్నానో మీరు చెప్పగలరా?” అని మనము ప్రశ్నించవలెను. ఎవరైనను భగవంతులైనచో వారు తప్పక ‘అఖిలాత్మ’గా ఉండి తీరవలెను. ఎవరైనను ఈశ్వరులైనచో అతడు అందరి హృదయాలలో నిలిచి ఉండవలెను. శ్రీకృష్ణుడు అందరి హృదయాలలో నిలిచి ఉన్నాడు *(సర్వస్య చాహం హృది సన్నివిష్టః).* దీనినంతటిని లోతుగా అధ్యయనము చేయవలెను. మనం ఈ మూర్ఖుడిని లేదా ఆ మూర్ఖుడిని భగవంతునిగా అంగీకరించరాదు. అలాగే ఈ దేవతకు లేదా ఆ దేవతకు తన కుటుంబమునకు, దేశానికి, సమాజానికి, భార్య, పిల్లి, కుక్క లేదా మరేదానికిని భక్తి చేయరాదు. ఇదంతయు భక్తి కాదు. భక్తి పేరిట చేసే ప్రదర్శన మాత్రమే. వాస్తవానికి ఇది కామవాంఛ. మనం కనుక శ్రీకృష్ణుడి పట్ల కృష్ణచైతన్యమును అనగా భక్తిని పెంచుకొనినచో మన జీవితాలు పరిపూర్ణములగును. వాస్తవానికి మరో దారి లేదు. ఈ శ్లోకంలో చెప్పినట్లుగా : *“సాదృశోఽస్టి శివః పంథా.”* పరబ్రహ్మ అనేది శ్రీకృష్ణుడు. మరియు *‘బ్రహ్మసిద్ధయే’* అనగా శ్రీకృష్ణుడితో మనకు గల సంబంధమును తెలుసుకొనుటయే. తాను బ్రహ్మన్‌గా*(అహం బ్రహ్మాస్మి)* అర్థం చేసుకొనుట మంచిదే. కాని పరబ్రహ్మన్‌తో మన సంబంధము ఏమిటి? బ్రహ్మన్ మరియు పరబ్రహ్మన్, ఆత్మ మరియు పరమాత్మ, ఈశ్వరుడు మరియు పరమేశ్వరుడు, జీవాత్మ మరియు భగవంతుడు, *‘నిత్య’* మరియు *‘నిత్యానామ్’, ‘చేతన’* మరియు *‘చేతనానామ్’* అని ఎల్లప్పుడు రెండు రకాలుండును. రెండు అనగా సంబంధము. కాబట్టి మనము భగవంతునితో, పరబ్రహ్మన్‌తో గల మన సంబంధమును అర్థం చేసుకోవాలి. దీనిని అర్థం చేసుకొనుటయే *‘బ్రహ్మసిద్ధి’.*

మనం పరబ్రహ్మన్‌తో గుణైక్యము కలవారము. కాని, పరబ్రహ్మన్ ఎంతో గొప్పవాడు, మనం ఎంతో అల్పులము. పరబ్రహ్మన్*(కైవల్య)* ఒకడు. మరొకడు కాని నకలు కాని కాలేరు. అతడికి సమానులు కాని అతడికంటె గొప్పవాడు కాని ఎవరూ లేరు. ఇది కైవల్యమను పదమునకు అర్థం. మానవ జీవితమనేది పరబ్రహ్మమును గురించి విచారించుటకు మరియు అతడితో తమకు గల

సంబంధమును తెలుసుకొనుటకు ఉద్దేశించబడినది. దురదృష్టవశాత్తు జనులు పరబ్రహ్మమును గురించి ఎటువంటి ప్రశ్నలను అడుగుట లేదు. ప్రతిఒక్కరు వార్తల గురించి వార్తాపత్రికల గురించి అడుగుతుంటారు. అంతేకాకుండ అందరు సంతకు వెళ్ళి తక్కువ ధరకు అనేక వస్తువులను కొనుటలో ఆసక్తిని కనపరుస్తారు. ఇదంతయు మానవ సమాజములో, కుక్క మరియు పిల్లి సమాజములో కూడ కొనసాగుచున్నది.

ఈ ప్రపంచము పూర్తి అంధకారము మరియ అజ్ఞానముతో నిండి ఉన్నది. కాని చైతన్యమనేది ఈ భౌతిక ప్రపంచము కంటే అతీతమైనది. కృష్ణచైతన్యములో అంధకారమనేది లేదు. కేవలము ప్రకాశము గలదు. రాత్రి సమయంలో ఏదైన వస్తువును కనుగొనుటకు ప్రయత్నించినచో అది ఎంతో కష్టమవుతుంది. ఏమైనను పగటిపూట ఆ ఇబ్బంది అనేది ఉండదు. చీకటిని విడిచి వెలుగులోకి రావలెనని శాస్త్రాలు చెప్పుచున్నవి. ఆ ప్రకాశము గురువు ద్వారా ఇవ్వబడుతుంది.

ఓమ్ అజ్ఞాన తిమిరాన్ధస్య జ్ఞానాంజనశలాకయా
చక్షురున్మీలితం యేన తస్మై శ్రీగురవే నమః

"నేను అజ్ఞాన గాఢాంధకారములో జన్మించితిని. మా ఆధ్యాత్మికాచార్యులు జ్ఞాన దీపముచే నా నేత్రములను తెరచెను. వారికి నేను నా గౌరవ పూర్వకములైన ప్రణామము లర్పింతును."

జ్ఞానం ద్వారా వెలుగును ప్రసాదించుటమనేది గురువు యొక్క ధర్మము. వైదిక జీవిత సారమును పూర్తిగా అర్థం చేసుకున్నవాడే గురువు. శ్రుతి శ్రవణము ద్వారా జ్ఞానము పొందబడుతుంది. ఇది ప్రయోగాత్మకమైనది. మన ఇంద్రియముల ద్వారా గ్రహించ లేనిదానిని ప్రయోగముల ద్వారా తెలుసుకొనుట సాధ్యపడదు. మన తండ్రి ఎవరనేది ప్రయోగజ్ఞానం ద్వారా తెలుసుకోలేము. "ప్రయోగాలు చేసి ఎవరు నా తండ్రి అనే విషయమును తెలుసుకుంటాను" అని ఎవరూ చెప్పలేరు. మన తండ్రి మనం జన్మించుటకు ముందు నుండి ఉన్నాడు. మరియు నా తండ్రి ఇతడా లేక అతడా అని ప్రయోగము చేసి తెలుసుకోలేము. నిజమైన ప్రమాణము తల్లి; అందుకే వైదిక జ్ఞానమును తల్లితోను మరియు పురాణములను చెల్లితోను పోలుస్తారు. పరమజ్ఞానం అంటే ఏమిటని వేదాల నుండి మనము అర్థము చేసుకోవలెను. జ్ఞానం యొక్క పరమలక్ష్యం శ్రీకృష్ణుడని అర్థం చేసుకొనుట వలననే మనం సమస్తమును అర్థం చేసుకోగలము. మనం ప్రత్యేకంగా విషయాలను అర్థం

చేసుకోవాల్సిన అవసరము లేదు. శ్రీకృష్ణుడు మనందరి హృదయాలలో ఉన్నాడు. అతడు దూరముగా లేడు. అంతేకాదు, అతడు అంతటా ఉన్నాడు. మనము శ్రీకృష్ణుడు పట్ల అనురాగమును కలిగి ఉన్నామని అతడు గమనించినప్పుడు, అతడు మనకు మిత్రుడగును. అతడు అందరికి మిత్రుడు. కాని అతడు ప్రత్యేకంగా అతని భక్తులకు మిత్రునిగా ఉంటాడు. భగవద్గీత(10.11)లో శ్రీకృష్ణుడు స్వయంగా ఇట్లు చెబుతున్నాడు :

తేషామేవానుకమ్పార్థమహమజ్ఞానజం తమః
నాశయామ్యాత్మభావస్థో జ్ఞానదీపేన భాస్వతా

"వారికి ప్రత్యేకానుగ్రహము చూపుటకే, నేను వారి హృదయములందు నివసించుచు, అజ్ఞానము వలన పుట్టిన తమస్సును ప్రకాశించు జ్ఞానదీపముచే నశింప చేయుదును."

జ్ఞానమనేది కలదు. కాని అది అజ్ఞానమనే తెర చేత ఆవరించబడినది. కాంతిగలదు మరియు అంధకారము కలదు, కాని మనము చీకటిలో ఉన్నప్పుడు వస్తువులను యథాతథంగా చూడలేము. ఎవరైనను తన సేవకు అంకితమైనచో అతడి అంధకారమును తానే స్వయంగా తొలగించెదనని శ్రీకృష్ణుడు చెబుతున్నాడు. జీవితములో పరిపూర్ణత్వమును సాధించ వలెనని నిజంగా కోరుకున్నచో, మనం భగవంతుని భక్తియుక్త సేవలో మాత్రమే పాల్గొనవలెను. భగవంతుడిని గుర్తించుట కష్టమేమి కాదు. భగవంతుడు హృదయములో ఉన్నాడు. *"ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి."* (భ.గీ. 18.61) అందరి హృదయాలలో నిలిచి ఉన్నవాడే నిజమైన భగవానుడు. భగవానుడు నిత్యలీలామయుడు. అతడు లోకాలకు అధిపతియైన బ్రహ్మకు ఉపదేశించును. మరియు బ్రహ్మ భగవంతుని ఆదేశాలను అనుసరించి ఈ విశ్వమును సృష్టించెను. మనం భక్తియుక్త సేవను అంగీకరించి నప్పుడు మనలను కూడ శ్రీకృష్ణుడు ఆదేశించును.

శ్లోకము 20

ప్రసంగమజరం పాశమాత్మనః కవయో విదుః
స ఏవ సాధుషు కృతో మోక్షద్వారమపావృతమ్

భౌతికత్వము నెడ ఆసక్తియే శుద్ధాత్మకు గొప్ప బంధమని పండితుడైన ప్రతియొక్కడు చక్కగా యెరిగియున్నాడు. కాని అదే ఆసక్తిని ఆత్మసాక్షాత్కారము

కలిగిన భక్తుల యెడ చూపినచో అది మోక్షద్వారమును తెరువగలదు.

భాష్యము : ఒకదాని యెడ గల ఆసక్తి బద్ధజీవనపు బంధకారణ మగుచుండ, అదే ఆసక్తిని వేరొకదాని యందు నిలిపినపుడు మోక్షద్వారమును తెరచుచున్నదని ఇచ్చట స్పష్టముగా తెలుపబడినది. ఆసక్తిని మనము చంపజాలము; కాని దానిని వేరొక వైపునకు మరల్చవచ్చును. భౌతిక విషయముల యెడ ఆసక్తి 'భౌతిక చైతన్యము' అని పిలువబడగా, శ్రీకృష్ణుని యెడ లేదా ఆ దేవాదిదేవుని యెడ గల ఆసక్తి 'కృష్ణ చైతన్యము' అని పిలువబడును. కనుక 'చైతన్యము' యనునది ఆసక్తికి పీఠము వంటిది. భౌతిక చైతన్యము నుండి కృష్ణచైతన్యము వైపునకు మరలుట ద్వారా మోక్షము నొందగలమని ఇచ్చట స్పష్టముగా తెలుపబడినది. ఆసక్తిని త్యజించ వలెనని చెప్పబడినప్పటికిని నిష్కామత్వ మనునది జీవునకు సాధ్యము కానట్టిది. జీవుడు తన సహజస్థితి దృష్ట్యా ఏదియోనొకదాని యెడ ఆసక్తుడై యుండును. సంతానము లేనివారు తమ ఆసక్తిని కుక్కలమీదనో, పిల్లుల మీదనో నిలుపుటను మనము గమనిస్తుంటాము. ఆసక్తి అనే ప్రవృత్తిని ఎవ్వరును నిలువరింప జాలరని ఈ విషయము మనకు సూచించుచున్నది; కావున దానిని శ్రేష్ఠమైన ప్రయోజనము కొరకు వినియోగించ వలెను. భౌతిక విషయముల యెడ గల ఆసక్తి మన బద్ధస్థితిని కొనసాగింప జేయుచుండగా, అదే ఆసక్తిని దేవాదిదేవునిపై లేదా ఆతని భక్తునిపైకి మరలించినచో అదే మోక్షకారకము కాగలదు.

ఆసక్తిని ఆత్మసాక్షాత్కారము పొందిన భక్తుల(సాధువులు) వైపునకు మరలించ వలెనని ఇచ్చట ఉపదేశింపబడినది. ఇంతకు సాధువనగా ఎవరు? కాషాయ వస్త్రం కట్టినట్టి లేదా పొడవుగా గడ్డం పెంచినట్టి సాధారణవ్యక్తి సాధువు కాబోడు. దృఢనిశ్చయముతో భక్తియుక్త సేవలో నెలకొని యుండువాడే సాధువని భగవద్గీత యందు వివరింపబడినది. భక్తియోగ నిబంధనలను ఖచ్చితముగా పాటించుచున్నట్లు గోచరింపక పోయినను, పరమపురుషుడైన శ్రీకృష్ణుని యందు దృఢమైన విశ్వాసమును కలిగియున్న వానిని సాధువుగా భావించవచ్చును. "సాధురేవ స మన్తవ్యః" అనగా భక్తియుక్త సేవను ఖచ్చితముగా అనుసరించువాడే సాధువు. ఎవరేని బ్రహ్మభూతస్థితిని బడయగోరినచో తన ఆసక్తిని సాధువు(భక్తుడు) వైపునకు మరలించవలెనని ఇచ్చట ఉపదేశితమైనది. శ్రీ చైతన్య మహాప్రభువు సైతము ఈ విషయమును నిర్ధారించిరి : *"లవమాత్ర సాధుసంఘే సర్వసిద్ధి హోయ్"* – సాధు పురుషుని క్షణకాల సాంగత్యముతో మనుజుడు పరిపూర్ణత్వమును బడయగలడు.

'మహాత్ముడు' అనునది సాధువుకు పర్యాయపదము. మహాత్ముల (శుద్ధభక్తులు) సేవ మోక్షమునకు రాచమార్గమని *(ద్వారమాహుర్విముక్తేః)* చెప్ప బడినది. *"మహత్సేవాం ద్వారమాహుర్విముక్తేస్తమోద్వారం యోషితాం సంగి సంగమ్."*(శ్రీమద్భాగవతము 5.5.2) లౌకికులకు ఒనరింపబడు సేవ విపరీత ఫలితములను కలుగజేయును. ఎవరేని మనుజుడు లౌకికునకు(కేవలము ఇంద్రియ భోగము నందే నిమగ్నుడైనవాడు) సేవల నందించినచో అట్టి సాంగత్యము ద్వారా నరకద్వారము తెరుచు కొనగలదు. అదే సిద్ధాంతము ఇచ్చట ధ్రువీకరించ బడినది. భక్తుని యెడ అనురక్తి యనగా భగవత్సేవ యెడ ఆసక్తి అనియే భావము. ఏలయన ఎవరైనా మనుజుడు సాధువుతో సాంగత్యము నెరిపినచో, దాని ఫలితముగా ఆ మహాత్ముడు ఏ విధముగా అతడు భగవానునికి భక్తుడు, ఆరాధకుడు, శ్రద్ధాళువగు సేవకుడు కాగలడో బోధించును. సాధువొసగెడి వరదానము లివియే. సాధు సాంగత్యమును మనము కోరుకొనినప్పుడు, ఏ విధముగా భౌతిక స్థితిని వృద్ధిపరచు కొనుటకు ఆయన నుండి ఆదేశములను పొందవలెనని అనుకోరాదు, ఊహించ రాదు. అతడు భౌతికాకర్షణ ముడిని ఏ విధముగా ఛేదించవలెనో, ఏ విధముగా భక్తియుక్తసేవలో పురోభివృద్ధిని సాధించవలెనను దానిని ఆయన మనలకు బోధించును. సాధుసాంగత్యమునకు ఫలితమిదియే. అటువంటి సాంగత్యము చేతనే ముక్తిపథము ఆరంభమగునని కపిలముని ప్రప్రథమముగా ఉపదేశించెను.

శ్రీ చైతన్య మహాప్రభువు ననుసరించి :

సాధుసంగ సాధుసంగ సర్వశాస్త్రే కోయ్
లవ్ మాత్ర సాధుసంగే సర్వసిద్ధి హోయ్

"శుద్ధభక్తునితో కలుగు లవమాత్ర సాంగత్యము చేతనే ఒకరు సమస్త సిద్ధులను సాధించగలరనేది శాస్త్రములన్నింటి సారము."(శ్రీ చైతన్య చరితామృతము, మధ్యలీల 22.54)

మానవుడు సంఘ జంతువని మరియు మన సాంగత్యము ననుసరించి మన వ్యక్తిత్వమును మార్చుకోవచ్చునని చెప్పబడినది. వ్యాపారులు తమ వ్యాపార మెలుకువలను పెంచుకొనుట కొరకు పరస్పరము కలుసుకొందురు. వివిధ రకాల సాంగత్యముల వలన మనకు ఒక ప్రత్యేక విషయము పట్ల, ప్రత్యేక సాంగత్యము పట్ల అనుబంధము పెరుగును. ఎవరైన భౌతికవాదులతో సాంగత్యము చేసినచో, వారికి ఇంద్రియ తృప్తి పట్ల అనుబంధము బలమగును. ఇంద్రియ తృప్తికి చిహ్నం

స్త్రీ; అందుకే ఇంద్రియ తృప్తితో సంబంధము కలిగి ఉన్నదేనినైనను 'యోషిత్' సంఘ అంటారు. ఈ భౌతిక ప్రపంచం 'యోషిత సంఘము'చే నిండి ఉన్నది. ఎందుకనగా, ఇంద్రియతృప్తి విషయాలలోనే అందరు ఆస్తకిని కలిగి ఉన్నారు. భగవద్గీత (2.44) లో తెలుపుచున్నట్లుగా :

భోగైశ్వర్యప్రసక్తానాం తయాపహృతచేతసామ్
వ్యవసాయత్మికా బుద్ధిః సమాధౌ న విధీయతే

"భోగానుభవమునందును, లౌకిక సంపదలందును మిక్కిలి ఆసక్తులై యుండువారి యొక్కయు అట్టి వానిచే ఆకర్షింపబడువారి యొక్కయు చిత్తములందు దేవాదిదేవుని భక్తియుక్త సేవకొరకు స్థిరమైన నిశ్చయము కలుగదు." 'భోగ' అనే పదానికి ఇంద్రియ తృప్తి అని అర్థం. 'భోగైశ్వర్య' : సంపద మరియు ఇంద్రియతృప్తి పట్ల అధిక ఆసక్తిని కలిగి ఉండువారు ఆధ్యాత్మిక జీవితమును అర్థం చేసుకోలేరు. అంతేకాకుండ వారు వెంటనే దీనిని అంగీకరించలేరు. ప్రస్తుత కాలములోని జనులు సోమరులు. కాబట్టి వారు ఈ కృష్ణచైతన్య సంఘము పట్ల శ్రద్ధను చూపించలేరు. కేవలం జీవితమును ఇంద్రియ తృప్తితో ఎలా ఆనందింప చేసుకోవలెనను దానిని ఆధునిక నాగరికత వారికి నేర్పుతున్నది. ప్రత్యేకించి పాశ్చాత్య దేశాలలో ఇంద్రియ తృప్తి కొరకు ఎన్నో సాధనములు కలవు. పూర్వం, సాధారణ కత్తిని క్షవరం చేసుకొనుటకు ఉపయోగించేవారు. కాని ఇప్పుడు ఎన్నో యంత్రాలు వచ్చాయి. ఆ యంత్రాలకు కృతజ్ఞతలను తెలుపుకోవాలి. ఎందుకంటే, ప్రస్తుతం మనకు చేతిని కూడ కలుపాల్సిన అవసరము లేదు. కాబట్టి దీనినే మనము అభివృద్ధిగా భావిస్తున్నాము. ఏమైనను శాస్త్రములలో మానవ జీవితం ఇంద్రియతృప్తి కొరకు కాకుండ తపస్య – తపమును ఆచరించుటకొరకు నిర్దేశించ బడినదని తెలుపబడినది. అది వైదిక నాగరికత. ప్రారంభములో ఇంద్రియములను ఎలా నియంత్రించ వలెనని తెలుసుకొనుటకు బ్రహ్మచర్యములో శిక్షణను పొందవలిసి ఉంటుంది. బ్రహ్మచారి ఇంద్రియ తృప్తికొరకు కాకుండ, తపస్సును ఆచరించుట కొరకు శిక్షణను పొందవలెను. పూర్వం బ్రహ్మచారులు ఇంటింటికి వెళ్ళి ఆశ్రమం కొరకు భిక్షాటనను చేసేవారు. మరియు ప్రారంభము నుండి ప్రతి స్త్రీని తల్లిగా సంభోదించునట్లు వారికి శిక్షణ నిచ్చేవారు.

ప్రస్తుతం, జనులు ఎంతటి దుఃఖపూరితమైన పరిస్థితిలో ఉన్నారంటే వారు తరచుగా మరణిస్తే బాగుండును, మరణిస్తే బాగుండునని అంటుంటారు. ఏమైనను, భగవద్గీతలో శ్రీకృష్ణుడంటాడు, "ఎందుకు నీవు మరణించాలి?" అని. కాని జనులు

భౌతిక ప్రకృతి యొక్క త్రివిధ క్లేశములను అనగా మరణమును అంతం చేయాలనుకుంటారు. కాని, మరణమును ఎలా నిరోధించాలనే విషయమును ఎవరు పరిశోధిస్తున్నారు? మరణము అనేది మనకు అసహజము అని భగవద్గీత నుండి మనం తెలుసుకుంటున్నాము. ఇది కృత్రిమంగా మనపై రుద్దబడినది. కాబట్టి తిరిగి మనము మృత్యువు లేనివారము కావలెను. అది మానవ జీవిత పరిపూర్ణత్వము. కాని ఎవరూ దీనిని పట్టించుకొనుట లేదు. అంతేకాకుండ మనం జన్మ, మృత్యు, వృద్ధాప్యం మరియు వ్యాధులను తప్పించు కోలేనంతటి మందబుద్ధి గలవారము. మన అజాగ్రత్త వలననే వాటిని అనుభవిస్తున్నాము. ఈ కారణం చేతనే శ్రీల సనాతన గోస్వామి శ్రీ చైతన్య మహాప్రభును సమీపించి ఇలా అడిగెను : "నా ప్రియమైన మహాప్రభు! ఏదో విధముగా, మీరు నన్ను మీ పాదపద్మముల వద్దకు రప్పించుకున్నారు. కాబట్టి నా నిజస్థితి ఏమిటి?" ఎందుకు నేను బలవంతముగా ఈ భౌతిక ప్రకృతి యొక్క త్రివిధ క్లేశములను అనుభవించవలసి వస్తుంది? అని నేను మిమ్ములను అడుగుతున్నాను. ఎవరూ ఈ విషయముల గురించి ప్రశ్నించుట లేదు. మోక్షము అనగా భౌతిక జీవితపు త్రివిధ క్లేశములతో పాటు జన్మ మృత్యు జరా వ్యాధినుండి విడువడుట. కొన్నిసార్లు, ఈ విషయాలలో జనం కొద్దిగా ఆసక్తిని కనపరచినను వారు ప్రామాణికము కాని మార్గములను అనుసరింతురు. లేదా మరేదో దానిని వారు కనిపెడుతుంటారు. కాని నిజానికి దేనిని కనుగొన నవసరము లేదు. ఎందుకంటే, ప్రతిఒక్కరు వారి స్థితి మరియు సంస్కృతితో సంబంధము లేకుండ కృష్ణచైతన్యముతో అందరూ ఉద్ధరింపబడుదురు. మేము ఈ కృష్ణచైతన్య ఉద్యమమును ప్రపంచమంతటా వ్యాప్తిచేశాము. దీనిచేత జనులు ఆనందమును పొందుతున్నారు.

భగవద్గీత (9.32) ప్రకారం ఎవరైనను శ్రీకృష్ణుడిని ఆశ్రయించవచ్చును. శ్రీకృష్ణుడు ఎవరిని కాదనడు, మరియు అలాగే అతని భక్తులు కూడ ఎవరిని కాదనరు. అదే కృష్ణచైతన్య ఉద్యమము. అందరికి స్వాగతం అని మేము ఆహ్వానిస్తుంటాము. ఈ జ్ఞానమును మరియు ఆధ్యాత్మిక జీవితమును అంగీకరించి కృష్ణభక్తులవ్వండి. కొన్నిసార్లు దీనివలన మేము విమర్శలను ఎదుర్కొవలసి వచ్చును. శ్రీకృష్ణుడు భగవద్గీతలో ప్రత్యేకించి ఇలా చెబుతున్నాడు, అధమ జన్ములైనను నన్ను ఆశ్రయించి ముక్తిని పొందవచ్చును. అలాగైనచో, బ్రాహ్మణ కుటుంబములలో జన్మించిన పుణ్యాత్ముల గురించి ఏమని చెప్పగలము? దురదృష్టవశాత్తు, ఈ యుగంలో ధనవంతులు లేక బ్రాహ్మణ కుటుంబములలో జన్మించిన వారు ఆధ్యాత్మిక

సాక్షాత్కారము పట్ల ఆసక్తిని కనపరచక పోవుటను మనం తరుచుగా చూస్తుంటాము. అంతేకాకుండ వారు అవకాశమును దుర్వినియోగ పరచుకుంటూ వారి పుణ్యకర్మల ఫలితాలను శూన్యము చేసుకుంటారు. సమాజ పురోభివృద్ధికి ఉత్తమ సాధువుల అవసరమెంతో కలదు. అందరు త్రాగుబోతులు మరియు శూద్రులైనచో, సమాజములో శాంతి ఎలా నెలకొనును. అందుకే సమాజమును క్రమబద్ధీ కరించుటకు శ్రీకృష్ణుడు వర్ణాశ్రమ ధర్మమును ప్రతిపాదించాడు. ఆదర్శవంతులైన బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రుల అవసరమెంతో కలదు. అయినను, ఎవరూ దీనిని పట్టించుకొనుట లేదు.

ఎవరైనను సాధువు అనగా ఏమిటి? అని ప్రశ్నించవచ్చును. సాధువు శ్రీకృష్ణుడిని సేవిస్తూ నిస్వార్థముగా కృష్ణచైతన్యములో పాల్గొనును. భగవద్గీత (9.30)లో శ్రీకృష్ణుడు ఇలా చెబుతున్నాడు :

అపి చేత్సుదురాచారో భజతే మామనన్యభాక్
సాధురేవ స మన్తవ్యః సమ్యగ్ వ్యవసితో హి సః

"మిక్కిలి అసహ్యమైన పనులు చేయువాడు కూడ భక్తియుక్త సేవలో నిమగ్నుడై ఉన్నచో, అతడు నిశ్చయములో తగినట్లుగా ప్రతిష్ఠితుడై ఉండుటచే సజ్జనుడుగనే పరిగణింప బడవలెను."

సహనమును వహించుట సాధువు ధర్మం. ఎవరైన భక్తులైనప్పుడు, ఎంతోమంది వారికి విరోధులవు తుంటారు. ఎందుకనగా, ఈ యుగంలోని జనులు కేవలం అసురులు. ప్రహ్లాద మహారాజు తండ్రియైన హిరణ్యకశిపుని వలె తండ్రి కూడ విరోధి కావచ్చును. ప్రహ్లాదుడు కేవలం ఐదు సంవత్సరాల బాలుడు మరియు 'హరేకృష్ణ' కీర్తనను చేసేవాడు. కాని అతడు భక్తుడైనందున అతని తండ్రి ప్రహ్లాదుడిని చంపాలనుకున్నాడు. "ఎందుకు నీవు 'హరేకృష్ణ' కీర్తనను చేయుచుంటివి? ఎందుకు నీవు మరో భగవంతుని గురించి మాట్లాడుతున్నావు? నేను భగవంతుడను" అని హిరణ్యకశిపుడు పలికాడు. ఆసురిక స్వభావమునకు అర్థమిదే. తాను భగవంతుడనని పలుకువారు కేవలం అసురులు. ప్రహ్లాదుని తండ్రి తాను భగవంతుడనని బలవంతము చేసినను ప్రహ్లాదుడు దానిని అంగీకరించ లేదు. అతడు తన తండ్రిని కేవలం అసురుడని అంగీకరించాడు, తత్ఫలితంగా వారి మధ్య గొడవ ప్రారంభ మైనది. హిరణ్యకశిపుడు ఎప్పుడైతే ప్రహ్లాదుని "నీవు నీ గురువుల నుండి నేర్చుకున్న శ్రేష్ఠమైన విషయమును తెలుపుము" అని ప్రశ్నించినపుడు, ప్రహ్లాదుడు "ఓ

అసురోత్తమాః నేను నేర్చుకున్నదేమిటంటే, ఈ భౌతిక శరీరమును అంగీకరించి నందున మనం మరణమును అంగీకరించవలసి వస్తున్నదని. కాని మానవజన్మ లక్ష్యం ఇది కాదు. మానవజన్మ అనునది మోక్షం కొరకు ఉద్దేశించబడినది" దురదృష్టవశాత్తు, మూర్ఖపు జనులు దీనిని అర్థం చేసుకోలేకున్నారు. "మృత్యుః సర్వహరశ్చాహమ్" – "నేను మృత్యువును మరియు మీకు సంబంధించిన దానినంతటిని నేను హరించెదను" అని శ్రీకృష్ణుడు చెబుతున్నాడు(భ.గీ. 10.34). హిరణ్యకశిపుడు ఎంతటి గొప్ప అసురుడనగా దేవతలు సైతం అతడికి భయపడెడి వారు. కాని శ్రీకృష్ణుడు ఒక్కక్షణంలో సర్వమును హరించాడు. హిరణ్యకశిపుడు రక్షణ కొరకు వెదుకుతూ, "నే నీ విధముగా లేదా ఆ విధముగా మరణించవద్దు" అని అతడు ఆలోచించసాగెను. కాని శ్రీకృష్ణుడు నరసింహ రూపంలో తనను చంపునని అతడు ఊహించలేదు. మనం ఎంతటి తెలివితేటలను కలిగివున్నను, శ్రీకృష్ణుడిని ఎంతగా మోసము చేయుటకు ప్రయత్నించినను, శ్రీకృష్ణుడు ఎప్పుడును అధికమైన బుద్ధిని కలిగియునట్టివాడు. యశోద త్రాడుతో శ్రీకృష్ణుడిని బంధించుటకు ప్రయత్నించినపుడు, ఎన్నిసార్లు ఎంతగా ప్రయత్నించినను త్రాడు రెండు అంగుళాలు తక్కువ పడుచుండెనని యశోద గమనించెను. మన బుద్ధి అటువంటిది. మోసం చేయాలనీ లేదా భగవంతుడిని అధిగమించా లనుకుంటాము. కాని అది సాధ్య పడదు. ప్రజలు జ్ఞానంలో ఎంతో అభివృద్ధిని సాధించామని భావిస్తారు, కాని నిజానికి గర్వం కారణంగా వారి జ్ఞానం మాయచేత అపహరించబడినది. హిరణ్య కశిపుడు వంటి అసురుల నుండి, నాస్తికుల నుండి శ్రీకృష్ణుడు జ్ఞానమును హరిస్తుంటాడు. శ్రీకృష్ణుని జ్ఞానం ఎల్లప్పుడు అందరికంటె రెండు అంగుళాలు అధికముగా ఉంటుందని నాస్తికులకు తెలియదు.

ఈ భౌతిక జీవితములో జీవనపోరాటమును చేయవలసి వస్తుంది. మరణము లేకుండ జీవించాలను కుంటాము. కాని ఈ జన్మలో దుఃఖములతో, రోగములతో వృద్ధులమవ్వాలనీ కోరుకొనము. ఈ భౌతిక జీవితములో ఎన్నో దుఃఖములు కలవు. మరియు వాటిని మనము కోరుకొనము. కాని అవి మనపై బలవంతముగా రుద్దబడుచున్నవి. దురదృష్టవశాత్తు, మనము ఈ సమస్య లన్నింటికి పరిష్కారమును కనుగొనేటంతటి జ్ఞానవంతులము కాము. కాబట్టి మనం సనాతన గోస్వామి వలె సమస్యలన్నింటిని ఎలా అంతం చేయాలని విచారింపవలెను. కాని మనం తిరిగి మరొక భౌతిక శరీరమును పొందునట్లుగా కర్మలను చేస్తున్నాము. మనం ఈ భౌతిక శరీరం వలన కలుగుచున్న దుఃఖములను అనుభవిస్తున్నను,

వీటినుండి విముక్తిని పొందగలిగేలా కర్మలను చేయుట లేదు. ఈ కృష్ణచైతన్య ఉద్యమము ముక్తిని పొందుటకు కావలసిన సమాచారమును అందజేస్తున్నది.

మహాత్ములైనవారు ఎల్లప్పుడు "హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే / హరే రామ హరే రామ రామ రామ హరే హరే" అనే మహామంత్రమును జపిస్తుంటారు. 'హరేకృష్ణ' మహామంత్రమును జపించుటయే భజన. ఎల్లప్పుడు 'హరేకృష్ణ' మహామంత్రమును జపం చేసే హరిదాస్ ఠాకూర్ వంటి మహాత్ములకు సేవ చేసినచో మనకు ముక్తి ద్వారం తెరుచుకుంటుంది. అలాకాకుండ, ఇంద్రియ తృప్తికోసం పిచ్చివారైన భౌతికవాదులతో మనము సాంగత్యము చేసినచో, అంధకారమనే మార్గము తెరచుకుంటుంది. *"తమోద్వారం యోషితాం సంగి సంగమ్."* మనం అజ్ఞానములోనే ఉండిపోకుండ ప్రకాశము వైపునకు మరల వలెనని వేదములు ఘోషిస్తున్నాయి. మనము శరీరమును అంగీకరించి నప్పటికినీ, ఈ శరీరములోనే శాశ్వతముగా ఉండుటకు అనుమతించ బడలేదు. మనం దీనిని విడిచి మరొక శరీరమును, మరొక శరీరమును ఇలా మరెన్నింటినో అంగీకరించ వలసి వస్తుంది. ఇది ఎలాంటి పని? ఈ భౌతిక ప్రపంచము ఎంతటి అంధకార మయమంటే, జనులు ఒక శరీరము తరువాత మరొక శరీరమును తిరిగి తిరిగి అంగీకరిస్తున్నారు. కాబట్టి కృష్ణచైతన్య ఉద్యమం జ్ఞానోదయమును మరియు ముక్తిని కలిగించుట కొరకై ఉద్దేశించబడినది. మరియు ఇది సులభమైన 'హరేకృష్ణ' మహామంత్ర సంకీర్తనమునే కాకుండ అత్యున్నతమైన సిద్ధాంతమును కూడ అందజేస్తున్నది.

అధ్యాయము 11

సాధు లక్షణములు

శ్లోకము 21

తితిక్షవః కారుణికాః సుహృదః సర్వదేహినామ్
అజాతశత్రవః శాన్తాః సాధవః సాధుభూషణాః

ఓర్పు, కరుణ, సర్వజీవుల యెడ మిత్రత్వము అనునవి సాధులక్షణములు. అతడు అజాతశత్రువు, శాంతుడు, శాస్త్రమునకు కట్టుబడి యుండువాడు అయి యుండును. మరియు అతని గుణములన్నియును ఉదాత్తములు.

భాష్యము : పైన వివరింపబడిన సాధువు కృష్ణభక్తుడే. కనుకనే అతని కార్యము జనులకు భక్తియుక్త సేవను తెలియజేయుటయే అయి యుండును. అది అతని కరుణావిశేషము. భక్తియుక్త సేవ లేనిదే మానవజీవితము వృథాయని అతడెరిగి యుండును. ఆ విధముగా భక్తుడు దేశమందంతటను ఇంటింటికి తిరుగుచు : "కృష్ణచైతన్యవంతులు కండి, కృష్ణభక్తులు కండి. జంతువుల వలె కోరికలను తీర్చుకొనుట యందే మీ జీవితమును వ్యర్థపరుపకండి. మానవ జీవితమున్నది ఆత్మసాక్షాత్కారము కొరకు లేదా కృష్ణచైతన్యము కొరకే అని ప్రచారము చేయును." సాధువు చేసెడి ప్రచారమిదియే. తాను మోక్షమును పొందుటతోనే సంతృప్తి చెందక సర్వదా ఇతరుల గూర్చియే అతడు ఆలోచించును. పతితజీవుల యెడ అతడు పరమ కరుణను కలిగియుండును. కనుకనే అతని ఒకానొక గుణము *'కారుణిక'* అనగా పతితజీవుల యెడ పరమకరుణ. ప్రచార కార్యక్రమము నందు పాల్గొనినపుడు, అనేకములైన అవరోధములను అతడు ఎదుర్కొనవలసి వచ్చును; కనుకనే సాధువు గొప్ప ఓర్పు గలవాడై ఉండవలెను. భక్తియుక్త సేవ, దివ్యజ్ఞానమును స్వీకరించుటకు బద్ధజీవులు సిద్ధపడియుండరు కనుక ఎవరైనను అతని యెడ అమర్యాదగా ప్రవర్తించవచ్చును. బద్ధజీవులు భక్తియోగను ఇష్టపడరు. అది వారి రోగము. అటువంటి వారికి దాని ప్రాముఖ్యతను తెలియజేసే స్తుతిరహిత కార్యమును సాధువు చేపట్టియుండును. కనుకనే భక్తులపై కొన్నిమార్లు హింసాయుత దౌర్జన్యము చేయబడుచుండును. ఏసుక్రీస్తు శిలువ వేయబడెను; హరిదాస ఠాకూరు ఇరువది రెండు అంగడి ప్రాంతములలో కొరడాలతో కొట్టబడెను; శ్రీ చైతన్య మహాప్రభువు

ప్రధాన అనుయాయుడైన నిత్యానంద ప్రభు జగాయ్, మధాయ్‌లచే తీవ్రముగా గాయపడిరి. అయినను పతిత జీవులను ఉద్ధరించుటయే వారి కార్యము కనుక వారు తితిక్షను కలిగియుండిరి. సాధుపురుషుడు పతిత జీవులందరి శ్రేయస్సును కోరుకొనును, ఓర్పును కలిగియుండును. అతడు మానవ సంఘమునకు మాత్రమే శ్రేయోభిలాషి గాక జంతువులకు కూడా శ్రేయోభిలాషియై యుండును. కనుకనే ఇచ్చట 'సర్వదేహినామ్' భౌతిక దేహములను కలిగినట్టి జీవులందరును అని చెప్పబడినది. కేవలము మానవుడే గాక ఇతర జంతువులు కూడా భౌతిక దేహములను కలిగియున్నవి. కనుకనే భక్తులు ఎల్లరి యెడను(శునకమార్జాలములు, వృక్షాదులు) కరుణామయులై యుందురు. జీవులందరును చివరకు ఈ భవబంధము నుండి విముక్తిని పొందు రీతిలో అతడు వారితో వర్తించును. శ్రీ చైతన్య మహాప్రభువు శిష్యులలో ఒకరైన శివానందసేనుడు తన ఆధ్యాత్మిక నడవడికతో ఒక శునకమునకు ముక్తిని కలిగించెను; సాధుసాంగత్యము చేత శునకము మోక్షము నొందిన సంఘటనలెన్నో కలవు. జీవులన్నింటి శ్రేయస్సు కొరకై సాధు మహాత్ముడు అత్యున్నతమగు పరోపకార కార్యక్రమమున లగ్నమై యుండుటయే అందులకు కారణము. సాధువు ఎవరి యెడను శత్రుత్వమును కలిగి యుండనప్పటికినీ, ఈ జగత్తు కృతజ్ఞతా హీనమైనందున అతడును పెక్కు శత్రువులను కలిగియుండును.

శత్రువు మరియు మిత్రుని నడుమ భేదమేమిటి? నడవడికలోని భేదమేమిటి? వారిరువురి నడుమ గల భేదమేమిటంటే, బద్ధజీవులందరును భవబంధము నుండి ముక్తిని పొందునట్లుగా సాధువువారితో ప్రవర్తించును. అనగా బద్ధజీవుని విడిపించుట యందు సాధువుకన్నను వేరెవ్వరును అధిక మిత్రత్వమును చూప జాలరు. సాధువు శాంతుడై యుండి, శాస్త్ర నియమముల నన్నింటిని ప్రశాంతముగా అనుసరించును. సాధువనగా శాస్త్రనియమములను అనుసరించుచు, అదే సమయమున కృష్ణభక్తుడై యుండువాడని భావము. దేవాదిదేవుని ఆదేశములను పాటించుమని సర్వశాస్త్రములు మనకు ఉపదేశించుచున్నవి. కనుక శాస్త్ర నియమములను నిజముగా పాటించువాడు భక్తుడే అయితీరును. కనుక సాధువనగా శాస్త్ర నిర్దేశములను మరియు భక్తుడిని అనుసరించువాడని అర్థము. ఈ గుణము లన్నియును భక్తుని యందు ప్రస్ఫుటముగా గోచరించును. భక్తుడైనవాడు దేవతల సద్గుణముల నన్నింటిని వృద్ధిపరచుకొనగా, విద్యావంతుడైన అభక్తుడు మాత్రము దివ్యానుభూతి ప్రమాణము ననుసరించి నిజమైన సద్గుణములను, మంచి యోగ్యతలను గాని కలిగియుండడు.

పద్మపురాణము ననుసరించి 84లక్షల జీవరాసులు కలవు, మరియు వాటన్నింటిలోను ఆత్మ అనేది కలదు. భగవద్గీత(5.18)లో చెబుతున్నట్లుగా, సాధువు దీనిని అర్థం చేసుకొనును :

విద్యావినయసమ్పన్నే బ్రాహ్మణే గవి హస్తిని
శుని చైవ శ్వపాకే చ పణ్డితాః సమదర్శినః

"యథార్థ జ్ఞానము కలవారగుటచే పండితులు విద్యావినయములతో కూడిన బ్రాహ్మణుని, ఆవును, ఏనుగును, కుక్కను, కుక్క మాంసమును తిను చండాలుని సమానదృష్టితో చూచును."

బ్రాహ్మణుడు మరియు కుక్క జీవాత్మలైనను బ్రాహ్మణుడు కుక్కతో సమానము కాదు. దైవశక్తి ననుసరించి మన బద్ధ స్థితిని బట్టి జీవులు వివిధ రకాల శరీరములను పొందుతారు. జీవుని కర్మ ననుసరించి యమధర్మరాజు శరీరములను ఒసగును. "*కర్మణా దైవనేత్రేణ.*" జీవుని అర్హత ననుసరించి శరీరములు ప్రధానము చేయబడుననే విషయమును మనము ముందుగానే చర్చించితిమి. మనం బ్రాహ్మణ గుణములను పెంపొందించుకొని బ్రాహ్మణుల వలె ప్రవర్తించినచో మనము బ్రాహ్మణుడిగా రూపొంద గలము. అలాగే మనము కుక్క వలె ప్రవర్తిస్తూ మరియు కుక్కవలే కార్యములు చేసినచో మనం కుక్కగా మారుదుము. ఒకరు బ్రాహ్మణుడిగా జన్మించిరి కనుక సహజముగానే వారు బ్రాహ్మణు లయ్యెదరని ఎవరూ భావించ రాదు. భగవద్గీతలో ఎవరు ఏ వర్ణానికి చెందినవారో గుర్తించుటకు కావలసిన లక్షణములు వివరించబడెను. శ్రీధరస్వామి కూడ జన్మ అనేది సర్వం కాదని పేర్కొనెను. మానవుడు అర్హతలను సంపాదించు కోవలెను. మనం ఎలాంటి శరీరములను కలిగి ఉన్నను మన స్థితి అనేది తాత్కాలికము. మనం శాశ్వతముగా ఏ స్థితిలోను ఉండలేము. మేము అమెరికావాసులము ఎంతో సుఖంగా ఉన్నామని ప్రస్తుతము భావించవచ్చును, అలాగే అది మంచిదే. కాని శాశ్వత సుఖం కొరకు ప్రణాళికలను చేసుకొనినను, భౌతిక ప్రకృతి మనలను స్థిరంగా ఉండిపోవుటకు అనుమతించదు. ప్రకృతి పిలిచిన వెంటనే మనం ఈ శరీరమును మన స్థితులను విడిచి, తరువాత మనం కుక్క, పిల్లి, దేవత, మానవుడు లేదా మరేదైన స్థితిలోకి మారవలసి ఉంటుంది. మనకిప్పుడు ఉత్కృష్టమైన మానవ శరీరము లభించినది, కాని దానిననుసరించి నడుచుకొననిచో మనం నీచజన్మను పొందవలసి ఉంటుంది. దీనినే '*కర్మణా దైవనేత్రేణ*' అని అంటారు.

ఈ మానవజన్మలో మనం శ్రీకృష్ణభగవానునికి భక్తులమగుటయే లక్ష్యము. కాబట్టి ఎంతో జాగ్రత్తను వహించవలెను. అదే ముక్తిమార్గము. పూర్వం భారత దేశంలోని మహాత్ములు ఈ జన్మమృత్యువులను ఆపుటకై అడవికి వెళ్ళి ధ్యానము చేసెడివారు. అదే మానవుడి ఉన్నత ధర్మము, నిజానికి ప్రతిఒక్కరు అందుకొరకై ఉద్దేశించ బడినారు. మనం జన్మమృత్యువులపై విజయము సాధించక పోయినచో, మనం మన జన్మలను కేవలము జంతువుల వలె ఆహారనిద్ర భయ మైథునాలతో వృథా చేసుకుంటాము.

ఈ కాలములోని జనులు ప్రత్యేకించి పశుజీవితమునకు మరియు మానవ జీవితమునకు మధ్య గల వ్యత్యాసమును గుర్తించరు. పశువులు వీధిలో నిద్రించును మరియు మానవులు చక్కని భవంతులలో నివసించుదురని మాత్రమే అనుకుంటారు. ఏమైనను, నాగరికత అనుదానిని గురించి శాస్త్రం ఈ విధంగా వివరించదు. ఎవరైనను వీధిలో లేదా భవంతిలో నిద్రించినను వారు చేసే కార్యం మాత్రమొక్కటే. కుక్క వీధిలోని చెత్తకుండి వద్ద కడుపు నింపుకొనినచో మానవుడు బంగారు పళ్ళెములో భుజించ వచ్చును. కాబట్టి వారిరువురు విభిన్న కార్యాలలో పాల్గొన్నారని అర్థం కాదు. ఏ స్థితిలోనైన కుక్క మరియు మానవుడు ఇరువురు ఆహారమును తమ పొట్టలోనికి పంపుదురు. కుక్క లైంగిక సంపర్కమును వీధిలో చేయవచ్చు, మరియు మానవుడు ఏకాంత ప్రదేశములో చక్కని పడకమీద చేయవచ్చును, ఏమైనను కార్యంలో ఎటువంటి మార్పు ఉండదు. జనులు నాగరికత అభివృద్ధి అనగా అహార నిద్ర భయ మైథునాదులను అభివృద్ధి పరుచుకొనుటమని అనుకుంటారు. కాని వీటికి నాగరికతకు ఎటువంటి సంబంధము లేదు. ఇవి కేవలము భౌతిక జీవిత బంధములను మరింతగా దృఢపరచును.

మానవ జీవితమనేది యజ్ఞమునకు అంటే పరమపురుషుని సంతృప్తి పరచుట కొరకు నిర్దేశించ బడినది. కర్మలలో మనం నైపుణ్యతను సాధించవచ్చును. కాని మన నైపుణ్యత జీవిత సంసిద్ధియైన శ్రీకృష్ణుడిని సంతృప్తి పరుచుట పైననే ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతము, మనము భౌతిక కార్యముల పట్ల ఆసక్తిని కలిగి ఉన్నప్పటికినీ, ఆ ఆసక్తిని సాధువు వైపునకు మరల్చినచో మన జీవితములు పరిపూర్ణములగును. మనమిప్పుడు కేవలము డబ్బుకు, స్త్రీ, చక్కటి భవంతి, దేశము, సమాజము, స్నేహితులు, కుటుంబము వంటివాటితోనే అనుబంధములను కలిగి ఉన్నాము. ఈ అనుబంధమును 'ఆర్జనం పశు' అని అంటారు. 'పశు' అనే శబ్దమునకు 'త్రాడు' అని అర్థం. మనం త్రాడుతో కట్టివేసినచో అసహాయ స్థితికి

గురవుతాము. ప్రస్తుతము ప్రకృతి యొక్క త్రిగుణాలచే మనము బంధింపబడి ఉన్నాము. *'గుణ'* అనే శబ్దమునకు కూడ 'త్రాడు' అని అర్థం. మనం బద్ధులము కనుక మనకు మనముగా విడిపించుకోలేము. ఉన్నతాధికారి ఆజ్ఞలేకుండ మనము స్వతంత్రముగా తిరగలేము. భగవంతుని ఆజ్ఞ లేకుండ చిన్నగడ్డి పరక కూడ కదలదు. కాబట్టి, మనము ఉన్నతాధికారి పర్యవేక్షణలో దేనినైనను చేయవలెను.

భగవంతుడు ప్రత్యేకించి మనలను పర్యవేక్షించ నవసరము లేదు. *"పరాస్య శక్తిర్వివిధైవ శ్రూయతే...న తస్య కార్యం కరణం చ విద్యతే"* – భగవంతునకు స్వయంగా ఏ కార్యమును చేయవలిసిన అవసరం లేదని శ్వేతాశ్వతరోపనిషత్తు (6.8)లో చెప్పబడినది. కార్యములన్నింటినీ నెరవేర్చుట కొరకు అతడికి ఎన్నో శక్తులు కలవు. మన కంటిరెప్పను కూడ స్వతంత్రముగా ఆడించలేనంతగా మనము నియంత్రించ బడుతుంటాము. ప్రస్తుతము మనము మన చేతులను స్వేచ్ఛగా ఆడిస్తున్నాము, కాని ఏ క్షణంలోనైన అవి పక్షవాతమునకు గురికావచ్చును. ప్రస్తుతము, "ఇది నా చేయి" అని నేను వాదించవచ్చును. వెంటనే చేయి పక్షవాతమునకు గురైనచో ఏమిటిది? ఇది బద్ధ జీవితము. మరియు దీనిని ఎలా అభివృద్ధి చేసుకోగలము? సమస్త బంధముల నుండి విముక్తిని పొందుటయే మన ధర్మము. అదెలా సాధ్యము? *"స ఏవ సాదుషు కృతో మోక్షద్వారమాపావృతమ్."* (భాగ. 3.25.20) మనము మన ఆసక్తిని భౌతిక వస్తువుల పై కాకుండ సాధువు వైపునకు మరల్చవలెను. *"సాధుసంగ సాధుసంగ సర్వశాస్త్ర కోయ్"* : ఇది శ్రీ చైతన్య మహాప్రభు ఆదేశము. సాధు సాంగత్యమును చేయాలని శాస్త్రములన్నీ మనకు బోధిస్తున్నవి. గొప్ప రాజనీతిజ్ఞుడైన చాణక్య పండితుడు కూడ దీనినే ప్రతిపాదిస్తున్నాడు : *"త్యజ దుర్జన సంసర్గం భజ సాధుసమాగమమ్."* ఒక వైష్ణవ గృహస్థుడు శ్రీ చైతన్య మహాప్రభువును గృహస్థుని ధర్మం ఏమిటని ప్రశ్నించాడు. మరియు శ్రీ చైతన్య మహాప్రభువు వెంటనే దానికి ఇలా సమాధాన మిచ్చాడు : *"అసత్ – సంగ త్యాగ్ ఏయ్ వైష్ణవ ఆచార్"* – "అభక్తుల సాంగత్యమును చేయరాదు, సాధువును అన్వేషించవలెను." (శ్రీ చైతన్య చరితామృతము, మధ్యలీల 22.87)

ప్రస్తుత కాలపరిస్థితులలో అభక్తులకు దూరముగా ఉండుట ఎంతో కష్టం, ఆ విధముగానే సాంగత్యము కొరకు సాధువు లభించుట కూడ ఎంతో కష్టము. కాబట్టి మేము ఈ కృష్ణ చైతన్య ఉద్యమమును సాంగత్యమును కల్పించుట కొరకు ప్రారంభించాము. దానితో జనులు సాధు సాంగత్యమును పొంది విముక్తిని సాధించ వచ్చును. ఈ సంఘమునకు మరో ఇతర ఉద్దేశ్యమేమి లేదు.

తనను గురించి ఎల్లప్పుడు ఆలోచించువాడు ఉత్తమ సాధువని శ్రీకృష్ణుడు భగవద్గీత(6.47)లో చెప్పెను. ఈ పద్ధతి ఎంతో సులువైనది. మనము ఎల్లప్పుడు శ్రీకృష్ణుడిని గురించి చింతించవలెను. కాని అది ఎలా సాధ్యం? మనమెప్పుడు మన వ్యాపారము మన కుక్క, మన కుటుంబము, మనం ప్రేమించే వస్తువు వాటిగురించే ఆలోచిస్తుంటాము. ఆలోచించకుండ ఉండుటమనేది సాధ్యము కాదు. కాబట్టి మనము మరోదానిని గురించి ఆలోచించ వలెను. కేవలము మనం మన ఆలోచనలను శ్రీకృష్ణుడి వైపునకు మరల్చవలెనను దానిని బోధించుటయే సాధు ధర్మము. మరియు దీనిని మనం సాధు సాంగత్యములోనే నేర్చుకోగలము. నిజానికి సాధువు దీనిని తప్ప మరోదానిని బోధించడు. *“ఆదౌ శ్రద్ధా తతః సాధుసంగః.”* (భక్తిరసామృత సింధువు 1.4.15) ఆధ్యాత్మిక అభివృద్ధిని సాధించుటకు ఇదే మార్గము. మనము సాధు సాంగత్యమును చేయవలెను. సాధారణముగా సాధు ధర్మమనేది ఎంతో కష్టముతో కూడుకున్నది. కాబట్టి అతడు సహనముతో ఉండవలెను. క్లిష్టపరిస్థితుల నెన్నింటిని ఎదుర్కొనినను, బద్ధజీవుల పట్ల సాధువు ఎల్లప్పుడు దయను కలిగి ఉండును. కృష్ణచైతన్యము లేనందున జనులు దుఃఖము లకు గురవుతున్నారని భక్తుడు గమనించును. అంతేకాకుండ అతడు ఎల్లప్పుడు ఇతరుల శ్రేయస్సు కొరకు చింతించును, కాబట్టి అతడు ‘సుహృత్’, ఇతరులు ఎల్లపుడు ఈర్ష్య భావనను కలిగి ఉంటారు. కాని సాధువు మాయ బంధముల నుండి ఇతరులను ఎలా తప్పించవలెనని ఎల్లప్పుడు ఆలోచిస్తుండును. సాధువు కేవలము మానవుల పట్లనే కాకుండ పిల్లులు, కుక్కలు, మొక్కలు, వృక్షములు, మరియు కీటకములు మొదలైన వాటన్నింటి పట్ల దయను కలిగి ఉండును. అతడు దోమను చంపుటకు కూడ సంకోచించును. నేను “ కేవలము నా సోదరుడి క్షేమమునే చూస్తాను” అని ఆలోచించడు. శ్రీకృష్ణుడు జీవులందరికి తండ్రినని చెబుతున్నాడు. కాబట్టి అతడు జీవరాసుల నన్నింటిని తన సహోదరులుగా చూచును.

సాధువు ఈ విధముగా జీవించును కాబట్టి అతడు విరోధులను సృష్టించుకోడు. విరోధులనేవారు వారి స్వభావము వలననే విరోధులవుతారు తప్ప సాధువు వారిని విరోధులయ్యేలా ఎప్పుడు ప్రేరేపించడు. “నా ప్రియమైన మానవులారా, నా స్నేహితులారా, కేవలము మీరు శ్రీకృష్ణుడికి శరణు పొందండి” అని మాత్రమే సాధువు వారికి బోధించును. విరోధు లనబడేవారు తమ ఈర్ష్య స్వభావము వలననే విరోధులవుతారు. పాము మరియు మానవుడు అనే రెండు ఈర్ష్య జంతువులు గలవని చాణక్య పండితుడు తెలిపెను. మీ తప్పులేకున్నను

ఇవి మిమ్ములను చంపవచ్చును. ఈ రెండెంటికన్నను ఈర్షతో కూడిన మానవుడు పాముకన్నను భయంకరుడు. ఎందుకనగా, పామును మంత్రముల ద్వారా లేదా మూలికల ద్వారా అణచి వేయవచ్చును. కాని ఈర్ష్యాద్వేషములు కలిగిన మనిషిని లొంగ దీసుకొనుట సాధ్యపడదు. ఈ కలియుగములోని ప్రతిఒక్కరు ఈర్ష్యాపరులే. కాబట్టి మనం వారిని సహించవలెను.

ఈర్ష్య గలవారు కృష్ణచైతన్య ఉద్యమమునకు ఎన్నో ఆటంకములను కలిగించెదరు. అయినను వారిని మనం సహించవలెను. దానికి మరోమార్గం లేదు, అన్ని సందర్భములలోను ప్రశాంతముగా ఉంటూ శ్రీకృష్ణునిపై ఆధారపడ వలెను. ఈ గుణములన్నీ సాధువునకు ఆభరణములు. మనం సాధువును గుర్తించి అతడి సాంగత్యమును తీసుకోవలెను. అప్పుడే మనకొరకు మోక్షద్వారము తెరువబడును.

తరువాతి శ్లోకములో కపిల భగవానుడు సాధుకార్యములను మరింతగా వివరిస్తున్నాడు.

శ్లోకము 22

మయ్యనన్యేన భావేన భక్తిం కుర్వన్తి యే దృఢామ్
మత్కృతే త్యక్తకర్మాణస్త్యక్తస్వజనబాన్ధవాః

అటువంటి సాధువు అనన్య భావముతో దృఢమగు భక్తియుక్త సేవ యందు నెలకొని యుండును. భగవానుని కొరకు అతడు లోకమందలి స్వజన సంబంధములు మరియు మిత్రపరిచయముల వంటి సమస్త సంబంధములను త్యజించి వేయును.

భాష్యము : సన్న్యాసాశ్రమము నందున్న వ్యక్తి సైతము 'సాధువు' అనియే పిలువ బడును. తన గృహమును, సౌఖ్యమును, స్నేహితులను, బంధువులను, బంధుమిత్రుల యెడ తన కర్తవ్యము వంటి సమస్తమును దేవాదిదేవుడి కొరకు అతడు త్యజించి యుండుటయే అందులకు కారణము. సన్న్యాసి సాధారణముగా వైరాగ్యము నందుండును; కాని తన శక్తియంతయు గొప్ప తపస్సుతో భగవత్సేవ యందు వినియోగింప బడినప్పుడే అతని త్యాగము ఫలించగలదు. కనుకనే ఇచ్చట: *"భక్తిం కుర్వన్తి యే దృఢామ్"* అని చెప్పబడినది. శ్రద్ధగా భగవత్సేవ యందు నెలకొనియుండి, సన్న్యాసజీవనము నందు కొనసాగువాడే సాధువు. సంఘము

యెడ, కుటుంబము యెడ గల తమ బాధ్యతల నన్నింటిని త్యజించినవాడు మరియు కేవలము భగవత్సేవార్థమై లౌకిక మానవత్వమును విడిచిన మనుజుడే సాధువు. ఈ లోకమునందు జన్మించినంతనే మానవునికి జనుల యెడ, దేవతల యెడ, ఋషుల యెడ, సాధారణ జీవుల యెడ, తల్లిదండ్రుల యెడ, పితృదేవతలు మొదలైన వారియెడ బాధ్యతలెన్నో ఏర్పడును. దేవాదిదేవుని సేవ కొరకై అట్టి వాటినన్నింటిని త్యజించినప్పుడు అతడు శిక్షింపబడడు. కాని మనుజుడు ఇంద్రియ భోగార్థమై అట్టి కర్తవ్యములను పరిత్యజించినచో, ప్రకృతి నియమములచే ఖచ్చితముగా అతడు శిక్షింపబడును.

శ్రీకృష్ణుడు మరియు ఇతర శాస్త్రములన్నీ కేవలము భగవంతునికే మనము ఋణపడి ఉండవలెనని తెలుపుచున్నవి. మనమతడిని సేవించినప్పుడు ఇతరు లందరితో మనకు గల ఋణములన్నీ తీరిపోవును. మనం ఋణవిముక్తుల మగుదుము. కాని ఇది ఎలా సాధ్యం? ఇది శక్తివంతుడైన భగవంతుడి వలననే సాధ్యపడును. ఒక వ్యక్తికి చట్టం ద్వారా మరణ శిక్ష విధించ బడవచ్చును, కాని దేశాధ్యక్షుడు లేదా రాజు కనుక క్షమాభిక్ష పెట్టినచో అతడు రక్షింపబడును. భగవద్గీత(18.66) లోని శ్రీకృష్ణుని చరమ ఉపదేశమేమిటంటే, సమస్తమును అర్పించుకోవలెనని. మన సంపద, జీవితము, మరియు బుద్ధి అన్నింటిని త్యాగం చేయవలెను. అదే యజ్ఞమనబడును. ప్రతిఒక్కరు ఎంతోకొంత బుద్ధిని కలిగి ఉన్నారు. కాబట్టి ప్రతిఒక్కరు తమ బుద్ధిని ఏదోరకంగా ఉపయోగిస్తారు. సాధారణముగా జనులు తమ బుద్ధిని ఇంద్రియ తృప్తికొరకు వినియోగిస్తుంటారు. చీమ కూడ దానిని చేయగలదు. మనము మన ఇంద్రియములను కాకుండ శ్రీకృష్ణుని ఇంద్రియములను తృప్తి పరచవలెను. అప్పుడే మనము పరిపూర్ణుల మగుదుము.

మనం ఈ శుద్ధి ప్రక్రియను సాధువు నుండి నేర్చుకోవలెను. మనమెంతగా ఇంద్రియతృప్తిని పొందుటకు ప్రయత్నిస్తామో, అంతగా ఈ భౌతిక ప్రపంచము పట్ల అనుబంధము కలుగుతుంది. మనము సాధువు లేదా శ్రీకృష్ణుడికి సేవ చేయవలెను. సాధువు శ్రీకృష్ణుని ప్రతినిధి. సాధువు ఎప్పుడు : "నాకు సేవ చేయుము" అని తెలుపడు, కాని అతడు "శ్రీకృష్ణుడికి సేవ చేయుము" అని తెలుపును. కాబట్టి మనము శ్రీకృష్ణుడిని సాధువు ద్వారా సమీపించ వలెనని వైష్ణవాచార్యుడైన నరోత్తమ దాస ఠాకూరు నిర్ధారించిరి : "చాడియా వైష్ణవ–సేవా *నిస్తార్ పాయ్‌చె కెబా."* మనము శ్రీకృష్ణుడిని నేరుగా సమీపించలేము. కాబట్టి మనము దోషరహితమైన శ్రీకృష్ణుడి ప్రతినిధి ద్వారా అతడిని సమీపించవలెను.

భౌతిక వాంఛలకొరకు ప్రాకులాడు వారు వివిధ దేవతలను సమీపిస్తుంటారు. వారు శివుడు, దుర్గ, కాళి, గణేశ, సూర్యుడు మొదలగు వారి దగ్గర నుండి ఏదో దానిని పొందుతుంటారు. శివుడితో పార్వతి, "సర్వోన్నతమైన ఆరాధనమేది?" అని అడిగెను. *"ఆరాధనానాం సర్వేషాం విష్ణోరారాధనం పరమ్"* – "నా ప్రియమైన పార్వతి, ఆరాధనల నన్నింటిలోకెల్లా విష్ణు ఆరాధనము ఉత్తమమైనది" అని శివుడు ఆదేశించెను (పద్మపురాణము). అతడు ఇంకా ఇలా చెబుతున్నాడు : "*తస్మాత్ పరతరం దేవి తధీయానాం సమర్చనమ్"* – "కాని విష్ణు ఆరాధన కంటే అతని భక్తుడైన వైష్ణవుని ఆరాధించటమనేది సర్వోన్నతమైనదని తెలిపాడు."

ఆధ్యాత్మిక జీవితమనేది సాధు సాంగత్యముతో ప్రారంభమగును. సాధు కృప లేకుండ మనము ఒక్క అంగుళము కూడా అభివృద్ధిని సాధించజాలము. ప్రహ్లాద మహారాజు కూడ దానినే ప్రతిపాదించాడు :

నైషాం మతిస్తావదురుక్రమాఙ్ఘ్రిం
స్పృశత్యనర్థాపగమో యదర్థః
మహీయసాం పాదరజోఽభిషేకం
నిష్కించనానాం న వృణీత యావత్

"పరమ విషయాసక్తులైనవారు భౌతిక కల్మషముల నుండి పూర్తిగా విడివడినట్టి వైష్ణవుని పాదపద్మరజమును తమ శరీరములకు పూర్తిగా అలదుకొననంత వరకు ఉరుక్రముని పాదారవిందముల యెడ అనురక్తులు కాజాలరు. భక్తిభావసమన్వితులై ఆ రీతి భగవచ్చరణార విందములను ఆశ్రయించుట ద్వారానే మనుజుడు అనర్థముల నుండి బయటపడగలడు."(భాగ. 7.5.32) "నీవు ఎలా కృష్ణభక్తిలో ఇంతటి పురోభివృద్ధిని సాంధించగలిగావు?" అని హిరణ్యకశిపుడు ప్రహ్లాదుని ప్రశ్నించాడు. అసురుడైనప్పటికిని హిరణ్యకశిపుడు జిజ్ఞాసను కలిగి ఉండెను. ప్రహ్లాదుడు ఇలా సమాధాన మిచ్చెను : "అసురులలో శ్రేష్ఠుడా! నా ప్రియమైన తండ్రి, మానవుడు కృష్ణచైతన్యమును కేవలం గురువు ఉపదేశముల వలననే పొందగలడు. కేవలం ఊహాగానాల చేత దీనిని పొందజాలము. విష్ణువును తిరిగి చేరుటయే తమ పరమ లక్ష్యమని సాధారణ జనులకు తెలియదు." ఈ భౌతిక లోకములోని జనులు ఎల్లప్పుడు దేనినో ఒకదానిని ఆశిస్తుంటారు. వారు కోరిక లెన్నింటినో కలిగి ఉన్నప్పటికినీ వారి కోరికలెన్నడు నెరవేరవు. జనులు బహిరంగ శక్తిని నియంత్రించి ఆనందముగా ఉండుటకు ప్రయత్నిస్తుంటారు. కాని

భగవంతుడిని సమీపించకుండా తాము ఆనందమును పొందలేమని తెలుసుకోలేకున్నారు. "మొదట నేను నా స్వార్థమును చూసుకోవలెను" అని జనులు భావిస్తారు. కాని వారికి ఆ స్వార్థమేమిటో తెలియదు. జనులు భౌతిక ప్రకృతిని నియంత్రించుట ద్వారా ఆనందమును పొందగలుగుతామని భావిస్తారు. అంతేకాకుండ, ప్రతిఒక్కరు కూడ దీనికొరకు వ్యక్తిగతముగా, సంయుక్తముగా, జాతీయముగా ప్రయత్నిస్తున్నారు. అయినను ఏ సందర్భంలోను ఇది సాధ్యపడదు. కాబట్టి జనులు చివరకు నిరాశ చెందవలసినదే. చివరకు నిరాశను కలిగించు దానికొరకు ప్రయత్నించడ మెందుకు? కాబట్టి ఇలా చెప్పబడినది : *"అధాంతగోభిర్ విశతాం తమిస్రం పునః పునశ్చర్విత చర్వణానామ్."* (భాగ. 7.5.30) జనులు వారి ఇంద్రియములను నియంత్రించు కోనందున ఎన్నో రకాలుగా భంగపడుతుంటారు. శ్రీకృష్ణుడిని ఆశ్రయించుటయే వారికి గల ఏకైక ఆశ్రయం. అందుకే ఈ శ్లోకంలో : *"మయ్యనన్యేన భావేన భక్తిం కుర్వన్తి యే దృఢామ్"* అని చెప్పబడినది.

ప్రహ్లాద మహారాజు శ్రీకృష్ణుడిని మాత్రమే స్మరించాడు. కాబట్టి అతడు తన తండ్రి వలన అనేక సమస్యలను ఎదుర్కొనవలసి వచ్చింది. భౌతిక ప్రకృతి మనకు అంత సులువుగా స్వేచ్ఛను ప్రసాదించదు. శ్రీకృష్ణుని పాదపద్మములను పట్టుకొనుటకు మనం గట్టిగా ప్రయత్నించినప్పుడు, మాయాదేవి కూడ ఆవిడ గుప్పిట్లో మనలను పెట్టుకొనుటకు గట్టిగా ప్రయత్నించును. ఏమైనను, మనం శ్రీకృష్ణుని కొరకు సర్వమును త్యజించినచో మాయ ప్రభావము పని చేయదనుటకు గొప్ప ఉపమానము గోపికలు. వారు తమ కుటుంబములను, గౌరవ మర్యాదలనన్నింటిని కేవలం శ్రీకృష్ణుని అనుసరించుట కొరకు త్యజించారు. అది అత్యుత్తమమైన సిద్ధి. కాని ఇది సాధారణ జీవులకు సాధ్యపడదు. కాబట్టి ఎలాగైనను వృందావనములోని గోస్వాముల దృఢ సంకల్పమును అనుసరిస్తూ శ్రీకృష్ణుని ఆరాధించవలెను.

హూసేన్ షా ప్రభుత్వములో శ్రీల సనాతన గోస్వామి ఒక ముఖ్యమైన మంత్రి పదవిని కలిగి ఉన్నప్పటికినీ అతడు శ్రీ చైతన్య మహాప్రభువును అనుసరించుట కొరకు సర్వమును త్యజించెను. అతడు సన్న్యాస జీవితమును పాటిస్తూ, ప్రతిరాత్రి ఒక్కొక్క వృక్షం క్రింద గడిపేవాడు. "భౌతిక ఆనందమును త్యజించిన తర్వాత ఎవరైనను ఎలా జీవించగలరు?" అని ఎవరైన ప్రశ్నించవచ్చు. గోస్వాములు శ్రీరాధాకృష్ణుల దివ్య ప్రేమ లీలలనే మహాసాగరంలో మునిగిపోతూ జీవించిరి. అది వారి సంపద, కాబట్టి వారు ప్రశాంతముగా జీవించేవారు. మనం

అంత సులభముగా సర్వమును త్యజించలేము. శ్రీకృష్ణుని యందు దృఢవిశ్వాసము లేకుండ సర్వమును త్యజించుటకు ప్రయత్నించినచో మనం పిచ్చి వారమగుదుము. కాని మనం శ్రీకృష్ణుని సాంగత్యమును పొందగలిగినప్పుడు, కుటుంబములను, వ్యాపారములను, గొప్ప పదవుల నన్నింటిని సులభముగా త్యజించ గలుగుదుము. దీనికొరకు సాంగత్యము అవసరము. మనం భక్తులతో అనగా సాధువులతో సాంగత్యము చేసినప్పుడు, సర్వమును విడిచి ముక్తాత్మల మగుటకు కావలసిన ఒకరోజు తప్పకుండ వచ్చును, అప్పుడే తిరిగి భగవద్ధామమును చేరుటకు అర్హతను పొంద గలుగుదుము.

ప్రస్తుతము మనం భౌతిక ఆనందముతో అనుబంధమును కలిగి ఉన్నాము, కాబట్టి శ్రీకృష్ణుడు కూడ మన ఇంద్రియములను అనుభవించుటకు అవకాశమును కలిగించును. ఈ భౌతికలోకంలోకి ఇంద్రియతృప్తిని అనుభవించుట కొరకు మనమిక్కడికి వచ్చాము. కనుక దానిని పూర్తి స్థాయిలో ఆనందించేలా అవకాశమును అతడు కలిగిస్తాడు. ఏమైనను ఇది మాయ, భ్రాంతి. ఇది వాస్తవ ఆనందము కాదు. కేవలము దుఃఖమే. మనం నిజానికి, ఈ భౌతిక లోకములో ఆనందము లేదని, ఎన్నో జన్మలుగా దుఃఖములను పొందుతున్నామని తెలుసుకున్న వారెవరైనను శ్రీకృష్ణునికి భక్తులగుదురు. ఆ సాక్షాత్కారమును పొందుటకు జ్ఞానమవసరము, ఆ జ్ఞానమును సాధువు లేక భక్తుల సాంగత్యము నుండి పొంద గలుగుదుము.

ఈ భౌతిక జీవితములోని దుఃఖముల నుండి విముక్తిని ఎలా పొందగలమనే విషయమును తరువాతి శ్లోకములో కపిల భగవానుడు వివరిస్తున్నాడు.

శ్లోకము 23

మదాశ్రయాః కథా మృష్టాః శృణ్వన్తి కథయన్తి చ
తపన్తి వివిధాస్తాపా నైతాన్ మద్గతచేతసః

దేవాదిదేవుడనగు నన్ను గూర్చిన శ్రవణ, కీర్తనములందే సదా నెలకొని యుండెడి సాధువులు భౌతిక క్లేశములచే బాధింపబోరు. ఏలయన నా లీలలకు, కర్మలకు సంబంధించిన ఆలోచనలనే వారెల్లప్పుడు కలిగి యుందురు.

భాష్యము : దేహమునకు, మనస్సునకు సంబంధించినవి, ఇతర జీవులచే కలుగ జేయబడినవి, ప్రకృతి ఉత్పాతములచే బలవంతముగా పై బడెడివి అనుచు భౌతిక అస్తిత్వము నందు అనేక రకములగు క్లేశములు కలవు. కాని తన మనస్సు సదా

కృష్ణచైతన్యముతో నిండియున్నందున సాధువు అట్టి క్లేశకర పరిస్థితులచే కలత చెందబోడు. ఆ విధముగా కృష్ణలీలలను తప్ప అన్య విషయముల దేనిని గూర్చియు అతడు చర్చించబోడు. అంబరీష మహారాజు వైకుంఠుని లీలలు తప్ప అన్యమును పలుకలేదు. *"వాచాంసి వైకుంఠగుణానువర్ణనే."* (భాగ. 9.4.18) తన పలుకులను అతడు కేవలము దేవాదిదేవుడిని కీర్తించుట యందే వినియోగించెను. ఇక సాధారణ బద్ధజీవులు భగవత్ లీలలను విస్మరించి సదా క్లేశములతోను, భౌతిక తాపములతోను నిండి యుందురు. వారట్లుండగా భక్తులు కృష్ణకథల యందే సదా ఆకర్షితులై యున్నందున భౌతిక ఆస్తిత్వపు క్లేశములను మరచి యుందురు. ఈ విధముగా వారు ఇతర దుఃఖపూరితమైన ప్రాణులకంటే భిన్నమగుదురు.

ఈ లోకంలో భౌతికంగా నియుక్తుడైన వారెవరైనను, "తాను దుఃఖములను అనుభవించుట లేదని." ధైర్యంగా చెప్పేవారెవరైన కలరా అని నేను సవాల్ చేస్తున్నాను. ఈ భౌతిక లోకములోని వారందరు ఏదోరకముగా కష్టములను అనుభవిస్తున్నారు. అలాకానిచో ఎందుకు ఎన్నోరకాల మత్తుపదార్థముల ప్రకటనలు వస్తున్నాయి? ఎల్లప్పుడు నొప్పిని అణిచి బాధను తగ్గించే మాత్రల ప్రకటనలెన్నింటినో టెలివిజన్‌లో చూస్తుంటాము. అమెరికా మరియు ఇతర పాశ్చాత్య దేశాల వారు ఎన్నోరకాల నొప్పులకు డజన్లకొద్దీ మాత్రలను కనిపెట్టునంతగా అభివృద్ధిని సాధించాయి. దీనినిబట్టి దుఃఖములు కలవని అర్థము. నిజానికి, భౌతిక శరీరములను పొందిన వారందరికి ఈ దుఃఖములను అంగీకరించవలసి ఉంటుంది. ఈ భౌతిక ప్రపంచములో త్రివిధ క్లేశములు కలవు : 'ఆధ్యాత్మిక', 'ఆదిభౌతిక', మరియు 'ఆదిదైవిక'ములు. ఆధ్యాత్మికమనేది శరీరమునకు మరియు మనస్సునకు సంబంధించినది. తలనొప్పి లేదా వెన్నునొప్పి లేదా మనస్సు సరిగ్గా లేకపోవుటమనే ఈ బాధలను ఆధ్యాత్మిక క్లేశాలంటారు. ఇతర జీవుల వలన పొందే బాధలను ఆదిభౌతిక క్లేశాలంటారు. మరియు ఇవేకాకుండ ఆదిదైవిక క్లేశాలు కూడ కలవు, ఇవి మన నియంత్రణకు అతీతముగా ఉంటాయి. ఇది దేవతల ద్వారా లేదా ప్రకృతి ద్వారా సంభవించే కరువు కాటకాలు, వరదలు, అంటు రోగాలు, అత్యధిక ఉష్ణోగ్రత, లేదా అత్యధిక చలి, భూకంపములు, అగ్ని మొదలైనవి. అయినను మనం ఈ భౌతిక లోకములో ఆనందముగా ఉన్నామని భావిస్తాము. ఈ త్రివిధ క్లేశములే కాకుండ జన్మ, మృత్యు, జరా, వ్యాధి అనే బాధలు కూడ కలవు. కాబట్టి సుఖమనేది ఎక్కడుంది? మాయ ప్రభావము వలన మన స్థితి సురక్షితమని భావిస్తూ, "జీవితమును అనుభవిద్దాము" అని భావిస్తాము.

కాని ఇది ఎటువంటి ఆనందము?

కష్టాలను తప్పకుండ మనము సహించవలెను. సాధు లక్షణములలో సహనము ఒకటి. ప్రతిఒక్కరు ఎంతోకొంత సహనశక్తిని కలిగి ఉంటారు. కాని సాధువు యొక్క సహనము సాధారణ వ్యక్తి సహనమునకు భిన్నమైనది. ఎందుకంటే, సాధువు తాను శరీరము కాదని తెలుసుకొనును. ఒక బెంగాలీ వైష్ణవ గీతము ననుసరించి : *"దేహ – స్మృతి నాహి జార్ సంసార – బంధన్ కాహ తార్."*

ఈ శరీరము మనము కాదని సరిగ్గా అర్థం చేసుకోగలిగినప్పుడు మనం బాధలు పడుతున్నను, ఆ బాధలను అంతలోతుగా పట్టించుకొనము. ఉదాహరణకు ఎవరైన వ్యక్తి 'ఇది నా కారు' అని భావించినప్పుడు, దానికి దెబ్బ తగిలినప్పుడు, దీనిని సరిచేయవచ్చులే లేదా దీనిని మార్చేయవచ్చునని పలికే ఇతర వ్యక్తులకన్నను, దానితో అనుబంధమును కలిగివున్న వ్యక్తి అధికమైన బాధకు గురగును. మనస్సులోకి ఎంతలోతుగా తీసుకున్నామను దానిపై బాధ ఆధారపడి ఉంటుంది. ఆ భౌతికవాది పశువులాంటివాడు, కనుక మరింత బాధలకు గురగును. మరొవైపు భక్తుడు భగవద్గీత (2. 14) లోని శ్రీకృష్ణుడి ఆదేశమును పాటించును:

మాత్రాస్పర్శాస్తు కౌన్తేయ శీతోష్ణసుఖదుఃఖదాః
ఆగమాపాయినోऽ నిత్యాస్తాంస్తితిక్షస్వ భారత

"కుంతీపుత్రా! సుఖదుఃఖములు తాత్కాలికమైన రాకయు, కాలక్రమమున వాటిపోకయు శీతగ్రీష్మ అనుభవముల వంటివి. భరత వంశీయుడా! అవి ఇంద్రియానుభవము వలన కలుగుచుండును. ఎల్లరును కలతపొందక వానిని సహింపవలెను."

వేసవి కాలములోను మరియు చలికాలములోను మనము బాధలకు గురవుతుంటాము. "వేసవికాలంలో నిప్పు బాధను కలిగిస్తుంది. కాని చలికాలములో అదే నిప్పు హాయినిస్తుంది. అదేవిధముగా చలికాలములో నీరు కష్టమును కలిగిస్తుంది. కాని వేసవిలో అదే హాయిని కలిగిస్తుంది. నీరు మరియు వేడి మారలేదు. కాని కొన్నిసార్లు వాటివలన సంతోషము కొన్నిసార్లు దుఃఖము కలుగుతున్నవి. ఇవన్నీ స్పర్శ కారణముగా కలుగుచున్నవి. మనమందరము చర్మరోగమును అనగా శరీరమును కలిగి ఉన్నాము, కాబట్టి బాధలు కలుగుతున్నవి. మనమెంతటి మూర్ఖులమంటే, "నేను ఈ శరీరము" అని ఆలోచిస్తున్నాము. ఆయుర్వేద శాస్త్రము ననుసరించి మన శరీరం కఫపిత్త వాయువులతో నిండినది. మనమెంతగా దేహాత్మ

బుద్ధికి లోనవుతామో అంతగా బాధలకు గురవుతుంటాము.

దేహాత్మబుద్ధి కారణముగా ప్రస్తుతమెన్నో 'వాద'ములు అభివృద్ధి చెందుచున్నవి. అవి జాతీయవాదం, సామ్యవాదం, సాంఘికవాదం, మతవాదం ఇలా మరెన్నో. 1947 సంవత్సరం కలకత్తా నగరములో మత సంఘర్షణలు జరిగినప్పుడు, "నేను హిందువు" లేదా "నేను ముస్లిం" అని భావించుట వలన అనేక రకాల బాధలను సహించవలసి వచ్చెను. కాని కృష్ణచైతన్యములో పురోభివృద్ధిని సాధించినవాడు ఇటువంటి వాదములకు అనుకూలముగా పోరాడడు. కృష్ణ చైతన్యములో గలవాడు తాను హిందు లేక ముస్లిం కాదని, కేవలం కృష్ణ సేవకుడనని ఎరుగును. దేహాత్మబుద్ధి భావన వృద్ధిచెందేలా జనులు శిక్షణ పొందుతున్నారు. కాబట్టి వారి కష్టాలు కూడ మరింతగా వృద్ధి చెందును. దేహాత్మబుద్ధి తగ్గినప్పుడు కష్టాలు కూడ తగ్గును. కృష్ణ చైతన్యవంతులైన వారు మరియు శ్రీకృష్ణుడిని తమ హృదయాలలో, మనస్సులో సదా స్మరించువారు అంతగా దుఃఖములచే బాధించబడరు. ఎందుకనగా, వారు పొందుతున్న దుఃఖములన్నీ కేవలం శ్రీకృష్ణుని ఇచ్ఛానుసారమే జరుగుతున్నవని వారికి తెలుసును. కాబట్టి వారు దుఃఖములను స్వాగతిస్తుంటారు. ఉదాహరణకు : శ్రీకృష్ణుడు హస్తినాపురమును విడిచి వెళ్ళుచున్నప్పుడు, అతనితో కుంతీ మహారాణి ఈ విధముగా పలికెను : "నా ప్రియమైన కృష్ణా! మేము అపదలలో చిక్కుకొనినప్పుడు మీరు మాకు శ్రేయోభిలాషిగా మరియు మిత్రునిగా చెంత నిలిచారు. ప్రస్తుతము మేము మా రాజ్యములో సురక్షితముగా ఉన్నందున, మీరు మమ్ములను విడిచి ద్వారకకు వెళ్ళుచున్నావు. ఇది దుఃఖమును కలిగిస్తున్నది. కాబట్టి తిరిగి మాకు కష్టాలు రావటమే మంచిది. ఎందుకనగా, బాధలలో మేము నిన్ను ఎల్లప్పుడు స్మరించ గలుగుదుము." శ్రీకృష్ణుడిని ఎల్లప్పుడు స్మరించుటకు భక్తుడు కష్టములను అవకాశముగా తీసుకుంటాడు : "నేను నా పుర్వ పాపకర్మలకు ఫలితముగా బాధలను అనుభవిస్తున్నాను. నిజానికి నేను మరింత అధికముగా దుఃఖములకు గురికావలసి వచ్చేది. కాని శ్రీకృష్ణుని కృప వలన నా బాధలు స్వల్పము లయ్యెను" అని భక్తుడు భావించును. నిజానికి దుఃఖములనేవి మనస్సు వలన కలుగును. కాబట్టి భక్తుడు కష్టముల వలన అంతగా దుఃఖములకు లోను కాడు. భక్తులకు మరియు అభక్తులకు మధ్యగల భేదమిదియే.

ఐదు సంవత్సరముల వయస్సుగల ప్రహ్లాద మహారాజు భక్తుడైనందున తన తండ్రి చేతిలో ఎన్నో కష్టాలకు గురికావలసి వచ్చెను. అతడు ఏనుగుల చేత త్రొక్కించ బడినాడు, పర్వతముల పై నుండి త్రోయించబడినాడు, మరుగుచున్న

నూనెలో వేయించ బడినాడు, పాములచే కాటు వేయించబడినాడు. అయినను ప్రహ్లాదుడు ఈ క్లిష్టపరిస్థితులను మౌనముగా భరించాడు. అదేవిధముగా హరిదాస్ ఠాకూరు ముస్లిం కుంటుంబములో జన్మించినను, అతడు గొప్పభక్తుడు మరియు సదా 'హరేకృష్ణ' మహామంత్రమును జపించేవాడు. కాని అదే అతని నేరమైనది. ముస్లిం ఖాజి అతడిని పిలిపించి ఇలా అన్నాడు : "నీవు గొప్ప ముస్లిం కుంటుంబములో జన్మించినను నీవు ఈ హిందువుల 'హరేకృష్ణ' మహామంత్రమును ఎందుకు జపిస్తున్నావు?" హరిదాస్ ఠాకూరు మృదువుగా ఇలా ప్రత్యుత్తర మిచ్చాడు: "అయ్యా! ఎందరో హిందువులు ముస్లిములుగా మారారు. నేనొక్కడిని హిందువుగా మారినచో అందులో తప్పేమిటి?" దానితో ఖాజి ఆగ్రహించి అంగడి కూడలిలలో అతనికి ఇరవైరెండు కొరడా దెబ్బలు కొట్టాలని ఆజ్ఞాపించాడు. ఇలా చేయుట వలన అతడు చివరికి మరణించునని భావన. కాని హరిదాస్ ఠాకూరు గొప్ప భక్తుడైనందున అతడు నిజానికి ఎలాంటి బాధకు గురికాలేదు. కొన్నిసార్లు భక్తుడు కష్టములకు గురికావలసి వచ్చినను, అతడు దానిని భరించును. అదే సమయములో బద్ధజీవుల పట్ల ఎంతో దయను కలిగి ఉండును. అంతేకాకుండ వారు కృష్ణ చైతన్యమునకు ఎదిగేలా అతడు ప్రయత్నించును. ఇది భక్తుని జీవితంలోని ప్రధాన కార్యాలలో ఒకటి. జనము సాధువులను ఎల్లప్పుడు ఇబ్బందులకు గురిచేసినను ఇతరులకు ఆనందమును కలిగించెడి కృష్ణచైతన్యమును విస్తరించుటమనే ధర్మమును అతడు విడువడు. ప్రహ్లాద మహారాజు ఇలా అన్నాడు : "ప్రియమైన దేవా! నాకు ఆనందమును పొందే కళ తెలిసినందున నేను బాధలు పడుట లేదు." ఇది ఎలా సాధ్యం? "కేవలము నీ గురించి శ్రవణము చేయుట వలన మరియు మిమ్ములను కీర్తించుట వలన నేను ఆనందమును పొందుతున్నాను." భగవంతుని గురించిన శ్రవణ కీర్తనమనునవి భక్తుల విధులు. ఇది *'శ్రవణం కీర్తనం విష్ణోస్మరణమ్'*: ఈ కృష్ణచైతన్య ఉద్యమము ద్వారా నేడు ప్రపంచమంతటా ఈ శ్రవణ కీర్తనములు జరుగుచున్నవి.

సాధారణ జీవితములో కూడ శరీరమునకు శస్త్రచికిత్స చేయుచున్నప్పుడు మనస్సు చలించకుండ ఉంచుకోగలుగుట మానవునకు సాధ్యపడుతుంది. కొన్ని సంవత్సరముల క్రితం జోసఫ్ స్టాలిన్‌కు శస్త్రచికిత్స చేయునప్పుడు మత్తు సూది తీసుకొనుటను అతడు తిరస్కరించాడు. సాధారణ భౌతిక జీవితములో ఇది సాధ్యమైనచో ఇక ఆధ్యాత్మిక జీవితమును గురించి ఏమి చెప్పగలము? మన మనస్సు ఎల్లప్పుడు శ్రీకృష్ణుని ఆలోచనలతో కృష్ణ చైతన్యములో అనగా శ్రీకృష్ణుని

స్మరించవలెను. "సర్వదా నన్ను గూర్చియే చింతించుము" అనునది శ్రీకృష్ణుని ఆదేశము. అమెరికా మరియు యురోపు దేశముల యువత చిన్ననాటి నుండి అనేక దుర్వ్యసనాలకు అలవాటు పడినప్పటికిని వారు ఇప్పుడు వాటినన్నింటిని విడిచివేసారు. ఎంతోమందికి అక్రమ సంభోగము, మత్తుపానీయాలను తీసుకొనుట, మాంసాహారము, మరియు జూదము వంటివాటిని విడిచి ఉండుటమనేది అసాధ్యము. ఎంతో ప్రఖ్యాతి గాంచిన పాశ్చాత్యదేశములోని ఒక మహారాజు మా స్వతీర్థుడితో ఇలా అన్నాడు : "దయచేసి నన్ను కూడ బ్రాహ్మణుడిని చేయండి" అని. దానికి మా స్వతీర్థుడు ఇలా అన్నారు : "అదేమి అంత కష్టమేమి కాదు. దానికొరకు మీరు మత్తుపదార్థాలు, మాంసాహారము, జూదము, అక్రమ సంభోగము వంటివాటిని త్యజించవలెను. దానితో మీరు బ్రాహ్మణు లగుదురు." అందుకు ఆ మహారాజు : "ఇది అసాధ్యం! ఇది మా జీవితము" అని అన్నాడు. వాస్తవానికి పాశ్చాత్య దేశాలలోని వృద్ధులు ఈ అలవాట్లను మానుకోలేక ఎన్నోబాధలు పడుతున్నారు. అయినను ఎందరో యువతీయువకులు వీటిని విడిచి వేయగలిగారు. దానితో బాధలు దూరములయ్యెను. ఇది కేవలం కృష్ణచైతన్యము వలననే సాధ్యమైనది.

ఈ ప్రక్రియ అందరికోసము తెరవబడినది. అందరు భగవద్గీత గురించి వినివున్నారు. ఆ గ్రంథములో చెప్పిన ఆదేశములను పాటించుట వలన మనం పరిపూర్ణత్వమును సాధించగలము. దీనికొరకు మన కర్తవ్యాలను త్యజించవలసిన అవసరము లేదు. అంబరీష మహారాజు గొప్పచక్రవర్తి మరియు రాజ్యమును పరిపాలిస్తున్నను అతడు శ్రీకృష్ణుని గురించియే చర్చించేవాడు. శ్రీ చైతన్య మహాప్రభువు తన భక్తులతో కేవలం శ్రీకృష్ణుడి గురించి మాత్రమే చర్చించాలని విన్నవించాడు. మనము శ్రీకృష్ణుడిని గురించి మాత్రమే చర్చిస్తూ అతడిని గురించి మాత్రమే శ్రవణము చేసినచో, మనము బాధలను అనుభవించలేని స్థితికి చేరుకుంటాము. 'వేదాంత సూత్రము'లలో ఈ స్థితిని *"ఆనందమయోఽభ్యాసాత్"* అని అంటారు. జీవుడు మరియు శ్రీకృష్ణుడు ఇరువురు ఆనందమయులు అనగా ఆధ్యాత్మికముగా ఆనంద స్వరూపులు. అట్టి స్థితిలో భౌతిక బాధలనేవి కలుగవు. ఇదేదో మాయ ఇంద్రజాల ప్రదర్శన కాదు. అంతేకాదు బాధలనుండి విముక్తి పొందుటమనేది గొప్ప ఇంద్రజాలము మరియు భక్తులు ఈ స్థితినే కలిగి ఉంటారు. మనం శ్రీకృష్ణుడి గురించి శ్రవణము చేసినపుడు లేదా కీర్తించుటలో ఆనందమును పొందగలిగితే, మనం సంసిద్ధి మార్గములో పురోభివృద్ధిని సాధిస్తున్నట్లు తెలుసు

కోవాలి. ఆ సమయంలో లౌకిక బాధలుండవు. ఇది భక్తియుక్త సేవవలన కలుగు ప్రత్యక్ష ఫలితము, దీనినే కపిల భగవానుడు తన తల్లికి తెలియజేస్తున్నాడు.

శ్లోకము 24

త ఏతే సాధవః సాధ్వి సర్వసంగవివర్జితాః
సంగస్తేష్వథ తే ప్రార్థ్యః సంగదోషహరా హి తే

ఓ జననీ! ఓ సాధ్వీ! ఇవన్నీ సమస్త ఆసక్తుల నుండి విడిపడినవారి శుద్ధభక్తుల లక్షణములు. అటువంటి శుద్ధాత్మల సాంగత్యమునే నీవు తప్పక కోరవలెను. ఏలయున భౌతికాసక్తి యొక్క దుష్టప్రభావములను అది నశింపజేయగలదు.

భాష్యము : భౌతికాసక్తి నుండి విడుదలను గోరినచో సాధుసాంగత్యమును సమస్త భౌతికాసక్తి నుండి విడివడి యున్నట్టి భక్తుల సాంగత్యము తప్పక వృద్ధి కావించు కోవలెనని కపిలముని తన తల్లియగు దేవహూతికి ఇచ్చట ఉపదేశించు చున్నాడు. భగవద్గీత(15.5) యందు ఇట్లు తెలుపబడినది: *“నిర్మానమోహా జితసంగదోషాః”* భౌతికసంపత్తి వలన కలిగెడి గర్వము నుండి పూర్తిగా విడివడి యున్నవానిని ఇది సూచించును. ఎవరేని మనుజుడు భౌతికముగా ధనవంతుడు, వైభవోపేతుడు లేదా గౌరవనీయుడు కావచ్చును; అయినను భగవద్రాజ్యమునకు అతడు చేరగోరునేని భౌతిక సంపత్తి వలన కలిగెడి గర్వము నుండి పూర్తిగా విడివడవలెను. ఏలయన అది మిథ్యాప్రతిష్ఠయై యున్నది.

ఒకానొకడు ధనవంతుడనని లేదా దరిద్రుడననే మిథ్యాభావనతో తలచుటయే ‘మోహము’ అను పదమునకు ఇచ్చట భావమై యున్నది. ఒకడు గొప్ప ధనవంతుడు లేదా మహాదరిద్రుడు(లేదా భౌతిక పరిస్థితికి సంబంధించిన అటువంటి ఏదో ఒక భావన) అనెడి ఈ భౌతిక జగమందలి భావన మిథ్యయే; ఏలయన ఈ దేహమే మిథ్య లేదా తాత్కాలికమై యున్నది. భవబంధము నుండి ముక్తినొంద సిద్ధపడినట్టి పవిత్రాత్ముడు మొట్టమొదట త్రిగుణ సంపర్కము నుండి బయట పడవలెను. ఆ త్రిగుణ సాంగత్య కారణముననే ప్రస్తుతము మన చైతన్యము కలుషితమై యున్నది. కనుకనే భగవద్గీత యందు ఇదే సూత్రము తెలుపబడినది: *“జితసంగదోషాః”* – ప్రతియొక్కడు త్రిగుణసంపర్కము నుండి విడివడవలెను. శ్రీమద్భాగవత మందును ఇచ్చటను ఇదే ధ్రువీకరింపబడినది : భగవద్ధామమునకు

చేరుటకు సిద్ధపడుచున్న విశుద్ధభక్తుడు త్రిగుణ సంపర్కము నుండి కూడ విడివడును. అటువంటి భక్తుల సాంగత్యమునే మనము కోరవలెను. దానికొరకే మేము అంతర్జాతీయ కృష్ణచైతన్య సంఘమును ప్రారంభించితిమి. ఒక ప్రత్యేకమగు విద్యను లేదా చైతన్యమును వృద్ధిచేయుటకు మానవ సంఘమున వ్యవసాయక, వైజ్ఞానికాధి సాంగత్యము పెక్కు ఉన్నప్పటికినీ భౌతిక సాంగత్యము నుండి మనుజుడు విడివడుటకు దోహదపడు వ్యవస్థ మాత్రము లేదు. భౌతిక సాంగత్యము నుండి ముక్తుడు కాగలిగే స్థితికి ఎవరైనా అరుదెంచినచో కృష్ణచైతన్యములోని భక్తుల సాంగత్యమును కోరవలసి యుండును. దానిద్వారా అతడు సమస్త భౌతిక సాంగత్యము నుండి విడివడగలడు.

కలుషితమైనట్టి సమస్త భౌతిక సాంగత్యము నుండి విడివడియున్న కారణమున భక్తుడు భౌతిక అస్తిత్వపు క్లేశములచే ప్రభావితుడు కాలేడు. అతడు భౌతికజగత్తు నందు ఉన్నట్లుగా గోచరించినప్పటికినీ అతడు భౌతిక క్లేశములచే ప్రభావితుడు కాబోడు. అది ఎట్లు సాధ్యపడును? పిల్లి చేసే కార్యక్రమాలు దీనికి ఒక చక్కని ఉదాహరణ కాగలదు. పిల్లి తన కూనలను నోటి యందు కరుచుకొని తీసికొని పోవుచుండును; ఎలుకను చంపునప్పుడు కూడ దానిని తన నోటితోనే పట్టుకొని పోవును. ఆ విధముగా రెండును పిల్లి నోటిలోనే ఉన్నప్పటికిని అవి ఉండే పరిస్థితులు భిన్నముగా నుండును. పిల్లికూనలు తమ తల్లినోటిలో ఆనందమును పొందియుండగా, పిల్లినోటిలో చిక్కిన ఎలుక మృత్యుబాధ ననుభవించును. అదేవిధముగా భగవంతుని కొరకు భక్తియుక్త సేవలో నియమింప బడిన భక్తులు*(సాధవః)* కూడ భౌతిక క్లేశముల ననుభవించరు; కాని కృష్ణ చైతన్యములో భక్తులు కానట్టివారు మాత్రము భౌతిక క్లేశములను నిజముగా అనుభవింతురు. కనుక మనుజుడు లౌకికుల సాంగత్యమును త్యజించి, కృష్ణచైతన్యములో నిమగ్నులైన వారి సాంగత్యమును కోరవలెను. అటువంటి సాంగత్యము ద్వారా అతడు ఆధ్యాత్మిక పురోగతిని బడయగలడు. ఆ మహాత్ముల ఉపదేశములు, వచనముల ద్వారా అతడు భౌతిక అస్తిత్వము నెడ తనకు గల ఆసక్తిని ఖండించు కొనగలడు.

ప్రత్యేకించి, ఈ కలియుగములో ప్రమాదకరమైన రజో తమో గుణముల ప్రభావమెంతో ఉంటుంది. ఈ యుగంలో ప్రతిఒక్కరు భోగవాంఛ, లోభము మరియు అజ్ఞానము వలన కలుషితులై ఉన్నారు. సత్త్వగుణమనేది ఈ కలియుగములో కనిపించకుండ పోవునని శాస్త్రములలో చెప్పబడినది.

భగవద్గీతలోని పదునాలుగవ అధ్యాయములో భౌతిక గుణముల నుండి కల్మషముల నుండి ఎలా తప్పించుకోగలమో చక్కగా వివరించబడినది. "జననీ, భౌతిక ప్రకృతి కలుషితముల నుండి నీవు విముక్తి పొందదలిచినచో సాధు సాంగత్యమును తీసుకోవలెను" అని కపిలదేవుడు ఇప్పుడు ఉపదేశిస్తున్నాడు.

నిజానికి, ప్రతిఒక్కరు ఏదో ఒకదాని పట్ల ఆసక్తిని కలిగి ఉన్నారు. మరియు ఎవరూ భౌతికాసక్తుల నుండి విముక్తుల మయ్యామని చెప్పలేరు, మాయావాద మరియు బౌద్ధుల తత్త్వము మనలను ఆసక్తుల నుండి విముక్తులు కావాలని చెబుతుంది. కాని ఇది అసాధ్యం. బాలుడు వివిధ రకాల ఆటలలో ఆసక్తిని కనపరుస్తుంటాడు. కాని క్రమముగా అతని ఈ ఆసక్తిని పాఠశాల వైపునకు మరల్చ వలెను. ఆసక్తులను విడుచుటకంటే దానిని మరో వైపునకు ఎలా మరల్చ వలెనన్నదే ప్రశ్న. కేవలము బంధములను అంతము చేయుటకు ప్రయత్నించినచో అతడు పిచ్చివాడైపోవును. ఆసక్తి స్థానంలో మరొక దానిని సమకూర్చవలెను. ఉదాహరణకు మా శిష్యులకు మేము మాంసాహారమును తినకూడదని ఆదేశిస్తాము. కాని ఈ మాంసాహారమును తినుటను ఎలా అపివేయుట? మాంసాహార స్థానములో కచోరిలు, రసగుల్లాలు, మరియు ఇతర రుచికర పదార్థములను అందించవలెను. ఈ విధముగా వైరాగ్యమనేది సాధ్యపడును. మొదట కనిష్ఠ ఆసక్తులను అంతము చేసుకొని దానిస్థానములో ఉన్నతమైన ఆసక్తులను ఏర్పరుచుకోవాలి. జీవులను బలవంతము చేయకూడదు. దీనిని క్రమముగా చేయవలెను. బాలుడు ఏదోఒక ఆసక్తిని కలిగి ఉండవచ్చును, కాని ఆ ఆసక్తి స్థానములో మరొక దానిని ఏర్పచుట ద్వారా ఆసక్తులను మార్చగలము. ఏదోవిధముగా మన చైతన్యము కలుషితమై ఉండెను. మనమిప్పుడు దానిని శుద్ధిపరిచినచో, కృష్ణచైతన్యమనేది సహజముగానే ఉదయించి జాగృతమగును.

కృష్ణ చైతన్యమనేది మన స్వాభావిక చైతన్యము, కాని ఇది ఏదో విధముగా భౌతిక ఆసక్తుల చేత కప్పబడినది. భౌతిక ఆసక్తి నుండి బయట పడుటమెలా మరియు శ్రీకృష్ణుని పట్ల ఆసక్తుల మయ్యేదెలా అనేదే ప్రశ్న. సాధుసంగ ప్రక్రియ అనేది సాధువు యొక్క సాంగత్యము. ఈ భౌతిక లోకములో మనకెన్నో ఆసక్తులు కలవు. కాని ఈ ఆసక్తులన్నింటినీ శూన్యము చేయలేము. కాబట్టి కేవలము వీటిని మనం శుద్ధి చేయవలెను. కన్నుకు రోగం వచ్చినచో దానిని తొలగించ వలెనని కొందరంటారు. కాని ఇది సరైన చికిత్స కాదు. చికిత్స అంటే రోగమును తొలగించడము. కంటిలో శుక్లము ఏర్పడినచో ఆ శుక్లమును ఏదోవిధముగా

తొలగించినచో మన కంటి చూపు తిరిగి మెరుగుపడును. మనకెన్నో కోరికలు కలవు, కాని ఈ కోరిక లనన్నింటిని మనం శ్రీకృష్ణుని సేవవైపునకు మరల్చవలెను. ఉదాహరణకు, "మీరు డబ్బు సంపాదనలో అసక్తిని కలిగి ఉండవచ్చు." "సరే, మీరు మీ వ్యాపారమును కొనసాగించండి. దీంట్లో ప్రమాదమేమి లేదు. కేవలము మీరు నాకు ఫలితాలను అర్పించండి" అని శ్రీకృష్ణుడు చెబుతున్నాడు. భగవద్గీత (9.27)లో చెబుతున్నట్లుగా :

యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్
యత్తపస్యసి కౌన్తేయ తత్కురుష్వ మదర్పణమ్

"ఓ కౌంతేయా! నీవు దేనిని చేయుదువో, దేనిని తిందువో, హోమము చేయునప్పుడు దేనిని ఆహుతిగా ఇచ్చెదవో, దేనిని దానము చేయుదువో, నీవు ఏ తపస్సును చేయుదువో, వాటినన్నింటిని నాకు అర్పణము చేయుము."

ఇది భక్తియోగ ప్రారంభము. మనము కనుక వ్యాపారమును నడిపిస్తూ దాని ద్వారా ధనమును ఆర్జించినచో, దానిని శ్రీకృష్ణుని సేవ కొరకు వినియోగించ వలెను. ఇది భక్తి కళ. దీనికి మరో ఉదాహరణ యోధుడైన అర్జునుడు. అతడు యుద్ధం చేయుట వలన భక్తుడయ్యెను. హరేకృష్ణ జపం చేయుటవలన కాకుండ కురుక్షేత్రములో యుద్ధము చేయుట వలన భక్తుడయ్యెను. అర్జునుడు వైష్ణవుడై నందున శ్రీకృష్ణుడు అతడిని యుద్ధం చేయుమని చెప్పినప్పుడు మొదట అతడు సంకోచించెను. వైష్ణవుడు దేనిని చంపుటకు ఇష్టపడడు. కాని శ్రీకృష్ణుడు ఆజ్ఞాపించినచో, యుద్ధం తప్పక చేయవలెను. వైష్ణవుడు సాధారణముగా యుద్ధం చేయుటకు ఇష్టపడడు. ఎందుకనగా వైష్ణవుడైనవాడు స్వభావరిత్యా ఎవరికి హానిని కలిగించడు. అయినను, శ్రీకృష్ణుడు ఏదైన ప్రత్యేక కార్యమును చేయదలిచినచో వైష్ణవుడైనవాడు దానిని తెలిసికొని, తమ స్వంత ఆలోచనలను త్రోసిపుచ్చును. ఏ సందర్భము లోనైనను, ప్రతిఒక్కరు ఏదోరకమైన స్వధర్మమును కలిగి ఉన్నారు. శ్రీకృష్ణుని ఆరాధనగా మనోవృత్తిని కొనసాగించినచో మన జీవితము పరిపూర్ణ మగును. శ్రీమద్భాగవతము(1.2.13) కూడ దీనినే ఆదేశించెను :

అతః పుంభిర్ద్విజశ్రేష్ఠా వర్ణాశ్రమవిభాగశః
స్వనుష్ఠితస్య ధర్మస్య సంసిద్ధిర్హరితోషణమ్

"ఓ ద్విజశ్రేష్ఠులారా! కనుకనే శ్రీకృష్ణభగవానునికి ముదమును గూర్చుటయే వర్ణాశ్రమ

పద్ధతి ననుసరించి మనుజుడు తన స్వధర్మమునకు నిర్దేశింపబడిన కర్మలను ఒనరించుట ద్వారా సాధించెడి అత్యున్నత సంసిద్ధియని నిర్ణయింప బడినది.”

పూర్వం వర్ణాశ్రమ వ్యవస్థ చక్కగా అమలులో ఉండెడిది, ప్రతిఒక్కరు సంఘములో వారి స్థితి ననుసరించి వివిధ వృత్తులను కలిగి ఉండిరి. ప్రస్తుతము వృత్తిపనులు విస్తరించ బడినవి. కాని ఒకరు కనుక ఇంజనీరు, వైద్యుడు, లేదా మరెవరైనను తమ పనుల ఫలితములను శ్రీకృష్ణునికి సమర్పించుట వలననే సేవ చేయగలుగుదురు. దానినే భక్తి అంటారు. జనులను వారి పనుల నుండి తప్పించుట కృష్ణచైతన్య ఉద్యమ సిద్ధాంతము కాదు. మనము మన వృత్తిధర్మాలలో నియమింప బడినను శ్రీకృష్ణుడిని విస్మరించరాదు. ఎల్లప్పుడు కృష్ణచైతన్యమును కలిగి ఉండాలని శ్రీకృష్ణుడు ఆదేశిస్తున్నాడు. కాబట్టి శ్రీకృష్ణుని కొరకు మనము పని చేయుచున్నామని ఎల్లప్పుడు భావించవలెను. మనకు మనం తోచినట్లుగా కాకుండ శ్రీకృష్ణుని మరియు అతని ప్రతినిధి ఆదేశాల ననుసరించి నడచుకోవలెను. మనం వ్యర్థ కార్యములను చేస్తూ, “నేను శ్రీకృష్ణుని కొరకై ఆచరిస్తున్నాను” అని భావించుటమనేది అంగీకరించ బడదు. ఆ కార్యం శ్రీకృష్ణుని లేదా అతని ప్రతినిధి ద్వారా అంగీకరించ బడవలెను. శ్రీకృష్ణుని ఆజ్ఞానుసారమే అర్జునుడు యుద్ధం చేసెను. అలాగే మనం కూడ శ్రీకృష్ణుని ఆదేశాలను పాటించవలెను. “నేను శ్రీకృష్ణుడిని ప్రత్యక్షముగా దర్శించుట లేదు, మరెలా అతడి ఆదేశములను అనుసరించ గలను?” అని మనం భావించవచ్చును. శ్రీకృష్ణుని ప్రతినిధులు సాధువులు శ్రీకృష్ణుని ఆజ్ఞలను పాటించుటయే సాధుధర్మం. కనుక కపిల దేవుడు తన తల్లి దేవహూతికి వారి సాంగత్యమును తీసుకో వలసినదిగా ఉపదేశిస్తున్నాడు.

మేము సాధు లక్షణములను వివరించాము. సాధువును అతడి లక్షణములను బట్టి అంగీకరించవలెను. ఎవరైనను దారిలో కనిపించి, “నేను సాధువును” అని తెలిపితే అంగీకరించుమని కాదు. సాధులక్షణములు అతడిలో ఉండవలెను. అదేవిధముగా, ఎవరైనను “తాను భగవంతుడను” అని చెప్పినచో మనం విశ్వసించ రాదు. శాస్త్రములలో భగవంతుడి లక్షణములు చెప్పబడెను. కృష్ణభక్తిలో సాధు సాంగత్యము ఎంతో అవసరము. ప్రజలు తమోగుణ మరియు రజోగుణ కలుషితముల చేత దుఃఖములకు గురవుతుంటారు. సత్త్వగుణములో శౌచం, మనస్సు నియంత్రణ, ఇంద్రియ నియంత్రణ, నిరాడంబరత, పరిపూర్ణ సహనము, మరియు పరిపూర్ణ విశ్వాసము అనునవి కొన్ని లక్షణములు. అలాగే జ్ఞానములో ఎలా స్థిరుడై ఉండవలెనను దానిని సాధువు బోధించును.

"నేను త్రాగనిచో పిచ్చివాడనగుదును" అని ఆలోచించుట కన్నను, "నేను సాధు సాంగత్యమును చేయకపోయినచో పిచ్చి వాడనగుదును" అని ఆలోచించాలి. ఈ విధంగా ఆలోచించిననాడు మనం ముక్తిని పొందగలము. ప్రపంచములోని ప్రతిగ్రామంలో కృష్ణచైతన్యపు కేంద్రములు నెలకొల్పబడాలనీ, దానితో జనులు సాధువుల సాంగత్యములో వారు కూడ సాధువు లయ్యెదరని శ్రీ చైతన్య మహాప్రభువు తెలిపిరి. కాబట్టి ఇదే కృష్ణచైతన్య సంఘపు ఉద్దేశ్యము. మనం కొంత తపమును ఆచరించవలెను. ప్రారంభములో, అక్రమ సంభోగము, మత్తుపదార్థములు, మాంసాహారము మరియు జాదములను విడుచుట కొద్దిగా కష్టమని పించినను దానిని సహించవలెను. రోగము నుండి విముక్తి పొందాలంటే, శస్త్రచికిత్సను అంగీకరించ వలసి ఉంటుంది. శస్త్రచికిత్స అనేది బాధాకరముగా ఉన్నను దానిని సహించవలిసి ఉంటుంది. దీనినే *'తితిక్షవః'* అంటారు. అదే సమయములో, దయతో పతితులైన వారికి కృష్ణ చైతన్యములో జ్ఞానోదయమును కలిగించుటకు ఒక గ్రామము నుండి మరో గ్రామమునకు వెళ్ళవలెను. దానినే *'కారుణికాః'* అంటారు. ఇది సాధుధర్మం. హిమాలయాలలో తపమును ఆచరించే వారికన్నను భక్తిప్రచారకులు శ్రేష్ఠులు. స్వప్రయోజనార్థము హిమాలయాలకు వెళ్ళి తపస్సును ఆచరించుట మంచిదే, కాని ప్రచారము చేయుచున్నప్పుడు ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొనే వారు వారికన్నను ఎంతో శ్రేష్ఠమైనవారు. నిజానికి వారు శ్రీకృష్ణుని కొరకు యుద్ధం చేయుచున్నారు. కాబట్టి వారు ఖచ్చితముగా అధికమైన దయను కలిగినట్టివారు. వృందావనమును విడిచి ఈ లోకంలో కృష్ణ చైతన్యమును ప్రచారము చేయుట కొరకు యుద్ధం చేసే సాధువులు ఉన్నతమైనవారు. ఇది భగవద్గీత (18.68,69)లో శ్రీకృష్ణుని అభిప్రాయము :

య ఇదం పరమం గుహ్యం మద్భక్తేష్వభిధాస్యతి
భక్తిం మయి పరాం కృత్వా మామేవైష్యత్యసంశయః

"ఈ ఉత్తమమైన రహస్యమును భక్తులకు వివరించువానికి విశుద్ధ భక్తియుక్త సేవ తప్పక లభించును. చివరి కాతడు తిరిగి నాకడకే వచ్చును."

న చ తస్మాన్మనుష్యేషు కశ్చిన్మే ప్రియకృత్తమః
భవితా న చ మే తస్మాదన్యః ప్రియతరో భువి

"నాకు అతనికంటెను ప్రియుడైన సేవకుడు మరొక్కడు ఈ ప్రపంచమున లేదు.

అతనికంటె ప్రియతరుడింకొక డుండబోడు."

శ్రీకృష్ణుని చేత వెంటనే గుర్తించబడవలెననిన మనం వెంటనే ప్రచారకులము కావలెను. ఇదే శ్రీ చైతన్య మహాప్రభు సందేశము. మనం భారతదేశములోనే ఉండిపోకుండ ప్రపంచమంతటా ప్రయాణిస్తూ కృష్ణచైతన్యమును ప్రచారము చేయవలెను. సాధువును 'సుహృత్' అంటారు. అనగా అతడు అందరికి శ్రేయోభిలాషి. అతడు కేవలము భారతీయులకే శ్రేయోభిలాషి అని అర్థం కాదు. అతడు పిల్లి, కుక్క జీవులన్నింటికి శ్రేయోభిలాషి. భక్తుడు ప్రసాదము ద్వారా కుక్క, పిల్లులకు సైతం లాభమును చేకూర్చాలను కుంటాడు. బెంగాలు నుండి భక్తులు శ్రీ చైతన్య మహాప్రభువును జగన్నాథపూరిలో కలుసుకొనుటకు వెళ్ళుచున్నప్పుడు ఒక కుక్క వారిని అనుసరించినది. మరియు ఆ గుంపునకు నాయకుడైన శివానంద సేన ఆ కుక్కకు ప్రసాదమును ఇవ్వసాగెను. అంతేకాకుండ వారు నదిని పడవలో దాటవలసి వచ్చినప్పుడు, పడవ నడిపేవాడు కుక్కను పడవలోకి ఎక్కించుకొనుటకు అంగీకరించనప్పుడు, "ఈ కుక్క కూడ వైష్ణవుడు, ఇది మమ్ములను అనుసరిస్తూ వచ్చినది. దీనిని ఎలా వదిలి వేయగలము?" కాబట్టి దీనిని కూడ తమవెంట తీసుకు వెళ్ళవలెనని అర్థించి అతడికి ఎక్కువ డబ్బును చెల్లించాడు. శ్రీ చైతన్య మహాప్రభువు స్వయముగా ఆ కుక్కకు కొద్దిగా తన ఉచ్ఛిష్టాన్నమును అంధించెను. ఈ విధముగా కుక్క వైకుంఠమును చేరుకున్నది.

సాధువు అందరికి శ్రేయోభిలాషియే కాకుండ, అతడు ఎవరికిని శత్రువు కాడు. అతడు 'శాంత'చిత్తుడు. ఇవన్నీ సాధువు యొక్క ప్రాథమిక లక్షణములు. అతడు శ్రీకృష్ణుని పట్ల తప్ప ఇతరులెవరితోను అనుబంధమును కలిగి ఉండడు. '*మయ్యనయ్యేన భావేన.*' ఇవన్నీ భక్తుని అంతరంగిక మరియు బహిరంగ లక్షణములు. భక్తుడు ఇతర దేవతలను గౌరవించును. ఎందుకనగా, శ్రీకృష్ణునితో వారికి గల సంబంధమును గురించి అతడికి తెలుసును. 'బ్రహ్మ సంహిత'(5.44)లో దుర్గాదేవి శ్రీకృష్ణుని బహిరంగ శక్తిగా లేదా శక్తిగా పూజింపబడెను :

సృష్టిస్థితిప్రళయసాధనశక్తిరేకా
ఛాయేవ యస్య భువనాని బిభర్తి దుర్గా
ఇచ్ఛానురూపమపి యస్య చ చేష్టతే సా
గోవిందమాదిపురుషం తమహం భజామి

"చిచ్ఛక్తి యొక్క ఛాయా స్వరూపమైన మాయాశక్తియే 'దుర్గ' అను నామముతో

అందరిచేత పూజలందు కొనుచున్నది. ఈ జడ జగత్తు యొక్క సృష్టి స్థితి పాలనకు ఆమెయే సాధనాశక్తి. ఆమె, ఆదిపురుషుడైన గోవిందుని ఇచ్ఛానుసారము ఈ కార్యములను నిర్వహిస్తున్నది. అట్టి గోవిందుని నేను భజించుచున్నాను."

దుర్గాదేవి ఎంతటి శక్తివంతురాలంటే అవిడ సృష్టి స్థితి మరియు ప్రళయములను కూడ చేయగలదు. అయినను ఆవిడ శ్రీకృష్ణుని ఆజ్ఞలేకుండ స్వతంత్రముగా నడుచుకోదు, అవిడ శ్రీకృష్ణుని ఛాయ వంటిది. మరియు శ్రీకృష్ణుని నిర్దేశకత్వంలో ప్రకృతి నడుచునని సాధువుకు తెలుసును. అలాగే ఒక రక్షకభటుడు కూడ తాను స్వతంత్రముగా కాకుండ ప్రభుత్వ ఆదేశాలకు లోబడి పని చేయు చున్నాడని తెలుసును. కాబట్టి స్వల్ప అధికారము కలిగిన రక్షకభటునకు ఈ జ్ఞానముండినచో తాను భగవంతుడ నయ్యానని భావించడు. అలాకాదు. భగవంతుడు అనేవాడు అంత చౌకకాదు. భగవంతుడు అనంతమైన శక్తులను కలిగినట్టివాడు. వాటిలో దుర్గ ఒకటి. అంతేకాని ఆవిడే సర్వం కాదు, ఎందుకనగా ఎన్నోకోట్ల శివులు మరియు ఎన్నో కోట్ల విశ్వము లున్నట్లుగా ఎన్నోకోట్ల దుర్గలు కూడ కలరు. కొన్నికోట్ల దేవతలు ఉన్నను భగవంతుడు మాత్రం ఒక్కటే. భగవంతుడు కోట్ల రూపములుగా విస్తరించును. కాని అది మరో విషయము. దేవతలను సర్వశక్తి మంతులని కాకుండ, వారిని దేవాదిదేవుని సేవకులని భక్తులు గౌరవింతురు. భగవంతుడంటే తెలియనివారు దేవతలను భగవంతునిగా కొలుస్తుంటారు. అటువంటివారు బుద్ధిహీనులు. భక్తుడు దేవతలను గౌరవించును, కాని అతడికి తెలుసును శ్రీకృష్ణుడే భగవానుడు అని. "*కృష్ణస్తు భగవాన్ స్వయమ్.*" నిజానికి సాధువు, వైష్ణవుడు ప్రతిఒక్కరిని గౌరవించును. అంతేకాకుండ అతడు బంధువులను, మరియు సమస్తమును కృష్ణసేవకై త్యజించుటకు సిద్ధంగా ఉండును. సాధువు శ్రీకృష్ణుని గురించి శ్రవణము చేయుటలో మరియు చర్చించుటలోనే అత్యధిక ఆనందమును పొందును.

శ్రీకృష్ణుడు ఎన్నో లీలలను చేసెను. అతడు రాక్షసులతో యుద్ధం చేసి వారిని సంహరించును, గోపికలతో లీలలు చేయును, వృందావనములో గోపబాలునిగా, ద్వారకలో రాజుగా లీలలు చేయును. శ్రీకృష్ణునికి సంబంధించిన ఎన్నోగ్రంథములు కలవు. ఈ చైతన్య ఉద్యమము కృష్ణకథల నెన్నింటినో ప్రచురించినది. శ్రీకృష్ణుడు బోధించిన భగవద్గీతనే కాకుండ ఇతర గ్రంథములను కూడ మనము అధ్యయనము చేయవచ్చును, ఈ విధముగా సాధువయ్యేందుకు గల కళను అభ్యసించ వచ్చును. కేవలం శ్రీకృష్ణుని గూర్చి శ్రవణము చేయుట

మరియు అతని గురించి చర్చించుట ద్వారానే వెంటనే భౌతిక స్థితి బాధల నుండి మనము విముక్తిని పొందగలము.

ఈ శ్లోకములో చెబుతున్నట్లుగా :

త ఏతె సాధవః సాధ్వి సర్వసంగవివర్జితాః

భౌతిక ఆసక్తుల నుండి విముక్తి పొందినప్పుడు, ఈ లక్షణములు మనలో కనిపించును. సాధువనేవాడు తాను హిందువు, ముస్లిము, క్రైస్తవునిగా అమెరికన్‌గా, భారతీయుడుగా ఇలా మరేదోనని భావించడు. "నేను శ్రీకృష్ణుని సేవకుడను" అని మాత్రమే సాధువు భావించును. "నేను బ్రాహ్మణుడను గాని, క్షత్రియుడను గాని, వైశ్యుడనని గాని, శూద్రుడనని గాని బ్రహ్మచారినని గాని మరేదో మరొకటి కాదని, నేను కేవలం శ్రీకృష్ణుని యొక్క దాసుని దాసుని యొక్క దాసుడను" అని శ్రీ చైతన్య మహాప్రభు తెలిపెను. ఎవరైనను ఉత్తమోత్తమమైన మానవసేవ చేయదలచినచో ఈ ప్రక్రియను అభ్యసించవలెను.

అధ్యాయము 12
శ్రవణము ద్వారా భగవంతునితో సాంగత్యము

శ్లోకము 25

సతాం ప్రసంగాన్మమ వీర్యసంవిదో
భవన్తి హృత్కర్ణరసాయనాః కథాః
తజ్జోషణాదాశ్వపవర్గవర్త్మని
శ్రద్ధా రతిర్భక్తిరనుక్రమిష్యతి

విశుద్ధభక్తుల సాంగత్యమునందు దేవాదిదేవుని దివ్యలీలల చర్చ హృదయమునకు, కర్ణమునకు మిగుల ప్రీతికరముగను, సంతుష్టికరముగను ఉండును. అట్టి జ్ఞానాభ్యాసము ద్వారా మనుజుడు క్రమముగా ముక్తి పథమున పురోగమించును; ఆ పిదప అతడు ముక్తుడై, వాటి యెడ అతని అకర్షణ సుస్థిరమగును. తదనంతరమే నిజమైన భక్తి, భక్తియుక్త సేవ ఆరంభమగుచున్నవి.

భాష్యము : కృష్ణ చైతన్యములో మరియు భక్తియుక్త సేవయందు పురోగమించు విధానము ఇచ్చట వర్ణింపబడినది. దానియందు మొదటి విషయమేమనగా కృష్ణచైతన్యవంతులై భక్తియుక్త సేవ నందు నెలకొనినవారి సాంగత్యమును మనుజుడు కోరవలెను. అట్టి సాంగత్యము లేకుండ అతడు పురోగమింప జాలడు. కేవలము సిద్ధాంతపర జ్ఞానము లేదా విద్య ద్వారా ఎవ్వరును గణనీయమగు పురోగతిని బడయజాలరు. కనుక మనుజుడు లౌకికుల సాంగత్యమును త్యజించి, భక్తుల సాంగత్యమును కోరవలెను. ఏలయన భక్తుల సాంగత్యము లేనిదే ఎవ్వరును భగవానుని లీలలను అవగతము చేసికొనజాలరు. సాధారణముగా జనులు పరమసత్యపు నిరాకార లక్షణమునే ఎరిగియుందురు. భక్తులతో సాంగత్యము నెరుపని కారణమున పరమసత్యము రూపసహితుడని, దివ్యలీలలను కలిగి యున్నాడని వారెరుగజాలరు. ఇది చాలా జటిలమైన విషయము; పరమ సత్యము రూపలక్షణ అవగాహన లేనిదే భక్తి అనుదానికి అర్థమే ఉండదు. ఏదో నిరాకారము నకు సేవను లేదా భక్తిని చేయజాలము. సేవ నొనర్చునది రూపసహితుడైన వానికే. భగవత్కర్మలు వర్ణితమై యుండు శ్రీమద్భాగవతమును గాని, ఇతర వేద వాఙ్మయమును గాని పఠించినప్పుడు అభక్తులు కృష్ణచైతన్యమును

ప్రశంసింపజాలరు; ఆ లీలలన్నియును కేవలము కల్పితకథలని వారు భావింతురు. ఆధ్యాత్మికతను గురించి వారికి సరియైన భావనలో వివరింపబడక పోవుటయే అందులకు కారణము. భగవానుని లీలల నెరుగుటకు మనుజుడు భక్తుల సాంగత్యమును కోరవలెను; అటువంటి సాంగత్యము ద్వారా అతడు భగవానుని దివ్యకర్మలను ధ్యానిస్తూ వాటిని అవగతము చేసికొన యత్నించినప్పుడు ముక్తిద్వారము తెరువబడి మోక్షమును బడయును. దేవాదిదేవుని యందు దృఢమగు శ్రద్ధ కలిగినవాడు సుస్థిరుడగును; భగవానుని యెడ, భక్తుల యెడ సాంగత్యముకై అతని ఆకర్షణ మెండగును. భక్తుల సాంగత్యమనగా భగవానుని సాంగత్యమనియే భావము. అట్టి సాంగత్యమును నెరిపినవాడు భగవత్సేవాభావమును వృద్ధిపరుచుకొనును. పిదప దివ్యమగు భక్తియుక్త సేవా స్థితియందు అతడు క్రమముగా పరిపూర్ణత్వమును బడయును.

శ్లోకము 26

భక్త్యా పుమాన్ జాతవిరాగ ఐంద్రియా –
ద్దృష్టశ్రుతాన్మద్రచనానుచిన్తయా
చిత్తస్య యత్తో గ్రహణే యోగయుక్తో
యతిష్యతే ఋజుభిర్యోగమార్గైః

ఆ విధముగా భక్తుల సాంగత్యములో ఎరుకతో భక్తియుక్త సేవలో నియుక్తుడై భగవత్ లీలలనే నిరంతరము చింతించుట ద్వారా మనుజుడు ఇహపర సౌఖ్యము లందు రుచిని కోల్పోవుదురు. ఈ భక్తియోగ విధానమే సులభతరమగు యోగపద్ధతి. భక్తియోగ పథమునందు నిజముగా నెలకొనినప్పుడు మనుజుడు మనస్సును నియంత్రింప గలుగును.

భాష్యము : ఈ జన్మమునందే గాక తదుపరి జన్మమందును సౌఖ్యమును బడయుటకై పుణ్యకర్మాచరణము కావింపుమని సర్వశాస్త్రములందు జనులకు బోధించబడినది. ఉదాహరణకు పుణ్యకర్మల ద్వారా మనుజుడు నిక్కముగా స్వర్గలోకమున కేగునని చెప్పబడినది. కాని భక్తుల సాంగత్యము నందున్న భక్తుడు మాత్రము భగవత్ లీలలను, అనగా అతడు ఈ విశ్వమును ఏ విధముగా సృష్టించెను, ఏ విధముగా దీనిని పోషిస్తుండెను, ఏ విధముగా విశ్వము లయించిపోవును, భగవద్ధామమున భగవల్లీలలు ఏ విధముగా కొనసాగుచుండు ననెడి విషయమును ధ్యానించుటనే

కోరును. ఈ భగవత్ లీలలను వర్ణించు గ్రంథములు ఎన్నో కలవు; వానిలో ముఖ్యమైనవి భగవద్గీత, 'బ్రహ్మ సంహిత', శ్రీమద్భాగవతము అనునవి. భక్తుల సాంగత్యమును పొందు శ్రద్ధావంతుడగు భక్తుడు ఆ భగవల్లీలా విషయమును శ్రవణము చేయుటకు మరియు స్మరించుటకు అవకాశమును బడయును; దాని ఫలితమేమనగా అతడు మర్త్యలోకపు, స్వర్గలోకపు సౌఖ్యములని పిలువబడే దానిపట్ల రుచిని కోల్పోవును. అనగా భక్తులు కేవలము భగవానుని సన్నిహిత సాంగత్యమును బడయుట యందే అభిరుచిని కలిగియుండి, తాత్కాలికమగు నామమాత్ర సౌఖ్యము నెడ ఆకర్షణను కోల్పోవుదురు. యోగయుక్తుడైన వాని స్థితి ఇదియే. యోగమునందు సుస్థాపితుడైన వాడు ఈ లోకపు లేదా స్వర్గలోకపు ఆకర్షణలచే విచలితుడు కాబోడు. కేవలము ఆధ్యాత్మిక విషయములందే అతడు అనురక్తుడై యుండును. ఇటువంటి ఉదాత్తమగు స్థితి భక్తియోగమనెడి సులభవిధానము ద్వారా అత్యంత సులభముగా లభించగలదు. *'ఋజుభిర్యోగమార్గైః.'* – *'ఋజుభిః'* (అతిసులభము) అనెడి పదము ఇందులో ఎంతో చక్కగా అమరినది. యోగ పరిపూర్ణత్వమును బడయుటకు అనేక విధములగు యోగమార్గము లున్నను భక్తియుక్త సేవ యనెడి ఈ విధానము అతి సులభమైనదై యున్నది. ఈ విధానము సులభమైనదే గాక, దీనివలన కలిగే ఫలితము కూడ ఉదాత్తమై యున్నది. కనుక ప్రతియొక్కరు ఈ కృష్ణచైతన్య విధానమును చేపట్టి జీవితపు అత్యున్నత పరిపూర్ణత్వమునకు చేర యత్నించవలెను.

'సత్' అనగా 'నిత్యమైనది' మరియు *'అసత్'* అనగా 'అనిత్యమైనది', తాత్కాలికమైనది. భౌతికలోకం *'అసత్'*; అందుకే వేదాలు ఈ విధముగా ఘోషిస్తున్నాయి, *"అసతో మా సద్గమా"* – "ఈ భౌతిక లోకంలో ఉండరాదు." భౌతిక జీవన విధానంలో ఆసక్తి కలిగి ఉన్నవారిని కూడ *'అసత్'* అంటారు. వైష్ణవుడు ఎలా నడుచుకొనునని ప్రశ్నించినప్పుడు, శ్రీ చైతన్య మహాప్రభువు ఇలా సమాధాన మిచ్చారు, *"అసత్–సంగ త్యాగ్ ఏయ్ వైష్ణవ–ఆచార్"*– "భక్తుడైనవాడు *'అసత్'* సాంగత్యమును అనగా భౌతిక జీవితము పట్ల ఆసక్తి గలవారి *'అసత్'* సాంగత్యమును విడనాడును." (శ్రీ చైతన్య చరితామృతము, మధ్యలీల 22.87) భౌతిక విషయాలలో ఆసక్తి కలిగిన వారి *'అసత్'* సాంగత్యమును విడుచుట కోసమై ఈ సంఘమును మేము ఏర్పాటు చేశాము. మనం శ్రీకృష్ణునితో సాంగత్యము చేయుట వలన అతడికి సంబంధించిన విషయాలను మాత్రమే కాకుండ మరే ఇతర విషయాలను చర్చించుటలోను ఆసక్తిని కలిగి లేము. ప్రతిఒక్కరు ఏదోఒక విషయాలలో ఆసక్తిని కలిగి ఉంటారు. కాని మేము కృష్ణచైతన్య విషయాలలో

మాత్రమే ఆసక్తిని కలిగి ఉన్నాము. అయినను వారు భౌతిక ఇంద్రియ 'అసత్' తృప్తిపట్ల ఆధ్యాత్మిక ఆసక్తిని కలిగి ఉంటారు. ఇంద్రియతృప్తి యొక్క అంతం మైథున సుఖము.

ఇదేకాకుండ, 'హరిభక్తి విలాసము' అనే గ్రంథములో శ్రీల సనాతన గోస్వామి వైష్ణవ నడవడిక లేని వారి వద్ద నుండి భగవద్గీతను, పురాణములను, శ్రీమద్భాగవతమును, లేదా ఎటువంటి హరికథా శ్రవణమును చేయకూడదని తెలుపుచున్నాడు. అనగా శ్రీకృష్ణుడిని దేవాదిదేవునిగా అంగీకరించని మాయావాదుల నుండి శ్రవణము చేయకూడదని అర్థం. శ్రీకృష్ణుడిని పరమ పురుషుడని అంగీకరించ కుండ, ఎవరైనను ఎలా భగవద్గీతపై ప్రవచనము చేయుటకు సాహసిస్తారు? అలాంటి జనుల వ్యాఖ్యానాలను శ్రవణము చేయుట వలన మనము ఎటువంటి ప్రయోజనమును పొందలేము. మాయావాదుల నుండి భగవద్గీతను వందలకొద్ది సంవత్సరాలు శ్రవణము చేసినను శ్రీకృష్ణుడిని గురించి ఎప్పటికిని అర్థం చేసుకోలేము. అందుకే వైష్ణవులైన వారికి మాయావాదుల నుండి శ్రవణము చేయుటమనేది నిషేధించబడినది.

శ్రీహరి లేదా శ్రీకృష్ణుని యొక్క 'హరికథ' అనునది 'అమృతము'. ఎవరైనను సరియైన పరంపరలో దానిని శ్రవణము చేసినచో వారు 'అమృత' స్థితిని పొందుదురు *(సోఽ మృతత్వాయ కల్పతే).* 'మృత' అనగా 'చావు మరియు పుట్టుకలు' మరియు 'అమృత' అనగా 'చావు మరియు పుట్టకల సమాప్తి'. ఆధ్యాత్మిక జీవితమనగా జన్మ మృత్యు జరా వ్యాధులకు సమాప్తి పలుకుట. అమృతమును పొందుటమనగా చావు పుట్టుక వృద్ధాప్యము మరియు రోగముల నుండి విముక్తిని పొందుట. అదే ఆధ్యాత్మిక జీవితమునకు నిజమైన లక్ష్యము. భగవద్గీత(7.16) లో శ్రీకృష్ణభగవానుడు ఇలా చెబుతున్నాడు. ఒకరు పుణ్యవంతులైనప్పుడు ఆధ్యాత్మిక జీవితమనేది ప్రారంభమగును :

చతుర్విధా భజన్తే మాం జనాః సుకృతినోఽర్జున
ఆర్తో జిజ్ఞాసు రర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ

"భరతవంశ శ్రేష్ఠుడవైన అర్జునా! ఆపదలో నున్నవాడు, సంపద గోరువాడు, జ్ఞానమును వాంఛించువాడు, ఆత్మసాక్షాత్కారమును పొందినవాడు – ఈ నాలుగు రకములైన పుణ్యాత్ములును నాకు భక్తియుక్తమైన సేవ చేయదొడంగుదురు."

మనం కనుక నిజమైన పుణ్యవంతులుగా భక్తియుక్త జీవితమును అభివృద్ధి

చేసుకోదలచినచో, సాధుసాంగత్యమును శ్రద్ధగా తీసుకోవలెను. అప్పుడు మనం శ్రీకృష్ణుని యందు కొద్దిపాటి రుచిని పొందగలుగుతాము. శ్రీకృష్ణునికి సంబంధించిన కథలను సాధువులతో చర్చించినచో ఆ సంభాషణ ఎంతో ఆనందమును కలిగించును. అప్పుడు మనం కొంత రుచిని అభివృద్ధి చేసుకోగలము. దానినే 'రస' అంటారు. మనం దప్పికతో ఉన్నప్పుడు మంచి రుచికరమైన పానీయమును త్రాగినచో దాని నుండి రసమును అనుభవించ గలము. నీటిని త్రాగుచున్నప్పుడు తనను స్మరించుమని శ్రీకృష్ణుడు మనలను ఆదేశించాడు. దీనిలో ఎటువంటి కష్టము లేదు. అంతేకాదు, ఉదయము సూర్యప్రకాశమును చూచినప్పుడు కూడ అతడిని స్మరించాలని శ్రీకృష్ణుడు చెబుతున్నాడు. "నాకు మీరు భగవంతుని చూపించగలరా?" అని ఎందుకు ప్రశ్నిస్తుంటారు. భగవంతుడు స్వయంగా దర్శన మిస్తున్నాడు. ఎందుకు మీరు కళ్ళు మూసుకొని అతడిని చూచుటకు ప్రయత్నిస్తారు? అతడు ఇలా చెబుతున్నాడు, "నేను ఇది నేను అది" అని. అకస్మాత్తుగా మనము భగవంతుడిని దర్శించాలను కోరాదు, కాని సాధుసాంగత్యము ద్వారా అర్హతను పొందవలెను. జనులెందరో గొప్పగొప్ప విశ్వ విద్యాలయముల నుండి పట్టభద్రు లగుటకు ఉత్సాహమును చూపిస్తుంటారు. కాని భగవంతుని జ్ఞానం లేని విద్య కేవలము మాయ ప్రచారము యొక్క విస్తరణ మాత్రమే. మాయ చేత జ్ఞానం అపహరించబడుట చేత విశ్వవిద్యాలయములు భగవత్ చైతన్య మార్గములో అడ్డంకులను మాత్రమే కలిగించుచున్నవి. జీవాత్మ భౌతిక లోకంలోకి వచ్చినప్పుడు మాయచేత భ్రాంతి చెందును. అంతేకాకుండ ఈ ఆధునిక విద్య అనేది అతని భ్రాంతిని మరింతగా పెంచును. జీవుడు ఈ తాత్కాలికమైన భౌతిక జీవితమును ఆనందముగా గడుపుటకు ప్రయత్నిస్తూ తాను శ్రీకృష్ణుని శాశ్వత సేవకుడనని విస్మరించును. ఎవరైనను ఈ తాత్కాలిక జీవితములో ఆనందము గలదని భావించినచో, అతడి ఆనందము కేవలము భ్రమ. ఎందుకనగా, ఎవరు కూడ ఇక్కడ నివసిస్తూ ఆనందమును అనుభవించుటకు అనుమతించ బడలేదు. భక్తుల సాంగత్యములో ఈ విషయములను అర్థం చేసుకోవలెను. పరమ సత్యమైన శ్రీకృష్ణుడిని తెలుసుకున్నందున భక్తుడు సమస్తమును ఎరుగును.

వేదాంత దర్శనముకు లక్ష్యం ఏమిటి? 'వేద' అనగా జ్ఞానం మరియు 'అంత' అనగా 'చరమ' చరమ జ్ఞానమంటే ఏమిటి? భగవద్గీత(15.15)లో శ్రీకృష్ణుడు ఇట్లు చెబుతున్నాడు :

వేదైశ్చ సర్వైరహమేవ వేద్యో
వేదాన్తకృద్వేదవిదేవ చాహమ్

"వేదముల నన్నింటి చేతను నేనే తెలియ దగినవాడను. నిజమునకు వేదాంతమును కూర్చినవాడను, వేదములను తెలిసినవాడను నేనే."

మనం కనుక శ్రీకృష్ణుడు తెలిపినదానిని శ్రవణము చేసి అతడు ఏమిటి? అతడెవరు అను దానిని అర్థం చేసుకున్నచో, మనం వేదాంతమును సరిగ్గా అర్థం చేసుకోగలిగినట్లు అర్థం. శ్రీకృష్ణుడిని అర్థం చేసుకోకుండ వేదాంతులమని ప్రచారము చేసుకున్నచో మనం భ్రాంతిలో ఉన్నట్లు భావించుకోవలెను. నిజానికి శ్రీకృష్ణుడిని అర్థం చేసుకొననివాడు మూర్ఖుడు. ఈ భౌతిక లోకంలో మూర్ఖులు ఎంతోమంది కలరు. మనమందరము మూఢులము, లేనిచో ఈ భౌతిక ప్రపంచమునకు వచ్చి ఉండేవారము కాదు. చీమ నుండి మొదలుకొని బ్రహ్మ వరకు, వివిధ దశలలో మనమందరము మూఢులమేనని తెలియక పోవచ్చును. నిజమైన వేదాంతు లగుటకు మనము భక్తుల సాంగత్యమును తీసుకోవలెను. అప్పుడే నిజముగా మనము కృష్ణభక్తిని ఆస్వాదించ గలము. కృష్ణభక్తుల సాంగత్యములో చర్చించబడు కృష్ణకథ చెవులకు మరియు హృదయమునకు ఎంతో ఆనందమును చేకూర్చును. దీనికి కొద్దిపాటి శిక్షణ అవసరము, మరియు ఈ శిక్షణను భక్తుల ద్వారా మాత్రమే పొందగలము. భక్తుల యొక్క ప్రత్యక్ష జీవన విధానమును వారి రోజువారి కార్యక్రమాన్ని మరియు నడవడికను మనం అనుసరించ వలెను. అనుసరించుట అనగా సాధన చేయుట. గొప్పగొప్ప ఆచార్యులందరు మనం అనుసరించుటకు కావలసిన నిత్యకర్మలను రూపొందించిరి. ఉదాహరణకు, శ్రీల రూప గోస్వామి ద్వారా రచించబడిన, 'భక్తిరసామృత సింధువు' అనే గ్రంథములో భక్తియుక్త సేవను ఎలా చేయవలె ననునది పేర్కొనబడెను. దీనిని మేము ఆంగ్లభాషలోకి అనువదించితిమి. ఇది అమెరికా మరియు యూరోపులోని విశ్వ విద్యాలయములలో ఎంతో ఆదరణను పొందుతున్నది. 'భక్తిరసామృత సింధువు' వాస్తవమైన భక్తి శాస్త్రము. భక్తి అనేది మూఢ విశ్వాసము కాదు. ఇది గొప్ప శాస్త్రము, కాబట్టి దీనిని మనం శాస్త్రీయముగా అభ్యసించ వలెను. భక్తియుక్త సేవను అభ్యసించుట కొరకు మనం మరొజన్మ వరకు వేచి ఉండవలెనని కాదు. మనం 'భక్తి రసామృత సింధువు'ను అధ్యయనము చేయవచ్చును, భక్తులతో కలిసి జీవించవచ్చును, ఉదయాన్నే మంగళహారతి చేయవచ్చును, వైదిక సాహిత్యములను పఠించవచ్చును,

ప్రసాదమును తీసుకుంటూ కృష్ణచైతన్యమును ప్రచారము చేయవచ్చును.

మాయ ఎంతో శక్తివంతమైనది, మరియు భక్తియుక్త సేవను ప్రారంభించుట మనగా మాయ పై యుద్ధమును ప్రకటించుటయే. కృష్ణచైతన్యమును అభ్యసించెడి కొందరు భక్తులు పతనము చెందినను వారు శ్రద్ధతో చేసిన సేవ అంతయు శాశ్వతముగా వారి ఖాతాలో నిలువ చేయబడునని భగవద్గీత(2.40)లో ధృవీకరించ బడెను. భక్తియుక్త సేవను కొద్దిగానైన సాధన చేసినవారు, తిరిగి పశు యోనులలో జన్మించకుండ మానవ జన్మను పొందగలరు. 84 లక్షల జీవరాసులు ఉన్నప్పటికినీ పతనము చెందిన భక్తుడు మాత్రము మానవజన్మను ఖచ్చితముగా పొందును. కృష్ణచైతన్య వంతులైనవారు మరుజన్మలో మంచి కుటుంబములో జన్మింతురని హామి ఇవ్వబడినది. కాని ఏమైనను ఈ జన్మలోనే ఒకరు తమ కృష్ణచైతన్యమును పరిపూర్ణము చేసుకోగలిగితే, అతడు తిరిగి జన్మించకుండ శ్రీకృష్ణుని చేరును. నిజానికి అదియే కావలసినది. బ్రాహ్మణ కుటుంబములో లేదా ధనవంతుల కుటుంబములో జన్మించు అవకాశమును ఎందుకు పొందవలెను? నిజానికి అలాంటి జన్మ ప్రమాదకరమైనది. ఎందుకనగా, దీనిని గురించిన నిజమైన హామి ఏమి ఇవ్వబడలేదు. సాధారణముగా ఐశ్వర్యవంతులు కృష్ణచైతన్యమును లెక్క చేయరు. మరియు బ్రాహ్మణ కుటుంబములో జన్మించినవారు, "నేను బ్రాహ్మణుడను, నేను గొప్పకులములో జన్మించితిని" అని గర్విస్తుంటారు. ఇలా భావించుట వారి పతనానికి దారితీస్తుంది. గర్వం పతనానికి దారితీయును. వైష్ణవుడు స్వభావరిత్యా నమ్రతను కల్గి ఉండును.

మానవజన్మను పొందినప్పుడు ఇలాంటి అవకాశములు కలుగును. కృష్ణ చైతన్య ఉద్యమము అందిస్తున్న అవకాశములను సద్వినియోగ పరచుకోవాలని శ్రీకృష్ణుడు స్వయంగా ఆదేశిస్తున్నాడు. మనం వాటిని అంగీకరించవలెను. అంతేకాని ఆధ్యాత్మిక ఆత్మహత్య చేసుకొనే క్లిష్టపరిస్థితిని ఎదుర్కొనరాదు.

పరమ పురుషుడిని, పరమ సత్యమును, పరమ తత్త్వమును అర్థం చేసుకునే మార్గమిదే. పరమ తత్త్వములో భేదములు లేవు. శ్రీకృష్ణుని నామరూపలీలా పరికరములన్నీ శ్రీకృష్ణునికి భిన్నములు కావు. పరమసత్యమునకు అర్థమిదే. శ్రీకృష్ణుడి రూపానికి మరియు శ్రీకృష్ణుడికి మధ్య తేడా లేదు. శ్రీకృష్ణుడి కాళ్ళకు మరియు శ్రీకృష్ణుడి చేతులకు ఎటువంటి భేదము లేదు. ఈ భౌతిక లోకంలో మన కుడిచేతికి ఎడమచేతికి మధ్య భేదము కలదు. మన ముక్కుకు మరియు చెవికి భేదము కలదు. కాని శ్రీకృష్ణునిలో ఈ ద్వంద్వాలు కనిపించవు. ఇదే పరమ

సత్యమునకు గల అర్థము. 'బ్రహ్మ సంహిత'(5.32) లో తెలిపినట్లుగా :

అంగాని యస్య సకలేంద్రియవృత్తిమన్తి
పశ్యన్తి పాన్తి కలయన్తి చిరం జగన్తి
ఆనందచిన్మయసదుజ్జ్వలవిగ్రహస్య
గోవిందమాదిపురుషం తమహం భజామి

"ఆదిపురుషుడైన ఆ గోవిందుని దివ్యస్వరూపము ఆనందముతో చిన్మయత్వముతో, వాస్తవికతతో సంపూర్ణమై యుండుట వలన మిక్కిలి ప్రశాంతమై యున్నది. ఆయన దివ్యశరీరము నందలి ప్రతి అంగము, సర్వేంద్రియ వృత్తులచే పూర్తిగా విలసితమై యున్నది. ఆయన సర్వదా ఆధ్యాత్మిక జగత్తును, భౌతిక జగత్తును చూచును, పాలించును, ప్రకటించును. అట్టి ఆదిపురుషుడైన గోవిందుని నేను భజింతును." మన శరీరములోని వివిధ భాగాలు వివిధ పనుల కొరకు నిర్దేశింపబడినవి. కాని శ్రీకృష్ణుని యొక్క ఏ శరీర భాగమైనను ఎలాంటి కార్యమునైనను చేయగలుగును. శ్రీకృష్ణుడు తన కన్నులచే ఆహారమును స్వీకరించగలడు, లేదా అతడు తలుచుకోగానే ఏ ప్రదేశానికైనను వెళ్ళగలడు. పరమతత్త్వం 'అద్వైతము', పరమసత్యము ద్వంద్వములు లేనిది. సమస్తం ఒకటే.

ఇంద్రియములను తృప్తి పరచాలను కోవడమే మనకు గల భౌతిక రోగము. ముందుగా తెలిపినట్లుగా, నాగరికత అభివృద్ధి అంటే భౌతిక ఇంద్రియ తృప్తి అభివృద్ధి. కాని భక్తి అనేది దీనికి విరుద్ధమైనది. భౌతిక ఇంద్రియ తృప్తి పట్ల ఆసక్తిని కలిగి ఉన్నంత వరకు భక్తి అనే ప్రశ్నే లేదు. ఇంద్రియతృప్తి ధోరణిని మనం తగ్గించుకోవలెను. మరియు భక్తియుక్త సేవా కార్యక్రమములను పెంచుకోవలెను. భౌతిక బంధములంటే ఒక శరీరమును స్వీకరించుట మరియు రాబోవు శరీరమును తయారు చేసుకోవటమని ముందుగానే తెలిపితిమి. ప్రకృతి ద్వారా ఇంద్రియములను భోగించుటకు శ్రీకృష్ణుడు మనకు పూర్తి అవకాశమును కలిగించును. పాశ్చాత్య దేశాలలో నగ్నంగా తిరుగుటమనేది ఒక సరదా. కాబట్టి ప్రకృతి జనులకు ఎన్నో సంవత్సరాలు వృక్షములుగా నగ్నంగా నిలబడుటకు అవకాశమిచ్చును. ఇంద్రియ తృప్తికొరకు మనము వివిధ రుచులను కలిగి ఉన్నందున, వివిధ రకాల శరీరములను అంగీకరిస్తున్నాము? ఆధ్యాత్మిక జీవితమును ప్రారంభించుటకు మునుపే మనము భౌతికమైన ఇంద్రియ తృప్తి పట్ల అనాసక్తిని కలిగి ఉండవలెను. ఇది కేవలము భక్తి వలననే సాధ్యమగును. శ్రీకృష్ణుడు మన

కంటిచూపుకు అతీతముగా ఉన్నను, మనమతడిని అర్చావిగ్రహ రూపములో దర్శించుటకు అనుమతించెను. విగ్రహము రాతితో తయారు చేయబడినదని భావించరాదు. మనము రాతికి అతీతముగా చూడలేము కాబట్టి అతడు విగ్రహము రాతిది అయినను ఆ రూపంలో మనముందు నెలకొని ఉంటాడు. అది శ్రీకృష్ణుని కృప. శ్రీకృష్ణుడు తన దివ్యరూపముతో అంతటా నెలకొని ఉన్నప్పటికిని మన కన్నులు మరియు ఇతర ఇంద్రియములన్నీ దోషపూరితము లైనందున మనమతడిని చూడలేము. అంతేకాకుండ, ఆధ్యాత్మికము మరియు భౌతికమనే భేదములను చూస్తుంటాము. కాని శ్రీకృష్ణుడు సంపూర్ణుడై నందున, అలాంటి భేదములను కలిగి ఉండడు. అతడు ఆధ్యాత్మికము గానైనను లేదా భౌతికముగానైనను అతడికి ఎలానచ్చితే అలా కాగలడు. వీటిలో అతడికి ఎటువంటి భేదము కనిపించదు. అతడు సర్వశక్తిమంతుడు మరియు సర్వజ్ఞుడై నందున, శ్రీకృష్ణుడు జడ పదార్థమును ఆధ్యాత్మికముగా మరియు ఆధ్యాత్మికమును జడ పదార్థముగా చేయగలడు. కాబట్టి మనం నాస్తికులు ఆలోచించు విధముగా రాతివిగ్రహాలను పూజిస్తున్నామని భావించరాదు. రాతి విగ్రహమైనను అది శ్రీకృష్ణుడే. అది శ్రీకృష్ణుని సంపూర్ణ స్థితి స్వభావము. మనం విగ్రహమును రాతి, లేదా లోహము లేదా కట్టెతో తయారు చేయబడినదని భావించినను అది శ్రీకృష్ణుడే. దీనిని అర్థం చేసుకొనుటకు మనము భక్తిని కలిగి ఉండాలి. మనం కొద్దిగానైన విచక్షణను మరియు తాత్త్విక స్వభావమును, భక్తిపట్ల ఏమాత్రం శ్రద్ధ కలిగి ఉన్నను శ్రీకృష్ణుడు విగ్రహములో కూడ నెలకొని ఉండునని అర్థం చేసుకోగలము.

నిజానికి శ్రీకృష్ణుడికి భిన్నమైనది ఏది లేదు. ఎందుకనగా సమస్తము శ్రీకృష్ణుని శక్తి. సర్వము భగవంతుడై నందున శ్రీకృష్ణునికి సాకార రూపమనేది ఉండదని మాయవాదులు చెబుతుంటారు. కాని నిజానికి శ్రీకృష్ణుడు, శ్రీకృష్ణుడే, మరియు అదే సమయములో అతడు సమస్తము. మనము కేవలము భక్తి ద్వారానే తప్ప మరే ఇతర పద్ధతి ద్వారా దీనిని అర్థం చేసుకోలేము. భక్తుడు ఒక వృక్షమును చూచినను అందులో అతడు శ్రీకృష్ణుని మాత్రమే చూచును. 'శ్రీ చైతన్య చరితామృతము' (మధ్యలీల, 8.274) లో వివరిస్తున్నట్లుగా :

స్థావర్ – జంగమ్ దేఖే, నా దేఖే తార్ మూర్తి
సర్వత్ర హోయ్ నిజ ఇష్ట – దేవ్ – స్ఫూర్తి

శుద్ధభక్తుడు జీవులను చరాచరములుగా మాత్రమే భావించకుండ శ్రీకృష్ణుడినే

చూచును. 'బ్రహ్మ సంహిత' (5.38) దీనిని వివరించును :

ప్రేమాంజనచ్ఛురితభక్తివిలోచనేన
సంతః సదైవ హృదయేషు విలోకయన్తే

అతడి కన్నులు భక్తి అనే కాటుకతో ఎల్లప్పుడు అలంకరించబడి నందున భక్తుడు సర్వత్ర శ్రీకృష్ణుని తప్ప మరోదానిని వీక్షించడు. అతడు శ్రీకృష్ణుడిని మరియు అతడి శక్తిని అంతటా చూచును. ఉదాహరణకు, మీరు మీ పిల్లవాడిని ప్రేమించినప్పుడు మీరు మీ పిల్లవాడి చెప్పులను లేదా అతడి బొమ్మను చూచినను, వెంటనే పిల్లవాడి గొంతును వినినట్లుగా అనిపించును. ఆ విధముగానే మనం శ్రీకృష్ణుని పట్ల ప్రేమను పెంపొందించు కున్నప్పుడు మనకు శ్రీకృష్ణుడు తప్ప మరొకటి కనిపించదు. నిజమైన కృష్ణప్రేమను వృద్ధి చేసుకున్నప్పుడు, మనం దేనిని చూసినను అందులో శ్రీకృష్ణుడినే చూడగలము.

శ్రీకృష్ణుని ప్రేమలో అభివృద్ధిని సాధించలేనివాడు దేనిని చూడలేడు మరియు అర్థము చేసుకోలేడు. మన జడ ఇంద్రియములతో భగవంతుని నామమును కూడ అర్థం చేసుకోలేము. "మీరెందుకు 'హరేకృష్ణ' జపమును చేస్తున్నారు?" అని ప్రజలు అడుగుతుంటారు. శ్రీకృష్ణుని సాక్షాత్కారమనేది అతని నామముతో మొదలగునని జనులు అర్థం చేసుకోలేకున్నారు. శ్రీకృష్ణుని నామానికి మరియు శ్రీకృష్ణునికి భేదము లేదు. బుద్ధి ద్వారా దీనిని అర్థం చేసుకోలేము. దీనిని అర్థం చేసుకొనుటకు 'హరేకృష్ణ' మహామంత్ర జపమును సాధన చేయవలెను. మనం భక్తియుక్త సేవలో పురోభివృద్ధిని సాధించి మరియు 'హరేకృష్ణ' మహామంత్రమును అపరాధ రహితముగా జపించి నప్పుడు, శ్రీకృష్ణుడికి మరియు అతడి నామముకు మధ్య ఎటువంటి భేదము లేదని మనం అర్థం చేసుకోగలము. ఆ విధముగా నాలుక ద్వారా కీర్తించుట మరియు కృష్ణప్రసాదమును రుచి చూచుట ద్వారా కృష్ణభక్తి ప్రారంభమగును. అంతేకాకుండ మనం కృష్ణభక్తులము కాగలము.

మందిరములో శ్రీకృష్ణుని విగ్రహమును దర్శించినప్పుడు ఆ విగ్రహము శ్రీకృష్ణుడని భావించ గలిగినప్పుడే, మనచేత వస్త్రములను అలంకరించ బడుటకు మరియు మనచేత దర్శించబడుటకు శ్రీకృష్ణుడు అంగీకరించును. అలాకాకుండ అతని విశ్వరూపమును తలచుకున్నచో అతడికి మనమేమి చేయగలము? శ్రీకృష్ణుని విశ్వరూపమునకు వస్త్రాలంకరణను ఎలా చేయగలము? అతడి అనేక తలలు ఆకాశమంతటా విస్తరించి ఉండును, అంతేకాకుండ దానిని మనము ఊహించుటకు

కూడ సాధ్యపడదు. శ్రీకృష్ణుడు అత్యంత పెద్దగా లేదా అత్యంత సూక్ష్మముగా మారగలడు. కాబట్టి : *"భక్త్యా పుమాన్ జాతవిరాగ అయింద్రియాత్."* అనే శ్లోకంలో ఇలా చెప్పబడినది. మనం శ్రీకృష్ణుడికి ఎంత ఎక్కువగా సేవ చేస్తూ, నైవేద్యమును అర్పిస్తూ అతడిని అలంకరించుటకు ఎంతఎక్కువగా శ్రద్ధ చూపినచో అంతఎక్కువగా మన శరీరముల పట్ల మనకు గల వ్యామోహము తగ్గిపోతుండును. ఈ భౌతిక ప్రపంచములోని జనులు ఇతరులను కామాకర్షకులను చేయుట కొరకు, వస్త్రాలంకరణను చక్కగా చేసుకొనుటలో మిక్కిలి శ్రద్ధను కనపరుస్తుంటారు. కాని మనం శ్రీకృష్ణునికి చక్కగా వస్త్రాలంకరణను చేయుటకు ప్రయత్నించినచో, భౌతిక వస్త్రాల పట్ల మనకు గల వ్యామోహం క్రమంగా తగ్గిపోవును. మరియు మనం శ్రీకృష్ణుడికి చక్కటి ఆహారమును నివేదించినప్పుడు నాలుకను సంతృప్తి పరచుట కొరకు హోటళ్ళకు వెళ్ళుటను కూడ విస్మరిస్తాము.

శ్రీకృష్ణుడు భగవద్గీతను బోధిస్తున్నప్పుడు, అర్జునుడు అతడిని ముఖాముఖిగా దర్శిస్తుండెను, శ్రీకృష్ణుని దర్శించుట మరియు భగవద్గీతను పఠించుట వంటివి రెండు సమానమే. అర్జునుడు శ్రీకృష్ణుని ప్రత్యక్షముగా దర్శిస్తూ ఉపదేశములను పొందేటంతటి అదృష్టవంతుడని జనులు చెబుతుంటారు. కాని అతడిని దర్శించే కన్నులు కలిగిఉన్నచో మనకు వెంటనే శ్రీకృష్ణుడు దర్శనమిచ్చును. దక్షిణ భారతదేశంలో నిరాక్షరాస్యుడైన బ్రాహ్మణుడు భగవద్గీతను పఠించు దృష్టాంతము 'శ్రీ చైతన్య చరితామృతము'లో వివరించబడినది. చుట్టుప్రక్కల వారికి ఆ బ్రాహ్మణుడు నిరక్షరాస్యుడని తెలుసును. కాబట్టి వారు : "నీవు ఎలా భగవద్గీతను చదవగలుగు తున్నావు?" అని గేలిచేస్తుండెడి వారు. ఒకసారి మహాప్రభువు ఆ మందిరమునకు వెళ్ళినప్పుడు బ్రాహ్మణుడిని భక్తుడని అర్థం చేసుకొని అతడిని సమీపించి : "ప్రియమైన బ్రాహ్మణా! మీరు పఠిస్తున్నదేమిటి?" అని అడిగెను. "నేను భగవద్గీతను పఠిస్తున్నాను, నిజానికి పఠించుటకు ప్రయత్నిస్తున్నానని సమాధాన మిచ్చెను. నేను చదువులేని వాడనైనను మా గురువుగారు ప్రతిరోజు భగవద్గీతలోని పదునెనిమిది అధ్యాయములను పారాయణము చేయుమని ఆదేశించిరి. అందుకే గురువుగారి ఆజ్ఞను పాటించుటకొరకై నేను భగవద్గీత పుటలను తెరుస్తూ మూస్తుంటిని." అప్పుడు శ్రీ చైతన్య మహాప్రభువు ఆ బ్రాహ్మణుడితో : "మీరు కొన్నిసార్లు రోదిస్తుండుటను కూడ నేను చూచితిని. ఎందుకు?" అని ప్రశ్నించెను. "నేను ఈ గ్రంథమును చూచినప్పుడల్లా, శ్రీకృష్ణుడు అర్జునుడి రథమును నడిపే చిత్రపటమును చూచుతుంటిని. శ్రీకృష్ణుడు ఎంతటి

దయగలవాడు. అతడు తన భక్తునకు సేవకుడిగా సేవ చేయుటకు అంగీకరించెనని దానిని చూచినప్పుడల్లా నాకు దుఃఖము కలుగుతున్నది” అని సమాధాన మిచ్చెను. శ్రీ చైతన్య మహాప్రభువు వెంటనే ఆ బ్రాహ్మణుని ఆలింగనము చేసుకొని : “మీరు భగవద్గీతను వాస్తవంగా అర్థము చేసుకున్నారని తెలిపెను.”

విద్య అనెడి ధనమవసరము లేదు. భాషను అర్థము చేసుకోవలసిన అవసరము కూడ లేదు. కావలసినది కేవలము ప్రేమ మరియు భక్తి. ఎవరైనను శుద్ధభక్తుడైనచో అతడు భౌతిక ఇంద్రియ తృప్తినంతటిని విస్మరించును. కేవలం తులసిమాల మరియు ఆధ్యాత్మిక దుస్తువులను ధరించుట వలన ఎవరూ భక్తుడవ్వ లేరు. ఇంద్రియ తృప్తి పట్ల ఆసక్తిని కోల్పోయినచో అతడు భక్తుడుగా పిలువబడును. నిజమైన భక్తుడు తన ఇంద్రియాలను కాకుండ శ్రీకృష్ణుని ఇంద్రియాలను సంతృప్తి పరుచుటలో ఆసక్తిని కనపరుస్తుంటాడు. అదే ఆధ్యాత్మిక జగత్తు. ఆధ్యాత్మిక జగత్తులోని వృందావనములో యశోదమాత, నంద మహారాజు, శ్రీమతి రాధారాణి, గోపికలు, గోపబాలురు, శ్రీధామ, సుదామ, భూమి, నీరు, వృక్షాలు, పక్షులు, ఇలా ప్రతిది శ్రీకృష్ణుడిని సంతృప్తి పరుచుటకు ప్రయత్నించును. శ్రీకృష్ణుడు వృందావనమును విడిచి మధురకు వెళ్ళినప్పుడు అతడి వియోగములో అందరు మృతసమానులైరి. మనము కూడ అదేవిధముగా శ్రీకృష్ణుని పట్ల వెఱ్రివారమైనచో ఎల్లప్పుడు వృందావనములో, వైకుంఠములో నివసించ గలుగుదుమని మహాప్రభువు ఉపదేశించెను. అంతేకాకుండ అతడు తన నిజ జీవితములో వీటిని ఆచరించి చూపించెను. అతడు జగన్నాథ పూరిలో ఉన్నపుడు రాత్రింపవళ్ళు శ్రీకృష్ణుడి కొరకై వెఱ్రివాడయ్యెను. అతడి చివరి పన్నెండు సంవత్సరాలు ఈ పిచ్చిలోనే గడిచిపోయేను. అంతేకాకుండ వెఱ్రివాడివలె తిరుగుచు కొన్నిసార్లు సముద్రములోను పడిపోయెను. ఇది సాధారణ మానవులకు సాధ్యపడదు. మనం భక్తులమైనందున ఈ సృష్టి వెనుక గల విషయాల నన్నింటిని తెలుసుకునే బుద్ధిని కలిగి ఉంటాము. మనం ఒక పుష్పమును తీసుకొని దాని యొక్క స్థితిని మరియు దాని రంగులు ఎలా చిత్రించబడెను, మరియు అది ఏ విధముగా సృష్టించబడినదని పరీక్షించి చూచినప్పుడు మనం శ్రీకృష్ణుడిని దర్శించగలము. శ్రీకృష్ణుడు అంతటి అందమైన పుష్పమును ఎంతటి నైపుణ్యముతో ఎలా సృష్టించెననెడి విషయమును మనము దర్శించగలము. ఆ వస్తువు సహజముగానే సృష్టించబడినదని కొందరు మూర్ఖులు భావించినట్లుగా మనము భావించరాదు. మూర్ఖులు చూడలేరు, కాని జ్ఞానవంతులు భగవంతుని హస్తమును సృష్టి అంతటా చూడగలరు. ‘*ఈశావాస్యమిదం సర్వమ్.*’

వాస్తవానికి ఏది కూడ స్వచ్ఛందముగా సృష్టించబడదు. సమస్తము శ్రీకృష్ణుని బుద్ధి చేతను, మరియు అతని సూక్ష్మమైన, సంపూర్ణమైన శక్తి వలననే రూపొందించ బడును. మనం ఒక పుష్పమును చిత్రించాలను కున్నప్పుడు దానికి కావలసిన వస్తువుల నెన్నింటినో సిద్ధం చేసుకోవలసి ఉంటుంది. అయినను ఆ చిత్రమును పరిపూర్ణముగా చిత్రించలేము. కాని శ్రీకృష్ణుడు సృష్టించిన పుష్పము సంపూర్ణమై ఉంటుంది. కనుక దీనివెనుక మెదడు లేదనే మూర్ఖుడెవరు? అందుకే ప్రకృతి స్వతంత్రముగా పనిచేయదని, "ప్రకృతి తన ఆదేశానుసారమే పని చేయును" అని శ్రీకృష్ణుడు ప్రత్యేకంగా తెలిపెను. ఇలా ఇవన్నీ చక్కగా పని చేయుచున్నప్పుడు, వాటిని అర్థం చేసుకొనుటకు కావలసిన సరియైన దృష్టిని పెంపొందించుకొని, మన ఇంద్రియాలను శ్రీకృష్ణుని సేవలో వినియోగించినప్పుడే అది సాధ్యపడును. మొదట మన నాలుకను 'హరేకృష్ణ' సంకీర్తనలో మరియు భగవత్ ప్రసాదమును స్వీకరించుటలో వినియోగించవలెను. అంతకుమించి మరేమి చేయనవసరము లేదు. అందుకే కృష్ణ చైతన్య ఉద్యమము ప్రసాద వితరణను చేయుచు జనులను 'హరేకృష్ణ' మహామంత్ర సంకీర్తనలో నిమగ్నులను చేయుచున్నది.

శ్లోకము 27

అసేవయాయం ప్రకృతేర్గుణానాం
జ్ఞానేన వైరాగ్యవిజృంభితేన
యోగేన మయ్యర్పితయా చ భక్త్యా
మాం ప్రత్యగాత్మానమిహావరున్ధే

ఆ విధముగా త్రిగుణములను సేవింపక కృష్ణచైతన్యమును (వైరాగ్య యుక్తమగు జ్ఞానము) వృద్ధికావించుకొనుచు దేవాదిదేవుని భక్తియుక్త సేవ యందు మనస్సు సుస్థిరముగా నిలిచియుండెడి యోగము నభ్యసించు మనుజుడు ఈ జన్మయందే నా సాంగత్యమును బడయగలడు. ఏలయన నేనే పరమసత్యమగు దేవాదిదేవుడనై యున్నాను.

భాష్యము : ప్రామాణిక శాస్త్రములందు తెలియజేయబడినట్లు శ్రవణము, కీర్తనము, స్మరణము, అర్చనము, వందనము, దాస్యము మొదలగు నవవిధ భక్తియోగ విధానములందు (ఒకదాని ద్వారా గాని, రెండింటి ద్వారా లేదా మూడింటి ద్వారా లేదా అన్నింటి ద్వారా) భగవానుని భక్తియుక్త సేవ నొనర్చెడివాడు సహజముగానే

త్రిగుణముల సేవలో నియుక్తుడవ్వడు. ఆధ్యాత్మికముగా చక్కటి కార్యకలాపములు లేనిదే భౌతికసేవానురక్తి నుండి బయటపడుట అసాధ్యము. కనుకనే భక్తులు కానివారు వైద్యశాలలను నిర్మించుట లేదా ధర్మసంస్థలను ఏర్పాటు చేయుటవంటి నామమాత్రపు ప్రజాహిత లేదా పరోపకార కర్మల యందే అభిరుచిని కలిగి యుందురు. నిస్సందేహముగా అవి మంచికర్మలే; అనగా పుణ్యకార్యములే. వాటిద్వారా కర్త ఈ జన్మలోనో లేదా తరువాతి జన్మలోనో ఇంద్రియ భోగము కొరకు మరింతగా సౌకర్యములను పొందవచ్చును. కాని భక్తియోగ అనునది ఇంద్రియభోగ పరిధికి అతీతమైనది. ఇది పూర్తిగా ఆధ్యాత్మిక కర్మ. మనుజుడు భక్తియుక్త సేవలో నెలకొనినప్పుడు ఇంద్రియభోగ కర్మల యందు సహజముగానే నెలకొనడు. అనగా కృష్ణచైతన్య కర్మలు గ్రుడ్డిగా కాకుండ జ్ఞానవైరాగ్యములను గురించిన పరిపూర్ణావగాహనతో నిర్వహించబడును. దేవాదిదేవుడైన శ్రీకృష్ణ భగవానుని యందే సదా మనస్సు సంలగ్నము కావింపబడెడి అట్టి యోగవిధానము ప్రస్తుత జన్మమందే ముక్తి నొసగగలదు. అటువంటి కర్మల నొనర్చువాడు దేవాదిదేవుని సన్నిధిని చేరగలడు. కనుకనే ఆత్మదర్శులగు భక్తుల నుండి భగవల్లీలలను శ్రవణము చేసెడి విధానమును శ్రీ చైతన్య మహాప్రభువు ఆమోదించిరి; శ్రోతలు ఈ ప్రపంచమునందలి ఏ వర్ణమునకు చెందిన వారమనెడి విషయము ప్రధానమైనది కానేకాదు. మనుజుడు ఆత్మదర్శియైన మహాత్ముని నుండి కృష్ణలీలలను మిక్కిలి అణుకువతో శ్రద్ధగా వినినచో ఆ దేవాదిదేవుని(ఏ ఇతర విధానము చేతను జయింపబడనివాడు) జయింపగలడు. అనగా భక్తుల నుండి శ్రవణము చేయుట మరియు వారితో సాంగత్యము అనునది ఆత్మసాక్షాత్కారమునకు అత్యంత ప్రధానమైన కార్యము.

గోలోక వృందావనములోని జీవులు శ్రీకృష్ణుడిని గొప్పమిత్రునిగా, గోపికల ప్రియునిగా, తల్లిదండ్రులుగా సేవించుకుంటున్నారు. అంతేకాకుండ చెట్లు, నీరు, పుష్పాలు, భూమి, ఆవులు దూడలు మొదలైనవి కూడ శ్రీకృష్ణుని గోలోక వృందావనములో సేవించుకొనును. ఇది కూడ మన ధర్మమే. కాని ఏ కారణము చేతనో మనము శ్రీకృష్ణుడికి సేవ చేయుటకు ఇష్టపడుట లేదు. కాబట్టి మనము భౌతిక ప్రకృతి యొక్క త్రిగుణముల ఆధీనములో మాయ యొక్క సేవలో పెట్టబడితిమి. కనుకనే ఒక దొంగ ప్రభుత్వ చట్టములను పాటించనిచో అతడిని కారాగారములో పెట్టి బలవంతంగా చట్టమును పాటించునట్లు చేయుదురు. మనం మన నిజస్థితిలో భగవంతుని అంశలమైనందున శ్రీకృష్ణుని సేవించుటయే మన

ధర్మం. మనం సేవ చేయుటకు నిరాకరించిన వెంటనే మాయ మనలను బంధించి, "నాకు సేవ చేయుము" అని ఆజ్ఞాపించును. యజమానిగా ఉండుట మన లక్షణము కాదు. మనం యజమానుల మైనను అనందముగా ఉండలేము. ఎందుకంటే ఆ స్థితి కృత్రిమమైనది. ఉదాహరణకు, "ఓ! నా దగ్గర ఇప్పుడు చక్కటి తీపి పదార్థము కలదు. కనుక దీనిని ఇప్పుడు నేను తినెదను" అని చేయి భావించినచో చివరికి అది నిరాశకు గురగును. ఆహారమును నోటికి అందించుట చేతి లక్షణము మరియు అదే దాని ధర్మం. ఈ విధముగా చేయి పుష్టిని పొందును. లేనిచో సర్వం నశించును. మనం భగవంతుని అంశలమైనందున అతడిని సంతృప్తి పరచుట మన ధర్మం. ఒక్కడైన భగవంతుడు అనేకములుగా విస్తరించెను. మనం శ్రీకృష్ణుని అనేక అంశలము. 'స్వాంశ' అనగా అతని అంతరంగిక విస్తరణలు, మరియు మనము అతని 'విభిన్నాంశ'లము. అన్ని సందర్భములలోను, విస్తరణలన్నీ శ్రీకృష్ణుని సేవించుటకొరకై ఉద్దేశించ బడినవని 'శ్రీ చైతన్య చరితామృతము'లో వివరించ బడినది (ఆదిలీల 5.142) : *"ఏకలే ఈశ్వర్ కృష్ణ, ఆర్ సబ్ భృత్య"*– "శ్రీకృష్ణభగవానుడు పరమ నియంత్రకుడు. మరియు ఇతరులందరు అతని సేవకులు."

శ్రీకృష్ణునితో ఆనందించుటమనేది మన స్వభావ సిద్ధలక్షణము. ఇంతకు పూర్వమే పేర్కొనినట్లుగా, శ్రీకృష్ణుడు ఆనందమయుడు మరియు అతడి అంశలమై నందున మనం కూడ ఆనందమయులమే. ప్రస్తుతము మనము ఆనందమును మరొక వాతావరణములో వెదుకుచున్నాము. ఎందుకంటే, మనకు స్వల్ప స్వాతంత్ర్యము లభించినది. కాబట్టి మనము భౌతిక ప్రకృతి కారాగారములోకి వెళ్ళుటకు నిశ్చయించుకున్నాము. అంతేకాకుండ, శ్రీకృష్ణుడిని సేవించుటకు బదులు మన ఇంద్రియాలను సేవించుటకు ప్రయత్నిస్తున్నాము. కాబట్టి మనమిప్పుడు మనం భౌతిక ప్రకృతిని ఎలా మరచిపోవాలను దానిని అభ్యసించ వలెను. మరియు ఆ ప్రక్రియే భక్తియుక్తసేవా మార్గము. మనం శ్రీకృష్ణునికి తప్ప మరెవరికి సేవకులము కాదను విషయమును అర్థం చేసుకోగలిగే స్థితికి రాగలిగినచో ఆత్మసాక్షాత్కారమును పొందినట్లు అర్థం చేసుకోవచ్చును. మనము ఈ స్థితిని మూర్ఖత్వముతో కాకుండ జ్ఞానముతో అర్థం చేసుకోవలెను. అనేక జన్మమృత్యువుల తర్వాత *'వాసుదేవః సర్వమితి'* అనగా వాసుదేవుడు సర్వం అని అర్థం చేసుకున్నవాడు శ్రీకృష్ణుడికి శరణుపొందును. ఇదే నిజమైన జ్ఞానము. అనగా భౌతిక విషయముల గురించిన జ్ఞానము మరియు వైరాగ్యము.

శ్రీకృష్ణుని సేవలో పూర్తిగా నెలకొనినప్పుడే మనము *'బ్రహ్మభూత'* స్థితికి చేరుకొందుము. ప్రస్తుతము మనం *'మాయభూత'* స్థితియందు నెలకొని ఉన్నాము. మాయలో మనకు మనం పోల్చుకుంటూ భౌతిక ప్రకృతి ననుసరించి కర్మ చేయు చున్నాము. ఏమైనను, మనం ఆత్మస్వరూపులమని *(అహం బ్రహ్మాస్మి)* అర్థం చేసుకోగలిగే స్థితికి చేరుకొనిన వెంటనే మనము ఆనందమును పొందగలము.

భౌతిక ప్రకృతి గుణముల ఆధీనములో దాని అలల చేత కొనిపోబడుతూ, మనం ఎక్కడకు వెళ్ళుచున్నామనే దానిని నియంత్రించ లేకున్నాము. శ్రీల భక్తివినోద ఠాకూరు ఇలా పేర్కొనెను : *"మాయర్ భేషే, యాచ్ఛ భేసే, ఖాచ్ఛ హబుదుబు భాయ్."* అనగా మనం సముద్రపు అలలపైన గల గడ్డిపరకల వంటివారము, అంతేకాకుండ, మనం అలల యొక్క పూర్తి నియంత్రణకు లోబడి ఉన్నాము. నాస్తికులు పునర్జన్మ అంటే కంపించిపోతారు. ఎందుకనగా, వారి జీవితములు పాపపూరితమైనవి. కాబట్టి వచ్చేజన్మలోని శిక్షలంటే భయపడుదురు. "నేను ఎన్నో పాపకర్మలను చేశాను, యమరాజు దండించును. నేనెలా తప్పించుకోవాలి?" అని అలోచించే వ్యక్తిని గురించి ఒక బెంగాలి సామెత ఇలా కలదు. అతడు కొద్ది సమయం ఆలోచించి : "నేను నా శరీరమంతటిని మలముతో రుద్దుకొనెదను. అప్పుడు యమరాజు నన్ను తాకడు" అని నిర్ణయించుకొన్నాడట. ఇది కేవలము మూర్ఖత్వము. మనం భౌతిక ప్రకృతి యొక్క మాయ నియంత్రణలో ఉన్నాము. మరియు దీనిని తప్పించుకొనుట అసాధ్యము. మనం భౌతిక ప్రకృతి అనే రోగముచే ప్రభావితము కాబడినాము. కాబట్టి ఎలాంటి కృత్రిమ పద్ధతులు మనలను రక్షింప లేవు. శ్రీకృష్ణుడిని శరణుపొందుట తప్ప మరే ఇతర మార్గము లేదు. మనం పాపాత్ముల మైనను శ్రీకృష్ణుడు మనలను రక్షించునని తెలుపుతున్నాడు.

మనం కనుక మన ఆసక్తిని శ్రీకృష్ణుని సేవలో భక్తియోగ వైపునకు మరల్చినచో, 'అనర్థాల' నన్నింటిని త్యజించుటకు మనం గట్టిగా ప్రయత్నించ గలము. మనం ఉదయాన్నే మేలుకొని శ్రీకృష్ణుని సేవలో నెలకొనవలెను. అప్పుడే క్రమంగా మనం మాయ సేవను విస్మరించ గలము. భక్తియోగ ఎంతటి శక్తివంత మైనదంటే, దీనిలో మనం నిమగ్నులమైన వెంటనే మాయ యొక్క సేవ సహజము గానే నిర్లక్ష్యము చేయబడును. దీనినే వైరాగ్యమంటారు.

శ్రీకృష్ణుడు ఆది పురుషుడు. సమస్తము శ్రీకృష్ణుని నుండి ఉద్భవించినది. అందుకే అతడు *'పురాణ'* అనగా ప్రాచీనుడు. శ్రీకృష్ణునికి మించి ఎవరు ప్రాచీనులు లేరు. కాని శ్రీకృష్ణుడు ఎల్లప్పుడు నవయువకుడే. అతడే భగవానుడు. ఆయన

ఆదిమూలము. సర్వకారణములకు కారణము. అయినను మనమెన్నడు శ్రీకృష్ణుడిని వృద్ధుడిగా చూడలేదు. అతడు ఎల్లప్పుడు నిత్యనూతనుడు, నిత్యయవ్వనుడు. కురుక్షేత్ర యుద్ధ సమయములో శ్రీకృష్ణుడు ముత్తాత అయినను, అతడు 20 సంవత్సరములకు పైబడిన వయస్సు కలవాడిగా కనిపించలేదు. శ్రీకృష్ణుడు ఎల్లప్పుడు నవయువకుడు. అంతేకాకుండ ఆధ్యాత్మిక జగత్తులోని జీవరాసులు కూడ శ్రీకృష్ణుని వలెనే ఆధ్యాత్మిక శరీరములను కలిగి ఉంటారు. శ్రీమద్భాగవతము లోని ఆరవ స్కంధములో అజామిళుని కొరకు విష్ణుదూతలు వచ్చినప్పుడు, వారు నాలుగు చేతులను కలిగి ఉన్నారని, మరియు ఎంతో సౌందర్యవంతులని కూడ మనం చదువుతుంటాము. ఆధ్యాత్మిక జగత్తులోని జీవులు నాలుగు చేతులను కలిగి ఉంటారు. మరియు వారందరు నిత్యముక్తులు అనగా శాశ్వతముగా ముక్తిని పొందినవారు.

దురదృష్టవశాత్తు, ప్రస్తుతం మనం ఈ భౌతిక లోకంలో ఖైదీలము. మరియు భౌతిక దేహాలను కలిగి ఉన్నాము. ఈ శరీరములు మారుతుంటాయి. కొన్నిసార్లు అవి యుక్త వయస్సు కలవి మరికొన్నిసార్లు అవి వృద్ధ శరీరములను కలిగినవి. ఏమైనను మనం కృష్ణచైతన్యవంతుల మైనప్పుడు, ఈ శరీరం విడిచిన తర్వాత తిరిగి మరో భౌతిక శరీరమును పొందబోము. మనం మన స్వధామానికి చేరుకొని శ్రీకృష్ణుడి వలె, నారాయణుడి వలె అందమైన మన ఆధ్యాత్మిక శరీరములను పొందుదుము. మనం భక్తియోగ పద్ధతులైన – *'శ్రవణం కీర్తణం విష్ణుస్మరణం పాదసేవనం అర్చనమ్'* – వంటివాటిని పాటిస్తూ భక్తులము కావలెను. మనం ఒకటిగాని లేదా మొత్తం తొమ్మిది భక్తియుక్త సేవా పద్ధతులను అంగీకరించి మన జీవితములను పరిపూర్ణము చేసుకోవలెను. శ్రీ చైతన్య మహాప్రభువు శ్రవణమనే అత్యంత ప్రధానమైన పద్ధతిని బోధించెను. మనము శ్రవణము చేయవలెను. మరియు అదే మన జీవితములను పరిపూర్ణము చేయును.

అధ్యాయము 13

శరణాగతితో పరిపూర్ణ జ్ఞానము

శ్లోకము 28

దేవహూతిరువాచ

కాచిత్త్వయ్యుచితా భక్తిః కీదృశీ మమ గోచరా

యయా పదం తే నిర్వాణమంజసాన్వాశ్నవా అహమ్

భగవానుని ఆ వచనములను ఆలకించిన దేవహూతి ఇట్లు ప్రశ్నించెను: నీ పాదపద్మముల సేవను నేను సులభముగను, శీఘ్రముగను పొందుటకు ఏ విధమగు భక్తియుక్త సేవను వృద్ధి కావించుకొనవలెను, మరియు అభ్యసించవలెను?

భాష్యము : శ్రీకృష్ణభగవానుని సేవ నుండి ఎవ్వరును నిషేధింపబడలేదని భగవద్గీత (9.32) యందు తెలుపబడినది. స్త్రీయైనను, శూద్రుడైనను, వైశ్యుడైనను భగవంతుని కొరకు భక్తియుక్త సేవలో నెలకొనినచో అత్యున్నత పరిపూర్ణత్వ స్థితికి ఉద్ధరింపబడి భగవద్ధామమునకు చేరగలుగుదురు. వివిధ రకములగు భక్తులకు అనువైన భక్తియుక్త సేవ ఆధ్యాత్మికాచార్యుని కృప చేతనే నిర్ణయింపబడి స్థిరపరుపబడును. అందుకే భౌతిక ప్రకృతి దుఃఖముల నుండి విముక్తి పొందుటకు, మానవుడు ప్రామాణికమైన ఆధ్యాత్మికాచార్యుడిని జిజ్ఞాసతో మరియు వినయముతో ఆశ్రయించ వలెను. అర్జునుడు శ్రీకృష్ణునికి శరణాగతి చేసుకొనినప్పుడు : "నా ప్రియమైన కృష్ణా! నేను మీతో స్నేహితుని వలె మాట్లాడుటను ఆపి వేయుదును, ఎందుకనగా, ఇప్పుడు స్నేహితుల వలె సంభాషించుట వలన నాకు ప్రయోజనము కలుగదు" అని అనెను. సాధారణంగా సమయమును గడుపుట కొరకు మనం స్నేహితులతో సంభాషిస్తాము. కాని మనం ఆధ్యాత్మికాచార్యుని సమీపించునప్పుడు అణుకువతో ఉండవలెను. స్నేహితులు సమాన స్థాయితో వ్యవహరిస్తారు. కాని ఆధ్యాత్మికాచార్యుని సమీపించుటకు ఇది పద్ధతి కాదు. వినయము లేకుండా విలువైన ఆదేశాలను పొందలేము. అర్జునుడు దేవాదిదేవుడైన శ్రీకృష్ణునితో గల స్నేహ సంబంధమును విడిచి, వినయమును ఎలా కలిగి ఉండవలెనో బోధిస్తున్నాడు. "ఇప్పుడు నేను మీ శిష్యుడను. దయచేసి నన్ను ఆదేశించండి" అని అర్జునుడు అర్థిస్తున్నాడు.

మనము ఎన్నో జన్మలు, ఎన్నో సంవత్సరాలు ఊహాగానాలను చేసినను

జీవితపు పరమ లక్ష్యమును అర్థం చేసుకోలేక పోవుచున్నాము. అందుకే గురువు కొరకు అన్వేషించాలని శాస్త్రములన్నీ ఆదేశిస్తున్నాయి. గురువు అనే శబ్ధమునకు "బరువైన" అని అర్థం. ఎవరైనను అపార జ్ఞానమును కలిగి ఉండినచో, అతడు జ్ఞానముచే బరువెక్కును. ప్రామాణికుడైన ఆధ్యాత్మికాచార్యుని ఈ విధముగా అర్థం చేసుకోవలెను. "నాకు సర్వం తెలుసునని, బోధించ గలవారెవరు?" అని ఎవ్వరూ ఇలా భావించరాదు. ఎవరు ఇలా పలుకకూడదు. ఎందుకనగా, అందరికి ఆదేశముల అవసరము కలదు.

వైదిక పద్ధతి ననుసరించి బాలురు ప్రారంభము నుండి జ్ఞానం కొరకు గురుకులానికి పంపబడుదురు. బాలుడు గురుకులములో చేరినప్పుడు అతడు బ్రహ్మచారియై సాధారణ సేవకునివలె సేవ చేయును. అతడు ఒక గొప్ప బ్రాహ్మణుడి కుమారుడైనను లేదా రాజకుమారుడైనను ఎటువంటి భేదము లేదు. బాలురు గురుకులములో చేరిన వెంటనే గురువుగారికి సేవకుడగును. గురువు ఎంతటి తక్కువస్థాయి కార్యమును అప్పగించినను దానిని చేయుటకు అతడు సిద్ధంగా ఉండవలెను. అది బ్రహ్మచారి ధర్మము. దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడు గురుకులానికి వెళ్ళవలసిన అవసరము లేదు. అయినను, ఉదాహరణను నెలకొల్పుట కొరకై శ్రీకృష్ణుడు కూడ గురుకులానికి వెళ్ళాడు. శ్రీ చైతన్య మహాప్రభువు కూడ గురువును అంగీకరించాడు.

ప్రకాశానంద సరస్వతీ గొప్ప విద్వాంసుడు, మరియు అతడికి శ్రీ చైతన్య మహాప్రభువు కూడ గొప్పపండితుడని తెలుసును. అయినను శ్రీ చైతన్య మహాప్రభువు కీర్తనను చేస్తూ నృత్యం చేయుటను అతడు విమర్శించాడు. ఎందుకనగా, మహాప్రభు సన్న్యాసి కనకు తన జీవితాన్నంతటిని వేదాంత పఠనము కొరకు అంకితము చేయాలనీ విశ్వసించాడు. కాబట్టి అతడు శ్రీ చైతన్య మహాప్రభువును ప్రామాణిక సన్న్యాసిగా కాకుండ కేవలం భావుకునిగా పరిగణించాడు. ప్రకాశానంద సరస్వతీ: "ఎందుకు నీవు వేదాంత సూత్రములను అభ్యసించుట లేదు? ఎందుకు నీవు కీర్తన మరియు నృత్యములను చేయుచుంటివి?" అని శ్రీ చైతన్య మహాప్రభువును ప్రశ్నించాడు. దానికి శ్రీ చైతన్య మహాప్రభువు ఇలా సమాధాన మిచ్చెను :

ప్రభు కోహే – సున్, శ్రీపాద్, ఇహార్ కారణ్
గురు మోరే మూర్ఖో దేఖి కరిలో శాసన్

"నిజానికి, నేను గొప్ప పండితుడను కాను. నేను మూర్ఖుడనని నేను వేదాంత

సూత్రములను పఠించలేనని మా గురువుగారు తెలిపారు. వేదాంత సూత్రములు సాధారణ జనుల కొరకై నిర్దేశించ బడలేదు. కనుక మా గురువుగారు నాకు 'హరేకృష్ణ' మహామంత్రమును కీర్తించమని ఆదేశించారు. కనుక ప్రస్తుతము నేను దానినే చేయుచున్నాను. మరియు దానిఫలితములను కూడ పొందుతున్నాను." (శ్రీ చైతన్య చరితామృతము, ఆదిలీల 7.71)

కలియుగములో జనులు గొప్ప విద్యావంతులు కారు. వారికి తమ పొట్టలను నింపుకొనుటకు మాత్రమే ధనమవసరము. కాబట్టి పని చేయుచున్నారు. వేదాంత తత్త్వం అనేది సాధారణ మానవుడికి గాని లేదా సాధారణ పండితుని కొరకు గాని నిర్దేశించబడలేదు. దీనికి గొప్పసంస్కృత భాషాజ్ఞానము మరియు తత్త్వజ్ఞానం అనేది అవసరము. శ్రీ చైతన్య మహాప్రభువు దేవాదిదేవుడు. అతడికి సర్వం తెలుసును, కాబట్టి అవిద్య మరియు అజ్ఞానముచే కూడుకున్న సమాజమునకు బోధించుట కొరకు అతడిప్పుడు సాధారణ మానవుని పాత్రను పోషిస్తున్నాడు. ఈ యుగములోని జనులు వేదాంత సూత్రములను పఠించుటకు ఆసక్తిని కనపరచుట లేదు. మరణం తర్వాత పునర్జన్మ కలదనే విషయము లేదా 84 లక్షల జీవరాసుల రూపముల గురించి తెలుసుకొనుటకు జనులు శ్రద్ధ చూపలేనంతగా మాయచే ప్రభావితు లవుతున్నారు. కొన్నిసార్లు ఈ విధమైన కర్మ చేయుట వలన వారు చెట్లుగా, కుక్కగా, పిల్లిగా, కీటకముగా లేదా మానవునిగా జన్మించెదరని వారు వినినప్పుడు కూడ ఈ విషయముల గురించి పట్టించుకోరు. "నేను కుక్కగా జన్మించినచో నష్టమేమిటి? నేను అన్నింటిని మరచిపోతాను" అని పాశ్చాత్య దేశాలలోని ఎన్నో విశ్వవిద్యాలయ విద్యార్థులు అంటుంటారు. వారు ఎంతగా అజ్ఞానములో మునిగి ఉన్నారంటే, వారిని మంద(బుద్ధిహీనులు) అని అంటారు. పూర్వం భారతదేశంలోని బ్రాహ్మణులు పరబ్రహ్మన్‌ను అర్థం చేసుకొనుటకు ఆసక్తిని కలిగి ఉండేవారు. *"అథాతో బ్రహ్మజిజ్ఞాసా."* ఏమైనను, ప్రస్తుతకాలంలో జనులందరూ శూద్రులే, మరియు బ్రహ్మన్‌ను అర్థం చేసుకొనుటకు ఎవరూ శ్రద్ధ చూపించుట లేదు. వారు అధికముగా డబ్బు సంపాదించుటలోను చలన చిత్రములను చూచుటలోనే ఆసక్తిని కనపరుస్తుంటారు.

మానవ జీవితమనేది మన నిజస్థితిని అర్థం చేసుకొనుట కొరకు నిర్దేశించ బడినది. కాబట్టి భగవద్గీత నుండి ఉపదేశములను పొందవలెను. శ్రీకృష్ణుని గురువుగా అంగీకరించి అర్జునుడు మనకు స్వయంగా బోధిస్తున్నాడు. శ్రీకృష్ణుడిని తనకు గురువుగా ఉండవలెనని మరియు బోధించమని అతడు ప్రార్థించెను.

శ్రీకృష్ణుడి ఉపదేశాలు కేవలం అర్జునుడికే కాకుండా అందరికొరకు ఉద్దేశించబడినవి. భగవద్గీతలో మనము గురువు కొరకు అన్వేషించ వలెనని శ్రీకృష్ణుడు బోధిస్తున్నాడు. ఆదిగురువు స్వయంగా శ్రీకృష్ణుడే, మరియు శ్రీకృష్ణునికి ప్రాతినిధ్యము వహించు వారందరు గురువులే. నేను వ్యాపారినైనచో, ఎవరైన నా తరపున వెళ్ళి వ్యాపార లావాదేవీలను సాగించినచో అతడు నా ప్రతినిధిగా పిలువబడును. ఒకరు కేవలం నా ప్రతినిధి అని చెప్పుకుంటూ, నా వ్యాపార లావాదేవీలను నడిపి డబ్బులు ఇతర వాటికి ఉపయోగించినచో అతడు నాకు నిజమైన ప్రతినిధి ఎలా కాగలడు.

"నేను శ్రీకృష్ణుడనైనాను" అని శ్రీకృష్ణుని భక్తులెన్నడు చెప్పరు. అలాంటి వ్యక్తి ప్రతినిధి లేదా గురువు కాలేడు. అతడు కేవలము మోసగాడు. శ్రీకృష్ణుని గురించి ప్రచారము చేసేవాడు శ్రీకృష్ణుని ప్రతినిధి అనబడును. "సర్వం నాకు అర్పించి శరణు వేడుము" అని శ్రీకృష్ణుడు చెబుతున్నాడు. అలాగే శ్రీకృష్ణుని ప్రతినిధి కూడ అన్నింటిని విడిచి కేవలం శ్రీకృష్ణునికి మాత్రమే శరణు వేడుమని చెబుతాడు. దీనిని అర్థం చేసుకొనుట అంత కష్టమేమి కాదు. ఎవరైనను, శ్రీకృష్ణుడి ప్రతినిధులు కావచ్చును. గత రెండు వందల సంవత్సరాలుగా, ఎంతోమంది యోగులు మరియు స్వామీజీలు విదేశాలకు వెళ్ళారు. అయినను ఎవరు కూడ శ్రీకృష్ణుడి గురించి చెప్పలేదు. వారు కల్పిత భారతీయ సంస్కృతిని మాత్రమే అందించారు. ఎవరు కూడ వైదిక సంస్కృతిని యథాతథంగా అందించలేదు.

మనం భగవద్గీతను యథాతథంగా పఠించవలెను. అంతేకాకుండ తత్త్వాన్ని అర్జునుడు అర్థం చేసుకున్నట్లుగా అర్థం చేసుకోవలెను. అర్జునుడు శ్రీకృష్ణుని స్నేహితుడు. అతడు శ్రీకృష్ణుడితో కూర్చొని ఒక స్నేహితుడు మరొక స్నేహితునితో సంభాషిస్తున్నట్లుగా సంభాషిస్తుండెను. పదకొండవ అధ్యాయములో శ్రీకృష్ణుడి విశ్వరూపమును దర్శించిన పిదప అర్జునుడు శ్రీకృష్ణునితో ఇలా తెలిపెను : "పూర్వం నేను మిమ్ములను, ఓ కృష్ణా, ఓ యాదవ, ఓ నా స్నేహితుడా! అని మీ వైభవమును తెలియక సంబోధించితిని, దయచేసి వెర్రితో లేదా ప్రేమతో నేను చేసిన నా ఆపరాధముల నన్నింటిని మన్నింపుము" అని పలికెను.

శ్రీకృష్ణుడు తన స్నేహితు డైనప్పటికినీ అతడు దేవాదిదేవుడని మరియు అతడే తనకు తగిన గురువు అని అర్జునుడు అర్థం చేసుకొనెను. అందుకే అతడు భగవద్గీత ప్రారంభం(2.7)లో శ్రీకృష్ణుడితో ఇలా అన్నాడు : "*శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్*" – "ఇప్పుడు నేను మీ శిష్యుడను మరియు శరణువేడిన

జీవుడను. దయచేసి ఆదేశింపుము.”

ఈ ఉపదేశములన్నీ మనకు భగవద్గీత నుండి లభించును. మరియు భగవద్గీతను చదివే వారెవరైనను శ్రీకృష్ణుడిని గురువుగా అంగీకరించ వలెను. మనము గురువుకు సేవ చేస్తూ అతడికి శరణు పొందవలెను. ఏవరో ఒక వ్యక్తిని గురువుగా అంగీకరించమని కాదు. గురువు శ్రీకృష్ణునికి ప్రతినిధియై అతడికి శరణు పొందినవాడై యుండవలెను. శరణాగతి అనగా గురువు చెప్పిన దంతయు అంగీకరించుటయే. “నేను నా గురువు మాటను లెక్కచేయను, అయినను నేను శిష్యుడను” అని ఎవరూ భావించరాదు. అది గురువును అంగీకరించుట అనబడదు. ఈ విధముగా గురువును అంగీకరించుట మనేది ఇప్పుడు అలవాటుగా మారినది, దీనివలన ఎవరూ లాభమును పొందలేరు. శ్రీకృష్ణుడు అర్జునుడికి గురువైన వెంటనే అతడిని మందలించుటను ప్రారంభించెను. శ్రీకృష్ణుడు అతడితో ఇట్లు పలికెను :

అశోచ్యానన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే
గతాసూనగతాసూంశ్చ నానుశోచన్తి పణ్డితాః

“నీవు ప్రజ్ఞావంతులు వచింపదగిన పలుకులను పలుకుచు దుఃఖింపదగని విషయమును గూర్చి దుఃఖిస్తున్నావు. జీవించి యున్నవారిని గూర్చిగాని, మరణించిన వారిని గూర్చి గాని పండితులు శోకింపరు.” (భ.గీ. 2.11)

ఈ విధముగా శ్రీకృష్ణుడు అర్జునునితో ఏ విషయముల గురించి అయితే విచారింపరాదో ఆ విషయాల గురించి మూర్ఖుని వలె దుఃఖిస్తున్నావని ప్రధానముగా మందలించెను. అర్జునుడు శరీరమును గురించి శోకిస్తూ తన బంధువులు యుద్ధములో చంపబడుటమనేది ఘోరమని భావించెను. కాని అతడు శోకించుటకు ఇది సరియైన విషయము కాదు. యోగ్యుడైన వ్యక్తి ఆత్మవిముక్తి కొరకు విచారింప వలెను. అందుకే శ్రీకృష్ణుడు ప్రారంభములో శరీరము మరియు ఆత్మకు మధ్యగల భేదమును వివరించెను.

ఈ కృష్ణ చైతన్య ఉద్యమం కూడ ఆత్మ విషయములోనే శ్రద్ధచూపును. అందుకే మేము ‘చైతన్యము’ అనే పదమును ఉపయోగించాము. ఎందుకనగా, చైతన్యమనేది ఆత్మకు సంబంధించినది. చైతన్యం అనేది ఆత్మ ఉనికికి లక్షణము. ఆత్మ శరీరములో నున్నందున శరీరము సుఖదుఃఖములను అనుభవించును. ఆత్మ శరీరమును విడిచినపుడు శరీరమును ముక్కలు ముక్కలుగా నరికినను అది స్పందించదు. చైతన్యము లేకపోవుటయే దీనికి కారణము. చైతన్యము కారణముగా

మనం సుఖదుఃఖములను అనుభవిస్తున్నాము. అందుకే శ్రీకృష్ణుడు చైతన్యమనేది శాశ్వతమైనదని శరీరం కాదని మనకు బోధిస్తున్నాడు. చైతన్యము శాశ్వతమైనదని అర్థం చేసుకొనుటకు మనం మన చైతన్యమును శుద్ధిచేసుకోవలెను. మనము అలాచేసినచో మన జీవితములు పరిపూర్ణములగును. మరణ సమయములో మన చైతన్యము మనలను మరో శరీరములోనికి తీసుకు వెళుతుంది. మనస్సు, బుద్ధి, అహంకారము అనునవి సూక్ష్మశరీరములోని భాగములు. అలాగే ఆత్మ అనేది సూక్ష్మమైనది. మనం మనస్సును కలిగి ఉన్నప్పటికినీ దానిని చూడలేమనే విషయం మనకు తెలుసును. అంతేకాకుండ మనము బుద్ధి, అహంకారము మరియు ఆత్మను కూడ చూడలేము. మనం ఈ స్థూల శరీరమును మాత్రమే చూడగలము. మరియు ఈ భౌతిక శరీరము అంతమైనపుడు సర్వం నశించునని మనము చెబుతుంటాము. ఈ విషయములను అర్థం చేసుకొనుటకు అర్జునుడు శ్రీకృష్ణుని ఆశ్రయించినట్లుగా మనం కూడ గురువును ఆశ్రయించవలెను.

శ్రీకృష్ణుడు అర్జునుడితో మర్యాదపూర్వకముగా అతడు పండితుడు కాడని తెలిపెను : “నీవు పండితుడవు కావు. జీవాత్మ అనేదే నిజమైన జీవపదార్థమని అర్థం చేసుకొనుటకు ప్రయత్నింపుము.” అత్మ విషయంలో శ్రద్ధ తీసుకొనుట మనేది వైదిక విద్య. ప్రస్తుతము ఆత్మ అనేది భౌతిక విషయములతో బంధించ బడినది. ఆత్మ క్షోభిస్తున్నది, కాబట్టి దానిని భౌతిక బంధముల నుండి విడిపించుట లోనే మన శ్రేయస్సు కలదు. ఇది వాస్తవమైన విద్య. ఈ విద్యను అభ్యసించుటకు మనము సరియైన గురువును ఆశ్రయించవలెను. శ్రీకృష్ణుడు గురువుగా ఉండనే ఉన్నాడు. అలాగే శ్రీకృష్ణుని అవతారమైన కపిలదేవుని రూపములో కూడ గురువు కలడు. శ్రీకృష్ణుడు మనకు తాను శరీరం యొక్క అధిపతిని అని చెబుతూ అనేక విధములుగా వివరించెను. ఆత్మను ఖండించలేమని, అగ్ని ద్వారా దహింప జాలమని, నీటి ద్వారా తడుపలేమని, లేదా గాలి ద్వారా ఎండింప జాలమని అతడు చెప్పియుండెను. జడ పదార్థము అనేది జడ పదార్థముతోనే కలియును. కాని ఆత్మ అనేది భౌతిక లోకానికి చెందినది కాదు. ఆత్మ అనేది భౌతిక కర్మల, వికర్మలకు అతీతమైనదని దీనిద్వారా అర్థమవుతుంది. ఈ భౌతిక లోకంలో రాయి మరియు లోహం కూడ కరుగుతుంది. కాని భౌతిక ప్రకృతి నియమాలు ఆత్మకు వర్తించవు.

ఈ విషయములను అర్థం చేసుకొనుటకు మనం శ్రీకృష్ణుని ప్రతినిధిని మిక్కిలి శ్రద్ధతో సమీపించవలెను. ఒక గ్రుడ్డివాడు మరొగ్రుడ్డివాడికి మార్గదర్శనము

చేయు బూటకపు గురువును మనము ఆశ్రయించకూడదు. జ్ఞానముతో కన్నులు తెరవబడి, పరమసత్యమును దర్శించినవారి నెవరినైనను మనం సమీపించవలెను. సూర్యుడు అందరూ దర్శించుకునేలా ఉన్నట్లుగానే పరమసత్యం కూడ కలదు. సూర్యుడు దాగి ఉండడు, కాని సూర్యుని నుండి దాగి ఉండుటకు వ్యక్తి తన గది తలుపులు మూసుకొని లోపల దాగి ఉండవచ్చును. సూర్యుడిని చూచుటకొరకై మనం తలుపులను తెరిచి ఉంచవలెను. అదేవిధముగా శ్రీకృష్ణుడు, భగవంతుడు ఉన్నందున మనం శ్రీకృష్ణుడిని సమీపించి భగవంతుడంటే ఏమిటి అని తెలుసు కొనుటకు భగవద్గీత నుండి ఉపదేశములను పొందవలెను. కాని మూఢులు ఇలా చేయకుండ శుష్క సిద్ధాంతములను రూపొందిస్తుంటారు. నిజానికి దీనివలన ఎలాంటి ఇబ్బంది లేదు. ఎందుకనగా శ్రీకృష్ణుడు స్వయంగా ఉన్నాడు, మరియు అతడి ఉపదేశములు కలవు. శ్రీకృష్ణుడు గొప్ప దయ కలవాడు. అందుకే అతడు ఇలా చెబుతున్నాడు : "సరే, మీరు నన్ను ఈ విధముగా అర్థం చేసుకోలేక పోయినచో నన్ను నీటిలో దర్శింపుము. రండి, మీరు కనుక నన్ను అలా కూడ అర్థం చేసుకోలేక పోయినచో, నన్ను సూర్యకిరణాలలో దర్శించుకొనుము" దీంట్లో ఎలాంటి ఇబ్బంది లేదు. కాని మనం గట్టిమూర్ఖమైన పట్టుదల గలవారము, మరియు మాయ కూడ ఎంతో బలమైనది. మనం శ్రీకృష్ణుడిని భగవంతుడని అంగీకరించుటకు ప్రయత్నించి నప్పుడు మాయ వెంటనే : "శ్రీకృష్ణుని ఎందుకు నీవు అంగీకరిస్తున్నావు? వద్దు, వద్దు ఎంతోమంది దేవిదేవతలు ఉన్నారు" అని మన చెవిలో చల్లగా చెబుతుంది. ఏమైనను శాస్త్రములు : *"కృష్ణస్తు భగవాన్ స్వయమ్"* అని చెప్పుచున్నవి. *"ఈశ్వరః పరమః కృష్ణః"* – "శ్రీకృష్ణుడు దేవాదిదేవుడు." మనము శాస్త్రముల నుండి ఆచార్యుల నుండి ఉపదేశములను పొందవలెను. భారతదేశంలో శ్రీమద్ రామనుజాచార్యులు, శ్రీ మధ్వాచార్యులు, శ్రీ విష్ణుస్వామి, శ్రీపాద శంకరాచార్యులు, మరియు గురునానక్ వంటి ఎందరో ఆచార్యులు కలరు. వీరందరు శ్రీకృష్ణుడిని దేవాదిదేవుడని అంగీకరించిరి. కాబట్టి మనమెందుకు అతడిని తిరస్కరించవలెను? మనం ఎందుకు మరొక పోటీదారుని అంగీకరించవలెను? ఊహాకల్పనలలో మాత్రమే నిమగ్న మవ్వకుండ, శ్రీకృష్ణుడిని పరిపూర్ణ చైతన్యముతో అంగీకరించి ఆనందించవలెను. ఇది కేవలము గురువు సహాయము చేతనే సాధ్యపడుతుంది. కాబట్టి దేవహూతి తన కుమారుడైన కపిలదేవుని మరికొన్ని ప్రశ్నలను అడుగుచున్నది.

శ్లోకము 29

యో యోగో భగవద్బాణో నిర్వాణాత్మంస్త్వయోదితః
కీదృశః కతి చాంగాని యతస్తత్త్వావబోధనమ్

నీవు వివరించినట్టి యోగవిధానము దేవాదిదేవుడగు భగవానుని పైననే లక్షింపబడి, భౌతిక అస్తిత్వమును పూర్తిగా అంతమొందించుటకే ఉద్దేశింపబడినది. అట్టియోగ స్వభావమును నాకు ఎరుకపరుచుము. అట్టి ఉదాత్తమగు యోగమును యథార్థముగా నెరుగుటకు ఎన్ని మార్గములు కలవు?

భాష్యము : పరమసత్యపు వివిధావస్థలను లక్ష్యించుచు యోగవిధానము అనేక రకములుగా నున్నది. జ్ఞానయోగ విధానము నిరాకార బ్రహ్మతేజముపై లక్షించి యుండును; హఠయోగము పరతత్త్వము యొక్క పరమాత్మ తత్త్వముపై లక్షించి యుండును; కాని శ్రవణ, కీర్తనాది నవ విధములుగా నిర్వహింపబడు భక్తియుక్త సేవ మాత్రము భగవానుని పరిపూర్ణానుభవము పైననే లక్షితమై యుండును. ఆత్మసాక్షాత్కారమునకు వివిధ పద్ధతు లున్నప్పటికినీ దేవహూతి ఇచ్చట ప్రత్యేకముగా భక్తియోగ విధానమునే (భగవానునిచే ఇదివరకే మొట్టమొదట వివరింపబడినది) తెలుపుచున్నది. శ్రవణము, కీర్తనము, స్మరణము, వందనము, మందిరమందు భగవదర్చనము, భగవత్సేవనము, భగవానుని ఆజ్ఞాపాలనము, ఆ దేవాదిదేవునితో మిత్రత్వము నెరుపుట, అంత్యమున సమస్తమును ఆతని సేవ యందు సమర్పణము కావించుట అనునవియే భక్తియోగమందలి వివిధాంశములు.

ఈ శ్లోకమునందు *'నిర్వాణాత్మన్'* అను పదము ప్రధానమైనది. భక్తియుక్త సేవా విధానమును అంగీకరించనిదే ఎవ్వరును భౌతక అస్తిత్వమును అంతమొందింప జాలరు. జ్ఞానులు జ్ఞానయోగము నందు అభిరుచిని కలిగి యుందురు; గొప్ప తపస్సు నొనరించి మనుజుడు తననుతాను బ్రహ్మజ్యోతి వరకు ఉద్ధరించు కొనినను తిరిగి భౌతిక జగమునకు పతనము చెందెడి అవకాశము కలదు. అనగా జ్ఞానయోగ మనునది నిజముగా భౌతిక అస్తిత్వమును నశింప చేయబోదు. అదేవిధముగా పరమాత్మ తత్త్వముపై లక్షింపబడి యుండు హఠయోగ విధానమునకు సంబంధించినంత వరకు దానిని అభ్యసించు పెక్కుయోగులు (విశ్వామిత్రుని వంటివారు) పతనము చెందియుండిరి. కాని దేవాదిదేవుని సన్నిధికి ఒక్కసారి చేరిన పిదప భక్తియోగులు తిరిగి ఈ భౌతిక జగత్తునకు మరలిరారు; ఈ విషయము భగవద్గీత యందు స్థిరపరుపబడినది. ఎవరును *"యద్గత్వా న*

నివర్తన్తే" – అచ్చటకు చేరిన పిదప తిరిగిరారు. "*త్యక్త్వా దేహం పునర్జన్మ నైతి*"– ఈ దేహమును త్యజించిన పిమ్మట, అతడు భౌతిక దేహమును తిరిగి పొందదు. 'నిర్వాణము' అనగా ఆత్మ యొక్క అస్తిత్వమును నశింపచేయదు. ఆత్మ నిత్యమైనట్టిది, శాశ్వతమైనది. కనుక 'నిర్వాణము' అనగా మనుజుని భౌతిక అస్తిత్వమును అంతమొందించుట అనియే భావము; మరియు దానిని అంతమొందించుట అనగా భగవద్ధామమున కేగుటయే.

జీవుడు ఏ విధముగా ఆధ్యాత్మిక జగత్తు నుండి భౌతిక జగత్తునకు పతనము చెందునని కొన్నిమార్లు ప్రశ్నింప బడుచుండును. దానికి ఇచ్చట సమాధాన మొసగ బడినది. భగవానునితో ప్రత్యక్ష సంబంధము పొందునట్లుగా వైకుంఠ లోకములకు ఉద్ధరింప బడనంత వరకు జీవుడు పతనము చెందు(నిరాకార బ్రహ్మానుభూతి నుండి లేదా ధ్యానసమాధి నుండి) అవకాశముండును. ఈ శ్లోకమందలి '*భగవద్బాణః*' అను మరొక పదము కూడ ప్రధానమైనది. *బాణః* అనగా భక్తియోగ మనునది దేవాదిదేవుని పైననే లక్షింపబడి యున్నట్టి బాణము. నిరాకార బ్రహ్మజ్యోతి తేజమునో లేదా పరమాత్మానుభూతినో పొందుటకు భక్తియోగము మనుజుని ప్రేరేపింపదు. అతి వాడియైనది మరియు వేగము కలదియైన ఆ 'బాణము' నిరాకార బ్రహ్మము, హృదయస్థ పరమాత్మ తత్త్వస్థితులను ఛేదించుకొని నేరుగా దేవాదిదేవుడినే చేరగలదు.

మనం పరమ పురుషుడిని '*తత్త్వతః*' అనగా యథాతథముగా తప్పక అర్థం చేసుకోవలెను. సాధారణంగా జనులు భగవంతుని పట్ల మరియు అతనితో తమకు గల సంబంధమును తెలుసుకొనుటకు ఆసక్తిని కనపరచరు. ఏమైనను వైదిక ఆదేశాలన్నియు దీనికొరకై నిర్దేశించబడినవి. మొట్టమొదట మనం భగవంతుని గూర్చి తెలుసుకోవలెను. తరువాత అతనితో మనకు గల సంబంధమును గూర్చి తెలుసుకోవలెను. ఆ సంబంధము ననుసరించి నడుచుకొనుట అనేది తరువాత మెట్టు. కొన్నికోట్ల జనులలో ఒకరు జీవిత లక్ష్యం కొరకు ఆసక్తిని కలిగి ఉంటారని శ్రీకృష్ణుడు తెలుపుచున్నాడు. మానవ జీవితమనేది దీనికోసమై ఉద్దేశించ బడినది. కాబట్టి ఎవరైన దీనిని అర్థం చేసుకొనుటకు ప్రయత్నించనిచో అతడు పశువు కంటే హీనమైనవాడు. మనము కేవలము భగవంతుడిని మరియు అతడితో గల సంబంధమును తెలుసుకొనుటయే కాకుండ ఆ సంబంధము ననుసరించి నడుచు కోవలెను. అప్పుడే మన జీవితములను పరిపూర్ణము చేసుకోగలము. సిద్ధస్థితిలో జీవుడు తనను "*అహం బ్రహ్మాస్మి*" అనగా "నేను ఈ శరీరమును కాదు" అని

అర్థం చేసుకొనును. ఇది బ్రహ్మన్ సాక్షాత్కారము అనగా *'బ్రహ్మభూత'* స్థితి. ఎవరైనను ఈ స్థితికి చేరుకొనినచో అతడు ఆనందమును పొందును. ఏమైనను ఈ స్థితిని అధిగమించి భక్తియోగ స్థితికి చేరుకోవలెను. ఆ స్థితిలో వైవిధ్యములు మరియు ఆనందము కలదు. ముందే తెలిపినట్లుగా, మనం ఆధ్యాత్మిక వైవిధ్యముల కొరకు అన్వేషిస్తున్నాము. కాబట్టి మనం ఆధ్యాత్మిక లోకములను చేరనిచో, భౌతిక వాతావరణములోకి తిరిగి పతనము చెందవలసి వస్తుంది. 'బ్రహ్మ సంహిత' (5. 29,30) ఆధ్యాత్మిక జగత్తులోని వైవిధ్యములను వర్ణించెను :

చింతామణి ప్రకరసద్మసు కల్పవృక్ష –
లక్షావృతేషు సురభీరభిపాలయంతమ్
లక్ష్మీసహస్రశతసంభ్రమ సేవ్యమానం
గోవిందమాదిపురుషం తమహం భజామి

"ఆదిదేవుడు, పురాణపురుషుడైన గోవిందుడు చింతామణి సమూహములచే నిర్మితములైన భవనముల యందు స్థితుడు. లక్షలాది కల్పవృక్షములచే ఆ భవనములు పరివేష్టితములై యున్నవి. కామధేనువులు ఆయన చల్లని నీడలో పోషింపబడుచున్నవి. లక్షలకొలది లక్ష్మీదేవతలు లేదా గోపికలు అత్యంత ప్రేమాదరములతో ఆ పురుషోత్తముని సేవించుచున్నారు. అట్టి గోవిందుని నేను భజించుచున్నాను."

వేణుం క్వణంతమరవిందదళాయతాక్షం
బర్హావతంసమసితాంబుదసుందరాంగమ్
కందర్పకోటికమనీయవిశేషశోభం
గోవిందమాదిపురుషం తమహం భజామి

"ఆదిపురుషుడైన గోవిందుడు మురళిని మ్రోగించుటలో కుశలుడు. ఆయన కన్నులు కమల దళములవలె విశాలమైనవి. నెమలి పింఛము ఆయన శిరోభూషణము. ఆయన నీలమేఘశ్యామ సుందర శరీరుడు. కోటిమన్మధుల సౌందర్య శోభలు గూడ ఆయన సౌందర్యమునకు సాటిరావు. అట్టి మహామహుడు ఆదిపురుషుడైన గోవిందుని నేను సేవించుచున్నాను."

శ్రీకృష్ణుని స్వరూపమును మనమేదో కళాకారుని చిత్రీకరణ అని భావించ రాదు. వేదాలలో అతడిని *'వేణుం క్వణంతమరవిందదళాయతాక్షమ్'* అని వర్ణించ

బడెను. అతడు వేణుగాణమును చేయును. అతడి కన్నులు తామర రేకులవలె ఉండును. అతడు నెమలి ఫించెం ధరించును. మరియు అతని రంగు నీలమేఘము వలె అందముగా ఉంటుంది. అతడి సౌందర్యము ఎంతటి గొప్పదైనదంటే అతడు కొన్ని వందలకొలది మన్మథులను ఆకర్షించును*(కందర్పకోటికమనీయవిశేష శోభమ్).* గోవిందుని గురించిన ఇలాంటి వర్ణణలు శాస్త్రములలో ఎన్నో లభించును.

నమిలిన దానినే ఈ భౌతిక లోకంలో తిరిగి నమలుతుంటారు. తీసివేసిన దానినే తిరిగి తీసుకొని నమలుతుంటారు. ఆధ్యాత్మిక వైవిధ్యములనేవి ఇలా ఉండవు. ఆధ్యాత్మిక వైవిధ్యములు *'అనందాంబుధివర్ధనమ్'* : ఇది నిరంతరముగా వృద్ధి చెందుతుండును. ఇది సముద్రము కంటే గొప్పది. ఎందుకంటే సముద్రము పెరగదు. సముద్రమునకు పరిమితులు కలవు, మరియు దాని పరిమితిలో అది ఉండును. ఏమైనను ఆనందమనే సముద్రము నిరంతరముగా పెరుగుతూనే ఉంటుంది. మనం ఎంతగా ఆధ్యాత్మిక ఆనందములో ప్రవేశిస్తామో, అంతగా మన ఆనందము పెరుగుతూనే ఉంటుంది.

'హరేకృష్ణ' ఉద్యమంలోని యువత అన్ని సమయాల్లోను 'హరేకృష్ణ' మహా మంత్రమును కీర్తిస్తుంటారు. ఈ మంత్రం కనుక భౌతికమైనచో ఎంతకాలం వారు అలా కీర్తంచగలరు? భౌతిక నామాలను ధీర్ఘకాలము కీర్తించలేము. ఎందుకంటే అది అలసటను కలిగించి మందగించును. 'హరేకృష్ణ' మహామంత్రము ఆధ్యాత్మికము కానిచో, ఎవరు దానిని కీర్తించి సంతృప్తి పొందలేక పోయేవారు. మనం "మిస్టర్ జాన్, మిస్టర్ జాన్, మిస్టర్ జాన్" అని కీర్తిస్తే ఒక గంటలోనే విసుగు చెందుతాము. మనం ఎంతగా ఆధ్యాత్మిక పురోభివృద్ధిని సాధిస్తామో అంతగా 'హరేకృష్ణ' మహామంత్ర కీర్తన నుండి ఆనందమును పొందుతాము.

శ్రీకృష్ణుని సాంగత్యములోనే పరిపూర్ణ ఆనందమును అనుభవించ గలము. మనం శ్రీకృష్ణుడితో సేవకుని వలె, మిత్రుని వలె, ఒక తండ్రి వలె, ఒక తల్లి వలె, లేదా ప్రేయసి వలె సాంగత్యము చేయవచ్చును. శాంత, దాస్య, సఖ్య, వాత్సల్య మరియు మాధుర్యమను ఐదు ముఖ్య రసములు కలవు. ఈ భౌతిక లోకంలో కూడ ఈ రసములను మనం చూస్తుంటాము. మనం ఎవరికో తండ్రి వలె, పుత్రుని వలె, ఏ ప్రియుడి వలె, ప్రేమికుడి వలె, యజమాని సేవకుని వలె లేదా మరో సంబంధమును కలిగి ఉన్నాము. ఈ సంబంధములన్నీ ఆధ్యాత్మిక లోకంలోని శ్రీకృష్ణునితో మనకు గల సంబంధములకు ప్రతిబింబములు. భౌతిక ప్రపంచములో నేడు నేను పుత్రవాత్సల్యమును అనుభవించవచ్చును. కాని రేపు ఆ కుమారుడే

నాకు బద్ధశత్రువు కావచ్చును. ఇలాంటి ప్రేమలో శాశ్వతత్వమనేది ఉండదు. నా కుమారుడు శత్రువు కాకపోయినను వాడు మరణించవచ్చును. నేడు నేను ఏ యువతినో లేదా యువకుడినో ప్రేమించవచ్చును, కాని అదే సంబంధము రేపు విడిపోవచ్చును. ఇవన్నీ భౌతికలోకంలోని లోపాల వలన జరుగుచున్నవి. కాని ఆధ్యాత్మిక లోకములోని ఈ సంబంధము లెన్నడు విడిపోవు. కేవలము అవి నిరంతరముగా పెరుగుతూ ఉండును. కాబట్టి దీనినే పరిపూర్ణత్వము అంటారు.

శ్రీకృష్ణుడు సురభి ఆవులను మేపుతూ ఆనందించును. కాని మాయావాదులు దీనిని అర్థం చేసుకోలేరు. "ఈ కృష్ణుడేమిటి?" అని వారంటుంటారు. బ్రహ్మదేవుడు కూడ భ్రాంతి చెంది, "శ్రీకృష్ణుడు, ఈ వృందావనంలోని బాలుడు పూజింపబడుట మనేది ఎలా సాధ్యము?" అని భావించెను. "అతడిని దేవాదిదేవుడు అంటున్నారు, ఇది ఎలా సాధ్యము?" ఇంద్రదేవుడు కూడ ఈ విధముగా భ్రాంతి చెందెను. మనం భ్రాంతికి లోనుకాకుండ ఉండవలెననిన, శ్రీకృష్ణుడిని మనం సత్యమని శ్రీకృష్ణుడి నుండి లేదా అతడి ప్రతినిధి నుండి తెలుసుకోవలెను.

శ్రీకృష్ణుడి లీలలు సాధారణమైనవి కావు, అవి దివ్యమైనవి. వాటిని మనం అర్థము చేసుకోగలిగినప్పుడు వెంటనే ముక్తిని పొందగలుగుదుము. గోపికలతో శ్రీకృష్ణుడి లీలలను అర్థము చేసుకోవలెను. ఈ లీలలు సాధారణమైనవి కావు. ఈ భౌతిక లోకంలో ఒక యువకుడు అనేక యువతులతో నృత్యం చేయాలనుకుంటాడు. కాని శ్రీకృష్ణుడు గోపికలతో నృత్యం చేయుట దీనికి భిన్నమైనది. ఎందుకంటే, జనులు శ్రీకృష్ణుడిని అర్థం చేసుకోనందున వారు గోపికలతో శ్రీకృష్ణుడి నృత్యము గురించి వినినప్పుడు, వారు దీనినొక అవకాశముగా తీసుకొని "యువతులలో నృత్యం చేసెదము" అని అంటుంటారు. ఈ విధముగా వారు నరకానికి వెళ్ళుతుంటారు. అందుకే మనం ప్రామాణిక వ్యక్తి నుండి శ్రీకృష్ణుడి లీలల గురించి తెలుసుకోవలెను. గోపికలతో శ్రీకృష్ణుడి లీలలు అత్యంత రహస్యమైనందున వాటిని వెంటనే అర్థం చేసుకొనుటకు ప్రయత్నించరాదు. ఈ లీలలన్నీ భాగవతములోని దశమ స్కంధములో వివరించబడెను. దీని అర్థమేమనగా ముందుగా మనం తొమ్మిది స్కంధములను క్రమముగా చదివిన తరువాతనే మనం శ్రీకృష్ణుడిని యథాతథంగా అర్థం చేసుకోగలము. మనం ఈ తొమ్మిది స్కంధములను అర్థం చేసుకొనిన పిదప పదవ స్కంధమునకు వెళ్ళవలెను. మనము ఈ విధముగా శ్రీకృష్ణుడి లీలలు సాధారణమైనవి కావని దివ్యమైనవని అర్థం చేసుకొనిన వెంటనే ముక్తిని పొందగలము.

మనం శ్రీకృష్ణుని గురించి శ్రవణము చేయుట, అతని నామాలను కీర్తించుట, అతడిని పూజించుట లేదా ప్రార్థించుటను చేయవలెను. మనం అన్నివేళలా గురువు ఆధీనములో లేదా స్వయంగా శ్రీకృష్ణుని ఆధీనములోనైన సేవ చేయవలెను. ఉదాహరణకు శ్రీరాముని ఆజ్ఞలను మాత్రమే హనుమంతుడు పాటించెను. సామాన్య దృష్టి ననుసరించి హనుమంతుడు విద్య లేనివాడు. అతడు వేదాంతమును బోధించలేదు, అతడు కేవలం శ్రీరామచంద్రుని ఆజ్ఞలను పాటించి పరిపూర్ణత్వమును సాధించెను. మరోవైపు అర్జునుడు శ్రీకృష్ణునితో అంతరంగిక స్నేహమును కలిగి ఉండెను. అర్జునుడు వేదాంతి కాడు, అతడు యోధుడు. అతడు రాజకీయము మరియు యుద్ధవిషయాల గురించి ఆలోచించవలెను. కాబట్టి అతడికి వేదాంతమును చదువుటకు సమయము లేకుండెను. ఏమైనను అతడు గొప్పభక్తుడు. "ఓ! అర్జునుడు వేదాంతి కాడు, బ్రాహ్మణుడు లేదా సన్న్యాసి కూడ కాడు. అటువంటప్పుడు శ్రీకృష్ణుడు అతడిని భక్తునిగా ఎందుకు అంగీకరించెను" అని జనులు అడగవచ్చును. భగవద్గీత(4.3)లో శ్రీకృష్ణుడు అర్జునుడు తన ప్రియ మిత్రుడని, భక్తుడని తెలిపెను : *"భక్తోఽసి మే సఖా చేతి."* ఎవరైన భక్తుడైనచో వారికి ఎటువంటి భౌతిక ఆటంకములు ఉండవు.

నిజానికి భక్తి అనేది సహజమైనది మరియు స్వచ్ఛందమైనది. శ్రీకృష్ణుని నిస్వార్థముగా సేవించవలెను. స్వార్థముతోనైనను శ్రీకృష్ణునికి సేవ చేయుటమనేది ఎల్లప్పుడు శ్రేయస్కరమైనది. ఎవరైనను మనస్సులో ఏదైన స్వార్థచింతనతో శ్రీకృష్ణుడిని ఆశ్రయించినను అతడిని పుణ్యాత్ముడని భావించవలెను. ఉదాహరణకు, ధృవమహారాజు ప్రారంభములో శ్రీకృష్ణుడిని స్వార్థముతో ఆరాధించెను. కాని భక్తియుక్త సేవలో పరిపూర్ణత్వమును సాధించిన తరువాత అతడు నిస్వార్థుడయ్యెను. నిజానికి అతడు శ్రీకృష్ణుని దర్శించినప్పుడు : "నాకు మీ నుండి ఏమి వద్దు, నాకు మీ సేవ తప్ప మరే వరము అవసరము లేదు" అని పలికెను. శ్రీకృష్ణుని దివ్య గుణములను శ్రవణము చేస్తూ మనం ఏదోవిధముగా కృష్ణచైతన్యము పట్ల ఆకర్షితుల మైనచో మన జీవితాలు పరిపూర్ణమగును. *"తస్మాత్ కేనప్యుపాయేన మనః కృష్ణే నివేశయేత్"* – "ఏదో విధముగా కృష్ణచైతన్యములో మన మనస్సులను లగ్నము చేయవలెను." (భాగ. 7.1.32) అప్పుడే శ్రీకృష్ణుడు మనకు సహాయము చేయును. భగవద్గీత(10.10)లో తెలిపినట్లుగా అతడు మనకు హృదయము నుండి జ్ఞానమును ప్రసాదించును :

తేషాం సతతయుక్తానాం భజతాం ప్రీతిపూర్వకమ్
దదామి బుద్ధియోగం తం యేన మాముపయాన్తి తే

“నన్ను ప్రేమతో సేవించుట యందు నిరంతరాసక్తులై యుండువారికి, నన్ను చేరుటకు ఉపయోగపడు బుద్ధిని నేనొసంగుదును.” ఇది నిజమైన బుద్ధియోగ. భక్తియోగ అనగా బుద్ధియోగ. ఎందుకనగా, ఉన్నతమైన జ్ఞానవంతులు కృష్ణ చైతన్యమును అంగీకరించుటకు నిర్ణయించు కొనెదరు. ఈ విధముగా, శాస్త్రము మరియు ఆధ్యాత్మికాచార్యుని నిర్దేశకత్వములో భక్తియుక్త సేవలో నిమగ్నులమై జీవితమును పరిపూర్ణము చేసుకోవచ్చును. దేవహూతి దీనిని అర్థం చేసుకొని, అర్జునుడు శ్రీకృష్ణునికి యుద్ధరంగములో శరణుపొందినట్లుగా తనకుతాను సమర్పించుకొనెను.

శ్లోకము 30

తదేతన్మే విజానీహి యథాహం మన్దధీర్హరే
సుఖం బుద్ధ్యేయ దుర్బోధం యోషా భవదనుగ్రహాత్

ప్రియమైన పుత్రా! కపిలదేవా! నేను స్త్రీని. నా బుద్ధి మందమైనది కనుక పరమసత్యమును తెలుసుకొనుట నాకు మిగుల కష్టతరమైనట్టిది. కాని దయతో నీవు దానిని నాకు వివరించినచో, మందమతి నైనప్పటికినీ దాని నెరుగగలిగి దివ్యానందమును అనుభవింపగలను.

భాష్యము : పరమసత్యమునకు సంబంధించిన జ్ఞానము సాధారణ అల్ప మానవులకు సులభముగా బోధపడదు. కాని ఆధ్యాత్మికాచార్యుడు శిష్యుని యెడ కరుణ కలవారైనచో, శిష్యుడెంత తెలివితక్కువ వాడైనప్పటికిని ఆయన దివ్యానుగ్రహమున సమస్తము విదితము కాగలదు. కనుకనే ఆధ్యాత్మికాచార్యుని కరుణ ద్వారా*(యస్య ప్రసాదాత్)* దేవాదిదేవుని కరుణ *(భగవత్ప్రసాదః)* లభించునని విశ్వనాథ చక్రవర్తి ఠాకూరులు పలికిరి. మందబుద్ధి గల స్త్రీని, తల్లిని కనుక తన యెడ కరుణను గొనుమని దేవహూతి కపిలదేవుని ప్రార్థించినది. సాధారణ మానవులకు(ముఖ్యముగా స్త్రీలకు) పరతత్త్వ విషయము సులభముగా బోధపడ నట్టిదైనను కపిలదేవుని అనుగ్రహముచే దానినెరుగుట ఆమెకు సాధ్యపడెను.

దేవహూతి ఆధ్యాత్మిక విషయములను అర్థం చేసుకునే పద్ధతిని ఈ శ్లోకంలో చూపుచున్నది. ఇది సవాల్‌ల ద్వారా కాకుండ శరణాగతి ద్వారా మాత్రమే సాధ్య పడును. భక్తియోగ పద్ధతి అనగా పూర్తిగా శరణాగతి పద్ధతియే. అది కూడ శ్రీ

చైతన్య మహాప్రభువు యొక్క ఆదేశము (శిక్షాష్టకము 3) :

తృణాదపి సునీచేన తరోరివ సహిష్ణునా
అమానినా మానదేన కీర్తనీయః సదా హరిః

ఎవరైనను 'హరేకృష్ణ' మహామంత్ర జపములో పురోభివృద్ధిని సాధించాలను కున్నచో, అతడు గడ్డిపరక కన్నను అణుకువగా మరియు వృక్షము కన్నను ఎక్కువ సహనమును కలిగి ఉండవలెనని శ్రీ చైతన్య మహాప్రభువు ఆదేశించెను. తన జ్ఞానమును చూసుకొని ఎవరు గర్వించరాదు. అన్నివిధాల ఇతరులకు ఆదరణను చూపించ వలెను. అప్పుడే 'హరేకృష్ణ' మహామంత్రమును అపరాధరహితముగా జపించ గలుగుదుము. దేవహూతి కపిలదేవునికి తల్లియైనను, తాను మిక్కిలి వినయముతో నడుచుకొనెను. అతడికి తల్లియైనందున తాను ఉన్నతురాలనని భావించలేదు.

ఆధ్యాత్మికాచార్యుడిని సేవతో సంతృప్తి పరచవలెను. మరియు భక్తి మార్గ మంతయూ ఈ సేవా తత్త్వము పైననే ఆధారపడినది. మన జడ ఇంద్రియములతో శ్రీకృష్ణుని దివ్యప్రవృత్తిని అర్థం చేసుకొనుట సాధ్యపడదు. శ్రీకృష్ణుని నామ రూప గుణములు మరియు లీలలన్నీ దివ్యములు. ప్రస్తుతము మన భౌతిక ఇంద్రియము లను భగవంతుని సేవలో వినియోగించి శుద్ధికరించుకోవలెను. నాలుక ద్వారా మన సేవ ప్రారంభమగును. మనం ఈ నాలుక ద్వారానే భగవంతుని దివ్య నామాలను కీర్తించగలము. ఇది ఎంతో సులభమైనది. ఈ ప్రక్రియ స్త్రీ, వైశ్య, మరియు శూద్రులందరి కోసం తెరవబడినది. కలియుగ దోషముల నన్నింటిని వర్ణించిన పిదప శ్రీమద్భాగవతము (12.3.51) ఈ విధముగా తెలుపుచున్నది :

కలేర్దోషనిధే రాజన్నస్తి హ్యేకో మహాన్ గుణః
కీర్తనాదేవ కృష్ణస్య ముక్తసంగః పరం వ్రజేత్

"రాజా! కలియుగము దోషసాగరమే అయినప్పటికిని దీనిలో ఇంకను ఉన్నట్టి ఒక మహాగుణమేమనగా కేవలము 'హరేకృష్ణ' మహామంత్రమును కీర్తించుట చేతనే మనుజుడు భవబంధవిముక్తుడై పరంధామమునకు చేరగలుగుచున్నాడు." శ్రీ చైతన్య మహాప్రభువు ఇట్లు తెలిపెను :

హరేర్నామ హరేర్నామ హరేర్నామైవ కేవలం
కలౌ నాస్త్యేవ నాస్త్యేవ నాస్త్యేవ గతిరన్యథా

“ ‘హరేకృష్ణ’ కీర్తనను చేయండి. ‘హరేకృష్ణ’ కీర్తనను చేయండి. మరొక మార్గము లేదు, కలియుగములో మరొక మార్గము లేనేలేదు.”

మనం జపం చేయునప్పుడు దశాపరాధములను చేయకుండ జాగ్రత్త పడ వలెను. హరేకృష్ణ మహామంత్రమును శ్రద్ధతో చేయు వారెవరైనను పవిత్రులౌతారు. *“చేతోదర్పణమార్జనం భవమహాదావాగ్నినిర్వాపణమ్.”* (శిక్షాష్టకము 1) అత్యంత సులభమైన ఈ పద్ధతి వలననే హృదయమనే అద్దము పరిశుభ్రమగును. ఎవరైనను, హరేకృష్ణ మహామంత్రమును శ్రద్ధగా జపించినచో వారికి శ్రీకృష్ణుడు సహాయము చేయును. అతడు అందరి హృదయములలోను కలడు కాబట్టి ఎవరు నిజమైన శ్రద్ధను కలిగి ఉన్నారో లేరో అతడు తెలుసుకోగలడు. శ్రీకృష్ణుడు శ్రద్ధ కలిగిన భక్తునికి బయటినుండి అంతేకాకుండ అంతరంగము నుండి కూడ సహాయము చేయును. అతడు పరమాత్మ రూపంలో అంతరంగము నుండి బుద్ధిని ప్రసాదిస్తూ హృదయము నుండి సహాయపడును. *“దదామి బుద్ధియోగం తమ్.”* అతడి ప్రతినిధిగా గురురూపంలో బాహ్యంగా సహాయపడును. అందుకే శ్రీ చైతన్య మహాప్రభువు ఇలా చెబుతున్నారు : *“గురు–కృష్ణ–ప్రసాదే పాయ్ భక్తిలత–బీజ్”* – “శ్రీకృష్ణుని కృప చేతనే మనకు ప్రామాణికాచార్యుడు లభించును. మరియు గురువు యొక్క కృపచేతనే శ్రీకృష్ణుడు లభించును.” (శ్రీ చైతన్య చరితామృతము, మధ్యలీల 19.151) అందుకే శాస్త్రం మనకు మన ఆధ్యాత్మిక జీవితమును గుర్తించుట కొరకు సులభమైన మార్గమును ప్రసాదించినది. అదే కృష్ణచైతన్య ఉద్యమం.

దేవహూతి ఎంతో వినయముగా తన కుమారుడిని గురువుగా అంగీకరించినది. కపిలదేవుని కృపచేత ఆవిడ శ్రీకృష్ణుడిని పరిపూర్ణముగా తెలుసు కోవాలని ఆశించింది. గురువు మరియు శ్రీకృష్ణుని అవ్యాజకృపను పొందుటమనేది ఎంతో ముఖ్యము. శ్రీకృష్ణుని కృపవలననే మనము ఆధ్యాత్మికాచార్యుడిని పొందగలము, మరియు ఆధ్యాత్మికాచార్యుని కృపచేతనే శ్రీకృష్ణుని పొందగలము.

గురుకృప అనేది ఎంతో ముఖ్యమని శ్రీల విశ్వనాథ చక్రవర్తి ఠాకూర్ నొక్కి చెప్పారు. సేవతో మనము గురువును సంతృప్తి పరచినప్పుడు అతడు మనలను ఆశీర్వదించు ననునది వాస్తవ సత్యం. ఇది ఒక గొప్ప అవకాశము. ఎందుకనగా, గురువు శ్రీకృష్ణుని అంతరంగిక సేవకుడు. గురువు శ్రీకృష్ణుని వలె పూజింపబడినను, గురువు ఎన్నడు తాను శ్రీకృష్ణుడనని చెప్పుకొనడు : *“సాక్షాద్ధరిత్వేన సమస్తశాస్త్రైః ఉక్తస్తథా భావ్యత ఏవ సద్భిః.”* (గుర్వాష్టకము 7)

శాస్త్రములన్నీ గురువును శ్రీకృష్ణునితో సమానముగా కొలుచుచున్నవి.

ఎందుకనగా, గురువు శ్రీకృష్ణుని ప్రతినిధి. కాబట్టి అతడు శ్రీకృష్ణుని వలె పూజింపబడును. గురువు శ్రీకృష్ణుడి అత్యంత అంతరంగిక సేవకుడైన కారణంగా అతడు శ్రీకృష్ణుడికి అత్యంత ప్రియమైనవాడు. కాబట్టి అతడు ఎవరినైనను శ్రీకృష్ణుడికి ప్రతిపాదించినచో శ్రీకృష్ణుడు వెంటనే వారిని స్వీకరించును. గురువు శ్రీకృష్ణుని అంతరంగిక సేవకుడు. ఎందుకనగా, అతడు ఇంటింటికి వెళ్ళి ప్రచారము చేస్తూ: "దయచేసి కృష్ణచైతన్య వంతులవ్వండి, శ్రీకృష్ణుడిని శరణువేడండి" అని విన్నవించును. శ్రీకృష్ణుడు అర్జునునితో అలాంటి సేవకుడు తనకు ప్రియమైనవాడని చెబుతున్నాడు. ప్రామాణికాచార్యుడు జనులతో తనను శరణాగతి చేసుకోమని చెప్పకుండ శ్రీకృష్ణునికి శరణువేడుమని ప్రార్థించును. అందుకే మనం నేరుగా కాకుండ గురువు మాధ్యమముగా శ్రీకృష్ణునికి శరణాగతి చేసుకోవలెను. ఇది పద్ధతి. శిష్యుని నుండి లభించు గౌరవము తనకొరకు కాదని గురువు దానిని శ్రీకృష్ణునికే సమర్పించును. మనం గురుకృపను పొందకుండ శ్రీకృష్ణుని నేరుగా సమీపించుట మనేది దుర్లభము.

జ్ఞానమను దానిని గురుశిష్య పరంపర నుండి పొందవలెనని భగవద్గీత (4.2)లో తెలుపబడెను : *"ఏవం పరంపరాప్రాప్తమ్."* గురువు తాను పొందే గౌరవమును తన గురువుకు అందజేయును, దానిని ఆ గురువు తన గురువుకు అందజేయును. ఈ విధముగా చివరికి అది శ్రీకృష్ణునికి అందజేయబడును. అలాగే శ్రీకృష్ణుని కృప గురుపరంపర పద్ధతి ద్వారా అందజేయబడును. అంతేకాకుండ శ్రీకృష్ణునికి అందజేయు గౌరవము పరంపర చేత పైకి చేర్చబడును. ఈ విధముగా దేవాదిదేవుడిని సమీపించుటను మనము అభ్యసించవలెను. కాబట్టి మనం భగవంతుడిని సమీపించ వలెనని, గురువును ఆశ్రయించ వలెనని, శ్రీకృష్ణుని సమీపించే మార్గమును అర్థం చేసుకొనుటకు దేవహూతి కపిల దేవుని కృపను అర్థించుచున్నది. ఆవిడ కపిల దేవుని మిక్కిలి వినయముతో సమీపించి : "నా ప్రియమైన కపిలా! నీవు దేవాదిదేవుడవు, నేను ఒక స్త్రీని, బుద్ధికుశలత లేని దానినైనను ఈ ఆధ్యాత్మిక దివ్య జ్ఞానమును నీ నుండి తెలుసుకోవాలని ఆశిస్తున్నాను. కేవలము నీ కృప చేతనే అది సాధ్యపడును" అని పలికెను.

భగవంతుని ఆశ్రయించి అతడిని అర్థం చేసుకునే పద్ధతిని గురించి శ్రీ రామానంద రాయ్ మరియు శ్రీ చైతన్య మహాప్రభువు మధ్య కూడ చర్చ జరిగినది. ప్రారంభములో వర్ణాశ్రమ ధర్మపద్ధతిని రామానంద రాయ్ వివరించెను. విష్ణుభగవానుని సమీపించుట కొరకు, వర్ణాశ్రమ ధర్మములోని విధులను పాటించుట

కొరకు మానవ జన్మ అనునది ఉద్దేశించబడినదని ముందుగా అతడు వివరించెను. ఈ యుగంలో వర్ణాశ్రమ ధర్మములను పాటించుట కష్టమని సమాధానముగా శ్రీ చైతన్య మహాప్రభువు తెలిపెను. ఈ కాలములో బ్రాహ్మణుడిగా నడుచుకొనుట ఎంతో కష్టం. ప్రాచీనమైన వర్ణాశ్రమ పద్ధతిని తిరిగి స్థాపించుటమనేది ప్రత్యక్షంగా సాధ్యపడదు. కాబట్టి ఈ పద్ధతి కూడ ఆచరించుటకు వీలుకాదని మహాప్రభువు తెలిపెను. శ్రీ చైతన్య మహాప్రభువును 'మహా ఔదార్య అవతారము' అని శ్రీల రూప గోస్వామి కీర్తించెను. ఎందుకనగా, అతడు అందరికి కృష్ణప్రేమను ఉచితముగా వితరణ చేస్తున్నాడు. నిజానికి, ప్రారంభములో మనం శ్రీకృష్ణుని కూడ అర్థం చేసుకోలేము. కాబట్టి అతడిని ప్రేమించుటమనే ప్రశ్నే ఉదయించదు. ఎవరినైన మనం అర్థం చేసుకోలేనప్పుడు వారిని మనము ఎలా ప్రేమించ గలము? ప్రేమ అనేది ఎంతో దూరములో కలదు. కాని మహాప్రభువు ఎంతటి దయామయుడు అనగా అతడు వారందరికి కృష్ణప్రేమను వితరణ చేసెను. శ్రీ చైతన్య మహాప్రభువు తన జీవితములో శ్రీకృష్ణుని కొరకు రోదిస్తూ, భగవంతుని కొరకు ఎలా వెర్రివార మవ్వాలనే దానిని చూపించెను.

యుగాయితం నిమేషేణ చక్షుషా ప్రావృషాయితమ్
శూన్యాయితం జగత్ సర్వం గోవిందవిరహేణ మే

"ఓ గోవిందా! నీ వియోగము ననుభవించు ప్రతి నిమిషమును ఒక యుగముగా నేను భావిస్తున్నాను. వర్షధారలవలె కన్నులనుండి నీరు స్రవించుచున్నది. నీ విరహములో నాకు జగమంతయు శూన్యముగా తోచుచున్నది." (శిక్షాష్టకము 7)

శ్రీకృష్ణుడు లేనిచో సర్వం అంధకారముగా గోచరించవలెను. అది శ్రీమతి రాధారాణి యొక్క మానసిక స్థితి. సాధారణ జీవుడికి ఇది సాధ్యపడదు. ఇది శ్రీ చైతన్య మహాప్రభువు మరియు కొద్దిమంది భక్తులకు అతని అనుచరులు మరియు అతని శిష్యులైన షట్ గోస్వాముల వంటివారికి మాత్రమే సాధ్యపడినది. వారు విరహములో శ్రీకృష్ణుని ఆరాధిస్తూ అతని కొరకు అంతటా వెదకసాగిరి.

హే రాధే వ్రజదేవికే చ లలితే హే నందసూనో కుతః
శ్రీగోవర్ధనకల్పపాదపతలే కాళిందీవన్యే కుతః
ఘోషన్తావితి సర్వతో వ్రజపురే ఖేదైర్మహావిహ్వలౌ
వందే రూపసనాతనౌ రఘుయుగౌ శ్రీజీవగోపాలకౌ

"షడ్గోస్వాములైన శ్రీ రూప గోస్వామి, శ్రీ సనాతన గోస్వామి, శ్రీ రఘునాథ భట్ట గోస్వామి, శ్రీ రఘునాథ దాస గోస్వామి, శ్రీ జీవ గోస్వామి మరియు శ్రీ గోపాల భట్ట గోస్వాములకు నా గౌరవ పూర్వక ప్రణామములు. వారు వృందావన మంతటా బిగ్గరగా ఈ విధముగా విలపించేవారు, 'ఓ వృందావనేశ్వరీ! ఓ రాధారాణి! ఓ లలితా! ఓ నందకుమార! ఇప్పుడెక్కడ ఉన్నారు? ప్రస్తుతం గోవర్ధనగిరిపై ఉన్నారా? లేదా యమునా నదితీరాన గల చెట్లకింద ఉన్నారా? మీరెక్కడ ఉన్నారు?' వారు ఈ విధమైన భావములతో కృష్ణ చైతన్యమును సాధన చేసేవారు." (షడ్గోస్వామ్యష్టకము 8)

గోస్వాములెన్నడు, "మేము శ్రీకృష్ణుడిని చూశాము" అని చెప్పలేదు. విప్రలంభ పద్ధతియే ప్రతిపాదింప బడినది. విస్మరించినట్టి మన కృష్ణ చైతన్యమును జాగృత పరుచుకొని అతని విరహములో మనం అతని కొరకు పిచ్చివారమై పోవలెను. దానినే కృష్ణప్రేమ అంటారు. ఈ ప్రేమను శ్రీ చైతన్య మహాప్రభువు వితరణ చేసెను. మనకు గల అల్పబుద్ధితో శ్రీకృష్ణుడిని అర్థం చేసుకొనుటకు ప్రయత్నించరాదు. మనం అసంపూర్ణులము కాబట్టి శ్రీకృష్ణుని గురించి ఎలా ఊహించగలము? జ్ఞానులు మరియు బ్రహ్మజ్ఞానవేత్తలు పరమ సత్యమును ఊహాగానాలతో అర్థం చేసుకొనుటకు ప్రయత్నిస్తుంటారు. కాని అది సాధ్యపడదు.

అథాపి తే దేవ పదామ్బుజద్వయ-
ప్రసాదలేశానుగృహీత ఏవ హి
జానాతి తత్త్వం భగవన్మహిమ్నో
న చాన్య ఏకోఽపి చిరం విచిన్వన్

"దేవా! నీ పాదపద్మముల కరుణాలేశమైనను పొందగలిగినచో మనుజుడు నీ మహాత్మ్యము నెరుగగలడు. కాని భగవతత్త్వము నెరుగుటకు కల్పనము కావించు వారు చిరకాలము వేదాధ్యయనమును కొనసాగించినను నిన్నెరుగజాలరు." (భాగ. 10.14.29) ఎవరైనను సంవత్సరాల కొలది ఊహించుకుంటూ పోయినను వారు శ్రీకృష్ణుడిని అర్థం చేసుకోలేరు. మానవుడు శ్రీకృష్ణుని కృపను గురువు నుండి పొందవలెను. మరియు ఈ పద్ధతినే శ్రీ చైతన్య మహాప్రభువు ప్రతిపాదించెను. *"స్థానేస్థితాః శ్రుతిగతః తనువాన్మనోభిః."* (భాగ. 10.14.3) శ్రీకృష్ణుడి మరో పేరు 'అజిత'. ఎవరు శ్రీకృష్ణుడిని జయించలేరు. కాని భక్తుని చేత శ్రీకృష్ణుడు జయించ బడును. ఒకరు వినమ్రులై ఇలా చెప్పవలెను, "ఓ కృష్ణా! నేను ఎంతో పేదవాడిని,

నిన్ను అర్థం చేసుకునే శక్తి లేనివాడిని, నాపై దయచేసి కృపను చూపుము. దయచేసి మిమ్ములను అర్థం చేసుకొని శరణాగతి చేసుకునేలా శక్తిని ప్రసాదించుము." ఇదియే కావలసినది. శ్రీకృష్ణుడు ఎంతో దయకలవాడు. మరియు ఎవరైనను తనకు శరణాగతిని చేసుకొనుటను అతడు చూచినప్పుడు అంతరంగము నుండి వారికి సహాయము చేయును.

అధ్యాయము 14

పరమోన్నతమైన మోక్షమే భక్తి

శ్లోకము 31

మైత్రేయ ఉవాచ
విదిత్వార్థం కపిలో మాతురిత్థం
జాతస్నేహో యత్ర తన్వాభిజాతః
తత్త్వామ్నాయం యత్ప్రవదన్తి సాంఖ్యం
ప్రోవాచ వై భక్తివితానయోగమ్

శ్రీ మైత్రేయుడు పలికెను : తల్లి వచనము నాలకించిన కపిలదేవుడు, ఆమె ఉద్దేశ్యమును నెరుగగలిగెను; ఆ జనని గర్భము నుండి జన్మించినందున ఆమె యెడ ఆతడు మిగుల దయాళువయ్యెను. ఆ విధముగా అతడు గురుశిష్య పరంపరలో ప్రాప్తించెడి సాంఖ్యతత్త్వమును (భక్తియుక్త సేవ మరియు యోగానుభూతి యొక్క సమ్మేళనము) వివరించెను.

భాష్యము : నాస్తిక కపిలుని ద్వారా ప్రతిపాదించిన సిద్ధాంతము భౌతిక మూలకముల యొక్క విశ్లేషణ. అంతేకాకుండ ఇది పాశ్చాత్య తత్త్వవేత్తల చేత ఎంతగానో కొనియాడ బడినది. దేవహూతి కుమారుడు కపిలదేవుని ద్వారా సాంఖ్యయోగ వివరించ బడినది. దీనిని గురించి పాశ్చాత్యులకు తెలియదు. ఇక్కడ వివరించబడిన సాంఖ్య యోగ నిజమైన భక్తిని వివరించును. ఈ జ్ఞానమును తర్కము ద్వారా కాకుండ గురుశిష్య పరంపర నుండి పొందుటయే సరియైన మార్గమని ఇక్కడ పేర్కొనబడినది. తర్కమనేది పరమ సత్యమును అర్థం చేసుకొనుటకు సరియైన మార్గము కాదు. సాధారణంగా పాశ్చాత్య తత్త్వవేత్తలు పరమసత్యమును ఆరోహణ పద్ధతియైన తర్కము ద్వారా అర్థం చేసుకొనుటకు ప్రయత్నిస్తారు. మరోపద్ధతి అవరోహణ పద్ధతి మరియు ఇదే పరంపర పద్ధతి. ఉన్నత ప్రమాణముల చేత జ్ఞానము అందించ బడును.

భగవద్గీతలో ఎన్నో యోగపద్ధతులు వివరించ బడినవి. కాని అన్నింటిలోకి భక్తియోగ పద్ధతి అనేది పరమోన్నత మైనదిగా పరిగణింపబడినది. మరియు చివరకు అన్ని యోగలు భక్తియోగలో కలియును. జ్ఞానయోగ మరియు హఠయోగ యొక్క

నిర్ణయమే భక్తియోగ. భగవద్గీతలోని ఆరవ అధ్యాయములో హఠయోగ ప్రక్రియయైన ధ్యానపద్ధతి ద్వారా వివరించబడినది. ఎంతో ఆధ్యాత్మిక పురోభివృద్ధిని సాధించిన అర్జునుడే ఈ విధముగా తన మనస్సును కేంద్రీకరించలేనని తెలిపెను. హఠయోగ పద్ధతి అనేది ఐదు వేల సంవత్సముల క్రితం, అత్యున్నత పురోభివృద్ధిని సాధించిన శ్రీకృష్ణుడి మిత్రునికే సాధ్యపడనప్పుడు, ఈ రోజు అది ఎలా సాధ్యపడుతుంది? ఈ యోగపద్ధతి ఆచరణకు సాధ్యపడదని అర్జునుడు నిర్మొహమాటముగా తెలిపెను. ఎందుకనగా మనస్సు అనేది వాయువును నియంత్రించుట వలె అత్యంత కష్టమైనది.

శరీరము పట్ల ఆధికాసక్తి కలవారికి ఈ హఠయోగ పద్ధతి నిర్దేశించబడినది. అలాకానిచో, కావలసినది సాంఖ్యయోగ లేదా భక్తియోగ. హఠయోగ పద్ధతి ఆచరించుటకు అత్యంత కష్టమైనదని అర్జునుడు శ్రీకృష్ణునితో చెప్పినప్పుడు, భగవంతుడు అతడిని శాంతపరుస్తూ, ఎవరైనను తనను గురించి నిరంతరము చింతించునో అతడు యోగులలో ఉత్తముడని తెలిపెను(భ.గీ. 6.47). అర్జునుడికి శ్రీకృష్ణుడు తప్ప మరేమి తెలియదు, కాబట్టి అతడు యుద్ధరంగంలో తనవైపు ఉండమని శ్రీకృష్ణుడిని ప్రార్థించెను. దుర్యోధనుడు మరియు అర్జునుడు శ్రీకృష్ణుని సహాయమును అర్థించుటకు వచ్చినప్పుడు, శ్రీకృష్ణుడు ఇలా పలికెను : "నా దగ్గర పద్దెనిమిది సైనిక అక్షౌహిణిలు కలవు. ఈ అక్షౌహిణిలు ఒక వైపు ఉండును. నేను స్వయంగా మరో వైపు ఉందును. అంతేకాకుండ, యుద్ధరంగములో నేను యుద్ధం చేయను" అని తెలిపెను. మొదట అర్జునుడు వేలకొలది ఏనుగుల మరియు గుర్రములతో కూడిన పద్దెనిమిది అక్షౌహిణిలను తీసుకొనుటయే మంచిదను కొనినను, శ్రీకృష్ణుడు తన వైపున్నచో అదే చాలుననుకున్నాడు. అతడికి సాధారణ సైనికుల అవసరము లేదు. దుర్యోధనుడు మరోవైపు శ్రీకృష్ణుని సైన్యమును తీసుకొనుటకు నిశ్చయించుకొనెను. అర్జునుడు అష్టాంగయోగ పద్ధతిని ఆచరించ లేకున్నను, అతడిని శాంతపరుచుటకు శ్రీకృష్ణుడు అతడిని చింతించ వలదని తెలిపెను.

"ఎవరైతే నన్ను నిరంతరం ధ్యానించుదురో అతడు అత్యున్నతమైన యోగి." శ్రీకృష్ణుడు మన హృదయములలో నిలిచి ఉన్నాడని నిరంతరము మనం గుర్తుంచు కోవలెను. ఇదే సరియైన ధ్యానయోగ పద్ధతి. మనం 'హరేకృష్ణ' మహామంత్రమును నిరంతరము జపించినచో మనం ఎల్లప్పుడు శ్రీకృష్ణుడిని స్మరించగలము. అప్పుడు వెంటనే శ్రీకృష్ణుని స్వరూపము హృదయములో జాగృతమవుతుంది. శ్రీకృష్ణుడిని నిరంతరము స్మరించు మార్గమే కృష్ణచైతన్య పద్ధతి. నిరంతరము కృష్ణచైతన్యమును

కలిగి ఉండువాడే ఉత్తమ యోగి. వినయముతో శ్రీకృష్ణుని గురించి శ్రవణము చేయుట వలన ఎవరైనను కృష్ణచైతన్యమును పొందవచ్చును.

మనం శ్రీకృష్ణుని గురుశిష్యపరంపర ద్వారా అంగీకరించ వలెను. నాలుగు ప్రామాణికమైన సంప్రదాయ పరంపరలు కలవు. ఒకటి బ్రహ్మదేవుని నుండి మొదలవుతున్నది(బ్రహ్మ సంప్రదాయం). మరొకటి లక్ష్మీదేవి నుండి మొదలవు తున్నది(శ్రీ సంప్రదాయం). కుమార సంప్రదాయం కూడ కలదు. మరియు రుద్ర సంప్రదాయము. ప్రస్తుతం బ్రహ్మ సంప్రదాయం మధ్వాచార్యుని చేత ప్రాతినిధ్యం వహించ బడుతుంది. మరియు మనం మధ్వగౌడీయ సంప్రదాయమునకు చెందిన వారము. శ్రీ మధ్వాచార్యుల నుండే మన సంప్రదాయము ప్రారంభ మగుచున్నది. ఈ సంప్రదాయములోని వారే శ్రీ మాధవేంద్ర పురీ, అతని శిష్యుడు శ్రీ ఈశ్వర పురీ. శ్రీ ఈశ్వర పురీ శిష్యుడు శ్రీ చైతన్య మహాప్రభువు. మరియు మన గురుశిష్య పరంపర శ్రీ చైతన్య మహాప్రభువు నుండి వచ్చుచున్నందున దీనిని మధ్వగౌడీయ సంప్రదాయ మంటారు. అంటే, మనం సంప్రదాయమును తయారుచేసినట్లు కాదు. నిజానికి మన సంప్రదాయము బ్రహ్మదేవుని నుండి ప్రారంభ మవుతుంది. శ్రీ సంప్రదాయం నుండి రామానుజ సంప్రదాయము వచ్చుచున్నది. అలాగే రుద్ర సంప్రదాయము నుండి విష్ణుస్వామి సంప్రదాయము వచ్చుచున్నది. కుమార సంప్రదాయము నుండి నింబాదిత్య సంప్రదాయము వచ్చుచున్నది. మనము వీటిలోని ఏ సంప్రదాయమునకు చెందకపోయినచో, మన నిర్ణయాలన్నీ ఫలితము లేనివగును. "నేను గొప్ప పండితుడను. ఈ సంప్రదాయాలన్నీ వృథా" అని భావించ రాదు. మనం మన స్వంత వ్యాఖ్యానాలను రూపొందించ కూడదు. ఎందుకంటే, ఈ విధంగా ఎన్నో వ్యాఖ్యానాలు వ్యర్థముగా చేయబడినవి. వాటివలన ఎటువంటి లాభం చేకూరదు. బ్రహ్మదేవుడు, నారదుడు, మధ్వాచార్యుడు, మాధవేంద్ర పురీ మరియు ఈశ్వర పురీ స్థాపించిన సత్యమును మనం అంగీకరించ వలెను. ఈ గొప్ప ఆచార్యులందరు పండితులమని పిలుపించుకునే వారివలే దోషపూరితులు కారు. భౌతిక శాస్త్రవేత్తలు, తాత్త్వికులు సరియైన నిర్ణయానికి రాలేక 'కావొచ్చు', 'లేదా' అనే పదాలను ఉపయోగిస్తుంటారు. మరియు వారు ఆ విధముగా ఊహాగానాలను మాత్రమే చేస్తుంటారు. మానసిక కల్పనలనేవి పరిపూర్ణమైనవి కావు.

యోగపద్ధతిలో మొదటి మెట్టు కర్మయోగ, తరువాత జ్ఞానయోగ మరియు ధ్యానయోగ, కాని అత్యున్నతమైనది మాత్రము భక్తియోగ. ఇతర యోగలన్నీ

అసంపూర్ణముగా ముగియును. పరమ సత్యమును చేరుటకు అందరూ ప్రయత్నిస్తుంటారు. భక్తియోగ ద్వారా పొందు అనుభూతి పరిపూర్ణమైనది. అంతేకాకుండ, దీనిని స్వల్పముగా అభ్యసించినను అది గొప్పశక్తిని కలిగి ఉండును. బ్రహ్మదేవుడు, శివుడు, కపిలదేవుడు వంటి గొప్ప 'మహాజను' లెందరో దీనినే ఆదేశించిరి. సంసిద్ధి మార్గమును అర్థం చేసుకొనుట కష్టమైనందున శాస్త్రములు 'మహాజను'లను అనుసరించ వలెనని ప్రతిపాదించెను. శ్రీమద్భాగవతము (6.3.20) లో వారి గురించి ఈ విధముగా వివరించబడెను :

స్వయంభూర్ నారదః శంభుః కుమారః కపిలో మనుః
ప్రహ్లాదో జనకో భీష్మో బలిర్ వైయాసకిర్ వయమ్

బ్రహ్మదేవుని మరోపేరు 'స్వయంభూ' ఎందుకంటే అతడు విష్ణునాభి నుండి ఉద్భవించిన కమలము నుండి జన్మించినాడు. అతడు తల్లితండ్రికి జన్మించ నందున అతడిని స్వయంభూ అంటారు. నారదముని కూడ 'మహాజనుడు' మరియు 'శంభు' అనగా శివభగవానుడు. కుమార అనగా సనక, సనందన, సనాతన, సనత్ కుమారుల నలుగురిని సూచించును. బ్రహ్మదేవుడు, శివుడు, కపిలదేవుడు, మను, భీష్మదేవుడు, జనక మహారాజు, శుకదేవ గోస్వామి, మరియు ప్రహ్లాదుడు మున్నగు పన్నెండుమంది 'మహాజనులు' సాంఖ్యయోగ లేదా భక్తియోగను అనుసరించిన వారు. మనం వీరిలో ఎవరినైనను అంగీకరించి అనుసరించినచో పరమ సత్యమును అర్థం చేసుకొనుటలో పరిపూర్ణు లమవుతాము. కాని పరమ సత్యమును తర్కము ద్వారా అర్థం చేసుకొనుటకు ప్రయత్నించినచో చివరకు మనం నిరాశ నిస్పృహలకు లోనవుతాము. ఒక తత్త్వవేత్త మరొక తత్త్వవేత్త కంటే అధిక తర్కజ్ఞానమును కలిగి ఉండవచ్చును. ఒక తాత్త్విక తర్కము మరొక దానిని ఖండించ వచ్చును. ఇది ఇలా నిరంతరము కొనసాగుతూనే ఉంటుంది. ఇది కేవలం వృథాకాలయాపనే. మనం వైదిక శాస్త్రములను సమీపించినను సమస్యలనేవి కలవు. యజుర్వేద, ఋగ్వేద, సామవేద, అథర్వణవేద, ఉపనిషత్తులు, పురాణములు, బ్రహ్మసూత్రాలు, రామాయణము, మహాభారతము వంటి ఇతర అనేక శాస్త్రములు కలవు. వివిధ రకాల వ్యక్తులు వాటిని అధ్యయనము చేసి వివిధ నిర్ణయాలను చేస్తుంటారు. బైబిల్ మరియు ఖురాన్ కూడ కలవు. వివిధ వ్యక్తుల ననుసరించి వివిధ రకాల వ్యాఖ్యానాలు కలవు. ఒక విద్వాంసుడు మరో విద్వాంసుడిని శాస్త్రబలముతో పరాజయుడిని చేయును. భిన్నమైన సిద్ధాంతమును ప్రతిపాదించకుండ ఎవరూ

ఋషి గాని పండితుడు గాని కాలేరని తెలుపబడినది. *"నాసావృషిర్యస్య మతం న భిన్నమ్."* అందుకే ఆధ్యాత్మిక జీవితం గుహ్యమైనది. సత్యం క్లిష్టమైనది. కాబట్టి దానిని అర్థం చేసుకొనుట ఎంతో కష్టం. సారాంశ మేమిటంటే, జీవితములో పరిపూర్ణత్వమును పొందాలంటే ఈ పన్నెండుగురు మహాజనులలోని ఒకరిని అనుసరించ వలెను. శ్రీకృష్ణుడు ఆది 'మహాజనుడు'. అతడు బ్రహ్మకు ఉపదేశించెను. బ్రహ్మదేవుడు కూడ ఒక 'మహాజనుడు'. నిజానికి శ్రీకృష్ణుడు భగవద్గీతను అందరి కోసము ఉపదేశించెను. కాబట్టి ఆ విధముగా అందరూ శ్రీకృష్ణుని నుండి అభ్యసిస్తున్నారు.

శ్రీమద్భాగవతము(1.1.1) లో కూడ ఇలా చెప్పబడినది : *"తేనే బ్రహ్మ హృదా య ఆదికవయే."* కపిలదేవుడు స్వయంగా ఉపదేశించినట్లుగా, శ్రీకృష్ణుడు కూడ స్వయంగా ఉపదేశించెను. భగవద్గీతలోని ఆ శ్రీకృష్ణుని బోధనలకు మరియు కపిలదేవుని బోధనలకు ఎలాంటి భేదము లేదు. దివ్యజ్ఞానమును మనం 'మహాజను'ల నుండి మాత్రమే పొందవలెను. ఇది మంచి ఫలితాలను శ్రేయస్సును చేకూర్చును. కపిలదేవుడు తన తల్లి పట్ల సహజ అనురాగముతో ఈ సాంఖ్య శాస్త్రమును తల్లికి బోధించాడు. దేవహూతిని సాధారణ స్త్రీగా మనం భావించరాదు. దేవహూతి ఎంతో వినయమును కలిగి ఉండుటను కపిలదేవుడు గమనించి దయతో నిండిపోయెను. పరమ సత్యమును తెలుసుకొనుటకు తన తల్లి ఉత్సాహవంతముగా ఉండుటను చూచి అతడు ఈ విషయమును పరిగణలోకి తీసుకొనెను. ఏమైనను అతడు తన శరీరమును ఆవిడ నుండి పొందినందున అతడు పరతత్త్వ జ్ఞాన నిర్ణయమైన సంఖ్య శాస్త్రమును తన తల్లికి అందజేయుటకు ప్రయత్నించవలెనని నిర్ణయించు కున్నాడు.

శ్లోకము 32

శ్రీభగవానువాచ
దేవానాం గుణలింగానామానుశ్రవికకర్మణామ్
సత్త్వ ఏవైకమనసో వృత్తిః స్వాభావికీ తు యా
అనిమిత్తా భాగవతీ భక్తిః సిద్ధేర్గరీయసి

కపిల భగవానుడు పలికెను : ఇంద్రియములు దేవతలకు ప్రాతినిధ్యములు; వేదోపదేశముల ననుసరించి కర్మనొనరించుటయే వాటి సహజ ప్రవృత్తి కావలెను.

ఇంద్రియములు దేవతలకు ప్రాతినిధ్యమైనట్లుగా మనస్సు దేవాదిదేవునికి ప్రాతినిధ్యము వహించుచున్నది. సేవయే దాని సహజధర్మము. ఆ సేవాభావమును నిర్హేతుకముగా భగవద్భక్తి యందు నెలకొల్పినప్పుడు, అది ముక్తికన్నను పరమోన్నత మైనది కాగలదు.

భాష్యము : జీవుని ఇంద్రియములు ఎల్లప్పుడు ఏదియోనొక కార్యమునందు నెలకొని యుండును; అవి వేదోపదేశములందు తెలియజేయబడిన కార్యములే కావచ్చును లేదా భౌతిక కార్యములే కావచ్చును. అనగా ఏదియోనొక దానికొరకై పనిచేయుట ఇంద్రియముల సహజ స్వభావము; ఇక మనస్సు ఆ ఇంద్రియములకు కేంద్రము. నిజమునకు మనస్సు ఇంద్రియములకు నాయకుడైనందున, అది 'సత్త్వము' అని పిలువబడును. అదేవిధముగా ఈ భౌతిక జగత్తు కార్యములందు నెలకొని యున్నట్టి సమస్త దేవతలకు(సూర్య, చంద్ర, ఇంద్రాదులు) దేవాదిదేవుడగు శ్రీకృష్ణుడే నాయకుడు.

దేవతలు భగవానుని విరాడ్రూపము వివిధాంగములని వేదవాఙ్మయమున తెలుపబడినది. మన ఇంద్రియములు కూడా వివిధ దేవతలతో నియంత్రింప బడుచుండును; అవి వివిధ దేవతలకు ప్రాతినిధ్యములై యున్నవి. మనస్సు దేవాది దేవునికి ప్రాతినిధ్యము. అనగా మనస్సు అధ్వర్యములో గల ఇంద్రియము లన్నియును దేవతల ప్రభావమున పనిచేయును. ఆ సేవాకార్యము దేవాదిదేవుని పైననే కేంద్రీకరింప బడినప్పుడు ఇంద్రియములు వాటి సహజస్థితి యందున్నవని భావము. శ్రీకృష్ణభగవానుడు 'హృషీకేశుడు' అని పిలువబడినాడు; ఏలయన నిజమునకు అతడే ఇంద్రియములకు యజమాని మరియు పరమ ప్రభువు. ఇంద్రియములు, మనస్సు సహజముగానే కర్మచేయుటకు సిద్ధముగా యుండును; కాని అవి భౌతికముగా కలుషితమై యున్నప్పుడు ఏదో ఒక భౌతిక లాభము కొరకు లేదా దేవతల కొరకు(తాము నిజమునకు దేవాదిదేవుని సేవకొరకే ఉద్దేశింప బడినను) పనిచేయును. ఇంద్రియములు 'హృషీకము'లు అని పిలువబడగా, దేవాదిదేవుడు 'హృషీకేశుడు' అని పిలువబడినాడు. అనగా పరోక్షముగా ఇంద్రియము లన్నియును సహజరీతిని భగవత్సేవ పట్లనే అపేక్ష కలిగియున్నవి. అదియే భక్తి అని పిలువబడును.

ఎటువంటి భౌతిక లాభాపేక్ష గాని, ఇతర స్వార్థపూరిత కోరికలు గాని లేకుండ ఇంద్రియములను దేవాదిదేవుని సేవ యందు నెలకొల్పినప్పుడు మనుజుడు

భక్తియోగము నందు స్థితుడగునని కపిలదేవుడు పలికినాడు. అటువంటి సేవాభావము 'సిద్ధి'(మోక్షము) కన్నను పరమోత్తమమైనది. ముక్తుడు కానిదే ఎవ్వడును ఇంద్రియములను భగవత్సేవలో నెలకొల్పజాలడు. ఇంద్రియములను భోగానుభవ పరమైన భౌతిక కర్మల యందు గాని లేదా వేదనిర్దేశిత కర్మలయందు గాని నెలకొల్పినప్పుడు ఏదియోనొక హేతువు ఉండవచ్చును; కాని అవే ఇంద్రియములను కృష్ణసేవ యందు నెలకొల్పినపుడు ఎటువంటి హేతువు ఉండబోదు. అదియే *'అనిమిత్త'* అని పిలువబడును; మనస్సు యొక్క సహజాపేక్ష అదియే. సారాంశమేమనగా, మనస్సు వైదికాదేశములచే గాని, భౌతిక కలాపములచే గాని గతి తప్పకుండ కృష్ణచైతన్యము నందే(దేవాదిదేవుని భక్తియుక్త సేవ) నెలకొనినచో అట్టి స్థితి అత్యంత అభిలషణీయమగు భవబంధ విముక్తి కన్నను పరమోత్తమమైనది.

భక్తి అనేది ముక్తి కంటే కూడ అతీతమైనది. సాధారణంగా జనులు ధర్మ, అర్థ, కామ, మోక్షముల యందు ఆసక్తిని కలిగి ఉంటారు. మొదట ధర్మము తర్వాత అర్థము(ధనాభివృద్ధి), కామ(ఇంద్రియతృప్తి), తర్వాత మోక్ష (పరబ్రహ్మములో ఐక్యమగుట), ఏమైనను భక్తి అనేది వీటన్నింటికంటే ఉన్నతమైనది. భక్తునికి ముక్తి అనునది అంత ముఖ్యమైనది కాదు. బిల్వమంగళ ఠాకూర్ మాటలలో : "*ముక్తిః స్వయం ముకులితాంజలి సేవతేఽస్మాత్*" – "ముక్తి స్వయంగా తాను రెండు చేతులు జోడించి, భక్తులను సేవించుటకు వేచియున్నది."(కృష్ణకర్ణామృతము 107) ఇది దక్షిణ భారతదేశమునకు చెందిన గొప్ప ధనవంతుడు బ్రాహ్మణుడైన బిల్వమంగళ ఠాకూర్ వారి అనుభవము. దుస్సాంగత్య కారణము చేత అతడు అతివేశ్యలోలుడిగా మారి తన ధనాన్నంతటిని చింతామణి అనే వేశ్య కొరకు వెచ్చించాడు. ఒకరోజు తుఫానుతో కూడుకున్న భయంకర అర్ధరాత్రి సమయములో అతడు చింతామణిని చూచుటకు వెళ్ళాడు. కాని ఘోరమైన ఈ తుఫాను కారణంగా, ఈ రోజు ఖచ్చితంగా బిల్వమంగళుడు రాడని వేశ్య భావించినను బిల్వమంగళుడు ఎన్నో ఆటంకములను దాటివెళ్ళెను. ఏదోవిధముగా నదిని దాటి చింతామణి ఇంటికి చేరినప్పుడు ద్వారాలు మూసి ఉండుటను అతడు గమనించాడు. అయినను ఏదో విధముగా వాటిపై నుండి క్రిందకు దూకెను. ప్రమాదాలెన్నింటినో ఎదుర్కొని చింతామణిని అతడు చేరుకొనెను. వేశ్య ఆశ్చర్యానికిలోనై ఇలా పలికెను : "ఇంత రాత్రి సమయములో ఇంటికి నీవెలా రాగలిగావు? ఓ! నీవు, ఈ చర్మానికి ఇంతగా అకర్షితుడవా, నీవు కనుక ఇంతటి ఆకర్షణను శ్రీకృష్ణుడిపై కలిగి ఉంటే, తప్పక

అది నీకు శ్రేయస్సును కలిగించేది." బిల్వమంగళుడు వెంటనే వేశ్యఇంటిని విడిచి వృందావనానికి బయలు దేరాడు. వాస్తవమునకు, అతడు తన గతజన్మలో 'భావభక్తి' స్థితిని చేరువరకు భక్తియుక్త సేవను నొనరించెను. ఆ విధముగా చింతామణి నిజానికి అతడికి గురువయ్యెను. అతడు వృందావనంలో 'కృష్ణకర్ణామృతము' అనే గ్రంథమును రచించెను. మరియు శ్రీ చైతన్య మహాప్రభువు ఆ గ్రంథమును ప్రతిపాదించెను. ఆ గ్రంథంలో బిల్వమంగళ ఠాకూరు ఇలా రచించెను: "ఓ భగవంతుడా! నీ పై మా భక్తి స్థిరమైనచో, మేము సులభంగా నీ దివ్యస్వరూపమైన కైషోర మూర్తిని, యుక్త రూపమును దర్శించగలము."

శ్రీకృష్ణుడి మరో పేరు కైషోర. 'కైషోర' అనే శబ్దం వివాహామునకు పూర్వం అనగా పదకొండు నుండి పదహారు సంవత్సరాల వయస్సు గల బాలుడిని సూచించును. శ్రీకృష్ణుడు ఎల్లప్పుడు కైషోర మూర్తి. భక్తియుక్త సేవతో మనము శ్రీకృష్ణుని కైషోర మూర్తి స్వరూపమును అతి సులభముగా దర్శించవచ్చును.

బిల్వమంగళ ఠాకూరు వృందావనముకు వెళ్ళునప్పుడు కూడ స్త్రీల వైపు అనురక్తిని కలిగి ఆకర్షితు డగుతుండెను. ఒకరోజు రాత్రి ఒక ధనవంతుడైన వ్యాపారి గృహములో అతడు విడిది చేసెను. ఆ వ్యాపారి భార్య తన భర్తతో బిల్వమంగళ ఠాకూర్ తనపై వ్యామోహం కలిగి ఉన్నాడని, తాను ఏమి చేయవలెనని భర్తను అడిగినది. దానికి ఆ వ్యాపారి, "అతనికి సేవ చేయుము" అని బదులు పలికెను. చివరికి బిల్వమంగళ ఠాకూర్ తన స్పృహలోనికి వచ్చి, ఈ కన్నులు నా శత్రువులు అని భావించెను. ఆ అందమైన స్త్రీ అతడిని సమీపించినప్పుడు, బిల్వమంగళ ఠాకూర్ ఇలా అడిగెను, "ఓ తల్లి దయచేసి మీ జడ కొప్పులోని పిన్నులను ఇవ్వండి. నాకు అందమైన స్త్రీలంటే పిచ్చి. కాబట్టి, నా కన్నులను పెరికి వేసికొననిమ్ము" ఈ విధముగా అతడు తనకుతానుగా అంధుడిని చేసుకొనెను. అతడు చూడలేకున్నప్పుడు వృందావనంలో శ్రీకృష్ణుడు స్వయంగా అతడికి పాలను సరఫరా చేసెను. ఈ విధముగా అతడు స్వయంగా భక్తితో శ్రీకృష్ణుని స్వయంగా అనుభూతి చెందెను. అంతేకాకుండ తన వ్యక్తిగత అనుభవములను లిఖించెను : "ముక్తి అనేది అంతటి గొప్ప ప్రధాన విషయం కాదని తెలిపెను. ఆవిడ సర్వదా చేతులు జోడించి నా సేవలో ఉంటూ, 'నా ప్రియమైన ప్రభూ! నేను మీకై ఏ సేవ చేయగలను?'" అని అర్థిస్తున్నది. కాబట్టి భక్తుడు ముక్తి పట్ల అంతగా ఆసక్తిని కనపరచడు. ఎందుకనగా అతడు అప్పటికే ముక్తజీవుడు. ఒక వ్యక్తివద్ద కోట్లకొలది రూపాయ లున్నప్పుడు పదిరూపాయల కొరకెందుకు అతడు ప్రాకులాడును?

భక్తి అనేది 'అనిమిత్త' అనగా స్వార్థచింతన లేనిది. నిజానికి శ్రీకృష్ణుడు మన కోరికల నన్నింటిని సులభముగా తీర్చును. ఎందుకనగా, అతడు అత్యంత శక్తివంతుడు మరియు పూర్తి ఐశ్వర్యములు కలిగి ఉన్నవాడు. మనం భౌతిక ఆనందముల కొరకు శ్రీకృష్ణుడిని కోరినప్పుడు వాటిని మనకిచ్చుటలో అతడికి ఏమాత్రం కష్టం కాదు. అంతేకాకుండ, అతడు మనకు ముక్తిని కూడ ప్రసాదించ గలడు. భక్తిని కాకుండ మరోదానిని అడిగితే అది మన మూర్ఖత్వమే అగును. భగవంతుడిని భక్తిని కాకుండ ముక్తిని గురించి కాని లేదా మరోదానిని గురించి గాని అడిగితే, అది ధనవంతుడి దగ్గరకు వెళ్ళి కాసింత బూడిదను కోరుకొని నట్లుండునని శ్రీల భక్తిసిద్ధాంత సరస్వతి ఠాకూర్ గారు చెబుతుండేవారు. అడవిలో ఎండు కట్టెల మోపును మోయుచున్న వృద్ధురాలు కథ ఒకటి ఇలా కలదు. బరువుగా నున్న ఆ కట్టెల మోపు ఎలాగో తలపై నుండి క్రింద పడిపోయెను. ఆ వృద్ధురాలు విచారానికి లోనై, "ఎవరు ఈ కట్టెల మోపును తిరిగి నా తలపై పెట్టగలరు?" అని ఆలోచించి, భగవంతుడిని పిలువటం ప్రారంభించెను, "భగవంతుడా నాకు సహాయము చేయుము" అకస్మాత్తుగా భగవంతుడు ప్రత్యక్షమై "ఏమి కావలెను" అని అడిగెను. "దయచేసి ఈ కట్టెల మోపును తిరిగి నా తలపై పెట్టుమని ప్రార్థించెను" మన మూర్ఖత్వము ఇటువంటిదే. భగవంతుడు మన దగ్గరకు వచ్చి ఏదైన వరం ఇవ్వాలను కొనినప్పుడు, మనమతడిని కేవలము భౌతిక బంధనాలనే బరువును తిరిగి ప్రసాదింపుమని కోరుతుంటాము. అతడిని మనము మరిన్ని భౌతిక వస్తువులను, సుఖమైన కుటుంబమును, గొప్పధనమును కొన్నికార్లను ఇలా మరేదో దానిని కోరుతుంటాము.

జన్మజన్మలకు భగవంతుడి సేవను మాత్రమే కోరవలెనని శ్రీ చైతన్య మహాప్రభువు బోధిస్తున్నాడు. ఇది 'హరేకృష్ణ' మహామంత్రమునకు గల నిజమైన అర్థం. మనం "హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే / హరే రామ హరే రామ రామ రామ హరే హరే" అని జపించినచో నిజానికి అది భగవంతుడిని మరియు అతని శక్తి 'హరా'ను సంబోధిస్తున్నట్లు అర్థము. 'హరా' అనగా భగవంతుని అంతరంగిక శక్తి శ్రీమతి రాధారాణి లేదా లక్ష్మి. 'జయ రాధే!' ఇది 'దైవీప్రకృతి', మరియు భక్తులు 'దైవీప్రకృతి'యైన శ్రీమతి రాధారాణినీ ఆశ్రయిస్తారు. ఈ విధముగా వైష్ణవులు శ్రీ రాధాకృష్ణులను, సీతారాములను, లక్ష్మినారాయణులను పూజిస్తారు. 'హరేకృష్ణ' మహామంత్ర ప్రారంభములో మనం శ్రీకృష్ణుని యొక్క అంతరంగ శక్తి అయిన 'హరే'ను సంబోధిస్తాము. అందుకే మనం : "ఓ రాధారాణీ! హరే! ఓ

భగవంతుని యొక్క శక్తీ!" అని పిలిచినప్పుడు, సహజముగానే వారు ఇలా పలుకును, "చెప్పండి. మీకు ఏమి కావలెను?" అప్పుడు సమాధానముగా మన ప్రార్థన ఇలా ఉండవలెను, "దయచేసి నన్ను మీ సేవలో నిమగ్నులను చేయండి" అని. అంతేకాని, "ఓ భగవంతుని శక్తి! ఓ కృష్ణా! దయచేసి నాకు ధనమును ప్రసాదించండి. దయచేసి నాకు అందమైన భార్యను ప్రసాదించండి. దయచేసి నాకు అనుచరులను అధిక సంఖ్యలో ఇవ్వండి. దయచేసి పేరుప్రతిష్ఠలను కలుగజేయు పదవిని ప్రసాదించుము, దయచేసి నాకు అధ్యక్ష పదవిని ప్రసాదించుము" అని అడుగరాదు. ఎందుకంటే ఇవన్నీ భౌతికమైన కోరికలు, వీటిని మనం విడనాడవలెను. భౌతికమైన కోరికలను త్యజించాలని బుద్ధభగవానుడు తెలిపెను. కోరికలు లేకుండ ఉండుట మనేది సాధ్యపడదు. కాని భౌతికమైన కోరికలను త్యజించుట సాధ్యపడును. కోరికలను కలిగి ఉండుటమనేది జీవుని సహజ లక్షణము, కోరికలు లేకుండ ఉండుట సాధ్యపడదు. కోరికలు లేనివాడు కేవలం మృతుడే. కోరికలు లేకుండ ఉండుటమనగా కోరికలను పవిత్రీకరించుటయే. శ్రీకృష్ణుని సేవను కోరినప్పుడే మనకోరిక శుద్ధమగును.

శ్రీ చైతన్య మహాప్రభువు ఇలా బోధిస్తున్నారు :

న ధనం న జనం న సుందరీం కవితాం వా జగదీశ కామయే
మమ జన్మని జన్మనీశ్వరే భవతాద్ భక్తిరహైతుకీ త్వయి

"ఓ జగదీశా! ధనమును కూడబెట్టవలెనని గాని, సౌందర్యవతులగు స్త్రీలనుగాని, అనేక సంఖ్యలో అనుయాయులను గాని నేను కోరను. జన్మజన్మల యందు నేను కోరునది నిర్హేతుకమైన నీ భక్తియుక్త సేవ ఒక్కటియే."(శిక్షాష్టకము 4) జన్మజన్మలకు శ్రీకృష్ణభగవానుని సేవను అతడు అర్థిస్తున్నాడు. అతడు ముక్తిని కోరుకోకుండ జన్మజన్మలలోను శ్రీకృష్ణుడిని మాత్రమే సేవించాలను కుంటున్నాడు. భక్తులైనవారు భగవంతునిలో ఐక్యమవ్వాలని కోరుకొనరు. బౌద్ధతత్త్వము 'నిర్వాణము'ను అనగా భౌతిక కోరికల నన్నింటిని అంతము చేయుటను ప్రతిపాదించును. కాబట్టి బుద్ధుడు దీనిని మాత్రమే ప్రసాదించును. కాబట్టి, ఈ భౌతిక లోకంలో కోరికలు లేకుండ ఉండాలని తరువాత బ్రహ్మజ్యోతిలో విలీనం కావాలనీ శ్రీపాద శంకరాచార్యుల వారు మరిన్ని విషయాలను మనకు తెలియజేసిరి. దీనినే బ్రహ్మనిర్వాణమని అంటారు. వైష్ణవ సిద్ధాంతము ననుసరించి, మనం భౌతిక కోరికలు లేకుండ బ్రహ్మభూత స్థితిలో నెలకొనవలెను. అంతేకాకుండ, మనం భగవంతుని సేవలో

నియుక్తులమై ఉండవలెను. దీనినే భక్తి అంటారు. మాయావాది తత్త్వవేత్తలు దీనిని అర్థం చేసుకోలేరు, కాని భక్తియుక్త సేవ అనేది శుద్ధసత్త్వమునకు చెందినదని శ్రీకృష్ణుడు చెప్పుచున్నాడు.

నాస్తిక కపిలుని భౌతిక జ్ఞానమైన సాంఖ్య సిద్ధాంతమనేది కేవలం ఇరవై నాలుగు మూలకముల అధ్యయనము. కాని కపిలదేవుడు ప్రతిపాదించిన వాస్తవమైన సాంఖ్యశాస్త్రము ఇరవై నాలుగు మూలకములకు మరియు భౌతిక కర్మలకు అతీతమైనది. కాబట్టి, నిజానికి ఈ సాంఖ్యశాస్త్రం భక్తియోగ. ఇది భౌతిక లాభములను ఆశించదు. భౌతిక స్థితిలో ఒక వ్యక్తి తన వ్యక్తిగత ఇంద్రియ తృప్తికొరకు లేదా మరింతగా విస్తరింపజేసుకొనిన ఇంద్రియతృప్తి కొరకు పనిచేయును. మానవుడు తన గురించి లేదా కుటుంబము, భార్య, సంతానం, సమాజం, వర్గము, జాతి లేదా సమస్త మానవాళి కొరకై పని చేయును. ఇదంతయు కేవలం విస్తరింప బడిన ఇంద్రియతృప్తి. ఒకడు తన గురించి లేదా కుటుంబము, వర్గము లేదా మరోదానికై దొంగతనము చేసినను అతడు దొంగగా సత్యమనేది నిలిచిపోవును. గొప్పయోధుడైన అలెగ్జాండర్ ఒక సామాన్య దొంగను బంధించినపుడు, ఆ దొంగ అలెగ్జాండర్‌తో ఈ విధముగా పలికెను: "నేను చిన్నమొత్తంలో దోచుకొనుచున్నాను. నీవు పెద్దమొత్తంలో దోచుకొనుచున్నావు, కాబట్టి మన ఇద్దరి మధ్య భేదమేమిటి?" సున్నిత మనస్కుడై నందున "అవును, భేదమేమి లేదు" అంటూ అలెగ్జాండర్ అతడిని విడుదల చేసెను. ఇంద్రియ తృప్తి అనేది తనగురించి చేసినను లేదా తన కుటుంబము గురించి తన జాతిగురించి లేదా దేనిగురించియైనను అది ఇంద్రియ తృప్తి అని మాత్రమే పిలువబడును. శ్రీకృష్ణుని ఇంద్రియ తృప్తికొరకై మనం కర్మ చేసినప్పుడు దాని గుణము మారుతుంది.

భగవద్గీతలో కాని లేదా శ్రీమద్భాగవతంలో కాని *'కృష్ణ ఉవాచ'* (శ్రీకృష్ణుడు పలికెను) లేదా *'కపిలదేవ ఉవాచ'* (కపిల దేవుడు పలికెను) అని తెలుపలేదను విషయమును మనము గమనించవలెను. కాని *'శ్రీభగవానువాచ'* (దేవాదిదేవుడు పలికెను) అంటే, దీని అర్థం ఆ వివరణ పరిపూర్ణమైనది. మనం సాధారణ వ్యక్తి నుండి జ్ఞానమును పొందినప్పుడు అందులో మనకెన్నో దోషములు కనిపించును. సాధారణ వ్యక్తి గొప్ప పాండిత్యమును కలిగి ఉండవచ్చును కాని పరిపూర్ణ జ్ఞానమును కలిగి ఉండడు. పరిపూర్ణత్వము అనునది మనం ఈ భౌతిక లోకంలో చూచుదానికి పూర్తిగా భిన్నమైనది. పరిపూర్ణత్వము అనగా దోషములు లేనిది, భ్రాంతి చెందనిది, మోసం ఎరుగనిది, పూర్ణమైనది. అందుకే 'శ్రీభగవానువాచ' అని చెప్పబడినది.

ఎందుకనగా, భగవంతుడు అంటే సంపూర్ణుడు. అందుకే మనం జ్ఞానమును భగవంతుని నుండి లేదా భగవద్గీత శాస్త్రము ననుసరించి బోధించే వారి నుండి గ్రహించవలెను.

కృష్ణచైతన్య ఉద్యమము ఈ సూత్రము పైననే ఆధారపడి ఉన్నది. మేము దేనినో తయారుచేసి దానిని మీకు అందించుట లేదు. మనం తయారుచేసిన దంతయు ఖచ్చితంగా లోపాలకు లేదా అసంపూర్ణతలకులోనై ఉంటుంది. మన తత్త్వవిచారణకు గల విలువ ఏమిటి? మన ఆలోచనలకు విలువ ఏమిటి? అని అడిగినప్పుడు, సాధారణంగా జనులు ఇలా చెబుతుంటారు, “నా అభిప్రాయములో” అనగా “నా యొక్క అభిప్రాయము” వారి అభిప్రాయమనేది ఏదో విలువైనదని భావిస్తుంటారు. “నేను వట్టిమూర్ఖుడను” అని జనులు భావించరు. జనులు వారి అభిప్రాయాలు ఎంతో గొప్పవని ఆలోచిస్తూ వాటికి ఎంతో విలువనిస్తుంటారు. ఈ లోకంలో ప్రతిఒక్కరూ అసంపూర్ణ ఇంద్రియములను కలిగి ఉన్నారు. అందుకే ఇంద్రియముల ద్వారా సంపాదించు జ్ఞానమంతయు అసంపూర్ణమైనదనుట సముచితము. మేము పదేపదే విన్నవించునది దేమనగా, జ్ఞానమును మనము గురుశిష్య పరంపర నుండి గ్రహించవలెను. జ్ఞానము అను దానిని సంపూర్ణుడైన భగవానుని నుండియే గ్రహించవలెను. ఈ పద్ధతిని పాటించినప్పుడే ప్రపంచ మంతటికి మనము గురువు కాగలము.

భక్తుడెన్నడు తాను గొప్ప భక్తుడనని భావించడు. ‘శ్రీ చైతన్య చరితామృతము’ (ఆదిలీల 5.205) యొక్క రచయిత అయిన శ్రీల కృష్ణదాస కవిరాజ గోస్వామి ఇలా ప్రకటించెను: *“పురీషేర్ కీట్ హొయితే మునీ సే లఘిష్ఠ”* – “నేను మలము లోని పురుగుల కంటే అధముడను.” ఇది వైష్ణవ దృక్పథము. “నేను అందరికంటే అధికుడను. నేను భగవంతుడ నయ్యాను” అని అతడెన్నడు చెప్పడు. వినయమనేది వైష్ణవుడి సహజ ప్రవృత్తి. “నేను భగవంతుడను”, “నన్ను పూజించండి” అని శ్రీకృష్ణుడంటాడు. “శ్రీకృష్ణుడు భగవంతుడు కాబట్టి శ్రీకృష్ణుడిని పూజించుము” అని వైష్ణవుడంటాడు. గురువు కాగలుగుట అంత కష్టమేమి కాదు. దానికొరకు శ్రీకృష్ణుడు చెప్పినదానిని మాత్రమే తిరిగి చెప్పవలసి ఉంటుంది. భగవద్గీతలో శ్రీకృష్ణుడు ధర్మమును వివరించాడు. ధర్మమనేది ఒకే రకముగా ఉంటుంది. అనేక రకాలుగా ఉండటానికి వీలులేదు. ధర్మం అనగా భగవంతుని ఆదేశములకు కట్టుబడి ఉండుట. ఏమైనను, మనకు భగవంతుడి గురించి లేదా అతడి ఆదేశాల గురించి తెలియనప్పుడు, మనము ఏదో విలువతక్కువ వాటిని రూపొందించుకొని మనలో

మనము కలహించు కుంటాము. ఇది ధర్మం కాదు. ఇది కేవలము ఊహాతర్కము. ఈ కల్పనల నన్నింటిని శ్రీమద్భాగతము త్రోసిపుచ్చుతున్నది. ఎందుకనగా ఇదంతయు మోసపూరితమైనది. భాగవతధర్మం మోసపూరితమైనది కాదు. ఎందుకనగా, దీనికి భగవంతునితో సంబంధము కలదు. భక్తి అనేది కేవలం భగవంతుని కొరకు చేయవలెను. మరియు భగవంతుడు లేనిచో భక్తి అనేది కూడ లేదు. భగవంతుడు శూన్యమైనచో భక్తి ఎలా ఉండదు. భక్తి అనేది భగవంతునికి భక్తునికి మధ్య గల వ్యవహారము. భగవంతుడున్నాడు, భక్తులు ఉన్నారు. భక్తులు భగవంతునితో సంభాషిస్తారు. అతడికి నైవేద్యమును సమర్పిస్తారు. భగవంతుని నామాలను కీర్తిస్తారు. భగవంతుని గురించి శ్రవణము చేయుటకు జనులను జాగృత పరుస్తుంటారు. భగవంతునికి సంబంధించిన గ్రంథములను ప్రచురిస్తుంటారు. ఇలా ఎన్నోరకాలుగా భగవంతుని ఆరాధిస్తారు. ఈ విధముగా వారు భగవంతుని ధ్యానంలో నిరంతరము నిమగ్నులై ఉంటారు. ఇదే భక్తి ప్రక్రియ.

శ్లోకము 33

జరయత్యాశు యా కోశం నిగీర్ణమనలో యథా

భుజించిన ఆహారపదార్థములను జఠరాగ్ని జీర్ణము చేయునట్లుగా, జీవుని సూక్ష్మదేహమును భక్తియుక్త సేవ ఎటువంటి ప్రత్యేకమగు యత్నము లేకనే నశింప జేయగలదు.

భాష్యము : భక్తి యనునది ముక్తికన్నను ఎంతో ఉన్నతమైన స్థితి యందున్నట్టిది. ఏలయన భవబంధవిముక్తికై మనుజుడు చేసెడి యత్నము భక్తియుక్త సేవ యందు అప్రయత్నముగా ఒనగూడగలదు. మనం భుజించెడి ఆహారపదార్థములను జఠరాగ్ని జీర్ణము చేసెడి ఉపమానము ఇచ్చుట ఈ సందర్భమున ఒసగబడినది. జీర్ణశక్తి తగినంతగా ఉన్నప్పుడే మనమేది భుజించినను జఠరాగ్నిచే అది జీర్ణమగును. అదేవిధముగా భక్తుడు ముక్తిని సాధించుటకై ప్రత్యేకముగా యత్నించ నవసరము లేదు. దేవాదిదేవుడగు శ్రీకృష్ణుని సేవయే అతని ముక్తివిధానము కాగలదు; ఏలయన కృష్ణసేవలో నియుక్తమగుట యనగా భవబంధముల నుండి విముక్తిని పొందుటయే.

భక్తునకు ముక్తి యనునది ఒక సమస్యే కాదు; ప్రత్యేకమగు ఎట్టి యత్నము లేకుండగనే ముక్తి లభించగలదు. కనుకనే భక్తి యనునది ముక్తికన్నను లేదా నిరాకారవాది స్థితికన్నను ఉన్నతమైనది. ముక్తిని బడయుటకు నిరాకారవాదులు

కఠోరమగు తపోనిష్ఠలను ఆచరింతురు; కాని భక్తుడు మాత్రము కేవలము భక్తియందు నెలకొనుట ద్వారా(ముఖ్యముగా "హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే / హరే రామ హరే రామ రామ రామ హరే హరే" అను మహామంత్రమును జపకీర్తనములను కావించుట) మరియు దేవాదిదేవునకు అర్పించిన అహార పదార్థములను ప్రసాద రూపమున భుజించుట ద్వారాను శీఘ్రమే జిహ్వను అదుపు లోనికి తెచ్చుకోగలడు. జిహ్వా నిగ్రహింప బడినంతనే సహజముగానే ఇతర ఇంద్రియము లన్నియును అప్రయత్నముగా నిగ్రహింప బడగలవు. ఇంద్రియ నిగ్రహమే యోగవిధానపు పరిపూర్ణత్వము; ఇక మనుజుడు భగవత్సేవ యందు నియుక్తుడైనంతనే అతని ముక్తి ఆరంభమగను. ఈ విధముగా భక్తియుక్త సేవ యనునది 'సిద్ధి'(మోక్షము) కన్నను అధిక మహిమాన్వితమైనదని కపిల దేవుడు నిర్ధారించినాడు.

భక్తి అనునది సూక్ష్మశరీరమును అంతం చేయునని ఇచ్చట పేర్కొనబడినది. ఆత్మ అనేది సూక్ష్మ మరియు స్థూల శరీరములను కలిగి ఉన్నది. స్థూల శరీరం భూమి, నీరు, వాయువు, అగ్ని, ఆకాశముతో తయారు చేయబడినది. సూక్ష్మశరీరం మనస్సు, బుద్ధి మరియు అహంకారముతో తయారు చేయబడినది. ఈ ఎనిమిది భౌతిక తత్త్వములలో ఐదు స్థూలమైనవి. మరియు మూడు సూక్ష్మమైనవి. సూక్ష్మ శరీరమును మనం చూడలేము. అంతేకాకుండ ఆత్మ అనేది అతి సూక్ష్మమైనది. కన్నులు గల వారెవరైనను శరీరమును చూడగలరు, కాని అందరు వాస్తవ జీవుడైన ఆత్మను చూడలేరు. వాస్తవ జీవుడు, లేదా ఆత్మ శరీరమును విడిచి వెళ్ళినప్పుడు, "అయ్యో! నా మిత్రుడు పోయాడు" అని మనం రోదిస్తాము. అనగా ఏదో ఖచ్చితముగా శరీరమును విడిచిపోయిందని గ్రహించ గలుగుతాము. కాబట్టి ఒకరి మిత్రుడు నిజానికి శరీరం కంటే భిన్నుడు. ప్రస్తుత పరిస్థితులలో, "ఇతడు నా మిత్రుడు" అని సంబోధించినప్పుడు, మనం శరీరమును సూచిస్తున్నాము, కాని అది కేవలం పశుదృష్టి మాత్రమే. "ఇది నా కుక్క స్నేహితుడు" మరియు "ఇది నా తల్లి కుక్క" అని జంతువులు ఆలోచిస్తాయి. అవి స్థూల శరీరమునకు అతీతముగా చూడలేవు. అదేవిధముగా మనము ఆత్మను చూడలేము, అంతేకాకుండ మనం సూక్ష్మమైన ఆత్మను చూడలేనిచో, మరి ఎలా ఈ జడమైన కన్నులచే భగవంతుడిని చూడగలమని భావించవచ్చును? మనం నిజానికి మరొదానిని చూడలేము. అటువంటప్పుడు భగవంతుని ఎలా చూడగలము. "*అతః శ్రీకృష్ణ నామాది న భవేద్ గ్రాహ్యమింద్రియైః*" అని చెప్పబడినది. అనగా జడేంద్రియాలు శ్రీకృష్ణుని

పవిత్ర నామమును, రూపమును, గుణమును మరియు లీలలను తెలుసుకోలేవు.

ప్రస్తుత మన ఇంద్రియాలు భగవంతుడిని చూచుటకు అసమర్థమైనవి, నిజానికి, మనం మరణ సమయంలో ఏదో విడిచిపోయినదని గ్రహించగలము. నిజానికి, మనం మన స్నేహితునికి బదులుగా జడ పదార్థమును చూస్తున్నామని అర్థం చేసుకోగలము. ఇదే జ్ఞానము. ఏమైనను, మరణమునకు ముందు ఎవరైన ఈ శరీరం కేవలము జడపదార్థపు ముద్ద అని గ్రహించ గలిగినచో, అతడు జ్ఞానవంతుడని తెలుసుకోవలెను. అతడు ఆత్మను జ్ఞానచక్షువులతో గ్రహించును. స్థూలభౌతిక స్థితిలో నెలకొని ఉన్నవారెవరైనను పశుసమానులు. వారు ఆత్మను గాని లేదా భగవంతుడిని గాని చూడలేరు. కర్మిలు లేదా స్థూలమైన ప్రతిఫలాపేక్షను కాంక్షించేవారు, శరీరము మరియు ఆత్మకు గల భేదమును చూడలేరు. కొన్ని కోట్లమంది కర్మిలలో ఒక జ్ఞాని మాత్రమే దీనిని అర్థం చేసుకోగలడు. జ్ఞాని తాను శరీరము కాదని తెలుసుకొనును. కొన్నికోట్ల జ్ఞానులలో ఒకడు మాత్రమే వాస్తవంగా ముక్తుడగును. మాయావాదులు తాము ఆత్మస్వరూపము లైనందున తాము భగవంతునితో సమానమని భావిస్తారు. గుణములో సమానమైనంత మాత్రాన మనం పరమాత్మతో సమానము కాలేము. మాయవాదులు తాము నారాయణునితో సమానమని భావిస్తూ తమలోతాము నారాయణ అని సంబోధించు కొంటుంటారు. “నీవు నారాయణుడవు, నేను నారాయణుడిని మరియు అందరు నారాయణులే” అని వారంటుంటారు. కాబట్టి ఈ తప్పుడు భావన నుండియే ‘దరిద్ర నారాయణ’ అనే ఆలోచన పుట్టుకు వచ్చింది. ఎల్లప్పుడు భగవంతుని పాదకమలముల సేవలో నెలకొనియున్న భక్తులు ఈ విధంగా ఆలోచించరు. “నేను భగవంతునితో సమానమైనచో, నేను ఎలా ఈ స్థితికి పతనము చెందితిని” అని వారు ఆలోచిస్తారు. సముద్రంలోని నీటిచుక్క గుణములో విశాలమైన సముద్రముతో సమానమైనను నీటిబిందువు పరిమాణములో ఎన్నడు సముద్రముతో సమానము కాలేదని కూడ వారికి తెలుసును.

కొన్నిసార్లు మాయవాదులు విష్ణుభగవానుని పూజిస్తారు. కాని నిజానికి వారు భగవంతుని స్వరూపములో విశ్వాసమును కలిగి ఉండరు. అతని స్వరూపము ఏదో కల్పన అని, ఆత్మసాక్షాత్కారము కొరకు ఉపయోగించు కొనుటకు గల సాధనమని, పరమ సత్యమునకు రూపం లేదని మాయవాదులు చెబుతుంటారు. కాని, *“ఈశ్వరః పరమః కృష్ణః సచ్చిదానందవిగ్రహః”* అని చెప్పబడినది– “గోవిందునిగా పిలువబడే శ్రీకృష్ణుడే పరమనియంత. అతడు సచ్చిదానంద

మయమైన దివ్యశరీరమును కలిగి ఉన్నాడు.”

‘విగ్రహః’ అనే పదము దివ్య స్వరూపమును సూచిస్తుంది. కాని మాయవాదులు దీనిని అర్థం చేసుకోలేరు. వైష్ణవులుగా పిలువబడే కొందరు విష్ణు భగవానుడిలో ఐక్యమవ్వాలనే లక్ష్యముతో ఆరాధిస్తూ మహా సముద్రంలో కలిసిపోయే నీటిబిందువు ఉదాహరణను కొన్నిసార్లు ఇస్తుంటారు. ఇదంతా కేవలము మూర్ఖత్వము. సముద్రమనేది లెక్కలేనన్ని జలబిందువులకు నిలయము. మరియు ఒక స్వల్ప పరమాణువనేది సముద్రమనే పూర్ణత్వములో కలిసిపోవుట అసాధ్యం. సూర్యకాంతి అనేది అనంతమైన అతి చిన్న వెలుగు కాంతికిరణముల సమ్మేళనము. మరియు ప్రతికణము ఒక పరమాణు రూపమున తన వైయుక్తిక స్వరూపమును కలిగి ఉండును. అతి చిన్నదైన పరమాణువుల విభజనను చూసే శక్తి కన్నులకు లేనందున వాటినన్నింటిని ఒకటని భావిస్తాము. కాని వాస్తవానికి అవన్నీ ఒకటి అనగా సమాన రూపములు కావు. ఆ విధముగా, దేవాదిదేవుని అణు అంశలమై నందున మనమందరము భిన్న వ్యక్తిత్వములను కలిగి ఉన్నాము. భగవద్గీత (2.12)లో శ్రీకృష్ణుడిట్లు చెబుతున్నాడు :

న త్వేవాహం జాతు నాసం న త్వం నేమే జనాధిపాః
న చైవ న భవిష్యామః సర్వే వయమతః పరమ్

“నేను ఉండని సమయము ఎప్పుడును లేదు. నీవు కాని, ఈ రాజులు కాని ఉండని సమయము కూడ ఎప్పుడును లేదు. ఇకముందు భవిష్యత్తులో కూడ మనమెవ్వరమును ఉండకపోవు.”

తాను, అర్జునుడు మరియు సైనికులందరు ఐక్యమవ్వాలని శ్రీకృష్ణుడు ఎక్కడ చెప్పలేదు. అలాకాకుండ, అతడు అందరు తమ వ్యక్తిత్వమును నిలుపు కొందురని చెప్పి ఉన్నాడు.

భవిష్యత్తులో తాము భగవంతునిలో ఐక్యమవ్వాలనీ పరిపూర్ణ జ్ఞానం గలవారెన్నడు ఆలోచించరు. వారు కేవలం శ్రీకృష్ణుని అంశగా తమ నిజస్థితిలో నెలకొనుటనే ఆశిస్తారు. ప్రస్తుతము మనమందరము భౌతిక శరీరము చేత కప్పబడినను, భక్తియోగ పద్ధతి ద్వారా సులభంగా భౌతిక శరీరమును చాలించవచ్చు, మనం భక్తియోగలో దృఢంగా నెలకొనినచో, మనం భౌతిక శరీరమును పొందకుండ కేవలము ఆధ్యాత్మిక శరీరమును పొందగలము. మనం ముక్తుల మగుదుము.

మనం జీవితములో భంగపడి లక్ష్మీపతియైన నారాయణులము కావాలను

కుంటాము. లక్ష్మి యొక్క పతి నారాయణుడు, స్వయం భగవానుడు. ఈ భౌతిక లోకంలో అదృష్ట దేవతయైన లక్ష్మీకటాక్షం కొరకు ప్రాకులాడి నప్పటికిని, మనము ఈ ప్రయత్నములో విఫలమవు తుంటాము. "నేను లక్ష్మీపతిని కావలెనని మనం భావించ వచ్చును." కాని నారాయణుడు మాత్రమే లక్ష్మీదేవిని భోగించగలడు. గొప్ప దేవతలైన బ్రహ్మ మరియు శివుడు కూడ నారాయణుడి కంటె తక్కువవారే. కాని మనము నారాయణుని స్థానమును ఆశించెటి మూర్ఖులము. లేదా నారాయణుని 'దరిద్ర నారాయణు'నిగా, వీధిలోని పేదవాడిగా మారుస్తున్నాము. బ్రహ్మదేవుడు, పరమశివుడు కూడ నారాయణుడితో సమానులని శాస్త్రమెన్నడు చెప్పనప్పుడు, ఇక ఈ మూర్ఖుల సంగతిని గురించి ఏమి చెప్పగలము?

నారాయణుడు మనలను ఎందుకు సృష్టించెను, మనమెందుకు నారాయణుని అంశలమని ఎవరైనను అడుగవచ్చును. *"ఏకో బహు స్యామ్."* ఎందుకు నారాయణుడు బహు రూపములుగా విస్తరించాడు? భగవానుడు తన ఆనందము కొరకు మనలను సృష్టించెను. *"ఆనందమయోఽ భ్యాసాత్"* ఒక యోగ్యుడు భార్యను అంగీకరించినట్లుగా, భగవంతుడు మనలను సృష్టించెను. ఎవరైనను, భార్యను అంగీకరించినప్పుడు సంతానమును పొందుతారు. భార్య మరియు సంతానపు బరువు బాధ్యతలను భర్త స్వీకరించును. ఎందుకనగా, అతడు వారి వలన తాను జీవితములో ఆనందమును పొందుదునని భావించును. భౌతిక లోకంలో భర్త అనెడివాడు, సాయంకాలము తన భార్యపిల్లలు మరియు స్నేహితులతో కలిసి ఆనందించుటకు ప్రయత్నించును. దానికొరకు అతడు అనేక బరువు బాధ్యతలను మోస్తుంటాడు. ఇది అతడికి ఆనందము. కాని, భౌతికలోకంలో ఇలా జరుగు చుండుట వలన ఆనందము అనేది రుచి లేకుండ పోయినది. ఏమైనను, మనం మన పరమ పితయైన శ్రీకృష్ణునితో ఉండగలిగినచో, ఈ ఆనందమును అనుభవించ గలము. మనమందరము పరమపిత యొక్క సంతానము. భగవద్గీత (14.4)లో శ్రీకృష్ణుడు సమస్త జీవజాతులన్నీ తన సంతానమని ప్రకటిస్తున్నాడు :

సర్వయోనిషు కౌన్తేయ మూర్తయః సమ్భవన్తి యాః
తాసాం బ్రహ్మ మహద్యోనిరహం బీజప్రదః పితా

"ఓ కౌంతేయా! మూల ప్రకృతి *(మహద్ బ్రహ్మ)* యనెడి గర్భము నందు జీవ జాతులన్నింటి జననము సాధ్యమగుచున్నది. నేనే వీటన్నింటికి బీజప్రదాతనైన తండ్రిని."

పరమ పితయైన శ్రీకృష్ణుడు తన ఆనందము కొరకు మనలను సృష్టించెను. దుఃఖమును కలిగించుట కొరకు కాదు. మనం శ్రీకృష్ణుని సంతతియైనను, అతడితో విడిపోయి స్వతంత్రముగా ఆనందించాలని ఆశించి మనము మన పరమపితను విడిచితిమి. అందుకే మనం దుఃఖములను అనుభవిస్తున్నాము. ధనికుని కుమారుడు ఇల్లు వదిలి స్వేచ్ఛగా ఆనందించా లనుకున్నచో, అతడు కేవలము దుఃఖముల పాలగును. తిరిగి భగవద్ధామమును చేరి మన నిజమైన తండ్రియైన శ్రీకృష్ణునితో ఆనందించుటనందే మన లాభం కలదు. ఇది మనకు ఆనందమును కలుగజేయును. అతడు సర్వైశ్వర్యములను అనగా ఐశ్వర్యము, శక్తి, సౌందర్యము, కీర్తి, జ్ఞానం మరియు వైరాగ్యము లన్నింటిని సంపూర్ణముగా గలవాడు. అతడు అన్నింటిని అపరిమితముగా కలిగి ఉండెను. కాబట్టి మనం మన నిజమైన తండ్రిని తిరిగి చేరినప్పుడే అతనితో అపరిమితముగా ఆనందించగలము. శ్రీకృష్ణుడితో కాకుండ మనం స్వతంత్రముగా ఆనందించలేము. కాబట్టి ఆనందము కొరకు మనం శ్రీకృష్ణునిలో ఐక్యమవ్వాల్సిన అవసరము లేదు. ఈ భౌతిక లోకంలో మన తండ్రి మనకు జన్మనిచ్చును. మనమతని కంటే భిన్నమైన జీవాత్మల మైనను మనము దుఃఖములను అనుభవిస్తూ, "ఓ తండ్రి, నేను బాధలు పడుతున్నాను, మీరు నన్ను తిరిగి మీలో కలుపుకొనుమని అర్థించగలమా?" ఇది సరియైన ప్రతిపాదన కాగలదా? "నేను మీకు జన్మనిచ్చినది మీరు విడిగా ఆనందించుట కొరకు అని తండ్రి చెప్పును. మీరు భిన్నులు మరియు నేను భిన్నుడను. ఈ విధముగానే మనం ఆనందించగలము. మీరిప్పుడు నాలో ఐక్యమవ్వాలను కుంటున్నారు, ఏమిటి ఈ మూర్ఖపు ఆలోచన?"

ఈ భౌతిక లోకములోని బాధల వలన మాయావాదులు భగవంతునిలో ఐక్యమవ్వా లనుకుంటారు. శ్రీకృష్ణుడు విడిగా అతని సాంగత్యములో ఆనందించుట కొరకు మనలను సృష్టించెను. కాని స్వతంత్రముగా ఆనందమును అనుభవించాలనే కోరిక వలన మనం అలా చేయలేకున్నాము. తత్ఫలితంగానే, మనం ఈ భౌతిక లోకంలో దుఃఖాలను అనుభవిస్తున్నాము. బాధల వలననే మనం మన తండ్రిలో ఐక్యమవ్వాలని కోరుకుంటున్నాము. జీవుడిని బంధించుటకు ప్రయత్నిస్తూ, అతడిని గర్వింప చేస్తూ తాను భగవంతుడు కాగలడని ఆలోచించేలా చేయుటమనేది మాయ యొక్క చివరి అస్త్రం. భగవంతునిలో ఐక్యమగుటయే సంసిద్ధి అని మాయావాదులు భావిస్తుంటారు. కాని ఇది సంసిద్ధి కాదు. ఎందుకంటే, శ్రీకృష్ణుని సహచర్యమును ఆనందించుటయే మన నిజస్థితి. స్నేహితులు ఒక గదిలో కూర్చొని ఒకరినొకరి

సహచర్యాన్ని ఆనందిస్తుంటారు. తమకుతాముగా ఎటువంటి ఆనందమును పొందలేరు? వైవిధ్యమనేది ఆనందమునకు తల్లివంటిది. నిజమైన ఆనందము కేవలము శ్రీకృష్ణుని సహచర్యములోనే లభించును. కాబట్టి భక్తులెన్నడు భగవంతునిలో ఐక్యమగుటను కోరుకొనరు. శ్రీ చైతన్య మహాప్రభువు ఇలా చెబుతున్నారు(శిక్షాష్టకము 4) :

మమ జన్మని జన్మనీశ్వరే భవతాద్ భక్తిరహైతుకీ త్వయి

“ఓ జగదీశా! ధనమును కూడబెట్టవలెనని గాని, సౌందర్యవతులగు స్త్రీలను గాని, అనేక సంఖ్యలో అనుయాయులను గాని నేను కోరను. జన్మజన్మల యందు నేను కోరునది నిర్హేతుకమైన నీ భక్తియుక్త సేవ ఒక్కటియే.” ఇది నిజమైన ఆనందం, మనం యోగ్యులైన పరిపూర్ణ భక్తులము కాకుండ వైకుంఠ లోకములలోకి ప్రవేశింప లేము. మరియు మనము బయట ‘బ్రహ్మజ్యోతి’లోనే నివసించవలసి వస్తుంది. ఈ కోరికను మనము కలిగి ఉన్నచో, శ్రీకృష్ణుడు మనకు అవకాశమును కలిగించును. నిజానికి శ్రీకృష్ణుడే సర్వస్వము. మరియు అతడే ‘బ్రహ్మజ్యోతి’, అతడే పరమాత్మ. భగవంతునిలో ఐక్యమవ్వా లనుకుంటే, మనము వైకుంఠ లోకం బయటగల బ్రహ్మజ్యోతిలో నివసించుటకు అనుమతించ బడుదుము. ఏమైనను, ఆ స్థితి అశాశ్వతమైనది. మేము ముందుగానే తెలిపినట్లు, మనం ‘బ్రహ్మజ్యోతి’లో శాశ్వతముగా ఉండలేము. ఎందుకనగా, మనం వైవిధ్యములను కోరుకుంటాము. వైవిధ్యములు(మార్పు) లేనిచో ఆనందము ఉండదు.

అన్ని స్థితులలోను శుద్ధభక్తుడు ముక్తుడు. అతడు ఏదైన వృత్తిలోగాని, వ్యాపారములోగాని నిమగ్నమైనప్పుడు అతడు ఎల్లప్పుడు శ్రీకృష్ణుని ఎలా సేవించ వలెనని ఆలోచించును. ఆ విధముగా అతడు సహజముగానే ముక్తుడగును. అతడు భగవంతునిలో ఐక్యమవ్వాలనీ లేదా ముక్తిని పొందాలనీ గాని ఆశించడు. మరియు అతడి ముక్తి అనేది భగవంతునితో అతడికి గల వ్యక్తిగత సంబంధము పైననే ఆధారపడి ఉంటుంది.

అధ్యాయము 15

భగవంతుని దివ్య రూపములను ధ్యానించుట

శ్లోకము 34

నైకాత్మతాం మే స్పృహయన్తి కేచి-
న్మత్పాదసేవాభిరతా మదీహాః
యేఽ న్యోన్యతో భాగవతాః ప్రసజ్య
సభాజయన్తే మమ పౌరుషాణి

భక్తియుక్త సేవ యెడ అనురక్తుడైనవాడును మరియు నా పాదపద్మసేవ యందు నిరంతరము నియుక్తుడైనవాడును అగు విశుద్ధభక్తుడు ఏనాడును నాతో ఏకము కావలెనని కోరడు. భక్తి యందు అకుంఠితముగా నెలకొనిన అట్టి భక్తుడు సదా నా లీలలనే కీర్తించుచుండును.

భాష్యము : శాస్త్రములందు ఐదు రకములగు ముక్తులు తెలుపబడినవి. దేవాదిదేవునితో ఏకమగుట లేదా వ్యక్తిత్వమును కోల్పోయి పరతత్త్వమందు లీనమగుట అందులో ఒకటి. అదియే *'ఏకాత్మతాం'* అని పిలువబడినది. భక్తుడెన్నడును అటువంటి ముక్తిని అంగీకరింపడు. భగవానుడు నివసించు లోకమును(వైకుంఠము) చేరుట, భగవానునితో సాహచర్యమును పొందుట, భగవానునితో సమానముగా ఐశ్వర్యమును పొందుట, భగవానుని వంటి రూప లక్షణములను పొందుట అనునవి మిగిలిన నాలుగు ముక్తులు. కపిలముని చేత వివరింపబడినట్లు శుద్ధభక్తుడు ఈ ఐదు ముక్తులలో దేనిని వాంఛింపడు. ముఖ్యముగా సాయుజ్యముక్తిని అతడు నరక ప్రాయమైనదిగా తృణీకరించును. శ్రీ చైతన్య మహాప్రభువు యొక్క గొప్పభక్తుడైన శ్రీ ప్రబోధానంద సరస్వతీ *"కైవల్యం నరకాయతే"* అని నుడివిరి. అనగా "మాయావాదులచే అమితముగా వాంఛింపడు సాయుజ్యముక్తి సౌఖ్యము నరకప్రాయమైనదిగా భావింపబడును." అటువంటి ఏకత్వము విశుద్ధభక్తుల కొరకై ఉద్దేశింపబడినది కాదు.

బద్ధస్థితి యందు దేవాదిదేవుని అర్చించినను చివరికి స్వరూప మనునది లేనేలేదని భావించు నామమాత్రపు భక్తులు పెక్కుమంది కలరు. పరమసత్యము నిరాకారము కనుక ప్రస్తుతము మనుజుడు నిరాకార పరతత్త్వమునకు ఏదియోనొక

సాకార రూపమును ఊహించు కొనవచ్చునని, కాని ముక్తిని బడసినంతనే అట్టి ఆరాధన నిలిచిపోవునని వారు పలుకుదురు. మాయావాద తత్త్వము తెలుపు సిద్ధాంతమిదియే. నిజమునకు నిరాకారవాదులు భగవానుని యందు గాక అతని దేహకాంతి(బ్రహ్మజ్యోతిగా పిలువబడునది) యందు లీనమగుదురు. బ్రహ్మజ్యోతి భగవానుని దేహమునకు అభిన్నమైనను, విశుద్ధభక్తుడు అటువంటి ఏకత్వమును (భగవానుని దేహకాంతి యందు లీనమగుటను) ఎన్నడును అంగీకరింపడు. నామమాత్రపు సాయుజ్య ముక్తి సౌఖ్యము కన్నను అధిక సౌఖ్యమును భక్తులు అనుభవించుటయే అందులకు కారణము. నిజమునకు భగవత్సేవయే పరమోన్నత సౌఖ్యము. ఏ విధముగా భగవత్సేవ చేయవలెనని భక్తులు సదా తలపోయు చుందురు; భౌతిక అస్తిత్వపు గొప్ప అడ్డంకుల నడుమ కూడా వారు దేవాదిదేవుని సేవకై అనేకములగు పద్ధతులను, మార్గములను రూపొందిస్తుంటారు.

భగవల్లీలా వర్ణనలను మాయావాదులు కథలుగా భావింతురు; కాని నిజమునకు అవి కథలు కావు. అవి చారిత్రిక సత్యములు. విశుద్ధభక్తులు భగవల్లీలలను కథలుగా గాక పరమసత్యములుగా అంగీకరింతురు. కనుకనే *'మమ పౌరుషాణి'* అను పదము ఇచ్చట ప్రధానమైనది. భగవత్ లీలలను కీర్తించుట యందే భక్తులు అమితముగా అనురక్తులై యుండగా, మాయావాదులు ఆ లీలలను ఊహింపనైనను సమర్థులు కారు. వారి ఉద్దేశ్యము ననుసరించి పరమసత్యము నిరాకారము. సాకారరూపము లేనిదే లీలలు ఎచ్చటి నుండి వచ్చును? శ్రీమద్భాగవతము నందు, భగవద్గీత యందు, ఇతర వేదవాఙ్మయము నందు తెలుపబడిన లీలలను నిరాకారవాదులు కట్టుకథలుగా భావింతురు; తత్కారణమున వారు వాటిని ఘోరముగా వ్యాఖ్యానింతురు. దేవాదిదేవుని గూర్చి వారికేమియును తెలియదు. అయినను అనవసరముగా శాస్త్రమందు వేలుపెట్టి, దానిని తప్పు ధోరణిలో వ్యాఖ్యానిస్తూ అమాయక జనులను మోసగింతురు. మాయావాద తత్త్వము అత్యంత హానికరమైనది. కనుకనే మాయావాది నుండి ఏ శాస్త్రము గూర్చియు వినరాదని శ్రీ చైతన్య మహాప్రభువు తన శిష్యులను హెచ్చరించిరి. ప్రక్రియ నంతటిని వారు చెరచి వేయుదురు; కనుకనే మాయావాదుల నుండి శ్రవణము చేయువాడు పూర్ణత్వమును బడయుటకై భక్తియుక్త సేవాపథమున కెన్నడును రాజాలడు, లేదా పిదపయే ఈ మార్గమునకు రాగలడు.

భక్తియుక్త సేవలు ముక్తికి పరమైనవని కపిలమునిచే స్పష్టముగా తెలుప బడినది. అవి 'పంచమ పురుషార్థము' అని పిలువబడినవి. సాధారణముగా,

జనులు ధర్మము, అర్థము, కామము, అంత్యమున భగవానుని యందు ఐక్యమగునట్లు ముక్తిభావనను కూడిన కర్మల యందే నెలకొని యుందురు. కాని భక్తి ఈ కర్మ లన్నింటికినీ అతీతమైనది. కనుకనే సమస్త కైతవ ధర్మములు శ్రీమద్భాగవతము(1.1.2) నుండి పూర్తిగా నిర్మూలించ బడినవని ఆది యందే తెలుపబడినది. ఆర్థికాభివృద్ధి మరియు ఇంద్రియ భోగముల కొరకై కర్మకాండ, ఇంద్రియభోగము నందు భంగపాటు పిదప సాయుజ్యముక్తి వాంఛ మొదలగు వన్నియును శ్రీమద్భాగవతము నందు పూర్తిగా త్రోసిపుచ్చబడినవి. ఎల్లప్పుడు కృష్ణచైతన్యములోనే(భక్తియుక్త సేవ యందు) నెలకొనియుండి, భగవానుని దివ్యకర్మలను నిరంతరము కీర్తించెడి విశుద్ధభక్తుల కొరకై శ్రీమద్భాగవతము ప్రత్యేకముగా ఉద్దేశింపబడినది. శ్రీమద్భాగవతము నందు మరియు ఇతర పురాణములందు వర్ణింపబడిన శ్రీకృష్ణుని వృందావన, ద్వారక, మథురాపురి లీలలను విశుద్ధభక్తులు భక్తితో అర్చింతురు. మాయావాద తత్త్వవేత్తలు వాటిని కథలుగా కొట్టివేసినను, వాస్తవమునకు అవి పరమ ఆరాధనీయ విషయములై యుండి కేవలము భక్తుల చేతనే ఆస్వాదనీయములై యున్నవి. మాయావాదికి, విశుద్ధభక్తునికి శాస్త్రవిషయములోని వ్యత్యాసమిదియే.

వాస్తవానికి వైదిక శాస్త్రములంటే 'కృష్ణకథ' అనగా శ్రీకృష్ణునికి సంబంధించిన వృత్తాంతములతో నిండి ఉంటుంది. మరియు 'కృష్ణకథ' అనేది తర్కవిషయము కాదు. ఇది భక్తుల కొరకు నిర్దేశించబడినది. భక్తులు కాని వారు శ్రీమద్ భగవద్గీత మరియు శ్రీమద్భాగవతమును చదువుటలో కేవలం తమ సమయమును వృథా చేస్తుంటారు. పండితులు, రాజకీయ నాయకులు, తత్త్వవేత్తలు అని పిలువబడేవారు భగవద్గీత పై వ్యాఖ్యానించుటకు ప్రయత్నిస్తూ తప్పుద్రోవ పట్టేలా భాష్యములను చేస్తుంటారని మేము ఎన్నోసార్లు పేర్కొన్నాము. కేవలము వారు మూత బిగించి ఉన్న తేనె సీసాను నాకుటకు ప్రయత్నించుదురని శ్రీల భక్తి సిద్ధాంత సరస్వతీ ఠాకూర్ ఎప్పుడు ఉదహరించేవారు. తేనె సీసాను ఎలా ఆస్వాదించాలో తెలియని వారు కేవలం సీసానే నాకుటకు ప్రయత్నిస్తుంటారు. కాని ఎవరైనను వాస్తవంగా తేనెను రుచి చూడాలనుకున్నచో, సీస మూతను తెరవవలెను. దానిని తెరిచే తాళం చెవి భక్తుడు. కాబట్టి ఇలా చెప్పబడినది :

సతాం ప్రసంగాన్మమ వీర్యసంవిదో
భవన్తి హృత్కర్ణరసాయనాః కథాః

తజ్జోషణాదాశ్వపవర్గవర్త్మని
శ్రద్ధా రతిర్భక్తిరనుక్రమిష్యతి

"విశుద్ధభక్తుల సాంగత్యమునందు భగవానుని లీలల చర్చ హృదయమునకు, కర్ణమునకు మిగుల ప్రీతికరముగను, సంతుష్టికరముగను ఉండును. అట్టి జ్ఞానాభ్యాసము ద్వారా మనుజుడు క్రమముగా ముక్తిపథమున పురోగమించును; ఆ పిదప అతడు ముక్తుడై, వాటి యెడ అతని ఆకర్షణ సుస్థిరమగును. తదనంతరమే నిజమగు భక్తి, భక్తియుక్త సేవ ఆరంభమగుచున్నవి." (భాగ. 3.25.25)

భగవంతుడు సనాతనుడు. అతడి ఉపదేశములు అతని అనుచరులు కూడ శాశ్వతులు, భగవద్గీత(4.1)లోని శ్రీకృష్ణుడు అర్జునునితో వేల సంవత్సరాల క్రితం తాను భగవద్గీతను సూర్యదేవునికి ఉపదేశించితినని తెలిపెను. అర్జునునికి భగవద్గీత ఐదువేల సంవత్సరాల క్రిందట చెప్పబడినది. అయినను, ఈ రోజు దానిని చదివినను అది నిత్యనూతనముగా అనిపిస్తున్నది. భగవద్గీత మరియు శ్రీకృష్ణుడు ఎన్నడు వృద్ధులు కారు. శ్రీకృష్ణుడు అందరికంటే పురాతనుడైనను, అన్నింటికంటే ఆది అయినను, అతడు యుక్త వయస్సుగల బాలుని వలె కనిపించును. అతడు ఇరవై సంవత్సరములకు పైబడినట్టుగా ఎన్నడు కనిపించడు. శ్రీకృష్ణుడి వాక్కులు సంపూర్ణమైనవి. అలాగే అతని స్వరూపము, గుణము మరియు లీలలన్నీ దివ్యమైనవి. అవి ఎల్లపుడు నిత్యనూతనములు. అవి అటువంటివి కానిచో, భక్తులు రోజులు తరబడి రెట్టింపు ఉత్సాహముతో వాటిని ఎలా కీర్తించగలరు? శ్రీకృష్ణుని ఎంతగా కీర్తిస్తే, అంత ఎక్కువగా కీర్తించుటలో, కీర్తించుటలో, కీర్తించుటలో ఉత్సాహము కలుగుతుంది. ఆధ్యాత్మికత అనుదానికి అర్థమేమిటంటే, భౌతిక లోకంలో మనం దేన్నినైనను ఒకటి, రెండు, మూడు లేదా నాలుగుసార్లు ఉచ్చరించినచో, అది చివరకు విసుగు పుట్టించి విరక్తి కలిగించును. కాని, ఏమైనను ఈ 'హరేకృష్ణ' మహామంత్రము రోజులో ఇరవైనాలుగు గంటలు జపించినను మనం నూతన నోత్సాహానుభూతిని పొందగలము. ఇది మనం రేడియోలో వినేటటువంటి భౌతిక శబ్ధం కాదు. ఇవి ఆధ్యాత్మిక శబ్ధ ప్రకంపనము మరియు ఆధ్యాత్మిక లోకం నుండి వచ్చుచున్నది. భౌతిక లోకంలో కూడ ఒకచోట శబ్ధమును విడుదల చేసినపుడు అది కొన్నివేల మైళ్ళదూరంలో కూడ వినిపించును. ఆధ్యాత్మిక శబ్ధం కొన్ని లక్షల మైళ్ళ దూరం నుండి విడుదల చేసినప్పటికినీ అది వినిపించును దానిని వినుటకు మన దగ్గర దానికి కావలసిన సాధనము ఉండవలెను. ఆ సాధనము 'భగవత్ ప్రేమ'. దీనిని సాధించు కొనినవారే దానిని వినగలరు.

అర్జునుడు వేదాంతి లేదా సన్న్యాసి కాదు. అంతేకాకుండ, ప్రత్యేకించి ఆధ్యాత్మిక అవగాహనను కలిగినట్టివాడు కూడకాదు. ఏమైనను, అతడు భక్తుడై నందున భగవద్గీతను శ్రవణము చేయగలిగెను. నాస్తిక విద్వాంసులు, మరియు రాజకీయవేత్తలు ఆధ్యాత్మిక శబ్ధ ప్రకంపనాలను అర్థం చేసుకోలేరు. వారు కేవలం తేనె సీసాను మాత్రమే నాకగలరు. మూర్ఖులు ధర్మంపేరిట తామేదో ఆచరిస్తున్నామని భావిస్తూ దేనినైనను తింటూ త్రాగుతుంటారు. స్వాములు, యోగులని పిలువబడే వారెందరో వారి శిష్యులతో మీ ఇష్టానుసారము నడుచుకున్నను మీరు ఆధ్యాత్మిక అభివృద్ధి సాధించగలరని చెబుతుంటారు. కాని ఇది ఎలా సాధ్యం. మానవుడు దానికొరకై పవిత్ర బ్రాహ్మణుడు కావలసి ఉంటుంది. ఇంద్రియములను, మనస్సును నిగ్రహించి సాధు సాంగత్యములో భగవంతుని గూర్చి చర్చించవలెను. ఇది కష్టసాధ్యమని పించవచ్చును. కాని సత్ సాధువయ్యేందుకు ఒక్కక్షణం చాలును. ఉత్సాహమును కలిగి గలవారు వెంటనే శ్రీకృష్ణుడికి శరణాగతి చేసుకోవలెను.

శ్రీకృష్ణుడిని ఆశ్రయించి ఇలా చెప్పవలెను : “ఓ ప్రియమైన కృష్ణా! నేను నిన్ను విస్మరించాను. నేను నిన్ను ఇప్పుడు పూర్తిగా శరణు వేడుతున్నాను. నీ ఇచ్ఛానుసారముగా నీవు నన్ను సంహరించవచ్చు లేదా సంరక్షించనైన వచ్చును.” అంతా నీ ఇష్టం. భగవంతుడు ప్రహ్లాదుడిని ఏ వరం కావాలని అడిగినప్పుడు ప్రహ్లాద మహారాజు ఇలా అన్నారు, “నా ప్రియమైన ప్రభూ! నీ కోసం కష్టపడి నందుకు నిన్ను వరం ఎందుకు నేను అడుగవలెను? నీవు అత్యంత శక్తివంతుడవు, నాకు ఏది లభించినను, అది నీ నుండియే లభించును. నేనురాక్షస కుంటుంబములో జన్మించినందున భౌతిక సుఖాలకు అలవాటు పడి ఉన్నాను. దేవతలను సైతం భయభ్రాంతులకు గురిచేసిన శక్తివంతుడైన నా తండ్రి క్షణములో సంహరించ బడుటను నేను చూసితిని. అయినను ఎందుకు నేను వరములను అర్థించ వలెను? నన్ను మీ సేవకుల సేవలో వినియోగించండి. ఇదే నేను కోరుకునేది. నాకు మరేమీ అక్కరలేదు.” ఈ విధముగా భక్తుడు దేవాదిదేవుని నుండి భౌతికమైన వాటినెన్నడును కోరడు. కేవలం భగవంతుని కీర్తించుటలోనే భక్తులు పూర్తిగా సంతృప్తిని పొందుతుంటారు. ఇదే భక్తియోగ పద్ధతి.

శ్రీకృష్ణుడు తన భక్తులను ఆనందింప చేయుటకు మరియు అసురులను సంహరించుట కొరకు అవతరిస్తాడు. శ్రీకృష్ణుడు జన్మించినప్పటి నుండి అసురులు కలరు. “శ్రీకృష్ణుడు జన్మించిన వెంటనే నాకు తెలియజేయండి, నేను వెంటనే అతడిని సంహరించెదను” అని కంసుడు తన అనుచరులతో తెలిపెను. ఈ

విధముగా శ్రీకృష్ణుడిని గురించి అతడు ఎప్పుడు తప్పుగా ఆలోచించేవాడు. ఆ విధముగానే, కేవలం శ్రీకృష్ణుని సంహరించాలనే ఉద్దేశ్యము గలవారెందరో ధార్మికులుగా పిలిపించు కొనుటను మనము చూస్తుంటాము. వారు ఏదోవిధముగా భగవద్గీత నుండి శ్రీకృష్ణుని తొలగించుటకు ప్రయత్నిస్తుంటారు. మరియు ఆ విధముగా ఎంతోమంది ధర్మాచార్యులుగా పిలువ బడుతుంటారు. అంతేకాకుండ వారు భగవద్గీతపై వ్యాఖ్యానాలను చేస్తుంటారు. కాని వారి భాష్యములో శ్రీకృష్ణుడు దేవాదిదేవుడైనందున అతడిని ఆరాధించవలెనని వారెన్నడు తెలుపరు. అంటే వారు తమకుతాము గొప్ప విద్వాంసులుగా ప్రకటించుకున్నను, వారందరు అసురులని దీనిని బట్టి విదిత మగుతుంది. వారు ఏదోవిధముగా కృష్ణభక్తిని ఆటంక పరచుటకు ప్రయత్నిస్తుంటారు. వారి పూర్తి ప్రచారము దీనినే లక్ష్యముగా కలిగి ఉంటుంది.

శ్లోకము 35

పశ్యన్తి తే మే రుచిరాణ్యంబ సన్తః
ప్రసన్నవక్త్రారుణలోచనాని
రూపాణి దివ్యాని వరప్రదాని
సాకం వాచం స్పృహణీయాం వదన్తి

ఓ జననీ! అరుణ లోచనములను గూడిన నా దరహాసవదనమునే భక్తులు ఎల్లప్పుడు గాంతురు. సమస్త వరదాయకములైన నా వివిధ దివ్యరూపములనే చూడగోరుచు వారు నాతో అనుకూలముగాను సంభాషింతురు.

భాష్యము : మాయావాదులు, నాస్తికులు ఆలయమునందలి దేవతామూర్తులను విగ్రహములని భావింతురు; కాని భక్తులెన్నడును రాతి విగ్రహములను పూజించరు. వారు ప్రత్యక్షముగా దేవాదిదేవుడినే ఆతని అర్చావతారమున ఆరాధింతురు. ప్రస్తుత స్థితి యందు మనం అర్చింపగల రూపమునే *'అర్చ'* అను పదము సూచించును. నిజమునకు ప్రస్తుత స్థితి యందు మనం భగవానుని ఆధ్యాత్మిక రూపమును చూడజాలము; ఏలయన చర్మచక్షువులు, భౌతికేంద్రియములు ఆధ్యాత్మిక రూపమును ధారణ చేయజాలవు. ఆత్మ యొక్క రూపమునే మనం చూడజాలకున్నాము. మరణ సమయమున ఆత్మ ఏ రీతిగా దేహమును వీడునో మనం గాంచజాలము. మన భౌతికేంద్రియముల దోషమిదియే. మన భౌతికేంద్రియములు చూడగలిగేలా దేవాదిదేవుడు 'అర్చావిగ్రహము' అని పిలువబడు ఒక అనుకూలమగు రూపమును

గ్రహించుచున్నాడు. అదియే కొన్నిమార్లు 'అర్చావతారము' అని పిలువబడును. అది ఆ దేవాదిదేవునికి భిన్నము కాదు. పలు అవతారములను దాల్చినట్లే ఆ దేవాదిదేవుడు మృత్తిక, దారువు, లోహము, మణిమయమైన రూపములను ధరించు చుండును.

భగవద్రూపమును తయారుచేయుటకు పెక్కు శాస్త్ర నిర్దేశములు కలవు. ఆ రూపములు భౌతికమైనవి కావు. భగవానుడు సర్వవ్యాపియైనచో ఆతడు భౌతిక మూలకము లందును ఉండును కదా! ఈ విషయమున ఎట్టి సందేహము లేదు. కాని నాస్తికులు దీనికి విరుద్ధముగా ఆలోచింతురు. అంతా భగవన్మయమేయని ప్రచారము చేసినను ఆలయమునకేగి శ్రీ విగ్రహమును గాంచినపుడు మాత్రము అది భగవానుడు కాదని వారు త్రోసిపుచ్చుదురు. వారి సిద్ధాంత ప్రకారము సమస్తము భగవన్మయమే అయినచో శ్రీవిగ్రహము మాత్రము ఎందుకు భగవానుడు కాదు? నిజమునకు భగవానుని గూర్చి వారికెట్టి అవగాహనయు లేదు. కాని భక్తుల దృష్టి మాత్రము భిన్నముగా నుండును; అది భగవత్ప్రేమతో నిండియుండును. భగవానుని వివిధ రూపములను గాంచినంతనే భక్తులు ప్రేమతో నిండిపోవుదురు; భగవానునికి మరియు మందిరమందలి భగవద్రూపమునకు నడుమ వారు భేదమును గాంచక పోవుటయే(నాస్తికులు వాని నడుమ భేదమును గాంతురు) అందులకు కారణము. మందిర మందలి శ్రీవిగ్రహపు సుందర ముఖారవిందమును భక్తులు ఆధ్యాత్మిక మైనదిగను దివ్యమైనదిగను గాంచుదురు, ఆ రూపము యొక్క దివ్యాలంకరణను భక్తులు శ్లాఘింతురు. మందిరమందలి శ్రీవిగ్రహమును ఏ విధముగా అలంకరించ వలెనో, మందిరమును ఏ విధముగా శుభ్రపరచవలెనో, శ్రీవిగ్రహమును ఏ విధముగా అర్చింపవలెనో ఉపదేశించుట గురువు యొక్క ధర్మము. విష్ణుమందిరము లందు అనుసరింపబడు విధినియమములు, పద్ధతులు పెక్కు కలవు; శ్రీవిగ్రహములు వరదాయకము లైనందున భక్తులు ఆ మందిరములకేగి వానిని గాంచుచు ఆధ్యాత్మికా నందమును బడయుదురు. వారు తమ మనోభావములను శ్రీ విగ్రహముల యెదుట వ్యక్తము కావింతురు; శ్రీవిగ్రహము సమాధానము లొసగిన సందర్భములు కూడా పెక్కు కలవు. భగవానునితోనే సంభాషించ గలుగుటకై మనుజుడు గొప్ప భక్తుడై యుండవలెను. కొన్నిమార్లు భగవానుడు స్వప్నమందు భక్తుడిని ఆదేశించును. శ్రీవిగ్రహము మరియు భక్తుని నడుమ ఒనగూడు ఈ పరస్పర భావవినిమయము నాస్తికులకు అవగతము కానట్టిది. కాని భక్తులు మాత్రము వాటిని నిజముగా ఆనందించు చుందురు.

నిజానికి ఎవరికైతే శ్రీకృష్ణుడిని దర్శించగలిగే కన్నులు గలవో, వారే అతడిని దర్శించగలరు. శ్రీ చైతన్య మహాప్రభువు జగన్నాథుని మందిరములోని శ్రీ విగ్రహమును చూచిన వెంటనే మూర్ఛిల్లిపోయెను : "ఓ ఇక్కడ నా ప్రభువు ఉన్నాడు! ఇక్కడ నా ప్రభువు ఉన్నాడు" అని అతడు పలికెను. ఆ విధముగా దర్శించుకోగల స్థితికి రావాలనుకుంటే మానవుడు *సంతః* కావలెను. మరియు సంస్కృతి ద్వారా మనం *సంతః* కాగలము. మనం కనుక శ్రీకృష్ణుని పై ప్రేమను పెంచుకో గలిగినప్పుడు, అతడిని దర్శించుకొనిన వెంటనే : "ఓ ఇక్కడ నా భగవంతుడు ఉన్నాడు" అని చెప్పుచూ మనం స్పృహ కోల్పోవుదుము. ఏమైనను, మరియు శ్రీకృష్ణుని అంగీకరించుటను తిరస్కరించుటకు ప్రయత్నించుచు వారు విశ్వాసము లేక కేవలం : "ఓ ఇది ప్రతిమ, ఇవి కేవలం రాతి ముక్క" అని అంటారు.

మనం శ్రీకృష్ణుడిని దర్శించుటకు మరియు అతడితో సంభాషించుటకు ఉత్సాహమును కలిగి ఉండవలెను. నిజానికి, మనం అతడితో మాట్లాడుటకు ఆసక్తి కలిగి ఉన్నామా లేదా అని అతడు చూస్తుంటాడు. భగవద్గీత(10.10)లో శ్రీకృష్ణుడు ఈ విధముగా చెప్పుచున్నాడు :

తేషాం సతతయుక్తానాం భజతాం ప్రీతిపూర్వకమ్
దదామి బుద్ధియోగం తం యేన మాముపయాన్తి తే

"నన్ను ప్రేమతో సేవించుట యందు నిరంతరాసక్తులై యుండువారికి, నన్ను చేరుటకు ఉపయోగపడు బుద్ధిని నేనొసంగుదును."

ఎవరైనను గొప్పవ్యక్తితో మాట్లాడ దలచినప్పుడు ముందుగా అందుకు కావలసిన అర్హతలను కలిగి ఉండవలెను. అధ్యక్షునితో లేదా పెద్దహోదా కలిగిన అధికారులతో మాట్లాడ దలచినచో సులభముగా వారితో మనము మాట్లాడలేము. అందుకు కావలసిన నియమపద్ధతిని పాటించవలసి వచ్చును. శ్రీకృష్ణుడు మనతో మాట్లాడుటకు సిద్ధంగా ఉన్నాడు. కాబట్టి ఈ ఉద్దేశ్యము కొరకు అతడు 'అర్చామూర్తి' రూపంలో మనకు దర్శనమిచ్చుటకు అవతరించెను. కాబట్టి మనం అతనితో మాట్లాడుట కొరకు కావలసిన అర్హతను సంపాదించుకోవలెను. మాయావాదులు భగవంతుడికి కళ్ళు లేవు, కాళ్ళు లేవు, చేతులు లేవు, చెవులు లేవని శ్రీకృష్ణుడిని తిరస్కరించుటకు ఉత్సాహమును కలిగిన అభక్తులు చెబుతుంటారు. పరోక్షముగా భగవంతుడు గ్రుడ్డివాడు మరియు చెవిటివాడని, అతడు దీనిని లేదా దానిని చేయలేరని చెబుతూ భగవంతుడిని కించపరుస్తుంటారు. నిందించుట అనగా ఇదే.

భగవంతుడు అటువంటి అర్థంలేని వాటిని వినాలనుకోడు. కాబట్టి ఈ శ్లోకంలో: *"సాకం వాచం స్పృహణీయాం వదన్తి"* అని చెప్పబడినది. శ్రీకృష్ణుడు గ్రుడ్డివాడు అతడికి కళ్ళులేవు, చేతులు లేవు ఇంకా ఏమి లేవు అని తెలుపుటమనగా పరోక్షముగా శ్రీకృష్ణుడికి ఉనికి లేదని చెబుతున్నట్లు అర్థం. ఇది ఖచ్చితంగా శ్రీకృష్ణునితో మాట్లాడుటకు కావలసిన అనుకూల పద్ధతి కాదు. శ్రీకృష్ణుని గురించి చెప్పదలచినచో, మనం వైదిక సాహిత్యములను తప్పక అభ్యసించవలెను. అప్పుడే మనము శ్రీకృష్ణుని ఎలా ఆరాధించవలెనో తెలుసుకోగలము.

'బ్రహ్మ సంహిత' (5.29)లో ఇలా చెప్పబడినది : "శ్రీకృష్ణుడు మురళినీ వాయిస్తుండును. అతని కన్నులు తామర పుష్పరేకుల వలే అందముగా నున్నవి. అతడు తలలో నెమలి పింఛమును ధరించెను. అతని స్వరూపము ముగ్ధ మనోహరముగా ఉంటుంది." "కేవలం భగవంతుని ఏదోఒక స్వరూపమును ఊహించుకొనండి" అని మాయావాదులు చెబుతుంటారు. కాని భగవంతుని దివ్య రూపమును ఊహించుకోలేము. ఎందుకంటే భగవంతుని రూపము ఊహకల్పన కాదు అది వాస్తవమైనది. ఈ వాస్తవ సమాచారమును వేదముల నుండి మాత్రమే మనము పొందగలము. శ్రీకృష్ణుడు ఈ భూమిపై అవతరించినప్పుడు, తన రూపమును మరియు లీలలను ప్రదర్శించెను. ఇవన్నీ భౌతికమైనవి కావు, అవి దివ్యమైనవి. శ్రీకృష్ణుని దేహము 'సచ్చిదానంద విగ్రహము'. ఇది భౌతికమైన వాటితో ఎటువంటి సంబంధమును కలిగి లేదు. నిరంతరము తనను దర్శించుటకు ఉత్సాహమును కలిగి ఉన్న భక్తులపై కృపను వర్షించుటకై శ్రీకృష్ణుడు అవతరించును. భక్తులకు ఆనందమును కలిగించుట అతని మొదటి విధి, భక్తులకు నిరంతరము బాధలకు గురిచేయు అసురులను సంహరించుట కొరకు అవతరించుట అతని రెండవ విధి. భక్తులను ఇబ్బందులకు గురిచేయుటయే రాక్షసుల ప్రవృత్తి. పాశ్చాత్య దేశములో భగవంతుని చైతన్యమును ప్రచారము చేసినందుకు ఏసుక్రీస్తుని శిలువ వేశారు. ఆ విధముగానే, హిరణ్యకశిపుడు ఐదు సంవత్సరాల బాలుడైన ప్రహ్లాద మహారాజును సంహరించా లనుకున్నాడు. ఎందుకనగా, అతని కుమారుడు శ్రీకృష్ణుని గురించి మాట్లాడేవాడు. పూతన, అఘాసుర, బకాసుర మరియు కంసుడు వంటి గొప్ప రాక్షసు లెందరో స్వయంగా శ్రీకృష్ణుడిని చంపుటకొరకు ప్రయత్నించిరి. అయినను శ్రీకృష్ణుడు వారందరిని తన అనంతమైన శక్తితో నశింపజేసెను.

నిజానికి, ఈ భౌతిక లోకంలోని అసురులందరు కొద్దోగొప్పో నాస్తికులే. ఎవరైనను ప్రచారము చేయదలచినచో అసురులను సహించుట మెలాగో

నేర్చుకోవలెను. అంతేకాదు, అసురులు కూడ భక్తులుగా మారునట్లుగా ప్రచారము చేయవలెను. ఎల్లప్పుడు శ్రీకృష్ణుని సంతృప్తిపరిచే విధముగా మనము మాట్లాడ వలెను. అప్పుడే మనం నిజమైన ప్రయోజనమును పొందగలము. శ్రీకృష్ణుడి మరో పేరు 'ఉత్తమశ్లోక' అనగా అతడు ఉత్తమమైన ప్రత్యేక శ్లోకములతో కీర్తించ బడునని తెలుపుతుంది. మనకు కావలసిన శ్లోకములను ఇచ్ఛానుసారముగా ప్రయోగించాలనీ చెప్పబడలేదు. వైదిక శాస్త్రములలో, బైబిల్, ఖురాన్‌లో అనేక ప్రార్థనలు కలవు. క్రైస్తవులు మరియు ముస్లిములు విగ్రహాలను పూజించకున్నను, వారు భగవంతునికి ప్రార్థనలు చేస్తుంటారు. అది కూడ భక్తియే. *'అర్చనం, వందనం.'*

భగవంతుడిని ఆరాధించుటకు తొమ్మిది రకాల పద్ధతులు కలవు. కాబట్టి మనం అందులోని ఒకటిగాని లేదా అన్నింటిని గాని అంగీకరించ వచ్చును. ఎన్నుకోబడిన ఉత్తమ శ్లోకాలతో మనము శ్రీకృష్ణుని శరణు వేడవలెను. అంతేకాని అతడికి అసంతృప్తిని కలిగించు శ్లోకములను మనము వాడరాదు. భగవంతుడు నిరాకారుడని అతడికి కళ్ళు లేవు, తల లేదు మరేదో అని మనము పలుకరాదు. నిజానికి, శ్రీకృష్ణుడికి చేతులు లేవు అని వేదాలలో తెలుప బడినప్పటికినీ అతడు మన నివేదనల నన్నింటిని స్వీకరించును. అంటే అతడు భౌతికమైన చేతులను కలిగి లేడని దాని అర్థం. నిజానికి, అతడు చేతులను కలిగి లేనిచో, కొన్ని వేల మైళ్ళదూరంలో మనం సమర్పించే దానిని అతడు ఎలా అంగీకరించగలడు? భగవంతుడు చేతులను కలిగిలేడని వేదాలు చెబుతున్నదానికి అర్థమేమిటనగా, కొన్ని కోటానుకోట్ల మైళ్ళదూరంలో గోలోక వృందావనము నున్నప్పటికినీ శ్రీకృష్ణుడు మనం సమర్పించు దానినంతటిని అంగీకరించును, కాబట్టి అతడు భౌతికమైన చేతులను కలిగిలేడనుటకు అర్థమిదియే. అతని చేతులు 'సత్, చిత్, అనందములు'. మనం శ్రీకృష్ణుని స్వరూపము, గుణములు లీలలన్నింటినీ ఈ విధముగా అర్థము చేసుకోగలిగితే భగవద్ధామానికి తిరిగి చేరుటకు అర్హుల మగుదుము.

శ్లోకము 36

తైర్దర్శనీయావయవైరుదార –
విలాసహాసేక్షితవామసూక్తైః
హృతాత్మనో హృతప్రాణాంశ్చ భక్తి –
రనిచ్ఛతో మే గతిమణ్వీం ప్రయుంక్తే

దరహాసపూర్ణములు, ఆకర్షణీయములునైన భగవానుని దివ్య మనోహర స్వరూపములను గాంచుచు, అతని పరమప్రియమగు వాక్కులను వినుచు విశుద్ధభక్తుడు దాదాపుగా ఇతర చేతనమును మరచును. సమస్త ఇతర కార్యకలాపముల నుండి తన ఇంద్రియములు విడివడగా, అతడు భక్తియుక్త సేవ యందు సంలగ్నమగును. ఆ విధముగా అతడు కోరనప్పటికినీ ప్రత్యేకమగు యత్నము లేకనే ముక్తి అతనికి లభ్యమగును.

భాష్యము : ప్రథమశ్రేణి భక్తులు, ద్వితీయశ్రేణి భక్తులు, తృతీయశ్రేణి భక్తులు అనుచు భక్తులు మూడు తరగతులుగా నుందురు. వీరిలో తృతీయశ్రేణి భక్తులు సైతము ముక్తాత్ములే. తగినంత జ్ఞానము లేనప్పటికినీ మందిరమందలి శ్రీవిగ్రహపు సుందరమగు అలంకరణను గాంచుట ద్వారా భక్తుడు భగవానుని గూర్చిన ఆలోచనలో మునిగిపోయి అన్యచేతనమును మరచునని ఈ శ్లోకమునందు వివరింప బడినది. అనగా కేవలము కృష్ణచైతన్యములో స్థిరముగా నెలకొనుట ద్వారా (ఇంద్రియములను కృష్ణసేవ యందు నెలకొల్పుట ద్వారా) మనుజుడు తెలియ కుండగనే ముక్తుడు కాగలడు. ఈ విషయము భగవద్గీత(14.26) యందును ధ్రువపరుప బడినది. శాస్త్రమునందు నిర్దేశింపబడిన రీతి విశుద్ధ భక్తియుక్త సేవను నిర్వహించుట ద్వారా మనుజుడు బ్రహ్మముతో సమానమగును. ఈ విషయమే *"బ్రహ్మభూయాయ కల్పతే"* అని భగవద్గీత యందు తెలుపబడినది. దీని భావమేమనగా జీవుడు తన సహజస్థితి యందు బ్రహ్మమై యున్నాడు. అతడు పరబ్రహ్మపు అంశ అగుటయే అందులకు కారణము. కాని తాను భగవానుని నిత్యసేవకుడ ననెడి సహజ స్వభావమును విస్మరించినందున అతడు మాయచే విహ్వాలుడై బంధితుడగును. జీవుని తన సహజస్థితిని విస్మరించుటనే మాయ అనబడును. లేనిచో అతడు నిత్యముగా బ్రహ్మమే అయియున్నాడు.

మనుజుడు తన సహజస్థితి నెరుగుటను నేర్చినప్పుడు తాను భగవానుని సేవకుడనని యెరుగగలుగును. 'బ్రహ్మము' అనునది ఆత్మానుభవస్థితికి సంబంధించి నట్టిది. పరమ సత్యము జ్ఞానమున పురోగతి నొందనప్పటికిని భక్తితో వందనముల నర్పించుచు, భగవానుని తలంచుచు, మందిరమందలి శ్రీ విగ్రహమును గాంచుచు మరియు ఫలపుష్పాదులను సమర్పించుచు తృతీయశ్రేణి భక్తుడు సైతము తెలియ కుండగనే ముక్తుడు కాగలడు. '*శ్రద్ధయాన్వితాః*' అనగా భక్తులు పరమభక్తితో శ్రీ విగ్రహములకు మనస్సులను, పూజాసామగ్రిని అర్పింతురని భావము.

శ్రీరాధాకృష్ణులు, శ్రీ సీతారాములు, శ్రీ లక్ష్మీనారాయణుల శ్రీమూర్తులు భక్తులకు పరమ ఆకర్షణీయముగా నుండును. బహు సుందరముగా అలంకరింపబడిన ఆ శ్రీమూర్తులను గాంచినపుడు వారు భగవద్భావనలోనే పూర్తిగా మునిగిపోవుదురు. అదియే ముక్తస్థితి. అనగా తృతీయశ్రేణి భక్తుడు సైతము దివ్యస్థితి యందున్న వాడేనని ఇచ్చట ధ్రువపరుపబడినది; మానసిక కల్పనము లేదా ఇతర విధానముల ద్వారా ముక్తికై ప్రయత్నించువారి కన్నను అతడు ఉన్నతుడు. శుకదేవ గోస్వామి మరియు సనకాదుల వంటి గొప్ప నిరాకారవాదులు సైతము శ్రీమూర్తుల సౌందర్యముచే ఆకర్షితులై భక్తులుగా మారిరి.

ఇచ్చట 'విలాస' అను పదము మిగుల ప్రధానమైనది. అది భగవల్లీలలను సూచించును. మందిరమును దర్శించినప్పుడు సుందరముగా అలంకరింపబడిన శ్రీవిగ్రహమును గాంచుటయే గాక శ్రీమద్భాగవతము, భగవద్గీత లేదా మరేదైన వాఙ్మయము నందలి ప్రవచనమును కూడ వినవలెనని మందిర అర్చావిధానమున తెలుపబడినది. వృందావన మందలి ప్రతి మందిరమందును శాస్త్రప్రవచనము లేదా పారాయణము ఉండును. శాస్త్రజ్ఞానము లేనట్టివారు లేదా శ్రీమద్భాగవతము, భగవద్గీతలను పఠించుటకు సమయము లేనట్టి తృతీయశ్రేణి భక్తులు సైతము తద్ద్వారా కృష్ణలీలలను వినుటకు అవకాశమును పొందుదురు. ఆ విధముగా వారి మనస్సులు సదా భగవద్భావన(భగవానుని రూపము, లీలలు, దివ్యస్వభావము) యందే సంలగ్నమై యుండగలవు. అట్టి కృష్ణచైతన్య స్థితియే ముక్తస్థితి. కనుకనే శ్రీ చైతన్య మహాప్రభువు ఐదు ప్రధాన పద్ధతులను ఉపదేశించిరి. అవియే 1. "హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే / హరే రామ హరే రామ రామ రామ హరే హరే" యనుచు హరినామ సంకీర్తనమును చేయుట, 2. భక్తులతో సాంగత్యమును చేస్తూ సాధ్యమైనంతగా వారిని సేవించుట, 3. శ్రీమద్భాగవత శ్రవణము, 4. సుందరముగా అలంకరింపబడిన మందిరమును, శ్రీ విగ్రహమును గాంచుట, వీలైనచో 5. మథుర లేదా వృందావనము వంటి ప్రదేశములలో నివసించుట అనునవి. ఈ ఐదు అంశములు అత్యున్నతమైన పరిపూర్ణత్వ స్థితిని బడయుటలో భక్తునకు తోడ్పడగలవు. ఈ విషయము భగవద్గీత యందును, ఇచ్చట శ్రీమద్భాగవతము నందును నిర్ధారింపబడినది. తృతీయశ్రేణి భక్తులు సైతము తెలియకుండగనే ముక్తిని బడయుదురనెడి విషయము సమస్త వేదవాఙ్మయము నందు అంగీకరింప బడినది.

భగవంతుని 'అర్చావిగ్రహ'మును పాదపద్మముల నుండి దర్శించుటను

ప్రారంభించ వలెను. అతడి చిరునవ్వులను చిందించే ముఖమును వెంటనే దర్శించమని కాదు. మనం ముందుగా శ్రీకృష్ణుని పాదపద్మములను దర్శించుటకు ప్రయత్నించవలెను. మరియు ఈ విధముగా అభ్యసించిన పిదప మనము అతని తొడలను, అతని నడుము మరియు అతని వక్షఃస్థలమును దర్శించవలెను. అటుపిమ్మట మనము అతని సుందర మందస్మిత వదనమును దర్శించవలెను. ఈ విధముగా మనం శ్రీకృష్ణుని రూపమును ధ్యానించవలెను. ఈ విధముగా అతడి చిరునవ్వులు చిందించే ముఖమును, అతని వేణువును, అతని చేతులు, అతని వస్త్రములను, అతని సహచరిణియైన శ్రీమతి రాధారాణిని మరియు అతడి సమీపములోని గోపికలను ధ్యానించుట ద్వారా శ్రీకృష్ణునితో సాంగత్యము చేయగలము. ఈ విధముగా మనం భగవంతుడిని దర్శించుటను అభ్యసించవలెను. అందుకే భగవంతుడు మన ఎదుట 'అర్చవిగ్రహ' రూపములో అవతరించెను.

'కనిష్టాధికారి', 'మధ్యమాధికారి' మరియు 'ఉత్తమాధికారి' అనే మూడు రకాల భక్తులు కలరు. 'ఉత్తమాధికారి' అత్యున్నత స్థితికి చెందినవాడు. 'మధ్యమాధికారి' మధ్యమ స్థితికి చెందినవాడు. మరియు 'కనిష్ఠాధికారి' ప్రారంభ స్థితికి చెందినవాడు. ప్రారంభికులు ప్రతిరోజు భగవంతుని అర్చావిగ్రహమును ధ్యానించ వలెనని ఆదేశించడమైనది. అతడు భగవంతుని పాదపద్మములను ధ్యానించుటను అభ్యసించిన తరువాత అతని దృష్టిని శ్రీకృష్ణుని ముఖారవిందము వైపునకు మరల్చ వలెను. ప్రారంభిక భక్తుడు భగవద్గీత మరియు శ్రీమద్భాగవతమును ప్రతిరోజు అధ్యయనము చేయవలెను. కేవలం దర్శనము కోసం ప్రయత్నిస్తూ, శ్రవణం చేయకపోయినచో అతడు శాశ్వతమైన ఫలితములను పొందలేడు. కొన్ని మందిరాలలో విగ్రహాలుంటాయి. కాని కృష్ణ కథ ఉండదు. జనులు కొంతకాలము అక్కడికి వెడతారు. తర్వాత అసక్తిని కోల్పోతారు. అర్చావిగ్రహములను పూజింప వలెను, మరియు దీనినే 'పాంచరాత్రికీ విధి' అంటారు. అలాగే 'భాగవత విధి' అనగా శ్రీమద్భాగవతము మరియు శ్రీమద్భగవద్గీతను శ్రవణము చేయవలెను. కాబట్టి రెండు కార్యక్రమములు ఉండవలెను. 'పాంచరాత్రికీ విధి' మరియు 'భాగవత విధి' అను ఈ రెండు ఒకదానితో మరొకటి కలిసి యుండును. ఈ రెండు పద్ధతులను సాధన చేయుట ద్వారా కనిష్ఠ భక్తుడు మధ్యమ స్థితికి చేరుకొనును.

ఆధ్యాత్మికాచార్యుడు అత్యున్నత స్థితికి చెందినవాడై ఉండవలెను. అయినను ప్రచార నిమిత్తము అతడు మధ్యమస్థితికి దిగివచ్చును. 'ఉత్తమాధికారి' అనగా అత్యున్నత స్థితికి చెందిన భక్తుడు. అతడు భక్తుల మరియు అభక్తుల మధ్య భేదమును

చూడదు. అతడు తననుతప్ప ఇతరులందరినీ భక్తులుగా పరిగణించును. నిజమైన పురోభివృద్ధిని సాధించిన భక్తుడు తనను కాకుండ మిగితా వారందరిని భక్తులుగా చూచును. 'కనిష్ఠ' భక్తుడు కేవలం ఆర్చావిగ్రహము పట్లనే శ్రద్ధను కలిగి ఉండును. మరియు ప్రారంభదశలో ఇది ఎంతో అవసరము :

అర్చయామేవ హరయే పూజాం యః శ్రద్ధయేహతే
న తద్భక్తేషు చాన్యేషు స భక్తః ప్రాకృతః స్మృతః

"ఆలయము నందు శ్రద్ధగా శ్రీవిగ్రహారాధనలో నెలకొనినను ఇతర భక్తుల యెడ లేదా జన సామాన్యము పట్ల చక్కగా వ్యవహరించని భక్తుడు ప్రాకృత భక్తుడని పిలువబడును. అట్టివాడు అధమస్థితిలో ఉన్నవానిగా పరిగణించబడును." (భాగ. 11.2.47) శాస్త్రములో వివరించినట్లుగా, విద్యుక్త ధర్మము ననుసరించి, అర్చ విగ్రహమును గౌరవించవలెను. కాని ఎవరైన పురోభివృద్ధిని సాధించినప్పుడు అతడు ఇతరులతో తమ సంబంధములను పెంచుకొనును. 'మధ్యమాధికారి' స్థితిని పొందినప్పుడు, అతని దృక్పథము ఇలా వివరించబడినది :

ఈశ్వరే తదధీనేషు బాలిశేషు ద్విషత్సు చ
ప్రేమమైత్రీకృపోపేక్షా యః కరోతి స మధ్యమః

"'మధ్యమాధికారి'యగు భక్తుడు భగవంతుని ప్రేమించును, భగవద్భక్తు లందరికీ మిత్రుడై మెలగును, అమాయకులగు అజ్ఞానజనుల యెడ కరుణను జూపును, భగవద్విరోధులను ఉపేక్షించును." (భాగ. 11.2.46)

'మధ్యమాధికారి' కేవలం అర్చవిగ్రహము పట్లనే శ్రద్ధకలిగి ఉండకుండ, అతడు భక్తులు మరియు అభక్తుల మధ్యగల భేదమును గుర్తించవలెను. అంతేకాకుండ, ఈ వ్యక్తి అమాయకుడా లేదా అని కూడ అతడు అర్థం చేసుకోవలెను. అమాయకుడికి ఏమి చేయ వలెననునది తెలియదు, అంతేకాకుండ వారికి భగవంతుడి గురించి కూడ ఏమీ తెలియదు. నిజానికి వారు అపరాధులు కాదు. కాని భగవంతుడి మరియు అతని భక్తుల గురించి వినగానే ఈర్ష్యను పెంచుకునే అపరాధులనే వారు కొందరు కలరు.

'మధ్యమాధికారి'కి శ్రీకృష్ణుడు భగవంతుడు అని తెలుసును : "*కృష్ణస్తు భగవాన్ స్వయమ్.*" అతడు తన ప్రేమను శ్రీకృష్ణుని పట్ల పెంచుకోవాలని కోరుకుంటాడు. అలాగే అతడు ప్రతిక్షణమును కృష్ణచైతన్యములో వినియోగించును.

జీవితములోని విలువైన సమయమును వృథా చేయకుండ జాగ్రత్త వహించును. ఇది 'మధ్యమాధికారి'కి గల మొదటి అర్హత. జీవించుటకు కొద్దికాలము మాత్రమే కేటాయించబడినది. ఎప్పుడు మరణిస్తామనే విషయం మనకు తెలియదు. దానికొరకు ఖచ్చితమైన హామి ఏమి లేదు. మూర్ఖపు జనులు తాము శాశ్వతంగా జీవిస్తామని భావిస్తారు. జీవితమనేది అశాశ్వతము. కాబట్టి భక్తుడు ప్రతిక్షణమును కృష్ణచైతన్యములో పురోభివృద్ధిని సాధించుటకు ఉపయోగిస్తాడు.

'హరే కృష్ణ' మహామంత్ర జపములో కూడ ప్రత్యేకమైన రుచిని 'మధ్యమాధికారి' కలిగి ఉంటాడు. అతడు శ్రీకృష్ణుడు నివసించిన వృందావనము, మథుర మరియు ద్వారకాలాంటి ప్రదేశములలో నివసించుటకు ఎంతో ఉత్సాహమును చూపించును. శ్రీకృష్ణుడు భగవంతుడైనందున అతడు ప్రతిచోట తన నివాసమును కలిగి ఉంటాడనేది సత్యము. అతడు ప్రతి అణువులోను నెలకొని ఉండును. *"అండాంతరస్థపరమాణుచయాంతరస్థమ్."* ఏమైనను, అతడు వృందావనము, మథుర మరియు ద్వారక వంటి ప్రత్యేక ప్రదేశాలలో నివాసమును కలిగి ఉంటాడు. కాబట్టి భక్తుడు అలాంటి ప్రదేశములలో నివసించుటకు ఉత్సాహమును కనపరుస్తాడు.

భగవంతుడి పట్ల తమ ప్రేమను వృద్ధి చేసుకోవడమనేది క్రమమైన ప్రక్రియ. మరియు అదే మొదట కావలిసినది. విశ్వాసము లేకుండ కృష్ణచైతన్యములో అభివృద్ధి సాధించుటమనే ప్రశ్నే లేదు. భగవద్గీతను యథాతథముగా అర్థం చేసుకొనిన తర్వాత విశ్వాసమనేది ఉదయించును. భగవద్గీతను చదువకుండ శ్రీకృష్ణునిలో విశ్వాసము ఏర్పడుటమనే ప్రశ్నే ఏర్పడదు. శ్రీకృష్ణుని ఉపదేశములపై విశ్వాసముంచ వలెను. "సమస్త ధర్మములను విడిచి నన్నే శరణు వేడుము. పూర్తి రక్షణను నేను కలిగింతును" అని ప్రత్యేకించి శ్రీకృష్ణుడు చెబుతున్నాడు. సాహిత్యము కొరకు భగవద్గీతను చదివి దానిని ప్రక్కన పెట్టినచో అది విశ్వాసమని పించుకోదు. శ్రీల కృష్ణదాస కవిరాజ గోస్వామి విశ్వాసమును గురించి ఇలా వివరిస్తున్నాడు :

'శ్రద్ధ' శబ్దె – విశ్వాస్ కహే సుదృఢ నిశ్చయ్
కృష్ణేభక్తి కొయిలే సర్వకర్మ కృత హోయ్

"శ్రీకృష్ణుడికి ప్రేమపూరితమైన భక్తియుక్త సేవను చేయుట వలన మనము ఇతర కర్మలన్నింటిని సహజముగానే నేరవేర్చిన వారమగుదుము. ఈ భక్తియుక్త సేవకు దృఢమైన, స్థిరమైన విశ్వాసము అనుకూలమైనది. దీనినే శ్రద్ధ అంటారు." (శ్రీ

చైతన్య చరితామృతము, మధ్యలీల 22.62)

శ్రీకృష్ణుడు తాను కేవలం పురుషుడే కాకుండ, దేవాదిదేవుడనని, తనకంటే అధికులు లేరని కూడ అతడు భగవద్గీతలో తెలుపుచున్నాడు. ఎవరికైనను, ఈ ఉపదేశములపై విశ్వాసము కలిగినచో, వారు విశ్వాసము గలవారని అర్థము. నిరాకారవాదులు భగవద్గీతను చదువు చున్నప్పటికినీ శ్రీకృష్ణుడిని వారు సాకార స్వరూపునిగా అంగీకరించరు. నిరాకారవాదులు తనను చేరుటకు ఎన్నో కష్టములను ఎదుర్కొందురని శ్రీకృష్ణుడు భగవద్గీతలోని పన్నెండవ అధ్యాయములో తెలుపు చున్నాడు. వారు తనను చేరుకుందురు, కాని దానికోసం వారికెంతో సమయం పడుతుంది. ఎందుకనగా, నిరాకార సాక్షాత్కారమనేది పరమసత్యపు పాక్షిక సాక్షాత్కారము. శ్రీకృష్ణుడు చెబుతున్నట్లుగా :

క్లేశోఽ ధికతరస్తేషామవ్యక్తాసక్తచేతసామ్
అవ్యక్తా హి గతిర్దుఃఖం దేహవద్భిరవాప్యతే

"అగోచరమైన నిరాకార బ్రహ్మమందు ఆసక్తితో గూడిన మనస్సు గలవారికి అభ్యుదయము చాలా క్లేశకరము. ఆ విధానమున ప్రగతి నొందుట బద్ధజీవుల కెప్పుడును కష్టతరమే." (భ.గీ. 12.5)

నిరాకార బ్రహ్మన్‌ని అర్థం చేసుకొనుటమనేది సూర్యకాంతిని అర్థము చేసుకొనుట వంటిదని మేము ఎన్నోసార్లు ఉదాహరించి తెలుపుటను మీరు గమనించ వచ్చును. గది కిటికి నుండి సూర్యకాంతి ప్రవేశించుటను మనం చూడవచ్చును, అంటే దాని అర్థం సూర్యుని గూర్చి పూర్తిగా తెలుసునని కాదు. పరమ సత్యం యొక్క నిరాకార సాక్షాత్కారము కూడ అలాంటిదే, సూర్యకాంతి అనేది నిరాకారము(బ్రహ్మన్). సూర్యుడు పరమాత్మ వంటివాడు. మరియు సూర్యగోళంలో నివసించే సూర్యుడు పురుషుడు(భగవాన్). మనం సూర్యకాంతి, సూర్యుడు, సూర్యదేవుడని మూడురకాలుగా సూర్యభగవానుడిని అర్థం చేసుకొనినట్లుగా, పరమ సత్యమును 'బ్రహ్మన్', 'పరమాత్మ' మరియు 'భగవాన్' అనే మూడు స్థితులను అర్థం చేసుకోవచ్చును.

సూర్యుడు కేవలం అగ్నిగోళమని మరేదోకాదని నిరాకారవాదులు పేర్కొంటుంటారు. కాని భగవద్గీత(4.1) లో శ్రీకృష్ణుడు ప్రత్యేకించి తాను భగవద్గీతను సూర్యభగవానుడైన వివస్వంతునకు బోధించెనని ప్రకటించెను. సూర్యుడు ఎలా పురుషుడని మనం ఊహించలేము. సూర్యుడు పెద్ద అగ్నిగోళం,

మరియు అక్కడ నివసించుట ఎవరికి సాధ్యపడదని మనం భావిస్తుంటాము. కాని ఈ రకమైన ఆలోచన దూరదృష్టి లేనటువంటిది. అగ్నిలో మనం నివసించ లేనందున, ఎవరూ అక్కడ నివసించ లేరనుటలో అర్థం లేదు. జలములో మనము నివసించలేక పోయినను అక్కడ జలరాసులు జీవించును. ఈ లోకములో మనము జీవిస్తున్నాము, మరియు ఇది మట్టితో తయారు చేయబడినది. అంతేకాకుండ, ఇక్కడ నివసించుటకు వీలుగా మన శరీరాలు దాదాపు మట్టితోనే తయారు చేయబడినవి. శరీరములు ఆ యా వాతావరణములలో నివసించుటకు వీలుగా తయారు చేయబడినవి. ఆ విధముగా సూర్యదేవుడు అగ్నిలో నివసించగలిగేలా శరీరమును కలిగి ఉన్నాడు.

శ్రీకృష్ణుడు 'సచ్చిదానంద విగ్రహము' అనగా శాశ్వతము, జ్ఞానము మరియు ఆనందదాయకమైన స్వరూపము గల సాకారపురుషుడు. నిరాకార సాక్షాత్కారమనేది 'సత్' లక్షణము యొక్క సాక్షాత్కారము. శ్రీకృష్ణుడిని పరిపూర్ణముగా అర్థం చేసుకొనుట, అనగా అతని లక్షణములన్నింటిని అర్థం చేసుకొనుటయే. భగవానునిలో 'ఆనంద' లక్షణమును చూడవచ్చును. శ్రీకృష్ణుడు వేణుగానమును చేయును. అతడు అతని ఆనందశక్తియైన 'హ్లాదినిశక్తి' శ్రీమతి రాధారాణితో కలిసి ఉండును. శ్రీకృష్ణుని శక్తులన్నింటిలో 'హ్లాదినిశక్తి' అనేది ఆనందమును ప్రసాదించును. శ్రీకృష్ణుడు తనకుతాను సంపూర్ణుడైనను, ఆనందించాలను కొనినప్పుడు అతడు విస్తరించును. ఆ విస్తరణయే అతని ఆనంద శక్తియైన శ్రీమతి రాధారాణి. గోపికలు శ్రీమతి రాధారాణి విస్తరణలు. శ్రీకృష్ణుని వివిధ అవతారములు దివ్యానందమును ఆస్వాదించుట కొరకు అవతరించును*(ఆనంద చిన్మయరస).* ఆ విధముగా, బ్రహ్మన్ సాక్షాత్కారమనేది *'సత్'* అనే భాగము యొక్క సాక్షాత్కారము. పరమాత్మ సాక్షాత్కారము అనేది *'చిత్'* భాగము యొక్క సాక్షాత్కారము. మరియు భగవాన్ సాక్షాత్కార మనునది *'ఆనంద'* విభాగము యొక్క సాక్షాత్కారము. వేదాంత సూత్రములలో భగవంతుడిని *"ఆనందమయోऽ భ్యాసాత్"* అని పేర్కొనెను. శ్రీకృష్ణుని లీలలు ప్రత్యేకించి అతడి స్వధామమైన వృందావనములో నిరంతరము దివ్యానందముతో కూడుకున్నవి. వృందావనములో శ్రీకృష్ణుడు అతని గోపబాలుర మిత్రులతో ఆడుకొనును, మరియు గోపికలతో నృత్యముచేయును. వృందావనములో శ్రీకృష్ణుడు యశోదమాత యొక్క వెన్నను దొంగిలించును. అతడి లీలలన్నీ దివ్యానందముతో కూడుకున్నవి.

భక్తియుక్త సేవా విధులను పాటించుట ద్వారా మనము ఆనంధానుభూతిని

పొందగలము. శ్రీకృష్ణుడు ఎలా చిరునవ్వులను చిందిస్తున్నాడో, వేణువును వాయిస్తూ, శ్రీమతి రాధారాణి సహచర్యమును ఎలా ఆనందిస్తున్నాడో మనం అర్చావిగ్రహమును దర్శించునప్పుడు అనుభూతి చెందవచ్చును. మనం శ్రీకృష్ణుని గురించి కూడ శ్రవణము చేయవలెను. మనం సహజముగానే గొప్ప భక్తులమయ్యేలా ఈ రెండు పద్ధతులు ఉపయోగపడును. "*అనిచ్ఛతో మే గతిమన్వీం ప్రయుంక్తే.*" వాస్తవానికి ఇది శాస్త్రీయమైన పద్ధతి. ఇది ఊహాకల్పితము కాదు. జనులు ఇది ప్రతిమపూజ లేదా కల్పనలని భావిస్తుంటారు. కాని భగవత్ చైతన్యమును పెంపొందించు ఈ పద్ధతి శాస్త్రము లన్నింటిలోను ఉపదేశించబడినది. ఇదే నిజమైన శాస్త్రము.

శ్రీభగవానువాచ
జ్ఞానం పరమగుహ్యం మే యద్విజ్ఞానసమన్వితమ్
సరహస్యం తదంగం చ గృహాణ గదితం మయా

"భగవానుడు ఇట్లు పలికెను : శాస్త్రములందు వర్ణింపబడిన జ్ఞానము పరమ రహస్యమైనది. భక్తియోగపు సంగమమునందే దానిని అనుభూత మొనర్చు కొనవలెను. ఆ విధానమునకు అవసరమైన అంశములను నేను వివరింతును; సావధానుడవై దానిని గ్రహింపుము."(భాగ. 2.9.31)

భగవద్గీతలో శ్రీకృష్ణుడు అత్యంత గుహ్యమైన జ్ఞానమును అర్జునునకు ఉపదేశించెనని చెబుతున్నాడు. ఎందుకనగా, అర్జునుడు అతని ప్రియభక్తుడు. ఈ రహస్యమైన జ్ఞానము : "*సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజః*" – "కేవలం నన్ను శరణువేడుము."(భ.గీ. 18.66) బ్రహ్మానుభూతి అనేది తప్పకుండా రహస్యమైనది, మరియు పరమాత్మ సాక్షాత్కారమనేది మరింత రహస్యమైనది. కాని శ్రీకృష్ణుడిని యథాతథముగా అర్థం చేసుకోగల జ్ఞానమనేది జ్ఞానము లన్నింటిలో కెల్ల అత్యంత గుహ్యమైనది.

మనస్సు మరియు ఇంద్రియములు పూర్తిగా కృష్ణచైతన్యములో నిమగ్న మైనప్పుడు వారు భక్తిని అస్వాదింతురు. భక్తి అనేది మూఢవిశ్వాసము కాదు. ఇది శాస్త్రీయమైనది. ఒకరు ఎన్నో కార్యక్రములలో పాల్గొనిన నప్పటికినీ, సర్వకాల సర్వావస్థలలోను మన మనస్సు ఖచ్చితంగా శ్రీకృష్ణునిపై నిమగ్నమై ఉండవలెను. ఒక గృహిణి ఎల్లప్పుడు ఇంటిపనులలో నిమగ్నమై ఉండినను, తన జుట్టును చక్కగా దువ్వుకుంటూ జాగ్రత్త తీసుకొనును. ఆవిడకు ఎన్ని పనులున్నను తన

జడను ఆకర్షణీయంగా అల్లుకొనుటను మరవదు. అదేవిధముగా ఒక భక్తుడు వివిధ కార్యాలలో నిమగ్నమై ఉండినను, శ్రీకృష్ణుని దివ్య స్వరూపమును అతడెన్నడు మరవడు. సంసిద్ధికి అర్థమిదే.

అధ్యాయము 16

శుద్ధభక్తుల దివ్య వైభవములు

శ్లోకము 37

అథో విభూతిం మమ మాయావినస్తా –
మైశ్వర్యమష్టాంగమనుప్రవృత్తమ్
శ్రియం భాగవతీం వాస్పృహ్యన్తి భద్రాం
పరస్య మే తేఽశ్నువతే తు లోకే

ఆ విధముగా నా చింతనమందే సంపూర్ణముగా లగ్నమైన కారణముగా, భక్తుడు సత్యలోక పర్యంతమగు ఊర్ధ్వలోకము లందలి ఏ అత్యున్నత వరదానమును కూడా వాంఛింపడు. యోగము ద్వారా లభ్యమగు అష్టసిద్ధులను గాని, భగవద్రాజ్యమును చేరవలెనని గాని అతడు కోరడు. అయినను వాటిని కోరకుండగనే ప్రస్తుత జన్మమందే అతడు ఆ వరదానముల నన్నింటిని భక్తుడు అనుభవింపగలడు.

భాష్యము : 'మాయ' ఒసగునట్టి 'విభూతులు'(ఐశ్వర్యము) పలు రకములుగా నుండును. పలు రకములగు భౌతికభోగముల అనుభవము ఈ లోకమందే మనకు గలదు. కాని మనుజుడు చంద్రలోకము, సూర్యలోకము లేదా ఇంకను ఉన్నతమగు మహర్లోకము, జనలోకము, తపోలోకము లేదా చివరకు బ్రహ్మదేవుడు వసించునట్టి సత్యలోకమును చేరగలిగినచో భౌతిక భోగమునకు పుష్కలమగు అవకాశమును పొందగలుగును. ఉదాహరణకు, ఊర్ధ్వలోకములందు ఆయుఃపరిమాణము ఈ లోకము కన్నను అత్యంత ధీర్ఘమైనది. చంద్రలోకములోని ఒకరోజు మన ఆరునెలల కాలముతో సమానమైనదని చెప్పబడినది. ఉన్నత లోకములలోని ఆయుః పరిమాణమును మనము ఊహించలేము. బ్రహ్మదేవుని పన్నెండు గంటల కాల వ్యవధి మన గణిత శాస్త్రజ్ఞులకు సైతము బోధపడనిదని భగవద్గీత (8.17) యందు తెలుపబడినది. ఇవన్నీ భగవానుని బాహ్యాశక్తి(మాయాశక్తి) వర్ణనలు. వీటితోపాటు యోగులు సాధించు విభూతులు కొన్ని కలవు. కాని అవి కూడ భౌతికములే. కేవలము కోరినంతనే లభ్యమై యున్నప్పటికిని భక్తుడు ఈ భౌతిక సుఖములను వేటిని వాంఛింపడు. భగవత్కరుణచే భక్తుడు కేవలము సంకల్పము ద్వారా

అద్భుతమగు ఫలితములను సాధింపగలడు; అయినప్పటికినీ, నిజమైన భక్తుడు దానికి ఇష్టపడడు. మనుజుడు భౌతిక ఐశ్వర్యమును గాని, భౌతిక యశస్సును గాని కోరరాదని, భౌతిక సౌందర్యమును భోగించుటకు యత్నించరాదని, ముక్తిని పొందజాలక అనంతముగా జన్మమృత్యువుల యందే కొనసాగవలసి వచ్చినప్పటికినీ కేవలము భక్తియుక్త సేవ యందే లగ్నమగుటను కోరవలెనని శ్రీ చైతన్య మహాప్రభువు బోధించిరి. నిజానికి కృష్ణచైతన్యములో నెలకొనినవానికి ముక్తి అదివరకే అభయ మొసగబడి యుండును. అటువంటి భక్తులు ఊర్ధ్వలోకముల యందలి లాభములను మరియు వైకుంఠ లోకముల యందలి లాభములను కూడా అనుభవించ గలరు. కనుకనే *'భాగవతీం భద్రామ్'* అని ప్రత్యేకముగా తెలుపబడినది. వైకుంఠ లోకము లందు ప్రతిదియు శాశ్వతమైన ప్రశాంతతను కలిగివుండును; అయినను, విశుద్ధ భక్తుడు అక్కడికి చేరుకోవలెనని అచ్చటి కేగవలెననియు కోరడు. కాని ఆ లాభము అతనికి ఒనగూడియే తీరును. ప్రస్తుత జన్మయందే అతడు భౌతిక, ఆధ్యాత్మిక లోకములందలి సమస్త సౌఖ్యములను అనుభవింపగలడు.

శ్రీ చైతన్య మహాప్రభువు ననుసరించి శ్రీల రూప గోస్వామి తన 'భక్తిరసామృత సింధువు'లో, నారదముని పంచరాత్రికములో మరియు శ్రీకృష్ణభగవానుడు భగవద్గీతలో చెప్పబడినట్లు, ఒక శుద్ధభక్తుడు భగవంతుడి నుండి దేనిని అనగా ముక్తిని కూడ ఆశించడు, ఇక భౌతిక విషయముల సంగతి చెప్పేదేముంది. సాధారణంగా, జనులు ధర్మ అర్థ కామ మోక్షములను ఒకదాని తర్వాత ఒకటిగా ఆశిస్తారు. భౌతికమైన ఆర్థిక(అర్థ) ఉన్నతిని సాధించుట కొరకు మొట్టమొదట జనులు ధర్మపరులు కావాలనుకుంటారు. ఎందుకనగా ఇంద్రియ తృప్తి(కామము)ని పొందుటకు, మరియు ఇంద్రియములను తృప్తి పరుచుటలో భంగపడినపుడు వారు ముక్తిని(మోక్షం) కోరుకుంటారు. ఈ విధముగా ధర్మ, అర్థ, కామ మరియు మోక్షము లనేవి కొనసాగుచుండును. ఏదిఏమైనను భక్తుడు మాత్రం వీటిలో ఆసక్తిని కనపరచడు. క్రైస్తవులు రోజు రొట్టెను ప్రసాదించుమని ప్రార్థిస్తుంటారు. కాని శుద్ధభక్తుడు తన రోజు వారి ఆహారము కొరకు ఎన్నడు ప్రార్థించడు. ఏదైన అత్యంత విలువైన వస్తువును చేతులతో పట్టుకోవలసి వచ్చినప్పుడు మీరెంతో జాగ్రత్తను వహిస్తుంటారు. అదేవిధముగా, శుద్ధభక్తుడు కూడ శ్రీకృష్ణుని హస్తములో విలువైన వజ్రమును పెట్టిన విధముగా పెట్టబడి ఉండును. శ్రీకృష్ణుడు కూడ భక్తుడిని అలాగే పట్టుకొని భక్తుడిని సంరక్షించును.

గొప్పధనికుడైన వ్యక్తి : "విచారించవద్దు, నేను మీకు రక్షణనిస్తాను" అని

తెలిపినప్పుడు, మన పరిస్థితి ఏమిటో ఊహించుకోవచ్చును? శ్రీకృష్ణభగవానుడు సంపద లన్నింటికి అధిపతి, శ్రీకృష్ణుడి కంటే అధిక ఐశ్వర్యవంతుడు ఎవరూ ఉండరు. కాబట్టి శ్రీకృష్ణుడు తన భక్తుల యొక్క యోగక్షేమములను చూచుకొనును. అప్పుడు దారిద్ర్యమనే ప్రశ్నే ఉదయించదు. దాదాపు అందరు భౌతిక ఐశ్వర్యములను కోరుకుంటారు. అయినను శ్రీకృష్ణుడు సర్వైశ్వర్యములకు అధిపతి అని వారికి తెలియదు. అది వారి దురదృష్టము. సర్వైశ్వర్య వంతుడైనవాడు : "కేవలం నన్నే శరణువేడండి. మీ యోగక్షేమములను నేను చూచుకొందును" అని చెప్పినను, జనులు అలా చేయకుండ : "నా బాగోగులను నేను చూసుకోగలను, నాకు నేను పోషించుకోగలను. నేను, నా కుటుంబము, నా స్నేహితులు మరియు నా దేశపు బాధ్యతలను వహించగలనని చెబుతుంటారు." అర్జునుడు గొప్ప జ్ఞానవంతుడు. ఎందుకంటే, అతడు శ్రీకృష్ణుడిని ఎన్నిక చేసుకొనెను. శ్రీకృష్ణుడిని జయించుట సాధ్యపడదు. కాని భక్తుడి భక్తి, ప్రేమ అతడిని బంధించును.

శ్రీకృష్ణుడి దివ్య ఐశ్వర్యములను అర్థం చేసుకొనుట జనులకు సాధ్యపడదు. అందుకే భగవంతుని గురించి ఊహాగానాలను చేయుట పనికిరాదని శ్రీ చైతన్య మహాప్రభువు మనకు సెలవిచ్చెను. ఒక బావిలోని కప్పను అతని స్నేహితుడు సమీపించి, "నా ప్రియమైన మండూకమా! నేను ఇప్పుడే ఒక పెద్ద జలాశయమును చూచి వచ్చాను" అని చెప్పెను. ఆ కప్ప "అది ఏమిటి?" అని ప్రశ్నించినప్పుడు, "అట్లాంటిక్ మహాసముద్రం" అని స్నేహితుడు బదులిచ్చెను. "ఓ అట్లాంటిక్ మహా సముద్రమా! అది ఈ బావి కంటే నాలుగు లేదా పది అడుగులు పెద్దనైనదా?"

భగవంతుని గురించి ఊహించుటకు మనం చేసే ప్రయత్నము కూడ అటువంటిదే. మనం భగవంతుడిని అర్థం చేసుకోవాలను కున్నచో, మనం భగవంతుని నుండి మాత్రమే ఆయనను గురించి అర్థం చేసుకొనుటకు ప్రయత్నించ వలెను. స్వయముగా అతని నుండే అతడిని అర్థం చేసుకోవలెను. మనం మన ప్రక్కన ఐశ్వర్యవంతుడు, పలుకుబడి కలిగినవాడు, జ్ఞానవంతుడు, బలవంతుడు మరియు సౌందర్యవంతుడైన వాడు ప్రక్కనున్నచో మనమతడి ఐశ్వర్యమును గురించి ఊహించుటకు ప్రయత్నించ వచ్చును. కాని మనం అతనితో స్నేహం చేసినప్పుడు, మనమతని నుండే అతని స్థితిని గురించి సరాసరి తెలుసు కోవచ్చును. భగవంతుడు మన ఊహాపరిధిలోనికి రాడు. మన ఊహాపరిధి పరిమితమైనది, మరియు మన ఇంద్రియములు అసంపూర్ణములు. భక్తిమార్గము ఊహలకు అందగలదనే ప్రశ్నే ఉదయించదు. మనం కేవలం వినమ్రతతో మరియు శరణాగతితో భగవంతుడైన

శ్రీకృష్ణుడిని ఇట్లు ప్రార్థించవలెను : "శ్రీకృష్ణా! నిన్ను అర్థం చేసుకొనుట నాకు సాధ్యపడదు. దయచేసి నిన్ను ఎలా అర్థం చేసుకోగలనో వివరించుము, అని వేడుకొనినప్పుడే సాధ్యపడును." భగవద్గీతలోని పదకొండవ అధ్యాయములో అర్జునుడు ఈ విధముగానే శ్రీకృష్ణుడిని ఆశ్రయించెను.

అసంఖ్యాకమైన విశ్వములను అర్థం చేసుకొనుట లేదా గ్రహించుట మనేది సాధ్యపడదు. జగత్ అనే శబ్దం ఈ విశ్వమును సూచించును. కాని ఈ ఒక్క విశ్వమే కాకుండ అనేక విశ్వములు కూడ కలవు. ఈ ఒక్క విశ్వమునే మనము చూడగలుగు తున్నను అనేక ఇతర కోట్లకొలది విశ్వములు కలవు, మరియు ఈ కోట్లకొలది విశ్వములను శ్రీకృష్ణుడు తన ఒకేఒక్క అంశతో పోషిస్తున్నాడు. మరియు దీనిని వైదిక సాహిత్యములెన్నో ధృవీకరించెను (బ్రహ్మ సంహిత 5.48):

యస్యైకనిశ్వసితకాలమథావలంబ్య
జీవంతి లోమవిలజా జగదండనాథాః
విష్ణుర్మహాన్ స ఇహ యస్య కలావిశేషో
గోవిందమాదిపురుషం తమహం భజామి

"ఆ మహావిష్ణువు యొక్క రోమరంధ్రముల నుండి ప్రకటితులైన బ్రహ్మ మరియు బ్రహ్మాండములకు అధిపతులైన ఇతర ప్రభువులు ఆ మహావిష్ణువు యొక్క ఒక నిశ్వాసకాలము మాత్రమే జీవించి యుందురు. కాని ఆ మహావిష్ణువు గూడ ఆ గోవిందుని కళావిశేషమే. ఆదిపురుషుడైన అట్టి గోవిందుని నేను భజించుచున్నాను."

బ్రహ్మ ద్వారా ప్రార్థింపబడిన 'బ్రహ్మ సంహిత'లోని శ్లోకములలో ఈ సమాచారము ఇవ్వబడినది. దక్షిణ భారతదేశములో లభించిన 'బ్రహ్మ సంహిత'ను శ్రీ చైతన్య మహాప్రభువు అంగీకరించెను. పూర్వం వైదిక సాహిత్యములను ముద్రించే విధానము లేకుండెను. కాబట్టి ఈ ముఖ్యమైన వైదిక సాహిత్యములను చేతులతో లిఖించేవారు. ఈ సాహిత్యములు అంత చౌకగా లభించేవి కావు. అవి అన్నిచోట్ల లభించేవి కావు. కాబట్టి కేవలం యోగ్యులైన గొప్ప బ్రాహ్మణుల వద్ద మాత్రమే అవి లభించేవి. అంతేకాకుండ వారు ఈ సాహిత్యములను మందిరములలో శాస్త్రమూర్తులుగా పూజించెడివారు. ప్రస్తుతము దీనినంతటిని ముద్రణాలయము మార్చివేసింది, అయినను ఈ గ్రంథములను భగవంతుని శబ్దావతారముగా ఎల్లప్పుడు పూజింపవలెను. భగవద్గీత, భాగవతములను సాధారణ గ్రంథములుగా పరిగణించరాదు. వాటిని ఎంతో జాగ్రత్తగా అర్చవిగ్రహలను చూచుకొనినట్లుగా చూచుకోవలెను.

శ్రీ చైతన్య మహాప్రభువు దక్షిణ భారతదేశ యాత్ర ముగించిన తర్వాత, ఈ 'బ్రహ్మ సంహిత'ను తన శిష్యులకు అందించి, ఇది వేదాంతము మరియు శ్రీమద్భాగవతముల సారాంశమని తెలియజేసాడు. కాబట్టి 'బ్రహ్మ సంహిత'ను మనం ప్రామాణిక శాస్త్రముగా అంగీకరిస్తాము. ఎందుకనగా, ఇది పరమ పురుషుడైన శ్రీ చైతన్య మహాప్రభువు చేత ప్రామాణికరించ బడెను. భగవద్గీతలో శ్రీకృష్ణుడు ఈ భౌతిక జగత్తు అంతయు తన ఒకేఒక అంశపై ఆధారపడి ఉన్నదని చెప్పినట్లుగానే బ్రహ్మసంహితలో కూడ అదే విషయం చెప్పబడినది. మహావిష్ణువు రోమరంధ్రముల నుండి విశ్వములన్నీ ప్రకటము లయ్యెనని చెప్పబడెను. ప్రతి విశ్వములోను దాని కార్యనిర్వహణాధికారి, ఉన్నత జీవియైన బ్రహ్మ ఉండును. ఈ కార్య నిర్వాహణాధి కారులందరు మహావిష్ణువు యొక్క నిశ్వాస వ్యవధి కాలము వరకు జీవింతురు. అతడు నిశ్వాస చేసినప్పుడు విశ్వములన్నీ సృష్టించబడును. మరియు శ్వాస తీసుకొనినప్పుడు అవన్నీ తిరిగి అతనిలో ప్రవేశించును. ఈ విధముగా ఎన్నో విశ్వములు మరియు బ్రహ్మలు వస్తూ పోవుచున్నారు. బ్రహ్మ జీవిత కాలమును నిర్ధారించే ఈ శ్వాసలు భగవద్గీతలో భూలోకంలోని కొన్ని లక్షల కోట్ల సంవత్సరములుగా వివరించబడెను. ఇవన్నీ ఊహలు లేదా కల్పనలని భావించవచ్చును, కాని దీనిని విశ్వసించనంత వరకు భగవద్గీతను తాకుటకు ఎవరూ ఎటువంటి హక్కును కలిగి ఉండరు.

సాధారణంగా, జనులు ఐశ్వర్యవంతులగుట కొరకు ఉన్నత లోకాలకు వెళ్ళెందుకు శ్రద్ధ చూపుతుంటారు. ఇది కర్మకాండ పద్ధతి. జనులు యజ్ఞములు మరియు పుణ్య కార్యములన్నింటినీ ఉన్నత లోకాలకు వెళ్ళుటకొరకు చేస్తుంటారు. ఉన్నత లోకాలకు వెళ్ళాలను కొనుటలోని అసలు ఉద్దేశ్యము తాము గొప్ప సుఖమును, ధీర్ఘాయువును, గొప్ప సంపదలను, సౌందర్యవతులను, అందమైన తోటల నన్నింటిని అనుభవించ వలెనని. కాని భక్తుడు ఈ విషయములలో ఎటువంటి ఆసక్తిని కనపరచడు. ఎందుకనగా, అతడు శ్రీకృష్ణుడిని అంగీకరించును. భగవద్గీత(8.16)లో శ్రీకృష్ణుడు : *"ఆబ్రహ్మ భువనాల్లోకాః పునరావర్తినోఽ ర్జున"* అని తెలిపెను. అనగా "అత్యున్నత లోకాలు మొదలుకొని క్రింది స్థాయిలోని లోకాల వరకు అన్ని ప్రదేశాలు దుఃఖములతో కూడుకొన్నవి. మరియు అక్కడ జన్మమృత్యువులు తిరిగి కలుగుచుండును."

అత్యున్నత లోకమైన బ్రహ్మదేవుడు నివసించు బ్రహ్మలోకములో కూడ మన స్థితి శాశ్వతము కాదు. కాబట్టి భక్తుడు అలాంటి ప్రదేశములలో ఆసక్తిని

ఎలా కనపరుచును? భక్తుడు కేవలం పరమ శాశ్వతమైన శ్రీకృష్ణుని పట్లనే ఆసక్తిని కలిగి ఉండును. భగవంతుడే శాశ్వత జీవాత్మలకు పరమాధిపతి. మరియు మన మందరము నిత్యులము. శ్రీకృష్ణుడు మనకు మార్గదర్శనము చేస్తూ లీలలను చేయును. ఆధ్యాత్మిక లోకంలో శ్రీకృష్ణుడు మరియు అతని భక్తులు, స్నేహితులందరు కలిసి గోపబాలుర వలె ఆటలాడుకొంటారు. వారు చంద్రలోకంలో కాని బ్రహ్మ లోకాలలో కాని ఎటువంటి ఆసక్తిని కనపరచరు. ఎందుకనగా, ఈ లోకాలన్నీ చివరకు నశించును. కొన్ని జీవరాసులు కేవలం కొన్నిక్షణాలు లేదా ఒక రాత్రి వరకు మాత్రమే ఆయువును కలిగి ఉండును. తెల్లవారేసరికి అవన్నీ మరణించును. కాబట్టి భౌతిక లోకములోని జీవితమును దీనితో పోల్చెదరు. బ్రహ్మ కోట్లకొలది సంవత్సరాలు జీవించినను చివరికతడు మరణించ వలసిందే. మనం పై లోకాలకు లేదా క్రింది లోకాలకు వెళ్ళినను, బ్రహ్మ శరీరములో లేదా పిల్లి శరీరములో నున్నప్పటికినీ మనం చివరికి మరణించాల్సిందే. శ్రీకృష్ణుడు నాస్తికులను మృత్యు రూపములో సమీపించును. హిరణ్యకశిపుడు వంటివారికి : "నేను భగవంతుడను, దేవతలందరు నన్ను చూసి భీతి చెందుదురు. నేను గొప్ప శక్తివంతుడను" అని విర్రవీగువానికి శ్రీకృష్ణుడు మృత్యు రూపములో ప్రత్యక్షమగును. శ్రీకృష్ణుడు అలాంటి నాస్తికుల ముందు మృత్యురూపంలో ప్రత్యక్షమై వారి సమస్త శక్తి, సంపద, ఐశ్వర్యముల సమస్తమును హరించును. ఆస్తికులు జీవించునప్పుడు భగవంతుడిని పూజింతురు, మరియు ఈ జీవితములో భగవంతుడిని పూజించుటయే వారి ధర్మము. మరణము తర్వాత కూడ వారు సేవను కొనసాగిస్తారు. అందుకే భక్తునికి మందిరములో మరియు వైకుంఠములో ఎటువంటి భేదము కనిపించదు. అన్నిచోట్ల సేవించుటమనేది అతని ధర్మము. కాబట్టి అతడు వైకుంఠ లోకాలకు వెళ్ళుటకు ఆసక్తిని కనపరుచును?

వైకుంఠ లోకములో శ్రీకృష్ణుని వలె లేదా నారాయణుని వలె ఐశ్వర్యములను కలిగి ఉండవచ్చును. ఐదురకాల ముక్తులు కలవు మరియు 'సార్ష్టి' అనేది అందులో ఒకటి, ఈ ముక్తి భగవంతుని వలె ఐశ్వర్యమును కలిగిస్తుంది. వైకుంఠ లోకములో ప్రతిఒక్కరు నారాయణుని వలె నాలుగు చేతులను కలిగి, అతడితో సమానమైన ఐశ్వర్యములను కలిగి ఉంటారు. గోలోక వృందావనంలో శ్రీకృష్ణుడు మరియు గోపబాలురు సమానమైన ఐశ్వర్యమును కలిగి ఉంటారు. వృందావనములోని గోపబాలురకు శ్రీకృష్ణుడు భగవంతుడని తెలియదు. వారు శ్రీకృష్ణుని సమానదృష్టితో చూస్తారు. ఇది వారి భక్తి యొక్క ఐశ్వర్య స్థితి.

అయినను, భక్తులు వీటికి సంబంధించిన కోరికలను కలిగి ఉండరు. వారు భగవంతుని సేవలో నిమగ్ను లగుటకు మాత్రమే ఆసక్తిని కలిగి ఉంటారు. ఈ విధముగా వారు అన్నింటిని పొందుదురు. అంతేకాదు, వారు యోగసిద్ధులను పొందుటలో కూడ ఎటువంటి ఆసక్తిని కనపరచరు. మరియు వారికి మరొక లోకమును సృష్టించ నవసరము కూడ లేదు. ఎందుకనగా, వారు శ్రీకృష్ణుడిని ఆరాధిస్తూ మందిరమును వైకుంఠముగా మార్చుదురు. మందిరము నిర్గుణమైనది అనగా గుణములకు అతీతమైనది. అడవి సత్త్వగుణమును, పట్టణము రజోగుణ ప్రభావమును కలిగి ఉండును. ఎందుకనగా, పట్టణములో వ్యభిచారము, మత్తు, జూదం మరియు అభక్ష్య భోజనం అధిక మోతాదులో ఉండునని శాస్త్రంలో చెప్పబడినది. పూర్వం జనులు ఆధ్యాత్మిక సాక్షాత్కారము కొరకు పట్టణములను విడిచి అడవులకు వెళ్ళెడివారు. అది 'వానప్రస్థ' దశ. 'వన' అనే పదానికి 'అడవి' అని అర్థం. వారు సన్న్యాసమునకు ముందు తమ కుటుంబములను విడిచి అడవులకు వెళ్ళి తపస్సును అభ్యసించెడివారు. *"వనం గతో యద్ధరిమాశ్రయేత."*

నిజానికి, అడవులలో నివసించుటకంటె మందిరములో నివసించుట మెంతో ఉన్నతమైనది. ఎందుకనగా, మందిరం 'నిర్గుణ'మైనది. అనగా, అది గుణము లన్నింటికి అనగా సత్త్వగుణము కంటే కూడ అధికమైనది. నిజానికి మందిరములో నివసించుటమనగా వైకుంఠములో నివసించుతున్నట్లు అర్థము.

తదుపరి కపిలదేవుడు భక్తుల యొక్క ప్రత్యేక గుణైశ్వర్యములను వివరిస్తున్నాడు.

శ్లోకము 38

న కర్హిచిన్మత్పరాః శాన్తరూపే
నఙ్క్ష్యన్తి నో మేऽ నిమిషో లేఢి హేతిః
యేషామహం ప్రియ ఆత్మా సుతశ్చ
సఖా గురుః సుహృదో దైవమిష్టమ్

భగవాను డింకను ఇట్లు కొనసాగించెను : ఓ ప్రియమైన జననీ! అట్టి దివ్యవిభూతులను బడిసిన భక్తులు వాటిని ఏనాడును కోల్పోరు; ఆయుధములు గాని, కాలము గాని అట్టి విభూతులను నశింప చేయజాలవు. భక్తులు నన్ను తమ మిత్రునిగాను, బంధువుగాను, పుత్రునిగాను, గురువుగాను, సుహృత్తుగాను,

దైవముగాను అంగీకరించినందున ఏ సమయమందును వారి ఐశ్వర్యములు నశింపబోవు.

భాష్యము : పుణ్యకర్మల ద్వారా ఎవరేని తననుతాను బ్రహ్మలోక పర్యంతమగు ఊర్ధ్వలోకముల వరకు ఉద్ధరించు కొనినను ఆ పుణ్యపరిపాకము నశించినంతనే తిరిగి ఈ భూలోకమునకు చేరి నూతన జీవితపు కర్మల నాచరింప వలసి వచ్చునని భగవద్గీత యందు తెలుపబడినది. అనగా జీవుడు అధికమైన భోగము, ఆయుర్దాయము కొరకై ఉన్నతలోకముల కేగినను అది శాశ్వత నివాసము కాబోదు. కాని భక్తులకు సంబంధించినంత వరకు వారి సంపత్తులు (భక్తియుక్త సేవ మరియు ఈ లోకమందే వైకుంఠలోక ఐశ్వర్యము) ఏనాడును నశింపబోవు. భక్తుల ఐశ్వర్యములు స్థిరమైనవని సూచించుచు కపిలదేవుడు ఈ శ్లోకమున తన తల్లిని *'శాంతరూప'* అని సంబోధించినాడు. భక్తులు శాశ్వతముగా వైకుంఠ వాతావరణము (రజస్తమోగుణములు లేకుండ కేవలము విశుద్ధమైన సత్త్వగుణము కారణమున శాంతరూపయని పిలువబడినది) నందే స్థిరముగా నెలకొనియుండుట దానికి కారణము. శ్రీకృష్ణభగవానుని భక్తియోగము నందు ఒక్కమారు స్థితుడైనంతటనే మనుజుని దివ్యమగు సేవాస్థితి ఇక ఏనాడును నశింపబోదు; ఆనందము మరియు సేవ యనునవి మాత్రము అనంతముగా వృద్ధి చెందుతుండును. కృష్ణచైతన్యము (వైకుంఠ వాతావరణము) యందు నెలకొనిన భక్తులపై కాలప్రభావము ఉండదు. భౌతిక జగమునందు కాలము సమస్తమును నశింపజేయును; కాని వైకుంఠ వాతావరణము నందు మాత్రము కాలప్రభావము గాని, దేవతల ప్రభావము గాని ఉండదు. వైకుంఠ లోకములందు దేవతలు ఉండకపోవుటయే అందులకు కారణము. ఈ భౌతిక జగమున మన కర్మలన్నియును వివిధ దేవతలచే నియంత్రింపబడు చుండును; మనం చేతిని కదిలించినను, కాలును కదిలించినను ఆ కార్యమంతయు దేవతల చేతనే నియంత్రితమగును. కాని వైకుంఠ వాతావరణము నందు మాత్రము దేవతల ప్రభావము గాని, కాలప్రభావము గాని ఉండదు. కావున వినాశమనెడి ప్రశ్నయే ఉదయించదు. కాలమనెడి అంశమున్నప్పుడు నిక్కముగా వినాశముండ గలదు. కాని కాలము లేనప్పుడు (భూత, భవిష్యత్, వర్తమానములు లేనప్పుడు) ప్రతిదియు శాశ్వతమైనదే. కనుకనే ఈ శ్లోకమునందు *'నఙ్క్ష్యన్తి నో'* అను పదము ప్రయోగింపబడినది. దివ్యవిభూతులు ఏనాడును నశింపవని అది సూచించుచున్నది.

వినాశము నుండి విముక్తికి గల కారణము కూడా ఇక్కడ వర్ణితమైనది.

భక్తులు శ్రీకృష్ణభగవానుని తమకు పరమప్రియునిగా అంగీకరించి, వివిధ సంబంధములలో ఆ దేవాదిదేవునితో ప్రేమ వినిమయము కావింతురు. వారు దేవాదిదేవుడిని తమ ప్రియమైన మిత్రునిగాను, ప్రియమైన బాంధవునిగాను, ప్రియమైన పుత్రునిగాను, ప్రియమైన గురువుగాను, ప్రియమైన శ్రేయోభిలాషిగాను, ప్రియమైన విగ్రహముగాను భావింతురు. శ్రీకృష్ణభగవానుడు శాశ్వతుడు; కనుక ఆ దేవాదిదేవునితో నెరపెడి ఏ సంబంధమైనను శాశ్వతమైనదే. ఆ సంబంధములు ఏనాడును నశింపవని స్పష్టముగా ఇచ్చట ధ్రువీకరింపబడినది; కనుకనే ఆ సంబంధములకు చెందిన విభూతులు ఏనాడును నశింపవు. ప్రతి జీవుడును ఎవరినో ఒకరిని ప్రేమించెడి స్వభావమును కలిగియుండును. తాను ప్రేమించ గలిగేందుకు ఎవ్వడును లేనిచో మనుజుడు తమ ప్రేమను సాధారణముగా ఏ కుక్క, పిల్లివైపునకో మరలించుటను మనం చూచుచుందుము. ఆ విధముగా జీవుల యందున్న ప్రేమించు స్వభావము సరియైన స్థానము కొరకై సదా అన్వేషించుచుండును. దేవాదిదేవుడగు శ్రీకృష్ణుని మనం పరమ ప్రియమైన ధ్యేయముగా (మిత్రునిగాను, పుత్రునిగాను, గురువుగాను, శ్రేయోభిలాషిగాను) ప్రేమించ వచ్చునని ఈ శ్లోకము ద్వారా అవగతమగు చున్నది. అందులో ఎటువంటి మోసము ఉండబోదు మరియు అట్టి ప్రేమకు అంతముండదు. ఆ రీతిని భగవానునితో మనం వివిధ రీతుల సంబంధమును అనుభవింపవచ్చును. భగవానుని పరమ గురువుగా అంగీకరించుట యనునది ఈ శ్లోకమందలి ఒక ప్రత్యేక అంశమై యున్నది. భగవద్గీత శ్రీకృష్ణభగవానునిచే ప్రత్యక్షముగా పలుకబడినది; అర్జునుడు ఆ ఆదిదేవుని గురువుగా అంగీకరించెను. అదేవిధముగా మనం కూడ శ్రీకృష్ణభగవానునే పరమ గురువుగా అంగీకరింపవలెను.

నిజమునకు శ్రీకృష్ణుడు అనగా శ్రీకృష్ణుడు మరియు ఆతని ఆంతరంగిక భక్తులని భావము. శ్రీకృష్ణుడెన్నడును ఒంటరివాడు కాదు. శ్రీకృష్ణుని గూర్చి పలికినపుడు ఆతని నామము, రూపము, గుణము, ధామము, సహచరులు అన్నింటిని పలుకుచున్నట్లు భావము. కృష్ణభక్తులు నిరాకారవాదులు కానందున శ్రీకృష్ణుడు ఏనాడును ఏకాకి కాడు. ఉదాహరణకు రాజు ఎల్లవేళలా తన కార్యదర్శి, సేనానాయకుడు, సేవకుడు, మరియు గొప్పఆర్భాటములను కూడియుండును కదా! కనుకనే శ్రీకృష్ణుని మరియు ఆతని సహచరులను మన గురువులుగా భావించి నంతనే మన జ్ఞానమును ఇక ఏ చెడు ప్రభావములను నశింప చేయజాలవు. ఈ భౌతిక జగమునందు మనం సంపాదించెడి జ్ఞానము కాలప్రభావమున

మారవచ్చును; కాని భగవద్గీతా వచనములు(శ్రీకృష్ణభగవానుని ప్రత్యక్ష వచనములు) మాత్రము ఎన్నడును మారవు. కనుకనే భగవద్గీతకు తప్పుడు వ్యాఖ్యానము చేయుట అనుచితము; ఏలయన ఆ జ్ఞానము శాశ్వతమైనదై యున్నది.

ప్రతిఒక్కరు దేవాదిదేవుడగు శ్రీకృష్ణునే ఉత్తమమిత్రునిగా అంగీకరింపవలెను. ఆతడెన్నడును వంచింపబోడు. సదా స్నేహపూర్వక ఉపదేశము నొసగుచు ఆతడు భక్తునకు స్నేహితుని మాదిరి రక్షణనొసగును. శ్రీకృష్ణునే పుత్రునిగా అంగీకరించినచో ఆతడు మరణించునన్న భయముండదు. ఇక్కడ చక్కని పుత్రుని కలిగిన తల్లిదండ్రులు లేదా ఆ బాలుని యెడ అనురాగము కలిగినవారలు సర్వదా "ఈ బాలుడు చిరంజీవి యగు గాక" అనుచు తలపోయుచుందురు. కాని ఆ రీతి మరణింపక యుండువాడు శ్రీకృష్ణుడొక్కడే. కనుకనే శ్రీకృష్ణుని తమ పుత్రునిగా భావించువారలు ఏనాడును పుత్ర వియోగమును అనుభవింపరు. భక్తులు శ్రీవిగ్రహమును పుత్రునిగా భావించిన ఉదంతములు ఎన్నియో కలవు. ముఖ్యముగా బెంగాల్ రాష్ట్రమందు అటువంటి సంఘటనలు ఎన్నో కలవు; అటువంటి భక్తుల మరణానంతరము శ్రీవిగ్రహమే శ్రాద్ధకర్మలను నిర్వహించెను. అనగా ఆ సంబంధమేనాడును నశింపబోదు. జనులు సాధారణముగా వివిధ దేవతారాధనకు అలవాటు పడియుందురు; కాని అటువంటి స్వభావము భగవద్గీత యందు ఖండించ బడినది. కనుక మనుజుడు జ్ఞానవంతుడై లక్ష్మీనారాయణుల రూపమునో, సీతారాముల రూపముననో, రాధాకృష్ణుల రూపముననో కేవలము దేవాదిదేవుడినే అర్చింపవలెను. అంతట అతడు మోసమునకు గురికాకుండును. దేవతార్చనము ద్వారా మనుజుడు తననుతాను ఊర్ధ్వలోకములకు ఉద్ధరించుకొనినను ప్రళయ సమయమున ఆ దేవత మరియు ఆ దేవతాలోకము రెండును లయం చెందును. కాని దేవాదిదేవుని అర్చించువాడు మాత్రము కాలప్రభావము గాని, వినష్టము గాని, విలయముగాని లేనటువంటి వైకుంఠ లోకములకు చేరును. సారాంశమేమనగా, దేవాదిదేవుడైన శ్రీకృష్ణునే సమస్తముగా భావించునట్టి భక్తులపై కాలప్రభావము ఏమాత్రము పనిచేయదు.

ఆధ్యాత్మిక జీవితము శాశ్వతమైనది. నాశనము లేనట్టిది. ఈ భౌతిక లోకములో మనం కలిగి ఉన్నదంతయు నశించును. భౌతిక లోకములో మనం చక్కటి గృహమును, సంపదను, సంతానమును, స్నేహితులను మరియు ఐశ్వర్యములను కోరుకుంటారు. కాని చివరకు ఇవన్నీ మనతోపాటు నశించును. ఇక్కడ ఏది శాశ్వతము కాదు. కాబట్టి సర్వం మాయగా పిలువబడును. నిజానికి మనం దీనిని అర్థం చేసుకోలేక వీటినన్నింటిని శాశ్వతమని భావిస్తాము. కాని

శ్రీకృష్ణుడు ఒక్కడే శాశ్వతము అనునది సత్యము. శ్రీకృష్ణుని భౌతికశక్తి అశాశ్వతమైనది.

ఆధ్యాత్మిక లోకంలో సంబంధములు ఉండవని మాయావాదులు భావిస్తారు. ఏమైనను, ఆధ్యాత్మిక లోకంలో నిజమైన జీవితము కలదని శాస్త్రములు తెలుపుచున్నవి. భౌతిక లోకములోని జీవితమనేది నిజమైన జీవితమునకు ప్రతిబింబము మాత్రమే. భగవద్గీతలోని పదునైదవ అధ్యాయములో ఈ భౌతిక లోకపు మూలములు పైకి మరియు కొమ్మలు క్రిందకి కలిగినట్టి మఱ్ఱివృక్షముతో పోల్చబడెను. అనగా ఇది ప్రతిబింబము. మనం ఒక జలాశయం సమీపంలో నిలుచుని అందులోకి చూచినచో, వృక్షము యొక్క ప్రతిబింబము తలక్రిందులుగా కనిపించును. ఈ భౌతిక లోకములో ఎండమావులను గురించిన అనుభవము మనకు కలదు. మనం జలము ఉందని భావిస్తాము. కాని నిజానికి జలముండదు. కొన్నిసార్లు సముద్రములోని నావికులు భూమిని చూస్తుంటారు, కాని నిజానికి అవి నీటి ఎండమావులు. ఈ భౌతిక లోకం కూడ అలాంటిదే. మన జీవితములలో 'రస'మును అనగా మనమేదో సంబంధములను అనుభవిస్తున్నామని భావిస్తాము. భార్యతో మనకు గల సంబంధమును అనుభవిస్తుంటాము. మన సంతతి మనలను తండ్రి అని సంబోధిస్తారు. కాని ఈ సంబంధములన్నీ ప్రతిబింబముల వంటివి. అయినను జనులకు ఈ విషయముల గురించి సమాచారము తెలియదు. ఈ సంబంధముల నుండి నిజమైన ఆనందమును ఆధ్యాత్మిక లోకములోని శ్రీకృష్ణుని నుండి పొందవచ్చును. కాబట్టి శ్రీకృష్ణుడు ప్రత్యక్షంగా అవతరించి, అతనితో మనము ఈ సంబంధములను ఆనందించ వచ్చునని మనకు బోధించును. మనము యజమానిగా, స్నేహితునిగా, కుమారునిగా, తండ్రిగా లేదా ప్రేమికుడిగా అతడితో ఆనందించ వచ్చును.

కాబట్టి శ్రీకృష్ణుడే సర్వమైనచో, శ్రీకృష్ణుడు సాకార పురుషునిగా ఉండుటమనే ప్రశ్నే ఉదయించదని మాయావాదులు చెబుతుంటారు. ఇది భౌతిక భావన. ఒక కాగితపు ముక్కను చిన్నచిన్న ముక్కలుగా చించినచో, ఆ కాగితము ఎటువంటి ఉనికిని కలిగి ఉండదు. కాని శ్రీకృష్ణుడు అలాంటివాడు కాదు.

అద్వైతమచ్యుతమనాదిమనంతరూపమ్
ఆద్యం పురాణపురుషం నవయౌవనం చ

"వేదముల ద్వారా గూడ దుర్లభుడైన వానిని, ఆత్మయొక్క శుద్ధభక్తి ద్వారా

సులభప్రాప్యుడైన వానిని, అద్వైతుడు, అచ్యుతుడు, అనాదియైన వానిని అనంతమైన రూపములు గలవానిని, సర్వాద్యుడును సనాతనుడును యైనవానిని నిత్య నవ యువకుని, ఆదిపురుషుడైన గోవిందుని భజింతును." (బ్రహ్మ సంహిత 5.33) శ్రీకృష్ణుడు కోట్లకొలది విస్తరణలను కలిగి ఉన్నాడు, అయినను అతడు ప్రతిఒక్కరి హృదయములోను కలడు. అతడు కేవలం మానవ హృదయంలోనే కాకుండ జంతువుల, చెట్ల, మొక్కల, జలచరములు మొదలగు వాటిలో కూడ కలడు. శ్రీకృష్ణుడు కనుక ఈ విధముగా కోటానుకోట్ల జీవరాసుల హృదయములలో ప్రవేశించినందున అతడు తన ఉనికిని కోల్పోవునని భావించుట భౌతికమైనది. శ్రీకృష్ణుడు కోట్లకొలది జీవరాసులుగా విస్తరించినప్పటికిని అతడి శక్తిలో మార్పు ఉండదు. శ్రీకృష్ణుడు 'సర్వైశ్వర్య' సంపూర్ణుడు అతడు ఎన్నడు క్షీణించడు.

ఒక పాఠశాలలోని పేద విద్యార్థిని గురించిన ఆసక్తికరమైన వృత్తాంతమొకటి కలదు. తండ్రి సంవత్సరీకము కొరకు దేనినైనను దానం చేయవలసిందిగా పాఠశాల ఉపాధ్యాయుడు విద్యార్థులను అభ్యర్థించాడు. పూర్వం ఉపాధ్యాయులు జీతం తీసుకునేవారు కాదు. కాబట్టి కేవలం విద్యార్థులు తమ ఇంటి నుండి దానముగా తీసుకువచ్చిన దానిని లేదా బిక్షాటన ద్వారా సేకరించిన సామాగ్రిని మాత్రమే స్వీకరించెడి వారు. సాధారణంగా బ్రాహ్మణులు ఉపాధ్యాయులుగా ఉండేవారు. మరియు వారు అందుకు ఎలాంటి రుసుమును వసూలు చేసేవారు కాదు. కాబట్టి, కొందరు విద్యార్థులు బియ్యం, మరికొందరు ఇతర పంటల ద్వారా వచ్చిన ధాన్యమును తీసుకు వచ్చెడివారు. ఒక విద్యార్థి ఎంత పేదవాడనగా, వాడికి ఏమి తీసుకురావాలో అంతుపట్టలేదు, దానితో అతడు ముందుగా తన తల్లిని అడుగుతానని ఉపాధ్యాయునితో తెలిపెను. పాఠశాల తర్వాత అతడు తన తల్లితో ఇలా చెప్పాడు : "అమ్మా! నా తోటి విద్యార్థులందరు ఉపాధ్యాయుని కొరకు ఏదో ఒకటి దానం చేయుదుమని ప్రమాణము చేసిరి. కనుక నేను ఏమి దానం చేయగలను?" "కుమారా! మనం పేదవారము. కాబట్టి దేనిని ఇచ్చుకునే స్థితిలో మనము లేమని తల్లి సమాధాన మిచ్చెను. ఏమైనను, శ్రీకృష్ణుడు పేదవారి బంధువు. కాబట్టి అతడు నీకు దేనినైన ఇచ్చినచో దానిని మీ ఉపాధ్యాయునికి ఇచ్చుదునని ప్రమాణము చేయుము." "అప్పుడు ఆ బాలుడు శ్రీకృష్ణుడు ఎక్కుడుండును?" అని ప్రశ్నించెను. "అతడు అడవిలో ఉండునని వింటిని" అని తల్లి తెలిపెను. దానితో ఆ బాలుడు అడవికి వెళ్ళి శ్రీకృష్ణుడి కొరకై పిలుస్తూ, రోదించుట మొదలు పెట్టెను. చివరకు శ్రీకృష్ణుడు ప్రత్యక్షమయ్యాడు. భక్తుడు తనను దర్శించుటకు

ఆతృతను కలిగి ఉండుటను చూచినప్పుడు భగవంతుడు గొప్ప దయతో దర్శన మిచ్చును. ఏమి కావలెను? అని శ్రీకృష్ణుడు బాలుని అడిగెను. "నీవు పేదవారి బంధువు." మరియు "నేను పేదవాడిని. నేను నా ఉపాధ్యాయునికి ఏమని ప్రమాణము చేయవలెను?"అని బాలుడు పలికెను. అప్పుడు శ్రీకృష్ణుడు : "నీవు పెరుగును దానం చేయుదునని ఉపాధ్యాయునితో చెప్పుము" అని తెలిపెను. ఆ బాలుడు దానికెంతో సంతోషించెను. మరుసటిరోజు అతడు పాఠశాలకు వెళ్ళి ఉపాధ్యాయునితో: "నేను మీకు కావలిసినంత పెరుగును దానం చేయగలను" అని చెప్పెను. ఉపాధ్యాయుడు మంచిదని మరియు ఆ పిల్లవాడి పట్ల అతడు సంతృప్తి చెందెను. సంవత్సరీకము రోజున ఆ బాలుడు అడవిలోకి వెళ్ళి శ్రీకృష్ణుడిని పిలిచెను. శ్రీకృష్ణుడు ప్రత్యక్షమై అతనికి ఒక పెరుగు కుండను అందజేసెను. ఆ పిల్లవాడు పెరుగు కుండను తీసుకొని ఉపాధ్యాయునికి అందజేసి, "ఇది నా దానము మాష్టారు" అని చెప్పెను. ఉపాధ్యాయుడు ఆ కుండను చూచి, "ఏమిటిది? వందల కొద్ది జనం రాబోతున్నారు, నీవు ఈ మాత్రం పెరుగునే తెచ్చి ఇస్తున్నావు" అని ఆగ్రహించి కుండలోని పెరుగును పడబోసెను. కుండను తీసుకొనుటకు వంగినప్పుడు, ఆ కుండ పెరుగుతో నిండి ఉండుటను అతడు చూచెను. దానిని తిరిగి పడబోసెను. అది తిరిగి నిండుకొనెను. ఆ కుండ దివ్యమైనదని అప్పుడు అర్థం చేసుకొనెను.

ఇది శ్రీకృష్ణుని లక్షణము, ఎవరైనను సర్వమును తీసుకొనినను, మొత్తం తిరిగి అలాగే మిగిలి ఉంటుంది. ఈ భౌతిక లోకంలో ఒకటి నుండి ఒకటి తీసివేసినచో శూన్యమవుతుంది. కాని ఆధ్యాత్మిక లోకంలో ఒకటి నుండి ఒకటి తీసివేసినచో ఒకటిగానే మిగులుతుంది. దానినే అద్వయ జ్ఞానమంటారు. ఆధ్యాత్మిక లోకంలో ద్వంద్వములు లేవు. ఒకటికి మరొకటి కలిపినను లేదా ఒకటి నుండి ఒకటిని తీసినను వచ్చేది ఒకటియే. కాబట్టి శ్రీకృష్ణుని మనము ప్రేమించినచో, భౌతిక లోకములో వలె ఆ ప్రేమ నశించదు. భౌతిక లోకములో ఒక సేవకుడు తన యజమానిని సంతృప్తి పరిచే విధంగా మరియు సేవకుడు సంతృప్తి చెందునంత వరకు అతడు సేవకుడిగా సేవచేయును. యజమాని జీతం చెల్లించు నంతకాలము సేవకుడు సంతృప్తి పడును. అలాగే సేవకుడు చక్కగా సేవ చేసినంతకాలము యజమాని సంతృప్తిపడును. ఏమైనను, ఆధ్యాత్మిక లోకములో సేవకుడు కొన్ని పరిస్థితులలో సేవ చేయలేకున్నను యజమాని ఎప్పుడు అతడిపట్ల సంతృప్తి చెందుతుండును. అలాగే యజమాని జీతం చెల్లించకున్నను సేవకుడు ఎప్పుడు

సంతృప్తి చెందుతుండును. దీనినే పరిపూర్ణ ఏకత్వం అంటారు. గురువు వందలకొలది సేవకులు లేదా శిష్యులు కలిగి ఉన్నప్పటికినీ అతడు వారికి జీతం చెల్లించనవసరము లేదు. వారు ఆ విధంగా ఆధ్యాత్మిక ప్రేమ కారణంగా సేవిస్తుంటారు. గురువు జీతం తీసుకోకుండా బోధించును. ఇదే ఆధ్యాత్మిక సంబంధము. ఈ సంబంధములో మోసగించుట లేదా మోసగింపబడుట అనేది ఉండదు. కాబట్టి శ్రీకృష్ణుడిని మనం మన పుత్రునిగా, స్నేహితునిగా లేదా ప్రేమికునిగా అంగీకరించినచో మనమెన్నడు మోసగించబడము. ఏమైనను, మనం బూటకమైన ఈ మాయా సంబంధమైన పుత్రులను, సేవకులను, తండ్రులను లేదా ప్రేమికులను త్యజించవలెను. ఎందుకనగా, వారు ఎలాగైనను మనలను మోసగిస్తారు. మన కుమారుడిని మనం ప్రాణం కంటే అధికంగా ప్రేమించవచ్చును, కాని ఆ పుత్రుడే ఒకరోజు మనకు శత్రువు కావచ్చును. మనం మన భార్యను ఎంతగానో ప్రేమించ వచ్చును, కాని ఆ భార్యనే ఒకరోజు తనస్వార్థం కొరకు మనలను చంపవచ్చును. ఇటువంటి సంఘటనల నెన్నింటినో మనము చరిత్రలో చూస్తున్నాము. ఈ భౌతిక లోకంలోని ఖేదు అనుభవముల కారణముగా మాయావాదులు ఇటువంటి సంబంధములంటే భయపడుతారు. కాబట్టి వారు అటువంటి సంబంధము లన్నింటిని అంతమొందించు కోవాలనుకుంటారు. అంతేకాకుండ వారు పుత్రుడు, పుత్రిక, ప్రియుడు, యజమాని వంటి లేదా ఎటువంటి సంబంధములు ఇకపై వద్దని అంటారు. వీటన్నింటి వలన విసుగు చెంది వారన్నింటిని శూన్యం చేయవలెనని కోరుకుంటారు. కాని మనం శ్రీకృష్ణుడితో ఈ విధమైన సంబంధములను కలిగి వున్నచో మనమెన్నడు మోసగింపబడము లేదా నిరాశ చెందము. అంతేకాకుండ మన ఉత్సాహము మరింతగా వృద్ధి చెందుతుండును. కాబట్టి శ్రీకృష్ణుడు తనను కుమారుడిగా స్నేహితునిగా మరియు యజమానిగా అంగీకరించమని మనలను ప్రోత్సహించును. అలాచేసినప్పుడే మనం ఆనందించ గలము.

శ్లోకము 39, 40

ఇమం లోకం తథైవాముమాత్మానముభయాయినమ్
ఆత్మానమను యే చేహ యే రాయః పశవో గృహాః

విసృజ్య సర్వానన్యాంశ్చ మామేవం విశ్వతోముఖమ్
భజన్త్యనన్యయా భక్త్యా తాన్ మృత్యోరతిపారయే

ఆ విధముగా విశ్వతోముఖుడనగు నన్ను అనన్యభక్తితో అర్చించు భక్తుడు స్వర్గాభిలాషను మరియు ధనము, పుత్రులు, పశువులు, గృహములతోను గాని లేదా ధనసంబంధమున గల దేనితోగాని ఈ జగమునందు సుఖి కావలెనను కోరికను త్యజించివేయును. అతనిని జన్మమృత్యువుల ఆవలి ఒడ్డుకు నేను చేర్చుచున్నాను.

భాష్యము : ఈ రెండు శ్లోకములందు తెలుపబడినట్లు అనన్య భక్తియోగమనగా దేవాదిదేవునే సర్వస్వముగా భావించి పరిపూర్ణమైన భక్తియుక్త సేవలో (కృష్ణచైతన్యములో) నెలకొనుటయని భావము. దేవాదిదేవుడగు శ్రీకృష్ణుడు సమస్తము తానేయైనవాడు కనుక ఎవరేని అతడిని అనన్యమగు శ్రద్ధతో అర్చించినచో సమస్త ఐశ్వర్యములను అప్రయత్నముగా పొందినవాడును, ఇతర కర్తవ్యముల నన్నింటిని నిర్వహించిన వాడును కాగలడు. అటువంటి భక్తుని తాను మృత్యు సాగరమునకు ఆవలి తీరమును చేర్చుచున్నట్లు భగవానుడు ఇచ్చట వాగ్దానము చేయుచున్నాడు. కనుకనే మృత్యుసాగరమును దాటగోరినవాడు ఎటువంటి భౌతిక సంపత్తులను కలిగి యుండరాదని శ్రీ చైతన్య మహాప్రభువు ఉపదేశించిరి. అనగా ఈ జగమునందే సుఖవంతులగుటకు లేదా స్వర్గాధిలోకముల కేగుటకు ఎవ్వరును యత్నించరాదని మరియు ధన, పుత్ర, గృహ, పశ్వాది సంపత్తులకై ప్రయాసపడరాదని దాని భావము.

ఏ విధముగా విశుద్ధభక్తుడు తెలియకుండగనే ముక్తిని బడయగలడో మరియు దాని లక్షణములేమిటో ఇచ్చట వివరింపబడినవి. బద్ధజీవునకు రెండు రకముల జీవనస్థితులు కలవు. ఒకటి ప్రస్తుత జన్మమునందు ఉండగా, రెండవది తదుపరి జన్మమునకై మనము చేయు సన్నాహము. నేను సత్త్వగుణమునందు స్థితుడనై యున్నచో ఉన్నతలోకముల కేగుటకు సమాయత్త మగుచున్నానని భావము; రజోగుణము నందున్నచో కర్మయే అతిప్రబలముగా నుండు మానవ సంఘమున నిలిచి యుండగలను; ఒకవేళ తమోగుణము నందున్నచో జంతు జీవనమునకు లేదా నీచతరగతి మానవజన్మకు పతనము చెందగలను. కాని భక్తునికి ఈ జన్మను గూర్చిగాని, తదుపరి జన్మను గూర్చిగాని చింతయే లేదు. ఏలయన ఏ జీవన మందును అతడు భౌతికాభివృద్ధిని గాని, ఉచ్చ నీచ జన్మలను గాని కోరడు. "హే ప్రభూ! నేను ఏ జన్మను పొందుదుననెడి విషయము ముఖ్యము కాదు. చీమగానైనా సరే భక్తుని గృహములోనే నాకు జన్మనొసగుము" అని భక్తుడు భగవానుని ప్రార్థించును. అనగా విశుద్ధ భక్తుడెన్నడును భవబంధముక్తికై ప్రార్థించడు.

నిజమునకు తాను ముక్తికి తగినవాడను కానని అతడు తలపోయును. తన పాత జీవితమును మరియు పాపకర్మలను తలచుకొనుచు నరకమున కేగుటయే తనకు ఉచితమని అతడు భావించును. ఈ జన్మమందు నేను భక్తుడనగుటకు ప్రయత్నించు చుంటిననగా పూర్వజన్మములందు నూటికినూరుపాళ్ళు పుణ్యాత్ముడనని భావము కాదు. అది అసంభవము. కనుకనే భక్తుడెల్లవేళలా తనను నెరిగియుండును. కేవలము సంపూర్ణ శరణాగతి కారణముననే భగవత్కరుణచే అతడి దుఃఖములు తొలగించబడును. ఈ విషయము భగవద్గీత యందు : "నాకు శరణము నొందుము! సమస్త పాపకర్మల నుండి నిన్ను రక్షించగలను" అని తెలుపబడినది. అదియే దేవాదిదేవుని కృప. కాని దీనిభావము శ్రీకృష్ణభగవానుని చరణకమలములకు శరణము నొందినవాడు గతజన్మము నందు ఎట్టి పాపకార్యములు చేయలేదని కాదు. కనుకనే భక్తుడు ఎల్లప్పుడును : "నేను చేసిన పాపములకు నేను తిరిగి తిరిగి జన్మించవచ్చును. కాని నా ఏకైక వినతి యేమనగా నీ సేవను మాత్రము నేను మరువకూడదు" అని ప్రార్థించుచుండును. భక్తుడు మానసిక శక్తి కలవాడు కనుకనే : "హే ప్రభూ! నేను మరలా మరలా జన్మించినను సరే; నీ విశుద్ధభక్తుని ఇంటనే నేను జన్మించునట్లుగా చేయుము. దానితో ఆధ్యాత్మికోన్నతికై తిరిగి అవకాశమును పొందగలుగుదును" అని విన్నవించును.

విశుద్ధ భక్తుడెన్నడును ఉన్నత జన్మమునకై ఆరాటపడడు. ఆ విషయమును అతడు అదివరకే త్యజించి యుండును. జీవునకు ఏ జన్మయందైనను(గృహస్థునిగా కాని లేదా జంతువుగా కాని) కొంత సంతానము, కొంత రాబడి, కొంత సంపత్తి ఉండి యుండును. కాని భక్తుడు మాత్రము దేనిని పొందవలెనని ఆరాటపడడు. భగవత్కరుణచే ప్రాప్తించిన దానిచే అతడు సంతుష్టి చెందును. తన సాంఘిక గౌరవమును వృద్ధి చేసికొనవలెనని గాని లేదా తన సంతానమునకు గొప్ప విద్యను చెప్పించ వలెనని గాని ఆతడు ఆరాటపడడు. దాని భావము అతడు నిర్లక్ష్యభావము కలవాడని కాదు; అతడు నిజమునకు కర్తవ్య పరాయణుడు. కాని తాత్కాలికమగు గృహకలాపములను లేదా సాంఘిక జీవనమును వృద్ధిపరచుకొనుట యందు అతడు అధికముగా కాలమును వృథా చేయడు. శ్రీకృష్ణుని సేవ యందే పరిపూర్ణముగా నెలకొనియుండు ఆ భక్తుడు ఇతర కలాపములకు కేవలము కావలసినంత సమయమును మాత్రమే కేటాయించును*(యథార్హముపయుంజ్యతః)*. అటువంటి విశుద్ధభక్తుడు తదుపరి జన్మమున గాని లేదా ప్రస్తుత జన్మమున గాని ఏమి జరుగ బోవుననెడి విషయమును అంతగా పట్టించుకొనడు; కుటుంబమును,

సంతానమును, సంఘమును కూడా అతడు లెక్కపెట్టడు. సంపూర్ణ కృష్ణచైతన్యములో అతడు పూర్తిగా కృష్ణసేవ యందు నియుక్తుడగును. భగవద్గీత యందు తెలుపబడినట్లు భక్తునికి తెలియకుండగనే భగవానుడు తన ధామమునకు అతనిని దేహత్యాగానంతరము శీఘ్రముగా చేర్చును. అనగా దేహత్యాగానంతరము భక్తుడు మరొక తల్లి గర్భమున ప్రవేశింపడు. సాధారణజీవుడు మాత్రము మరణానంతరము తన కర్మానుసారము మరొక దేహమును పొందుటకు మరొక తల్లి దేహమున ప్రవేశించును. కాని భక్తుని విషయమునందు మాత్రము అతడు శీఘ్రముగా ఆధ్యాత్మిక జగమున భగవత్సాహచర్యము నందుకొనును. అదియే భగవానుని ప్రత్యేక కరుణ. అది యెట్లు సాధ్యమనెడి విషయము రాబోవు శ్లోకము లందు వివరింపబడినది. సర్వశక్తి వంతుడైనందున శ్రీకృష్ణభగవానుడు దేనినైనను కావింపగలడు; సమస్త పాపములను అతడు క్షమించగలడు; శీఘ్రమే మనుజుని వైకుంఠ లోకమునకు చేర్చగలడు. విశుద్ధభక్తుల యెడ అనుకూలుడై యుండు దేవాదిదేవుడగు శ్రీకృష్ణభగవానుని అచింత్యశక్తి అదియే.

ఈ శ్లోకములలో కపిలదేవుడు భక్తులు దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుని తమ ప్రాణముగా ఆశ్రయించిన తీరును వివరిస్తున్నాడు. మనం శ్రీకృష్ణుడిని కుమారుడి వలె ప్రేమించాలను కున్నచో, అతడు మనకు కుమారుడిగా మారుటకు సిద్ధపడును. అర్జునుడు శ్రీకృష్ణుడిని ప్రాణమిత్రునిగా అంగీకరించెను. మరియు శ్రీకృష్ణుడు అతనికి ప్రాణమిత్రుడు, ప్రతిఒక్కరు కూడ శ్రీకృష్ణుని ఏదోరకముగా అంగీకరించ వచ్చును. మనం అర్జునుడి వలె శ్రీకృష్ణుని ప్రేమించవచ్చును. లేదా యశోద వలె ప్రేమించవచ్చును. అదేవిధముగా, పరీక్షిత్తు మహారాజు కేవలం శ్రీకృష్ణుడి గురించి శ్రవణము చేస్తూ అతడిపై ప్రేమను పెంచుకొనెను. ప్రథమ శ్రేణికి చెందిన యోగి శ్రీకృష్ణుడిని ప్రియునిగా, పుత్రునిగా, సఖునిగా, గురువుగా సర్వముగా అంగీకరించును. ఇదే నిజమైన భక్తి. మనం పుత్రుడిని పొందాలను కొనినచో శ్రీకృష్ణుడు మనకు పుత్రుడగుటకు సిద్ధంగా ఉన్నాడు. మనకు ప్రేమికుడు కావాలను కొనినచో అతడు ప్రేమికుడగుటకు సిద్ధంగా ఉండును. మనం స్నేహితుడు కావాలను కొనినచో అతడు మనకు స్నేహితునిగా ఉండుటకు సిద్ధంగా ఉన్నాడు. భౌతిక లోకములో మనమెలాంటి సంబంధములను ఆశిస్తామో, వాటినన్నింటిని శ్రీకృష్ణుడి ద్వారా పొందవచ్చును. ఎందుకనగా, మనమందరము కొద్దిగా ప్రేమించే ప్రవృత్తిని కలిగి ఉంటిమి. కాబట్టి శ్రీకృష్ణుడు దీనిని నేరవేర్చుటకు సిద్ధంగా ఉన్నాడు. శ్రీకృష్ణుడు మనలాంటి సాధారణ వ్యక్తి కాదు. మనం ఒక శరీరమునే అక్రమించ

గలము. కాని శ్రీకృష్ణుడు శరీరము లన్నింటికి అధిపతి. శరీరమనేది శ్రీకృష్ణుడి ద్వారా ఇవ్వబడిన యంత్రము. ఈ భౌతిక లోకములో, తండ్రి తన కుమారుడికి కారును ఇవ్వచ్చును. అదేవిధముగా శ్రీకృష్ణుడు జీవులకు 84 లక్షల వివిధ రకాల శరీరములను ఇచ్చును. జీవాత్మ కారులో కూర్చొని అటు, ఇటు ప్రయాణించునట్లుగా మనం శరీరములలోకి ప్రవేశిస్తాము. శరీరమనే ఈ యంత్రమును మనమెన్నో సంవత్సరాలు నడిపించవచ్చును. కాని అది ఉపయోగపడనప్పుడు మనం మరో యంత్రములోకి మారుతుంటాము. జనన మరణముల ప్రక్రియ ఇదియే. మనం ఒక కారుని కొంతకాలం నడిపించగలము. చివరికి కారు ధ్వంసమై పనిచేయనప్పుడు లేదా కారు ప్రమాదం జరిగినను, జరగకున్నను చివరకు కారు పాత ఇనుప సామాన్ల కొట్టుకు పోవాల్సిందే. అప్పుడు మనం మరొక కారును తీసుకోవలసి వస్తుంది.

జన్మమృత్యువులు లేకుండుటయే మన నిజస్థితి. అయినను మనకెందుకు ఈ యంత్రములను ఆశ్రయించ వలసిన పరిస్థితి ఏర్పడినది? ఇదే మన నిజమైన సమస్య. దీనికి కారణము, మనము ఈ భౌతిక లోకమును దాని సంపదలు మరియు ఐశ్వర్యము లన్నింటితో కూడి ఆనందించా లనుకుంటాము. మనం భౌతిక సంపదల కొరకు ప్రాకులాడినంత వరకు జన్మమృత్యు చక్రమును అధిగమించ లేము. ఏమైనను, వీటన్నింటిని విడిచి కేవలం దేవాదిదేవుడైన శ్రీకృష్ణభగవానుని ఆశ్రయించి అతడిని మనము ఆరాధించవలెను. అతడిని మన ఇచ్ఛానుసారము కాకుండ అతడు ఇష్టపడునట్లుగా ఆరాధించవలెను. కాబట్టి శ్రీకృష్ణుడు : “నాకు ఒక గ్లాసు నీరుకావాలి” అనినచో మనం నీటిని మాత్రమే తీసుకురావలెను. “నీరు కంటె పాలు శ్రేష్ఠమని, నేను అతడికి పాలు తీసుకువెడతాను” అని భావించరాదు. ఇది అనుకూలమైన సేవకాదు. “నేను భగవంతుని నా ఇష్టంవచ్చిన రీతిలో పూజిస్తాను” అని భక్తులుగా పిలువబడే కొందరు చెబుతుంటారు. మాయావాదులు పరబ్రహ్మకు రూపం లేదంటూ ఏదైన రూపమును ఊహించు కొనుమని సూచిస్తుంటారు. ఇది కేవలం ఊహాగానము మాత్రమే. కాని శ్రీకృష్ణుడు అలా కాదు. శ్రీకృష్ణుడు తన నిజ స్వరూపమును కలిగి ఉన్నాడు, మరియు అతడు వైదిక సాహిత్యములలో వర్ణింపబడినాడు. ఈ విషయములను గురించి మేము పూర్వమే వివరించితిమి. మనం బ్రహ్మలాంటి శరీరమును పొందవలె ననుకున్నచో దానిని పొందవచ్చును. మనం మలములోని పురుగు శరీరమును పొందగోరినచో దానిని పొందవచ్చును. లేదా మనం శ్రీకృష్ణుడి లాంటి శరీరమును పొందగోరినచో

దానిని పొందవచ్చును. అది మన నిజమైన సచ్చిదానంద శరీరము. దేవతలవంటి శరీరమును కూడ మనం పొంది స్వర్గలోకములలోకి ప్రవేశించవచ్చును. లేదా మనం ఈ భూలోకములోనే ఉండిపోవచ్చును. మన ఇచ్ఛానుసారమే మనకు గమ్యం లభించును. మన కర్మల చేత మనకు పూర్తి స్వాతంత్ర్యము ఇవ్వబడినది. పుణ్యకర్మల ద్వారా స్వర్గలోకములకు మరియు కృష్ణచైతన్య కర్మల ద్వారా మనం వైకుంఠ లోకాలను చేరవచ్చును.

మనం శ్రీకృష్ణుడి అంశలము. కాని ఏదోవిధముగా ఈ విషయమును మనం విస్మరించాము. 'శ్రీ చైతన్య చరితామృతము'(మధ్యలీల 20.117) లో ఇలా చెప్పబడినది :

కృష్ణ బులి సేయ్ జీవ్ అనాది-బాహిర్ముఖ్
అతైవ మాయ తారె దెయ్ సంసార్-దుఃఖ్

"అనాది నుండి జీవుడు శ్రీకృష్ణుడిని విస్మరించి భౌతిక శక్తిపట్ల ఆకర్షితుడైనాడు. కాబట్టి మాయాశక్తి(భ్రాంతి) అతనికి ఎన్నో భౌతిక దుఃఖాలను కలిగించును." మనం శ్రీకృష్ణుని విస్మరించినందున శ్రీకృష్ణుడు మనకొరకు వేదాలను మరియు పురాణములను అందించెను. శ్రీకృష్ణుడు స్వయంగా అవతరించి తన గురించి గుర్తు చేయుట కొరకు ఈ భౌతిక లోకములో అవతరించును. ఈ కలియుగములోని జనులు శ్రీకృష్ణుని మరింతగా విస్మరిస్తున్నారు. వారు అతని పట్ల ఆసక్తిని కనపరచుట లేదు. కాని మనం శ్రీకృష్ణుడి పుత్రులమైనందున అతడు మనపట్ల శ్రద్ధను కనపరచును. పిచ్చివాడైన పుత్రుడు తన ఇంటి పట్ల, తల్లితండ్రుల పట్ల ఆసక్తిని కలిగి ఉండక పోవచ్చును. కాని అతడి పుత్రుడు గృహమును వీడి కష్టపడుతున్నాడు, కనుక తండ్రి ఎన్నడు తన కుమారుని పై గల శ్రద్ధను కోల్పోడు. అదే విధముగా, శ్రీకృష్ణుని పుత్రుడు ఆధ్యాత్మిక లోకమును విడిచి ఒకదాని తర్వాత మరొక భౌతిక శరీరమును అంగీకరిస్తున్నాడు. ఈ విధముగా ఒక లోకము నుండి మరోలోకానికి వివిధ జాతుల శరీరములలో సంచరిస్తుండును. కాబట్టి శ్రీకృష్ణుడు అతడిని సంరక్షించుటకు వచ్చును.

అధ్యాయము 17

పరమ నియంతయైన శ్రీకృష్ణుని శరణువేడుట

శ్లోకము 41

నాన్యత్ర మద్భగవతః ప్రధానపురుషేశ్వరాత్
ఆత్మనః సర్వభూతానాం భయం తీవ్రం నివర్తతే

సర్వశక్తిసంపన్నుడను, సమస్త సృష్టికి ఆది కారణమగు దేవాదిదేవుడను, సమస్త జీవులకు పరమాత్ముడైన నన్ను గాక అన్యమైన దానిని ఆశ్రయించిన వారలకు భయంకరమగు జన్మమృత్యు భయము ఏనాడును తొలగదు.

భాష్యము : భగవానునికి విశుద్ధభక్తుడు కానిదే జన్మమృత్యు వలయము ఆగదని ఇచ్చట సూచింపబడినది. కనుకనే : *"హరిం వినా నైవ సృతిం తరన్తి"* అని చెప్పబడినది. దేవాదిదేవుని అనుగ్రహమును బడయనిదే ఎవ్వరును జన్మమృత్యు వలయమును దాటలేరు. అదే విషయము ఇచ్చటను సమర్థింపబడినది : తన అసంపూర్ణమగు ఇంద్రియకల్పనము ద్వారా మనుజుడు పరమసత్యమును నెరిగే విధానమును చేపట్టవచ్చును లేదా యోగము ద్వారా ఆత్మానుభవమునకై యత్నింపవచ్చును; కాని ఎవరేది చేసినను దేవాదిదేవునికి శరణు నొందనిదే ఏ విధానము కూడా ముక్తి నొసగజాలదు. దీని భావము కఠిన నియమ నిబంధనలను అనుసరించుచు తపోధ్యానములను కావించువారు వృథాయత్నము కావించుచున్నారా అని ఎవరైనను ప్రశ్నించు నవకాశము కలదు. దానికి శ్రీమద్భాగవతము (10.2.32) నందు : *"యేఽ న్యేఽ రవిందాక్ష విముక్తమానినః"* అని సమాధానము తెలుపబడినది. భగవానుడు దేవకీదేవి గర్భము నందున్నప్పుడు బ్రహ్మాది దేవతలు ఈ విధముగా ప్రార్థించిరి : "ఓ అరవిందాక్షా! ముక్తులమైతిమని(భగవానునితో ఏకమైతిమని లేదా సాక్షాత్తుగా తాము భగవానుడేయని) తలంచుచు గర్వితులయ్యెడివారు పెక్కురు కలరు. ఆ రీతిగా గర్వించువారు, నిక్కముగా అల్పజ్ఞులే." వారి బుద్ధి(ఉన్నతమైనను లేదా గౌణమైనను) విశుద్ధమైనది కాదని అచ్చట తెలుపబడినది. విశుద్ధమగు బుద్ధి యందు జీవుడు శరణాగతికి అన్యమైనదానిని తలంపజాలడు. కనుకనే బుద్ధిమంతుడైనవాని యందే విశుద్ధబుద్ధి ఉదయించునని భగవద్గీత(7.19) ధ్రువపరచుచున్నది. *"బహూనాం జన్మనామన్తే జ్ఞానవాన్ మాం ప్రపద్యతే"* –

బహుజన్మల పిదప నిజముగా జ్ఞానవంతుడైనవాడే దేవాదిదేవుడైన శ్రీకృష్ణునకు శరణు నొందగలడు.

శరణాగత విధానము లేకుండా ఎవ్వరును ముక్తిని పొందలేరు. ఈ విషయమున శ్రీమద్భాగవతము ఇట్లు పలుకుచున్నది : "ఏవో కొన్ని భక్తిరహిత విధానములను చేపట్టి తమనుతాము ముక్తులమని తలచుచు గర్వితులయ్యెడి వారి బుద్ధి విశుద్ధమైనది కాదు. వారు నీకు శరణాగతులు కాకపోవుటయే అందులకు కారణము. పలువిధములగు తపోనిష్ఠలను ఆచరించి నప్పటికిని, బ్రహ్మానుభూతి వరకు అరుదెంచినప్పటికిని (బ్రహ్మజ్యోతి నందు నిలిచితిమని వారు తలచి నప్పటికిని) నిజముగా దివ్యసేవ లేని కారణమున వారు తిరిగి భౌతిక కర్మలలోనికి పతనము చెందుదురు." తాను బ్రహ్మమని తెలియుటతోనే ఎవ్వరును సంతృప్తి చెందరాదు; అతడు పరబ్రహ్మపు సేవలో నెలకొనవలెను. అదియే భక్తి. అనగా బ్రహ్మము యొక్క సేవ పరబ్రహ్మపు సేవయే కావలెను. బ్రహ్మము కానిదే మనుజుడు పరబ్రహ్మమును సేవింపజాలడని చెప్పబడినది. పరబ్రహ్మము దేవాదిదేవుడే. ఇక జీవుడు సైతము బ్రహ్మమే. తాను బ్రహ్మమును (ఆత్మను, భగవానుని నిత్యసేవకుడను) అనెడి అనుభూతి లేకుండ కేవలము బ్రహ్మమని తలచినచో మనుజుని భావన కేవలము సిద్ధాంతపరమైనది కాగలదు. అతడు ఆ భావనను అనుభూత మొనర్చు కొనుచు, అదే సమయమున దేవాదిదేవుని భక్తియుక్త సేవలో స్వయముగా నియుక్తుడు కావలెను. అప్పుడే అతడు బ్రహ్మభావనలో నిలువగలడు. లేనిచో పతనము తప్పదు.

కృష్ణచైతన్య రహితులైన వారు దేవాదిదేవుని పాదపద్మముల దివ్యమగు సేవను నిర్లక్ష్యపరుతురు కనుక వారి బుద్ధి శుద్ధమైనది కాదని శ్రీమద్భాగవతము తెలుపుచున్నది. తత్కారణమున వారు పతనము చెందుదురు. జీవుడు ఏదియోనొక కర్మ యందు నియుక్తుడు కావలసియే ఉండును. అతడు దివ్యసేవా కార్యక్రమమున నియుక్తుడు కానిచో లౌకిక కార్యములలోనికి పతనము చెందవలసినదే. లౌకిక కర్మలలోనికి పతనము చెందినందున జన్మమృత్యు వలయము నుండి విడుదల కలుగబోదు. కపిల భగవానుడు "నా కరుణ లేనిదే" *(నాన్యత్ర మద్భగవతః)* అని ఇచ్చట పలికినాడు. అతడు ఇచ్చట భగవానునిగా (దేవాదిదేవునిగా) పేర్కొన బడినాడు; ఆతడు షడ్గుణైశ్వర్య సంపూర్ణుడని ఈ విషయము సూచించుచున్నది. తత్కారణమున అతడు మనుజుని జన్మమృత్యు వలయము నుండి ఉద్ధరించుటకు పూర్ణముగా సమర్థుడై యున్నాడు. పరమపురుషుడైన కారణమున ఆతడు 'ప్రధానము'

అని కూడ పిలువబడెను. సర్వులయెడ సముడైనను తనకు శరణము నొందిన వాని యెడ ఆతడు ప్రత్యేక అనుగ్రహమును కలిగియుండును. భగవానుడు సర్వుల యెడ సమముగా వర్తించుననియు, ఆతనికి శత్రుమిత్రులు లేరనియు, భగవద్గీత (9.29) యందు నిర్ధారించబడినది. కాని తనకు శరణునొందిన వారి యెడ ఆ దేవాదిదేవుడు ప్రత్యేకముగా అనుగ్రహమును చూపును. అనగా కేవలము ఆతడిని శరణువేడుట ద్వారా(ఆ దేవాదిదేవుని కరుణచే) మనుజుడు జన్మమృత్యు వలయము నుండి బయటపడగలడు. లేనియెడల అతడు జన్మజన్మలుగా, అనేకమార్లు ఇతర ముక్తి విధానములను యత్నించవలసి వచ్చును.

ప్రస్తుతము మనమెంతటి మందబుద్ధి మరియు మూర్ఖత్వమును కలిగి ఉన్నామంటే, మనకు *'భయం'* మరియు *'తీవ్రం'* అంటే ఏమిటో తెలియదు. *'తీవ్రం'* అనే పదానికి గొప్ప భయంకరమైనదని మరియు *'భయం'* అనగా ' గొప్ప భయమును కలిగించేది' అని అర్థం. మనం తీవ్రమైన భయంలో చిక్కుకున్నాము. కాని మనం మాయ ప్రభావం చేత మందబుద్ధులమై దీనిని పట్టించుకొనుట లేదు. మరణ సమయములో అనేక బాధలుండును. కాబట్టి మనం తీవ్రమైన భయమునకు లోనగుదుము. కొన్నిసార్లు మానవుడు మరణసమయములో కోమాలోకి వెళ్ళి అచేతనుడై పోవును. అతడు ఎటువంటి భయంకర పరీక్షను ఎదుర్కొను చున్నాడో దానిని మనం అర్థం చేసుకోలేము. అతడు ఎన్నో కలలను కనుచుండును లేదా రోదించు చుండును. ఏమి జరుగుచున్నదో అతడు వ్యక్తపరచలేడు. పాపులైన వారు ప్రత్యేకించి ఆ విధముగా మరణిస్తుంటారు. మరణము తర్వాత మరోతల్లి గర్భములోకి ప్రవేశింప వలసి ఉంటుంది. అది గొప్ప భయంకరమైన పరిస్థితి. జీవుడు ఒక సంచిలో బంధింపబడి ఉండును, అంతేకాకుండ సంచి మలమూత్రము లతో నిండి ఉండును. మరియు ఇలా గాలి ప్రవేశించని సంచిలో జీవుడు తొమ్మిది నెలలు గడపవలసి వస్తుంది.

ఇది మహా భయంకరమైన పరిస్థితి, దీనినంతటిని మనం విస్మరిస్తున్నాము. ఈ 'జన్మమృత్యువు'లే నిజమైన సమస్యలనీ భగవద్గీత(13.9)లో శ్రీకృష్ణుడు తెలిపెను. జీవాత్మ గర్భంలో కదలలేని స్థితిలో ఉన్నపుడు, అతడు భగవంతుని ఈ విధముగా ప్రార్థించును : "దయచేసి ఈ దుస్థితి నుండి నాకు విముక్తిని ప్రసాదించండి. మీరు నన్ను విడుదల చేసినచో, నేను మిమ్ములను పూజించెదను." చివరకు, తొమ్మిదినెలల తర్వాత, జీవుడు గర్భం నుండి బయటపడును. బయటిలోక వాతావరణమును తట్టుకొనుటకు ప్రయత్నిస్తూ అతడు నా నా యాతనలను

అనుభవించును. శిశువు నిరంతరముగా రోదిస్తూ కేవలము తన తల్లి దయపైననే ఆధారపడి ఉండును. కొన్నిసార్లు పిల్లవాడు ఎందుకు ఏడుస్తున్నాడో తల్లి అర్థం చేసుకోలేక పోవును. కొన్నిసార్లు చీమ కరచినను, శిశువు ఆకలి వలన రోధిస్తున్నాడని తల్లి భావిస్తుంది. ఈగలు, కీటకాలు, దోమలు, మలము, మూత్రము వంటివి ఆ నూతన శరీరమును బాధించును. ఇవన్నీ త్రివిధ క్లేశములు. అయినను మనం ఎంతో పురోభివృద్ధిని సాధించితిమని భావిస్తుంటాము. ప్రతిక్షణము ఒకదాని తరువాత ఒకటిగా ఎన్నోబాధలకు మనము గురవుతుంటాము. అయినను జనులు జన్మమృత్యు జరావ్యాధి విషయాలలో కన్నులు మూసుకొని ఉంటారు. ఈ బాధల నన్నింటిని నాస్తికులు విస్మరిస్తుంటారు. అందుకే వారు మరణం తర్వాత తిరిగి జన్మ ఉండదను కొనుటకు ఇష్టపడుతుంటారు. వారు ఉష్ట్రపక్షి వంటివారు, శత్రువు దండయాత్ర చేసినప్పుడు, అవి వాటి తలలను భూమిలోనికి దూరుస్తుంటాయి.

శ్రీకృష్ణుడిని పూజించుతునని జీవుడు గర్భంలో ఉన్నప్పుడు ప్రమాణము చేసినను, అతడు గర్భంనుండి విడుదల పొందిన తర్వాత అతని ప్రమాణమును నిలుపుకోడు. అతడు జన్మించి పెరిగి పెద్దవాడైన తరువాత అతడు మంచి బ్యాంకు నిలువలను భార్యను మరియు సంతానమును పొందుటను ప్రారంభించును. అంతేకాకుండ, తమ సమస్యలు పరిష్కారమైనచో తాను ఆనందముగా జీవించ గలుగుదునని భావిస్తుంటాడు. నిజానికి అతడి సమస్యలెన్నడు పరిష్కరించబడవు. అతడు తాత్కాలిక సదుపాయాలను కలిగి ఉండినప్పటికిని ప్రధాన సమస్య అలాగే నిలచి ఉంటుంది. ప్రతిక్షణం, ప్రతి నిమిషం, జనులు మరణిస్తూ యమరాజు వద్దకు వెళ్ళుతున్నారు. కాని జీవించి ఉన్నవారు తాము మరణించబోమని భావిస్తుంటారు. వారి స్నేహితులు మరణించుటను చూస్తున్నను వారు మాత్రము ఏదోవిధముగా శాశ్వతముగా జీవించుదుమని భావిస్తుంటారు. ఈ లోకములో ఇదే అత్యంత ఆశ్చర్యకరమైన విషయమని యుధిష్ఠిర మహారాజు తెలిపెను. ఇతరులందరు మరణిస్తున్నను తాము మరణించమని భావించుట.

ఏ శరీరమును పొందినను తాను ఆనందముగానే జీవిస్తామని జీవాత్మ భావించును. అతడు కుక్క శరీరమును లేదా పిల్లి శరీరమును పొందినను, అతడు ఆ శరీరములో అనందముగా ఉంటూ దానిని వదులుకో దలుచుకోడు. ఇదే భ్రమ. ఒక చీమ ప్రమాదమును పసిగట్టినప్పుడు అది ఎంతో వేగంగా పరిగెత్తును. ఎందుకనగా, అది తన శరీరమునకు విలువనిస్తూ దానిని పోగొట్టుకొనుటకు ఇష్టపడదు. స్వర్గలోకాధిపతియైన ఇంద్రుడు ఒకసారి తన గురువైన బృహస్పతి

చేత పందిగా మారమని శపించబడినాడు. అతడు భూలోకానికి వచ్చి ఇక్కడ తన పంది శరీరమును అనుభవించసాగాడు. చివరకు బ్రహ్మవచ్చి అతనితో ఇలా పలికెను: "నా ప్రియమైన ఇంద్రా! నీవు అనుభవించిన బాధలు చాలును. నీవిప్పుడు, మాతో వచ్చి నీ స్వర్గలోకమునకు తిరిగి చేరుకొనుము." "నేను ఎచ్చటికి రావలెను?" అని పంది శరీరంలో గల ఇంద్రుడు అడిగెను."స్వర్గానికి" అని బ్రహ్మ బదులిచ్చాడు. అప్పుడు ఇంద్రుడు, లేదు నాకు నా కుటుంబము మరియు సంతానము కలదు. నేను ఎంతో ఆనందముగా ఉన్నాను. నన్ను ఇక్కడనే ఉండనివ్వండి అని ఇంద్రుడు పలికెను. ఈ విధముగా ప్రతిఒక్కరు భయంకరమైన విపత్కర పరిస్థితిలో ఉన్నను, ప్రతిఒక్కరు తాము ఆనందముగా ఉన్నామని భావిస్తున్నారు. ఏమైనను, నిజమైన బుద్ధిగలవాడు తాను నిజానికి ఆనందముగా లేడని మరియు బాధలకు గురవు తున్నాడని అర్థం చేసుకోగలడు. అజ్ఞానము ఆనందముగా భావించబడినది, కాని ఇది పంది అనుభవించెడి ఆనందము. జీవుడు తాను నిజముగా ఈ భౌతిక లోకములో ఆనందముగా లేనని అర్థం చేసుకొనినప్పుడు అతడు తన బాధలకు ఉపశమనమును పొందును.

శ్రీకృష్ణుని పాదపద్మములను ఆశ్రయించకుండ బాధల నుండి విముక్తి పొందుటమనేది సాధ్యపడదు. జనులు గర్భస్రావముతో శిశువును గర్భంలో చంపుట వలన బాధలకు ఉపశమనము కలిగించునని భావిస్తుంటారు. ఈ విధముగా వారు ఒక పాపము తర్వాత మరొక పాపమును చేస్తూ మరింతగా బంధములలో చిక్కుకు పోతున్నారు. తత్ఫలితముగా గర్భస్రావము చెందిన శిశువు జన్మించాలనే కర్మను కలిగి ఉండుట వలన, అది మరొక తల్లి గర్భములోకి ప్రవేశించును. మరో తల్లి గర్భములోనికి ప్రవేశించినను అతడు తిరిగి చంపబడవచ్చును. ఈ విధముగా ఎన్నోసంవత్సరాల వరకు అతడు సూర్యుని వెలుగును చూడలేక పోవచ్చును. కలియుగములోని జనులు పాపకార్యాలలో ఎంతగా మునిగి పోతున్నారంటే, కృష్ణచైతన్యమును అంగీకరించనంత వరకు వారు రక్షింపబడలేరు. మానవ సమాజమంతయు మాయ అనే అగ్నిలో పడిపోవుచున్నది. జనులు మిడుతల వలె అగ్నిలోనికి ప్రవేశిస్తున్నారు. అందమైన మంటలు కనపడినచో మిడుతలు ఎంతో దూరము నుండి వచ్చి మంటలలో ప్రవేశించి ఫప్, ఫప్, ఫప్ అని మరణించును. ఈ విధముగా మానవుడు మరణిస్తూ, తిరిగి జన్మించి తిరిగి దుఃఖములను అనుభవించి తిరిగి మరణించును.

ఏమైనను, శ్రీకృష్ణుడు మరియు అతని భక్తులు ఎంతో దయకలిగిన వారు

భౌతిక లోకములోని దుఃఖము లన్నింటిని చూసి బాధపడుదురు. శ్రీకృష్ణుడు సమస్త జీవులకు తండ్రి, మరియు తమ కుమారులు దుఃఖించుటను చూసి అతడు బాధపడును. కాబట్టి శ్రీకృష్ణుడు అవతరించి ఇలా బోధించును : "ఈ బూటకపు ఆనందమనబడే దానిలో మీరెందుకు చిక్కుకొను చున్నారు? వీటినన్నింటిని విడిచి నన్ను శరణువేడుము. నేను మీకు ఉపశమనమును కలిగించుదును. అప్పుడే మీరు శాశ్వతముగా జీవించగలరు. మీ కోరికలన్నీ తీరును, అంతేకాకుండ, దేని చేతను దుఃఖింపబడరు." దీనికోసమే శ్రీకృష్ణుడు అవతరించును. నిజానికి భగవానుడికి ఇక్కడ చేయవలసిన కార్యములంటూ ఏమి లేవు. ఎందుకంటే, అతడి ప్రతినిధియైన ప్రకృతి అన్నింటిని చేయును. అయినను కృపతో శ్రీకృష్ణుడు తన దివ్యస్వరూపముతో వచ్చును. లేదా కపిలదేవునిగా అవతరించును. శ్రీకృష్ణుడు తన ప్రతినిధిని పంపును. అతడు వచ్చి "మూర్ఖుడా! కేవలం శ్రీకృష్ణుని శరణుపొంది ఆనందించుమని చెప్పును."

ఈ భూమిపై సుఖముగా నున్నామని భావించు మూర్ఖపు జనులకు జ్ఞానోదయమును కలిగించుటకు శ్రీకృష్ణుడు బ్రహ్మ యొక్క ఒకరోజులో ఒకసారి వచ్చును. అంతేకాకుండ అతడి అవతారములు కూడ అవతరించును. భగవంతుని పట్ల శుద్ధమైన ప్రేమతో కూడిన భక్తియుక్త సేవయైన సాంఖ్య శాస్త్రమును స్థాపించుటకు కపిలుడు అవతరించెను. భగవంతుని శరణువేడనంత వరకు జీవులు తప్పక మరణించవలసియే ఉండునని కపిల దేవుడిక్కడ చెబుతున్నాడు. ఇక్కడ రక్షింపబడుటకు జీవులకు మరొక మార్గం లేదు. మనమందరము భయంకరమైన పరిస్థితిలో చిక్కుకునినను మనం దీనిని అర్థం చేసుకోలేకున్నాము. మాయ ప్రభావము వలన మనం ఆనందముగా ఉన్నామని భావిస్తుంటాము. కాని ఇది సత్యం కాదు. మన ఈ భయంకర పరిస్థితి నుండి మనము విముక్తి పొందదలచినచో వెంటనే దేవాదిదేవుడిని శరణువేడవలెను. అతనితో మనకు గల పాత సంబంధమును తిరిగి స్థాపించుకోవాలి. ఆ సంబంధము ఏమిటి? మనమందరము అతని శాశ్వత సేవకులము. మనం భగవంతునితో సమానము కాని లేదా భగవంతుల మవుతామని కాని మూర్ఖంగా భావించరాదు. ఇదంతయు మూర్ఖత్వమునకు ఫలితము. మనం శ్రీకృష్ణుని శాశ్వత పుత్రులము, మరియు సేవకులమని అర్థం చేసుకొనుటయే జ్ఞానం యొక్క ప్రారంభ దశ. సేవకునికి, పుత్రునకు మధ్య తేడా లేదు. సేవకుడు యజమానిని సేవించిన విధముగా కుమారుడు తండ్రికి సేవ చేయును. తండ్రి మరియు కుమారుని మధ్య, యజమాని

మరియు సేవకుని మధ్య ప్రేమ ఆప్యాయతలు ఉండును. తండ్రి కూడ కుమారుడిని ఎన్నో విధములుగా సేవించును. అందుకే ఆ సంబంధము ఇచ్చిపుచ్చుకోబడును. మన నిజస్థితి గుర్తింపు అనునది శాశ్వత సేవకుని వంటిదని శ్రీ చైతన్య మహాప్రభువు వివరించెను. "నేను స్వాతంత్రుడను, నేను ఎవరి సేవకుడను కాదు. నేను భగవంతుడ నయ్యాను, నేను ఇది, నేను అది" అని జనులు కృత్రిమంగా భావిస్తుంటారు.

భౌతిక లోకములో ఎవరికో సేవకునిగా ఉండుటమనేది గొప్ప ఆనందమును కలిగించదు. భగవంతుడికి సేవకుడిగా ఉండుటమనేది ఏదో వ్యక్తికి సేవకునిగా ఉండుట వంటిదని భౌతికముగా రోగగ్రస్తుల మైనందున భావిస్తుంటాము. కాని ఆధ్యాత్మికజగత్తులో సేవకుడు మరియు యజమాని ఇద్దరు సమానులే. ఉదాహరణకు గురువు శ్రీకృష్ణుని సేవకుడైనను అతడు శ్రీకృష్ణునిగా అంగీకరించబడును.

సాక్షాద్ధరిత్వేన సమస్తశాస్త్రైః
ఉక్తస్తథా భావ్యత ఏవ సద్భిః
కింతు ప్రభోర్యః ప్రియ ఏవ తస్య
వందే గురోః శ్రీచరణారవిందమ్

"శ్రీ గురుదేవులు భగవంతునికి అత్యంత అంతరంగిక సేవకులగుట చేత, వారిని భగవంతుని ప్రతినిధిగా గౌరవించవలెను. ఈ విషయమును శాస్త్రములు మరియు ప్రామాణిక సాధువులందరు కూడ ధ్రువీకరించారు. అటువంటి శ్రీహరి విశుద్ధ ప్రతినిధియైన శ్రీ గురుదేవుల పాదపద్మములకు నా గౌరవపూర్వక ప్రణామములు." (గుర్వాష్టకము 7) శాస్త్రములన్నింటి సారమిదే. "నేను శ్రీకృష్ణుడను, నేను భగవంతుడను, నేను భగవానుడను" అని గురువు ఎన్నడు తెలుపడు. అలాకాకుండ గురువు : "నేను భగవంతుని దాసుని యొక్క దాసుని యొక్క వినమ్రుడైన దాసుడను" అని తెలుపును. తాను భగవంతునకు ప్రత్యక్ష సేవకుడనని కూడ తెలుపడు. అంతేకాకుండ అతడు ఎన్నోవేల దాసులందరి తర్వాత తానని భావిస్తాడు. *"గోపీభర్తుః పదకమలయోర్ దాసదాసానుదాసః"* మనం ప్రత్యక్షంగా భగవంతునికి సేవకుల మగుటకు ప్రయత్నించరాదు. ఎందుకనగా ఇది సాధ్యపడదు. మొట్టమొదట మనం దాసదాసాను దాసులము కావలెను. గురువు శ్రీకృష్ణుని సేవకుడు మరియు మనము అతని సేవకులమైనప్పుడే నిజమైన ప్రామాణిక సేవకులము కాగలము. అదే మన నిజస్థితి. అందుకే శ్రీ చైతన్య మహాప్రభువు ఇలా ప్రార్థిస్తున్నాడు :

అయి నందతనుజ కింకరం పతితం మాం విషమే భవాంబుధౌ

"ఓ! నంద మహారాజ కుమారా, నేను నీ శాశ్వత సేవకుడను కాని ఏదో విధముగా నేను ఈ జన్మమృత్యుసాగరములో పడిపోయితిని."(శిక్షాష్టకము 5) శ్రీ చైతన్య మహాప్రభువు భగవంతుడిని నంద మహారాజ పుత్రుడని సంభోదిస్తున్నాడు. ఎవరైనను తనను వాసుదేవుని కుమారునిగా, యశోద లేదా నంద కూమారునిగా సంబోధించి నప్పుడు శ్రీకృష్ణుడెంతో ఆనందించును. శుద్ధభక్తుల నామములతో పిలువబడుటకు శ్రీకృష్ణుడు ఇష్టపడును. అందుకే అతడిని యశోద నందన, నంద నందన, వసుదేవ నందన, రాధిక రమణ మొదలగు నామములతో పిలువబడును. కాబట్టి శ్రీ చైతన్య మహాప్రభువు అతడిని ఆ విధముగానే సంబోధిస్తున్నాడు. అతడు శ్రీకృష్ణుని శాశ్వత సేవకు డైనప్పటికినీ, ఏదోవిధముగా ఈ జన్మమృత్యువనే సంసార సాగరములో పడిపోయి, ఒక దాని తర్వాత మరొక శరీరములను అంగీకరిస్తూ, తిరిగి జన్మిస్తూ, మరణిస్తూ ఈ లోకములోనే కాకుండ విశ్వమంతటా ఎన్నో జీవరాసుల శరీరములలో జన్మిస్తున్నాడని తెలుపుచున్నాడు. బద్ధజీవుల పరిస్థితి ఇది. కొన్నికోట్ల సంవత్సరములుగా జీవి ఒక జన్మ నుండి మరోజన్మకు, ఒక లోకము నుండి మరోలోకమునకు పరిభ్రమిస్తూనే ఉండును. మనం దీనిని పరిగణించము. ఎందుకనగా, మనం ధైర్యవంతులమని మరియు భయమనేది తెలియదని చెప్పుకుంటూ గర్విస్తుంటాము. కాని ఇది మూర్ఖత్వముతో కూడిన గర్వం. "ఎక్కడైతే కాలుపెట్టటానికి దేవతలు కూడ భయపడుతారో అక్కడికి మూర్ఖులు పరుగెత్తుదురు" అని చెప్పబడినది. ఈ భయంకర పరిస్థితి నుండి మనలను మనం రక్షించుకొనుట కొరకు దేవాదిదేవుడిని శరణు వేడవలెనని శాస్త్రములన్నీ తీర్మానించెను. మరియు ఈ ఉద్దేశ్యము కొరకు శ్రీకృష్ణుడు స్వయంగా అవతరించును. లేదా అతడు కృష్ణ చైతన్య ఉద్యమమును ప్రచారము చేయుట కొరకు రాత్రింపగళ్ళు కష్టపడునట్టి తన ప్రతినిధులను పంపును.

శ్లోకము 42

మద్భయాద్వాతి వాతోऽ యం సూర్యస్తపతి మద్భయాత్
వర్షతీన్ద్రో దహత్యగ్నిర్మృత్యుశ్చరతి మద్భయాత్

నా ఆధిపత్యము కారణముననే భయము వలన వాయువు వీచుచున్నది; నా భయము వలననే సూర్యుడు ప్రకాశించుచున్నాడు; నా భయము వలననే మేఘరాజగు ఇంద్రుడు వర్షము కురిపించుచున్నాడు; నా భయము వలననే అగ్ని

దహించుచున్నది; నా భయము చేతనే మృత్యువు చరించుచున్నది.

భాష్యము : తన అధ్యక్షత యందే ప్రకృతి నియమములు తమ కార్యములను చక్కగా నెరవేర్చుచున్నవని దేవాదిదేవుడగు శ్రీకృష్ణుడు భగవద్గీత యందు తెలియ జేస్తున్నాడు. ఎటువంటి అధ్యక్షత లేకనే ప్రకృతి అప్రయత్నముగా పనిచేయుచున్నదని ఎవ్వరును భావించరాదు. మేఘములు ఇంద్రునిచే నియమింప బడుననియు, ఉష్ణము సూర్యునిచే ఒసగబడుననియు, చల్లని చంద్రకాంతి చంద్రునిచే ప్రసరింప బడుననియు, వాయువు వాయుదేవుని ఏర్పాటుచే వీచుననియు శాస్త్రములందు తెలుపబడినది. ఈ దేవతలందరికి దేవాదిదేవుడు ప్రధానుడు : *"నిత్యోఽ నిత్యానాం చేతనాశ్చేతనానామ్."* దేవతలు కూడా సాధారణ జీవులే. అయినను వారికి గల శ్రద్ధ కారణమున(వారి భక్తియుక్త సేవ కారణమున) వారికి ఆ పదవులు ఒసగ బడినవి. చంద్రుడు, వరుణుడు, వాయువు మొదలగు వివిధ దేవతలు (నిర్దేశకులు) "అధికార దేవతలు" అని పిలువ బడుదురు. వారు ఆయా శాఖలకు అధిపతులు. భగవానుని ప్రభుత్వము ఒకటి లేక రెండు లోకములను గాక కోట్లాది లోకములను, కోట్లాది విశ్వములను కూడియున్నది. దేవాదిదేవుని ప్రభుత్వము అత్యంత గొప్పది. కనుక అనేకమంది సేవకులు ఆతనికి అవసరము. దేవతలు ఆతని దేహాంగములుగా పరిగణింపబడిరి. వేదవాఙ్మయమున ఈ విషయము లన్నియును వర్ణితమైనవి. ఈ విధముగా సూర్యదేవుడు, చంద్రదేవుడు, అగ్నిదేవుడు, వాయుదేవుడు దేవాదిదేవుని అధ్యక్షతలో పనిచేయుచున్నారు. ఇదే విషయము భగవద్గీత(9.10)లో : *"మయాధ్యక్షేణ ప్రకృతిః సూయతే స చరాచరమ్"* అని ధ్రువపరుప బడినది. ప్రకృతి నియమము లన్నియును అతని అధ్యక్షతన యందే నెరవేర్చబడుచున్నవి. దేవాదిదేవుడు పూర్వరంగము వలె ఉన్న కారణమున ప్రతిదియు నియమబద్ధము గాను, సక్రమముగాను ఒనగూడుచున్నది.

దేవాదిదేవునికి శరణాగతుడైనవాడు అన్నిరకాల ప్రభావముల నుండి సంపూర్ణముగా రక్షింపబడును. అతడు ఇక మరెవ్వరిని సేవింపడు లేదా మరెవ్వరికిని ఉపకారబద్ధుడై యుండడు; అలాగని ఎవ్వరి యెడను అగౌరవమును కూడా చూపడు. కాని అతని ఆలోచనాశక్తి అంతయు దేవాదిదేవుని సేవ యందే సంలగ్నమై యుండును. తన నిర్దేశమందే వాయువు వీచుచున్నది, అగ్ని జ్వలించుచున్నది, సూర్యుడు ప్రకాశించుచున్నాడు అనెడి దేవాదిదేవుడైన కపిలుని వచనములు ఏవో అభిప్రాయ వాదములని భావించరాదు. భాగవతపు భక్తులు ఎవరో ఒకరిని

దేవాదిదేవునిగా ఊహించి ఆతనికి అనేకమగు యోగ్యతలు కట్టబెట్టుదురని నిరాకారవాదులు పలుకుచుందురు; కాని వాస్తవమునకు అది ఊహగాని, కృత్రిమమగు శక్తిని దేవాదిదేవుని నామమున చొప్పించుట గాని కాదు. తైత్తిరీయోపనిషత్తు (2. 8. 1) లో కూడా : *“భీషాస్మాద్ వాతః పవతే/భీషోదేతి సూర్యః”* – “దేవాదిదేవుని భయము వలననే వాయుదేవుడు, సూర్యదేవుడు పని చేయుచున్నారని తెలుపబడినది.” *“భీషాస్మాద్ అగ్నిశ్చేంద్రశ్చ / మృత్యుర్ధావతి పంచమః”* – “అగ్ని, చంద్రుడు, మృత్యువు సైతము ఆతని నిర్దేశమందే వర్తించు చున్నారు.” ఇవే వేద వచనములు.

దేవతలే భయానికి లోనైతే, ఇక సాధారణ జీవాత్మల సంగతి చెప్పేదేముంది? మనం ఎల్లప్పుడు ఏదోదాని చేత భయపడవలసి ఉండును, కాబట్టి భౌతిక జీవనము ఆనందముతో కూడినది కాదు. ఎవరు కూడ “నేను దేనికి భయపడను” అని చెప్పలేరు. ప్రతిఒక్కరు దేనికో ఒకదానికి భయపడుతుంటారు. ఒక పక్షి, జంతువు, మానవుడు లేదా జీవించి ఉన్న ఏ జీవరాశియైనను దేనికో ఒకదానికి భయపడు తుండును. “నేను ఈ శరీరము”ను అని ఈ దేహాత్మబుద్ధిని కలిగి ఆలోచించుటయే దీనికి కారణము. ఈ విధముగా భావించుట వలననే శరీరము నశించునని చెప్పినప్పుడు జనులు భయగ్రస్తులౌతారు. లాస్ ఏంజెల్స్‌లో భూకంపము సంభవించి నప్పుడు, అందరు కేకలు వేసుకుంటూ ఇంటి నుండి బయటకు పరుగెత్తసాగిరి. “ఇప్పుడు మరణం అసన్నమైనది” అని అందరు భయ భ్రాంతులకులోనై ఆలోచింప సాగిరి. ఇది భౌతిక ప్రకృతి. ప్రకృతిలోని సంఘటనలెన్నో మనకు భయాందోళనలను కలిగించును. తీవ్రమైన గాలివానలు, తుఫానుల వంటివి ఎన్నోకలవు. అధిక ఉష్ణోగ్రత మరియు అధికమైన వర్షపాతము, వరదలు, కరువు కాటకములు, మరియు యుద్ధములు ఉన్నప్పటికినీ ఈ లోకంలో ఆనందముగా జీవిస్తామని జనులు భావిస్తుంటారు.

ఆధునిక శాస్త్రవేత్తలు దేవతలు గాని మరియు భగవంతుడు అంటూ ఎవరూ లేరని, ఆ సంఘటనలన్నీ ప్రకృతి వలన సంభవిస్తున్నవని చెబుతుంటారు. ప్రకృతి పని చేయుచున్నదనుట సత్యం. భౌతిక ప్రకృతి అనేది జడ పదార్థము మాత్రమే. జీవాత్మ నిర్దేశకత్వం లేకుండ జడ పదార్థం స్వతంత్రంగా పని చేయదు. జడ పదార్థము స్వతంత్రంగా పని చేయుచున్నదని మనం చెప్పలేము. సముద్రము పెద్ద అలలను కలిగి ఉండుటను మనం చూడవచ్చును. నీరు అనేది జడ పదార్థం కాని గాలి ఆ అలలను త్రోస్తూ భూమిపైకి నెట్టి వేయుచున్నది. ప్రకృతి ఈ విధముగా

లేదా ఆ విధముగా పని చేయుచున్నదని శాస్త్రజ్ఞులు చెబుతుంటారు. కాని ప్రకృతి స్వాతంత్ర్యమైనది కాదు. ప్రకృతి అనేది దేవతల నిర్దేశకత్వములో పని చేయు చున్నదనీ, ప్రామాణిక శాస్త్రముల నుండి మనము సమాచారమును పొందు తున్నాము. కాబట్టి ఈ ప్రక్రియలన్నీ సహజముగానే కొనసాగుచున్నవని మనం చెప్పలేము. ప్రకృతి అద్భుతముగా పనిచేయుచున్నదని శాస్త్రజ్ఞులు చెబుతుంటారు. కాని ప్రకృతి అనేది వారి ఆధీనములో లేదు. శ్రీకృష్ణుడిని శాస్త్రజ్ఞులు అంగీకరించి నను తిరస్కరించినను ప్రకృతి క్రియలను ఏ మాత్రం తిరస్కరించ లేరు. అందరు ప్రకృతికి లోబడే ఉంటారు. ఏమైనను ప్రకృతి భగవంతుని ఆధీనములో పని చేయుచున్నది. కాబట్టి ప్రతిఒక్కరు భగవంతుని ఆధీనులే.

సూర్యుడు, సముద్రములు, భూమి, ఆకాశము మరియు ఈ భౌతిక సృష్టిలోని సమస్తము శ్రీకృష్ణుని బహిరంగ శక్తి యొక్క సృష్టి మాత్రమే. సర్వం శ్రీకృష్ణుడు మరియు అతని శక్తికి లోబడినవే. 'బ్రహ్మ సంహిత'(5.44) లో భౌతిక ప్రకృతి అనేది ఎంత గొప్పదనగా అది సృష్టించగలదు, పాలించగలదు. మరియు దానిలోనే లయం చేసుకోగలదని చెప్పబడినది : *"సృష్టిస్థితిప్రళయసాధనశక్తిరెకాః"* ఏమైనను భౌతిక ప్రకృతి అనునది ప్రతిబింబము వలె పనిచేయుచున్నది. మనం మన చేతిని కాంతి ముందు పెట్టినప్పుడు దాని ఛాయను గోడపైన కదులుటను మనం చూడవచ్చును. అదే విధముగా భౌతిక ప్రకృతి పరమాత్మ యొక్క స్పర్శ వలన పని చేయుచున్నది. మోటారుకారు తనకుతాను నడవలేదు. జీవుడు తప్పక అందులో ఉండి మీటను నొక్కవలసి వచ్చును. జీవాత్మ యొక్క స్పర్శవలన యంత్రము నడుస్తున్నది. అలాగే జీవాత్మ దానిలో ఉండి మీటను నొక్కినప్పుడే ఆ యంత్రము కదులును. అలాగే సృష్టి అంతయు భగవంతుని స్పర్శ వలననే ఆ విధముగా కదులుచున్నది. దేవాదిదేవుని నిర్దేశకత్వములో గాలి వీస్తున్నదని, నీరు కదులు చున్నదని, సూర్యుడు వెలుగుచున్నాడని మరియు భూమి తిరుగుచున్నదని శాస్త్రాను సారము తెలుపబడినది. ఒకవేళ భౌతిక మూలకాల నిర్దేశకులు సరిగ్గా పని చేయనిచో వారు యజమానియైన శ్రీకృష్ణుని చేత శిక్షింపబడుదురు.

వర్షములకు అధిపతియైన స్వర్గాధిపతి ఇంద్రదేవుడు గర్వించుటను శ్రీకృష్ణుడు భూమిపై అవతరించినప్పుడు గమనించెను. కాబట్టి శ్రీకృష్ణుడు తన తండ్రియైన నంద మహారాజుతో ఇంద్రుడిని పూజించ నవసరము లేదని సూచించెను. "ఇంద్రుని కొరకు యజ్ఞం చేయవలసిన అవసరము లేదు, భగవంతుని ప్రతినిధియైన గోవర్ధన పర్వతమును పూజించుట మేలు, ఆవులు వాటి గడ్డి మరియు

ధాన్యాలను గోవర్ధన పర్వతము నుండి పొందును. కాబట్టి దానిని పూజించుట మేలు" అని తండ్రితో అతడు పలికెను. ప్రారంభములో నందమహారాజు ఇలా చేయుటకు సుముఖముగా లేకుండెను. కాని శ్రీకృష్ణుని పై గల ప్రేమ చేత చివరకు ఒప్పుకొనెను. నందమహారాజు గోవర్ధన పర్వతమును పూజించుటను ఇంద్రుడు చూచి కోపోద్రేకుడై వృందావన మంతయు మునిగి పోవునట్లుగా తుఫాన్‌ను సృష్టించుటకు భయంకరమైన మేఘములను పంపెను. కాని శ్రీకృష్ణుడు ఇంద్రుడి శక్తి అంతయు తన ఎడమచేతి చిటికెన వ్రేలికి కూడ సరిపోదని గోవర్ధన పర్వతమును ఎత్తెను. మరియు ఇంద్రుని తీవ్ర వర్షఘాతముల నుండి వృందావన వాసులను రక్షించుటకు గోవర్ధన పర్వతమును గొడుగులా వాడెను. ఇదంతయు భాగవతములో వర్ణించబడెను.

ఆ విధముగా ప్రతిఒక్కరు సేవకులే. ఎవరూ కూడ తాము యజమానులమని వాదించలేరు. మనము శ్రీకృష్ణుని శరణు పొందినప్పుడు వివిధ దేవతల తృప్తికొరకు కర్మలను చేయవలసిన అవసరము లేదు. మనం చెట్టు మూలమునకు నీరు అందించినప్పుడు, ప్రత్యేకించి కొమ్మలకు చిగుళ్ళకు, పుష్పములకు, లేదా ఫలములకు నీరును అందించవలసిన అవసరము లేదు. మనం మన పొట్టకు ఆహారమును అందించినప్పుడు మన కళ్ళకు, చేతులకు, మరియు కాళ్ళకు విడిగా ఆహారమును అందించవలసిన అవసరము లేదు. అదేవిధముగా, మనము అన్నింటికి పరమాధారమైన శ్రీకృష్ణుని పూజించినప్పుడు మరే ఇతర దేవత పూజ అవసరము లేదు.

యజ్ఞములను నిర్వహించుటకు పెద్ద మొత్తంలో ధనమవసర ముండును. పూర్వం యజ్ఞములలో వందల కిలోల కొద్ది ఆహారమును సమర్పించేవారు. కాని ఈ యుగములో ఇది సాధ్యపడదు. కాబట్టి సంకీర్తన యజ్ఞమనగా, 'హరేకృష్ణ' మహామంత్ర కీర్తన. కాబట్టి అదే ఈ యుగమునకు ఆదేశించబడినది. ఎవరైనను, 'హరేకృష్ణ' కీర్తనను చేయవచ్చును. శ్రీ చైతన్య మహాప్రభువు మృదంగ వాద్యమును మరియు కరతాళాలను పరిచయము చేసినను, ఏ విధమైన వాయిద్యముల అవసరము లేకున్నను హరేకృష్ణ సంకీర్తనను చేయవచ్చును. కేవలం చప్పట్లు చరిచినను సరిపోవును. ఎవరైనను తమ కుటుంబ సభ్యులతో కూర్చొని చప్పట్లను చరుస్తూ, "హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే / హరే రామ హరే రామ రామ రామ హరే హరే" అని కీర్తించవచ్చును. ఈ సంకీర్తనను ఆచరించుట ఎంతో సులువు. సాయంత్రపు వేళలో జనులు చలనచిత్రాలకు లేదా హోటళ్ళకు

వెళ్ళివారి సమయమును మరియు డబ్బును క్లబ్బుల వద్ద మరియు నృత్యాల కొరకు వృథా చేస్తుంటారు. వారు జన్మ, వృద్ధాప్యము, రోగాలు, మరియు మరణము వంటి భయంకర పరిస్థితుల గురించిన అవగాహనను కలిగి లేరు. జనులు భౌతిక ప్రకృతి అలలలో పడికొట్టుకుపోతూ దాని నియమాలకు లోనగుదురు. ఈ విలువైన మానవ దేహంలో మనకు గల సమయమును వృథా చేసుకోరాదు. కాని మన సమస్యల నన్నింటిని పరిష్కరించు కొనుటను ప్రారంభించ వలెను.

చివరకు ఈ భూమిపై గల సమస్తము నశించును. ప్రస్తుతము మూడు వంతుల భాగం నీటితో కప్పబడి ఉంది. ప్రారంభములో భూమి పూర్తిగా నీటితో కప్పబడి ఉండెను. కాని క్రమంగా నీరు ఎండిపోవుట వలన భూమి పైకి వస్తున్నది. భూమి పైకి వచ్చినది కనుక మనం దానిని ఆసియా ఖండముగా ఇది ఉత్తర అమెరికాగా, దక్షిణ అమెరికాగా, ఆఫ్రికా అంటూ లెక్కిస్తున్నాము. చివరకు నీరు పూర్తిగా లేకుండ ఎండిపోవును. కేవలం భూమి మాత్రమే మిగిలిపోవును. అనగా చివరకు నాశనము జరుగునని దీని అర్థం. నీరులేని కారణంగా వేడి భరించరానిదిగా ఉండును. చివరకు భూమి బూడిదగును. తిరిగి వర్షాలు కురియును, తిరిగి అంతా కలిసిపోవును. అనగా తిరిగి విధ్వంసమగును. ఈ విధముగా సమస్తము సృష్టించ బడును. మరియు విధ్వంసమగును. ఆ విధముగా ఈ శరీరము సృష్టించబడును. మంచి రూపమును పొందును. తిరిగి శాశ్వతముగా నశించిపోవును. తిరిగి మనం మరోశరీరమును పొందవలసి ఉంటుంది. శరీరం బుడగ వంటిది. ఇది క్షణకాలము నిలిచి పగిలిపోతుంది, ఈ విధముగా శాశ్వతముగా నశించిపోవును.

మనం ఒక బుడగ తర్వాత మరో బుడగను ఒక శరీరము తర్వాత మరో శరీరమును పొందుతూ ఈ విధముగా ఆనందముగా ఉండగలమని మూర్ఖత్వముతో భావిస్తుంటాము. కాని మనమెంతటి మూర్ఖులమనగా, శ్రీకృష్ణుడు మనవలె వ్యక్తిగా వచ్చినప్పుడు అతడిని సాధారణ వ్యక్తిగా భావిస్తాము. ఇదే మన దురదృష్టము. మనం శ్రీకృష్ణునికి మాత్రమే శరణాగతి చేసుకున్నచో వివిధ రకాల శరీర కర్మలకు కట్టుబడి ఉండవలసిన అవసరము లేదు. మనము శ్రీకృష్ణునికి భక్తియుక్త సేవను చేస్తూ పతనమైనప్పటికినీ నష్టపోయేదేమి ఉండదు. సమస్త లాభములను పొందుదుము. వచ్చే జన్మలో మనకు మానవ దేహం లభించునని హామి కలదు. కాబట్టి మన శ్రేయస్సు కొరకు శ్రీకృష్ణుని అంగీకరించవలెను.

అధ్యాయము 18

భక్తియుక్త సేవ - అంతిమ పరిపూర్ణత

శ్లోకము 43

జ్ఞానవైరాగ్యయుక్తేన భక్తియోగేన యోగినః
క్షేమాయ పాదమూలం మే ప్రవిశన్త్యకుతోభయమ్

జ్ఞానవైరాగ్యయుక్తులై తమ శాశ్వత లాభము కొరకు భక్తియుక్త సేవ యందు నెలకొనిన యోగులు నా పాదపద్మాశ్రయమును పొందుదురు. నేను దేవాదిదేవుడనై నందున ఆ విధముగా వారు నిర్భయముగా భగవద్రాజ్యమున ప్రవేశింప యోగ్యులగు చున్నారు.

భాష్యము : నిజముగా ఈ భౌతిక జగత్తు బంధముల నుండి విడివడి భగవద్ధామమునకు చేరవలెనని కోరువాడే వాస్తవమైన అష్టాంగయోగి. కనుకనే *'యుక్తేన భక్తియోగేన'* అను పదములు విశేషముగా వాడబడినవి. భక్తియుక్త సేవ యందు నియమింపబడిన యోగులే ఉత్తమ శ్రేణియోగులు. భగవద్గీత (6. 47) యందు వర్ణింపబడినట్లు దేవాదిదేవుడగు శ్రీకృష్ణుడిని గూర్చి నిరంతరము చింతించు నట్టి యోగులే ఉత్తమశ్రేణి యోగులు. అటువంటి యోగులు జ్ఞానవైరాగ్యములతో ఉందురు. భక్తియోగి అనగా సహజముగానే జ్ఞానవైరాగ్యములను బడయుటయని భావము. భక్తియోగ పరిణామమిదియే. వాసుదేవుని(శ్రీకృష్ణుని) భక్తియుక్త సేవ యందు నెలకొనినవాడు పరిపూర్ణ జ్ఞానవైరాగ్యములను కలిగి యుండునని శ్రీమద్భాగవతము (1. 2. 7) నందు తెలుపబడినది. అవి ప్రాప్తించుటకు అన్యమగు వివరణ మేదియును లేదు. *'అహైతుకీ'* అనగా ఎటువంటి కారణము లేకనే అవి వచ్చిచేరును. మానవుడు పూర్తిగా విద్యావిహీనుడైనను కేవలము భక్తియుక్తసేవలో నెలకొనినచో శాస్త్రజ్ఞానమంతయు అతడికి విధితము కాగలదు. ఈ విషయము వేదవాఙ్మయ మంతటా తెలుపబడినది. దేవాదిదేవునిలోను, ఆధ్యాత్మికాచార్యుని లోను పరిపూర్ణ విశ్వాసము, శ్రద్ధ గలవానికి వేదసారమంతయు అప్రయత్నముగానే వెల్లడి యగును. దానినతడు విడిగా కోరవలసిన అవసరము లేదు. అనగా భక్తియుక్త సేవనందు నెలకొనెడి యోగులు జ్ఞానవైరాగ్యవంతులై యుందురు. జ్ఞానవైరాగ్యములు లోపించినచో మానవుని యందు పరిపూర్ణభక్తి రాలేదని అవగతము చేసుకొనవలెను.

సారాంశమేమనగా దేవాదిదేవుడగు శ్రీకృష్ణభగవానుని పాదపద్మములకు శరణు జొచ్చునిదే ఎవ్వరును ఆధ్యాత్మిక రాజ్యములోనికి(భగవానుని నిరాకార 'బ్రహ్మజ్యోతి' లోనికి గాని లేదా 'బ్రహ్మజ్యోతి' యందున్న వైకుంఠ లోకములలోనికి గాని) ప్రవేశింప జాలరు. శరణాగత జీవులే 'అకుతోభయమ్' అని పిలువబడుదురు. వారు నిస్సందేహులును, భయరహితులై యుందురు. భగవద్ధామమున వారి ప్రవేశము నిశ్చితమై యుండును.

భౌతిక ప్రపంచములో ప్రతి అడుగులో ప్రమాదము పొంచి ఉన్నందున భక్తియుక్త సేవ అనునది ఎంతో ముఖ్యమైనది. ఏ క్షణములోనైన మన జీవితము అంతం కావచ్చును. మనం చక్కగా నడుచుకుంటూ వెళ్ళవచ్చు, కాని ఏ క్షణములోనైన జారిపడి మెడ విరగొట్టు కోవచ్చును. అందుకే ఈ లోకమును మర్త్యలోకం అన్నారు. అనగా మృత్యులోకము అనగా మృత్యువు తప్పనిసరి, మనం ఎంత దృఢంగా మరియు ఆరోగ్యంగా ఉన్నను మృత్యువును తప్పించుకోలేము. ప్రతిరోజు సముద్రతీరంలో వ్యాయామం చేసినను మనం ఏ క్షణంలోనైన మరణించ వచ్చును. ఈ విషయములో ఎటువంటి హామి లేదు. అందరూ ఆరోగ్య సంరక్షణను కావాలను కుంటారు, కాని నిజానికి సంరక్షణ అనేది లేదు. కేవలం జీవన పోరాటమే కలదు. జనులు రక్షణ కొరకు పోరాడుతున్నారు. కాని నిజానికి ఇది అంతయు మూర్ఖత్వము. శ్రీకృష్ణుడిని విస్మరించి నందుకు లేదా తిరస్కరించి నందుకు జనులు ఎల్లప్పుడు భయమును కలిగి ఉంటారు. మనం శ్రీకృష్ణుని శాశ్వత సేవకులమని, అతని అణు అంశలమని, అతనితో మనము అత్యంత సన్నిహిత సంబంధమును కలిగి ఉన్నామనే విషయమును విస్మరించాము. భౌతిక లోకంలో మనం 'అసత్' అశాశ్వతమైన స్థితిలో నెలకొనినాము. పిల్లవాడు తల్లిదండ్రులను పోగొట్టు కొనినచో, అతడు ఎల్లప్పుడు భయాందోళన పరిస్థితులను కలిగి ఉంటాడు. అతడు వీధిలో, "నా తల్లిదండ్రులెక్కడ?" అని రోదించును. మనం అటువంటి భయాందోళన పరిస్థితులలో ఉండకూడదను కొన్నచో శ్రీకృష్ణుని పాదపద్మములను శరణు పొందవలెను. మనమందరము శ్రీకృష్ణుని సంతతియైన కారణంగా అతడు తనవద్దకు రమ్మని అర్థిస్తున్నాడు. "ఎల్లప్పుడు పాపములను చేయుట వలన మీరిక్కడ క్రుంగి పోతున్నారు, మీరు ఒక శరీరమును విడిచి మరో శరీరమునకు మారుతున్నారు. మీరు మానవులనీ, అమెరికా వాసులమనీ, ఇది లేదా అది అని భావిస్తున్నారు, కాని మరుక్షణంలో మీరు ఒక కుక్కగానో లేదా కీటకముగానో మారవచ్చును" అని అతడు తెలుపుతున్నాడు. జనులు ఎల్లప్పుడు తాము పూర్తిగా సురక్షితముగా

ఉన్నట్లు భావిస్తుంటారు. దీనినే మాయ అంటారు.

శ్రీకృష్ణుడితో మనకు గల సంబంధమును అర్థం చేసుకొనుటయే జ్ఞానము. "నేను శ్రీకృష్ణుడి కోసం చేయవలసిన ధర్మం ఏమిటి?" అని జ్ఞానవంతుడు ప్రశ్నించును. మనమొకసారి శ్రీకృష్ణునితో మనకు గల సంబంధమును అర్థం చేసుకొని మరియు అతని పట్ల మన ధర్మమును గుర్తు చేసుకున్నప్పుడు, సహజము గానే భౌతిక కార్యక్రమాలలో పాల్గొనము. దీనినే వైరాగ్యం అంటారు. అనగా భౌతికకర్మల పట్ల విరక్తి, భక్తియోగ ద్వారా జ్ఞానవైరాగ్యములు జాగృతమగును. భక్తి అనగా శ్రీకృష్ణునికి శరణాగతు లగుటయే. శ్రీకృష్ణుడికి శరణు పొందకుండ, మన స్థితిని మనం అర్థం చేసుకోలేము. మూర్ఖులు తనను అర్థం చేసుకోకుండ ఉండేలా శ్రీకృష్ణుడు హక్కును కలిగి ఉండును. అతడు భక్తుల కొరకు మాత్రమే ఉద్దేశించబడినాడు. మనం భక్తుల మవ్వకుండ అతడిని అర్థం చేసుకోలేము.

భౌతిక జీవితమనగా మైథునము. జనులు రాత్రి సమయములో అనుభవించు కొద్దిపాటి మైథునసుఖం కొరకు పగలంతా కష్టించి పనిచేయుదురు. భౌతిక లోకంలో ప్రతిఒక్కరు కూడ మన్మథుడి పదునైన బాణముల చేత బాధింప బడుతున్నారు. మన్మథుడు తన బాణములను స్త్రీపురుషులపై ప్రయోగించి, వారు ఒకరిపట్ల ఒకరు వెర్రివారగునట్లు చేయును. కాని ఎవరైనను శ్రీకృష్ణుడిని మదన మోహనుడు అనగా మన్మథుడిని సైతం మోహించు అతడిని చూచినప్పుడు, ఎవరూ కూడ మన్మథుని బాణములచే బాధించబడరు. అనగా వారు నిజముగానే భయరహితు లగుదురని దీని అర్థం. తరువాత వారు భక్తియోగను అభ్యసిస్తూ భౌతిక జగత్తును త్యజించ వలెను. శాస్త్రముల ననుసరించి *'శ్రేయాన్'* మరియు *'ప్రేయన్'* కలవు. శ్రేయాన్ అనగా పరమలక్ష్యం. చివరకు ఆనందించగలిగేలా మనం నడుచుకోవాలి. ఏమైనను, మనం తాత్కాలిక ఆనందమును పొందగోరి భవిష్యత్తును నిర్లక్ష్యము చేసినచో, మనం *'ప్రేయన్'*ను పొంద గొరుచున్నట్లు అర్థం. *'ప్రేయన్'* అనేది మందబుద్ధులకు మరియు చిన్నపిల్లల కొరకు. బాలుడు రోజంతా ఆడుకొనుటలో ఆనందించును. అతడు పాఠశాలకు వెళ్ళి విద్యావంతుడు కావాలనుకోడు. విద్య అనేది *'శ్రేయాన్'* అనగా పరమలక్ష్యం. ఎవరును దీనిపట్ల శ్రద్ధవహించరు. మనం *'శ్రేయాన్'*ను లక్ష్యంగా కలిగి ఉండాలనీ, మరియు *'ప్రేయన్'* ద్వారా బంధించ బడరాదని శాస్త్రాలు ఆదేశించుచున్నవి. భక్తియోగ అనునది పరమ *'శ్రేయాన్'.*

భవిష్యత్తులో ఈ భౌతిక లోకంలో ఏదోఒకరోజు ఆనందము దొరకుతుందనే ఆశతో మనం జీవితపోరాటమును చేస్తుంటాము. అయినప్పటికినీ, మనము

ఆందోళనలకు గురవుతుంటాము. ఎడారిలో ఒక జంతువు ఎండమావి నీడలను చూసి, ఆ నీడ వెనక ఎంతగానో పరుగెడుతుంది. అది ముందుకు మరింత ముందుకు పరుగెడుతూ, తీవ్రమైన వేడి ఇసుక తిన్నెలను ఆ విధముగా దాటుతూ మరింత దప్పికతో చివరికి మరణించును. మన జీవిత పోరాటము కూడ అటువంటిదే. "మరింత ముందుకు వెళ్ళినచో, అక్కడ నీరు ఉండవచ్చును. చివరికి అక్కడ సుఖం లభించ వచ్చును" అని మనం భావిస్తుంటాము. కాని ఎడారిలో నీరు ఉండదు. బుద్ధిహీనులైన వారు పశువుల వంటివారు భౌతిక లోకమనే ఎడారిలో ఆనందము కొరకు పరుగెడుతుంటారు. భక్తియోగ పద్ధతితో ఈ మాయాసక్తిని విడనాడవలెను. దీనిని కృత్రిమంగా కాకుండా ఎంతో శ్రద్ధగా తీసుకోవలెను. మనము భౌతిక కోరికల నన్నింటిని విడుచుటను శ్రీకృష్ణుడు చూచినప్పుడు అతడు ఎంతగానో ఆనందించును. మనం నిజానికి ధర్మ, అర్థ, కామ మరియు మోక్షాలతో తీరిక లేకుండ ఉన్నాము. కాని మనం వీటిని అధిగమించినచో భక్తి ప్రారంభమగును.

మనం ప్రపంచ చరిత్రను చూచినప్పుడు అది పోరాటాల చరిత్ర అని గమనించ వచ్చును. మానవులందరు దుఃఖపూరితమైన పరిస్థితుల నుండి ఉపశమనమును పొందుటకు ప్రయత్నించును. కాని అది కేవలం మరొక దుఃఖ పూరితమైన పరిస్థితికి దారితీయును. మనం ఒక సమస్యను అధిగమించుటకు ప్రయత్నించినప్పుడు మరొక సమస్య ఎదురవుతున్నది. భౌతిక లోకము పట్ల మనకు గల సంబంధమును విడుచుటలో మనకు గల దృఢసంకల్పమును 'ముక్తి' అంటారు. 'ముక్తి' అనగా ఆధ్యాత్మిక స్థితిని సాధించుటయే. మనం ఆధ్యాత్మిక జగత్తుకు చెందినవారము కనుక ఈ భౌతిక లోకములో ఆనందముగా ఉండుటమనేది అసాధ్యము. నేలపై నివసించే జంతువును నీటిలో విడిచినచో, అది ఎంత ఈత నేర్పరియైనను జీవితము కొరకు పోరాడును. మనం ఈ భౌతిక లోకానికి ఇంద్రియములను తృప్తిపరచు కొనుటకై వచ్చాము. అయినను మన ప్రయత్నము లెన్నడు ఫలించవు. నిజానికి భయమునకు అతీతమైన స్థితిని మనము పొంద గోరినచో, భగవానుడైన కపిలదేవుని ద్వారా ప్రతిపాదించబడిన ఈ భక్తియోగను అంగీకరించవలెను.

శ్లోకము 44

ఏతావానేవ లోకేஉస్మిన్ పుంసాం నిఃశ్రేయసోదయః
తీవ్రేణ భక్తియోగేన మనో మయ్యర్పితం స్థిరమ్

కనుకనే భగవానునిపై మనస్సు సంలగ్నమైన వారలు తీవ్రమగు భక్తి యోగమున నెలకొందురు. జీవితపు చరమసిద్ధిని బడయుటకు అదియే ఏకైక సాధనము.

భాష్యము : ఇచ్చట *'మనోమయ్యర్పితం'* (నా యందు సంలగ్నమైన మనస్సు) అను పదము మిగుల ప్రధానమైనది. మనుజుడు తన మనస్సును శ్రీకృష్ణభగవానుని యందు లేదా అతని అవతారపు పాదపద్మముల యందు నిలుపవలెను. ఆ రీతిని స్థిరముగా మనస్సును నెలకొల్ప గలుగుటయే ముక్తికి మార్గము. దీనికి అంబరీష మహారాజే చక్కని ఉపమానము. అతడు తన మనస్సును శ్రీకృష్ణుని పాదపద్మముల పైననే నిలిపెను; అతడు కేవలము ఆ దేవాదిదేవుని లీలలనే ప్రసంగించెను; శ్రీకృష్ణునకు అర్పించిన పుష్పములు, తులసీదళములనే ఆఘ్రాణించెను; ముకుందుని మందిరమునకే ప్రయాణించెను; శ్రీహరి మందిర మార్జనమునకే తన హస్తములను వినియోగించెను; ఆ దేవాదిదేవునకు అర్పించిన ఆహార పదార్థములను ప్రసాద రూపమున రుచిచూచుట యందే జిహ్వను నెలకొల్పెను; అచ్యుతుని మహిమాన్విత లీలల శ్రవణము నందే కర్ణములను నియోగించెను. ఆ విధముగా అతని ఇంద్రియము లన్నియును యుక్తముగా భక్తియందు నెలకొనినవి. మొట్టమొదట మనస్సును స్థిరముగాను, అతి సహజముగాను కృష్ణపాదార విందముల చెంత నెలకొల్పవలెను. మనస్సు ఇంద్రియములకు ప్రభువు కనుక అది సేవలో నియుక్తమై నంతనే ఇంద్రియము లన్నియును సేవోన్ముఖులు కాగలవు. అదియే భక్తియోగము. యోగమనగా ఇంద్రియ నిగ్రహమని భావము. నిజమునకు ఇంద్రియములు నిగ్రహింప బడజాలవు; అవి ఎల్లప్పుడు కల్లోలితమై యుండును. ఇది బాలుని విషయమునను సత్యమై యున్నది. ఎంతకాలము అతడిని బలవంతము చేసి మౌనముగా కూర్చుండ బెట్టగలము? అది అసాధ్యమగు విషయము. అర్జునుడు కూడ : *"చంచలం హి మనః కృష్ణ"* (మనస్సు ఎల్లప్పుడు చంచలమైనది) అని పలికెను. కనుక దానిని కృష్ణపాదారవిందముల చెంత సంలగ్నము చేయుటే ఉత్తమోత్తమ విధానము *(మనోమయ్యర్పితం స్థిరమ్).* అనగా మనుజుడు అత్యంత శ్రద్ధతో కృష్ణచైతన్యములో నెలకొనినచో అదియే పరమోన్నత స్థితి కాగలదు. కృష్ణ చైతన్య వంతములైన మానవ జీవితపు ఉన్నతమైన పరిపూర్ణత్వస్థితి యందే సమస్తము లభ్యమగును.

ఈ శ్లోకము కపిలదేవుని చేత దేవహూతికి వివరించబడిన భక్తియోగ

ముగింపును సూచించును. జ్ఞానవైరాగ్యములో పురోభివృద్ధిని సాధించిన వారి కార్యకలాపములే భక్తియోగ. సార్వభౌమ భట్టాచార్యుడు భక్తియోగను *'వైరాగ్య విద్య నిజ భక్తియోగ'* అని వివరించాడు. శ్రీకృష్ణుని ఉపదేశములను మనం అంగీకరించినప్పుడు భక్తియోగ ప్రారంభమగును (భ.గీ. 18.66) :

సర్వధర్మాన్ పరిత్యజ్య మాం మేకం శరణం వ్రజ

"సమస్త ధర్మములను విడిచి కేవలం నన్నే శరణు పొందుము."

మన భౌతిక బంధనముల నన్నింటిని విడిచి శ్రీకృష్ణుని పాదపద్మములను ఆశ్రయించ వలెను. మనం ఈ భౌతిక లోకములో ఆనందముగా ఉండుటకు ఒకదాని తర్వాత మరొక ప్రణాళిక లెన్నింటినో చేయుచున్నాము. కాని ఈ లోకము *'దుఃఖాలయమశాశ్వతమ్'* దుఃఖముల యొక్క లోకం. చెరసాల అనేది శిక్షను అనుభవించుటకు నిర్దేశించబడినట్లుగా ఈ భౌతిక లోకమనేది నిజానికి దుఃఖముల కొరకై నిర్దేశించబడినది. మన నిజస్థితియైన *'బ్రహ్మభూత'* స్థితిని పొందినప్పుడు, మనం భగవంతుని దివ్యధామములోనికి ప్రవేశించగలము. కర్మయోగ ద్వారా మనం భౌతిక బద్ధశరీరము నుండి బయటపడుటకు ప్రయత్నిస్తాము. కాని భక్తియోగ ద్వారా సూక్ష్మశరీరం నుండి బయటు పడుదుము, కాని భక్తియోగ ద్వారా సూక్ష్మశరీరం(మనస్సు, బుద్ధి మరియు అహంకారం) మరియు భౌతికస్థూల శరీరము నుండి నేరుగా అతీతులము కావచ్చును. అప్పుడు మనం మన నిజ స్వరూపంలో అనగా ఆధ్యాత్మిక స్థితిలో నెలకొందుము. మనం ఈ సూక్ష్మ మరియు స్థూల శరీరములలో నున్నంత వరకు, మనము భౌతిక ప్రకృతి యొక్క త్రిగుణముల చేత దుఃఖములను అనుభవిస్తూనే ఉంటాము. మనం భగవంతుని భక్తియుక్త సేవను ప్రారంభించిన తక్షణమే *'బ్రహ్మభూత'* స్థితిలో నెలకొనగలము. *"అహం బ్రహ్మాస్మి"* ("నేను బ్రహ్మన్") అనునది కేవలం తత్త్వజ్ఞానము. కాని మనం కనుక వాస్తవంగా భక్తియుక్త సేవలో నెలకొనినచో అది ప్రత్యక్ష జ్ఞానమనబడును. అప్పుడు మనం భౌతిక స్థితిలో కాకుండ *'బ్రహ్మభూత'* స్థితిలో నెలకొంటాము.

ప్రహ్లాద మహారాజు నరసింహ భగవానుని చేత అతని తండ్రిని సంహరింప చేసి తన తండ్రికి గొప్ప సేవ చేసెను. బయటకు ప్రహ్లాద మహారాజు తన తండ్రికి సహాయపడ లేదనిపిస్తుంది. కాని అది నిజం కాదు. శాస్త్రములలో ఎవరైన రాక్షసుడైనను భగవంతుని చేత సంహరించ బడినచో అతడు వెంటనే ముక్తిని పొందునని తెలుపబడినది. ప్రహ్లాద మహారాజు ఇట్లు ఆలోచించెను : "నా తండ్రి

ఎన్నో పాపకార్యములను ఒనరించెను, మరియు భగవత్ చైతన్యమును వ్యతిరేకించెను కాబట్టి అతడు ముక్తిని పొందజాలడు” అని భావించెను. నరసింహ భగవానుడు హిరణ్యకశిపుని సంహరించిన తరువాత ప్రహ్లాద మహారాజు ఇలా పలికెను : “నా ప్రియమైన భగవాన్! మిమ్ములను ఒక విషయము అడుగవచ్చునా? నా తండ్రి గొప్ప నాస్తికుడు. అతడు మీ పాదపద్మముల వద్ద అనేక అపరాధములను చేసెను. ప్రస్తుతం అతడిని నీవు సంహరించితివి. అతడిని క్షమించి ముక్తిని ప్రసాదించుమని నేను మిమ్ములను ప్రాధేయపడుతున్నాను.” నిజానికి హిరణ్యకశిపుడు వెంటనే ముక్తిని పొందాడు, కాని అతని ప్రియపుత్రుడు తన తండ్రి ముక్తిని పొందగలిగెనా లేదా అని జిజ్ఞాసతో తెలుసు కోవాలనుకున్నాడు. ఎవరైనను, శుద్ధవైష్ణవుడై భగవంతునికి సేవ చేసినచో వారు తమ కుటుంబమునకు అత్యున్నతమైన సేవ చేసినవారగుదురు. ఎందుకంటే ఇరవైఒక్క తరాల వారు ముక్తిని పొందుదురు. కేవలం వైష్ణవుడి తండ్రియే కాకుండ ఇరవైఒక్క తరాలలోని ప్రతిఒక్కరూ కూడ వైష్ణవుడు ముక్తిని పొందుటకు మునుపే వారందరును ముక్తిని పొందుదురని భగవంతుడు నిర్ధారించెను.

యోగి యొక్క నిజమైన ధర్మం శ్రీకృష్ణుని చరణములపై తన మనస్సును కేంద్రికరించుట. అదే నిజమైన యోగపద్ధతి. యోగులు ఎన్నో వ్యాయామాలను చేస్తుంటారు. కాని ఇవన్నీ శరీరముపై అధిక ఆసక్తి గలవారి కోసమై ప్రతిపాదించడమైనది. శ్రీకృష్ణునికి ఇరవై నాలుగు గంటలు సేవచేయుటను భక్తియోగ అంటారు. మరియు అదే నిజమైన సమాధి, జనులు ఏదో ఫలితమును ఆశించి రాత్రింపవళ్ళు కష్టపడుదురు. కాని భక్తియోగలో వ్యక్తి రాత్రింపవళ్ళు కష్టించి ఫలితములను శ్రీకృష్ణునకు అర్పింతురు. సాధారణ కర్మికి మరియు భక్తియోగికి మధ్య గల గొప్ప భేదమిదే. భక్తులు ఆధ్యాత్మిక స్థితిలో నెలకొని ఉన్నారని సాధారణ కర్ములు అర్థం చేసుకోలేరు.

మేము ముందుగా తెలిపినట్లుగానే, భగవంతుని రామ, నరసింహ, వరాహ, కృష్ణ, కపిలదేవ, బలరామ మొదలగు ఎన్నో అవతారములు కలవు. కొన్నిసార్లు మూర్ఖపు జనులు ఇలా ప్రశ్నిస్తుంటారు : “మీరు శ్రీకృష్ణుడిని పూజిస్తున్నారు. ఎందుకు రాముని పూజించరు?” నిజానికి శ్రీకృష్ణునికి మరియు శ్రీరామునికి మధ్యతేడా లేదు. కాని ప్రతిఒక్కరు విభిన్నమైన ఆసక్తులను కలిగి ఉన్నారు. ఉదాహరణకు, హనుమంతుడు ప్రత్యేకించి శ్రీరామచంద్రునికి అంకితమైనాడు. గోపికలు కేవలం శ్రీకృష్ణుడికి అంకితమైనారు. నిజానికి ఇందులో ఎటువంటి

భేదము లేదు. భగవంతుడు వివిధ రూపాలతో అవతరించును. కాని అన్ని పరిస్థితులలోను అతడు భగవంతుడే. ఒకసారి శ్రీకృష్ణుడు గోపికల మధ్యనుండి అదృశ్యమై నాలుగు చేతులు గల నారాయణునిగా ప్రత్యక్షమైనాడు, గోపికలు శ్రీకృష్ణుని కొరకు వెతకసాగిరి. వారు నాలుగు చేతులు గల నారాయణుని రూపము పట్ల వారు పెద్దగా ఆసక్తిని కనపరచలేదు. వారు కేవలం శ్రీకృష్ణుడిని చూడాలను కున్నారు. నిజానికి శ్రీకృష్ణుడికి విష్ణువుకు మధ్య భేదము లేదు. కాని ప్రతిభక్తుడు ఒక ప్రత్యేకమైన ఆసక్తిని కలిగి ఉంటాడు. వైష్ణవ సంప్రదాయములోని కొందరు శ్రీ రాధాకృష్ణులను, మరికొందరు శ్రీ సీతారాములను, శ్రీ లక్ష్మీనారాయణులను మరికొందరు రుక్మిణీ శ్రీకృష్ణులను ఆరాధిస్తారు. వీరందరు సమానులే. మరియు వీరి భక్తులందరు వైష్ణవులే. ఎవరైనను, 'హరే కృష్ణ' లేదా హరే రామ అని కీర్తిస్తున్నారా లేదా అనేది ప్రధాన విషయము. ఏమైనను, దేవతలను పూజించుట ఏమాత్రం అంగీకరించ బడలేదు. ఏదిఏమైనను భక్తియోగ అనునది శ్రవణము ద్వారా అనగా శ్రవణ కీర్తన ద్వారా ప్రారంభమగును. ఎవరైనను ప్రామాణిక మార్గముల నుండి శ్రవణము చేసిన విషయమును అంగీకరించినప్పుడు అతడు సహజముగానే కీర్తించును. కీర్తన అనగా భగవంతుని గురించి ప్రచారము చేయుట, కీర్తించుట, మరియు చర్చించుట. పరీక్షిత్తు మహారాజు కేవలము శ్రీమద్భాగవతమును శ్రవణము చేయుట ద్వారా పరిపూర్ణత్వమును సాధించెను. ఇది శ్రవణ కీర్తనము. పరీక్షిత్తు మహారాజు శ్రవణము చేస్తుండెను, మరియు శుకదేవ గోస్వామి భగవంతుని గూర్చి వర్ణించుతుండెను అనగా కీర్తన చేయుచుండెను. పృథు మహారాజు భగవంతుడిని మాత్రమే ఆరాధించెను. మరియు లక్ష్మీదేవి భగవంతుని పాదపద్మములకు సేవచేసెను. అర్జునుడు భగవంతునితో స్నేహం చేసెను. మరియు హనుమంతుడు రామచంద్రుని ఆజ్ఞలను పాటించెను. బలి మహారాజు తన సర్వస్వమును వామన రూపంలో వచ్చిన భగవంతునికి సమర్పించుకొనిన తరువాత తన దేహమును సైతం సమర్పించుకొనెను. ఇటువంటి ఉదాహరణలెన్నో కలవు. కాని ప్రస్తుతం, మనం శ్రీకృష్ణుని గురించి శ్రవణము చేసినంత మాత్రముననే సరిపోవును. భగవంతుడు మనకు చెవులను ఇచ్చెను. మనం ఆత్మసాక్షాత్కారమును పొందిన ప్రామాణికాచార్యుడిని చేరి అతడి నుండి శ్రీకృష్ణుని గురించి శ్రవణము చేయవలెను. ఈ యుగమునకు ఈ పద్ధతి ప్రతిపాదించ బడినది. ఎందుకనగా, జనులు ఎంతో పతనం చెందినట్టివారు మరియు విద్యలేనివారు.

మన స్థితితో నిమిత్తం లేకుండ మనము భక్తుడి గురించి అన్వేషించ వలెనని

శ్రీ చైతన్య మహాప్రభువు ఆదేశించెను. మన స్థితి ఏదైనను మార్చుకోవలసిన అవసరము లేదు. మనము మన స్థితిలోనే నెలకొని ఉండుటమనేది ఎంతో మంచిది. అంతేకాకుండ, కేవలం శ్రీకృష్ణుడి గురించి శ్రవణము చేయవలెను. కృష్ణచైతన్య ఉద్యమము శ్రీకృష్ణుడిని గూర్చి శ్రవణము చేసే అవకాశమును అందరికి కలుగ జేస్తున్నది. శ్రీకృష్ణుడు అందరి హృదయాలలో నిలిచి ఉన్నాడు. కాబట్టి మనం అతడి పట్ల శ్రద్ధాసక్తులను కలిగి ఉన్నామని గ్రహించిన వెంటనే అతడు మనకు సహాయపడును. ఇదే భక్తికి ప్రారంభము.

మనకు ఈ తత్త్వము అర్థం కాకున్నను, కేవలం శ్రీకృష్ణుడు ఏమి చెప్పుచున్నాడో దానిని శ్రవణము చేసినంతనే శుద్ధులమౌతాము. ఇది హరి – సంకీర్తన యొక్క పూర్తి ప్రక్రియ. కనుక ఈ హరేకృష్ణ అంటే ఏమిటి? అని అర్థం చేసుకోవలసిన అవసరము లేదు. మనం పరిశుద్ధుల మగుటకు మాత్రమే వినవలెను. పవిత్రుల మవ్వకుండ భగవంతుని అర్థం చేసుకొనుట సాధ్యపడదు. మన హృదయములో ఎన్నో కల్మషములు కలవు, మరియు ఈ యుగంలో జనులు వ్యభిచారము, మాంసాహారము, జూదము, మత్తుపానీయాలను సేవించుట వంటి ఎన్నో పాపకార్యాలలో మునిగి పోవుచున్నారు. ప్రపంచమంతయు వీటి చుట్టు తిరుగుచున్నది. ఏమైనను వీటి మధ్యనే మనం ఈ కృష్ణచైతన్య ఉద్యమమును విస్తరింప వలెను. ఆటంకములెన్ని ఎదురైనను వాటినన్నింటిని శ్రీకృష్ణుని కృపచేత అధిగమించ వలెను. కేవలం భక్తిలో దృఢసంకల్పులము కావలెను. అప్పుడే అన్ని సర్దుకొనును. కపిల భగవానుడు అతడి తల్లియైన దేవహూతికి ఇచ్చిన ఉపదేశముల సారాంశము ఇదే.

పరమపూజ్యశ్రీ శ్రీమత్ ఏ.సి. భక్తివేదాంత స్వామి ప్రభుపాదుల వారి పరిచయము

పరమపూజ్యశ్రీ శ్రీమత్ ఏ.సి. భక్తివేదాంత స్వామి ప్రభుపాదుల వారు భారతదేశములోని కలకత్తా నగరములో 1896 వ, సంవత్సరములో జన్మించారు. వారు తమ ఆధ్యాత్మిక ఆచార్యులైన శ్రీల భక్తిసిద్ధాంత సరస్వతీ గోస్వామి వారిని కలకత్తాలో 1922 వ, సం.లో మొదటిసారి కలుసుకున్నారు. శ్రీల భక్తిసిద్ధాంత సరస్వతుల వారు ప్రముఖ వైదిక విద్వాంసులు, 64 గౌడీయ మఠాలను (వైదిక సంస్థలను) స్థాపించారు. వారు విద్యాసంపన్నులు, యువకులయిన ప్రభుపాదుల వారిని చూచి ఎంతో సంతోషించి, వైదిక విజ్ఞానాన్ని బోధించడానికి తమ జీవితాన్ని అంకితము చేయుమని ఉపదేశించారు. ఆనాటి నుండి శ్రీల భక్తిసిద్ధాంత సరస్వతీ ఠాకూరు వారికి శిష్యులై పదకొండు సంవత్సరాల తరువాత యథావిధిగా దీక్షను తీసుకున్నారు.

మొదటి సమావేశములోనే శ్రీల భక్తిసిద్ధాంత సరస్వతీ ఠాకూరు గారు ఆంగ్ల భాష ద్వారా వైదిక విజ్ఞానాన్ని ప్రచారము చేయుమని శ్రీల ప్రభుపాదుల వారిని కోరారు. తరువాతి సంవత్సరాలలో శ్రీల ప్రభుపాదుల వారు భగవద్గీతకు భాష్యం వ్రాసి, గౌడీయమఠ కార్యక్రమాలకు తోడ్పడ్డారు. 1944 లో 'బ్యాక్ టు గాడ్‌హెడ్' (భగవద్దర్శనం) అనే ఆంగ్ల పక్ష పత్రికను స్థాపించారు. అది ఇప్పుడు పాశ్చాత్య దేశాలలో వారి శిష్యుల చేత ముప్ఫయి కంటె ఎక్కువ భాషలలో కొనసాగించ బడుతూంది.

శ్రీల ప్రభుపాదుల వారి భక్తివిజ్ఞానాలను గుర్తించి 1947 లో గౌడీయ వైష్ణవ సంఘం వారికి భక్తివేదాంత బిరుదమును ఇచ్చి గౌరవించింది. 1950 లో 54 సంవత్సరాల వయస్సులో ప్రభుపాదుల వారు వైవాహిక జీవితాన్ని విడిచి పెట్టి ఎక్కువకాలం గ్రంథాలను చదవడానికీ, వ్రాయడానికీ వినియోగించ సాగారు. తరువాత వారు వృందావనానికి వెళ్ళి అక్కడ మధ్యయుగంలో చరిత్ర ప్రసిద్ధి కెక్కిన శ్రీశ్రీరాధా దామోదర మందిరములో అతి నిరాడంబర జీవితమును గడిపారు. అక్కడే వారు చాలా సంవత్సరాలపాటు ఉండి ఎంతో విద్యా వ్యాసంగం చేసి

అనేక గ్రంథాలను రచించారు. 1959 లో సన్న్యాసాశ్రమాన్ని స్వీకరించారు. తమ జీవిత ముఖ్య రచన అయిన శ్రీమద్భాగవతములోని 18,000 శ్లోకాలకు అనువాదము, వ్యాఖ్యానాలతో కూడిన అనేక సంపుటాలుగా రచనను ప్రారంభించారు. గ్రహాంతర సులభయానం అనే మరో గ్రంథాన్ని కూడా రచించారు.

శ్రీమద్భాగవతము మూడు సంపుటాలుగా ప్రచురించాక ప్రభుపాదుల వారు తమ ఆధ్యాత్మికాచార్యుల కోరికను నెరవేర్చడానికి 1965 లో అమెరికా సంయుక్త రాష్ట్రాలకు వెళ్ళారు. అప్పటి నుండీ వారు భారతీయ వేదాంత గ్రంథాలపై ప్రామాణికాలైన వ్యాఖ్యానాలు, భాషాంతరీకరణాలు, సంగ్రహ వ్యాఖ్యలు 70 సంపుటాలకు పైగా రచించారు.

1965 లో మొట్టమొదటిసారిగా ఒక వాణిజ్యనౌకలో న్యూయార్కు నగరానికి వెళ్ళినప్పుడు వారిదగ్గర ఒక్కపైస కూడా లేదు. తరువాత ఒక సంవత్సరానికి అంటే 1966 జూలైలో వారు అతికష్టము మీద అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘాన్ని (ఇస్కాన్) స్థాపించగలిగారు. పది సంవత్సరాల లోపలే ఆ సమాజము బాగా అభివృద్ధి చెంది ప్రపంచమంతట వ్యాపించసాగింది. పాఠశాలలు, మందిరాలను, ఆశ్రమాలు మొదలైన వాటిని నెలకొల్పసాగింది.

1968 లో శ్రీల ప్రభుపాదుల వారు న్యూవర్జీనియాలోని కొండల పైన ఆధ్యాత్మిక సమాజాన్ని స్థాపించి దానికి నూతన వృందావనం అని పేరును పెట్టారు. అక్కడే ఒక వైదిక పాఠశాలను నెలకొల్పి పాశ్చాత్యదేశాలకు సైతం వైదిక గురుకుల విద్యావిధానాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఆ నూతన వృందావనం ఇప్పుడు వేయి ఎకరాలకు పైగా వైశాల్యం గల ప్రదేశంలో విరాజిల్లుతుంది. అమెరికాలోని వారి శిష్యులు అలాంటి సంఘాలను చాలా వాటిని స్థాపించారు.

1972 లో పరమపూజ్యశ్రీ శ్రీమత్ ప్రభుపాదుల వారు పాశ్చాత్య దేశాలలోని డెల్లాస్, టెక్సాస్‌లలో వైదిక పద్ధతిలో గురుకులాలను ఏర్పాటు చేశారు. 1972 లో ముగ్గురు విద్యార్థులతో ప్రారంభమైన గురుకులము 1975 నాటికి 150 మంది విద్యార్థులతో విరాజిల్లింది.

శ్రీల ప్రభుపాదుల వారు భారత దేశములో అంతర్జాతీయ కేంద్రాలను నిర్మింపచేయడానికి ప్రోత్సహించారు. పశ్చిమ బెంగాలులోని మాయాపూరులో శ్రీధామమనే అంతర్జాతీయ ఆధ్యాత్మిక కేంద్రాన్ని నిర్మించ తలపెట్టారు. అతివిస్తృతమైన ఆ పథక నిర్మాణానికి చాలాకాలము పట్టవచ్చును. అది వైదిక శాస్త్ర పఠనానికి కూడ అనుకూలంగా నిర్మించబడింది. భారత దేశములోని

వృందావనంలో మహోన్నతమైన కృష్ణబలరామ మందిరము ఆ పద్ధతుల ప్రకారమే నిర్మించబడింది. అక్కడ ఒక అంతర్జాతీయ అతిథి గృహము కూడ నిర్మించబడింది. పాశ్చాత్యులక్కడ నుండి వైదిక సంస్కృతిని స్వయంగా నేర్చుకునే అవకాశము ఉంది. బొంబాయిలో ప్రధాన సాంస్కృతిక విద్యాకేంద్రం కూడ గలదు. భారత దేశములో షుమారు పద్దెనిమిది ముఖ్యస్థానాలలో ఇతర కేంద్రాల నిర్మాణము కొనసాగుతుంది.

శ్రీల ప్రభుపాదుల వారి ముఖ్యాతి ముఖ్యమైన సేవ గ్రంథరచన. దాని ద్వారా వారు ఎంతో ప్రసిద్ధిని పొందారు. వారి గ్రంథాలు ప్రామాణికత్వానికీ, జ్ఞాన గాంభీర్యానికీ, వైదుష్యానికి పెట్టింది పేరు. అవి విద్వాంసుల చేత ఎంతగానో గౌరవించబడ్డాయి. అనేక కళాశాలల్లో, పాఠశాలల్లో ప్రామాణిక పాఠ్యగ్రంథాలుగా నిర్ణయించబడ్డాయి. వారి రచనలు ఎనభైకి పైగా భాషలలోకి అనువదించబడ్డాయి. ప్రభుపాదుల వారి గ్రంథాలను ముద్రించి, ప్రకటించడము కోసమే 1972 లో భక్తివేదాంత బుక్ ట్రస్ట్ అనే సంస్థను స్థాపించారు. అది ఇప్పుడు భారతీయ వైదికతత్త్వ విషయాలపై గ్రంథాలను ప్రచురించే ప్రపంచ ప్రముఖ ప్రచురణ సంస్థగా రూపొందింది.

వార్ధక్యం సమీపించినా షుమారు పన్నెండు సంవత్సరాలలో శ్రీల ప్రభుపాదుల వారు ప్రపంచమంతట పద్నాలుగుసార్లు ఉపన్యాస యాత్ర సాగిస్తూ ఆరుఖండాలలో పర్యటించారు. అంతటి నిర్విరామ కార్యక్రమాలలో నిమగ్నులై ఉన్నప్పటికీ వారు తమ గ్రంథ రచనను కొనసాగిస్తూనే ఉండేవారు. వారి గ్రంథాలన్నిటినీ కలిపితే ఒక ప్రఖ్యాత వైదిక వేదాంత సాహిత్య సంస్కృతీ గ్రంథాలయము అవుతుంది.

1977 నవంబరు 14వ తేదీన వారు ఉత్తరప్రదేశ్‌లోని వృందావనములో తిరోభవించే వరకు నిర్విరామముగా శ్రమించారు. ప్రపంచమంతట వందకు పైగా ఆశ్రమాలను, మందిరాలను, సంస్థలను స్థాపించి కృష్ణ చైతన్య సంఘాన్ని అంతర్జాతీయ సంస్థగా (ఇస్కాన్) తీర్చిదిద్దారు.

ఈ లోకంలో గొప్ప ధ్యానయోగియైన కర్దమమునికి మరియు అతని భార్యయైన దేవహూతికి కపిల భగవానుడు కుమారుడిగా అవతరించెను. తమ పుత్రుని యొక్క దివ్యత్వము గురించి కర్దమముని మరియు దేవహూతికి ముందే తెలుసును. కర్దమముని అడవులకు వెళ్ళిన తర్వాత, దేవహూతి తన దివ్య కుమారుడిని మిక్కిలి వినయముతో సమీపించి దివ్యజ్ఞానము కొరకు తన కోరికను విన్నవించెను. తల్లికి గల శుద్ధమైన కోరికకు సంతసించి, ఆమెపై గొప్ప కృపతో కపిలుడు 'సాంఖ్య' దర్శనమును ఉపదేశించుటను ప్రారంభించెను.



భక్తివేదాంత బుక్ ట్రస్ట్